చరిత్ర
భారతదేశ
సామాజికార్థిక చరిత్ర

(అనాది నుండి క్రీ.శ. 700 వరకు)

ఖండాలు IV & V

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్
2004

రచయితల బృందం

సంపాదకులు

ఆచార్య అల్లాడి వైదేహి కృష్ణమూర్తి

సహసంపాదకులు

ఆచార్య వి.రామకృష్ణారెడ్డి

కుమారి ఇ సుధారాణి

రచయితలు

ఆచార్య బి.మస్తానయ్య

డా. కె.సత్యమూర్తి

డా. వి.మీనాకుమారి

డా. కె.జానకి

115057
27-4-05

ముఖ చిత్రం : చంద్ర

Dr. B.R.A.O.U. LIBRARY
Acc No. 115057
Date 27.4.2005
Call No

డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్.

ప్రథమ ముద్రణ

1997 2002 2004

©1997. డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం. అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈపుస్తకంలోని ఏభాగాన్నైనా ఉపయోగించదల్చుకుంటే, విశ్వవిద్యాలయ అనుమతిని పొందాలి. ఈ పుస్తకం సార్వత్రిక విశ్వవిద్యాలయ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ఒక భాగం.

ఇతర వివరాలకు
డైరెక్టర్ (అకడమిక్)
డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
రోడ్ నెం. 46, జూబ్లీ హిల్స్
హైదరాబాద్ - 500 033. ఆం.ప్ర.

Printed by : Siddeshwar Printers, Market Street, Secunderabad - 500 003.
Lr. No.961/Dr.BRAOU/DMP/PTG/F.No.38/J.O.272/Dt: 07-09-2004 - 200 Copies.

BRAOU

పరిచయం

చరిత్ర నిరంతరంగా సాగే ఒక సామాజిక ప్రక్రియ. మానవ సమాజంలో అభివృద్ధి, పరిణామాలు అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంటాయి. చరిత్ర మరింత 'ఆకర్షవంతంగా ఉండాలంటే, మానవుడు తోటి మానవులందరి సహకారంతో తన అవసరాలు తీర్చుకొంటూ, ఎలా పురోగమిస్తూ వచ్చాడో చూపాలి' అన్న డి.డి. కొశాంబి మాటలు అక్షరాలా సత్యం. కాని, మనకున్న చరిత్రల్లో చాలావరకు సాధారణంగా రాజవంశాలనో, పాలకులనో, పరిపాలననో వర్ణించేవిగా ఉన్నాయి. మానవుడు తన సృజనాత్మక శక్తిచే నిర్మించి, ఉపయోగించి, వదిలివెళ్ళిన అవశేష దృశ్య చిహ్నాలు, లిఖిత, మౌఖిక వాజ్మయం ద్వారా భారతదేశ చరిత్ర పునర్నిర్మింపబడి, కొంతవైవిధ్యంతో కూడిన వాస్తవాలు. ఇటీవలి కాలంలో వెలుగులోకి వస్తున్నాయి. వాటి ఆధారంతో, వినూత్న దృక్పథంతో కూడిన రచనలు వచ్చాయి. చరిత్ర అంటే, ప్రభువులు, పాలకుల చరిత్రతోపాటు, సామాన్యుల చరిత్ర కూడా అన్న భావం ఉత్పన్నమై, సామాజికార్థికాంశాలకు ప్రాధాన్యత పెచ్చింది. చరిత్ర గతినే నిర్దేశించే, కీలకాంశాలైన సామాజికార్థికాంశాల ప్రస్తావన లేనిదే చరిత్ర పరిపూర్ణం కాదు.

చరిత్రలో ద్వితీయ సంవత్సర స్నాతకోత్తర పాఠ్యాంశాలను అధ్యయనం చేసే డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థులకు, భారతదేశ సామాజికార్థిక చరిత్ర (అనాది నుండి క్రీ.శ.700 వరకు) కోర్స్‌గా రూపొందించ బడింది. ఇటీవలి కాలంలో, చరిత్ర రచన, బోధనల్లో వచ్చిన మార్పుల కనుగుణంగా ఈ కోర్స్ పాఠ్యాంశాలు రూపొందించబడ్డాయి. దీనిలో, మానవ సమాజ పరిణామ క్రమంలోని ప్రధాన దోరణులు, మానవుని వైజ్ఞానిక, ఆర్థిక పురోగతి, సామాజిక కట్టుబాట్లు, మత విశ్వాసాలు, నమ్మకాలు, దేశ విదేశాలతో వారికున్న వ్యాపార సంబంధాలు మొదలైన అంశాలను విశ్లేషించడం జరిగింది

ఈ కోర్స్‌లో మొత్తం ఐదు ఖండాలకు చెందిన ఇరవై ఒక్క భాగాలున్నాయి. పఠనా సౌలభ్యంకోసం, దీన్ని రెండు పుస్తకాలుగా ముద్రించడమౌతుంది. మొదటి పుస్తకంలో, మొదటి మూడు ఖండాలకు సంబంధించిన పన్నెండు భాగాలను చేర్చడం జరిగింది. వీటిలో 'భారతదేశ సంస్కృతీ పరిణామంలో ముఖ్య దశై, మానవ నాగరికతా ఔన్నత్యాన్ని చాటి చెప్పే హరప్పా నాగరికత, మానవ మేధో పరిణామ క్రమాన్ని తెల్పే వేద కాలం, మత సంస్కరణ వాద కాలం నాటి మాహావీరుని జైన మతం, గౌతమ బుద్ధుని బౌద్ధం, హైందవ సంస్కృతీ మూలమైన భాగవత, శైవ మతాలు, నాస్తిక వాదాలైన ఆజీవిక, లోకయత మతాలు సవిస్తరంగా చర్చించబడ్డాయి.

రెండో పుస్తకంలో, చివరి రెండు ఖండాలకు చెందిన తొమ్మిది భాగాలను పొందుపర్చడమైంది. వీటిద్వారా, ప్రాచీన భారతదేశంలో, మౌర్యుల, శాతవాహనుల, గుప్తుల కాలంనాటి ఆర్థిక స్థితిగతులు, అనాది నుండి క్రీ.శ.700 వరుకు నెలకొన్న వాణిజ్య, పారిశ్రామికాభివృద్ధి క్రమం, భారతదేశంలో నెలకొన్న భూస్వామ్య వ్యవస్థ లక్షణాలు, యుగయుగాలుగా పాతుకు పోయిన కుల వ్యవస్థ, ప్రాచీన భారత సమాజంలో స్త్రీల పాత్ర, విద్యా వికాసం గూర్చి విపులంగా విశ్లేషించబడ్డాయి. వీటి అధ్యయనం ద్వారా, మానవ సామాజికార్థికాభివృద్ధి, పరిణామాలు, ఏవిధంగా అవిచ్ఛిన్నంగా సాగాయో తెల్సుకొని, చరిత్ర గతిలో సామాజిక చైతన్యాన్ని, ఆర్థిక ప్రగతిని గూర్చి విద్యార్థులు సరైన అవగాహనను పొందగలరని ఆశిస్తున్నాం.

భారతదేశ సంస్కృతీ ఔన్నత్యాన్ని చాటిచెప్పే ప్రాచీన భారతీయుల సామాజికార్థిక చైతన్యాన్ని భావితరాల మనుగడను, సమాజంలో ఉన్న వాస్తవాల వైరుధ్యాన్ని గూర్చి క్షుణ్ణంగా తెలుసుకొనేందుకు ఈ పాఠ్య భాగాలు తోడ్పడగలవని విశ్వవిద్యాలయం ఆశిస్తుంది.

BRAOU

BRAOU

విషయ సూచిక

			పుట నెం.
ఖండం-IV	:	**ఆర్థిక పరిస్థితులు**	
భాగం-13	:	మౌర్యుల కాలంనాటి ఆర్థిక పరిస్థితులు	3
భాగం-14	:	శాతవాహనుల కాలం నాటి ఆర్థిక పరిస్థితులు	27
భాగం-15	:	గుప్తుల కాలంలో ఆర్థిక పరిస్థితులు	50
భాగం-16	:	గుప్తుల అనంతర కాలంనాటి ఆర్థిక పరిస్థితులు	78
భాగం-17	:	వాణిజ్యం, పరిశ్రమలు (క్రీ.శ.2500 క్రీ.శ.700)	104
భాగం-18	:	భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ, దాని స్వభావం	142
ఖండం-V	:	**సామాజిక సంస్థలు**	
భాగం-19	:	యుగయుగాలుగా కుల వ్యవస్థ	157
భాగం-20	:	సమాజంలో స్త్రీల పాత్ర	171
భాగం-21	:	విద్య, విద్యా కేంద్రాలు పాఠ్య ప్రణాళిక మాదిరి పరీక్షా పత్రం అభ్యాసాలు.	182

BRAOU

BRAOU

ఖండం- IV: ఆర్థిక పరిస్థితులు

ఈ ఖండంలో 13వ భాగంలో మౌర్యుల కాలం నాటి ఆర్థిక పరిస్థితులు, 14వ భాగంలో శాతవాహనుల కాలంనాటి ఆర్థిక పరిస్థితులు, 15వ భాగంలో గుప్తుల కాలంనాటి ఆర్థిక పరిస్థితులు, 16వ భాగంలో గుప్తుల తర్వాత కాలంనాటి ఆర్థిక పరిస్థితులు, 17వ భాగంలో హరప్పా కాలం నుండి క్రీ.శ.700 వరకు వర్తక, పారిశ్రామిక రంగాల్లో వచ్చిన అభివృద్ధి, 18వ భాగంలో భారతదేశంలోని భూస్వామ్య వ్యవస్థ, దాని స్వభావం గురించిన వివరణ ఉంది.

BRAOU

BRAOU

భాగం - 13 మౌర్యుల కాలంనాటి ఆర్థిక పరిస్థితులు

విషయక్రమం

13.0 లక్ష్యాలు
13.1 పరిచయం
13.2 ఆర్థిక జీవనం-ప్రభుత్వ నియంత్రణ
13.3 వ్యవసాయం
- 13.3.1 వ్యవసాయం-ప్రభుత్వ విధానం
- 13.3.2 గ్రామాలు
- 13.3.3 గ్రామ సంక్షేమం-రక్షణ
- 13.3.4 భూమి యాజమాన్యం
- 13.3.5 వ్యవసాయ భూములు
- 13.3.6 భూమిశిస్తు నిర్ధారణ పద్ధతి
- 13.3.7 ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాలు
- 13.3.8 వ్యవసాయదారులు
- 13.3.9 వ్యవసాయ కార్మికులు
- 13.3.10 వ్యవసాయ పంటలు
- 13.3.11 పశుపోషణ
- 13.3.12 అడవులు

13.4 నీటి పారుదల
13.5 ఆర్థిక విధానం
- 13.5.1 పన్నుల విధానం
- 13.5.2 ఆదాయ వ్యయాలు
- 13.5.3 వ్యవసాయ పన్నులు
- 13.5.4 వాణిజ్య పన్నులు
- 13.5.5 పన్ను ఎగవేతదారులు-శిక్షలు
- 13.5.6. ఆర్థిక సంక్షోభం

13.6 శ్రేణులు
13.7 రుణ పరపతి విధానం
13.8 ద్రవ్య వ్యవస్థ
- 13.8.1 బంగారు నాణేలు
- 13.8.2 వెండి నాణేలు
- 13.8.3 రాగి నాణేలు
- 13.8.4 నాణేలు తయారుచేయు పద్ధతి

13.9 కార్మికులు
- 13.9.1 కూలీ పనివారు
- 13.9.2 వెట్టి పనివారు
- 13.9.3 బానిస పనివారు

13.10 దుర్భిక్షాలు-ప్రభుత్వ విధానం
13.11 సంగ్రహంగా
13.12 పరిక్ష నమూనా ప్రశ్నలు
13.13. ఉపయుక్త గ్రంథాలు

BRAOU

13.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవటం వల్ల మీరు క్రింది విషయాలను తెలుసు కోగల్గాలి.

★ మౌర్యుల కాలంనాటి ప్రజల ఆర్థిక జీవనం, ప్రభుత్వ నియంత్రణ.

★ మౌర్యుల కాలంనాటి వ్యవసాయ పరిస్థితులు, ప్రభుత్వ నిర్వహణ, నీటిపారుదల సౌకర్యాలు.

★ మౌర్యుల వాణిజ్యం, శ్రేణులు, రుణ పరపతి విధానం, ద్రవ్య వ్యవస్థ.

★ మౌర్యుల పాలనలో కార్మికుల స్థితిగతులు, ప్రభుత్వ దుర్భిక్ష నివారణ చర్యలు.

13.1 పరిచయం

మౌర్య వంశ రాజులు భారతదేశాన్ని సుమారు క్రీ.పూ.324 నుండి క్రీ.పూ.187 వరకు 137 సంవత్సరాలు పరిపాలించారు. భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా దేశంలో అత్యధిక భూభాగాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకొని పరిపాలించినవారు మౌర్యులే. వారి పాలనలో ప్రజలు శాంతి సౌభాగ్యాలతో తులతూగేవారని నాటి సాహ్యధారాల వల్ల తెలుస్తుంది. ప్రజా సంక్షేమం, మానవాభ్యుదయం, ప్రపంచ శాంతి కొరకు అశోక చక్రవర్తి నిరంతరం పాటుపడ్డాడు.

మౌర్యుల కాలంలో ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యాయి. వ్యవసాయం అభివృద్ధి చెందింది. ప్రభుత్వ నిర్వహణలో వ్యవసాయ క్షేత్రాలు కూడ ఉండేవి. వ్యవసాయ భూములకు నీటిపారుదల సౌకర్యాలు కల్పించబడ్డాయి. ప్రభుత్వ పన్నుల విధానం ప్రజలకు భారంగా ఉండేది కాదు. పన్ను ఎగవేతదారులను శిక్షించేవారు. పన్నుల ద్వారా వచ్చిన ఆదాయంతో ప్రభుత్వ ఖజానా నిండుగా ఉండి, ఆ ధనాన్ని ప్రజల సంక్షేమం కోసం ఖర్చు పెట్టేవారు. శ్రేణులు ఆ కాలంలోనే వ్యవస్థీకృతమయ్యాయి. ద్రవ్య వ్యవస్థ అభివృద్ధి చెందింది. బంగారు, వెండి నాణేలే గాక, దేశంలోనే మొదటిసారిగా మౌర్యులు రాగి నాణేలను కూడ ముద్రించి వాడుకలోకి తెచ్చారు. కార్మికుల పరిస్థితులు మెరుగ్గా ఉండేవి. మౌర్యుల కాలంలో దుర్భిక్షాలు సంభవించినా, ప్రజలను ఆదుకొని, వాటి నివారణకు సత్వర చర్యలను చేపట్టారు.

13.2 ఆర్థిక జీవనం- ప్రభుత్వ నియంత్రణ

మౌర్యుల కాలంలో భారతదేశంలోని ప్రజల ఆర్థిక జీవనంపై ప్రభుత్వ నియంత్రణ అధికంగా ఉండేది. కార్మికుల్లో ఎక్కువ భాగం ప్రభుత్వాధీనంలోనే పని చేసేవారు. వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం ప్రభుత్వ నియంత్రణలోనే ఉండేవి.

మౌర్యుల కాలంలో ముఖ్యంగా అశోకుని పాలనలో కేంద్రీకృత ప్రభుత్వ పాలన ఉండేది. దాని ఫలితంగా, నాటి ఆర్థిక వ్యవస్థ మీద ప్రభుత్వ నియంత్రణ అధికంగా ఉండేది. మౌర్యులు పాలనా వ్యవస్థకు మెరుగులు దిద్ది, అభివృద్ధి చేశారు. అందువల్ల ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలను నిశితంగా పరీక్షించి, నియంత్రణలో ఉంచుకొనేందుకు పాలనా యంత్రాంగానికి తగిన సామర్థ్యం వచ్చింది. ఈ వ్యవస్థ నియంత్రణానికి, సమన్వయానికి అవసరమై, రాజు ఎక్కువ అధికారాలను స్వీకరించాడు.

PRAOU

భూములు, మూలధనం, కార్మికులు, పరిశ్రమలు ప్రభుత్వాధీనంలోనే ఉండేవి. గనులు, పరిశ్రమలలో జాతీయం చేసి, ప్రభుత్వం ఆధీనంలోకి తెచ్చారు. నిరుద్యోగులకు, జీవనోపాధిలేని నిస్సహాయులకు ప్రభుత్వమే సహాయపడేది. ఈ చర్యల ఫలితంగా, మౌర్యుల కాలంలో ఎక్కువగా ఆర్థిక స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం ఏర్పడ్డాయి.

మౌర్యుల కాలంలో అనుసరించిన ఆర్థిక విధానం వల్ల, వ్యవసాయదారునికి, ప్రభుత్వ యంత్రాంగానికి ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడ్డాయి. దాని ఫలితంగా, వాస్తవంగా రాజు ప్రజలకు పూర్వంకంటే మౌర్యుల కాలంలో ఎక్కువగా దూర మయ్యాడు. ఎందువల్లంటే, రైతుల పనులు, అవసరాలు ప్రభుత్వ అధికారులే తీర్చేవారు. కాబట్టి రైతులు క్రింది అధికారులతో మాత్రమే సంబంధాలను కలిగి ఉండేవారు. ఇదే పరిస్థితి తర్వాత కొన్ని శతాబ్దాల వరకు కొనసాగింది.

గ్రీక్ తత్వవేత్త అరిస్టాటిల్ తన రచనల్లో వర్ణించినట్లుగానే, కౌటిల్యుడు కూడ అర్థశాస్త్రంలో రాజ్యం అంటే సాంఘిక సంక్షేమానికి పాటుపడేది అని పేర్కొన్నాడు. వ్యవసాయ భూములు, గనులు, అడవులను అభివృద్ధి చేయడం, పరిశ్రమలను ప్రభుత్వ యాజమాన్యంలో ఉంచడం, కొత్త వలసలను స్థాపించడం, వ్యాపార, వాణిజ్య రంగాలను అభివృద్ధి చేయడం, ధరలను నియంత్రీకరించడం మొదలైన చర్యలు, అంటే ఆర్థిక సౌభాగ్యానికి, జాతీయ సంపద పెరుగుదలకు దోహదపడే అన్ని చర్యలు, రాజ్యాధికారంలో ఉన్న ప్రభుత్వానిదే బాధ్యతగా పరిగణించేవారు.

కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల, మౌర్యుల పాలనలో ఆర్థిక కార్యక్రమాలు క్రమబద్ధం చేసేందుకు ప్రభుత్వం 27 మంది అధ్యక్షులను (పర్యవేక్షణాధికారులు) నియమించిందని తెలుస్తుంది. వారు వ్యవసాయం, వ్యాపార వాణిజ్య రంగాలు, కొలతలు తూనికలు, నూలు వడకడం, నేయడం, గనులు త్రవ్వడం మొదలైన వృత్తులను నియంత్రించి, క్రమబద్ధం చేసేవారు.

BRAOU

13.3 వ్యవసాయం

మౌర్యుల కాలంలో వ్యవసాయం అభివృద్ధి చెందింది. రైతుల వ్యవసాయంలో ప్రభుత్వ జోక్యం ఉండేది కాదు. వ్యవసాయానికి గ్రామాలు కేంద్రంగా ఉండేవి. రాజ్యంలోని భూమి అంతా రాజుకు చెందిందే. ప్రజల్లో అధికులకు వ్యవసాయమే ముఖ్య వృత్తి. వ్యవసాయ భూమి పన్ను విధానం పటిష్టంగా ఉండేది. ప్రభుత్వం అధీనంలో వ్యవసాయ క్షేత్రాలు కూడ ఉండేవి. మౌర్యుల కాలంలో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ పురోగతి చెంది పటిష్టంగా ఏర్పడినందు వల్ల, దేశ ఆర్థిక రంగంలో వ్యవసాయదారులకు ప్రాముఖ్యత పెరిగింది. వ్యవసాయ కార్మికుల జీవన పరిస్థితులు మెరుగ్గా ఉండేవి. ఆ కాలంలో అనేక రకాల వ్యవసాయ పంటలను పండించే వారు. పశు పోషణ కూడ ముఖ్య వృత్తిగా ఉండేది. నీటిపారుదల సౌకర్యాలు తగినంతగా ఉండేవి.

13.3.1 వ్యవసాయం-ప్రభుత్వ విధానం

విశాలమైన వ్యవసాయ క్షేత్రాలు రాజు యాజమాన్యంలో ఉండేవి. దాని ఫలితంగా, దేశంలో వ్యవసాయం అధిక భాగం ప్రభుత్వ అధీనంలో ఉండేది. క్రమం తప్పకుండా భూమిశిస్తు చెల్లించినంత కాలం రైతుల వ్యవసాయపు పనుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకొనేది కాదు.

కొత్తగా భూములను గాని, వదిలివేసిన భూములను గాని సాగులోకి తీసుకొనిరావడం, ఖాళీగా ఉన్న ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్ళి నివాసం ఏర్పర్చుకోవడం, విదేశీయులు వచ్చి దేశంలో స్థిరనివాసం ఏర్పర్చుకొనేందుకు సహాయపడడం మొదలైన చర్యల ద్వారా, దేశంలో వ్యవసాయ ఉత్పాదకత సంఘటితంచేసి విస్తరింప చేయడం అనే విషయాలకు సంబంధించి, ప్రత్యేకంగా ప్రభుత్వానిదే బాధ్యతగా ఉండేది.

13.3.2 గ్రామాలు

ప్రతి గ్రామంలోను వ్యవసాయ జీవనం ఈ క్రింద పేర్కొన్న వాటిమీద ఆధారపడి జరిగేది.

1. 'కేదార'=పంటపొలాలు
2. 'పుష్పవాట'=ఉద్యానవనాలు
3. 'ఫలవాట' = పండ్ల తోటలు
4. 'షండ' = అరటి, చెరకు మొదలైన పంటలు
5. 'మూలవాప' = అల్లం, పసుపు మొదలైన దుంపజాతులు పండించే భూములు.

గ్రామంలో రికార్డు కాబడి, రిజిస్టరు చేయబడిన ప్రాంతంలో ఈ క్రింద పేర్కొనబడిన భాగాలు ఉండేవి.

1. 'కృష్ట్ర' = సాగుచేయబడిన ప్రాంతం
2. 'అకృష్ట్ర' = సాగుచేయబడని బంజరు భూములు
3. 'స్థల' = ఎత్తైన మెట్ట ప్రాంతం
4. 'కేదార' = పంటపొలాలు
5. 'ఆరామ' = ఉపవనాలు
6. 'స్కండ' = అరటి మొదలైన సండ్లతోటలు
7. 'వాట' = చెరకు తోటలు
8. 'వన' = వంట చెరకు మొదలైనవి దొరికే వనాలు
9. 'వాస్తు' = నివాస స్థలాలు
10. 'చైత్య' = పవిత్రంగా భావించే వృక్షాలు
11. 'దేవగృహ' = దేవాలయాలు
12. 'సేతుబంధ' = ఆనకట్టలు
13. 'స్మశాన' = స్మశానం
14. 'సత్ర' = సత్రం
15. 'ప్రపా' = త్రాగేనీరు నిలువ ఉంచే నిర్మాణం
16. 'పుణ్యస్థాన' = పుణ్యస్థలాలు
17. 'వివీత' = గ్రామంలోని పశువుల మేతకు ఉపయోగపడే పచ్చిక బయలు
18. 'పథి' = రహదారులుగల ప్రాంతం

ప్రభుత్వ ఆదాయాన్ని బట్టి చూస్తే, గ్రామాల్ని ఈ క్రింద పేర్కొనబడిన విధంగా వివిధ తరగతులుగా విభజించి, వర్ణించవచ్చు.

1. 'పరిహారక' = రాజు అనుగ్రహంతో దానంగా ఇవ్వబడి, పన్నుల నుండి మినహాయింపు ఇవ్వబడింది.

2. 'ఆయుధీయ' = సైనిక సేవ రూపంలో శిస్తు చెల్లించడం

3. 'ధాన్య ప్రతికర' = ధాన్య రూపంలో భూమి శిస్తు చెల్లించడం

4. 'పశు ప్రతికర' = పశువుల రూపంలో భూమిశిస్తు చెల్లించడం

5. 'హిరణ్య ప్రతికర' = బంగారం,వెండి, రాగి రూపంలో భూమిశిస్తు చెల్లించడం

6. 'కుప్య ప్రతికర' = అటవీ ఉత్పత్తుల రూపంలో భూమిశిస్తు చెల్లించడం

7. 'విష్ట ప్రతికర' = వెట్టిపని రూపంలో భూమిశిస్తు చెల్లించడం

BRAOU

ప్రతి గ్రామంలోను ప్రజలందరికీ ఉపయోగపడే నిర్మాణాలు అనేకం ఉండేవి. అవి 'ఆరామాలు' (విశ్రాంతి గృహాలు), 'ప్రపా' (చెరువులు), సత్రాలు, పుణ్యస్థానాలు (పవిత్రస్థలాలు), చైత్యాలు (పూజావృక్షాలు), దేవగృహాలు (దేవాలయాలు), సంగీతం, నాట్యం, నాటకాలు మొదలైన వినోదాలకు, గ్రామస్తులందరూ చేసుకొనే విందులకు ఉపయోగపడే విశాలమైన గదులు (halls) మొదలైనవి. ప్రజలకు ఉపయోగపడే ఈ నిర్మాణాలన్నీ గ్రామస్తులందరి ఉమ్మడి చొరవతో, సంపూర్ణ ఆమోదంతో, పూర్తి సహకారంతో జరిగేవి.

గ్రామసేవకు, జీతంపై పనివారిని నియమించేవారు. వారికి 'గ్రామ భృతక'లు అని పేరుండేది. వారిలో వడ్రంగులు (కుట్టక), కమ్మరులు (కర్మార, అయస్కార), కుమ్మరులు, మంగలివారు (సాపిత), చాకలివారు, భవనం చేయువారు లేక భూమి త్రవ్వువారు (మెదక), త్రాళ్ళు అల్లేవారు (రజ్జువర్తక) మొదలైనవారు ఉండేవారు.

13.3.3 గ్రామ సంక్షేమం - రక్షణ

మౌర్యుల కాలంలో గ్రామీణ ప్రాంతాల సంక్షేమంకోసం ప్రభుత్వం పాటుపడేది. గ్రామంకోసం, దాని సంక్షేమం కోసం ప్రభుత్వం కొన్ని విధులను నిర్వహించేది. అవి (1) ఆసులకు హద్దులు నిర్దేశించడం, (2) ప్రవేశయోగ్యం కాని ప్రాంతాలకు రహదార్లు నిర్మించి, వాటికి సౌకర్యాలను కల్పించడం, (3) గ్రామీణాభివృద్ధి పనులు చేపట్టడం, (4) గ్రామాలకు రక్షణ కల్పించడం వంటివి.

గ్రామీణ ప్రాంతాల్లో రక్షకభటులను (పోలీసులు) నియమించడం ద్వారా, గ్రామం చూట్టూ రాళ్ళతో గాని లేదా కలపతోగాని గోడకట్టి, దానికి ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయడం ద్వారా, గ్రామాలకు రక్షణ ఏర్పాటు చేసేవారు. గ్రామానికి చెందిన వ్యవసాయ క్షేత్రాలను కీటకాలు, మృగాలు, పశువుల బారినుండి రక్షించేందుకు కంచెలు, వలలు, కాపలాదార్లు మొదలైని వాటిని ఏర్పాటు చేసే వారని కౌటిల్యుని అర్థశాస్త్రం వివరిస్తుంది.

ఈ విధంగా వ్యక్తిగత ఆస్తి, ప్రాణానికి, ఆస్తికి రక్షణ, వార్తా రవాణా సౌకర్యాలు, ప్రజా పనులు అనే అంశాలను ఆధారంగా చేసుకొని, మౌర్యుల కాలంలో ప్రజా జీవనం ఉండేది

13.3.4 భూమి యాజమాన్యం

రాజ్యంలోని భూమి అంతా రాజుకు చెందిందే అని, భూములను రైతులు రాజుకొరకే సాగు చేసేవారని మెగస్తనీస్ 'ఇండిక'లో పేర్కొన్నాడు. కాని ఇతర గ్రంథాలు రాజును భూమికి యజమాని అనిగాక, ఆ భూమిని రక్షించేవాడని మాత్రమే పేర్కొన్నాయి. మౌర్య సామ్రాజ్యం విశాలమైందేగాక, దానిలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి వివిధ దశల్లో ఉండినందువల్ల, రాజ్యంలో మొత్తంమీద ఒకేరకమైన భూమి యాజమాన్య పద్ధతి ఉండేదని భావించడం అసాధ్యమైన విషయం.

మౌర్యుల కాలంలో ఐదు రకాల భూమి యజమానులు ఉండేవారు. వారు 1. రాజు, 2. ప్రభుత్వం, 3. పెద్ద భూస్వాములు, 4. సమిష్టి యాజమాన్యం, 5. రైతులు. కాని వీటి రచనలేవీ రైతులకు భూములపై యాజమాన్యపు హక్కు ఉండేదని ప్రత్యక్షంగా పేర్కొలేదు. ఇది ఆశ్చర్యకరమైన విషయం కాదు. ఎందువల్లంటే, ఏ కొద్దిమందో తప్ప మిగిలిన రైతులందరూ శూద్రులే. సమష్టి యాజమాన్యం అనేది మౌర్యుల కాలం తర్వాత కొన్ని శతాబ్దాలకు వాడుకలోకి వచ్చింది.

జాతక కథలు 'గహపతులు', 'గ్రామభోజకులు' అనేవారిని పలుసందర్భాల్లో పేర్కొన్నాయి. వారిరువురి అధీనంలో విశాలమైన భూములు ఉండేవి. వారు ఆ భూములను సాగుచేసేందుకు జీతం ఇచ్చి, పనివారిని నియమించేవారు. ఆ పనివారి జీవన పరిస్థితులు దారుణంగా ఉండేవి. కాని అవి బానిసల జీవన పరిస్థితులంత మరీ దారుణంకాదు.

BRAOU

ప్రారంభంలో రాజు భూములకు యజమాని కాదు. కాని కాలక్రమేణా ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. తర్వాత కాలంనాటి ధర్మశాస్త్రాలు రాజుకు భూమిపై ఉండే యాజమాన్యపు హక్కును స్పష్టంగా పేర్కొన్నాయి. రాజు భూమికంతా అధిపతి అని కాత్యాయనుడు పేర్కొన్నాడు.

రాజు అధీనంలో ఉన్న సొంత భూములకు, ప్రభుత్వానికి చెందిన భూములకు భేదం ఉండేది. రాజుకు యాజమాన్యపు హక్కు గల సొంత భూములను తన ఇష్టం వచ్చినట్లుగా దత్తం చేసే అధికారం ఉండేది. కాని ప్రభుత్వాధీనంలో ఉన్న భూములకు సంబంధించి రాజుకు ఆ భూములపై సిస్తుల ద్వారా వచ్చే ఆదాయం రాజ్యాధినేతగా పొందే హక్కు, ఆ భూముల నుండి వచ్చే ఉత్పత్తి అనుభవించే హక్కు మాత్రమే ఉండేవిగాని, ఆ భూముల మీద యాజమాన్యపు హక్కు ఉండేది కాదు. రాజు మత సంస్థలకు గాని, ఇతరులకుగాని దానంగా భూములను ఇవ్వాలని అనుకుంటే, తన యాజమాన్యంలోని భూములను మాత్రమే ఇచ్చేవాడు. అంతేగాని ప్రభుత్వం అధీనంలోని భూములను మాత్రం కాదు.

కౌటిల్యుని అర్థశాస్త్రం రాజుకు చెందిన భూములను పేర్కొంది. ఆ భూముల మీద రాజుకు యాజమాన్యపు హక్కు ఉండేది. ఆ భూముల మీద వచ్చే ఆదాయం రాజుకు చెందిందే. మిగిలిన భూములన్నీ ప్రభుత్వానికి చెందినవి.

మౌర్యుల కాలంలో భూములు, భవనాల క్రయ విక్రయాల గురించి కౌటిల్యుని అర్థశాస్త్రం వివరించింది. ఈ రకమైన భూములను కొనే స్తోమత ఎవరికైతే ఉందో, వారే ఆ భూములను కొనేవారు. ఆ కాలంలో భూములనేవి సమగ్రమైన, సంపూర్ణమైన వ్యక్తిగత ఆస్తి కాదు. భూములపై ప్రభుత్వ యాజమాన్యం ఉండేది. అంతేగాక, రైతులకు కూడ కొద్ది విస్తీరణంగల భూములపై కూడ యాజమాన్యపు హక్కు ఉండేది. ఆ భూములను రైతులు సాగుచేసుకొనేవారు. అంటే మౌర్యుల వ్యవస్థలో చిన్న తరహా భూమి యాజమాన్యం అనేది ప్రధానంగా ఉండేది కాదు.

13.3.5 వ్యవసాయ భూములు

మౌర్యుల కాలంలో ప్రజల్లో అధిక భాగానికి వ్యవసాయమే ప్రధానమైన వృత్తి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రామం కేంద్ర స్థానంగా ఉండేది. ప్రతి గ్రామంలో30 నుండి 100 వరకు కుటుంబాలు నివసించేవి. గ్రామం చుట్టూ ప్రహరీ గోడ ఉండేది. ఆ గోడకు ప్రవేశ ద్వారాలుండేవి. ప్రహరీకి ఆవలివైపు వ్యవసాయ క్షేత్రం, దాని చుట్టూ కంచె ఉండేవి. కాపలాదార్లు పక్షులు, మృగాలు, కీటకాల బారినుండి వ్యవసాయ క్షేత్రాన్ని రక్షించేవారు. వ్యవసాయ భూములను రైతులకు కమతాలుగా పంచిపెట్టేవారు. ఈ భూకమతాల మధ్య సహకార సీటిపారుదల కోసం గోతులను త్రవ్వేవారు. భూకమతాలు కొద్ది విస్తీర్ణం కలిగి ఉండి, వాటిని వాటి యజమానులు, వారి కుటుంబ సభ్యులు, కూలీలు సాగుచేసేవారు.

మౌర్యుల కాలంలో విశాలమైన భూ కమతాలు కూడ ఉండేవి. బ్రాహ్మణుల అధీనంలో, 1,000 'కరీసలు' (ఎకరాలు) విస్తీర్ణంగల పెద్ద కమతాలు కూడ ఉండేవని నాటి రచనల వల్ల తెలుస్తుంది. అతి పెద్ద కమతం ఒక దాన్ని సాగుచేసేందుకు 500 నాగళ్ళు, అధిక సంఖ్యలో ఎద్దులు, కూలీలను కూడ ఉపయోగించేవారు.

వ్యవసాయ భూములకు, ఆవలివైపు పచ్చికబయళ్ళు ఉండేవి. అని గ్రామస్తుల సమష్టి యాజమాన్యంలో ఉండి, వాటిని గ్రామంలో నివసించే వారందరి పశువుల మేత కొరకు వాడేవారు. ప్రభుత్వం అధీనంలో కూడ కొన్ని పచ్చికబయళ్ళు ఉండేవి. పశువులను గోపాలకులు సంరక్షించేవారు. ప్రతి గ్రామంలోను తోటలు, ఉపవనాలు కూడ ఉండేవి. కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల, ఉపవనాల్ని మత సంబంధమైన కార్యక్రమాలకు ఉపయోగించేవారని తెలుస్తుంది.

BRAOU

కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల ప్రతి గ్రామంలోను ఈ క్రింది పేర్కొన బడిన వివిధ రకాల భూములు ఉండేవని తెలుస్తుంది.

1. కృష్ట = సాగుచేయబడిన భూములు
2. అకృష్ట = సాగుచేయబడని భూములు
3. స్థల = మెట్ట భూములు
4. కేదార = పంట భూములు
5. ఆరామ = ఉపవనాలు
6. స్కంధ = పండ్ల తోటలు
7. మూలవాప = దుంపలు పండే భూములు
8. వాట = చెరకు తోటలు
9. వన = కలప జాతి వృక్షాలు పెంచే భూములు
10. వివీత = పచ్చిక బయళ్ళు

13.3.6 భూమిశిస్తు నిర్ధారణ పద్ధతి

మౌర్యుల కాలంలో వ్యవసాయ భూముల మీద ప్రభుత్వం విధించే పన్ను మదింపు చేసి, నిర్ధారించే విధానం సమర్థవంతంగా ఉండేది. రైతులు కట్టవలసిన భూమిశిస్తును రెవిన్యూ అధికారులే నిర్ణయించేవారు. గ్రామానికి చెందిన వ్యవసాయ భూములన్నింటినీ కలిపి సమష్టిగా కాకుండా, ప్రతి రైతు సాగు చేసిన భూములను వేర్వేరుగా మదింపుచేసి, దాని ఆధారంగా భూమిశిస్తును నిర్ణయించేవారు.

భూమిశిస్తు నిర్ణయించేందుకు మొదట గ్రామంలోని భూములను వాటి సాన్యత మీద ఆధారపడి 'ఉత్తను', 'మధ్యమ', 'అధమ' అనబడే మూడు తరగతులకు చెందిన భూములుగా విభజించేవారు. ఆ తర్వాత గ్రామాన్ని ఈ క్రింది పేర్కొనబడిన నాలుగు రకాల్లో దేనికి చెందుతుందో దాని జాబితాలో చేర్చేవారు.

1. పన్నుల నుండి మినహాయింపు ఇవ్వబడిన గ్రామాలు (పరిహారిక)
2. సైనికులను సరఫరా చేసే గ్రామాలు (ఆయుధీయ)
3. ధాన్యం, పశువులు, బంగారం (హిరణ్య), ముడిపదార్థాలు (కుప్య) రూపంలో పన్నులు చెల్లించే గ్రామాలు
4. పన్నులకు బదులుగా వెట్టిపనివారిని (విష్టి), పాల ఉత్పత్తులను సరఫరా చేసే గ్రామాలు.

పైన పేర్కొనబడిన విషయాల వల్ల, ప్రభుత్వ పాలనా యంత్రాంగం వ్యవసాయ భూములకు శిస్తు నిర్ణయించే ముందు స్థానిక పరిస్థితులు, లక్షణాలు పరిగణనలోకి తీసుకొని, పరిశీలించేవారిని స్పష్టమౌతుంది.

13.3.7 ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాలు

ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాలు మౌర్యుల కాలంలో సమర్థవంతంగా నిర్వహింపబడ్డాయి. వాటిని ఆదర్శ క్షేత్రాలుగా తీర్చిదిద్దారు. అవి దేశంలో వ్యవసాయాభివృద్ధికి మిక్కిలి ఉపయోగకరంగా ఉండేవి. ఆ క్షేత్రాల్లో వివిధ రకాల పంటలను వేసేందుకు మేలైన విత్తనాలను పండించి, రైతులకు సరఫరా చేసేవారు. అంతేగాక, ప్రభుత్వ యాజమాన్యంలో పూలతోటలు, పండ్లతోటలు, కాయకూరలు పండే భూములుండేవి. ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాల్లో వాణిజ్య పంటలైన ప్రత్తి (కార్పాస), జనపనార (క్షౌమ) కూడ పండించేవారు.

ప్రభుత్వాధీనంలో విశాలమైన అనేక వ్యవసాయ క్షేత్రాలుండేవి. ఆ భూములను సాగు చేసేందుకు అధిక సంఖ్యలో బానిసలను, కూలీలను నియమించేవారు. అశోకుడు కళింగ యుద్ధం తర్వాత అక్కడ నుండి యుద్ధ ఖైదీలుగా తెచ్చిన 1,50,000 మందిని బానిసలుగా మార్చి, వారిని ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాల్లో వ్యవసాయ పనులకు ఉపయోగించారు.

13.3.8 వ్యవసాయదారులు

మౌర్యుల కాలంలో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ పెరుగుదల ఫలితంగా, ఆర్థిక రంగంలో రైతుకు క్రమంగా ప్రముఖ పాత్ర వచ్చింది. నాటి సాంఘిక వ్యవస్థలో మాత్రం అతని స్థానం ఉపేక్షించబడే విధంగా ఉండేది కాదు.

మెగస్తనీస్ రచన 'ఇండిక' నాటి భారతదేశంలోని కుల వ్యవస్థలో రైతు రెండవ కులానికి చెందినట్లుగా పేర్కొంది. ఈ తరగతికి చెందినవారు అధిక సంఖ్యలో ఉండేవారు. వారందరు వ్యవసాయమే వృత్తిగా కలిగి, భూములను దున్ని, వాటిని సాగు చేసేవారు. యుద్ధాలు జరిగే సమయంలో రైతులను సైనికులు బాధించేవారు కాదు. ఎందువల్లంటే, ప్రజలందరికి అవసరమైన ఆహారం కొరకు పంటలు పండించేందుకు రైతుల అవసరం ఎంతో ఉందని గుర్తించారు.

మెగస్తనీస్ రచన వల్ల భూములన్నీ రాజుకు చెందినవని, వాటిని రైతులు రాజు కొరకు సాగుచేసేవారని తెలుస్తుంది. రైతులు వ్యవసాయోత్పత్తిలో నాలుగో భాగం భూమిశిస్తుగా పన్నుకట్టేవారు. రైతులు భూమి శిస్తుతో పాటు, భూమికి కప్పం కూడా రాజుకు కట్టేవారు.

నాటి భారతదేశంలోని జనాభాలో రైతులు అధిక సంఖ్యలో ఉండేవారు. వారిని నిరాయుధులుగా ఉంచేవారు. వారుచేసే ముఖ్యమైన పని భూములు దున్ని వ్యవసాయం చేయడం. కొన్ని గ్రామాలకు పన్నులనుండి మినహాయింపు ఉండేది. కాని ఇది సైనికులను సరఫరా చేసినందుకు బదులుగా మాత్రమే, ఆ గ్రామాలకు పన్నుల నుండి మినహాయింపు లభించేది.

వ్యవసాయదారులందరూ శూద్రులు. అధిక జనాభా గల నగరాల నుండి, యుద్ధంలో జయించిన ప్రాంతాల నుండి శూద్రులను తెచ్చి, వారితో బంజరు భూముల్లో కొత్త గ్రామాలను నిర్మించేవారు. ఆవిధంగా స్థిరపడినవారి దగ్గర ఆయుధాలు లేకుండా చూసేవారు. ఆ గ్రామాలు ప్రభుత్వాధీనంలో ఉండేవి. వాటి వల్ల వచ్చే మిగులు వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వమే తీసుకొనేది.

కొత్తగా నిర్మించిన గ్రామాల్లో స్థిర నివాసం ఏర్పరుచుకొనేది, శూద్రులైన రైతులు ఒక్కరే కాదు. ఆ గ్రామాలు ఏర్పాటు చేసేందుకు, గ్రామీణ జీవనం సంపూర్ణంగా ఉండేందుకు అవసరమైన వడ్రంగులు, వర్తకులు మొదలైన ఇతర వృత్తులవారు కూడ ఆ గ్రామాల్లో నివాసం ఏర్పాటు చేసుకొనేవారు. కాని ఈ విషయంలో ఒక వ్యత్యాసం ఉండేది. ప్రభుత్వం ఆజ్ఞల మీద శూద్రులైన రైతులు కొత్త గ్రామాలకు తరలి వెళ్ళేవారు. కాని ఇతర వృత్తులకు చెందినవారు మాత్రం తమకు తాముగా స్వచ్ఛందంగా వారి వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపడ్చు కొనేందుకు కొత్తగా నిర్మించిన గ్రామాలకు వలసవెళ్ళి, అక్కడ స్థిర నివాసాన్ని ఏర్పరుచుకొనేవారు.

మౌర్యుల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ప్రతి గ్రామానికి సంబంధించిన సమష్టి యత్నాలకు ప్రాముఖ్యం ఇవ్వబడింది. గ్రామంలో నివసించే ప్రజలందరి నిత్యావసరాలకు సంబంధించి, ప్రతి గ్రామం స్వయం సమృద్ధి గల విభాగంగా క్రమంగా అభివృద్ధి చెందింది.

13.3.9 వ్యవసాయ కార్మికులు

మౌర్యుల కాలంలో భూమిలేని వ్యవసాయ కార్మికులుండేవారు. వారిని ఇంటిపనివారుగా నియమించేవారు. వారికి ఉచితంగా ఆహారం, కొద్దిగా డబ్బు రూపంలో జీతం ఇచ్చేవారు. జీతం మీద పనిచేసే సాధారణ కార్మికులు (కర్మకార) కూడ ఉండేవారు. డబ్బుకు అమ్ముడుపోయిన బానిసలు (దాసులు) కూడ పనిచేసేవారు. వీరేగాక సొంత భూములు

BRAOU

గలరైతులు, వారి కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులు చేసేవారుండేవారు. ఈ రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తుల్లో కొంత భాగం ప్రభుత్వానికి ఇవ్వవలసి ఉండేది. ప్రభుత్వం రైతుల నుండి వారు పండించిన పంటలో ఆరో వంతు భూమిశిస్తుగా వసూలు చేసేది.

ఆ కాలం నాటి 'దీఘనికాయ' 'అంగుత్తరనికాయ', మిళిందపన్హా', మొదలైన బౌద్ధ గ్రంథాలు భూస్వామికి తన భూమిని దున్ని సాగు చేయడమే ధ్యేయంగా ఉండాలి అని పేర్కొన్నాయి. ఆ రచనల వల్ల, వ్యవసాయ కూలీలను నాటి సాంఘిక వ్యవస్థలో నీచంగా చూసేవారని, వారిని బానిసలకంటే అధమంగా పరిగణించేవారని తెలుస్తుంది.

చిన్నరైతులు తమ భూములను సాగు చేసి, ధాన్యం పండించక ఇంటిలోని ధాన్యం కొట్టును ఖాళీగా వదలి, వ్యవసాయ కార్మికుల్లో కలసి, కూలీలుగ పెద్ద భూస్వాముల, ధనిక వర్గాల భూకమతాల్లో వ్యవసాయ పనులు చేసేందుకు వెళ్ళడం నాటి సాంఘిక వ్యవస్థ క్షీణ దశను సూచిస్తుందని జాతక కథలు పేర్కొన్నాయి.

కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల బానిసలను వ్యవసాయ పనులు చేసేందుకు వినియోగించడం మౌర్యుల కాలంలో వచ్చిన ముఖ్యమైన సాంఘికాభివృద్ధి అని తెలుస్తుంది. భారతదేశంలో మొదటి సారిగా మౌర్యుల కాలంలోనే బానిసలను అధిక సంఖ్యలో వ్యవసాయ పనుల్లో వినియోగించారు.

13.3.10 వ్యవసాయ పంటలు

మౌర్యుల కాలంలో అనేక రకాల పంటలు, కాయకూరలు, పండ్లు పండించేవారు. వాటిలో ముఖ్యమైనవి, 1. పలురకాల వరిధాన్యాలు, 2. ముడిధాన్యం (కొద్రవ), 3. నువ్వులు (తిలలు), 4. మిరియాలు, కుంకుమ పువ్వు (ప్రియంగు), 5. పప్పుధాన్యాలు, 6. యవలు, 7. గోధుమ, 8. అవిసెలు (అతసి), 9. ఆవాలు (సర్షప), 10. కాయకూరలు (శాకమూలాలు), 11. అరటి, గుమ్మడి, పుచ్చకాయలు, ద్రాక్ష మొదలైన పండ్లు, 12. చెరకు (ఇక్షు) మొదలైన పంటలు.

13.3.11 పశుపోషణ

మౌర్యుల కాలంలో వ్యవసాయం పశువుల మీద ఆధారపడి ఉండేది. పశువుల్లో ఆవులు, ఎద్దులు, దున్నలు, గేదెలు, మేకలు, గొర్రెలు, గొర్రెపోతులు, గాడిదలు, పందులు, కుక్కలను పెంచేవారు.

ప్రభుత్వం పశు క్షేత్రాలు(Cattle - farms), గుర్రాల క్షేత్రాలు (Stud - farms), పాడిక్షేత్రాలను (Dairy - farms), నిర్వహించేది. వాటిలో అనేకమంది కార్మికులు పని చేసేవారు. వారు 1. ఆవులు, ఎద్దుల కాపరులు (గోపాలకులు), 2. గేదెల, దున్నల కాపరులు (పిండారకులు), 3. పాలు పితికేవారు (దోహకులు), 4. మజ్జిగ చిలికేవారు (మంథకులు), 5. క్రూరమృగాలు పచ్చిక బయళ్ళు నాశనం చేయకుండా కాపలాకాసే వేటగాళ్ళు.

పశు క్షేత్రాల్లో లేగదూడలు, కోడెలు, ఆంబోతులు, దున్నపోతులు పెంచేవారు. అడవుల్లో పెరిగిన పశువులను మచ్చిక చేసేవారు. ప్రభుత్వ నిర్వహణలో పైన పేర్కొనబడిన పశు క్షేత్రాలేగాక, కోళ్ళక్షేత్రాలు (Poultry-farms) కూడ ఉండేవి.

13.3.12 అడవులు

మౌర్యుల కాలంలో భారతదేశంలో విశాలమైన ప్రాంతాల్లో అడవులు ఉండేవి. ప్రజల ఆర్థిక జీవనంలో అటవీ ఉత్పత్తులకు కూడ ప్రాముఖ్యత ఉండేది. అటవీ ఉత్పత్తుల నుండి నాగళ్ళు మొదలైన వ్యవసాయ పనిముట్లు,

BRAOU

ఇతర పరికరాలు, బండ్లు, ఆయుధాలు మొదలైనవి తయారుచేసేవారు. అటవీ ఉత్పత్తుల నుండి పరికరాలను తయారుచేసేందుకు చిన్న తరహా కర్మాగారాలు కూడ ఉండేవి.

మౌర్యుల కాలంలో ఆర్థికపరమైన వినియోగాలకు వివిధ రకాల అడవులు పెంచేవారని కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల తెలుస్తుంది. అవి 1. రాజు, రాజ కుటుంబీకులు వేటాడేందుకు రిజర్వు అడవులు. వాటిలో పులులు, ఎనుబోతులు, ఏనుగులు మొదలైన క్రూరమృగాలు అధిక సంఖ్యలో పెంచేవారు. వాటి నుండి ప్రమాదం లేకుండా వాటి కోరలు, గోళ్ళు తీసివేసేవారు. 2. క్రూరమృగాలు నివసించే ఇతర అడవులు. 3. కలప, వెదురు, వేము, జనుము మొదలైన నారలు, అద్దకాలకు ఉపయోగించే పూలమొక్కలు, ఔషధాల్లో వాడే మొక్కలు, వేళ్ళు, పూలు మొదలైనవి లభించే అడవులు. ఈ ఉత్పత్తులు లభించే అడవులన్నీ ప్రభుత్వాధీనంలో ఉండేవి.

ఆర్థిక పరంగాను, సైనిక పరంగాను ఉపయోగపడే ఏనుగు జాతులను పెంచి పోషించేందుకు కూడ అడవులను పెంచేవారు. ఈ అడవులు 'నాగవనాధ్యక్ష' అనే ప్రత్యేక అటవీ సంరక్షణాధికారి నిర్వహణలో ఉండేవి. చిరుత పులులు, పెద్ద పులులు, సింహాలు, ఏనుగులు, అడవి దున్నలు, చమరాలు, పాములు, పక్షులు, మొదలైన జంతువుల నుండి చర్మాలు, కొవ్వు, ఎముకలు, పళ్ళు, కొమ్ములు, గిట్టలు, తోకలు మొదలైనవి కూడ అడవుల నుండి లభించేవి.

13.4 నీటి పారుదల

మౌర్యుల కాలంలో వ్యవసాయ భూమికి నీటిపారుదల విషయంలో ప్రభుత్వమే బాధ్యత వహించేది. ఎందువల్లంటే, నీటిపారుదల రకాల ఆధారంగా భూమిశిస్తు మదింపు, నిర్ధారణ జరిగి, దాని మూలంగా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. ప్రభుత్వం నీటి తూములను తన అధీనంలో ఉంచుకొని, నీటి పంపకం చేసేది. చెరువులు, కాలువలు నిర్మించడం ద్వారా కొత్తగా నీటి సరఫరా కల్గించడం కూడా ప్రభుత్వానిదే బాధ్యత.

జాతక కథలు మొదలైన బౌద్ధ మతానికి చెందిన పాళీ గ్రంథాల వల్ల, సహకార నీటిపారుదల కోసం గ్రామంలోని వ్యవసాయ యోగ్యమైన భూములను కమతాలుగా విభజించి, వాటి మధ్య చిన్న కాలువలను త్రవ్వేవారని తెలుస్తుంది.

మగధలోని వ్యవసాయ భూములు దీర్ఘచతురస్రాకారంలోను, అర్ధచంద్రాకారంలోను ఉండి, చూపరులకు గుడ్డముక్కలతో కుట్టిన బౌద్ధ సన్యాసుల దుస్తుల్లాగ కనపడేవని బుద్ధుడు వర్ణించాడని వినయగ్రంథంలో పేర్కొన్నారు

మౌర్యుల కాలంలో వ్యవసాయ భూమి సారవంతంగాను, దానిలో అత్యధిక భాగం నీటి పారుదల కలిగి ఉండి, సంవత్సరానికి రెండు పంటలు పండేవి. భూమి సాగుచేసే వ్యవసాయదారుల ప్రయోజనం కోసమే ప్రభుత్వం నీటిపారుదల సౌకర్యాలను కలుగజేసి, నీటిసరఫరాను నియంత్రించేది. మౌర్య సామ్రాజ్యంలో ఈజిప్టులోలాగే ప్రభుత్వాధికారి భూమి కొలతలు కొలిచి, కాలువలు పరిశీలించి, వాటినుండి చిన్న కాలువల ద్వారా నీటి సరఫరా జరిగేటట్లు చూసేవాడు.

చంద్రగుప్తుడు వ్యవసాయ భూములకు నీటిపారుదల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాడు. ప్రభుత్వాధికారి నీటి తూములు తనిఖీ చేసి, వాటి ద్వారా కాలువలకు నీటి సరఫరా చేయడంవల్ల వ్యవసాయదారులందరికి నీటిపారుదల సౌకర్యం కలిగి, భూములు సాగుచేసేవారని మెగస్తనీస్ పేర్కొన్నాడు.

ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగానే, చంద్రగుప్తుడు సౌరాష్ట్రలోని 'సుదర్శన సరస్సు' నిర్మాణానికి ఆ ప్రాంత గవర్నర్ పుష్యగుప్తుని ఆజ్ఞాపించాడు. పర్వతాల్లో నుండి వచ్చే వాగుకు ఆనకట్ట కట్టి సుదర్శన సరస్సును నిర్మించారు. ఈ రిజర్వాయర్ వల్ల సౌరాష్ట్ర ప్రాంతంలో నీటిపారుదల సౌకర్యాలు కలిగి, కొత్తగా భూములు సాగులోకి తేబడి

BRAOU

వ్యవసాయ భూమి విస్తీర్ణం అధికంగా పెరిగింది. దీనివల్ల వ్యవసాయాభివృద్ధి జరిగి, రైతులు బాగుపడటమేగాక, ప్రభుత్వానికి భూమి శిస్తు ద్వారా లభించే ఆదాయం కూడ పెరిగింది.

సుదర్శన సరస్సు నిర్మాణం చంద్రగుప్తుని పాలనలో జరిగినా, అశోకుని కాలంలో దానికి నీటి తూములు నిర్మించారు. ఆ తర్వాత క్రీ.శ.150లో పశ్చిమ క్షాత్రవంశరాజు రుద్రదాముని పాలనా కాలంలో వచ్చిన తుఫాను ఫలితంగా సుదర్శన సరస్సు ఆనకట్టకు గండి పడినందువల్ల, దాన్ని బాగుచేశారని జునాగఢ్ శాసనం పేర్కొంది. తిరిగి క్రీ.శ.456 లో గుప్తవంశ రాజు స్కందగుప్తుని పాలనా కాలంలో సుదర్శన సరస్సు ఆనకట్టకు గండ్లు పడినందువల్ల, గిర్నార్ ప్రాంత గవర్నర్ చక్రపాలితుడు అత్యధిక వ్యయంతో ఆనకట్టను రాళ్ళతో పునర్నిర్మించాడు. ఆ ఆనకట్ట పునర్నిర్మాణం పూర్తైన సందర్భంగా, క్రీ.శ.458 లో 'చక్రభృత్' లేక విష్ణు ఆలయం నిర్మించారని జునాగఢ్ శాసనం పేర్కొంది.

13.5 ఆర్థిక విధానం

మౌర్యుల కాలంనాటి ఆర్థిక విధానం పటిష్టంగా ఉండేది. ప్రభుత్వం ప్రజల నుండి వసూలుచేసే అనేక రకాల పన్నులను కౌటిల్యుడు తన రచనల్లో సవివరంగా పేర్కొన్నాడు. వ్యవసాయదారుల మీద, వ్యాపారుల మీద పలురకాల పన్నులను విధించేవారు. పన్ను ఎగవేతదారులను కఠినంగా శిక్షించేవారు. ప్రభుత్వం ఆర్థిక వ్యవహారాల్లో ఎంత జాగ్రత్త వహించినా, మౌర్యుల చివరి కాలంలో దేశం ఆర్థిక సంక్షోభంలో పడింది.

13.5.1 పన్నుల విధానం

భారతదేశంలోని పన్నుల వ్యవస్థలో మౌర్యుల కాలంనాటి పన్నుల విధానం ఒక మహత్తర సంఘటనగా పేర్కొనవచ్చు. రైతులు, చేతివృత్తివారు, వ్యాపారస్తులు కట్టవలసిన అనేక పన్నులను కౌటిల్యుడు అర్థశాస్త్రంలో పేర్కొన్నాడు. ఆపన్నుల మదింపుకు, వసూలుకు, వసూలైన డబ్బు నిలువచేసేందుకు పటిష్టమైన, సమర్థవంతమైన ప్రభుత్వ యంత్రాంగం మౌర్యుల కాలంలో ఉండేది. పన్నుల ద్వారా వసూలైన డబ్బు నిలువజేసే పనికంటే, వాటి మదింపుకు మౌర్యులు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. సమాహర్తుడు పన్నుల మదింపుకు సంబంధించిన ప్రభుత్వ ఉన్నతాధికారి. సన్నిధాతుడు ప్రభుత్వ ఖజానాకు, గిడ్డంగులకు ముఖ్య అధికారి.

మౌర్యుల కాలంలో ప్రభుత్వం ప్రజల మీద అనేక రకాల పన్నులు వేసేదని కౌటిల్యుని అర్థశాస్త్రంలో ఇవ్వబడిన పన్నుల పట్టిక పరిశీలిస్తే తెలుస్తుంది. ఆ పన్నులన్నీ ప్రభుత్వం వాస్తవంగా వసూలు చేసిఉంటే, ప్రజలు కనీసం సాధారణ జీవనం గడిపేదానికి కూడ వారివద్ద ఏమీ మిగులుదల ఉండేది కాదని చెప్పవచ్చు.

వ్యవసాయం ఒక్కటే ఉత్పత్తి సాధనమని, సంపదకు మూలాధారం, కాబట్టి, వ్యవసాయ భూముల మీద ప్రత్యక్ష పన్ను ఒక్కదాన్నే పెంచడం ద్వారా ప్రభుత్వాదాయం పెంచాలని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంతేగాక, అధిక పన్నులు వేయడం లేదా వారు కూడబెట్టిన ధనాన్ని కక్కించడం ద్వారా ధనికులను బలోపేత పర్చడం అనే విధానాన్ని ప్రభుత్వ అనుసరించాలని కూడా కౌటిల్యుడు సూచించాడు.

మౌర్యుల కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో గిడ్డంగులు ఉండేవని నాటి శాసనాల వల్ల తెలుస్తుంది. దీన్నిబట్టి, ఆ కాలంలో పన్నులను ధాన్యరూపంలో కూడ వసూలు చేసేవారని, దుర్భిక్షాలు, కరువు కాటకాలు సంభవించినప్పుడు ప్రజలకు సహాయపడేందుకు ధాన్యపు గిడ్డంగులను ఉపయోగించేవారిని తెలుస్తుంది.

BRAOU

13.5.2 ఆదాయ వ్యయాలు

ప్రభుత్వానికి ఆదాయం ప్రధానంగా భూమి శిస్తు ద్వారా వచ్చేది. సాధారణంగా వ్యవసాయ ఉత్పత్తిలో ఆరో వంతు భూమి శిస్తుగా రాజుకు చెందేది. కాని అది ప్రదేశాన్ని బట్టి, పరిస్థితులను బట్టి మారేది. గనులు, అడవుల వల్ల వచ్చే రాబడి మీద పన్నులు, రాజ్య సరిహద్దులో ఎగుమతులు, దిగుమతులపై వసూలు చేసే కస్టమ్స్ పన్నులు, దారి సుంకాలు, రేవుల వద్ద వసూలు చేసే పన్నులు, వృత్తి పనివారల మీద వేసే పన్నులు, స్వల్పంగా వేసే పన్నులు, ఇతర పన్నులను, గడ్డుకాలాల్లో ప్రజలనుండి వసూలు చేసేవి మొదలైన వాటివల్ల ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. ప్రభుత్వం వేసే పన్నులను వసూలు చేసే బాధ్యత సమాహర్తుడు అనే అధికారికి ఉండేది.

పన్నుల ద్వారా వచ్చే ఆదాయం రాజు, రాజు ఆస్థానం, సైన్యం, రాజ్య రక్షణ, ప్రభుత్వాధికారుల జీతాలు, చేతిపనివారలు మొదలైన వారికి ఇవ్వవలసిన భత్యాలు, దానధర్మాలు, మతసంబంధమైన కార్యక్రమాలు, రహదారులు, నీటిపారుదల, భవనాలు వంటి ప్రజలకు ఉపయోగపడే పనులు మొదలైన వాటిమీద ఖర్చు చెట్టేవారు.

13.5.3 వ్యవసాయ పన్నులు

మౌర్యుల కాలంలో ప్రభుత్వం వ్యవసాయం మీద అనేక రకాల పన్నులను వేసేది. అవి (1) వ్యవసాయ ఉత్పత్తిపై పన్ను, (2) వెట్టిసని, (3) యుద్ధాలు, కరువుకాటకాలు సంభవించినప్పుడు ప్రభుత్వ ధాన్యపు గిడ్డంగులను నింపేందుకు వ్యవసాయ ఉత్పత్తుల మీద వేసే ప్రత్యేక పన్ను, (4) అప్పుడప్పుడూ రాజుకు చెల్లించవలసిన చందాలు.

వ్యవసాయ ఉత్పత్తిలో ఆరోవంతు నుండి పన్నెండో వంతు వరకు ప్రభుత్వ భాగంగా హిందూ ధర్మశాస్త్రాలు నిర్ణయించాయి. బుద్ధుని జన్మస్థలమైన లుంబినీ గ్రామంలో మాత్రం, వ్యవసాయ ఉత్పత్తిలో ఎనిమిదో వంతు మాత్రమే ప్రభుత్వ భాగంగా అశోకుడు తగ్గించాడు.

కౌటిల్యుడు అర్థశాస్త్రంలో ఈక్రింది వ్యవసాయ పన్నులు పేర్కొన్నాడు.

(1) 'భాగ' = ఉత్పత్తిలో ప్రభుత్వ భాగం
(2) 'బలి' = భాగ పన్నుకు అధికంగా వేసే పన్ను
(3) 'కర' = అష్టి పన్ను
(4) 'వినీత' = పచ్చిక బయళ్ళ మీద వేసే పన్ను
(5) 'రజ్జు' = సర్వేకు, గ్రామం ఏర్పాటు బందోబస్తు పన్ను
(6) 'చోరరజ్జు' = పోలీసు పన్ను లేక చౌకీదారీ పన్ను

భూములన్నీ రాజుకు చెందినవని, వాటిని రైతులు రాజు కొరకే సాగుచేసేవారని మెగస్తనీస్ పేర్కొన్నాడు. రైతులు వ్యవసాయ ఉత్పత్తుల్లో నాలుగో భాగం శిస్తుగా ప్రభుత్వానికి చెల్లించేవారని, అదేగాక భూమి మీద కప్పం కూడ రాజుకు కట్టేవారని, మెగస్తనీస్ పేర్కొన్నాడు. వ్యవసాయ భూములు సాగుచేసినందుకుగాను రైతులకు ఉత్పత్తిలో నాలుగో భాగం రాజు ఇచ్చేవాడని స్ట్రాబో వివరించాడు. కాని ఆర్రియన్ మాత్రం రైతులు భూములను సాగు చేసేవారని, వారు రాజులకు, స్వతంత్ర నగరాలకు కప్పం కట్టేవారని వర్ణించాడు. భూమి మీద కట్టే కప్పం, ప్రభుత్వానికి చెల్లించే భూమిశిస్తు వేర్వేరని డయోడొరస్ స్పష్టంగా పేర్కొన్నాడు. భూమిపై కట్టే కప్పం అంటే, ఆభూమి సాగుచేసుకొన్నందుకు రాజుకు ఇచ్చే అద్దే. ప్రభుత్వానికి కట్టే భూమిశిస్తు అంటే, వ్యవసాయ ఉత్పత్తిపై వేసే పన్ను.

కొన్ని ప్రాంతాల్లో భూమి మీద కట్టే కప్పం ప్రభుత్వాదాయానికి మూలంగా ఉండి, వ్యవసాయ ఉత్పత్తిలో నాలుగో భాగం అనేది కొన్ని పంటలకు మాత్రమే వర్తించేది. రెండు రకాల భూమిశిస్తు ఉండేదని యు.ఎస్. ఘోషాల్

BRAOU

వివరించాడు. వాటిలో మొదటిది తొలి వేద కాలంనాటి కప్పం (బలి) ఆధారంగా వేసే భూమిశిస్తు (భాగ), రెండవది 'హిరణ్య' లేదా ప్రత్యేక రకాల పంటలపై ధనరూపంలో వేసే పన్ను. కాబట్టి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఒకే ప్రాంతంలో సైన పేర్కొన్న రెండు రకాల భూమి శిస్తు వేసేవారు.

వ్యవసాయ ఉత్పత్తిలో నాలుగో భాగంగా భూమి శిస్తు అంటే, అది సాధారణ అంచనాగా ఉండాలి లేదా మెగస్తనీస్‌కు పరిచయం లేని పాటలీపుత్రం చుట్టూ ఉండే అత్యంత సారవంతమైన ప్రాంతాల్లో వేసే భూమిశిస్తు అయినా అయి ఉండాలి. భూమి శిస్తుగా వసూలు చేసే కచ్చితమైన మొత్తం అనేది స్థానిక పరిస్థితులను బట్టి మారుతూ ఉండేది. భారతీయ గ్రంథాల్లో అధిక భాగం వ్యవసాయ ఉత్పత్తిలో ఆరో భాగాన్నే భూమి శిస్తుగా పేర్కొన్నాయి. కాబట్టి వ్యవసాయ ఉత్పత్తిలో నాలుగో భాగం భూమి శిస్తు అనేది ఆ గ్రంథాలు పేర్కొన్న అరో భాగం కంటే చాలా ఎక్కువ. భూమి శిస్తును వ్యవసాయ ఉత్పత్తిలో ఎనిమిదో భాగం, పదో భాగం, పన్నెండో భాగం అని కూడ కొన్ని గ్రంథాలు పేర్కొన్నాయి.

అత్యవసర పరిస్థితుల్లో భూమి శిస్తును వ్యవసాయ ఉత్పత్తిలో మూడోభాగంగా లేక నాలుగో భాగంగా పెంచవచ్చు లేదా రెండు పంటల పద్ధతి అవలంబించవచ్చు. కాని అది వర్షాధారంగా సాగుచేసే సారవంతమైన ప్రాంతాల్లో మాత్రమే.

వ్యవసాయ ఉత్పత్తిలో నాలుగో భాగం భూమిశిస్తు అనేది చాలా ఎక్కువ అని, అటువంటి శిస్తు కట్టడం రైతులకు అత్యంత కష్టసాధ్యమని, దాన్ని బలవంతంగా అమలు చేస్తే, ప్రభుత్వం మీద ప్రజలు తిరుగుబాటు చేస్తారని, అటువంటి తిరుగుబాటు సమర్థనీయమేనని హెచ్.సి.రాయ్ చౌదరి అభిప్రాయ పడ్డారు.

న్యాయంగా చూస్తే, వ్యవసాయ ఉత్పత్తిలో నాలుగో భాగం భూమిశిస్తు అనేది చాలా ఎక్కువ అని, కాని మౌర్యుల కాలం అనంతరం కొన్ని శతాబ్దాల తర్వాత పరిస్థితులు మరీ దిగజారి పోయాయని, ఉదాహరణకు మొగల్ చక్రవర్తి అక్బర్ పరిపాలనా కాలంలో భూమిశిస్తు అత్యధికంగా అంటే వ్యవసాయ ఉత్పత్తిలో మూడో భాగంగా ఉండి, రైతులపై పెనుభారం పడిందని రోమిలా థాపర్ వివరించాడు.

అశోకుని శాసనాల్లో మౌర్యుల కాలం నాటి భూమిశిస్తు గురించి కచ్చితంగా పేర్కొంది, 'రుమ్మిండై శాసనం' ఒక్కటి మాత్రమే. ఆ శాసనం వల్ల బుద్ధుని జన్మస్థలం లుంబినీ గ్రామం కాబట్టి అశోకుడు ఆ గ్రామానికి పన్నుల నుండి మినహాయింపు ఇచ్చాడని, ఆ గ్రామంలోని రైతులు భూమిశిస్తుగా వ్యవసాయ ఉత్పత్తిలో ఎనిమిదో భాగం మాత్రమే చెల్లించేవారని తెలుస్తుంది. మొట్టమొదటిసారిగా ఆ శాసనంలో వాడిన పదం ' ఉద్భలికె'. అంటే దానికి అర్థం కప్పం (బలి) నుండి మినహాయించడం. దీన్నిబట్టి మౌర్యుల కాలంలో ప్రతిగ్రామం కప్పం కట్టవలసి వచ్చేది అని తెలుస్తుంది. ఎనిమిదో భాగం (అట్టభాగియే) అనేది వ్యవసాయ ఉత్పత్తిలో భాగమే.

మౌర్యుల కాలంలో భూమి మీద కట్టే కప్పం నుండి మినహాయింపు విషయంలో రాజు మాత్రమే ప్రత్యక్షంగా నిర్ణయం తీసుకొనేవాడని 'రుమ్మిండై శాసనం' వల్ల తెలుస్తుంది. భూమి యజమాని వంటి మధ్యవర్తి ఉండి ఉంటే, మినహాయింపు ఇచ్చే విషయంలో రాజు నిర్ణయం తీసుకొనేదానికి కొంచెం కష్టంగా ఉండేది. ఎందువల్లంటే, ఆ నిర్ణయ ప్రభావం భూమి యజమాని ఆర్థిక స్థితి మీద పడేది. దీన్నిబట్టి మౌర్యుల కాలంలో భూస్వామ్య వ్యవస్థ లేదని తెలుస్తుంది.

13.5.4 వాణిజ్య పన్నులు

మౌర్యుల కాలంలో అమ్మకం వస్తువుల మీద సాధారణంగా వేసే వాణిజ్య పన్ను వాటి ధరలో పదో వంతుగా ఉండేదని, కాని అది ప్రతి సరుకు మీద వేరుగా మారేదని కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల తెలుస్తుంది. కొన్ని రకాల జౌళి వస్త్రాల మీద వాటి ధరలో ఇరవై ఆయిదో వంతు (1/25) వాణిజ్య పన్ను వేసేవారు. పూలు, కాయకూరలు మొదలైన సరుకుల మీద వాటి ధరలో ఆరో భాగం (1/6) వాణిజ్య పన్ను వేసేవారు. దీన్ని బట్టి మౌర్యుల కాలంలో

Dr. BRAOU LIBRARY Acc. No. 115057 Class No. 954 CHE

అమ్మకం వస్తువుల మీద వేసే వాణిజ్య పన్ను వాటి ధరలో 1/25 నుండి 1/6 భాగం మధ్య వరకు ఉండేదని తెలుస్తుంది.

అమ్మకం వస్తువులన్నింటి మీద వాణిజ్య పన్ను వేసేవారు. కాబట్టి ఏ సరుకైనా దాని మీద పన్ను వేయకుండా, దాని ధర నిర్ణయించకుండా ముందుగా కొనడం, వస్తువు తయారయ్యే ప్రదేశంలో కొనడం శిక్షార్హమైన నేరంగా పరిగణించేవారు. స్వదేశీ సరుకుల మీద అవి తయారయ్యే ప్రదేశంలోనే వాణిజ్య పన్ను ముద్ర వేసేవారు. విదేశీ వస్తువుల మీద దారిసుంకాలు వసూలు చేసే ద్వారాల వద్ద వాణిజ్య పన్ను ముద్ర వేసేవారు. దారి సుంకం వస్తువు ధర మీద ఆధారపడి ఉన్నందువల్ల దాన్ని వస్తురూపంలో కాకుండా, డబ్బుగా వసూలు చేసేవారు.

13.5.5 పన్ను ఎగవేతదారులు - శిక్షలు

మౌర్యుల కాలంలో పన్నుల ఎగవేతదారులు ఉండేవారని, అటువంటి నేరస్తులకు మరణ దండన వేసి శిక్షించేవారని గ్రీక్ రచనల వల్ల తెలుస్తుంది. కాని పన్నులు ఎగవేసినందుకు అవిధంగా శిక్షించేవారు కాదని, ప్రభుత్వాధికారుల నుండి పన్నుల రూపంలో వసూలైన డబ్బును దొంగలించిన వారికే మరణ దండన శిక్ష వేసేవారని, కొందరు చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. ఎందువల్లంటే, అర్థశాస్త్రంలో ఎక్కడా పన్నులు ఎగవేసిన నేరానికి మరణ దండన వేసేవారని కౌటిల్యుడు పేర్కొనలేదు.

కౌటిల్యుడు అర్థశాస్త్రంలో పన్నులు వసూలు చేసే ప్రభుత్వాధికారుల నుండి డబ్బు దొంగలించడానికి సంబంధించిన నేరానికి చెప్పుకోదగ్గ ప్రాముఖ్యం ఇచ్చి నొక్కి చెప్పాడు కాబట్టి, మౌర్యుల కాలంలో అటువంటి నేరాలు ఉండేవని స్పష్టంగా తెలుస్తుంది. గ్రీక్ రచనల్లో పేర్కొన్న విషయం ఇటువంటి నేరానికి సంబంధించిందే అయిండవచ్చు.

13.5.6 ఆర్థిక సంక్షోభం

మౌర్యుల పాలనలో సైన్యం మీది భారీ వ్యయం ఉండినందువల్ల, సామ్రాజ్యంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. ప్రాచీన కాలంలో భారతదేశంలో మౌర్యుల పాలనలోనే అతిపెద్ద సైన్యం, అత్యధిక సంఖ్యలో ప్రభుత్వాధికారులు ఉండేవారు. అందువల్ల ప్రజల మీద అనేక రకాల పన్నులు వేసినా కూడ, అంత పెద్ద ప్రభుత్వ వ్యవస్థను నిర్వహించడం కష్టసాధ్యమయ్యేది. అంతేకాక, అశోకుడు బౌద్ధ సన్యాసులకు అధికంగా దానధర్మాలు చేయడం వల్ల ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యింది. దాని ఫలితంగా మౌర్యుల పాలన చివరి దశలో ప్రభుత్వ వ్యయాన్ని భరించేందుకు బంగారు విగ్రహాల్ని కూడ కరిగించవలసి వచ్చే పరిస్థితి ఏర్పడింది. దీన్ని బట్టి మౌర్యుల కాలంలో భారతదేశంలో, ప్రజల ఆర్థిక పరిస్థితులు కాలక్రమేణా క్షీణించాయని తెలుస్తుంది.

13.6 శ్రేణులు

మౌర్యుల కాలంలో చేతిసనివారు అందరూ వారి వారి వృత్తుల ఆధారంగా శ్రేణులు ఏర్పాటు చేసుకొనేవారు. ప్రతి శ్రేణికి అధ్యక్షుడుగా 'పనుఖుడు', నగర వృద్ధుడుగా(elderman) 'జెట్టకుడు' ఉండేవారు. అంతే కాక శ్రేణులన్నీ సమాఖ్యలుగా ఏర్పడేవి. సమాఖ్యలన్నీ భాండాగారికుని ఆధ్వర్యంలో ఉండేవి.

పారిశ్రామిక రంగంలో లాగే, వాణిజ్య రంగంలో కూడ వర్తకులు శ్రేణులను ఏర్పాటు చేసుకొనేవారు. ప్రతి శ్రేణికి నాయకుడుగా శెట్టి ఉండేవాడు. శ్రావస్తి నగరవాసి మహాశెట్టి అనే వ్యాపార ప్రముఖుడు 500 మంది శెట్టిల ఆధ్వర్యంలో ఉన్న వర్తక శ్రేణులు ఏర్పాటు చేసుకొన్న వాణిజ్య సమాఖ్యకు నాయకుడుగా ఉండేవాడు.

మౌర్యుల కాలంలో వ్యాపారస్తులు, చేతి సనివారు ఒక పద్ధతి ప్రకారం సంఘటితం అయ్యేవారని, సైన పేర్కొన్న విషయాల వల్ల తెలుస్తుంది. శ్రేణి వ్యవస్థ తొలి బౌద్ధ యుగంలో ప్రారంభమై, మౌర్యుల కాలమంతా కొనసాగిందని నాటి ఆధారాల వల్ల తెలుస్తుంది.

BRAOU

శ్రేణుల చరిత్ర గురించి రాస్తూ వాటి అభివృద్ధికి స్థలాకృతి(Topography) సహకరించిందని ఫిక్ (Ficke)సూచించాడు. ఎందువల్లంటే ఒక పట్టణంలో కొన్ని ప్రదేశాల్లో ప్రత్యేకంగా ఒక వృత్తికి చెందిన వారే నివసించేవారు.

శ్రేణి వ్యవస్థ అవిర్భావానికి అవసరమైన మూడు అంశాలు ఆ కాలంలో ఉండేని. అవి 1. ఒక వృత్తి ఒకే ప్రాంతానికి చెందడానికి అనుకూలంగా ఉండేది. 2. వృత్తులన్నీ వంశపారంపర్యంగా వచ్చేవని గుర్తించారు. 3. శ్రేణికి నాయకుడు (జెట్టకుడు) ఉండడం అవసరమని అందరు గుర్తించి, ఆమోదించారు.

మౌర్యుల కాలంలో వాణిజ్యం విస్తృతంగా అభివృద్ధి చెందినందువల్ల అది శ్రేణుల అభివృద్ధికి, వాటి స్థిరీకరణకు దోహద పడింది. శ్రేణుబు మొదట్లో తెగకు,కులానికి మధ్యస్థంగా ఉండేవి. కాని తర్వాత కాలంలో అని కఠినమైన నియమ నిబంధనలకు లోబడి ఉండేవి. దాని ఫలితంగా వాటిలో కొన్ని కాలక్రమేణా కులాలుగా మార్పుచెందాయి.

శ్రేణులు ఏర్పడేందుకు ప్రారంభంలో వృత్తి, వ్యాపారాల్లో వ్యక్తుల మధ్య పోటీ కూడ ఒక ప్రోత్సాహకర అంశంగా ఉండేది. ఆర్థికపరంగా చూస్తే వ్యక్తిగతంగా పనిచేసేదాని కంటే, ఒక సంఘంలో సభ్యునిగా వ్యక్తికి సంఘంలో స్థానం, గౌరవం పెరిగేవి. అంతేగాక అవసరమైనప్పుడు ఇతర సభ్యుల సహాయ సహకారాలు పొందేందుకు అవకాశం ఉండేది. క్రమంగా వివిధ దశల్లో శ్రేణులు అభివృద్ధి చెంది, అవి ఉన్న ప్రాంతాల్లో అత్యంత ప్రాముఖ్యంగల పారిశ్రామిక సంఘాలుగా ఏర్పడ్డాయి.

శ్రేణి వ్యవస్థ కారణంగా, శ్రేణుల సభ్యులకు కొన్ని హక్కులుండేవి. ఉదాహరణకు వారికి గాయాల నుండి, దొంగతనాల నుండి రక్షణ ఉండేది. ఒక వృత్తి పనివాడిని గాయపరిస్తే, ఆ నేరస్తుడికి మరణదండన విధించేవారు.

ఒక చేతిపనివాడి పనిముట్లు దొంగలిస్తే, ఆ దొంగకు పెద్ద మొత్తంలో 100 పణాలు జరిమానా వేసేవారు. చేతిపనివారు మోసానికి పాల్పడితే, కఠిన నియమ నిబంధనలను అమలు చేసేవారు. చేతిపనివారు ఎవరికైనా వారు శ్రేణుల సభ్యులైనా డబ్బు ఇచ్చేటప్పుడు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించేవారు.

శ్రేణి సభ్యులకు నియమ నిబంధనలు కఠినంగా ఉండేవి కాబట్టి, అవి వారు మోసానికి పాల్పడకుండా నిరోధించేవి. ఒక చేతిపనివాడు మోసం చేస్తూ పట్టుబడితే, అతడు శ్రేణులను కొనసాగేందుకు వీలు ఉండేదికాదు. అతడు శ్రేణుల నుండి బహిష్కరణకు గురై, చేతిపనివారికి చాలా నష్టం జరిగేది. ఎందువల్లంటే, వారు స్వతంత్రంగా తమ వృత్తిపనులను చేసుకొంటూ జీవనం సాగించడం మిక్కిలి కష్టసాధ్యంగా ఉండేది. అర్థశాస్త్రంలో కౌటిల్యుడు పరిపాలనా పర్యవేక్షకుల పనిని గురించి చర్చిస్తూ, శ్రేణులు పనిచేసే విధానాన్ని గురించి కూడ వివరించాడు. ఈ శ్రేణులు తయారుచేసే వస్తువుల గురించి అర్థశాస్త్రంలో ఇవ్వబడిన వివరాలు గ్రీక్ రచనలు, పురావస్తు ఆధారాలు కూడ ధృవీకరించాయి.

మౌర్యుల కాలం నాటికి ఉత్తర భారతదేశంలో శ్రేణులు భారీ సంస్థలుగా అభివృద్ధిచెంది, నాటి ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ స్థానం పొందాయి. స్థానిక అధికారుల వద్ద శ్రేణులు నమోదు అయ్యేవి. దాని ఫలితంగా, శ్రేణులకు అధికారికంగా గుర్తింపు పొందిన స్థానం ఉండేది. గ్రామాల్లో స్థానికంగా ఉండే సహకార శ్రేణులు తప్ప, మిగిలిన శ్రేణులు నిషేధింపబడ్డాయి. దీన్నిబట్టి ప్రభుత్వాధికారుల అనుమతి లేకుండా, ఒక శ్రేణి ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి పోయే అవకాశం ఉండేది కాదని తెలుస్తుంది. అంతేకాక, వృత్తుల ఆధారంగా ప్రతి తరగతికి చెందిన చేతిపని వారిలో కూడ సాంఘిక హోదా క్రమం (social hierarchy) ఏర్పడింది.

13.7 రుణ పరపతి విధానం

మౌర్యుల కాలంలో రుణపరపతి విధానాన్ని గురించి రాస్తూ, 'భారతీయులు వడ్డీకి అప్పు ఇచ్చేవారు కాదు, తీసుకొనేవారు కాదు' అని మెగస్తనీస్ పేర్కొన్నాడు. కాని ఈ విషయం యదార్థంకాదు. ఎందువల్లంటే బౌద్ధ

రచన వల్ల నాటి కాలంలో వర్తకులు, వాణిజ్యవేత్తలు తమ వనరులను, సంపదను అభివృద్ధి చేసుకొని, స్థిరంగా కూడబెట్టిన విధం పరిశీలిస్తే, వారికి సంపూర్ణమైన వ్యాపార దక్షత, వాణిజ్య నిర్వహణా పరిజ్ఞానం ఉండేవని తెలుస్తుంది.

మౌర్యుల కాలంలో వాణిజ్య వ్యవహారాల్లో వ్యాపారులకు తోడ్పడేందుకు ప్రైవేట్ బ్యాంకులు పూర్తిగా లేవని చెప్పలేం. ఎందువల్లంటే, కౌటిల్యుడు అర్థశాస్త్రంలో వ్యవస్థీకృతమైన రుణపరపతి విధానాన్ని వివరించాడు. ఆ కాలంలో రుణపరపతి మీద ఏవిధమైన నిషేధంఉండేది కాదు.ఎందుకంటే ప్రభుత్వ ఖజానా నుండి కూడ నిర్ణీత కాలాల్లో వడ్డీ కట్టే షరతు మీద డబ్బు అప్పుగా ఇచ్చే పద్ధతి ఉండేది. కొన్ని సందర్భాల్లో రుణాలపై న్యాయసమ్మతంగా వసూలు చేసే వడ్డీ రేట్లను గురించిన వివరాలు అర్థశాస్త్రంలో పేర్కొనబడి ఉన్నాయి. అప్పు తీసుకొన్న డబ్బు మీద వడ్డీ సాధారణంగా సంవత్సరానికి పదిహేను శాతం (15%) ఉండేది. గాని ప్రత్యేక వాణిజ్య వడ్డీమాత్రం అధికంగా అంటే సంవత్సరానికి అరవై శాతం (60%) వరకు ఉండేది. ఈ అధిక వడ్డీని సముద్రయానాలు, సుదూరప్రయాణాలతో సంబంధం ఉన్న వ్యవహారాల నిమిత్తం తీసుకొనే అప్పుల మీద వసూలు చేసేవారు. వడ్డీరేట్లు ప్రభుత్వ నియంత్రణలో ఉండేవి. అందువల్లే, మెగస్తనీస్ ఆ కాలంలో భారతదేశంలో రుణపరపతి వ్యవహారాలు లేవని పేర్కొని ఉండవచ్చు.

13.8 ద్రవ్య వ్యవస్థ

భారతదేశంలో నందులు, మౌర్యులు అధికారానికి రాక పూర్వమే, స్వదేశీ ప్రమాణాల ఆధారంగా ద్రవ్య వ్యవస్థ రూపు దిద్దుకొంది. వేద కాలం నాటి నిష్క, శతమాన, సువర్ణ నాణేలు నిర్ణీత బరువు గల బంగారు నాణేలు. కాని తర్వాత కాలంనాటి రచనలైన జాతక కథలు, పాణిని రాసిన అష్టాధ్యాయి, కౌటిల్యుని అర్థశాస్త్రం నాడు వాడుకలో ఉండిన బంగారు నాణేలు నిష్క, సువర్ణలు, వెండి నాణేలు కార్షాపణలను పేర్కొన్నాయి. ఆ నాణేలకు రెట్టింపు విలువలు గల నాణేలు, వాటిలో అర్ధ, పావు విలువలు గల నాణేలను కూడ పై గ్రంథాలు పేర్కొన్నాయి. మౌర్యుల కాలంలో మొదటి సారిగా రాగి నాణేలు కూడ ముద్రించి వాడుకలోకి తెచ్చారు.

మౌర్యసామ్రాజ్యంలో వెండి నాణెమైన 'పణ' ప్రామాణిక నాణెంగాను, రాగి నాణెమైన 'మాషక' మారక ద్రవ్యంగాను ఉండేవని కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల తెలుస్తుంది. రాగిని వెండితో అనుసంధానం చేస్తూ, రాగి నాణెం మాషక విలువ వెండి నాణెం పణలో పదహారో వంతుగా (1/16) నిర్ణయించారు.

మౌర్యుల కాలంలో ద్రవ్య వ్యవస్థగురించి రాప్సన్ ఇలా వర్ణించాడు: ధర్మ శాస్త్రాల్లో ప్రత్యక్షంగా పేర్కొన్న విషయాల్ని, నాణేల అధ్యయనాన్ని బట్టి, ప్రాచీన భారతదేశంలో వెండి నాణేలు, రాగి నాణేలు వేర్వేరుగా ఉండి, వేర్వేరు ప్రాంతాల్లో వాడుకలో ఉండేవి. రాగి నాణేలు వెండి నాణేలకు అనుబంధంగా ఉండేవి కావు. కొన్ని జిల్లాల్లో వెండి నాణేలు ప్రామాణికంగా ఉనట్లుగానే, ఇతర జిల్లాల్లో రాగి నాణేలు ప్రామాణికంగా ఉండేవి.

13.8.1 బంగారు నాణేలు

మౌర్యుల కాలంలో వాడుకలో ఉండిన బంగారు నాణేలకు నిష్క, సువర్ణ, శతమాన అని పేర్లుండేవి. సువర్ణ నాణెం బరువు 80 'రక్తిక'లు లేక 'కృష్ణలా'లు (గురువింద గింజలు) అని మనుధర్మ శాస్త్రం, యాజ్ఞవల్క్య

ధర్మ శాస్త్రం, కౌటిల్యుని అర్థ శాస్త్రం పేర్కొన్నాయి. అంటే, సువర్ణ, నాణెం బరువు సుమారు 144 గ్రెయిన్లు. సుమారు 140 గ్రెయిన్లు బరువుగల నాణేలు కొన్ని దొరికాయి. అవి దీర్ఘచతురస్రాకారంలో ఉన్నాయి. అవి మౌర్యుల కాలానికి చెందినవే అని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. అంతకుమించి మౌర్యుల కాలంలో వాడుకలో ఉండిన బంగారు నాణేల గురించి ఇతర వివరాలు ఏమీ తెలియవు. దీన్ని బట్టి మౌర్యుల కాలంలో బంగారు నాణేలు అతి తక్కువ సంఖ్యలో వాడుకలో ఉండేవని తెలుస్తుంది.

13.8.2 వెండి నాణేలు

మౌర్యుల కాలంలో వెండి నాణేలు అధిక సంఖ్యలో ముద్రింపబడి విస్తృతంగా వాడుకలో ఉండేవి. నాటి వెండి నాణేలు ఎక్కువగా దొరికాయి. వెండి 'విద్ధంక' (Punch-marked) నాణేలు భారతదేశమంతటా కాబూల్ నుండి గంగా నది ముఖద్వారం వరకు, హిమాలయ పర్వతాల నుండి కన్యాకుమారి వరకు దొరికాయి అని అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ పేర్కొన్నాడు.

మౌర్యుల కాలంలో వాడుకలో ఉండిన వెండి నాణేలకు కార్షాపణలు, పణలు, ధరణలు, పురాణాలు అని పేర్లుండేవి వెండి నాణెం బరువు 80 రక్తికలు లేక 58 గ్రెయిన్లు అని కౌటిల్యుని అర్థశాస్త్రం 32 రక్తికలు లేక 58 గ్రెయిన్లు అని మను ధర్మశాస్త్రం, యాజ్ఞవల్క్య ధర్మశాస్త్రం పేర్కొన్నాయి. మను ధర్మశాస్త్ర వ్యాఖ్యానకర్త కుల్లూక భట్టుని ప్రకారం, కార్ష నాణెం బరువు పాలలో నాలుగో వంతు. పాల బరువు 320 రక్తికలు. అంటే కార్ష బరువు 80 రక్తికలకు సమానం.

కౌటిల్యుని అర్థశాస్త్రం కార్షాపణని ప్రామాణిక వెండినాణెంగా తీసుకొని, దాని ఉపభాగాలతో సహా నాలుగు రకాల వెండి నాణేలను పేర్కొంది. అవి 1. పణ, 2. అర్ధపణ(1/2), 3. 'పాద' (1/4), 4. 'అర్ధపాదిక' లేక 'అష్టభాగిక' (1/8).

ఇప్పటి వరకు దొరికిన మౌర్యుల కాలం నాటి వెండి నాణేలు కార్షాపణులు. వాటి బరువు ఒక్కొక్కటి 50 నుండి 52 గ్రెయిన్లు, అవి ముఖ్యంగా విద్ధంక నాణేలే(Punch-marked coins) అవి కాక, వెండి నాణేలను కత్తిరించిన ముక్కలు కూడ దొరికాయి. కార్షాపణ నాణేన్ని రెండు ముక్కలుగాను, నాలుగు ముక్కలుగాను చేసి వాటిని అర్ధపణలుగాను, పాద పణలుగాను వాడి వుండవచ్చు. ఇంకా 2 నుండి 3 గ్రెయిన్లు బరువుగల చిన్న వెండి నాణేలు కూడ దొరికాయి. అవి పణలో పదహారో వంతు విలువగల మాషక నాణేలు కావచ్చు.

13.8.3 రాగి నాణేలు

భారతదేశంలో మొదటిసారిగా మౌర్యుల కాలంలోనే రాగి నాణేలు వడుకలోకి వచ్చాయి. మౌర్యులు రాగి విద్ధంక నాణేలు, పోతపోసిన నాణేలను ముద్రించి వాడుకలోకి తెచ్చారు. అవి ఉత్తర భారతదేశమంతా క్రీ.పూ. 3వ శతాబ్దం నుండి క్రీ.శ. మూడవ శతాబ్దం వరకు వాడుకలో ఉండేవి. రాగి నాణేల్లో చాలా రకాలుండేవి.

మౌర్యుల కాలం నాటి రాగి నాణేల్లో, ప్రామాణిక నాణెం మాషక, దాని విలువ వెండి నాణెం కార్షాపణ లో పదహారో వంతు (1/16), మాషక నాణేలు రకాలు 1. చతుర్మాషక, 2. త్రిమాషక, 3. ద్విమాషక, 4. ఏకమాషక 5. అర్ధమాషక, 6. పాదమాషక.

BRAOU

మౌర్యుల కాలం నాటి రాగి నాణేల్లో దొరికినవి ఎక్కువగా పోతపోసిన నాణేలే. రాగి విద్ధంక నాణేలు కొన్ని మాత్రమే దొరికాయి. నాటి రాగి నాణేలు మగధ, అంగ, ఉజ్జయిని, విదిస, మేవార్ ప్రాంతాల్లో దొరికాయి.

13.8.4 నాణేలు తయారుచేయు పద్ధతులు

నాణేలు రెండు పద్ధతుల్లో తయారు చేసేవారు. అవి 1.'విద్ధంక నాణేలు(punch-marked coins) తయారు చేసే పద్ధతి, 2. పోతపోసిన నాణేలు (Dre struck coins) తయారు పద్ధతి.

1. విద్ధంక నాణేలు తయారుచేసే పద్ధతి: ఈ పద్ధతిలో లోహాన్ని కరిగించి సమతలమైన రేకులుగా తయారుచేసేవారు. ఆరేకులను వివిధ పరిమాణాల్లో కావలసిన బరువులకు సమానమైన ముక్కలుగా కత్తిరించేవారు. ఆ ముక్కల పై భాగాన (బొమ్మవైపు), క్రింది భాగాన (బొరుసు వైపు) చిహ్నాలను ముద్రించేవారు. ఈ చిహ్నాలు కేంద్ర ప్రభుత్వానికి చెందినవి. నాణేలపై ప్రభుత్వ చిహ్నాలను ముద్రించడం వల్ల, వాటిలో వాడిన లోహం, వాటి బరువు సరియైనదిగా అధికారికంగా గుర్తింపు పొంది, చెలామణిలోకి వచ్చేవి. విద్ధంక నాణేల్ని ముఖ్యంగా వెండితో తయారు చేసేవారు.

2. పోతపోసిన నాణేలు తయారుచేసే పద్ధతి : ఈ పద్ధతిలో లోహాన్ని కరిగించి, దాన్ని మట్టి మూసల్లోకి పోసేవారు. మట్టి మూస లోపలివైపు నాణేలపై ముద్రించవలసిన చిహ్నాలు అచ్చులో ఉండేవి. ఆ లోహం ఆరిపోయిన తర్వాత, ముద్రించిన నాణేలు తయారయ్యేవి. కొన్ని సందర్భాల్లో మట్టి మూసను కొన్ని భాగాలుగా విభజించి, వాటిలో కరిగించిన లోహం పోసి, ఒకే సమయంలో ఎక్కువ సంఖ్యలో నాణేలను తయారు చేసేవారు. పోతపోసిన నాణేలను ముఖ్యంగా రాగితో తయారు చేసేవారు.

13.9 కార్మికులు

మౌర్యుల కాలంలో కార్మికులు మూడు తరగతులుగా ఉండేవారు. వారు 1. కూలీ పనివారు, 2. వెట్టి పనివారు, 3. బానిస పనివారు. కార్మికులకు సంబంధించి ప్రభుత్వ విధానం సమగ్రంగాను, సమర్థవంతంగాను ఉండేది. చేతి పనివారల నైపుణ్యం దిగజార్చేవారిని ఆ నాణేలు ప్రభుత్వ ఆమోదంతో న్యాయ సమ్మతంగా వారి ఆదాయానికి, వారి కొనుగోళ్ళకు, వారి అమ్మకాలకు అడ్డంకులు కల్పించే వారిని శిక్షించేవారు. మొదట నిర్ణయించిన వేతనాలను విధిగా చెల్లించేవారు. ఒప్పందం ప్రకారం నిర్ణయింపబడిన వేతనాలు చెల్లించకపోతే, యజమానుల మీద పెద్ద మొత్తంలో జరిమానాలు వేసేవారు.

13.9.1 కూలీ పనివారు

మౌర్యుల కాలంలో శ్రేణి వ్యవస్థ బాగా అభివృద్ధి చెంది, ఉత్పత్తి మొత్తం దాని నియంత్రణలోకి వచ్చింది. ఆ దశలో యజమానులు, వారి కుటుంబ సభ్యులు తయారుచేసే ఉత్పత్తులు అప్పటి గిరాకీకి సరిపోలేదు. అందువల్ల, కూలి పనివారి అవసరం కలిగింది. దాని ఫలితంగా, వారిని వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో నియమించారు.

కూలి పనివారిని భూమి సాగుచేసేందుకు, పొలాల కాపలాకు, పంట కోతలకు, పరిశ్రమల్లోను, వ్యాపార నిర్వహణలోను, పశుపోషణకు నియమించేవారు. ధనికుల గృహాల్లో ఇంటి పనులు చేసేందుకు బానిసలతోటి కూలి పనివారిని కూడ ఉపయోగించేవారు. అంతేకాక, ఓడల్లో పనిచేసేందుకు కూడ వారిని నియమించేవారు.

యజమానుల వద్ద కూలి పనివారు జీతభత్యాల మీద పనిచేసేవారు. వారి జీతభత్యాలను గురించి కౌటిల్యుని అర్థశాస్త్రం సవివరంగా పేర్కొంది. వారి జీతాలు వారు చేసే పనిని బట్టి ఉండేవి. లేదా వారు చేసిన ఉత్పత్తిలో పదో వంతు (1/10) వారి జీతంగా ఉండేది. వ్యవసాయ కార్మికులకు, కాపలాదార్లకు నెలజీతంగా ఒకటింపాతిక పణ (1 1/4 Pana), భత్యాలుగా వంట సరుకులు ఇచ్చేవారని అర్థశాస్త్రం వల్ల తెలుస్తుంది.

కూలి పనివారు యజమానుల సొత్తుకాదు. వారు స్వతంత్రంగా జీవించేవారు. బానిసలతో పోల్చి చూస్తే, కూలి పనివారి జీవనపరిస్థితులు మెరుగ్గా ఉడేవి. కాని నాటి సాంఘిక వ్యవస్థలో వారి స్థానం అధోగతిలోనే ఉండేది. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో కూలి పనివారల జీవన పరిస్థితులు బాగుపర్చేందుకు అవసరమైన చర్యల గురించి ఎటువంటి సూచనలను చేయలేదు.

13.9.2 వెట్టి పనివారు

మౌర్యుల కాలంలో వెట్టి పనివారు ఉండేవారు. వెట్టి పని భారతదేశంలో ప్రాచీన కాలం నుండి 20వ శతాబ్దం వరకు కొనసాగింది. వెట్టి పనికి జీతభత్యాలు ఉండేవికావు. ప్రాచీన భారతదేశంలో రాజ్యాధినేతలు ప్రజలకు ఉపయోగపడే పనులు చేయించేందుకు వెట్టి పని పద్ధతి ఉపయోగించేవారు. మౌర్యుల కాలంలో వెట్టిపని కనీసావసరంగా ఉండేదని, గ్రామకరణాలు, నగరాధికారులు వెట్టి పనివారల పట్టికలు తయారుచేసి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని ప్రభుత్వం ఆజ్ఞలు జారీచేసిందని కౌటిల్యుడు అర్థశాస్త్రంలో పేర్కొన్నాడు.

చేలిపనివారు కట్టవలసిన పన్నులకు బదులుగా ప్రభుత్వానికి కొన్ని రోజులు వెట్టి పని చేసేవారని మెగస్తనీస్ పేర్కొన్నాడు. అలాంటి పద్ధతే వ్యవసాయంలో కూడ ఉండేదని అర్థశాస్త్రం వల్ల తెలుస్తుంది. అర్థశాస్త్రం వెట్టి పని పేర్కొని, దాన్ని నిరంకుశంగా అమలు చేయకూడదని హెచ్చరించింది. సామంతులు, క్రింది అధికారులు బలవంతంగా రైతులచేత వెట్టిపని చేయించకుండా, వారికి రక్షణ ఇవ్వవలసిన బాధ్యత రాజుకు ఉండేది.

తొలి కాలం నాటి శాసనాలు కూడ వెట్టి పనిని పేర్కొన్నాయి. పశ్చిమ క్షాత్రపుల కార్దమక వంశానికి చెందిన మొదటి రుద్రదామనుని జునాగఢ్ శాసనం ప్రజలకు కొత్త పన్నులు వెట్టిపనుల నుండి భారం కలుగకుండా ప్రభుత్వ ఖజానా నుండి డబ్బు ఖర్చుపెట్టి, సుదర్శన సరస్సు నిర్మించారని వర్ణించింది. దీన్నిబట్టి ప్రాచీన కాలంలో రాజులు ప్రజలచేత వెట్టిపని చేయించినా వారిలో విశాల హృదయులు, ప్రజాసంక్షేమం కోరే రాజులు కొందరు వెట్టిపని వల్ల ప్రజలపై భారం పడుతుందని భావించేవారని తెలుస్తుంది.

రాజు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ప్రజలచేత వెట్టి పని చేయించేవాడని శాసనాల వల్ల తెలుస్తుంది. ఈ విషయం విశాఖదత్తుని ముద్రారాక్షసం కూడ స్పష్టం పరుస్తుంది. చంద్రగుప్తుని పట్టాభిషేకం సందర్భంగా, రాజప్రాసాదం ముద్రాధారికి చారువర్మ అనే వ్రద్ధంగి వైభవోపేతమైన అలంకరణలు చేశాడు. చాణక్యుడు ఆజ్ఞాపించక పూర్వమే, చారువర్మ ఆపని చేశాడు. ఆపని నైపుణ్యాన్ని చూసి చాణక్యుడు చారువర్మను ప్రశంసించి, ముందుగా చెప్పకుండానే పని చేసినందుకు సంతృప్తి చెంది, దానికి బహుమానం అతనికి త్వరలోనే వస్తుందని అభయం ఇస్తాడు. ఇది ఒక ప్రత్యేకమైన వెట్టిపని.

BRAOU

13.9.3 బానిస పనివారు

ప్రాచీన కాలంలో భారతదేశంలో సాంఘిక ఆర్థిక జీవనంలో బానిసత్వం ఒక ముఖ్యమైన భాగంగా ఉండేది. అది ఆమోదం పొందిన శ్రామిక వ్యవస్థ కాబట్టి, దాన్ని ఎవ్వరూ ప్రశ్నించలేదు. ప్రాచీన కాలంలో ఏ ప్రభుత్వం కూడ దాన్ని నిర్మూలించే ప్రయత్నం చేయలేదు. ఏ మతం కాని దానికి చెందిన మతస్థులకు గల బానిసలను సొంతం చేసుకొనే హక్కును సవాలు చేయలేదు. చాలా శతాబ్దాల వరకు ప్రాచీన సాంఘిక వ్యవస్థ మీద బౌద్ధ, జైన మతాల మానవతావాద ప్రభావం ఉన్నా, ఆ మతాలు బానిసత్వ నిర్మూలనకు అనుకూలంగా ఒక్క మాట కూడ అనలేదు. బౌద్ధ మతాభిమాని, అహింసావాది అయిన అశోకుడు కూడ బానిసలను, కూలీ పనివారిని ప్రజలు దయార్ద్ర హృదయంతో ఆదరించాలని మాత్రమే కోరాడు. దీన్ని బట్టి ప్రాచీన కాలంలో శ్రామిక వ్యవస్థలో భాగంగా బానిసత్వం అందరి ఆమోదాన్ని పొందిందని తెలుస్తుంది.

మౌర్యుల కాలంలో ప్రజల ఆర్థిక జీవనంలోను, నాటి శ్రామిక రంగంలోను బానిసలు ముఖ్య పాత్ర నిర్వహించారు. ఆ కాలం నాటికి బానిసత్వం ఒక వ్యవస్థగా అభివృద్ధి చెందింది. తొలి కాలం నాటి యుద్ధ నియమాల ఫలితంగా బానిసత్వం వాడుకలోకి వచ్చింది. కాలక్రమేణా సాంఘిక సంస్థలు రూపు దిద్దుకొని పటిష్టంగా ఏర్పడిన ఫలితంగా బానిసత్వం వ్యవస్థీకృతమై, బానిసల రకాల సంఖ్య పెరిగింది. వ్యవసాయ పనులకు, ఇంటి పనులకు, వ్యక్తిగత సేవకు వారిని ఉపయోగించడం జరిగింది.

కౌటిల్యుని అర్థశాస్త్రం అయిదు రకాల బానిసలను పేర్కొంది. వారు 1. యుద్ధంలో బంధింపబడినవారు (ధ్వజాహృత), 2. తమకు తాముగా అమ్ముడు పోయినవారు (ఆత్మ విక్రయ), 3. దాసికి బానిస ద్వారా జన్మించినవారు (ఉదరదాస లేక గర్భదాస), 4. ఋణం కారణంగా లేదా తాకట్టు ఫలితంగా బానిసలైన వార (ఆహితక), 5. జరిమానా కారణంగా లేదా న్యాయస్థానం తీర్పు ఫలితంగా బానిసలైన వారు (దండప్రణీత).

మను ధర్మశాస్త్రంలో ఏడు రకాల బానిసలను (దాసులు) గూర్చి పేర్కొనబడ్డారు. వారు 1. యుద్ధంలో బంధింపబడినవారు, 2. ఆహారం కొరకు బానిసలైనవారు, 3. బానిస స్త్రీకి జన్మించినవారు, 4. బానిసలుగా కొనబడినవారు, 5. తల్లిదండ్రులచేగాని, బంధువులచే గాని బానిసలుగ ఇవ్వబడినవారు, 6. వారసత్వంగా పొందిన బానిసలు, 7. జరిమానా వల్లగాని, న్యాయస్థానం తీర్పు వల్ల గాని బానిసలైన వారు.

బౌద్ధ గ్రంధాలు మూడు రకాల బానిసల్ని పేర్కొన్నాయి. వారు 1. తండ్రి నుండి వారసత్వంగా పొందిన బానిసలు, 2. కొనబడినవారు లేదా బహుమానంగా ఇవ్వబడినవారు, 3. బానిసలుగా జన్మించినవారు. శిక్ష ఫలితంగా బానిసలైన వారిని (దండదాస) కూడ జాతక కథలు పేర్కొన్నాయి.

బానిసలు సర్వసాధారణంగా ఇంటిపనులను చేసేవారు. బానిసల్ని వారి యజమానులు వ్యక్తిగత సేవకులుగా కూడ వినియోగించేవారు. కొందరు బానిసలు వ్యవసాయ కార్మికులుగా పని చేసేవారు. మరికొందరు చేతిపనివారుగా ఉండేవారు. కొన్ని సందర్భాల్లో ఎక్కువ మంది బానిసలు గల యజమానులు వారిలో కొందరిని ఇతర పనులకు కిరాయి మీద పంపేవారు.

కౌటిల్యుని అర్థశాస్త్రం మరొక తరగతికి చెందిన బానిసల్ని కూడ పేర్కొంది. సాధారణ పరిస్థితుల్లో ఆర్యుడ్ని బానిసగా చేయరాదు. కాని దురదృష్టం సంభవించినప్పుడు, కుటుంబానికి కష్టాలు వచ్చినప్పుడు, లేదా ఎక్కువ

BRAOU

డబ్బు సంపాదించాల్సిన అవసరం కలిగినప్పుడు ఆర్యుడు తాత్కాలికంగా బానిసగా పనిచేయవచ్చు. ఒప్పందం ప్రకారం బానిసగా పని చేసిన కాలం పూర్తైన తర్వాత అతడు తిరిగి స్వతంత్రుడై సాధారణ జీవితం గడపవచ్చు.

గ్రీక్ రాయబారి మెగస్తనీస్ తన గ్రంథం ఇండికలో భారతదేశంలో బానిసలు లేరని పేర్కొన్నాడు. ఈ కథనం వల్ల మౌర్యుల కాలంలో బానిస వ్యవస్థ ఉండేదా లేదా అనే విషయం మీద చరిత్రకారుల్లో చాలా కాలం చర్చ జరిగింది. ఎందువల్లంటే స్వదేశీ ఆధారాల మూలంగా ఆ కాలంలో బానిసలు ఉండేవారని తెలుస్తుంది. అంతేకాక నాటి శ్రామిక వర్గంలో బానిసలు, కూలీ పనివారు ముఖ్య భాగాలుగా ఉండేవారు. బహుశా మెగస్తనీస్ గ్రీక్ సాంఘిక వ్యవస్థలోని బానిసత్వాన్ని దృష్టిలో ఉంచుకొని, దానికి భిన్నంగా ఉండిన భారతీయ వ్యవస్థను గుర్తించలేక పోయి ఉండవచ్చు. మౌర్యుల కాలం నాటి బానిస వ్యవస్థ అర్థశాస్త్రంలో కౌటిల్యుడు వర్ణించినట్లుగా ఉండి ఉంటే, మెగస్తనీస్ చెప్పింది నిజమే. ఎందువల్లంటే, భారతీయ దాసుడు (బానిస) గ్రీక్ డౌలోస్ ఒక్కరు కాదు. భారతదేశంలోని దాసునికి సొంత ఆస్తి కలిగివుండే హక్కు, సొంతంగా సంపాదించుకొనే అవకాశం ఉండేవి. కాని గ్రీస్ దేశంలోని డౌలాస్‌కు ఆ అవకాశం ఉండేది కాదు.

13.10 దుర్భిక్షాలు - ప్రభుత్వ విధానం

మౌర్యుల కాలంలో కరువు కాటకాలు సంభవించాయి. జైన మత గ్రంథాల వల్ల, చంద్రగుప్త మౌర్యుని పాలనా కాలంలో కరువు వచ్చిందని తెలుస్తుంది. మౌర్యుల కాలంనాటి సాగర, మహాస్థన్ శాసనాలు గంగానదీలోయ ప్రాంతాల్లో కరువు పరిస్థితులు ఉన్నప్పుడు, వాటిని మెరుగు పర్చేందుకు చేపట్టిన చర్యలను పేర్కొన్నాయి. ఈ ఆధారాలను బట్టి మౌర్యుల పాలనలో దుర్భిక్షాలు సంభవించాయని కరువు పరిస్థితులు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం సత్వర చర్యలను చేపట్టిందని తెలుస్తుంది.

కరువు పరిస్థితులు సంభవించినప్పుడు ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఈ క్రింది పేర్కొన్న చర్యలను చేపట్టేదని కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల తెలుస్తుంది.

1. రైతులకు విత్తనాలు, వంట సరుకులు ఇవ్వడం
2. ప్రజలు మరొక ప్రాంతానికి వలస వెళ్ళేందుకు ప్రోత్సహించడం
3. వ్యవసాయ పథకాలు చేపట్టడం
4. ప్రజలకు హాని జరుగకుండా రక్షణ కల్పించడం
5. నిలకడ లేని ఆధారాల మూలంగా ఉండే నీటి సరఫరా పథకాల కంటే, పారే నీటికి ఆనకట్టలు కట్టి, నీటి సరఫరా జరిపే పథకాలకు ప్రాముఖ్యాన్ని ఇవ్వడం
6. బంజరు భూములకు నీటి సదుపాయం కలుగజేసేందుకు చెరువులను నిర్మించడం
7. నీటి సదుపాయం కొరకు బావులను త్రవ్వించడం
8. ఆశ్రయం కొరకు ఇళ్ళు నిర్మించడం
9. పూల తోటలు, పండ్ల తోటలు పెంచడం

BRAOU

10. చెరువులకు మరమ్మతులు చేసి, బాగుచేసేందుకు కావలసిన సామగ్రి ప్రైవేట్ వ్యక్తులకు సరఫరా చేయడం

11. ప్రైవేట్ వ్యక్తుల దానధర్మాలతో, రిజర్వాయర్లు నిర్మించడానికి ప్రోత్సాహం ఇవ్వడం

12. ప్రభుత్వ నీటి పారుదల విధానానికి తోడ్పడే వారికి పన్నుల నుండి మినహాయింపు ఇవ్వడం

13. కరువు నివారణ పథకాలు చేపట్టడం

14. దుర్భిక్షం పాలైన రైతులకు వస్తురూపంలో సబ్సిడీలు, రుణాలు ఇవ్వడం

15. ఉచిత సహాయం చేయడం

16. బీదలు, దరిద్రుల పరిస్థితులు మెరుగుపర్చేందుకు దేశసంపదను మళ్ళించి ఉపయోగించడం.

మౌర్యుల కాలంలో భారతదేశంలోని ప్రజల జీవనానికి సమృద్ధిగా ఫలరులున్నందు వల్ల వారు ఉన్నత స్థాయిలోను, సగర్వంగాను ఉండేవారని మెగస్తనీస్ పేర్కొన్నాడు. అంతేకాక, మెగస్తనీస్ భారతదేశంలో కరువు కాటకాలు లేవని పేర్కొన్నాడు. కాని ఈ కథనం వాస్తవం కాదు. ఎందువల్లంటే, స్వదేశీ ఆధారాల మూలంగా మౌర్యుల పాలనా కాలంలో కరువులు సంభవించాయని, వాటి నివారణకు ప్రజల పరిస్థితులు మెరుగుపర్చేందుకు నాటి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టిందని స్పష్టంగా తెలుస్తుంది. బహుశా మెగస్తనీస్ భారతదేశం వదిలి వెళ్ళిన తర్వాత మౌర్యుల కాలంలో కరువు కాటకాలు సంభవించి ఉండవచ్చు.

13.11 సంగ్రహంగా

1. మౌర్యుల పాలనా కాలంలో భారతదేశంలోని ప్రజల ఆర్థిక జీవనం మీద ప్రభుత్వ నియంత్రణ ఉండేది. ఆర్థిక కార్యక్రమాలు క్రమబద్ధం చేసేందుకు ప్రభుత్వం పర్యవేక్షకాధికారులను నియమించింది.

2. వ్యవసాయ భూములు రాజ భూమిస్వంలోను, రైతుల ఆధీనంలోను కూడ ఉండేవి. ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాలు ఉండేవి. అనేక రకాల పంటలు, కాయగూరలు, పండ్లు పండించేవారు. వ్యవసాయ భూములకు నీటిపారుదల విషయంలో ప్రభుత్వమే బాధ్యత వహించేది. గ్రామీణ ప్రాంతాల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడేది.

3. ప్రభుత్వం ప్రజల మీద అనేకరాల పన్నులు వేసేది. అవి వ్యవసాయ పన్నులు, వాణిజ్య పన్నులు మొదలైనవి. పన్నుల ద్వారా వసూలైన డబ్బుతో ప్రభుత్వ ఖజానా నిండుగా ఉండేది. కాని చివరి దశలో ఆర్థిక సంక్షోభం ఏర్పడి, ప్రభుత్వ ఖజానా ఖాళీ అయింది.

4. వృత్తిపనివారందరూ శ్రేణులు ఏర్పాటు చేసుకొనేవారు. శ్రేణులు భారీసంస్థలుగా అభివృద్ధిచెంది, నాటి ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ స్థానం పొందాయి.

5. ద్రవ్య వ్యవస్థ పటిష్టంగా రూపుదిద్దుకొంది. నాడు బంగారు నాణేలు ఉండేవి. కాని వెండి నాణేలు ఎక్కువగా వాడుకలో ఉండేవి. రాగి నాణేలను మొదటిసారిగా ముద్రించి, వాడుకలోకి తెచ్చారు.

6. కార్మికులు మూడు తరగతులుగా ఉండేవారు. వారు 1. కూలీ పనివారు, 2. వెట్టి పనివారు, 3. బానిస పనివారు. కార్మికులకు సంబంధించి ప్రభుత్వ విధానం సమర్థవంతంగా ఉండేది.

7. ఆ కాలంలో కరువు కాటకాలు సంభవించాయి. కరువు సమయాల్లో ప్రజల పరిస్థితులను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం సత్వర చర్యలను చేపట్టింది. కరువు నివారణ పథకాలను అమలుపర్చింది.

BRAOU

13.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. మౌర్యుల కాలంనాటి ఆర్థిక పరిస్థితులను వివరించండి.
2. మౌర్యుల పాలనలో జరిగిన వ్యవసాయాభివృద్ధిని వర్ణించండి.
3. మౌర్యుల ఆర్థిక విధానాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి.
4. మౌర్యుల కాలంనాటి ద్రవ్య వ్యవస్థ ఎట్టిదో అంచనా వేయండి.
5. మౌర్యుల పాలనలో కార్మికుల పరిస్థితులను సమీక్షించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలు రాయండి.

1. మౌర్యుల కాలంనాటి భూమి యాజమాన్య విధానాన్ని పరిశీలించండి.
2. మౌర్యుల పాలనలో ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాల పాత్రను అంచనా వేయండి.
3. మౌర్యుల కాలంనాటి శ్రేణుల వ్యవస్థను వర్ణించండి.
4. మౌర్యుల పాలనలో రుణపరపతి విధానాన్ని పరిశీలించండి.
5. కరువు కాటకాలు సంభవించినప్పుడు మౌర్యులు అనుసరించిన ప్రభుత్వ విధానం ఎట్టిదో వివరించండి.

BRAOU

13.13 ఉపయుక్త గ్రంథాలు

Bandopadhyaya, N	-	**Economic Life and Progress in Ancient India.**
-Do-	-	**Kautilya**
Bhandarkar, D.R	-	**Asoka**
Buch, M.A	-	**Economic Life in Ancient India**
Das, S.K	-	**Economic History of Ancient India**
Dikshitar, V.R.R	-	**Mauryan Polity**
Gopal, M.H.	-	**Mauryan Public Finance**
Ghoshal, U.N	-	**The Agrarian System in Ancient India**
-do-	-	**Contributions to the History of Hindu Revenue System**
Majumdar, R.C.	-	**Corporate Life in Ancient India**
Mookerji, R.K.	-	**Chandragupta Maurya and His Times**
-do-	-	**Asoka**
Nigam, Shyam Sundar	-	**Economic Organisation in Ancient India**
Nilakanta Sastri, K.A.	-	**Age of Nandas and Mauryas**
Nath, Pran	-	**A Study in the Economic Condition of Ancient India**
Rai, G.K.	-	**Forced Labour in Ancient and Early Medieval India**
-do-	-	**Ancient Indian Economic Institution**
Roychoudhury	-	**Social, Cultural and Economic History of India (Ancient)**
Smith, V.A.	-	**Asoka**
Thapar, Romila	-	**Asoka and the Decline of the Mauryas**
Tripathi, O.N.	-	**Taxation and Fiscal Administration in Ancient India**

రచయిత - ఆచార్య బి. వసంతవయ్య.

BRAOU

భాగం-14 శాతవాహనుల కాలం నాటి ఆర్థిక పరిస్థితులు

విషయక్రమం

14.0 లక్ష్యాలు

14.1 పరిచయం

14.2 శాతవాహనుల పాలన

14.3 వ్యవసాయం

14.3.1 భూములు

14.3.2 భూస్వామ్య వ్యవస్థ

14.3.3 భూ స్వాధీనం

14.4 రెవిన్యూ విధానం

14.5 శ్రేణులు

14.6 బ్యాంకులు-రుణపరపతి విధానం

14.7 బానిసలు

14.8 ద్రవ్య వ్యవస్థ

14.8.1 శాతవాహనుల నాణేలు

14.8.2 రోమ్ నాణేలు

14.9 కుషాణుల పాలన

14.10 వ్యవసాయం

14.10.1 భూస్వామ్య వ్యవస్థ

14.10.2 భూమికొలు విధానం

14.10.3 వ్యవసాయ పద్ధతులు

14.10.4 వ్యవసాయ కార్మికులు

14.10.5 పశు పోషణ

14.11 నీటి పారుదల

14.12 ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ

14.12.1 రెవిన్యూ విధానం

14.12.2 ప్రభుత్వం-ఆదాయ వనరులు

14.12.3 ప్రభుత్వం-వ్యయం

14.13 ఆర్థిక వనరుల సమీకరణం-వినియోగం

14.14 శ్రేణులు

14.15 రుణ పరపతి విధానం

14.16 కార్మికులు

14.17 కరువు కాటకాలు-ప్రభుత్వ విధానం

BRAOU

14.18 తూనికలు, కొలతలు
14.19 ద్రవ్యవ్యవస్థ
14.19.1 ద్రవ్యహారకం
14.19.2 వస్తుహారక పద్ధతి
14.19.3 నాణేలు
14.19.3.1 ఇండో-గ్రీక్ నాణేలు
14.19.3.2 శకుల నాణేలు
14.19.3.3 పహ్లవుల నాణేలు
14.19.3.4 కుషాణుల నాణేలు
14.20.14 సంగ్రహంగా
14.21.14 పరీక్షనమూనా ప్రశ్నలు
14.22.14 ఉపయుక్త గ్రంథాలు

14.0 లక్ష్యాలు

ఈభాగాన్ని చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

★ దక్షిణ భారతదేశంలో శాతవాహనుల కాలంనాటి ఆర్థిక పరిస్థితులు, వ్యవసాయం, రెవిన్యూ విధానం, శ్రేణులు, బ్యాంకులు, రుణపరపతి విధానం, ద్రవ్య వ్యవస్థ.

★ ఉత్తర భారతదేశంలో కుషాణుల పాలనలో ఆర్థిక పరిస్థితులు, వ్యవసాయం, నీటిపారుదల విధానం

★ ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక వనరుల సమీకరణ, వినియోగం, శ్రేణులు, రుణ పరపతి విధానం, తూనికలు, కొలతలు, ద్రవ్య వ్యవస్థ.

14.1 పరిచయం

దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో, శాతవాహన వంశ రాజుల పాలన ఉండేది. వారు ఉత్తర భారతదేశంలో గంగానది వరకు దండయాత్రలను చేశారు. వారి పాలనలో ప్రజలు సుఖ జీవనం గడిపేవారు. నాడు భారతదేశానికి విదేశాలతో వాణిజ్య సంబంధాలుండేవి. ఉత్తర భారతదేశంలో అధిక భాగం విదేశాల నుండి వచ్చి, మనదేశంలో కొన్ని ప్రాంతాలు జయించిన కుషాణుల పాలనలో ఉండేది. కుషాణులు విదేశాల నుండి వచ్చినా, కాలక్రమేణా భారతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవనంలో కలసిపోయారు. కుషాణుల పాలనలో, పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ ఉండేది. నాటి ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండేవి.

BRAOU

14.2 శాతవాహనుల పాలన

దక్షిణ భారతదేశ ప్రాంతాన్ని పరిపాలించిన శాతవాహనులు సుభిక్ష పాలన నందించారు. వ్యవసాయం ప్రధానంగా గల వ్యవస్థలో రాజు గుత్తాధిపత్యం ఉండేది. రాజులు ధర్మశాస్త్ర కర్తలు సూచించిన సూత్రాలనుసరించి, సరళమైన పన్నులు విధించేవారు. ప్రభుత్వాదాయం ప్రధానంగా భూమి శిస్తు ద్వారా వచ్చేది. శాతవాహనుల కాలంలో వర్తకవు శ్రేణుల ప్రభావం ఎక్కువగా ఉండేది.

14.3 వ్యవసాయం

శాతవాహనుల కాలంలో వ్యవసాయం ప్రజల ప్రధాన వృత్తిగా ఉండేది. శాసనాల్లో ఆవులు, భూములు, గ్రామాలు దానంగా ఇచ్చేవారని పేర్కొనడాన్నిబట్టి, నాటి దైనందిక ప్రజా జీవనంలో వాటికుండిన ప్రాముఖ్యత స్పష్టమౌతుంది. రాజుకు సొంత భూములుండేవి. ప్రభుత్వం రైతుల నుండి వ్యవసాయం ఉత్పత్తిలో ఆరోవంతు (1/6) ప్రభుత్వ భాగంగా వసూలు చేసేది. శాసనాల వల్ల భూమిపై గుత్తాధిపత్యం ప్రభుత్వానికి ఉండేదని తెలుస్తుంది.

భూములు సాగుచేసే వ్యవసాయం చేసేందుకు, బరువైన నాగలి, ఇనుప పరికరాలను వాడే పద్ధతులు ఉత్తర భారతదేశం నుండి దక్షిణాదికి వచ్చాయి. ఉత్తర భారతదేశంలో నదీ పరీవాహక ప్రాంతాల్లో సారవంతమైన భూములుండి, ప్రజలు ఆ ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొనేందుకు అనుకూలంగా ఉండేది. కానిదక్కన్‌లోను, దక్షిణాదిన సారవంతమైన నల్లరేగడి భూములు కొద్ది ప్రాంతాల్లో మాత్రమే ఉండినందువల్ల, అన్ని ప్రాంతాల్లోను ప్రజలు స్థిర నివాసం ఏర్పరుచుకొనేందుకు అనుకూలంగా ఉండేది కాదు.

14.3.1 భూములు

శాతవాహనుల కాలంలో భూములు వ్యవసాయదారుల ఆధీనంలో ఉండేవి. రాజుకు సొంత భూములుండేవి. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో దొరికిన శాతవాహనుల కాలంనాటి శాసనాల వల్ల మత సంస్థలకు, వ్యవసాయానికి, వెల్లు పెంచేందుకు గ్రామాలు, భూములు దానంగా ఇచ్చేవారని తెలుస్తుంది. రాజు గ్రామాలు గాని, భూములను గాని దానంగా ఇచ్చేందుకు రైతుల యాజమాన్యంలోని భూములు ఆక్రమించకుండా, వాటిని రైతుల నుండి ఖరీదుకు కొని మాత్రమే దానంగా ఇచ్చేవాడు.

కొన్ని సందర్భాల్లో భూమి ఒకరికంటే ఎక్కువ మంది యాజమాన్యంలో ఉండేది. అటువంటి సందర్భాల్లో ఒక్కొక్కరి భాగాన్ని ద్రవ్య రూపంలో నిర్ణయించేవారు. కన్హేరి శాసనం 'అర్ధపణ' భూమి యాజమాన్యాన్ని పేర్కొంది. ప్రభుత్వం భూములపై అనేక రకాల పన్నులను వేసేది.

14.3.2 భూస్వామ్య వ్యవస్థ

మౌర్యుల కాలంలో ఉన్నట్లుగా ఆ తర్వాత కాలంలో భూస్వామ్య వ్యవస్థ మీద, వ్యవసాయం మీద ప్రభుత్వ నియంత్రణ ఉండేది కాదు. శాతవాహనుల కాలంలో రైతులకు భూముల మీద వ్యక్తిగత యాజమాన్య హక్కు ఉండి, వాటి సాగుఫలాన్ని అనుభవించేవారు.

BRAOU

కన్హేరి శాసనాల వల్ల బౌద్ధ సన్యాసులకు వర్తకులు, సామాన్య ప్రజలు భూములు స్వతంత్రంగా దానం ఇచ్చేవారని తెలుస్తుంది. దీన్ని బట్టి శాతవాహనుల పాలనలో రైతులకు భూముల మీద వ్యక్తిగత యాజమాన్యం ఉండేదని స్పష్టమౌతుంది.

ముగుదాసుడు అనే వ్యక్తి భూమి దానం ఇచ్చినట్లుగా ఒక నాసిక్ శాసనం పేర్కొంది. 'ఉషవదీత్తుడు' (ఋషభదత్తుడు) ఒక బ్రాహ్మణుని నుండి భూమి కొని, దాన్ని తిరిగి దానం ఇచ్చినట్లుగా మరొక నాసిక్ శాసనం పేర్కొంది. ప్రైవేట్ భూముల బదలాయింపు గురించి, ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోని కొద్ది నిస్తీర్ణంగల వ్యవసాయ భూముల దానం గురించి 'జున్నార్' శాసనాలు పేర్కొన్నాయి.

రాజుకు తన రాజ్యంలోని మొత్తం భూమి మీద హక్కు ఉండేది. శాతవాహన రాజులు తమకు గల భూమి యాజమాన్యపు హక్కులను వినియోగించేవారని, వారు బ్రాహ్మణ మత గురువులకు, బౌద్ధ సన్యాసులకు చేసిన భూముల దానాల వల్ల తెలుస్తుంది. ఇటువంటి భూదానాలను 'నానాఘాట్' శాసనాలు, గౌతమీ పుత్ర శాతకర్ణి కాలంనాటి 'నాసిక్'-శాసనం, వాసిష్ఠీపుత్ర పులుమావికి చెందిన 'నాసిక్', 'కార్లె' శాసనాలు పేర్కొన్నాయి. రాజు ప్రజలకు ఇచ్చిన రక్షణ కు బదులుగా, ప్రజలునుండి పన్నులను వసూలు చేసేవారని వసిష్ఠ, మను ధర్మశాస్త్రాల వల్ల తెలుస్తుంది.

14.3.3 భూ స్వాధీనం

శాతవాహనులు హిందూ మత పక్షపాతంగల వారైనాకూడా, భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా బౌద్ధ సన్యాసులకు భూములు దానంగా ఇచ్చారు. గౌతమీపుత్ర శాతకర్ణి బౌద్ధ సన్యాసులకు భూములు దానంగా ఇవ్వడమేగాక, ఆ భూములు మీద పరిపాలన, ఆర్థిక సంబంధమైన హక్కులు కూడా వారికి ఇచ్చాడని నాసిక్ శాసనం వల్ల తెలుస్తుంది.

14.4 రెవిన్యూ విధానం

శాతవాహనుల పాలనలో ప్రభుత్వం ప్రజల మీద వారు భరింపరాని, అన్యాయమైన పన్నులు వేసేది కాదు. శాతవాహన రాజులు రెవిన్యూ విధానంలో ధర్మశాస్త్రకర్తలు వారి గ్రంథాల్లో సూచించిన పన్నులకు సంబంధించిన సూత్రాలనే అనుసరించేవారు. రైతులపై వారు పండించిన పంటలో ఆరోవంతు (1/6) భూమి పన్నుగా వేసేవారు. గౌతమీపుత్ర శాతకర్ణి ధర్మాన్ని, న్యాయాన్ని అనుసరించే పన్నులు విధించేవాడని నాసిక్ శాసనం వల్ల తెసుస్తుంది.

ప్రభుత్వానికి ఆదాయం ప్రధానంగా భూమి శిస్తు ద్వారా వచ్చేది. అంతేకాక ఉప్పు తయారీపై ప్రభుత్వానికి గల గుత్తాధిపత్యం, ఇతర సాధారణ, అసాధారణ పన్నులు, జరిమానాల ద్వారాకూడ, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది.

మౌర్యుల కాలంనాటి రెవిన్యూ విధానంతో పోల్చినట్లైయితే, శాతవాహనుల కాలంలో ప్రజలమీద ప్రభుత్వం వేసే పన్నులు స్వల్పంగాను, సరళంగాను ఉండేవి. కాని శాతవాహనుల పాలనలో రాజులు దానధర్మాలకుగాను, మత సంస్థలకు, యజ్ఞయాగాదులకు విరివిగా ఖర్చుపెట్టినట్లు నాటి శాసనాలవల్ల తెలుస్తుంది. దాని ఫలితంగా ఖజానాపై అధిక భారం పడి, ప్రభుత్వం ఇతర మార్గాల ద్వారా ఆదాయం రాబట్టుకొనే ప్రయత్నాలు చేయవలసి వచ్చింది.

14.5 శ్రేణులు

శాతవాహనుల కాలంలో శ్రేణులు ఉండేవి. అవి సామూహిక సంస్థలు. దేశంలో వాటి ప్రభావం ఎక్కువగా ఉండేది. రకరకాల చేతివృత్తులవారు, వ్యాపారస్తులు శ్రేణులను ఏర్పాటు చేసుకొనేవారు. శ్రేణులు వారి ప్రయోజనాలను పలురకాలుగా సంరక్షించేవి.

'జున్నార్' శాసనాలు 'ధమ్మిక' శ్రేణి, 'కాసాకార' శ్రేణి, 'తెసకార' శ్రేణులను పేర్కొన్నాయి. గోవర్ధనలో 'కొలీకనికాయ' శ్రేణులుండేవి. నాసిక్ శాసనాలు 'కులరిక' శ్రేణి, 'లిపిషక' శ్రేణి 'ఒదయంత్రిక' శ్రేణి మొదలగు శ్రేణుల్ని పేర్కొన్నాయి.

ప్రతి శ్రేణికి అధ్యక్షుడుగా శ్రేష్ఠి ఉండేవాడు. శ్రేణుల కార్యాలయాలు పురమందిరంలో గాని లేదా నిగమ సభలోగాని ఉండేవి. ఉషవదత్తుడు శ్రేణుల్లో పెట్టిన పెట్టుబడులు 'నిగమ సభలో' రిజిస్టర్ చేశారు.

మత సంస్థలకు ఇవ్వబడిన శాశ్వత దానాలు భూముల్లోగాని లేదా శ్రేణుల్లోగాని పెట్టుబడి పెట్టేవారు. ఉషవదత్తుడు ఇచ్చిన మత సంబంధమైన దానాలను శ్రేణుల్లో పెట్టుబడిగా ఉంచాడు. దీనివల్ల ప్రభుత్వ సంస్థల్లాగే , శ్రేణులు కూడా సుస్థిరమైన సంస్థలుగా ఉండేవని తెలుస్తుంది.

చేతివృత్తులవారు శ్రేణులను ఏర్పాటు చేసుకొనేవారు. క్రీ.శ.2వ శతాబ్దానికి చెందిన శాసనాలు మహారాష్ట్రలోని కుమ్మరులు, నూనెగానుగ పనివారు, నేత పనివారు ఏర్పాటు చేసుకొన్న శ్రేణులను పేర్కొన్నాయి. శాసనాలు పేర్కొన్న చేతివృత్తులవారిలో ఎక్కువమంది మథుర, పశ్చిమ దక్కన్ ప్రాంతాలకు చెందినవారు. ఆ ప్రాంతాలు పశ్చిమ తీరంలోని రేవులకు వెళ్ళే వ్యాపార మార్గాల్లో ఉండేవి.

శ్రేణులు, కొత్త నివాస స్థావరాలు త్వరితంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన పెట్టుబడి, మూలధనం వ్యాపారుల నుండి, సంఘారామాల నుండి లభించేవి. శాతవాహనుల కాలంలో దక్కన్ ప్రాంతంలోని చిన్న చిన్న పట్టణాల్లో చేతివృత్తులవారల శ్రేణుల ద్వారా వ్యాపార వస్తువులు తయారు కాబడి, ఒక రకమైన పౌర సంస్కృతి ఏర్పడింది.

శ్రేణులు, బ్యాంకుల కార్యకలాపాలను కూడా నిర్వహించేవి. అవి డిపాజిట్లు తీసుకొనేవి. అప్పులు ఇచ్చేవి. జున్నార్ శాసనం వల్ల, బౌద్ధ మతానికి చెందిన ఒక వ్యక్తి రెండు వ్యవసాయ క్షేత్రాల నుండి వచ్చిన ఆదాయాన్ని 'కొనచిక' అనే పట్టణంలో ఉండిన శ్రేణిలో డిపాజిట్ చేసి, దానిపై వడ్డీద్వారా వచ్చే ఆదాయాన్ని చెట్లు నాటేందుకు నిర్దేశించాడని తెలుస్తుంది.

ఒక సంస్థపేరు మీద దానం చేసేదానికి కూడా శ్రేణులకు హక్కు ఉండేది. 'జున్నార్' శాసనం వల్ల ధాన్యం వ్యాపారుల శ్రేణి ఏడు గదులు కలిగిన గుహను, జలాశయాన్ని దానంగా ఇచ్చిందని తెలుస్తుంది.

శ్రేణులు చాలాకాలంనుండి స్థిరపడి ఉన్నాయి. వాటి కార్యకలాపాల్లో నిజాయితీ, నిష్పక్షపాతం ఉండేవి. 'అలాకానట్లైతే, ప్రజలు వారుచేసిన శాశ్వత దానాలను శ్రేణుల్లో ఉంచేవారు కాదు' అని ఆర్.సి. మజుందార్ అభిప్రాయ పడ్డాడు. శ్రేణుల్లో ఉంచబడిన డిపాజిట్లు వ్యాపారస్తులకు పెట్టుబడులుగా ఉపయోగపడి, వారి వ్యాపార కార్యకలాపాలకు ప్రోత్సాహకరంగా ఉండేవి.

BRAOU

14.6 బ్యాంకులు - రుణ పరపతి విధానం

శ్రేణులు బ్యాంకుల్లాగా కార్యకలాపాలు నిర్వహించేవి. డబ్బు లావాదేవీలు చూసేవి. ప్రజలకు బ్యాంకు సౌకర్యాలు కలుగజేసేవి. ధన రూపంలో డిపాజిట్లను స్వీకరించేవి. దానంగా ఇచ్చిన ఆస్తిని కూడా స్వీకరించేవి. వాటిపైవచ్చిన ఆదాయాన్ని నిర్దేశించిన ప్రత్యేక ప్రయోజనాల మీద ఖర్చు పట్టేవి.

శాతవాహనుల కాలంలో వడ్డీమీద అప్పులు ఇచ్చే పద్ధతి ఉండేది. కాని స్వల్ప వడ్డీ మాత్రమే వసూలు చేసేవారు. అప్పుల మీద వడ్డీరేటు సాధారణంగా సంవత్సరానికి 12 శాతం ఉండేది. వడ్డీరేటు నెలసరి పద్ధతి మీద నిర్ణయించేవారు. ఆనాటి ప్రజలు, సంస్థలు, బ్యాంకులు ఈ నిధానాన్ని అనుసరించేవారని పశ్చిమ దక్కన్‌లోని దొరికిన శాసనాలు ధృవపరుస్తున్నాయి.

ఉషవదత్తుని నాసిక్ శాసనం గోవర్ధనలోని చేనేతపనివారి శ్రేణి రెండు డిపాజిట్లు స్వీకరించినట్లుగా పేర్కొంది. అందులో మొదటిదినెలకు ఒక శాతం వడ్డీరేటు మీద 2,000 కార్షాపణలు, రెండవది నెలకు 3/4 శాతం వడ్డీరేటు మీద 1,000 కర్షాపణలు. మొదటి డిపాజిట్ మీద వచ్చే వడ్డీ మొత్తాన్ని నాసిక్‌లోని గుహలో వర్షాకాలం నివాసం ఏర్పాటు చేసుకొన్న బౌద్ధ సన్యాసులకు ప్రతి ఒక్కరికి సంవత్సరానికి వస్త్రాలు ఖరీదు చేసేందుకు గాను 12 కార్షాపణలుగా ఖర్చుపట్టేదానికి నిర్దేశింపబడింది. రెండవ డిపాజిట్ మీద వచ్చే వడ్డీమొత్తాన్ని ఆ బౌద్ధ సన్యాసులకు ఇతర అవసరాల నిమిత్తం ఖర్చుపట్టేందుకు ఇవ్వబడింది.

చేనేత పనివారి శ్రేణికి 1,000 కార్షాపణలు, వడ్రంగి పనివారి శ్రేణికి 2,000 కార్షాపణలు, నూనెగానుగ పనివారి శ్రేణికి 500 కార్షాపణలు యజ్ఞ శ్రీ శాతకర్ణి డిపాజిట్ చేసినట్లుగా శాసనాల వల్ల తెలుస్తుంది.

14.7 బానిసలు

శాతవాహనుల కాలంలో బానిస వ్యవస్థ ఉండేది. పాలకులు, ధనవంతులు మొదలగు వారి ఇళ్ళలోను, కర్మాగారాల్లోను, వ్యవసాయపనుల్లోను, వ్యాపారస్తుల వద్ద బానిసలు పనిచేసేవారు.

గుణాఢ్యుని 'బృహత్కథా మంజరి' లో అనేక సందర్భాల్లో బానిస వ్యాపారం గురించి, దాసులను గురించిన ప్రస్తావనలు ఉన్నాయి. విదేశాలతో నౌకా వ్యాపారం చేసే వర్తకుల దగ్గర విశేషంగా బానిసలు ఉండేవారనీ, వర్తకులు వారిని అతినీచంగా చూస్తుండేవారని గుణాఢ్యుని రచనల ద్వారా స్పష్టమౌతుంది

14.8 ద్రవ్య వ్యవస్థ

శాతవాహనులు ద్రవ్యముద్రకం కోసం సీసం రాణి నాణాలను అధికంగాను, రాగి, తగర లోహాలను స్వల్పంగాను ముద్రించారు.

BRAOU

14.8.1 శాతవాహనుల నాణేలు

శాతవాహనుల కాలంలో సీసం, రాగి నాణేలను అధిక సంఖ్యలో ముద్రించారు. తొలి, తగరం లోహాల మిశ్రమంతో పోటిన్ నాణేలు స్వల్ప సంఖ్యలో ముద్రించారు. గౌతమీ పుత్ర శాతకర్ణి పాలనా కాలంలో వెండి నాణేలను ప్రవేశ పెట్టారు.

నాణేలు తయారు చేసేందుకు 'విద్ధంక' పద్ధతి, పోతపోసే పద్ధతి అనే రెండు పద్ధతులను అవలంబించారు. కాని ఎక్కువగా విద్ధంక పద్ధతే వాడుకలో ఉండేది. మూడు రకాల లోహాలకు సంబంధించి కూడ నాణేల ఆకారం ఏదైనా, వాటిని పూర్తిగా విద్ధంక పద్ధతిలోనే తయారు చేసేవారు. నాణేలను పోతపోసే పద్ధతిలో తయారు చేసేటప్పుడు బొమ్మలు, శాసనాలు ముందుగానే ముద్రించేవారు. బొమ్మలు, శాసనాలు ముద్రించడానికి పోతపోసే పద్ధతి తర్వాత 'అచ్చుపోసే పద్ధతి' అనుసరించేవారు.

అధిక సంఖ్యగల నాణేలను గుండ్రని ఆకారంలో ముద్రించారు. చతురస్రాకారంలోను, దీర్ఘచతురస్రాకారంలోను ఉండే నాణేలను కూడ ముద్రించి, వాడుకలోకి తెచ్చారు. గుండ్రని నాణేలు ఎక్కువగా దక్షిణ భారతదేశంలోను, చతురస్రాకార నాణేలు, దీర్ఘ చతురస్రాకార నాణేలు ఎక్కువగా ఉత్తర భారతదేశంలోను చెలామణిలో ఉండేవి.

నాగనిక రాణికి చెందిన నానేఘాట్ శాసనం, గౌతమీపుత్ర యజ్ఞ శ్రీ శాతకర్ణి 16వ పరిపాలనా సంవత్సరంలో ఇచ్చిన కర్వేరి శాసనం వల్ల, డబ్బు మొత్తాలను కార్షాపణల్లో లెక్క కట్టేవారని తెలుస్తుంది. వెండి కార్షాపణ నాణెం ప్రామాణిక బరువు 32 రత్తిలు (3.823 గ్రాములు) రాగి కార్షాపణ నాణెం ప్రామాణిక బరువు 80 రత్తిలు (9.460 గ్రాములు) గాను ఉండేవి. శాతవాహనుల పాలనా కాలంలో ముద్రించబడిన నాణేల అత్యల్ప బరువు 1.600 గ్రాములు గాను, అత్యధిక బరువు 9.460 గ్రాములు, 28.380 గ్రాముల మధ్య ఉండేవి.

శాతవాహనులు ముద్రించిన నాణేలపై శాసనాలుండేవి. ఈ పద్ధతి ఇండో గ్రీక్ నాణేల ప్రభావ ఫలితమే. నాణేలపై రాజు పేరు, అతని బిరుదును ముద్రించేవారు. శాసనాలు బ్రాహ్మీ లిపిలోను, ప్రాకృత భాషలోను ఉండేవి.

శాతవాహనుల నాణేలపై చిహ్నాలు, బొమ్మలు కూడ ముద్రించేవారు. ఆ బొమ్మలు నాలుగు రకాలుగా ఉండేవి. అవి (1) స్థానిక చిహ్నాలైన వృషభం, మీనుగు, సింహం, చుట్టూ కంచె ఉన్న వృక్షం, (2) ప్రాంతీయ లేక రాజకీయ చిహ్నాలైన రాజు బొమ్మ, కొండ, ఉజ్జయిని చిహ్నం, (3) వాణిజ్య సంబంధమైన చిహ్నాలు, ఓడలు, (4) మత సంబంధమైన చిహ్నాలు లేక స్మృతి చిహ్నాలైన శ్రీవత్స, లక్ష్మి, స్వస్తిక, నది, సూర్యుడు, చంద్రుడు, అర్ధ చంద్రుడు, సంది పాదం, కమలం, శంఖం మొదలైనవి.

14.8.2 రోమ్ నాణేలు

భారతదేశానికి, రోమ్ సామ్రాజ్యానికి మధ్యగల వ్యాపార సంబంధాల ఫలితంగా, రోమ్ చక్రవర్తులు, రిపబ్లిక్‌లు ముద్రించిన నాణేలు మనదేశంలో ప్రవేశించాయి. అని బంగారు, వెండి, కంచు, రాగి నాణేలు. రిపబ్లిక్ నాణేలపై గ్రీక్ నాణేల ప్రభావం ఫలితంగా, మత సంబంధమైన చిహ్నాలను ముద్రించారు. రాజరికపు నాణేలు మీద చక్రవర్తులు, రాజకుటుంబీకుల బొమ్మలను ముద్రించారు.

BRAOU

రోమ్ నాణేల మీద బొమ్మ వైపు భాగాన చక్రవర్తి తల లేదా ఛాతీవరకు గల బొమ్మ, అతని పేరు, బిరుదులను ముద్రించారు. ఆ నాణేల వెనుక బొరుసువైపు భాగాన గ్రీక్ నాణేల మాదిరిగా దేవుళ్ళు, దేవతలైన అపోలో, 'మార్స్', 'మినర్వా', వీనస్ మొదలగు వారి బొమ్మలను ముద్రించారు. తర్వాత కాలంలో సద్గుణాలైన 'అబండెన్షియా' (సమృద్ధి),' క్లెమెన్షియా' (దయ), 'కంకార్డియా' (సామరస్యం), 'హానస్' (గౌరవం)లను స్త్రీపురుషుల రూపంలో ముద్రించారు.

భారతదేశంలో రోమ్ నాణేలు ముఖ్యంగా దక్షిణాదిన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోను, ఉత్తరాదిన ఒరిస్సా, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లోను లభించాయి. పాకిస్తాన్‌లోను, వాయువ్య ప్రాంతంలోను తక్షశిల, మాణిక్యాల, హజార, జలాలాబాద్ మొదలగు ప్రదేశాల్లో కూడ రోమ్ నాణేలు దొరికాయి.

14.9 కుషాణుల పాలన

ప్రాచీన భారతదేశ ఉత్తర ప్రాంతాన్ని పాలించిన వారిలో కుషాణులు ముఖ్యులు. విదేశాల నుండి వచ్చినా వారు భారతీయతను సంతరించుకొని, పటిష్ఠ పాలన నందించారు.

14.10 వ్యవసాయం

కుషాణుల కాలంలో ప్రజా జీవనం ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉండేది. వారి పాలనలో వ్యవసాయం చెప్పుకోతగినంతగా అభివృద్ధి చెందింది. నాటి ఆధారాల్లో పంటలు, భూమి స్వభావం, భూముల అభివృద్ధి, నీటి పారుదల మొదలగువాటి గురించి పేర్కొనడాన్ని బట్టి ఆ కాలపు రైతులకు వ్యవసాయం ప్రాముఖ్యత గురించి, వ్యవసాయోత్పత్తి పెంపొందించేందుకు అవసరమైన మార్గాలు, సాధనాలను గురించి స్పష్టమైన అవగాహన ఉండేదని తెలుస్తుంది.

14.10.1 భూస్వామ్య వ్యవస్థ

కుషాణుల పాలనలో అమల్లో ఉండిన భూస్వామ్య వ్యవస్థ గురించి లభించిన సమాచారం చాలా తక్కువ. మౌర్యుల పాలనలో అన్ని రంగాల మీద ఏర్పర్చబడిన ప్రభుత్వ నియంత్రణ వారి తర్వాత కాలంలో కొనసాగలేదు. వ్యక్తి యాజమాన్యం, భూమి అనుభవించే హక్కు కుషాణుల కాలంలో ఉండేవని మనకు లభించిన నాటి ఆధారాల వల్ల స్పష్టమౌతుంది.

అడవిని తొలగించి, భూమిని సాగు చేసేందుకు అవసరమైన మిగతా చర్యలు చేపట్టిన వ్యక్తిని గురించి మిలిందపన్హ పేర్కొంది. ఆ వ్యక్తి భూమిని సాగులోకి తెచ్చాడు కాబట్టి, అతన్ని భూమి యాజమాని అనికూడ ఆ గ్రంథం

పేర్కొంది. కలుపు మొక్కలు తీసి శుభ్రం చేసిన వాడికే ఆ భూమి చెందుతుంది, జింకను మొదట గాయపర్చిన వానికే అది చెందుతుంది అని మనుధర్మ శాస్త్రం వివరించింది. కష్టపడి పనిచేస్తూ, వ్యవసాయం చేసే రైతుల గురించి 'దివ్యావదాన' వర్ణించింది.

కాని కేవలం పై విషయాల ఆధారంగా మాత్రమే కుషాణుల కాలానికి భూమి మీద ప్రభుత్వ యాజమాన్యం అంతరించి పోయిందని చెప్పలేం. ఆ కాలంలో భూమిమీద రాజుకు హక్కు ఉండేదని, నాటి రచనల వల్ల తెలుస్తుంది. భూమిపై ఉన్న సట్టణాలు, రేవులు, గనులు మొదలగు వాటిమీద రాజుకు యాజమాన్యం ఉండేదని మిళిందప్రశ్న స్పష్టంగా పేర్కొంది. రాజు అన్నిటికి అధిపతి కాబట్టి, నిధులు, ఖనిజాల్లో భాగానికి కూడా అతనికి హక్కు ఉంటుందని, మనుధర్మశాస్త్రం స్పష్టంగా తెలియపరిచింది. రాజుకు తన రాజ్యం లోని భూమి మీద పూర్తి హక్కుందని 'దివ్యావదాన', 'మహావస్తు' పేర్కొన్నాయి.

14.10.2 భూమి కౌలు విధానం

కుషాణులు కౌటిల్యుని ధర్మ సూత్రాలను అనుసరించి బ్రాహ్మణులకు, బౌద్ధ సన్యాసులకు పన్నులనుండి మినహాయింపుతో భూదానాలను చేసేవారు. బ్రాహ్మణులకు తరచుగా పన్నులనుండి మినహాయింపు లభించేదని, వారు కోశసంబంధమైన ఇటువంటి ప్రత్యేక హక్కులను కలిగి ఉండేవారని ధర్మశాస్త్రవేత్తలైన వసిష్ఠుడు, మనువు రచనల ఆధారంగా తెలుస్తుంది. అంతకు పూర్వ కాలానికి చెందిన ఆపస్తంబుడు, గౌతముడు బ్రాహ్మణులకు భూములు, డబ్బు దానంగా ఇచ్చే పద్ధతిని ప్రోత్సహించారు.

బ్రాహ్మదేయ భూములను 'దీఘనికాయ' పేర్కొంది. ఈ రకపు భూములకు పన్నుల నుండి మినహాయింపు ఉండేది కాదు. కాని కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల రాజు యజ్ఞయాగాదులు నిర్వహించే పూజారులకు, మత గురువులకు, పురోహితులకు, వేద పండితులకు పన్నులు, జరిమానాల నుండి మినహాయింపుతో, బ్రహ్మదేయ భూములు దానంగా ఇచ్చేవాడని తెలుస్తుంది.

కుషాణులు బౌద్ధ మతాభిమానులు. కాని వారు బౌద్ధ సన్యాసులకు భూములు దానంగా ఇచ్చినట్లు, స్పష్టమైన ఆధారాలు లభించలేదు. అయినప్పటికీ శాతవాహనులలాగే కుషాణులు కూడ బౌద్ధ సన్యాసులకు భూములు దానంగా ఇచ్చేవారని, ఇతర ఆధారాల వల్ల తెలుస్తుంది.

హువిష్కుడు 'అక్షయ నీవి' పద్ధతి ప్రకారం వందమంది బ్రాహ్మణులకు పుణ్యశాలలను, 500 పురాణలను రెండు దానాలుగా ఇచ్చాడని మథుర శాసనం వల్ల తెలుస్తుంది. అంటే ఆ దానాలను శాశ్వత ప్రాతిపదిక మీద ఇచ్చాడు. ఈ సాక్ష్యాధారం మీద గుప్తుల కాలంలో విస్తృతంగా అమల్లో ఉండిన అక్షయ నీవి కౌలు పద్ధతి క్రీస్తు శకం తొలి శతాబ్దాల్లో కుషాణుల పాలనతోనే వాడుకలోవచ్చిందని ఆర్.శర్మ అభిప్రాయ పడ్డాడు.

14.10.3 వ్యవసాయ పద్ధతులు

కుషాణుల కాలంలో వ్యవసాయ పద్ధతులు, ప్రక్రియలు ఈ క్రింద పేర్కొన్న విధంగా ఉండేవని నాటి ఆధారాల వల్ల తెసుస్తుంది.

వ్యవసాయయోగ్యమైన భూమిలో గుంటలు, ఎత్తుపల్లాలు, మురికినీళ్ళు, బురదతో నిండిన కాలువలు లేకుండా

చేసేవారు. భూమి దున్నేవాడికి 'కార్షుడు' లేక కర్షకుడు అని పేరుండేది. అతడు మొదట కలుపు మొక్కలు, ముళ్ళపొదలు, రాళ్ళు తీసివేసి, భూమి దున్నేవాడు (కసిత్వా). ఆ తర్వాత విత్తనాలు చల్లడం (వపిత్వా), నీరు పెట్టడం (ఉదకం 'పయోసెత్వా'), కంచె వేయడం ('రక్కిత్వా'), కాపలాకాయడం ('గోపెత్వా'), పండిన పంటను కోయడం ('లవన') చేసేవాడు. చివరగా పండిన పంటను నూర్చేవాడు (మద్దనేన). దాని ఫలితంగా వ్యవసాయదారుడు అధికంగా లభించే ఉత్పత్తికి యజమాని అయ్యేవాడు (బహుధన్నకోహోతి). రకరకాల పంటల ఆధారంగా విత్తనాలు నాటేవారు.

బార్లీ పంట కోసే పద్ధతిని 'మిళిందసుత్త' సవివరంగా వర్ణించింది. రైతు పండిన బార్లీ పైరును గుత్తిగా చేతిలో పట్టుకొని కుడిచేతిలోని కొడవలితో (దాత్తం) కోసేవాడు (చిందంతీతి).

14.10.4 వ్యవసాయ కార్మికులు

కుషాణుల కాలంలో చిన్నకారు రైతులు, వారి కుటుంబ సభ్యులు స్వయంగా వారి సొంత పొలాలను సాగు చేసుకొనేవారు. పెద్ద భూస్వాములు మాత్రం వ్యవసాయ పనులకు కార్మికులను నియోగించేవారు. నాటి ప్రజల ఆర్థిక జీవనంలో కార్మికుల పాత్ర గణనీయంగా ఉండేది. కాని వ్యవసాయ రంగంలోని కార్మికులకు తగిన ప్రతిఫలం ఉండేది కాదు. వారి పరిస్థితులు మెరుగ్గా ఉండేవి కావు. వ్యవసాయం, ఇతర పనుల్లో ప్రజలు కష్టించి పనిచేసేవారు కాని, వారి కష్టాలకు అంతం లేకుండా ఉండేదని అశ్వఘోషుడు 'బుద్ధ చరిత్ర' లో పేర్కొన్నాడు.

14.10.5 పశుపోషణ

కుషాణుల కాలం నాటి ప్రజల ఆర్థిక జీవనంలో వ్యవసాయమే కాకుండా, పశు పోషణ కూడా ముఖ్యభాగంగా ఉండేది. పశువుల కాపరికి గోపుడు అని పేరుండేది. అతడు పశువులను కాపలాకాయడం, వాటిని సచ్చిక బయళ్ళకు తీసుకొనిపోయి మేపించడం, మొదలైన పనులు చేసేవాడు. పశువులు పంటపొలాల్లోకి వెళ్ళకుండా, పంటలను నాశనం చేయకుండా, గోపుడు చూసేవాడు. ఆవుల నుండి సరైన సమయాల్లో పాలుతీయడం గురించి అశ్వఘోషుడు 'బుద్ధ చరిత్ర' లో వర్ణించాడు.

14.11 నీటి పారుదల

వ్యవసాయదారులు సారవంతమైన భూమికి అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. కాని భూసార లక్షణం ఒక్కటే సరిపోదు. భూమిని సాగుచేసేందుకు నీరు చాలా అవసరం. కాబట్టి, వ్యవసాయ భూములకు నీటి పారుదల సౌకర్యాలు కల్పించేందుకు కాలువలు త్రవ్వేవారు. కాలువల ద్వారా పరిపొలాలకు నీరు పెట్టేవారు. అంతేకాక బావులు, చెరువులు కూడ నిర్మించి, నీటిపారుదల సౌకర్యాలు కలుగచేసేవారు.

కనిష్కుని క్రీ.శ.89 నాటి 'జెడా' శాసనం, పెషావర్ మ్యూజియం శాసనం No.21, క్రీ.శ.118 నాటి 'షకర్దర' శాసనం, క్రీ.శ.139 నాటి 'ఉండ్' శాస నం, 'తోర్‌ధెరై' కుండపెంకుల శాసనాలు, రెండో కనిష్కుని క్రీ.శ.119 నాటి 'ఆరా' శాసనం మొదలైనవి బావులు త్రవ్వడం లేదా బావులు దానంగా ఇవ్వడం గురించి పేర్కొన్నాయి.

హువిష్కుని కాలంనాటి 'మాట్' శాసనం వల్ల, నవతి అనే పేరుగల వ్యక్తి ఒక చెరువుకు మరమ్మతు చేయించాడని తెలుస్తుంది. కుషాణ పుత్ర వేమ తక్షముని మధుర శాసనం దేవాలయం, తోట, చెరువు, బావి నిర్మించడాన్ని

పేర్కొంది. పశ్చిమ క్షత్రపుడు రుద్రదామనుని జునాగఢ్ శాసనం వల్ల, సీటిపారుదలకు చంద్రగుప్త మౌర్యుని కాలంలో నిర్మింపబడిన సుదర్శన సరస్సును తిరిగి మరమ్మతు చేశారని తెలుస్తుంది.

సైన పేర్కొన్న సాక్ష్యాధారాల వల్ల ప్రజలు వ్యక్తిగతంగాను లేదా ప్రభుత్వాధికారులు చొరవ తీసుకొని, శాశ్వతంగా నీటిసరఫరా సౌకర్యాలను కలుగజేసేందుకు ఏర్పాట్లు చేస్తేవారని తెలుస్తుంది.

కొత్తగా నిర్మింపబడిన ఈ చెరువులు, బావుల్లో అధికంగా మతసంబంధమైన ప్రయోజనాలకోసం దానంగా ఇవ్వబడినవే. అయినా దీనివల్ల భూములకు సర్వసాధారణంగా బావులు, చెరువులు, కాలువలు, నదులనుండి నీటిపారుదల సౌకర్యాలు కలుగజేసేవారని తెలుస్తుంది.

ఇళ్ళు, చెరువులు, తోటలు, వ్యక్తి యాజమాన్యంలోని పొలాలు ఇతరుల దురాక్రమణకు లోనికాకుండా, ప్రభుత్వమే వాటికి రక్షణ కల్పించేదని మనుధర్మశాస్త్రం వల్ల తెలుస్తుంది.

కుషాణుల కాలంలో పెద్దవి, చిన్నవి అయిన నదుల నుండి నీరు తీసుకొని పోయేందుకు చాలా కాలువలను నిర్మించారని డయాన్ క్రిసోస్తం (క్రీ.శ.50-117) పేర్కొన్నాడు.

14.12 ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ

ప్రభుత్వం చేపట్టే అన్నిపనులు, కార్యక్రమాలు రాజ్య ఆర్థిక పరిస్థితి మీద ఆధారపడి ఉండేవి. రాజు అధిపత్యంలోని ప్రభుత్వం మొట్టమొదట ఖజానాకు, ఆర్థిక విషయాలకు ప్రాముఖ్యత ఇచ్చేది. రాజు తన ఆదాయాన్ని అధిక వ్యయప్రయాసలతో సంరక్షించుకొనేవాడు. ఎందుకంటే, రాజ్య సౌభాగ్యం ప్రభుత్వానికి వచ్చే ఆదాయం మీద ఆధారపడి ఉండేది.

రాజరిక వ్యవస్థ, ప్రభుత్వం రెండూ కూడ రాజు వ్యక్తిగతంగా సంరంక్షించవలసిన విషయాలే. రాజు స్వయంగా ఆదాయం, వ్యయ వ్యవహారాలను చూసేవాడు. కోశాగారానికి సంబంధించిన విషయాలు జాగ్రత్తగా చూసుకోవడం, ఆర్థికవనరులు ఏవిధంగా పెంపొందించుకోవాలో ఆ మార్గాలు ఆలోచించడంకోసం, రాజు ఎల్లపుడూ జాగృతితో ఉండాలని మహావస్తు హెచ్చరించింది.

14.12.1 రెవిన్యూ విధానం

ఉత్తర భారతదేశంలోని రెండు మహానదుల పరీవాహక ప్రాంతాల్లోనూ, వ్యవసాయమే ప్రధాన వృత్తిగాగల గ్రామాలే ప్రాబల్యంలో ఉండేవి. 'మౌర్యుల కాలంలో ఆ ప్రాంతాల్లో వ్యవసాయోత్పత్తిలో మిగులుదల ఉండేది. కాని తర్వాత కాలంలో విదేశీయులైన గ్రీకులు, శకులు, పహ్లవులు, కుషాణులు ఆ ప్రాంతాలను జయించి, వరసగా పాలించి, అక్కడి వ్యవసాయోత్పత్తి మిగులుదలనంతా దోచేశారు' అని డి.డి. కోశాంబి అభిప్రాయ పడ్డాడు. కాని మౌర్యుల తర్వాత కాలంనాటి ఆధారాల వల్ల దేశీయ, విదేశీయ పాలకులు అందరూ స్మృతికర్తల ధర్మసూత్రాలను అనుసరించే పాలించారని స్పష్టమౌతుంది.

B R A O U

రాజు దురాశతో ప్రజలపై అధిక భారం పడేటట్లు పన్నులు వేయరాదని, ఎందువల్లంటే, ఆ విధానం అనుసరిస్తే ప్రజల కూకటివేళ్ళు నరికేసినట్లు అవుతుందని మనువు తెలిపాడు. ధర్మశాస్త్రాల్లోని సూత్రాలకు అనుగుణంగానే పన్నులు వేయాలని, వస్తువు రకాల్ని, కాలమాన పరిస్థితుల్ని, దుర్భిక్షాల్ని పరిగణనలోకి తీసుకొనే ధర్మశాస్త్రాలు ఏరకాల పన్నులు ఎంతెంత వేయాలో నిర్ణయించి, నిర్దేశించాయని 'మనుస్మృతి' పేర్కొంది. కౌటిల్యుడు కూడా అర్థశాస్త్రంలో ఇటువంటి అభిప్రాయాన్నే వెలిబుచ్చాడు.

శక రాజైన మహాక్షత్రప రుద్రదామనుడు తన రాజ్యంలోని ప్రజలపై అధిక భారం పడే పన్నులు (కర) వేయకుండా, వెట్టిపని (విష్టి) నిర్భంధంగా అమలు చేయకుండా, ప్రజల దాన ధర్మాలమీద (ప్రణయ క్రియ) ఆధారపడకుండా, ప్రభుత్వ కోశాగారం నుండే అధిక మొత్తంలో డబ్బు ఖర్చుపెట్టి, సీటిసరఫరాకు ఆధారమైన సుదర్శన సరస్సుకు ఆనకట్ట నిర్మించాడని క్రీ.శ.150 నాటి అతని జునాగఢ్ శాసనం వల్ల తెలుస్తుంది.

పైన పేర్కొన్న విషయాల్ని బట్టి, స్మృతికర్తలు ఉద్ఘోషించిన ధర్మసూత్రాలనే అనుసరించి, నాటి పాలకులు ప్రజలు కట్టవలసిన పన్నులను నిర్ణయించారని తెలుస్తుంది. అయినా కూడా కేంద్ర ప్రభుత్వం బలహీన స్థితిని ఆసరాగా తీసుకొని కొంతమంది రెవిన్యూ అధికారులు ముఖ్యంగా సుదూర ప్రాంతాల్లో, కొన్ని సందర్భాల్లో ప్రజల్ని అధిక పన్నులతో భయభ్రాంతుల్ని చేసి హింసించేవారు.

14.12.2 ప్రభుత్వం - ఆదాయ వనరులు

కుషాణుల కాలంలో ప్రభుత్వానికి ప్రధానంగా భాగ, బలి, శుల్క అనే పన్నుల ద్వారా ఆదాయం వచ్చేది. ఆ మూడు పన్నులు సాధారణ పన్నులుగానే నాటి ప్రభుత్వాలు ప్రజలు నుండి వసూలు చేసేవి. అవి ప్రజలు భరింపరాని పన్నులు కావు. ఎందువల్లంటే రుద్రదామని జునాగఢ్ శాసనంలో ఇవ్వబడిన ప్రజలు భరింపరాని పన్నుల జాబితాలో ఆ మూడు పన్నులు లేవు.

'భాగ' పన్ను సాంప్రదాయకంగా రాజుకు వ్యవసాయోత్పత్తిలో వచ్చే భాగమే. అది వ్యవసాయోత్పత్తిలో ఆరో భాగంగా (1/6) ఉండేది. కౌటిల్యుని అర్థశాస్త్రం, మనుదర్మ శాస్త్రం కూడ రాజుకు వ్యవసాయోత్పత్తిలో ఆరో వంతు చెందుతుందని పేర్కొన్నాయి.

'మిలింద ప్రశ్న' వల్ల బలి అనేది అత్యవసర సమయాల్లో వేసే పన్ను అని తెలుస్తుంది. కాని అశ్వఘోషుని 'బుద్ధచరిత్ర' మాత్రం బలిని సాధారణంగావేసే పన్నుగా పేర్కొంది. మను ధర్మ శాస్త్రం ప్రకారం, బలి పన్ను ప్రభుత్వ కోశాగారానికి ప్రతి సంవత్సరం చెల్లించే పన్నుగా స్పష్టమౌతుంది.

'శుల్క' అనేది వాణిజ్య పన్ను. ఆ పన్ను వసూలుచేసే ప్రభుత్వాధికారికి 'శౌల్కికుడు' లేక శుల్కాధ్యక్షుడు అని పేరుండేది. శుల్క పన్నును దేశీయ, విదేశీయ వ్యాపార సరుకులు రెండింటిమీద వేసేవారు.

'కర' పన్ను వల్ల మాత్రం ప్రజల మీద భారం పడేది. ఎందువల్లంటే, అది సాధారణ పన్నుల కంటే అధికంగా ఉండేది. కాని అశ్వఘోషుడు మాత్రం 'కర' ను సాధారణ పన్నుగానే పరిగణించాడు.

కుషాణుల కాలంలో వెట్టి పని (విష్టి) కూడా వాడుకలో ఉండేది, కార్మికులు, చేతిపనివారు, దాసులు పన్నులు కట్టడానికి బదులుగా, వెట్టిపని రూపంలో, కూలి తీసుకోకుండా ప్రభుత్వానికి సేవ చేసేవారు.

BRAOU

14.12.3 ప్రభుత్వం - వ్యయం

ప్రభుత్వం చేసే వ్యయం అది చేపట్టే పలురకాల కార్యక్రమాల మీద ఆధారపడి ఉండేది. మౌర్యులవలె కుషాణులుకూడ రాజ్యంలోని ప్రజల రక్షణ అవసరాల నిమిత్తం, పోలీసు రక్షక దళాన్ని, రాజ్యం వెలుపలనుండి విదేశీయుల దండయాత్రలు, దురాక్రమణలనుండి రక్షణ కొరకు సైన్యాన్ని ఏర్పాటు చేశాడు. ఈ రెండు వ్యవస్థల మీద ప్రభుత్వానికి ఖజానానుండి డబ్బు భారీగా ఖర్చు అయ్యేది.

విదేశీయులైన కుషాణులు ఉత్తర భారతదేశంలో అధిక భాగాన్ని జయించిన తర్వాత పటిష్టమైన పరిపాలన కోసం ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో ఉన్న ప్రభుత్వాధికారుల జీతభత్యాల మీద కూడా ప్రభుత్వానికి భారీగా వ్యయమయ్యేది. కౌటిల్యుని అర్థశాస్త్రంవల్ల ప్రభుత్వాధికారుల జీతాలు 60 నుండి 48,000 పణాల వరకు ఉండేవని తెలుస్తుంది. మనుధర్మశాస్త్రం వల్ల రెవిన్యూ అధికారులకు నేరుగా ప్రభుత్వం డబ్బు రూపంలో జీతాలు ఇవ్వకుండా వారికి భూములు ఇచ్చేదని, వారు ఆ భూముల నుండి వచ్చే ఆదాయాన్ని అనుభవించేవారని తెలుస్తుంది. కాని కుషాణుల కాలంలో మాత్రం, ప్రభుత్వాధికారులకు జీతాలు డబ్బురూపంలో ఇచ్చేవారు.

కుషాణుల కాలంలో వ్యవసాయానికి రక్షణ కల్పించడం, దాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలను తీసుకోవడం ప్రభుత్వానిదే బాధ్యతగా ఉండేది. వ్యవసాయ భూములకు నీటిపారుదల సౌకార్యాలు కల్గించే నిమిత్తం అవసరమైన సరస్సులు, చెరువులు, కాలువలను నిర్మించడం, బావులు త్రవ్వించడం మొదలైన కార్యక్రమాల నిమిత్తం, ప్రభుత్వం డబ్బు ఖర్చు పెట్టేది.

పైన పేర్కొన్న పనులు, పద్ధుల మీదే కాక, ఈ క్రింద చెప్పబడిన వివిధ కార్యక్రమాలు, పద్ధుల మీద కూడా ప్రభుత్వానికి వ్యయం అయ్యేది.

(1) ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడం కోసం రహదారులను నిర్మించడం

(2) రహదారుల మీద ప్రయాణీకులకు రక్షణ కల్పించడం

(3) అడవులు, గనులు, నిధులు మొదలైన ఆర్థిక వనరుల సమీకరణ, వినియోగం

(4) నిరుపేదలకు, అనాథలకు భోజనం, ఇతర సదుపాయాలు కల్పించే సహాయ కార్యక్రమాలు

(5) బ్రాహ్మణులకు, సన్యాసులకు, మత సంస్థలకు భూముల రూపంలోను, ధన రూపంలోను దానాలు ఇవ్వడం.

14.13 ఆర్థిక వనరుల సమీకరణ - వినియోగం

అడవులు, గనులు, భూగర్భ నిధులు మొదలైన ఆర్థిక వనరుల సమీకరణ, వినియోగం కోసం ప్రభుత్వానికి ఉత్పాదిక వ్యయం అయ్యేది. మౌర్యుల కాలంలో రిజర్వు అడవులు ఉండేవని, కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల తెలుస్తుంది. కాని కుషాణుల కాలం నాటి ఆధారాల్లో, నాటి రిజర్వు అడవుల గురించి స్పష్టమైన సమాచారం లేదు. అయినా అంతమాత్రంచేత, మౌర్యులు తర్వాత కాలంలో రిజర్వు అడవులు పూర్తిగా అదృశ్యమైపోయాయని చెప్పలేం.

BRAOU

గనుల మీద ప్రభుత్వానికి గుత్తాధిపత్యం ఉండేది. నాటి సాహిత్యధారాల్లో ఈ విషయం గురించిన ప్రస్తావనలున్నాయి. రాజు మిగతావాటితో గనులపై కూడ అధికారులను నియోగించాలని మహాభారతం లోని శాంతిపర్వం పేర్కొంది. గనుల నుండి ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, అందువల్ల రాజు గనులకు సంబంధించి, నమ్మకస్తులైన అధికారులను నియోగించాలని మనుధర్మశాస్త్రం పేర్కొంది.

బ్రాహ్మణుడు భూగర్భ నిధిని కనుగొన్నట్లైతే, ఆనిధి పూర్తిగా అతని సొంతానికే చెందుతుందని మనుధర్మశాస్త్రం పేర్కొంది. కాని రాజు నిధిని కనుగొన్నట్లైతే, దానిలో సగ భాగం బ్రాహ్మణులకు ఇవ్వవలసి ఉంటుందని, మిగిలిన సగభాగమే ప్రభుత్వ ఖజానాకు చెందుతుందని మనువు వివరించాడు. దీన్నిబట్టి భూమిలో నిక్షిప్తమైన నిధులను కనుగొనేందుకు రాజులు ప్రభుత్వ అధికారులను నియోగించేవారని తెలుస్తుంది.

14.14 శ్రేణులు

మౌర్యుల తర్వాత కాలంలో వర్ధిల్లిన కళలు, వృత్తులమీద కుషాణుల ప్రభుత్వం ఏ విధమైన నియంత్రణను అమలు చేయలేదు. మిళిందపన్హ 75 వృత్తులను పేర్కొంది. వాటిలో 65 చేతిపనులకు సంబంధించినవి. 'మహావస్తు' వల్ల రాజగృహ పట్టణంలో 36 రకాల కార్మికులు నివసించేవారని తెలుస్తుంది.

వ్యాపారాలు, పరిశ్రమల్లో అత్యధికంగా శ్రేణులు ఏర్పడ్డాయి. శ్రేణులు స్వపరిపాలనా సంస్థలు. శ్రేణుల విషయాల్లో కలుగజేసుకొనేందుకు ప్రభుత్వానికి ఎక్కువ అవకాశం ఉండేది కాదు. శ్రేణుల వ్యవస్థ గురించి, వాటి కార్యక్రమాల గురించి సమాచారం నాటి ఆధారాల వల్ల లభిస్తుంది. శ్రేణికి అధ్యక్షుడుగా శ్రేష్ఠి ఉండేవాడు. మనుధర్మశాస్త్రం శ్రేణి ధర్మాన్ని గురించి పేర్కొంది. శ్రేణి ధర్మం చట్టంతో సమానంగా పరిగణింపబడేది. రాజు శ్రేణి ధర్మాన్ని అమలు చేయాలని నారదుడు తెలిపాడు.

కుషాణుల కాలంలో చేతివృత్తులవారు, వివిధ రకాల వృత్తులవారు, వ్యాపారస్తులు, కార్మికులు మొదలగువారు శ్రేణులను ఏర్పాటు చేసుకొనేవారు. బౌద్ధగ్రంథం మహావస్తు, ఆంధ్రుల (శాతవాహనుల), క్షాత్రపుల కాలంనాటి శాసనాలు, హువిష్కుని క్రీ.శ.106 నాటి మథుర శాసనం వివిధ రకాల శ్రేణులను పేర్కొన్నాయి. నాటి ప్రజల ఆర్థిక జీవనంలో శ్రేణుల పాత్ర గణనీయంగా ఉండేది.

బౌద్ధ గ్రంథం 'మహావస్తు' ఈక్రింద ఇవ్వబడిన వివిధ రకాల వృత్తిపనివారల, వ్యాపారస్తుల శ్రేణులను పేర్కొంది.

(1) సౌవర్ణిక - హైరణ్యక = సువర్ణకారులు

(2) ప్రావారిక - పలి - పావారిక = కోక్స్ (Coakes) తయారు చేసేవారు లేదా అమ్మేవారు

(3) మణి ప్రస్తరక = మణులు కాంతివంతంగా చేసేవారు

(4) గంధిక = సుగంధ ద్రవ్యాలను అమ్మేవారు

(5) తైలిక = నూనెగానుగల వారు

(6) ఘృత కుండిక	=	నేయి నిలువ చేసేందుకు కుండలు తయారు చేసేవారు
(7) గోలిక	=	క్షారం తయారు చేసేవారు
(8) దధిక	=	పెరుగు తయారు చేసేవారు
(9) కార్పాసిక	=	నూలు బట్టలు తయారు చేసేవారు
(10) ఖండకారక	=	కలఖండ తయారు చేసేవారు
(11) మోదక కారక	=	మిఠాయిలు చేసి అమ్మేవారు
(12) సమితా కారక	=	గోధుమ పిండి అమ్మేవారు
(13) శక్తు కారక	=	బార్లీ పిండి అమ్మేవారు
(14) ఫల వణిజ	=	పండ్ల వర్తకులు
(15) మూల వణిజ	=	వేర్లు అమ్మేవారు
(16) చూర్ణ కుట్టక	=	పిండి చేసేవారు
(17) గంధ తైలక	=	సుగంధ తైలాలు అమ్మేవారు
(18) అట్టవానజ	=	వంటసరుకులు అమ్మేవారు
(19) కోలికనికాయ	=	చేనేత పనివారు
(20) కులైరిక	=	కుమ్మరులు
(21) ఔద యంత్రిక	=	జలశక్తి యంత్రాలు (hydraulic engines) తయారుచేసి అమ్మేవారు
(22) దమ్మిక	=	ధాన్యం వర్తకులు
(23) వసకార	=	వెదురు పనివారు
(24) కాంస్యకార	=	కంసాలివారు

శ్రేణులు శాశ్వత డిపాజిట్లు (అక్షయనీవి) స్వీకరించి, దస్తావేజు పత్రంలో వాటికి ఇవ్వబడిన విధులను నిర్వర్తించేవి. మథురలోని క్రీ.శ.101 నాటి శాసనం వల్ల, శక పాలకుడొకరు 550 పురాణలను గోధుమ పిండి వర్తకుల శ్రేణి, ధాన్యం వర్తకుల శ్రేణి అనే రెండు శ్రేణుల్లో డిపాజిట్ చేసి, ఆ డిపాజిట్ మీద ప్రతి నెలా (మాసానుమాసం) వచ్చే

BRAOU

వడ్డీ ఆదాయంతో , 100 మంది బ్రాహ్మణులకు భిక్షుగృహంలో భోజన వసతి కల్పించేటట్లు, వచ్చే ఆదాయంలో కొంత భాగం నిరుపేదలకు, అనాధలకు దానాలు చేసేందుకు నిర్దేశించాడని తెలుస్తుంది.

పైన పేర్కొన్న విషయాల్ని బట్టి, చెప్పుకోదగిన మొత్తంలో డబ్బు రెండు శ్రేణుల్లో డిపాజిట్ చేశారంటే, ఆ శ్రేణుల ఆర్థిక సుస్థిరతను ధ్రువ పరుస్తుంది. అలా కాని ఎడల ఒక విదేశీయుడు సందేహాస్పదమైన, స్థిరత్వంలేని శ్రేణి సంస్థలతో ఆర్థిక లావాదేవీలు చేసుకొని ఉండేవాడు కాదని స్పష్టమౌతుంది.

14.15 రుణ పరపతి విధానం

వడ్డీ వ్యాపారిని శ్రేష్ఠి అనేవారు. అతడు ప్రజలకు డబ్బు అప్పుగా ఇచ్చి, (యోగ ప్రయోగ) దానిమీద వడ్డీ (ప్రయోగ) తీసుకొనేవాడు. మిళిందప్రశ్న వల్ల అప్పు ఇవ్వడం ఒక మధ్యవర్తి (ఇణసాధక) ద్వారా జరిగేదని, అప్పుతీసుకొన్న వ్యక్తి (ఇణగాహక) తిరిగి ఇవ్వలేక పోయినట్లయితే, అతనికి అంతులేని బాధలు (ఇణట్ట) కలిగేవని తెలుస్తుంది.

శ్రేణులు కూడ బ్యాంకుల్లాగా ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించేవి. అవి డిపాజిట్లు స్వీకరించడమేగాక, వడ్డీ మీద అప్పులు కూడ ఇచ్చేవి.

14.16 కార్మికులు

వ్యవసాయం, వృత్తిపనులు, వ్యాపారం మొదలగు రంగాల్లో కార్మికులు పని చేసేవారు. ఈ రకాల కార్మికులకు జీతభత్యాలు ఉండేవి. వీరేకాక వెట్టి కార్మికులు కూడ ఉండేవారు. కార్మికులు, చేతిపనివారు, దాసులు ప్రభుత్వానికి పన్నులు కట్టేదానికి బదులుగా వెట్టిపని చేసేవారు.

జూనాగఢ్ శాసనం వెట్టి పనిని ప్రజలు భరింపరాని పన్నుగా పేర్కొంది. అయినప్పటికీ ప్రభుత్వం అధికారయుతంగానే అప్పుడప్పుడు వెట్టి పనిని శూద్రులు, వృత్తిపనివారు, చేతిపనివారు మొదలగువారి మీద విధించేది.

కుషాణులు అధిక సంఖ్యలో స్తూపాలు, సంఘారామాలను నిర్మించారు. ఆ కట్టడాల నిర్మాణం నిమిత్తం కొన్ని సందర్భాల్లో సాధారణ పన్నులకు బదులుగా, ప్రజల మీద వెట్టి పనిని నిధించి ఉండవచ్చు.

14.17 కరువు కాటకాలు - ప్రభుత్వ విధానం

కుషాణుల కాలంలో సంభవించిన పలురకాల కరువుకాటకాలు, వాటి ఫలితంగా కలిగిన పరిస్థితులు, ఆ పరిస్థితుల్లో ప్రభుత్వం చేపట్టిన చర్యలను గురించి నాటి బౌద్ధ గ్రంథాలు పేర్కొన్నాయి.

'దివ్యావదాన' మూడు రకాల దుర్భిక్షాలను (త్రివిధం దుర్భిక్షం భవిష్యతి) పేర్కొంది. అవి (1) 'చంచు' (2) 'స్వేతాష్ఠి' (3) 'సలాక వృత్తి'. 'చంచు' కరువు సంభవించినప్పుడు ప్రజలు చనిపోయిన వారి శాంతి కోసం, ఒక పెట్టెలో ఉంచిన ధాన్యం ఆహారంగా వాడుకొని జీవించేవారు. 'స్వేతాష్ఠి' కరువు సంభవించినప్పుడు ఎముకలు

ఉడకబెట్టగా వచ్చిన చారు (Soup) త్రాగి బ్రతికేవారు. 'సలాక వృత్తి' కరువు వచ్చినప్పుడు, ధాన్యాన్ని వీరుకొని, దాన్ని బెల్లం నీటిలో ఉడికించగా వచ్చిన జావ త్రాగి జీవించేవారు. కరువు కాటకాల్లో శవాల నుండి లభించిన ఎముకలు, మాంసంతిని జీవించే వారని అశ్వఘోషుడు పేర్కొన్నాడు.

దుర్భిక్షాలు సంభవించినప్పుడు ప్రభుత్వం కొన్ని చర్యలను చేపట్టేది. మొదటగా ఆహార ధాన్యాల్ని సేకరించి, వాటిని ప్రతి గ్రామం, పట్టణం, నగరం లోని ధాన్యపు గిడ్డంగుల్లో, కోష్ఠాగారంలో నిలువ చేసేవారు, ఆ తర్వాతే ఆహారధాన్యాల్ని అందరికి సమానంగా పంచేందుకు (సమం భక్తం) జనాభా లెక్కలను తయారు చేసేవారు. జనాభా లెక్కల సేకరణ అధికారి గణితంలో నిపుణుడుగా (గణిత కుశల) ఉండేవాడు. ధాన్యపు గిడ్డంగుల అధికారికి 'కోష్ఠాగారికం పురుషం' అని పేరు ఉండేది. చివరగా, ఆహారధాన్యాల్ని అందరికి సమానంగా పంపిణీ చేసేవారు. ఆహార ధాన్యాల్ని ప్రతి ఒక్కరికి ఒక కడప (కుడవ) గాను, రాజుకు, రెండు కడవలుగాను కొలిచి ఇచ్చేవారని, 'అవదాన శతకం' పేర్కొంది. ఆహార ధాన్యాల్ని ప్రతి ఒక్కరికి ఒక మానిక ఇచ్చేవారని దివ్యావదాన పేర్కొంది.

14.18 తూనికలు - కొలతలు

కుషాణుల కాలంనాటి మథుర శాసనం మూడు రకాల తూనికలను పేర్కొంది. అవి (1) 'ఆఢక', (2) 'ప్రస్థ' (3) 'ఘటక' అనే ధాన్యపు తూనిక కార్షలో నాలుగో వంతుకు, లేదా 4096 మాషలకు, అంటే సుమారుగ 3Kgలకు సమానం. 'ప్రస్థ' అనేది 'ఆఢక' లో నాలుగో వంతు. 'ఘటక' అంటే 4 ఆఢలకు లేదా 1 'ద్రోణకు' సమానం.

'దివ్యావదాన' నాలుగు రకాల తూనికలను పేర్కొంది. అవి (1) అంజలి (2) మానిక (3) విల్వానుత్రం (4) ప్రవేధ. 'అంజలి' అనేది 1 కుడవకు లేదా 'ప్రస్థ' లో నాలుగో వంతుకు సమానం. మానిక అంటే 8 పాలలకు, లేదా 2 కుడవలకు, లేదా శరావకు సమానం. 'విల్వ' అనేది ఒక ప్రత్యేకమైన తూనిక. అది ఒక పాలకు లేదా కుడవలో నాలుగోవంతుకు సమానం.

మిళిందపన్హ మూడు రకాల కొలతలను పేర్కొంది. అవి (1) వాలంగుళి (2) వ్యామ (3) యోజన అంగుళి అనేది ఒక చేతివ్రేలి పొడవుకు సమానం. 12 అంగుళాలు ఒక వితస్తికు, 24 అంగుళాలు ఒక హస్తానికి సమానం. 'వ్యామ' అనేది రెండు మూరలకు సమానం. 'యోజన' అనేది అన్నిటి కంటె పెద్ద కొలత. అది 2 క్రోషలకు లేదా 12.8 - 14.4 కి.మీ.కి సమానం. శ్రావస్తి, సోపార పట్టణాల మధ్య దూరం 100 యోజనాలు ఉండేదని 'దివ్యవదాన' పేర్కొంది.

పైన పేర్కొనబడిన కుషాణుల కాలంనాటి మథుర శాసనం, గ్రంథాల్లో బరువుకు, దూరానికి సంబంధించి ఇవ్వబడిన తూనికలు, కొలతలు ప్రాచీన యుగంలో మౌర్య కాలం నుండి వాడుకలో ఉండేవి.

14.19 ద్రవ్య వ్యవస్థ

కుషాణుల కాలంలో నిర్దిష్టమైన ద్రవ్య వ్యవస్థ ఉండేది. మూడకం ద్రవ్య రూపంలోను, వస్తురూపంలోను ఉండేది. వీరికాలంలో బంగారు నాణాలు ఎక్కువగా చెలామణిలో ఉండేవి.

BRAOU

14.19.1 ద్రవ్య మూరకం

డబ్బు మూరక సాధనంగా ఉండేది. కుషాణుల కాలంనాటి గ్రంథాలు మూడు రకాల నాణెలను పేర్కొన్నాయి. అవి (1) 'దినారలు', (2) 'పురాణలు' (3) 'కార్షాపణలు'. 'దివ్యావదాన', 'అవదాన' శతకం 'దినార' నాణేన్ని పేర్కొన్నాయి. క్రీ.శ.106 నాటి మథుర శాసనం 550 పురాణలను దానంగా ఇచ్చినట్లు పేర్కొంది. పురాణలు వెండి నాణేలు. ఈ నాణేలను మహావస్తుకూడా పేర్కొంది. మనుధర్మశాస్త్రం ప్రకారం, ఒక పురాణ నాణెం 10 పణలకు సమానం.కార్షాపణాలు రాగి నాణాలు. ఈ నాణాలను దివ్యావదాన, మిలిందప్ష్న, అశ్వఘోషుని బుద్ధచరిత్ర పేర్కొన్నాయి. అవదాన శతకం బంగారు నాణేలు (సువర్ణపిటక) పేర్కొంది.

14.19.2 వస్తుమూరక పద్ధతి

కుషాణుల కాలంలో వస్తుమూరక పద్ధతి (నిమినిత్వ లేక విస్సజ్జెయ్య) కూడ వాడుకలో ఉండేది. ఒక ప్రయాణికుడు ఒక పెద్ద నగరానికి పోయి, అక్కడ తన అవసరాల నిమిత్తం ఒక వస్తువును డబ్బుకు మార్చుకొనడాన్ని, 'సద్ధర్మ పుండరీక' పేర్కొంది. వ్యాపార వస్తువుల మారకం కూడ ఉండేదని దివ్యావదాన వల్ల తెలుస్తుంది.

14.19.3 నాణేలు

కుషాణుల కాలంలో ఉత్తర భారతదేశంలో బంగారు నాణేలు వాడుకలో ఉండేవి. నాటి గ్రంథాలు, శాసనాలు బంగారు నాణేల్ని పేర్కొన్నాయి. వాటి మారక విలువ ఒక బంగారం నాణేనికి 35 వెండి నాణేలు,కార్షాపణలకు సమానం.

కుషాణుల కాలంలోను, అంతకు ముందు విదేశీ నాణేలైన గ్రీక్ బ్యాక్ట్రియన్ నాణేలు, రోమన్ నాణేలు అధిక సంఖ్యలో భారతదేశంలో ప్రవేశించాయి. ఈ విదేశీ నాణేల ప్రభావం శకులు, పహ్లవులు, కుషాణులు, తర్వాత కాలంనాటి భారతదేశ పాలకులు ముద్రించిన నాణేల మీద గణనీయంగా పడింది. దాని ఫలితంగా భారతదేశాన్ని పరిపాలించిన రాజులు అధిక సంఖ్యలో నాణేలను ముద్రించడం క్రమంగా ప్రారంభించారు. భారతీయ రాజులు ముద్రించిన నాణేల రూపంలోను, నాణ్యంలోను, ప్రామాణిక బరువులోను మార్పులు వచ్చాయి. అంతేకాక డెనేరియస్, డ్రక్మ మొదలైన విదేశీ నాణేల పేర్లను అనుకరించి, భారతీయ నాణేలకు డబ్బు మారక సాధనంగా ఉండేది. కుషాణుల కాలంనాటి గ్రంథాలు మూడు 'దినార', 'ద్రమ్మ' అని పేర్లు పెట్టారు. గుండ్రని నాణేలు ముద్రించడం, నాణేల మీద రాజు పేరు, శాసనం రాయడం లాంటి పద్ధతులను విదేశాలనుండి అనుకరించారు.

కుషాణుల ప్రభుత్వం ద్రవ్య వ్యవస్థను సరైన నాణేల తూకం ద్వారా, సక్రమ పద్ధతిలో పెట్టింది. కుషాణులు ఒక పద్ధతి ప్రకారం బంగారం, రాగి నాణేలను అధిక సంఖ్యలోను, వెండి నాణేలను స్వల్ప సంఖ్యలోను ముద్రించారు.

కుషాణులు ముద్రించిన 'దినార' అనే బంగారు నాణెం పరిమాణంలోను, బరువులోను రోమన్ బంగారు నాణెం 'ఆరై'ని పోలి ఉండేది. బంగారు నాణెం బరువు స్థిరంగా ఉండేది. కాని బంగారం నాణెంలో బంగారు శాతం మాత్రం క్రమంగా తగ్గిపోయింది. వేమా కాడ్ఫీయిసెస్ కాలంలో మూడు రకాల బంగారు నాణేలను ప్రవేశ పెట్టారు. అవి (1) 248 గ్రెయిన్ల బరువు గల రెట్టింపు స్టేటర్, (2) 124 గ్రెయిన్ల బరువుగల స్టేటర్ (3) గ్రెయిన్ల బరువుగల

పాతిక స్టేటర్. కనిష్కుని కాలంలో స్టేటర్ రకం నాణేలే ఉండేవి. కనిష్కుని తర్వాత రాజులు స్టేటర్ రకం నాణేలు ఉంచి, పాతిక స్టేటర్ నాణేలను మరల ప్రవేశపెట్టారు.

కుషాణుల రాగి నాణేలకు, వాయవ్య భారతదేశాన్ని పాలించిన రాజులు ముద్రించిన రాగి నాణేలకు పోలికలు ఉన్నాయి. 160 గ్రెయిన్ల బరువుగల పర్షియన్ ప్రామాణిక డైడ్రాక్మ్‌లు 40 గ్రెయిన్ల బరువుగల పర్షియన్ ప్రామాణిక హెమిడ్రాక్మ్‌లు, 58 గ్రెయిన్ల బరువుగల భారతీయ ప్రామాణిక డ్రాక్మ్‌లతో కలిపి, 'టెట్రాడ్రాక్మ్'లను కూడా వాడుకలో ఉండేవి. ఆట్టిక్ ప్రామాణికంతోను, భారతీయ ప్రామాణికంతోను రెండు రకాల టెట్రాడ్రాక్మ్‌లను ముద్రించి, వాడుకలోకి తెచ్చారు.

ప్రాచీన భారతదేశంలో రాగి నాణేనికి 'పణ' అని పేరుండేది. మనుధర్మశాస్త్రం ప్రకారం 'పణ' బరువు 146 గ్రెయిన్లు లేక ప్రతి మాషకు 5 రైతులు గల 16 మాషలకు సమానంగా ఉండేది. కాని ఒక పణ ప్రతి మాషకు 5 రైతులు గల 20 మాషలతో సమానం అని వశిష్ఠుడు, గౌతముడు పేర్కొన్నారు. కాని మనుధర్మశాస్త్రం పేర్కొన్న ప్రామాణికం అంతకు ముందు కాలంనాటి ధర్మశాస్త్రకర్తల ప్రామాణికానికి బదులుగా వాడుకలోకి రాలేదు. నారదుడు కూడ 20 మాషలతో సమానమైన పణను పేర్కొన్నాడు. 'అగ్ని పురాణం' మాత్రం 24 మాషలకు సమానమైన పణను పేర్కొంది.

కుషాణుల రాగి నాణేలు 240 నుండి 260 గ్రెయిన్ల బరువుతో అంటే, 26 నుండి 28 మాషలకు సమానంగా ఉండేవి. 260 గ్రెయిన్ల బరువుగల పణ నాణెం 28 మాషలు గాను, 130 గ్రెయిన్ల బరువు గలది 14 మాషల అర్ధ పణ నాణెంగాను, 64 గ్రెయిన్ల బరువుగలది 7 మాషల పాతిక పణ నాణెం గాను ఉండేది.

శాతవాహనులు, కుషాణులు భారతదేశాన్ని పాలించిన కాలంలో విదేశాల నుండి వచ్చి, మన దేశంలో రాజ్యాలు స్థాపించిన రాజులు నాణేలను ముద్రించి వాడుకలోకి తెచ్చారు. ఇండో గ్రీకులు, శకులు, పహ్లవులు, కుషాణులు నాణేలను ముద్రించి, చలామణిలో పెట్టారు. క్రీ.శ.తొలి మూడు శతాబ్దాల్లో భారతదేశంలోని ఆర్థిక జీవనం కుషాణుల ద్రవ్య వ్యవస్థ మీద ఆధారపడి ఉండేది.

BRAOU

14.19.3.1 ఇండో గ్రీక్ నాణేలు

ఇండో గ్రీకులు ఎక్కువగా రెండి, రాగి నాణేలను ముద్రించారు. అల్పసంఖ్యలో బంగారు నాణేలను కూడ ముద్రించారు. ఇండో గ్రీక్ రాజులైన డయోడోటస్, యూక్రటైడ్స్, యూథిడెమస్ మొట్టమొదటి బంగారు నాణేలను ముద్రించారు. అవి బాక్ట్రియాలో చలామణిలో ఉండేవి. వారు బంగారు నాణేలను భారతదేశంలో ముద్రించలేదు కాని కొందరు చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం, ఇండో గ్రీక్ రాజుల్లో గొప్పవాడైన మెనాండర్ కొన్ని బంగారు నాణేలను ముద్రించారు. అవి భారతదేశంలో మొట్టమొదటగా ముద్రింపబడిన బంగారు నాణేలు.

ఇండో గ్రీక్ రాజులు డైడ్రాక్మ్‌లు, హెమిడ్రాక్మ్‌లు అనే రెండి నాణేలను ముద్రించారు. అవి గుండ్రంగా ఉండేవి. వాటిని పర్షియా ప్రామాణికం ఆధారంగా ముద్రించారు.

ఇండో గ్రీక్ రాజులు రాగి నాణేలను అధిక సంఖ్యలో ముద్రించారు. అవి చతురస్రాకారంలో ఉండేవి. వాటిని తక్షశిల (Taxila) లో స్థానికంగా వాడుకలో ఉన్న రాగి నాణేల ప్రామాణికాన్ని అనుసరించి ముద్రించారు.

ఇండో గ్రీక్ రాజులు తగరం నాణేలు, సీసం నాణేలను కూడ ముద్రించారు. తగరం నాణేలను పాంటాలియన్, అగతోకల్స్ ముద్రించారు. అవి ప్రపంచంలో మొట్టమొదటగా ముద్రింపబడిన తగరం నాణేలు. సీసం నాణేలను రెండవ స్ట్రాటో ముద్రించారు.

ఇండో గ్రీక్ రాజులు ముద్రించిన నాణేల పైభాగాన (బొమ్మవైపు) రాజు తల లేదా రాజు బొమ్మ ముద్రించేవారు. ఆ నాణేల్లో బొమ్మవైపు భాగాన గ్రీక్ లిపిలో శాసనం కూడ ముద్రించేవారు. కొన్ని నాణేల మీద శాసనం ఉండేది కాదు. నాణేల బొరుసు వైపు భాగాన గ్రీక్ దేవతలైన జ్యూస్, నైక్, పల్లాస్ బొమ్మలును చిత్రించి, ముద్రించేవారు.

ఇండో గ్రీక్ రాజులు తొలి కాలంలో ముద్రించిన నాణేల బొమ్మవైపు భాగాన గ్రీక్ లిపిలోశాసనాలు ఉండేవి. ప్రతి నాణెం మీద మూడు పదాలు ఉండేవి. అవి (1) రాజు (బాసిలియోస్), (2)రాజు బిరుదు, (3) రాజు పేరు. తర్వాత కాలంలో డెమెట్రియస్, అతని తర్వాత పాలించిన రాజులు ముద్రించిన శాసనాలు గ్రీక్ లేక ఖరోష్ఠి లిపిలోను, గ్రీక్ లేక ప్రాకృత భాషలోను ఉండేవి.

ఇండో గ్రీకుల నాణేల మీద రాసి ముద్రింపబడిన మోనోగ్రామ్‌లు మొదట కొన్ని అక్షరాల కలయికతోను, తర్వాత ఒక్కొక ఖరోష్ఠి అక్షరాలలోను ఉండేవి. వారి నాణేలు సాధారణంగా గుండ్రని ఆకారంలో ఉండేవి. డెమెట్రియస్ భారతదేశాన్ని జయించి తర్వాత చతురస్రాకారంలో ఉండే రాగి నాణేలను ముద్రించాడు. ఇండో గ్రీకులు నాణేలు ముద్రించేందుకు ఆట్టిక్ నాణేల బరువు ప్రమాణికాన్ని అనుసరించి, 67.5 గ్రెయిన్లు బరువుగల డ్రాక్మ్‌లు ముద్రించారు.

ఇండో గ్రీక్ రాజులు నాణేల ముద్రణలో కొత్త పద్ధతులను ప్రవేశపెట్టారు. (1) వారి కాలంలోనే భారతదేశంలో మొట్టమొదటగా నాణేలను ముద్రించేందుకు పోతపోసే పద్ధతి వాడుకలోకి వచ్చింది. దీనికి వారు గ్రీక్ పద్ధతి అవలంబించారు. (2) నాణెం పైభాగం వైపు రాజు చిత్రాన్ని ముద్రించడం ప్రారంభమైంది. కిరీటం లేక హెల్మెట్ ధరించిన రాజు తల భాగం లేదా రాజు బొమ్మను ముద్రించేవారు. (3) భారతదేశంలో మొట్టమొదటగా నాణేల మీద గ్రీక్ దేవుళ్ళు, దేవతలైన జ్యూస్, నైక్, ఏథైనా, పల్లాస్, ఆర్టెమిస్, పొసైడాన్, అపోల్లో, డయొస్కూరాయ్ బొమ్మలు నాణెం వెనుక (బొరుసు) భాగాన ముద్రించడం జరిగింది. (4) భారతదేశంలో మొట్టమొదటగా నాణేల మీద శాసనాలను ముద్రించడం, ఇండో గ్రీక్ రాజుల కాలంలోనే ప్రారంభమైంది.

14.19.3.2 శకుల నాణేలు

శక రాజులు రెండి, రాగి నాణేలను ముద్రించారు. ఆ నాణేల్లో కొన్నింటి మీద గ్రీక్ లిపి, గ్రీక్ భాషలో శాసనాలు ఉండేవి. కాని అధిక సంఖ్యలో నాణేలమీద రెండు భాషల్లో శాసనాలను ముద్రించారు. కొన్ని నాణేల మీద గ్రీక్ లిపి, గ్రీక్ భాషలోను, మిగిలిన వాటి మీద ఖరోష్ఠి లిపి, ప్రాకృత భాషలోను శాసనాలను ముద్రించారు. నాణేల పైవైపు (బొమ్మ) భాగాన రాజు బొమ్మ, వెనుక వైపు (బొరుసు) భాగాన గ్రీక్ దేవతల చిత్రాలు ఉండేవి. కాని అజిలైసెస్ పాలనలో మొట్టమొదటగా భారతీయ దేవతా చిత్రాలు ముద్రించడాన్ని ప్రవేశపెట్టారు. నాణేల వెనుక వైపు అభిషేక లక్ష్మి చిత్రాన్ని ముద్రించారు. లక్ష్మీదేవి బొమ్మ, ఆమెకు ఎదురుగా రెండు కాడలు, ఆకులు ఉన్న తామర పుష్పం, రెండువైపుల శిరస్సు మీద నీరు చల్లుతూ ఉండే ఏనుగు బొమ్మలు చిత్రించి, నాణేలు ముద్రించారు.

BRAOU

; శక క్షాత్రపులు కూడ నాణేలు ముద్రించారు. క్షాత్రపులైన రాజుల, నహపాన, చష్టనలు ఇండో గ్రీక్ నాణేలను పోలివుండే నాణేలు ముద్రించి, భారతదేశంలో ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో చలామణిలోకి తెచ్చారు. శకక్షాత్రపుల నాణేలు అధిక సంఖ్యలో లేవు. అయినప్పటికీ వారి నాణేలు ఆ కాలంలో వాడుకలో ఉండేవి.

14.11.3.3 పహ్లవుల నాణేలు

పహ్లవ రాజైన మొదటి గొండోఫర్నెస్ భారతదేశంలో కొన్ని ప్రాంతాలను జయించి, ఆ ప్రాంతాల్లో తను ముద్రించిన నాణేలు వాడుకలోకి తెచ్చాడు. ఆ నాణేల పైపు (బొమ్మ) భాగాన గుర్రంమీద స్వారి చేస్తున్న రాజు బొమ్మ, లేదా రాజు బొమ్మ, లేదా సింహాసనం మీద ఆ సీనుడై ఉన్న రాజు బొమ్మను ముద్రించారు. నాణేల వెనుక వైపు (బొరుసు) భాగాన గ్రీక్ దేవతలైన జ్యూస్, నైక్, పల్లాస్ బొమ్మలు చిత్రించి, ముద్రించారు. గొండోఫర్నెస్ తర్వాత పాలించిన పహ్లవ రాజులు అబ్దగాసెస్, అర్తాగ్నెస్, పకోరెస్, రెండవ గొండోఫర్నెస్, అర్కాసెస్, సనబరెస్ కూడ నాణేలను ముద్రించి, చలామణిలోకి తెచ్చారు.

14.19.3.4 కుషాణుల నాణేలు

కుషాణ వంశ రాజుల్లో మొదటి వాడైన కుజుల కాడ్ఫయిసెస్ రాగి నాణేలను ముద్రించాడు. ఆ నాణేల మీద రాజు బొమ్మ ఉండేది. నాణేలు అన్నింటి మీద శాసనాలు రెండు భాషల్లో ఉండేవి. అవి గ్రీకు లిపి, గ్రీకు భాషలోను, ఖరోష్ఠి లిపి, ప్రాకృత భాషలోను ఉండేవి.

వేమా కాడ్ఫయిసెస్ పాలనలో బంగారం, రాగి నాణేలను ముద్రించారు. అంతేకాక విదేశీ వ్యాపారం ఫలితంగా భారతదేశంలో ప్రవేశించిన రోమన్ బంగారు నాణేల ప్రభావం ఫలితంగా, వేమా కాడ్ఫయిసెస్ మొట్టమొదటగా బంగారు నాణేలను కూడా ముంద్రించాడు. ఆ బంగారు నాణేలు మూడు రకాలుగా ఉండేవి. అవి (1) రెట్టింపు దినార, (2) దినార, (3) పాతిక దినార. రెండు భాషల్లో ఉండే శాసనాలు, నాణేల మీద ముద్రించిన రాజుల్లో వేమా కాడ్ఫయిసెస్ చివరి వాడు.

మొదటి కనిష్కుడు బంగారం, రాగి నాణేలను ముద్రించాడు. ఆ నాణెలు అన్నింటి మీద పైవైపు (బొమ్మ) భాగాన ఒకే రకమైన రాజు బొమ్మను ముద్రించారు. రాజు నిలుచొని, పొడువైన కోటు ధరించి, ఉత్తరీయాన్ని ఛాతికి ఎదురుగా పట్టుకొని, తల మీద గుండ్రని టోపీ పెట్టుకొని, ఎడమ చేతిలో బల్లెం పట్టుకొని, అగ్నిగుండం ముందు యాగం చేస్తున్నట్లుగా చిత్రించి, ముద్రించారు. నాణేలు వెనుక వైపు (బొరుసు) భాగాన గ్రీక్ పేర్లతో 'హెలియోఫ్', 'సలీన్', 'హెఫాయిస్టోస్' అనే దేవతల చిత్రాలను ముద్రించడం ప్రారంభించారు. అంతేగాక నాణేల వెనుకవైపు పర్షియన్ల దేవుళ్ళు, దేవతలు అయిన 'మిహిర' లేక 'మిత్ర' (సూర్యుడు), 'మావో'(చంద్రుడు), 'ఒవాడో', ('వాయు దేవుడు') 'అర్ధ్షో'(అగ్ని), 'మాజ్డా' (జొరాస్ట్రియన్ల మత దేవతల్లో ప్రథముడు), 'అర్డోక్షో'(లక్ష్మీదేవిని పోలిన దేవత) మొదలైనవారి చిత్రాలను కూడ ముద్రించారు. నాణేల మీద శాసనాలు ముద్రించే విషయంలో రెండు భాషలు ఉపయోగించే పద్ధతిని నిలిపివేశారు. గ్రీక్ లిపి, గ్రీక్ భాషలో మాత్రమే శాసనాలు ఉండేవి. కాని తర్వాత కాలంలో నాణేల వెనుకవైపు (బొరుసు) భాగన మధ్య పర్షియా (బ్యాక్ట్రియన్) లేక 'ఖోటనీసు శక' అనే కొత్త భాషను ప్రవేశపెట్టారు. ఆ నాణేల మీద 'షావోనానో షావో కనెష్కి కొషానో' అని శాసనం ఉండేది.

BRAOU

హువిష్కుని పాలనలో నాణేల పైవైపు (బొమ్మ) భాగన కొత్తరకం బొమ్మను ప్రవేశ పెట్టారు. రాజు బొమ్మ ఎడం వైపు అభిముఖంగా చిత్రించారు. చాలా అరుదుగా మాత్రమే నాణేల మీద రాజు బొమ్మ కుడివైపు అభిముఖంగా ముద్రించారు. రాజు రత్నాభరణాలతో ఉన్న దుస్తులతోను, తలమీద ఎత్తుగా అలంకరింపబడిన శిరస్త్రాణంతోను. కుడిచేతిలో రాజదండం లేదా గద, ఎడమ చేతిలో శూలం ధరించి ఉన్నట్లుగా చిత్రించారు. నాణేల వెనుక వైపు (బొరుసు) భాగాన పర్షియన్ల దేవతలు, లేదా గ్రీక్, ఈజిప్ట్ దేవతలు, లేదా భారతీయ దేవతలైన శివుడు, ఉమ, కార్తికేయుల బొమ్మలను ముద్రించారు.

వాసుదేవుని పాలనలో నాణేల పైవైపు (బొమ్మ) భాగాన రాజు నిలుచొని అగ్నిగుండం దగ్గర యాగం చేస్తున్నట్లుగాను, రాజు చేతిలో త్రిశూలం ధరించినట్లు గాను, వెనుక వైపు (బొరుసు) భాగాన 'నాన' లేదా 'ఒయెషో' (శివుడు) దేవతల బొమ్మలు ముద్రించారు.

రెండని కనిష్కుని కాలంలో ముద్రించిన నాణేల పైవైపు (బొమ్మ) భాగాన రాజు బొమ్మ పైన పేర్కొన్న విధంగానే ఉండి, బ్రాహ్మి అక్షరాలు కూడ ఉన్నాయి. నాణేల వెనుక వైపు (బొరుసు) భాగాన 'ఒయోషో' (శివుడు) లేదా 'అర్ధోక్షో' బొమ్మ ఉంది.

14.20 సంగ్రహంగా

శాతవాహనుల కాలంలో ఉత్తర భారతదేశం విదేశీ రాజులైన ఇండో గ్రీకులు, శకులు, పహ్లవులు, కుషాణుల పాలనలో ఉండేది. దక్షిణ భారతదేశంలో అధిక భాగాన్ని పాలించిన శాతవాహనుల పాలనలో ఉండేది.

శాతవాహనుల పాలనలో వ్యవసాయం అభివృద్ధి చెందింది. రైతులకు భూముల మీద వ్యక్తిగత యాజమాన్య హక్కు ఉండేది. ప్రభుత్వ రెవిన్యూ విధానం సరళంగాను, ప్రజలకు అనుకూలంగాను ఉండేది. చేతివృత్తులవారు, వ్యాపారస్తులు వారి ప్రయోజనాలను సంరక్షించుకొనేందుకు శ్రేణులను ఏర్పాటు చేసుకొన్నారు. శ్రేణులు బ్యాంకుల్లాగ కూడా కార్యకలాపాలు నిర్వహిస్తూ, డిపాజిట్లు స్వీకరించి, ప్రజలకు స్వల్పవడ్డీకి రుణాలు ఇచ్చేవి. ఆకాలంలో బానిస వ్యవస్థ కూడా ఉండేది. శాతవాహనులు వెండి, సీసం, రాగి, పోటిన్ నాణేలను ముద్రించి చలామణిలోకి తెచ్చారు.

కుషాణుల పాలనలో ప్రజలు ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడి జీవించేవారు. రైతులు వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి, వ్యవసాయోత్పత్తిని పెంపొందించారు. నాటి విదేశీ పాలకులు వ్యవసాయ భూములకు నీటి పారుదల కలిగించే విషయంలో ప్రత్యేక శ్రద్ధను చూపేవారు. రెవిన్యూ విధానం పటిష్టంగాను, స్మృతికర్తల ధర్మసూత్రాలను అనుసరించి ఉండేది. రాజు స్వయంగానే ప్రభుత్వ ఆదాయ, వ్యయ వ్యవహారాలు చూసుకొనేవాడు. వ్యాపారం, పరిశ్రమ రంగాల్లో అధికంగా శ్రేణులు ఏర్పడ్డాయి. శ్రేణుల మీద ప్రభుత్వ నియంత్రణ ఉండేది కాదు. వ్యవసాయం, వృత్తి పనులు, వ్యాపార రంగాల్లో కార్మికులను నియోగించేవారు. వారికి ముందుగా నిర్ణయించిన జీత భత్యాలు ఉండేవి. దుర్భిక్షాలు వచ్చినప్పుడు ప్రభుత్వం ప్రజలను ఆదుకొనేందుకు సహాయ చర్యలు చేపట్టేది. ద్రవ్య వ్యవస్థలో బంగారం, వెండి, రాగి నాణేలు ముద్రించి చలామణిలోకి తెచ్చారు.

14.21 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. శాతవాహనుల కాలం నాటి ఆర్థిక పరిస్థితులను వివరించండి.
2. శాతవాహనుల పాలనలో వ్యవసాయ పరిస్థితులను వర్ణించండి.
3. కుషాణుల కాలం నాటి ఆర్థిక పరిస్థితులను చర్చించండి.

కుషాణుల పాలనలో వ్యవసాయ రంగ లక్షణాలు రాయండి.

కుషాణుల ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను అంచనా వేయండి.

. కుషాణుల పాలనలోని ద్రవ్య వ్యవస్థ ఎట్టిదో వివరించండి.

I - ఈక్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.

1. శ్రేణులు
2. రుణ పరపతి విధానం
3. పశుపోషణ
4. కార్మికులు
5. బానిస వ్యవస్థ
6. దుర్భిక్షాలు - ప్రభుత్వ విధానం
7. శాతవాహనుల నాణేలు
8. కుషాణుల నాణేలు
9. రోమ్ నాణేలు

14.22 ఉపయుక్త గ్రంథాలు

Chattopadhyaya, Bhaskar - **Kushana State and Indian Society**

Chetty, K.Ch. - **Social and Economic History of Andhradesa**

Das, D.R. - **Economic History of the Deccan from 1st to 6th Century A.D.**

Devahuti - **Kushanas**

Gopalachari, K - **Early History of Andhra Country**

Kumar, Baldev - **The Kushanas**

Majumdar, R.C. & Pusalker, A.D. (Ed) - **Age of Imperial Unity**

Narain, A.K. - **Indo-Greeks**

Prasad, Kameshwar - **Cities, Crafts and Commerce under the Kushanas**

Puri, B.N. - **India under the Kushanas**

Sarma, I.K. - **Coinage of the Satavahana**

Yazdani, G. (Ed) - **Early History of Deccan**

రామారావు. యమ్ - **శాతవాహన సంచిక**

సత్యనారాయణ. కె - **ఆంధ్రుల సంస్కృతి – చరిత్ర**

రచయిత : ఆచార్య బి.వసంతనయ్య

BRAOU

భాగం - 15 గుప్తుల కాలంలో ఆర్థిక పరిస్థితులు

విషయక్రమం

15.0 లక్ష్యాలు
15.1 పరిచయం
15.2 భూమి విధానం
- 15.2.1 భూమి యాజమాన్యం
- 15.2.2 భూముల వర్గీకరణ
- 15.2.3 భూమి కొలుదారీ విధానం
- 15.2.4 భూముల సర్వే
- 15.2.5 భూమి కొలతలు
- 15.2.6 భూదానాలు
- 15.2.7 భూముల అమ్మకం

15.3 శిస్తు విధానం
- 15.3.1 భూమి శిస్తు
- 15.3.2 ఇతర పన్నులు, ఆబాయాలు
- 15.3.3 ఫాహియాన్ కథనం

15.4 వ్యవసాయ పరిస్థితులు
- 15.4.1 పంటలు
- 15.4.2 దుర్భిక్షాలు
- 15.4.3 నీటి పారుదల
- 15.4.4 అడవులు, తోటలు
- 15.4.5 పశు పోషణ

15.5 కార్మికులు
- 15.5.1 బానిసలు
- 15.5.2 కూలి పనివారు
- 15.5.3 వెట్టి పనివారు

15.6 సామూహిక ఆర్థిక జీవన విధాన స్వభావం, లక్షణాలు
- 15.6.1 శ్రేణులు-సంస్థలు
- 15.6.2 భాగస్వామ్యం

15.7 ద్రవ్య విధానం
- 15.7.1 ద్రవ్య విధానం, మారకం
- 15.7.2 బంగారు నాణేలు
- 15.7.3 వెండి నాణేలు
- 15.7.4 రాగి నాణేలు

15.8 సంగ్రహంగా
15.9 పరీక్ష నమూనా ప్రశ్నలు
15.10 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

15.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగలగాలి

★ గుప్తుల కాలం నాటి ఆర్థిక పరిస్థితుల్లో భూమి విధానం, వ్యవసాయం, పశు పోషణ

★ గుప్తుల కాలంనాటి శిస్తు విధానం తీరుతెన్నులు

★ కార్మికులైన బానిసలు, కూలీలు, వెట్టిచనివారల జీవన స్థితిగతులు

★ గుప్తుల కాలంలో చెలామణీలో ఉన్న ద్రవ్య విధాన స్వరూపం

15.1 పరిచయం

భారతదేశంలో గుప్తుల కాలం స్వర్ణయుగంగా భావింపబడుతూంది. ఆ కాలంలో పటిష్టమైన, ప్రజా సంక్షేమం కోసం పాటుపడే ప్రభుత్వం ఉండేది. ప్రజలు సుఖశాంతులతో, భోగ భాగ్యాలతో తులతూగేవారు. మధ్యరాజ్యం (మగధ)లో ప్రజలు అధిక సంఖ్యలో ఉండేవారని, వారు సుఖసంతోషాలతో ఉండేవారని చైనా యాత్రికుడు ఫాహియాన్ కథనంలో వర్ణింపబడింది. దీన్ని బట్టి, గుప్త సామ్రాజ్యంలోని ఇతర ప్రాంతాల కంటే, మగధ, దాని పరిసర ప్రాంతాలు అన్ని వనరులతో, ఆర్థికంగా అభివృద్ధి చెందాయని తెలుస్తుంది.

15.2 భూమి విధానం

గుప్తుల కాలంలో వ్యవసాయం కొరకు భూమికి గిరాకీ ఎక్కువగా ఉండేది. ప్రభుత్వానికి ఆర్థిక మూలాధారం వ్యవసాయం. ఆ వ్యవస్థకు ప్రాథమిక విభాగం గ్రామం

15.2.1 భూమి యాజమాన్యం

ప్రాచీన భారతదేశంలో భూమి యాజమాన్య స్వభావం గురించి చరిత్రకారుల్లో విభిన్న అభిప్రాయాలున్నాయి. స్మృతి గ్రంథాల్లో చెప్పబడిన విషయాల ఆధారంగా, భూమి అంతా రాజుకు చెందింది అనే వాదం ఉంది. కాని దీనికి భిన్నంగా, వ్యక్తిగత ఆస్తి హక్కుకు గుర్తింపు ఉండటమే గాక, దానికి పూచీ (గ్యారంటీ) ఉండేవనటానికి తగిన సాక్ష్యాధారాలున్నాయి.

గుప్తుల కాలంలో వ్యక్తికి, సమిష్టి కుటుంబానికి, లేదా గ్రామానికి భూమిపై యాజమాన్యం ఉండేదని శాసనాల వల్ల తెలుస్తుంది. రైతులకు రక్షిత భూస్వామ్య హక్కులు ఉండేవి. వాస్తవంగా వారికి యాజమాన్య హక్కులు అనేకం ఉండేవి. అటువంటి హక్కులు వ్యక్తిగత యాజమాన్య హక్కులేగాక, ఇతర ఆస్తి హక్కులు కూడా ఉండేవి. కొన్నిరకాల భూములు రాజుకు చెంది ఉండేవి. వాటిలో సాగు చేయకుండా వదిలేసిన భూములు, నిక్షిప్త నిధులుండే భూములున్నాయి.

B R A O U

మనుధర్మ శాస్త్రం ప్రకారం, భూమి స్వాధీనదారుడే ఆ భూమికి యజమాని. కాని స్మృతి కర్తలైన యాజ్ఞవల్క్యుడు, బృహస్పతి, నారదుల రచనల వల్ల, యాజమాన్య హక్కు కొరకు స్పష్టమైన అధికార పత్రం అవసరమని తెలుస్తుంది.

బృహస్పతి, నారద ధర్మశాస్త్రాల్లో మరొక రకమైన ఆస్తి యాజమాన్యం గురించి ఉంది. ప్రతిఘటన, ఆటంకం లేకుండా ఎవరైతే భూమిని తన స్వాధీనంలో ఉంచుకొన్నారో, ఆ ఆస్తిపై అతనికే హక్కు ఉంటుంది.

న్యాయ సంబంధమైన ఆమోదం అవసరం కాబట్టి, ధర్మశాస్త్రవేత్తలు భూమి యాజమాన్యానికి అవసరమైన చట్టాలు, నిబంధనలను రచించారు. ఈ నిబంధనలు భూమి స్వాధీనదారుడి ప్రయోజనాలను సంరక్షిస్తూ, భవిష్యత్తులో ఆ ఆస్తిపై న్యాయమైన అతని హక్కుకు ఎటువంటి ప్రమాదం లేకుండా కాపాడాయి. భూమిపై యాజమాన్యానికి తామ్ర పత్రాన్ని చట్టబద్ధమైన సాక్ష్యంగా పరిగణించేవారని ధర్మాదిత్యుని శాసనం ద్వారా తెలుస్తుంది.

గుప్తుల కాలంలో సర్వాధికారం రాజుకే చెంది ఉండేది. చట్టబద్ధంగా వ్యక్తిసరమైన భూమి యాజమాన్యం రాజు నుండి సంక్రమించి, అతని అంతిమ అధికారానికి లోబడి ఉండేది. ప్రభుత్వానికి పన్నులు కట్టినంత కాలం వ్యక్తి తన ఆస్తిని అనుభవించే వీలుండేది. అంటే వ్యవసాయ ఉత్పత్తులు కౌలుదారీ ఫలితంగా వచ్చే అద్దె రూపంగా పరిగణింపబడేవి.

భూమి కంతా రాజే యజమాని అనే భావం తొలి న్యాయ గ్రంథాల్లోను, విదేశీ రచనల్లోను కనపడుతుంది. భూమికి అంతిమ అధిపతి రాజు అని, కాబట్టి భూమిలో లభించే నిధులు, ఖనిజాల్లో భాగానిపై అతనికి హక్కు ఉందని మనుధర్మశాస్త్రంలో చెప్పబడింది. 'భారతదేశమంతా రాజు ఆస్తి, ఏ ఇతర వ్యక్తికి భూమిని సొంతం చేసుకొనే అనుమతి లేదు' అని మెగస్తనీస్ తెలియజేశాడు.

రాజు భూమికంతా యజమాని అనే విషయం గుప్తుల కాలం నాటి అనేక శాసనాలు ధృవీకరిస్తాయి. ఈ శాసనాల్లో రాజు ఒక గ్రామం, గ్రామంలోభాగం, లేదా కొంత భూమిని దానంగా ఇచ్చినట్లుగా ఉంది. గ్రామానికి రాజు అంతిమ యాజమానిగా పరిగణించేవారు. గుప్తుల కాలంలో పన్నులు, ఇతర ఆదాయాలు రాజు అనుభవిస్తూ ఉండడాన్ని బట్టి, రాజే భూమికంతా యజమాని అనే విషయం ధృవపడుతుంది.

ప్రజలు భూమిని కొనుగోలు చేయాలన్నా, లేదా దానం చేయాలన్నా, ప్రభుత్వం నుండి అనుమతి పొందవలసి ఉండేది. దానికోసం వారు స్థానిక అధికారుల ద్వారా, ప్రభుత్వానికి ధరఖాస్తు పెట్టుకొనేవారు.

గ్రామాలకు భూమిపై సామూహిక యాజమాన్యం ఉండేదని ఆర్. జి. బాసక్, ఆర్. సి. మజుందార్, ఏ. యస్. ఆల్టేకర్ మొదలగు చరిత్రకారుల అభిప్రాయం. ఆర్. సి. మజుందార్ ఇలా వివరించాడు. గ్రామ సంఘాలు తాజాగా సుగమం చేయబడిన వానిలో సహా గ్రామానికి చెందిన అన్ని భూములకు సంపూర్ణ యజమానులు. ప్రభుత్వానికి రావలసిన మొత్తం శిస్తుకు వారిదే బాధ్యత. ఒకవేళ భూమి యజమాని తాను కట్టవలసిన శిస్తు చెల్లించకపోతే, ఆ భూమి గ్రామ సంఘం ఆస్తిగా పరిగణింపబడేది. ప్రభుత్వానికి రావలసిన శిస్తులు వసూలు చేసుకొనేందుకు ఆ భూమిని అమ్మే హక్కు గ్రామ సంఘానికి ఉండేది.

గుప్తుల కాలంలో భూమి అంతా వ్యక్తి యాజమాన్యంలో ఉండేదని ఏ. యస్. ఆల్టేకర్, కె. పి. జయస్వాల్ అభిప్రాయ పడ్డారు. ఏ. యస్. ఆల్టేకర్ ఇలా వివరించాడు. "వ్యవసాయ భూమి యాజమాన్యం వ్యక్తికి, లేదా కుటుంబానికి ఉండేది. కాని ప్రభుత్వానికి కాదు". భూమిపై యాజమాన్యపు హక్కు రాజుకు ఉండేదనే వాదనను కె. పి. జయస్వాల్ ఖండించారు.

BRAOU

15.2.2 భూముల వర్గీకరణ

గుప్తుల కాలం నాటి భూములను ఆర్థికపరంగా ఈ క్రింద పేర్కొన్న రకాలుగా ఎ్గ ఏషచ్చు.

1. వ్యవసాయ యోగ్య భూమి.
2. బంజరు భూమి
3. నివాస యోగ్య భూమి
4. పచ్చిక భూమి
5. ఉద్యాన వన భూమి.
6. అటవీ భూమి.

అమరకోశంలో ఈ క్రింద పేర్కొనబడిన 12 రకాల భూములు వర్ణింపబడి ఉన్నాయి.

1. 'ఉర్వరా' (సారవంతమైన భూమి)
2. 'ఊషర' (బంజరు భూమి)
3. 'మరు' (ఎడారి భూమి)
4. 'అప్రహత' (సాగుచేయని భూమి)
5. 'శాద్వల' (పచ్చిక భూమి)
6. 'పంకిల' (అడుసు భూమి)
7. 'జలప్రాయం' 'అనుపం' (నీటిపారుదల గల భూమి)
8. 'కచ్ఛ' (నీటికి అనుకొని ఉన్న భూమి)
9. 'శర్కరా' (గులక రాళ్ళు, మున్నపు రాళ్ళతో నిండిన భూమి)
10. 'శక్రావతి' (ఇసుక భూమి)
11. 'నదీ మాతృక' (సాగుకొరకు నది నుండి నీటి సదుపాయం గల భూమి)
12. 'దేవ మాతృక' (వర్షపు నీటితో సాగయ్యే భూమి)

గుప్తుల కాలం నాటి శాసనాల్లో ఈ క్రింద పేర్కొన్న రకాల భూములు పేర్కొనబడి ఉన్నాయి.

BRAOU

1. 'క్షేత్ర' (వ్యవసాయ భూమి)

2. 'ఖిల' (పూర్వం సాగుచేయబడి, ప్రస్తుతం సాగుచేయబడని భూమి)

3. 'అప్రహత' (ఇప్పటి వరకు సాగుచేయబడని భూమి)

4. 'అప్రదా' (సాగుచేయబడని భూమి)

5. 'వాస్తు' (నివాసయోగ్యమైన భూమి)

6. 'గోపథ సరః (పశువుల మేతకు ఉపయోగపడే పచ్చిక భూమి)

15.2.3 భూమి కొలుదారీ విధానం

గుప్తుల కాలం నాటి తామ్రపత్ర శాసనాలు మతసంబంధ కారణాల వల్ల భూమిని దానం చేసినట్లుగా ఉండే ప్రమాణ పత్రాలు. ఆ శాసనాలు ఈ క్రింది కొలుదారీ పద్ధతులను పేర్కొన్నాయి.

1. నీవి ధర్మం

క్రీ.శ.433-434 నాటి దామోదర్ పూర్ తామ్రపత్ర శాసనంలో, కర్పటిక అనే పేరుగల బ్రాహ్మణుడు వ్యవసాయ యోగ్యమైన భూమిని ఆ ప్రాంతంలో ఉన్న ధరకు కొనుటకు స్థానిక ప్రభుత్వానికి ఒక ధరకాస్తు పెట్టుకొన్నట్లుగా ఉంది. నీవి ధర్మం ప్రకారం, ఆ భూమిని మంజూరు చేయమని అతడు ప్రార్థించాడు.

కె.పి. జయస్వాల్ అభిప్రాయం ప్రకారం'నీవి' అనగా ప్రమాణ పత్రం, లేదా వార్త అని అర్థం. అమరకోశం ద్వారా నీవి, పరిపణ, మూలధన అనే పదాలకు ఒకే అర్థం ఉండేదని తెలుస్తుంది. నీవి, మూల ద్రవ్యం అనే పదాలకు ఒకే అర్థం అని హేమచంద్రుని గ్రంథంలో వివరింపబడి ఉంది.

భారతీయ శాసనాల ప్రకారం నీవి అంటే నిర్ణీత పెట్టుబడి మీద వచ్చే వడ్డీతో పెట్టే ఖర్చు అని అర్థం. కాబట్టి నీవి ధర్మం ప్రకారం, భూమికాని, డబ్బుకాని దానం ఇవ్వడం అంటే ఆ దానం చిరకాలం కొనసాగించే షరతు మీద ఉండేది. దాని ప్రతిగ్రహీతకు నిర్దిష్టమైన ప్రయోజనాలపై వడ్డీ ఖర్చుపెట్టేందుకు మాత్రమే వీలుండేది. దామోదర్ పూర్ తామ్రపత్ర శాసనంలో, 'సూర్యచంద్రాదులు ఉన్నంత వరకు భూమిని అనుభవింపవచ్చు' అని పేర్కొనబడి ఉంది. అందువల్ల ఈ శాసన సాక్ష్యాధారం పై అభిప్రాయాన్ని ధృవపరుస్తుంది.

ఈ రకమైన దానాన్ని ప్రతిగ్రహీత చిరకాలం కొనసాగించాలని, దానిపై వచ్చే ఆదాయాన్ని మాత్రమే అతడు ఉపయోగించవచ్చని ఎస్.కె. మైత్రి తెలిపారు.

2. అక్షయ నీవి ధర్మం

'అక్షయ నీవి ధర్మం' అంటే శాశ్వతమైన పత్రం' అని కె.పి. జయస్వాల్ అభిప్రాయం. దానం శాశ్వతమైంది అనే విషయం నొక్కి చెప్పడం కోసం నీవి ముందు అక్షయ పదం చేర్చేవారని, 'అక్షయ' అంటే శాబ్దికంగా అవినాశనమైన లేక శాశ్వతమైన అనే అర్థంగా ఎస్.కె. మైత్రి తెలిపారు.

BRAOU

పహర్ పూర్, బైగ్రాం శాసనాల్లో అక్షయ నీవి ధర్మం అని పేర్కొనబడి ఉండటమేగాక, 'శాశ్వతా-చంద్రార్క-తారక' అని కూడ పేర్కొనబడి ఉంది.

3. నీవి ధర్మ అక్షయ

నీవి ధర్మ అక్షయ గురించి ఎస్.కె. మైత్రీ వేరొక విధంగా వివరిస్తూ,'నీవి ధర్మ-క్షయేణ' అని కాక,'నీవి ధర్మ-అ-క్షయేణ' అని చదవాలన్నారు. అతడు దాన్ని 'అవినాశనమైన నీవి ధర్మ ఆచారం ప్రకారం' అని అనువదించారు.

4. అప్రద ధర్మం

'అప్రద'కు శాబ్దికంగా న-ప్రద అని అర్థం. అంటే అన్యాక్రాంతం చేయలేనిది, లేక ఫలమివ్వనిది అని అర్థం . అప్రద ధర్మం ప్రకారం భూమిని దానం చేయడం అంటే, ప్రతిగ్రహీతకు ఆ ఆస్తిని అనుభవించుటకు అన్ని హక్కులు ఉండటం. కాని అతనికి ఆ భూమిని తిరిగి దానం చేసే హక్కు లేదు. దానిపై వచ్చే ఆదాయం, వడ్డీ మాత్రమే అనుభవింపవచ్చు. అంటే నీవీ ధర్మంలో లాగే మొదట ఇచ్చిన దానం తగ్గించడం కాని, నాశనం కాని చేయక, దాన్ని శాశ్వతంగా పరిరక్షించవలసి ఉంటుంది.

5. 'అప్రదక్షయ నీవి ధర్మం' లేక 'అప్రదక్షయ నీవి మర్యాద'

క్రీ.శ.448-449 నాటి కుమార గుప్తుని దామోదర్ పూర్ తామ్రపత్ర శాసనంలో'అప్రదాక్షయ నీవి' అని పేర్కొనబడి ఉంది. ఈ దరఖాస్తుదారుడు బదలాయింపు షరతు రద్దుమీద లేదా దాన్ని పొడిగించడం మీద భూమిని కోరుకొన్నాడో లేడో అనే విషయం సందేహాస్పదమే. అప్రదక్షయ అనే పదాన్ని పై రెండు విధాలుగా వ్యాఖ్యానింపవచ్చు అని ఆర్.జి. బాసక్ అభిప్రాయ పడ్డారు.

నీవి ధర్మంలో లాగే అప్రదక్షయ నీవి ధర్మంలో కూడ ప్రతిగ్రహీతకు శాశ్వతంగా దానం అనుభవించే హక్కు ఉంటుంది. కాని అతనికి దాన్ని అన్యాక్రాంతం, నాశనం, లేదా తగ్గించే అధికారం లేదని యు.ఎన్. ఘోషాల్, ఎస్.కె. మైత్రీ తెలియజేశారు.

6. 'భూమిచ్ఛిద్ర న్యాయం'

గుప్తుల కాలం నాటి అనేక శాసనాలు భూమిచ్ఛిద్ర న్యాయాన్ని గూర్చి పేర్కొన్నాయి. భూమిచ్ఛిద్ర న్యాయం అంటే "భూమిలోని గుంటలు శాశ్వతమైనవి గాక, కాలక్రమేణా వాటి పూడ్చివేతకు సంబంధించింది" అని ఆర్.జి.భండార్కర్ అభిప్రాయం, భూమిచ్ఛిద్ర న్యాయం ప్రకారం ఒక గ్రామం లేక అటువంటిది ఇవ్వబడింది అంటే , దాని ఉపకరణాలు, ఉత్పత్తి హక్కులు మొదలైన వాటితో సహా అది ఇవ్వబడింది అని అర్థం అని బుహ్లర్ తెలిపారు.

భూమిచ్ఛిద్ర భూములు అనేవి వ్యవసాయ యోగ్యం కాని బంజరు భూములు అని కౌటిల్యుని అర్థశాస్త్రం పేర్కొంది. 'చ్ఛిద్ర' అంటే వ్యవసాయ యోగ్యమైన భూములు ('భూమి చ్ఛిద్రం-కృష్యయోగ్య') అని 'యాదవ ప్రకాశ' తెలుపుతుంది.'దున్నుటకు లేదా వ్యవసాయానికి అనుకూలమైన భూములు భూమిచ్ఛిద్ర భూములు' అని ఫ్లీట్ పేర్కొన్నారు.

"భూమిచ్ఛిద్ర న్యాయం అంటే, కౌలుదార్లు నిర్మానుష్య ప్రదేశాల్లోను, అడవుల్లోను భూములను అస్థిరంగా కలిగి ఉండటం. ఆ భూముల నుండి కౌలుదార్లను తన ఇష్టానుసారం బయటకు పంపే అధికారం రాజుకు ఉండేది' అని బార్నెట్ వివరించారు.

BRAOU

"భూమిచ్ఛిద్ర న్యాయం శాశ్వత భూమి కౌలుదారీ పద్ధతిని స్పష్టంగా సూచిస్తుంది. ఈ నియమంలో దానం చేసిన ఆస్తిని ఒక తరం నుండి మరొక తరానికి స్వేచ్ఛగా స్వాధీనం చేయవచ్చు" అని ఎస్.కె. మైత్రి తెలిపారు.

పైన చెప్పబడిన విశ్లేషణల వల్ల, నీవిధర్మం వంటి కౌలుదారీ విధానం కనీసం గుప్తుల కాలం నుండి ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో అమల్లో ఉండేదని తెలుస్తుంది. కాని మిగిలిన అయిదు భూముల కౌలుదారీ విధానాలు బెంగాల్లో లభించిన శాసనాల్లో తరచుగా పేర్కొనబడినందు వల్ల, అవి బహుశా గుప్త సామ్రాజ్యం తూర్పు భాగంలో అమల్లో ఉండేవని తెలుస్తుంది.

15.2.4 భూముల సర్వే

గుప్త సామ్రాజ్యంలో స్థిరమైన వ్యవసాయాభివృద్ధి, ప్రజల సౌభాగ్యం ఫలితంగా భూములకు గిరాకీ హెచ్చుగా ఉండేది. దాని ఫలితంగా, సరైన భూమి హద్దుల గుర్తులు, కొలతలు నిర్వహించేందుకు చాలా జాగ్రత్త తీసుకొనేవారు. గ్రామాల సరిహద్దులు, గ్రామాల్లోని స్థలాల హద్దులకు సంబంధించి, సక్రమమైన రికార్డులు ఉండేవి.

భూముల సర్వే, కొలతలు, భూమిశిస్తులు మొదలగు వాటికి సంబంధించి ఒక ప్రభుత్వ శాఖ ఉండేదని, ఆ శాఖలో 'పుస్తపాలురు' అనే అధికారులు ఉండేవారని, రికార్డులను సరిగా ఉంచటం వారి పని అని గుప్తుల శాసనాల ద్వారా తెలుస్తుంది. వారు అన్ని భూముల లావాదేవీలు జాగ్రత్తగా రికార్డు చేసేవారు. ఆర్థిక సరిపాలనకు వారు బాధ్యులు.

ప్రభావతి గుప్తకు చెందిన 'పూనే' తామ్రపత్ర శాసనంలో దానం చేయబడిన నాలుగు గ్రామాల సరిహద్దులు నిర్దిష్టంగా పేర్కొనబడి ఉన్నాయి. కొన్ని సమయాల్లో గ్రామానికి అన్ని వైపులా హద్దులను నిర్ణయించి, వాటికి గుర్తుగా కందకాలు వేసేవారు. మిగిలిన సందర్భాల్లో రెండు గ్రామాల మధ్య, లేదా రెండు స్థలాల మధ్య సరిహద్దు స్తంభాలు ఏర్పాటు చేసేవారు. నిర్ణయించిన స్థానం నిర్ధారించేందుకు వీలుగా సంబంధిత గ్రామాల సరిహద్దులు, పరిసర గ్రామాలకు చెందిన వివరాలు విపులంగా రికార్డు చేసేవారు.

ప్రతి ఒక్క స్థల నిర్ధారణ ప్రదేశం, దాని సరిహద్దులు సూక్ష్మంగా, సవివరంగా రికార్డుల్లో భద్రపర్చేవారు. స్థానికంగా ఉన్న పెద్దలు, రికార్డులు భద్రపర్చేవారు. ఆ స్థలాలకు గుర్తులు పెట్టి కొలిచేవారు. కొన్ని గ్రామాల విషయంలో మాత్రం వీటి సరిహద్దులు సహజంగా లేదా కృత్రిమంగా ఉన్న అడ్డులే అయినందువల్ల, పై వివరాల అవసరం లేకపోయింది.

'మల్లసురాల్' తామ్రపత్ర శాసనంలో 'విజయసేనుడు 8 కుల్యవాపల భూమిని వత్సస్వామికి దానం ఇచ్చినట్లుగా' పేర్కొనబడింది. ఆ భూమి వర్ధమాన భుక్తిలో వక్కట్టక వీధిలోని వెత్రకర్త గ్రామంలో ఉండేది. దానికి తూర్పున, దక్షిణాన గోధ గ్రామం, ఉత్తరాన వటవల్లక అగ్రహారం, పడమర వైపు ఆమ్రగర్తిక ఉండేవి. గుర్తుకోసం ఆ భూమి చుట్టూ కొయ్యగూటాలు పాతి పెట్టేవారు. కొన్ని సందర్భాల్లో భూమికి నాలుగు వైపులా ఊక, బొగ్గు, గుంటలతో సరిహద్దులను నిర్ణయించేవారు. ('ధిర-కాల-స్థాయి-తుషాంగార్-ఆదీనా(0) చిహ్నాయి-చాతుర్దిశో నియమ్య దాస్యత్').

15.2.5 భూమి కొలతలు

గుప్తుల శాసనాల్లో చాలా వాటిలో 'హస్తం' లేక ఘనపరిమాణం పేర్కొనబడి ఉంది. హస్తం అనేది సేటి 45 సెం.మీ.కి సమానం. భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ఈ కొలత ఇప్పటికీ వాడుకలో ఉంది.

'అష్టక-నవక-నలాభ్యాం అపవింధ్య' (8,9 నిడివిగల రెల్లు కొట్టంతో కొలవబడిన) అనేది నాడు వాడుకలో ఉన్న

మరొక కొలత అని బెంగాల్‌లో దొరికిన అనేక గుప్తుల కాలం నాటి శాసనాల వల్ల తెలుస్తుంది. బెంగాల్, అస్సాంలలో ఘనపరిమాణాల్లో ('నలలు') నిర్ణయింపబడిన పాడవు గల రెల్లు గొట్టాలతో భూమిని కొలిచే సద్ధతి ఇప్పుడు వాడుకలో ఉందని, 'నల' అనే పదంతో కలిపి షటిక, 'అష్టక', 'నవక' అనేవి 6,8,9 ఘనపరిమాణం గల కాడలుగా చెప్పవచ్చని దీక్షిత్ వివరించారు. ఈ అభిప్రాయాన్ని డి.సి. సర్కార్ కూడ బలపర్చారు. గతంలో నలలోని ఘనపరిమాణాల సంఖ్య 5 నుండి 16 వరకు విభిన్న రకాలుగా ఉండేదని, 'అష్టక-నవక-నలాభ్యాం అపనింధ్య' అంటే 8 రెల్లు గొట్టాల వెడల్పు, 9 రెల్లు గొట్టాల పాడవు గల భూమి అని పార్జిటర్ సూచించారు. 'పాడవు కొలిచేదానికి 9 ఘనపరిమాణాలు గల 'నలం', వెడల్పు కొలిచేదానికి 8 ఘనపరిమాణాలు గల 'నలం' వాడుకలో ఉండేవి' అని బి.సి. సేన్ తెలిపారు.

గుప్త సామ్రాజ్యంలో తూర్పు భాగాన ఆధవాప, ద్రోణవాప, కుల్యవాప అను పరిమాణాలతో ఒక విశేషమైన భూమిని కొలిచే విధానం అమల్లో ఉండేది.

మనుధర్మశాస్త్ర వ్యాఖ్యానకర్త కుల్లూక భట్టు రచన ఆధారంగా, 'కుల్య' అంటే రెండు నాగళ్ళతో దున్న గలిగిన భూమికి సమానం అని తెలుస్తుంది. కాని 'కుల్య' అంటే చెరిగే బుట్ట, 8 ద్రోణాలు గల కొలత అనే అర్థాలు కూడ ఉన్నాయి. అలాగే 'వాప' అంటే వెదజల్లుట, విత్తులు చల్లుట అనే అర్థాలు కూడ ఉన్నాయి. 'కుల్యవాప' అంటే 8 నలాలు వెడల్పు, 9 నలాలు పాడవు గల ప్రదేశం అని, అది ఒక ఎకరానికి కొంచెం ఎక్కువగాను లేక 3 బిఘాలకు సమానం అని పార్జిటర్ వివరించారు. 'కూల్యవాప' అంటే ఒక ఎకరా కంటే కొంచెం ఎక్కువగా ఉంటుంది అనేదే ఆట్టేకర్ అభిప్రాయం కూడ.

కుల్లూక భట్టు, రఘునందుని శాస్త్రగ్రంథాలు, 'పంచాంగన తర్కరత్న', ఇంకా మధ్య యుగ బెంగాలీ ధర్మశాస్త్రాల ఆధారంగా, తొలికాలపు బెంగాల్‌లో కుల్య, ద్రోణ, ఆఢక అనే కొలతలు వాడుకలో ఉండేవని, అవి గుప్తుల శాసనాల్లోని 'కుల్యవాప', 'ద్రోణవాప', ఆఢవాపలకు సమానమని డి.సి. సర్కార్ వివరించారు. అంటే 1 'కుల్యవాప' 8 'ద్రోణవాప' లకు 32 'ఆఢవాప'లకు సమానం.

'పాటక' అనే మరొక కొలత కూడ ఆనాటి బెంగాల్‌లో వాడుకలో ఉండేది. క్రి.శ.507-508 నాటి వైన్య గుప్తుని 'గున్నైగర్' తామ్రపత్ర శాసనం ఒక గ్రామంలో 11 పాటకల భూమిని దానం ఇచ్చినట్లుగా పేర్కొంది. ఎస్.కె. మైత్రి అభిప్రాయం ప్రకారం, ఒక పాటకకు 40 ద్రోణవాపలు సమానం.

వాకాటక, మైత్రక రాజ్యాల్లో 'పాదావర్త' అనే కొలత వాడుకలో ఉండేది. భూములు, చెరువుల విస్తీర్ణానికి, సంబంధించి ఆ కొలతను నాటి శాసనాలు పేర్కొన్నాయి. 'పాదావర్త' నేటి ఒక అడుగు (30 సెం.మీ) కంటే పెద్దదని, దానికి అర్థం 'పాదం చుట్టూ తిప్పుట' అని, ఈ అర్థం పరిగణనలోకి తీసికొన్నట్లైతే, పాదావర్త 9 చదరపు అడుగుల వైశాల్యంతో సమానమని ఎస్.కె. మైత్రి తెలిపారు.

గుప్త సామ్రాజ్య ప్రతిష్ట వెలిగిపోతున్న రోజుల్లో కూడ ఉత్తర భారతదేశంలో కొలతలకు సంబంధించిన పద్ధతులు వివిధ ప్రాంతాల్లో విభిన్న రకాలుగా అమల్లో ఉండేవి. కాని స్థానిక ప్రమాణాలు కూడ వాడుకలో ఉండేవి. వాటినే ప్రభుత్వ అధికారులు కూడ అనుసరించేవారు. బహుశా గుప్త సామ్రాజ్యంలో కేంద్ర ప్రభుత్వం ఒకే ప్రామాణిక కొలత అన్ని ప్రాంతాల్లో అమలు చేసే ప్రయత్నంచేసి ఉండక పోవచ్చు లేదా అటువంటి ప్రయత్నం చేసి, అందులో విఫలం అయి ఉండవచ్చు అని చరిత్రకారుల అభిప్రాయం.

BRAOU

15.2.6 భూ దానాలు

గుప్తుల కాలంలో భూములు ఎక్కువగా బ్రాహ్మణులకు, బౌద్ధ, జైన సంఘాలకు దానంగా ఇచ్చేవారు. దానాలు ఎక్కువగా రాజు, రాణి, అధికారులు, ఇతరులు, లేదా శ్రేణులు మోక్షసాధనం కోసం చేసేవారు. కొన్ని సందర్భాల్లో భూములు మొదటకొని, తరువాత మత సంస్థలకు దానంగా ఇచ్చేవారు. బుధగుప్తుని దామోదర్‌పూర్ తామ్ర శాసనం బ్రాహ్మణులకు నివాసం కల్పించేందుకు భూమి కొన్నట్లుగా పేర్కొంది.

ప్రభుత్వ ఉన్నతాధికారుల అభ్యర్థనపై మత సంస్థలకు భూమి దానం చేసినట్లుగా, నాటి రాజుల శాసనాలు పేర్కొన్నాయి. గుప్త చక్రవర్తి వైన్యగుప్తుడు మహారాజ రుద్రదత్తుని అభ్యర్థనపై మహాయాన శాఖకు చెందిన సంఘానికి భూమి దానం చేశాడని గునైగర్ తామ్ర శాసనం పేర్కొంది. పలు సందర్భాల్లో రాజే ఏదో ఒక మతపరమైన లక్ష్యంతో భూమి దానం చేసేవాడు. సముద్రగుప్తుని గయ, నలంద తామ్రపత్ర శాసనాలు మొదలైన శాసనాలు ఆ కాలంలో రాజులు చేసిన దానాలకు సాక్ష్యాలు.

కొన్ని సందర్భాల్లో రాజోద్యోగులు భూములు దానం చేసేవారు. రెండవ చంద్రగుప్తుని పాలనలో ప్రభుత్వ అధికారి అమ్రాకరదేవుడు ఈశ్వరవాసక అనే గ్రామంలోని భూములు 'కాకనాదబోట' (సాంచి)లో ఆర్య సంఘానికి దానంగా ఇచ్చాడు.

భూములు దానం ఇవ్వడానికి కొన్ని పద్ధతులు ఉండేవి. దానం ఇచ్చే సందర్భంలో కొన్ని శిష్టాచారాలను అనుసరించేవారు. వాకాటక మహారాణి ప్రభావతి గుప్తకు చెందిన 'రిద్ధపూర్' తామ్ర శాసనం, మహారాజ శార్వనాధుని 'ఖో' తామ్ర శాసనం మొదలైన శాసనాల వల్ల భూములు దానం ఇచ్చిన తర్వాత ఆ విషయాన్ని బ్రాహ్మణులు, కుటుంబీకులు, రాజోద్యోగులు మొదలైన వారికి తెలియజేసేవారని నిశ్చయమౌతుంది.

కొన్ని సందర్భాల్లో ఒక ప్రత్యేక లక్ష్య సాధనకు లేదా మోక్షం కొరకు భూములను దానం చేసేవారు. దేవతల పూజా కార్యక్రమాలు నిర్వహించే నిమిత్తం అయ్యే ఖర్చుకు అవసరమయ్యే రాబడి కోసం భూములను దానం చేసేవారు. 'బలి' (పూలు, గంధం మొదలైనవి), 'చారు' (ఆహార ధాన్యాల్ని పాలతో కలిసి ఉడికించి జున్నులో కలిసినది), సత్రం, సుగంధాలు, కర్పూరం, హారాలు దీపాలు మొదలైనవాటి నిర్వహణ కోసం ఆ దానాలను చేసేవాళ్ళు.

దానశాసనాలు ఆర్థిక సంబంధమైన, ఇతర మినహాయింపులు, రక్షణలు ప్రత్యేకంగా పేర్కొన్నాయి. భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా గుప్తుల శాసనాల ద్వారా దాన ప్రతిగ్రహీతలు ప్రభుత్వంతోను, గ్రామీణులతోను ధర్మబద్ధంగా వ్యవహరించాలి అనే హెచ్చరిక ఉండేదని తెలుస్తుంది. అంతేగాక దాన ప్రతిగ్రహీతకు మినహాయింపు ఇవ్వబడిన పన్నులు మొదలైనవి, రాజు కొరకు ప్రత్యేకింపబడినవి, అతనికి బదలాయించబడినవి మొదలైన వాటి గురించి అన్ని వివరాలను రికార్డు చేసేవారు. ఇంకా గ్రామీణులు దాన ప్రతిగ్రహీతకు సాంప్రదాయబద్ధంగా ఎప్పే కప్పములు, యాజమాన్య హక్కులు ఇవ్వవలసి ఉండడమే గాక, అతనికి విధేయులై ఉండవలసి వచ్చేది.

వేయిమంది బ్రాహ్మణులకు భూములు దానం చేసే సందర్భంలో ఇవ్వబడిన మహారాజ ప్రవరసేనుని 'చమ్మక్' తామ్రపత్ర శాసనం ఇలా పేర్కొంది: దానికి (భూమికి) పన్నులు కట్టే పనిలేదు. సైనికులు కాని, ఛత్రధారులు కాని దానిలో ప్రవేశించరాదు. ఆవులు, ఎద్దుల వారసత్వ ఉత్పాదనపై కాని, పుష్కలంగా ఉండే పూలు, పాలపై కాని, పచ్చిక, చర్మాలు, బొగ్గుపైకాని, కొనుటకు దొరికే తడిఉప్పు లభ్యమయ్యే గనులపై కాని దానికి ఎలాంటి

BRAOU

హక్కు లేదు. వెట్టిపనికి సంబంధించిన అన్ని నిర్బంధాల నుండి దానికి విముక్తి. భూమిలోని నిధి నిక్షేపాలు దానికి చెందుతాయి.

గుప్తుల శాసనాలు జాగ్రత్తగా పరిశీలిస్తే, విశాలమైన భూములు పురోహితులకు లేదా మత సంబంధమైన సంస్థలకు ఇచ్చినట్లుగా విశదమౌతుంది. ఎక్కువ సందర్భాల్లో రాజుకు కట్టవలసిన రుణాల నుండి విముక్తితో, ఆ భూములు దానంగా ఇచ్చేవారు. దాని ఫలితంగా రాజులు, అధికారులు, పౌరులు మొదలైనవారి ఆదాయం వల్ల ప్రభుత్వ కోశాగారానికి చెప్పుకోదగ్గ నష్టం వచ్చి ఉండాలి.

15.2.7 భూముల అమ్మకం

గుప్తుల కాలంలో భూముల అమ్మకానికి సంబంధించిన ఆధార పత్రాలు దొరికాయి. ప్రతి సందర్భంలోను మతపరంగా దానం ఇచ్చేందుకు భూమిని కొనడం జరిగేది. కాని గుప్తుల కాలంనాటి లౌకిక సంబంధ విక్రయ పత్రం ఏదీ లభ్యం కాలేదు.

భూములు కొనుగోలు చేసేటప్పుడు ఒక స్పష్టమైన విధానం ఉండేది. మొదట కొనుగోలుదారుడు స్థానిక ప్రభుత్వానికి ఆ భూమిని కొనుగోలు చేసే కోరిక ఉన్నట్లు, తన అభిలాషకు గల ధ్యేయం, కారణం, అప్పటి ధర ప్రకారం, దానికి తగిన వెల చెల్లించేదానికి అతని సమ్మతి తెలియపరచాలి.

కొనుగోలుదారుడు ఆ జిల్లా అధికారిని, నగర పరిషత్‌ను కలిసేవాడు. పరిషత్ వారు 'పుస్తపాలుర'ను (రికార్డులు భద్రపరిచేవాడు) సంప్రదించేవారు. భూమిపై హక్కును ధృవీకరించుకొని, ఆ లావాదేవీకి విగతమైన ఆక్షేపణ లేదని, అంతేకాక ముఖ్యంగా ఆ దానం వల్ల ప్రభుత్వ కోశాగారానికి మరింత రాబడి వస్తుందని, దాని వల్ల వచ్చే మొత్తంలో అరో వంతు రాజుకు సంక్రమిస్తుందని ప్రకటించేవారు.

పుస్తపాలుర నుండి ఆమోదం లభించిన తర్వాత దరఖాస్తుదారుడు జిల్లా కార్యాలయానికి ఆ భూమికి నిర్ణయించిన ధరను కట్టేవాడు. ఆ భూమిని స్థానిక పరిషత్ వారు తనిఖీ చేసేవారు. ప్రామాణిక కొలత ఆధారంగా, ఆ భూమి హద్దులు నిర్ణయించేవారు. చివరగా స్థానిక పరిషత్ వారు విక్రయం జరిగినట్లు ప్రకటించి, ఆ భూమి బదలాయింపు ను రికార్డు చేసేవారు.

క్రీ.శ.478-479 నాటి పిపోర్‌ఫూర్ తామ్రపత్ర శాసనం వల్ల సాథశర్మ అనే పేరుగల బ్రాహ్మణుడు, అతని భార్య రామి పుండ్రవర్ధనలో జిల్లా అధికారిని, వర్తక శ్రేణి అధ్యక్షుడు నాయకత్వంలోని నగర పరిషత్‌ను కలిసి, స్థానికంగా అప్పుడు అమల్లో ఉన్న విధానాన్ని అనుసరించి, 3 దీనారాలకు 4 గ్రామాల్లో ఉన్న 11/2 కుల్యవాపల భూమిని ఇచ్చుటకు, పుష్ప ధూప దీపనైవేద్యాలతో అర్హతులకు పూజాకార్యక్రమాలను శాశ్వతంగా నిర్వహించడానికి ఆ భూమిని దానం చేసేదానికి, వటగోహాలిలో జైన మత గురువు విహారం దగ్గర సత్రం కట్టేదానికి అనుమతి ఇవ్వవలసిందిగా అభ్యర్థించినట్లు తెలుస్తుంది.

నేటి భారతదేశంలో ఉన్నట్లుగానే, గుప్తుల కాలంలో కూడ భూముల ధరలు వివిధ ప్రదేశాల్లో వివిధ రకాలుగా మారుతూ ఉండేవి. నేల స్వభావం, లక్షణం బట్టి, స్థానికంగా భూములకు గల గిరాకీ మీద భూముల ధరలు ఆధారపడి ఉండేవి.

BRAOU

గుప్తుల కాలంలో వాడుకలో ఉన్న భూముల ధరల విషయానికొస్తే, క్రీ.శ.443-444 లో బెంగాల్‌లో పుండ్రవర్ధన భుక్తి (రాష్ట్రం) లోని 'కోటి వర్ష' విషయ (జిల్లా) లో ఒక 'కుల్యవాప' విస్తీర్ణం గల నిర్మానుష్యమైన (అప్రద), సాగుచేయని (అప్రహత) భూమి అనగా అప్పుడు దున్ని సాగులోకి తీసికొనిరాని భూమి ధర మూడు దీనారాలు ఉండేది. పహార్‌పూర్ తామ్రపత్ర శాసనం వల్ల క్రీ.శ.478-479లో పుండ్ర క్షేత్రం (వ్యవసాయ యోగ్యమైన భూమి) ధర రెండు దీనారాలు ఉండేదని తెలుస్తుంది.

గుప్తుల శాసనాల వల్ల సుమారుగా 100 సంవత్సరాలు అంటే, క్రీ.శ.443-444 నుండి క్రీ.శ.533-534 వరకు బెంగాల్‌లో కోటివరష విషయ (జిల్లా)లోని కొంచె పెరుగుదల తప్ప, వివిధ రకాల లక్షణాలు గల భూముల ధరలు స్థిరంగా ఉండేవని తెలుస్తుంది. ఒక కుల్యవాప విస్తీర్ణం గల భూమి ధర పరిశీలిస్తే, ఖంజరు భూమి ధర రెండు దీనారాలు గాను, సాగుచేయని భూమి ధర మూడు దీనారాలు గాను, సాగుచేసే భూమి ధర నాలుగు దీనారాలు గాను ఉండేవి.

15.3 శిస్తు విధానం

గుప్తుల కాలంలో ప్రజల సంక్షేమం కోసం శిస్తులు వసూళ్ళు చేసి, రాజ కోశాగారంలో భద్రపర్చేవారు. ప్రభుత్వానికి కోశాగారం, సైన్యం మూలస్తంభాల వంటివిగా పరిగణించేవారు. గుప్తుల కాలంలో ప్రభుత్వ ఖజానా నిండుగా ఉండి, ఆ పరిస్థితి సౌభాగ్యంతో వర్ధిల్లుతున్న సమయాల్లో కొనసాగేది. రాజ్యానికి ప్రభుత్వ ఖజానా అత్యంత ముఖ్యమైన అంగంగా పరిగణించేవారు.

15.3.1 భూమి శిస్తు

గుప్తుల శాసనాల్లో అనేక సార్లు పేర్కొనబడిన విషయాలను బట్టి, ప్రభుత్వ ఖజానా సమృద్ధికి భూమిశిస్తు ద్వారా వచ్చే ఆదాయమే ముఖ్య ఆధారమని తెలుస్తుంది. ప్రజల ప్రాణాలను, వారి సంపదను రక్షించుటకు బదులుగా, ప్రజలకు భూముల నుండి వచ్చిన ఆదాయంలో ఆరో వంతు ప్రభుత్వం శిస్తుగా తీసుకొనేది.

'బుషులను అడ్డంకుల నుండి, సంపదను దొంగల నుండి రక్షించడం వల్ల ఆశ్రమాలు, వివిధ కులాలకు వచ్చే ఆదాయంలో ఆరోవంతు రాజుకు చెందేలు అని కాళిదాసు పేర్కొన్నాడు. కాళిదాసు వివరణను నారదుని కథనం ధృవపరుస్తుంది. సంటలో ఆరో భాగం భూమిశిస్తుగా ఉండేదని, ప్రజలకు రక్షణ కల్పించినందుకు బదులుగా రాజు దాన్ని తీసుకొనే వాడని నారదుడు పేర్కొన్నాడు.

భూమిశిస్తేకాక, కర, 'ఉద్రంగ', 'ఉపరికర', 'క్లుప్త', 'ఉపక్లుప్త', 'హిరణ్య', 'బలి' మొదలైన పన్నులు, వెట్టికూలి, పాడి పరిశ్రమ ఉత్పత్తులు కూడ ఉండేవి. రైతులు ఈ క్రింద పేర్కొన్న పన్నులను కట్టేవారని గుప్తుల కాలం నాటి శాసనాల వల్ల తెలుస్తుంది.

1. బలి : మత సంబంధమైన పన్ను లేదా ప్రజలు ఇచ్చే చందా, లేదా వెన్న, ధాన్యం, బియ్యం, సంద్లు, పూలు మొదలైన వాటితో దేవునికి నైవేద్యం ఇచ్చుట.

2. 'కర' : రైతులు నిర్ణిత సమయాల్లో కట్టవలసిన పన్ను.

BRAOU

3. 'ఉపరికర' : సొంత భూమి లేని వ్యవసాయదారులపై వేసే పన్ను (ఫ్లీట్) లేదా తాత్కాలిక కౌలుదార్లపై వేసే పన్ను (ఘోషాల్) లేదా పంటలో రాజు భాగం (బార్నెట్)

4. 'ఉద్రంగ' : పంటలో రాజు భాగం (ఫ్లీట్) లేదా శాశ్వత కౌలుదార్లపై వేసే పన్ను (ఘోషాల్, సర్కార్) లేదా అన్ని రకాల కౌలుదార్లపై వేసే అదనపు పన్ను (మైతీ)

5. 'ధాన్యం' : ధాన్యంలో భాగం

6. 'హిరణ్య' : కొన్ని పంటలకు ధన రూపంలో రాజు భాగం. లేదా బంగారం రూపంలో గాని లేదా బంగారు నాణేలుగా గాని కట్టే పన్ను.

15.3.2 ఇతర పన్నులు, ఆదాయాలు

గుప్తుల కాలంలో వ్యవసాయదారులే కాక, చేతిపనివారు కూడ ప్రభుత్వానికి పన్నులను చెల్లించే వారు. ఈ విధంగా ప్రభుత్వానికి భూమిశిస్తే కాక, ఇతర మార్గాల ద్వారా కూడా ఆదాయం వచ్చేది.

స్కందగుప్తుని శిలాస్తంభ శాసనం 'శుల్క' అనే పన్నును శౌల్కికుడు అనే అధికారి వసూలు చేసేవాడని పేర్కొంది. 'శౌల్కికుడు' అంటే దారి సుంకాలు, కస్టమ్స్ సుంకాల అధికారి అని ఫ్లీట్ అభిప్రాయం. శుల్కం అంటే , వర్తకులు ఒక పట్టణంలోకి లేదా ఓడరేవులోకి తెచ్చే సరుకులో రాజు భాగం అని ఎస్.కె. మైత్రీ వివరించారు.

గుప్తుల కాలంలో భారతదేశంలో సౌభాగ్య పరిస్థితులు నెలకొని ఉన్నందు వల్ల దేశీయ, విదేశీ వాణిజ్యం కూడా చెప్పుకోదగినంతగా ఉండేది. దాని ఫలితంగా మౌర్యుల కాలంలో లాగే గుప్తుల కాలంలో కూడా శుల్కం వసూలుకు ఒక ప్రత్యేక ప్రభుత్వ శాఖ, దారి సుంకం, కస్టమ్స్ సుంకం వసూలుకు ఒక అధికారి అవసరమైంది.

గుప్త ధనరాసులు, నిధులు, గనులు, ఉప్పు త్రవ్వకం మొదలైనవి రాజుకు ప్రత్యేకంగా చెందినవై, రాజ్య సంపదకు మూల ఆధారంగా ఉండేవి. ఈ విధమైన సంపదను గురించి అనేక సందర్భాల్లో చెప్పబడింది. భూములు దానం చేసిన తర్వాత కొన్ని సందర్భాల్లో గుప్త నిధులు, గనులపై రాజు కొన్ని హక్కులను మినహాయించుకొనేవాడు. కాని ఇతర సమయాల్లో ఆ హక్కులు దానప్రతిగ్రహీతకు ఇవ్వబడేవి.

గుప్తుల కాలంలో దొంగలు, అన్యాయాలు, అక్రమాలు చేసేవారిపై వేసిన జరిమానాల వల్ల కూడ ప్రభుత్వానికి చెప్పుకోదగ్గ ఆదాయం వచ్చేది. గుప్తుల శాసనాలు అనేకం నేరస్తులపై వేసిన జరిమానాలతో కలిపి లేదా వాటి మినహాయింపుతో దానాలు ఇచ్చినట్లుగా పేర్కొన్నాయి.

15.3.3 ఫాహియాన్ కథనం

చైనా యాత్రికుడు ఫాహియాన్ ఆ కాలంలో భారతదేశంలో అమలులో ఉన్న భూమిశిస్తు విధానం గురించి తెలిపిన సమాచారం శాసనాల్లో పేర్కొనబడినదానికి భిన్నంగా ఉంది. మధ్య రాజ్యం (మధ్య దేశం లేదా గుప్త సామ్రాజ్యంలోని మధ్య రాష్ట్రం లేదా మగధ) గురించి వర్ణిస్తూ, రాజుకు చెందిన భూములను సాగుచేసేవారు మాత్రమే ధాన్యంలో భాగం చెల్లించవలసి ఉండేది అని ఫాహియాన్ పేర్కొన్నాడు. ఫాహియాన్ కథనాన్ని వివరిస్తూ, భూమిశిస్తు ముఖ్యంగా రాజుకు చెందిన భూముల కౌలు నుండే వచ్చేది అని స్మిత్, బేని ప్రసాద్ అభిప్రాయ పడ్డారు.

BRAOU

భారతీయ భూమిశిస్తు విధానం గురించిన ఫాహియాన్ కథనానికి మరొక వివరణ ఇచ్చారు. చైనాలో ప్రాచీన కాలంలో ప్రభుత్వ ఆర్థిక విధానానికి మూలంగా 'గట్సింగ్ చీన్' విధానం అనే ప్రజా పంపిణీ విధానం ఉండేది. బహుశా ఫాహియాన్ తన మాతృదేశమైన చైనాలోని భూమి శిస్తు విధానం లాంటిదే నాటి భారతదేశంలో ఉన్న భూమిశిస్తు విధానం అని పొరపాటుపడి ఉండవచ్చు.

'భారతదేశంలో క్రీ.శ.5వ శతాబ్దంలో అమల్లో ఉన్న భూమిశిస్తు విధానాన్ని గురించి ఫాహియాన్ చేసిన వ్యాఖ్యలు అకారణంగా భ్రాంతితో రాసిన అసత్యాలు' అని ఎస్.కె. మైతీ అభిప్రాయపడ్డారు. ఎందువల్లనంటే, భారతదేశంలోని ప్రజా జీవన విధానంపై ఫాహియాన్ చేసిన ఇతర వ్యాఖ్యలు కూడ సత్యదూరమైనవే.

15.4 వ్యవసాయ పరిస్థితులు

గుప్తుల కాలంలో ఉత్తర భారతదేశంలో ప్రజల ఆర్థిక జీవనం ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉండేది. వ్యవసాయానికి, నివాసానికి భూమిపై గిరాకీ ఎక్కువగా ఉండేది. జనాభా క్రమంగా పెరగడం వల్ల వ్యవసాయ యోగ్యమైన, వ్యవసాయ యోగ్యం కాని బంజరు భూములు కాలక్రమేణా సాగులోకి తీసికొని రాబడ్డాయి.

కామందకుని రచనల వల్ల వైశ్యుల జీవనం పశుపోషణ, వ్యవసాయం, వాణిజ్యం వల్ల సాగేదని, వాటిపై ఆధారపడి జీవించేవారి వృత్తికి 'వార్తా' అనే పేరుండేదని తెలుస్తుంది. దానిలో వ్యవసాయం, పశు పోషణ మొదలైన వాటిని కలిపి, అది దేశ సంపదకు ముఖ్య ఆధారం అని కాళిదాసు పేర్కొన్నాడు.

భూమిని చిరకాలం బంజరుగా ఉంచేవారు కాదు. బంజరు భూములను సాగులోకి తెచ్చి, పంటలు పండించేందకు ఇతరులను ప్రోత్సహించేవారు. వ్యవసాయం చేసేందుకు, నివాస స్థానాలను ఏర్పాటు చేసుకొనేందుకు ప్రోత్సాహకరంగా రాజు వ్యవసాయయోగ్యమైన భూములు ఉండే విశాలమైన ప్రాంతాలను దానంగా ఇచ్చేవాడు. అంతే కాక ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో నీటిపారుదల సౌకర్యాలు కల్పించడం వల్ల, బంజరు భూములు కూడ సాగులోకి తేబడి, వ్యవసాయం అభివృద్ధి చెందింది.

వ్యవసాయదారులు తాము సాగుచేసిన భూములు లేదా తోటల చుట్టూ కంచెవేసి, వాటిని ఆవులు, కోడెలు, దున్నపోతులు, మేకలు, గొర్రెలు, గుర్రాలు, ఏనుగులు మొదలైనవాటి బారినుండి రక్షించేవారు. పశువులు పంటలను నాశనం చేస్తే, పశువుల కాపలాదార్లను శిక్షించేవారు. లేదా దానికి నష్టపరిహారం వసూలు చేసేవారు.

గుప్తుల కాలంలో రైతుల కమతాలు చాలా చిన్నవిగా ఉండేవి. రైతుల సొంత భూములను వారు, వారి కుటుంబ సభ్యులు సాగుచేసుకొనేవారు. కొన్ని పెద్ద కమతాలు కూడ ఉండేవి. ఉదాహరణకు గునైగర్ తామ్రపత్ర శాసనంలో, ఒక వ్యవసాయదారునికి 11 పాటకుల విస్తీర్ణంగల భూమి ఉండేదని, దాన్ని సాగుచేసేందుకు కిరాయి కూలీలను ఉపయోగించేవాడని లేదా కౌలుదార్లకు పండిన పంటను పంచుకొనే పద్ధతి మీద ఆ భూములు సాగుకు ఇచ్చేవాడని తెలుస్తుంది. భూమి సాగు పద్ధతులు అనేక రకాలుగా ఉండేవి. భూమిని దున్నేందుకు ఎద్దులతో లాగే నాగళ్ళు ఉపయోగించేవారు. వ్యవసాయదారులు ఇనుముతో తయారు చేయబడిన నాగేటి కర్రును వాడేవారు.

గుప్తుల కాలంలో భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మూడు పంటలను పండించేవారు. వరాహమిహిరుడు 'బృహత్ సంహిత'లో వేసవి, శరత్, వసంత కాలాల్లో పండే మూడు పంటలు పేర్కొన్నాడు. భూమి సాగు పద్ధతిని గురించి కూడ వరాహమిహిరుడు సవివరంగా వర్ణించాడు.

BRAOU

15.4.1 పంటలు

గుప్తుల కాలంలో అనేక రకాల పంటలు పండించేవారు. వాటిని ఈ క్రింద పేర్కొన్న రకాలుగా విభజింపవచ్చు.

1. తృణ ధాన్యాలు
2. పప్పు ధాన్యాలు
3. నూనె విత్తనాలు
4. నారలు
5. అద్దకం పంటలు
6. ఔషధం పంటలు
7. సుగంధ ద్రవ్యాలు
8. కాయ కూరలు
9. ఆకు కూరలు
10. పండ్లు
11. పచ్చిక గడ్డి

అధిక వర్షాలు ఉండే ప్రాంతాల్లో వరిపంటను పండించేవారు. నాటి బెంగాల్‌లో పండించే వరి ధాన్యం గురించి కాళిదాసు రచనలు తరచుగా పేర్కొన్నాయి. 'రఘువంశం 'శాలి'; 'సమల', 'నివార', 'ఉంఛ', 'శ్యామాక' అనే బియ్యం రకాలను గూర్చి పేర్కొంది. వాటినే కాక కలమ, ఎర్రబియ్యం, పసుపు రంగు బియ్యం, మూడేడు రంగు బియ్యం అనే నాలుగు రకాల వరిధాన్యాలను వరాహమిహిరుడు పేర్కొన్నాడు.

గుప్తుల కాలంలో వరిధాన్యాలే కాక, రకరకాల బార్లీ, బఠాణీ, కాయ ధాన్యాలు, చిక్కుళ్ళు, గోధుమలు, పప్పు దాన్యాలను పండించేవారు. తృణ ధాన్యాలే కాక కాయకూరలు, కూడా పండించేవారు. అమరకోశం దోస, బీరకాయలు, వక్కలు, తమల పాకులు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, గుమ్మడి, పొట్లకాయలు, ఆనపకాయలు మొదలైన కాయకూరలను పేర్కొంది.

చెరకు పంట, చెరకు పరిశ్రమ గుప్తుల కాలంలో విస్తృతంగా ఉండేది. శరత్ కాలపు చెరకు పంటకు, వరిపొలాలకు సంబంధించిన పాటలు రఘు వంశంలో ఉన్నాయి. సాధారణంగా శీతాకాలంలో వరిధాన్యంతో బాటే, చెరకు పంటను కూడా వేసేవారు. చెరకు రసం నుండి పంచదార తయారు చేసేవారు. అమరకోశం బెల్లం, చక్కెరలను పేర్కొంది.

నారపంటల్లో ముఖ్యమైంది ప్రత్తి. అమరకోశం ప్రత్తి సాగును గురించి వివరంగా పేర్కొంది. సౌరాష్ట్ర, లేక కథియవార్‌లో ప్రధానంగా ప్రత్తి పండించేవారు.

గుప్తుల కాలంలో ఖాద్య సుగంధ ద్రవ్యాలు, నూనె పంటలు, వైద్య సంబంధమైన మొక్కలు మొదలైన వాటిని వేసేవారు. ఆవాలు, నువ్వులు, అవిసెలు, చింతపండు, లోధ్ర, ఎర్రలోధ్ర, మిరియాలు, సిప్పళ్ళు, కలబంద, నీలీమందు, లవంగాలు, ఏలకులు, జటామాంసి, సుగంధ గడ్డి, వక్క, అల్లం, పసుపు, కుంకుమ పువ్వు మొదలైన వాటిని రైతులు పండించేవారు.

BRAOU

దక్షిణ భారతదేశం మిరియాలు, ఏలకులకు ప్రసిద్ధి చెందిందని, మలయా (నీలిగిరి) పర్వతాల్లో వాటిని ఎక్కువగా పండించేవారని కాళిదాసు రచనల వల్ల తెలుస్తుంది. అడవులు, తోటల్లో మామిడి, తాటి, కమలా, నారింజ, పనస, దానిమ్మ, ద్రాక్ష, అరటి, కొబ్బరి, ఖర్జూరం మొదలైనవి పండించేవారు.

పైన పేర్కొనబడిన వ్యవసాయ ఉత్పత్తులు ప్రజల దైనందిన జీవనానికి నిత్యావసరమయ్యే వస్తువులు కాబట్టి, వాటికి భారతదేశమంతటా ఎల్లప్పుడూ గిరాకీ ఉండేది.

15.4.2 దుర్భిక్షాలు

ప్రాచీన కాలం నుండి భారతదేశంలో దుర్భిక్షం అనేది జాతీయ విపత్తుగా వరిగణింపబడుతూ ఉంది. భూకంపాలు, అనావృష్టి, తెగుళ్ళు, కీటకాల వల్ల పంట నాశనం, వరదలు, పంటల విఫలం, ప్లేగు మొదలగు వ్యాధుల వల్ల దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడేవని వరాహమిహిరుని 'బృహత్సంహిత' వల్ల తెలుస్తుంది. అధిక వర్షాల వల్ల ముంపుకు గురై, పంటలు పండక కరువు ఏర్పడిన అనేక సందర్భాలను వరాహమిహిరుడు పేర్కొన్నాడు.

స్కందగుప్తుని జునాగఢ్ శిలాశాసనం ద్వారా, అధిక వర్షాల వల్ల సుదర్శన సరస్సు ఆనకట్ట తెగిందని, దాని ఫలితంగా కరువు పరిస్థితులు ఏర్పడి, ప్రజలు అనేక దురవస్థలు పడ్డారని తెలుస్తుంది.

దుర్భిక్షానికి మరొక ముఖ్య కారణం అనావృష్టి. వరాహమిహిరుడు పలు సందర్భాల్లో అనావృష్టి, భూకంపాలను గూర్చి పేర్కొన్నాడు. వడగళ్ళవాన, కీటకాల వల్ల పైర్లు నాశనం, అంటువ్యాధులు, మనుషులకు, జంతువులకు వచ్చే జబ్బులను గురించి కూడా నాటి రచనలు చాలాసార్లు పేర్కొన్నాయి. యుద్ధాల వల్ల జరిగే వినాశనం కూడ దుర్భిక్షానికి కారణం అని వరాహమిహిరుడు తెలిపాడు.

గుప్తుల కాలంలో దుర్భిక్ష పరిస్థితుల్లో తీసికొనే సహాయ కార్యక్రమాలను గురించిన సమాచారం నాటి రచనలు ప్రత్యక్షంగా పేర్కొనలేదు. కాని అలహాబాద్ శిలాస్తంభ శాసనం వల్ల సముద్రగుప్తుడు దుర్భశలో ఉన్నవారికి, పేదవారికి, విపత్సహాయులకు, పీడితులకు, ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడూ సహాయం చేసేవాడని తెలుస్తుంది. మిహిరకులుడు దురవస్థలు, ఆపదలను తొలిగించే వాడని పేర్కొంది. గుప్తుల కాలంలో దుర్భిక్షం వచ్చినట్లుగా కాని, దాని స్వభావం గురించి కాని నిర్దిష్టమైన సాక్ష్యాధారాలు లభించలేదు.

15.4.3 నీటి పారుదల

ప్రాచీన కాలం నుండి భారతదేశం వ్యవసాయిక దేశం. భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో వ్యవసాయం నీటిపారుదలపై అధారపడి ఉంది. ప్రకృతి సిద్ధమైన నీటిపారుదల నదులు, సరస్సులు, నీటి బుగ్గలు, వర్షం ద్వారా లభిస్తుంది. పంటలు, గనులు, ఖనిజాలు మొదలైనవి ఉండి, వర్షంపై ఆధారపడని నీటిపారుదల సమృద్ధిగా గల భూమి ప్రజల సంక్షేమ, సౌభాగ్యాలకు అనుకూలమైందని కామందకుడు పేర్కొన్నాడు. ప్రకృతిసిద్ధమైన నీటిపారుదల సౌకర్యాలు లేనప్పుడు, కృత్రిమమైన నీటిపారుదల వల్ల భూమి సారవంత్వం పెంపొంది, అధిక వ్యవసాయ ఉత్పత్తి వస్తుంది.

గుప్తుల కాలంలో నదులు లేదా చెరువుల నుండి కాలువలు త్రవ్వి, దూరంగా ఉండే పంటపొలాలకు కూడా నీటి సదుపాయాన్ని కల్పించేవారు. అమరకోశం కాలువలను జలనిర్గమాలుగా వర్ణిస్తుంది. అంటే నదుల నుండి వచ్చే ముంపును కాలువలు నివారించేవి.

BRAOU

కొన్ని పెద్ద చెరువుల ద్వారా త్రాగునీరు, పంటపొలాలకు నీటిపారుదల రెండూ లభించేవి. చెరువుల్లో మూడు రకాలు ఉండేవి. అవి 1. 'వాపి' అనేవి చిన్న చెరువులు, 2. 'తడాగ' అనేవి పెద్ద చెరువులు, 3. 'దిర్ఘిక' అనేవి మిక్కిలి పెద్ద చెరువులు.

సరస్సులు ఎక్కువగా సుదర్శన సరస్సులాగా అత్యంత విశాలంగా ఉండేవి. గిర్నార్ పర్వత పాదం వద్ద ఉండే సుదర్శన సరస్సు ఆనకట్టలు అధిక వర్షం ఫలితంగా తెగిపోయినందువల్ల, ఆప్రాంత గవర్నర్ రెండు నెలలు కృషిచేసి, పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చుపెట్టి, వాటిని తిరిగి నిర్మించాడు. జునాగఢ్ శాసనంలోని ఆధారాల మూలంగా, సుదర్శన సరస్సు ఆనకట్ట పొడవు 100 మూరలని, వెడల్పు 68 మూరలని, ఎత్తు ఏడుగురు మనుషుల ఎత్తు (31 1/2 మూరలు) అని ఫ్లీట్ వివరించాడు. ఆ ప్రాంత ప్రజల సౌభాగ్యం ఆ సరస్సుపైనే ఆధారపడి ఉండేది.

గుప్తుల కాలంలో బావులు (కూప) గురించి కూడ చారిత్రక ఆధారాలు ఉన్నాయి. విశ్వవర్మనుని గంగాధర్ శిలా శాసనం మాళ్వా ప్రాంతంలోని బావిని పేర్కొంది. అమరకోశంలో కూడా ఈ రకపు బావిని గురించి రాయబడింది.

పైన పేర్కొన్న వివరాల వల్ల ప్రభుత్వం, ప్రజలు కూడా నీటిపారుదల నిర్మాణాలు, మరమ్మతుల మీద తగిన శ్రద్ధ వహించేవారని తెలుస్తుంది. వాటి నిర్మాణానికి రాజే చొరవ తీసికొని, ప్రోత్సహించేవాడు. సుదర్శన సరస్సును నిదర్శనంగా తీసికొన్నట్లైతే, నీటిపారుదల నిర్మాణాలు, మరమ్మతులపై ప్రభుత్వం అధికంగా డబ్బు ఖర్చుపెట్టేదని తెలుస్తుంది. అంతేగాక వ్యవసాయం, నీటిపారుదలకు గల ఆర్థిక ప్రాముఖ్యత పరిగణనలోకి తీసికొన్నట్లైతే, నీటిపారుదల నిర్మాణాలకు ప్రభుత్వమే రక్షణ కల్పించేదని తెలుస్తుంది. వాటికి నష్టం కలిగించే వారిపై జరిమానాలను, శిక్షలను వేసేవారు.

15.4.4 అడవులు - తోటలు

భారతదేశంలో విశాల ప్రాంతాల్లో అడవులు ఉన్నాయి. గుప్తుల కాలంలో గిరిజన నాయకులు అరణ్య ప్రాంతాల్లో స్వతంత్ర రాజ్యాలను స్థాపించేవారు. ఉదాహరణకు సముద్రగుప్తుడు దక్షిణ భారతదేశ దండయాత్రలో మగధ నుండి కళింగ వెళ్ళే మార్గంలో అటవీ రాజ్యాలను జయించినట్లుగా అలహాబాదు శాసనం తెలియజేస్తుంది. హస్తిన్ మహారాజుకు డభాల రాజ్యంతో సహా, 18 అటవీ రాజ్యాలు వారసత్వంగా సంక్రమించాయని 'ఖో' తామ్ర శాసనం పేర్కొంది. ఈశాన్య భారతదేశంలోని అటవీ రాజ్యాలను వరాహమిహిరుడు పేర్కొన్నాడు. కాళిదాసు రచనల్లో అడవుల గురించిన అనేక వివరాలు కానవస్తాయి.

అడవులకు గల ఆర్థిక ప్రాముఖ్యత వాటికి ఉన్న సైనిక ప్రాముఖ్యత కంటే ఎక్కువగా ఉండేది. అడవులు వాటి పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా వర్షం కురియటానికి, భూమిలో తేమ ఎక్కువ కాలం ఉండేదానికి, దాని ఫలితంగా ఎక్కువ ఉత్పత్తి జరిగడానికి తోహద పడేవి. విపత్కర పరిస్థితుల్లో అడవుల ద్వారా ఆహారం, రక్షణ లభించేవి. అడవుల నుండి ఆర్థిక ఉత్పత్తులు సమృద్ధిగా లభిస్తూ ఉండినందు వల్ల, వాటి ప్రాముఖ్యత అధికంగా ఉండేది.

అడవులు, అటవీ ఉత్పత్తులను గురించి కాళిదాసు తన రచనల ద్వారా సవివరంగా తెలియజేశాడు. భవన నిర్మాణాలకు వాడే కలప, వంట చెరకు, జంతు చర్మాలు, జింకల నుండి లభించే మృగనాభి, స్త్రీలు వాడే రంగులకు అవసరమయ్యేలాక్షరాజచిహ్నంగా పరిగణింపబడి, నింజామరంగా వాడే చామర మృగ తోక మొదలైనవి మహారణ్యాల నుండి లభించేవి. చామర మృగాలు, కస్తూరి మృగాలు హిమాలయ ప్రాంతాల్లో ఎక్కువగా ఉండేవి.

BRAOU

కళింగ, కామరూప, అంగ రాజ్యాల్లోని అడవుల్లో ఏనుగులను పట్టుకొనేవారు. ప్రాచీన కాలంలో భారతీయ సైన్యంలో ఏనుగులు ఒక ప్రధాన అంగంగా ఉండేవి. ఏనుగులు చనిపోయిన తర్వాత వాటినుండి తీసిన దంతాలకు చాలా విలువ ఉండేది.

నదులపైన, సముద్రంమీద ప్రయాణం చేసే యుద్ధ నౌకలు, వ్యాపార నౌకలు తయారు చేయడానికి అవసరమయ్యే కలప కూడ అడవుల నుండి లభించేది.

హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఖనిజాలు దొరకడమే గాక, అక్కడ అధిక సంఖ్యలో సాల వృక్షాలు పెరిగేవి. ఈ చెట్లనుండి భవన నిర్మాణానికి అవసరమయ్యే శ్రేష్ఠమైన కలప లభించేది.

తోటలు, ఉద్యాన వనాలు నగర పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా ఉండేవి. ప్రజలకు వాటినుండి పూలు, కాయగూరలు మొదలైనవి లభించేవి. రాజభవనాలు, ధనికుల నివాసాలకు అనుబంధంగా ఉండేవి. వాటికి గల అధిక ప్రయోజనం దృష్టిలో పెట్టుకొని మొక్కలు, చెట్లు చాలా జాగ్రత్తతో పెంచేవారు.

సన్నని కాలువల (కుల్య) ద్వారా నీటిని పంపి, తోటలకు నీటిపారుదల సదుపాయం కలుగజేసేవారు. చెట్ల చుట్టూ గుండ్రని గుంటలు ('అలవాల' లేక 'ఆదార బంధ') త్రవ్వి, వాటికి నీరు పెట్టేవారు. ఆశ్రమాల్లో ఋషుల కుమార్తెలు కుండల్లో నీటిని తీసికొనిపోయి మొక్కలకు నీరుపోస్తుంటే, సయనానందకరంగా ఉండేదని కాళిదాసు వర్ణించాడు. అడవులకు, తోటలకు ఆర్థిక ప్రాముఖ్యత ఉండినందువల్ల, వాటి అభివృద్ధికి ప్రభుత్వం ఒక అటవీవన పర్యవేక్షక అధికారిని నియమించింది. స్కందగుప్తుని బీహార్ శిలాస్తంభ శాసనంలో 'గాల్మికుడు' లేక అటవీ పర్యవేక్షణాధికారిని గురించి పేర్కొనబడింది. ఈ అధికారులు ప్రభుత్వ అధీనంలో ఉన్న అడవులను పర్యవేక్షించేవారు. కట్టెలు కొట్టేవారి నుండి, వర్తకుల నుండి అటవీ ఉత్పత్తులను, పన్నులను వసూలు చేసేవారు. అడవులకు హానికలుగజేసేవారిపై జరిమానాలు విధించి, వసూలు చేసేవారు.

15.4.5 పశుపోషణ

గుప్తుల కాలంలో పశుపోషణ గురించి నాటి ఆధారాలు పలు సందర్భాల్లో పేర్కొన్నాయి. ప్రజల సంపదకు, ప్రభుత్వ ఆదాయానికి కూడ పశుపోషణ ఒక ముఖ్య మూలాధారంగా పరిగణించేవారు. వైశ్యుల జీవనానికి పశుపోషణ ఒక మార్గమని కామందకుడు పేర్కొన్నాడు. కాని వాస్తవంగా చూస్తే, పశుపోషణ మాత్రమే వృత్తిగా అవలంబించే వర్గం అంటూ ప్రజల్లో ప్రత్యేకంగా ఉండేది కాదు. ఎందువల్లంటే, వ్యవసాయదారులు అందరూ పాలాల సాగుకు, పాల ఉత్పత్తులకు, రవాణాకు పశువుల మీద ఆధారపడవలసి వచ్చేది. పాలాల సాగు, రవాణా, ఆహారం, చర్మాలు, దంతాలు, కొమ్ములు, ఎముకలు మొదలగు వాటికి సంబంధించి, జంతువులకు ఆర్థికపరమైన విలువ అన్ని కాలాల్లో ఉంది.

జంతువులను పెంపుడు జంతువులు, క్రూర మృగాలు అని రెండు రకాలుగా విభజింపవచ్చు. క్రూర మృగాల్లో సింహం, పులి, సివంగి, అడవి పంది, కోతి, ఎలుగుబంటి, ఏనుగు, తోడేలు ముఖ్యమైనవి. వాటిలో కొన్నింటికి ఆర్థిక ప్రాముఖ్యత ఉన్నందు వల్ల మచ్చిక చేసేవారు. పెంపుడు జంతువుల్లో గుర్రం, దున్న పోతు, ఆవు, ఒంటె, మేక, పొట్టేలు, గొర్రె, గాడిద, కుక్క, పంది, పిల్లి ముఖ్యమైనవి. వాటిని వివిధ కారణాల వల్ల పెంచేవారు. వేటగాళ్ళు, చేపలు పట్టేవారు, పాములు పట్టేవారు వారి జీవనానికి జంతువుల మీదే ఆధారపడేవారు.

BRAOU

గుప్తుల కాలంలో వ్యవసాయానికి పశువులు కనీస అవసరంగా ఉండేది. పాలం దున్నేందుకు ఎద్దులను మాత్రమే ఉపయోగించేవారు. వాటిని రవాణాకు కూడా వాడేవారు. పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, జున్ను, మొదలైన పాల ఉత్పత్తులు లభిస్తున్నందు వల్ల, ఆవులకు విలువ ఎక్కువగా ఉండేది. మతాచార కర్మలు, ఉత్సవాలు ఆవులు లేకుండా జరిగేవి కావు. పాలు, బియ్యంతో తయారు చేసే 'చరు' అనే వంటకాన్ని అనేక శాసనాలు పేర్కొన్నాయి. సాహిత్య గ్రంథాలు, ధర్మశాస్త్రాల వల్ల నాటి ప్రజలు తరచుగా జున్ను వాడేవారని తెలుస్తుంది. ఆవు మాంసం, ఎముకలు ఎరువులుగా వాడేవారు. ఆవుపేడ ఎరువుగాను, ఇంధనంగాను ఉపయోగించేవారు.

వ్యవసాయిక ఆర్థిక విధానంలో పశువులకు ప్రాముఖ్యత ఉండినందువల్ల, పాల ఉత్పత్తులు ప్రజలకు ఉపయోగకరమైనందు వల్ల గుప్తుల కాలంలో ఆవును పవిత్రంగా చూసేవారని నాటి రచనలు, శాసనాల ద్వారా తెలుస్తుంది. రఘువంశంలో ఒక పర్వం మొత్తం దిలీప మహారాజు, అతని రాణి ఆవును పూజించే పద్ధతి గురించే రాయబడింది. అంతేకాక మోక్ష సాధన కొరకు రాజు ఒక పాడి ఆవును లేదా వృషభాన్ని ఒక మత సంస్థకు లేదా బ్రాహ్మణునికి దానంగా ఇచ్చేవాడు. సముద్రగుప్తుడు కొన్ని వేల ఆవులను దానం చేసినట్లుగా అలహాబాద్ శిలాస్తంభ శాసనం పేర్కొంది.

గోవుని చంపడం అంటే బ్రాహ్మణుని హత్య చేయడం వల్ల కలిగే పాపంతో సమానమని భావించేవారు. దానం ఇచ్చేటప్పుడు విఘ్నం కలిగించేవారు గోవును లేదా బ్రాహ్మణుని హత్య చేసేవారితో సమానమైన వారిగా పరిగణించేవారని చంద్రగుప్తుని పాంచి శిలా శాసనం వల్ల తెలుస్తుంది. 'గోవులకు, బ్రాహ్మణులకు గౌరవం చూపే పౌరులు సౌభాగ్యంతో వర్ధిల్లెదరు' అని బుధగుప్తుని 'ఈరాన్ శాసనం' పేర్కొంది. దీన్ని బట్టి గుప్తుల కాలంనాటి ప్రజలు గోవుని ఎంతో గౌరవంతో చూసేవారో తెలుస్తుంది.

యుద్ధానికి ఏనుగులను రాజు సైన్యంలో అత్యంత ముఖ్యమైన భాగంగా పరిగణించేవారు. శత్రు సైన్యాలను నాశనం చేసేందుకు, వారిపై విజయం సాధించేందుకు ఏనుగులపై ఆధారపడేవారని కామందకుడు పేర్కొన్నాడు. కాబట్టి రాజు సైన్యాల్లో ఏనుగులు తప్పనిసరిగా ఉండేవి. హాని కలుగజేసే క్రూరమైన ఏనుగును చంపడం కూడా రాజుకు తగదని అజుడు రఘువంశంలో పేర్కొన్నాడు. ఏనుగులకు సైన్యంలో ఉండే ప్రాముఖ్యతేగాక, ధనవంతులు వాటిని వేటాడేందుకు, సవారీ చేసేందుకు, కూడా ఉపయోగించేవారు.

గుర్రాలను ఆశ్విక బలంగాను, రథాలు లాగేందుకు, వేటాడేందుకు ఉపయోగించేవారు. గుర్రాలకు వాటి జాతులను బట్టి ప్రాముఖ్యం ఇచ్చేవారు. కొన్ని స్థానిక జాతి గుర్రాలు శ్రేష్ఠమైనవిగా పరిగణించేవారు. మేలు జాతి గుర్రాలకు భారతదేశ వాయవ్య ప్రాంతం, పర్షియా, అరేబియా దేశాలు సుప్రసిద్ధమైనవి. కాంభోజరాజు తన లొంగుబాటుకు సూచనగా, రఘు మహారాజుకు కొన్ని మేలుజాతి గుర్రాలను బహుమతిగా ఇచ్చాడు. అజుని సైన్యంలో ప్రధాన భాగంగా వనాయు దేశపు గుర్రాలుండేవని కాళిదాసు పేర్కొన్నాడు. వనాయు దేశం అంటే, నేటి అరేబియా దేశం అని పండే, కాని అది భారతదేశంలో వాయవ్య ప్రాంతంలో ఉండేదని కన్నింగ్‌హామ్ అభిప్రాయ పడ్డారు.

ఏనుగులకు, గుర్రాలకు సంవత్సరంలో నిర్ణీత కాలంలో వాటి ముందు దీపాలు ఊగించడంలాంటి మతాచార సంబంధమైన ఉత్సవాలు, పూజలు చేసేవారు. అశ్వ యజమానులు కార్తీకమాసంలో ఇటువంటి ఉత్సవం చేయాలని బృహత్ సంహిత పేర్కొంది. గుప్తుల కాలంలో గుర్రాన్ని పవిత్రంగా చూసేవారు. అంతేకాక నాడు ఆచారంలో ఉన్న అశ్వమేధ యాగం వల్ల కూడ గుర్రానికి ఉండే ప్రాముఖ్యత తెలుస్తుంది.

BRAOU

గేదె, దున్నపోతు, ఒంటె, మేక, గొర్రె, పొట్టేలు, ఎద్దు, గాడిద, కుక్క, పంది, పిల్లి, నెమలి, మొదలైన జంతువులను వివిధ కారణాల వల్ల మచ్చిక చేసుకొని పెంచేవారు. గాడిదలు, కంచరగాడిదలు, ఒంటెలను సామానులు మోసుకొని పోయేందుకు వాడేవారు. కుక్కలను వేటలో ఉపయోగించేవారు. మేకలు, గొర్రెలను ఆహారం కొరకు పెంచేవారు. ఆ జంతువులు చనిపోయిన తర్వాత, వాటినుండి లభించే చర్మం, క్రొవ్వు, పిత్తము, కండలు, పళ్ళు, గిట్టలు, ఎముకలు, కొమ్ములను వివిధ రకాలుగా ఉపయోగించేవారు.

బౌద్ధ, జైన మతాల వల్ల అహింసా ధర్మం ఎక్కువగా ప్రాచుర్యం పొందడం వల్ల, ప్రజల్లో జంతు దయ పెరిగింది. చైనా యాత్రికుడు ఫాహియాన్ ఇలా పేర్కొన్నాడు: 'దేశంలోని అన్ని ప్రాంతాల్లోని ప్రజలు జీవరాసులను చంపరు. మత్తు పానీయాలు సేవించరు. ఉల్లిపాయలుగాని, వెల్లుల్లిగాని తినరు. చండాలురకు మాత్రం ఇది వర్తించదు. ఆ దేశం (మధ్య దేశం)లో ప్రజలు పందులను, పక్షులను పెంచరు. బ్రతికి ఉన్న పశువులను అమ్మరు. బజార్లలో మాంసం దుకాణాలు లేవు. మత్తు పానీయాలు అమ్మే న్యాపారస్తులు లేరు'. దీన్ని బట్టి ఫాహియాన్ కాలంలో మధ్యదేశ ప్రజలు పూర్తిగా శాకాహారులని తెలుస్తుంది. కాని కాళిదాసు రచనల వల్ల, నాటి ప్రజలు మాంసాహారం వాడేవారని, మత్తుపానీయాలు సేవించేవారని తెలుస్తుంది.

15.5 కార్మికులు

గుప్తుల కాలంలో కార్మికులు మూడు తరగతులుగా ఉడేవారు. వారి 1. బానిసలు 2. కూలి పనివారు 3. వెట్టి పనివారు. బానిసలు సాదారణంగా ఇంటిపని చేస్తూ సేవకులుగా ఉండేవారు. పొలాల సాగు, పంటల రక్షణ, పరిశ్రమలు, వ్యాపారం, పశుపోషణ మొదలైన పనులు కూలీ పనివారు చేసేవారు. గుప్తుల కాలంలో వెట్టి పని వారు డబ్బుతో కొనబడేవారు. వెట్టి పని పన్ను రూపంగా ప్రభుత్వానికి ఆదాయంకూడా సమకూర్చేది. మొత్తంమీద గుప్తుల కాలంలో కార్మికుల జీవన పరిస్థితి మెరుగ్గా ఉండేది కాదు.

BRAOU

15.5.1 బానిసలు

ప్రాచీన భారతదేశంలోని ఆర్థిక జీవన విధానంలో బానిసత్వం కూడ ఒక ముఖ్యమైన భాగంగా ఉండేది. గుప్తులకు పూర్వం వ్యవసాయం వంటి ఆర్థిక ప్రాముఖ్యత గల రంగాల్లో బానిసలు పనిచేసేవారు. కాని గుప్తుల కాలంలో బానిసలు సాధారణంగా ఇంటిపనివారుగాను, సేవకులుగాను ఉండేవారు. ఇంటిపని పరిశుభ్రమైన పని, అపరిశుభ్రమైన పని అని రెండు రకాలుగా నారదుడు విభజించాడు. పరిశుభ్రమైన పనిని కూలీలు చేసేవారు. అపరిశుభ్రమైన పనిని మాత్రం బానిసలే ప్రత్యేకించి చేసేవారు. ద్వారాలు, పాయిఖానాలు, రహదార్లు మొదలైన వాటిలో ఉండే చెత్త, చెదారం ఊడ్చడం, మనిషి శరీరంలోని రహస్యాంగాలను శుభ్రం చేయడం, మల మూత్రాలు తీసివేయడం, యజమాని కాళ్ళు, చేతులు మర్దన చేయడం మొదలైనవి అపరిశుభ్రమైన పనులు. వాటిని బానిసలు మాత్రమే విధిగా చేసేవారు. యజమాని బయటకి వెళ్ళి తిరిగి వచ్చిన తర్వాత, అతని పాదాలు నీటితో కడిగి శుభ్రం చేయడం ఆడపనివారు చేసేవారు.

రెండవ చంద్రగుప్తుని ఉదయగిరి శాసనం ఇలా పేర్కొంది:"విక్రం-ద్వక్రయక్రీతా దాస్య-న్యాగ్ భూత-పార్థివా" అంటే దాని అర్థం: శౌర్య శక్తి అనే డబ్బుతో భూమిని కొని, దానిలో ఉండే రాకుమారులు అందరిని బానిసలుగా

చేసి అవమానపర్చాడు. దీన్ని బట్టి గుప్తుల కాలంలో బానిసలు ఉండేవారని తెలుస్తుంది. సముద్రగుప్తుని అలహాబాద్ స్తంభ శాసనం కూడ ఆస్థాన పండితుడైన హరిసేనుడు చక్రవర్తి పాదాల వద్ద బానిస అని పేర్కొంది.

15.5.2 కూలీ పనివారు

పొలాలు దున్నేందుకు, పంటలు కాపాడేందుకు, పంటకోతకు, పరిశ్రమల్లో పనిచేసేందుకు, వ్యాపారం నడిపే పనిలోను, పశువులను పెంచి పోషించేందుకు మొదలైన పనులకు కూలి పని వారిని ఉపయోగించేవారు. ధనికుల గృహాల్లో ఇంటి పనులు చేసేందుకు బానిసలే గాక, కూలీలు కూడ ఉండేవారు. కూలి పనివారికి జీతం డబ్బురూపంలో ఇచ్చేవారు. కాని కొంత మంది కూలీలకు జీతంగా ఆహారం ఇచ్చేవారు. లేదా జీతంగా కొంతడబ్బు, కొంత ఆహారం ఇచ్చేవారు.

దేశ సంపద ఉత్పత్తిలో కూలీల పాత్ర గణనీయంగా ఉండేది. కాని నాటి కార్మికుల గురించిన సమాచారం ధర్మశాస్త్రాలు, విదేశీయుల రచనలు, గుప్తుల కాలం నాటి సారస్వత గ్రంథాల్లో అక్కడక్కడా స్వల్పంగా మాత్రమే లభిస్తుంది. కూలి పనివారికి కార్మిక సంఘాలు ఉండేవి కావు. వారి జీతాల పెంపుదలకు, వారి పరిస్థితులు మెరుగు పరిచేందుకు కార్మిక నాయకులు పోరాడినట్లుగా ఆధారాలు లేవు.

గుప్తుల కాలంలో కూలి పనివారి జీవన పరిస్థితి మెరుగ్గా ఉండేది కాదు. నక్షత్రాలు, గ్రహాల ప్రభావం వల్ల ప్రజలు దారిద్ర్యంతోను, పేదరికంతోను యాతన పడేవారని వరాహమిహిరుడు 'బృహత్ సంహిత'లో వర్ణించాడు. కరువు, కాటకాలు మొదలైన ప్రకృతిసిద్ధమైన విపత్కరాలను కూడా వరాహమిహిరుడు పేర్కొన్నాడు. పస్తులతో ఆకలికి మాడిపోయే పరిస్థితుల్లో నిరంతరం శ్రమిస్తూ, యాతన పడుతూ, నీచమైన పనులు చేస్తూ మాత్రమే డబ్బు సంపాదించేందుకు వీలుండేది. ప్రజల్లో ఎక్కువమంది బానిస పని చేస్తూ కాలం గడిపేవారు. బానిసలు నీచమైన పనులు చేయవలసి వచ్చేది.

15.5.3 వెట్టి పనివారు

గుప్తుల కాలంలో వెట్టి పని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. దాన్ని ప్రజలు కట్టే పన్నుగా పరిగణించేవారు. అందువల్ల గుప్తుల శాసనాలు మిగిలిన పన్నులతో సహా వెట్టి పనిని కూడ ఒక పన్నుగా పేర్కొన్నాయి. దీన్ని బట్టి పూర్వం కంటే గుప్తుల కలంలో వెట్టిపని సర్వసాధారణంగా ఉండేదని తెలుస్తుంది.

భూమిని దానంగా ఇచ్చేటప్పుడు వెట్టి పనిని మినహాయించేవారని రెండవ ప్రవరసేనుని 'చమ్మక్ సివాని' తామ్రపత్ర శాసనాల వల్ల తెలుస్తుంది. వాకాటక మహారాణి ప్రభావతి గుప్త వెట్టి పని మినహాయింపుతో భూములను బ్రాహ్మణులకు, వారి కుమారులకు, మనుమలకు దానంగా ఇచ్చిందని 'రిద్ధపూర్' తామ్రపత్ర శాసనం పేర్కొంది. గుప్తుల కాలంలో వెట్టిపని ఉండేదని సముద్రగుప్తుని గయ తామ్రపత్ర శాసనం, మహారాజు జయనాథుని 'ఖో' తామ్రపత్ర శాసనం వల్ల కూడ తెలుస్తుంది.

గుప్తుల కాలంలో వెట్టిపనిని గురించి చర్చిస్తూ సాలెటోర్ రెండవ చంద్రగుప్తుని ఉదయగిరి శాసనంలోని ఒక భాగాన్ని ఉటంకిస్తూ ఇలా పేర్కొన్నాడు: ఈ పనివారు డబ్బుతో కొనబడ్డారు. ఎందువల్లనంటే ఇది (శాసనంలోని ఈ భాగం) 'కొనుగోలు ధనం' పేర్కొంటుంది. వెట్టి పనికి అటువంటి డబ్బు విలువ ఉన్నందువల్ల దాన్ని ప్రభుత్వ ఆదాయానికి ఒక మార్గంగా పరిగణించేవారు.

BRAOU

వెట్టిసనిని పేర్కొనే శాసనాలు అధికంగా మధ్యప్రదేశ్, కథియవర్‌లలో లభించాయి. అందువల్ల ప్రత్యేకంగా ఆ ప్రాంతాల్లోనే వెట్టి పనివారు ఎక్కువగా ఉండేవారని, గుప్తుల ప్రత్యక్ష పాలనలో ఉన్న ప్రాంతాల్లో ఆపద్ధతిని కఠినంగా అమలు పర్చలేదని తెలుస్తుంది.

15.6 సామూహిక ఆర్థిక జీవన విధానం-స్వభావం లక్షణాలు

గుప్తుల కాలంలో అనేక శ్రేణులు, సంస్థలు చురుగ్గా పనిచేయడం నాటి ఆర్థిక జీవన విధానానికి గల ఒక ముఖ్య లక్షణం. శ్రేణి జీవన విధానం వల్ల ప్రాచీన భారతదేశంలో ఆర్థికాభివృద్ధి గణనీయంగా జరిగింది. ఆ విధానంలో వృత్తి పనివారు ప్రతి ఒక్కరూ తమనైపుణ్యాన్ని, చాతుర్యాన్ని పెంపొందించుకొనేందుకు అవకాశం ఉండేది. అంతేకాక శ్రేణుల చట్టాలు, నిబంధనలు నాటి వృత్తి పనివారల ప్రయోజనాలకు అంతర్గతంగాను, వెలుపలి నుండి కలిగే హాని నుండి రక్షించేవి.

గుప్తుల కాలంలో మొట్టమొదటి సారిగా ధర్మ శాస్త్రాలు శ్రేణులు పనిచేసే విధానం, వ్యాపారంలో భాగస్వామ్యానికి సంబంధించిన నియమాలు సవివరంగా పేర్కొన్నాయి. దీన్నిబట్టి నాటి న్యాయశాస్త్రవేత్తల దృష్టిలోకి వచ్చిన సంఘాల కార్యక్రమాలు గణనీయంగా పెరిగాయని తెలుస్తుంది. అందువల్ల పూర్వం కంటే గుప్తుల కాలంలో వ్యాపారం ఎక్కువగా అభివృద్ధి చెంది ఉంటుందని భావించవచ్చు.

15.6.1 శ్రేణులు - సంస్థలు

గుప్తుల కాలంలో వివిధ రకాల శ్రేణులు, సంస్థలు ఉండేవి. రఘువంశం వాస్తుశిల్పుల శ్రేణిని గురించి పేర్కొంది. విశాఖదత్తుడు స్వర్ణకారుల శ్రేణిని పేర్కొన్నాడు. వరాహమిహిరుడు వ్యవసాయం, వాణిజ్యం, వివిధ వృత్తులను గురించి వర్ణిస్తూ శ్రేణులు, శ్రేణుల అధ్యక్షుల సౌభాగ్యాన్ని, దుర్దశను గరించి పలు సందర్భాల్లో చెప్పాడు.

శాసనాలు కూడ శ్రేణులను, సంస్థలను పేర్కొన్నాయి. వాటిలో మూనె ఉత్పత్తిదారుల శ్రేణి, సట్టు నేతపనివారల శ్రేణి ముఖ్యమైనవి. మత సంబంధమైన కార్యక్రమాలకు, దానధర్మాలకు అవసరమయ్యే డబ్బును శ్రేణుల్లో శాశ్వతంగా జమచేసి దాచేవారని కొన్ని శాసనాల వల్ల తెలుస్తుంది.

పహార్ పూర్, దామోదర్‌పూర్ తామ్రపత్ర శాసనాలు నగర శ్రేష్ఠిని పేర్కొన్నాయి. నగర శ్రేష్ఠి అంటే నగర షాహుకారు (City Banker) అని, అతడు శ్రేణి అధ్యక్షుడు అని డి.సి. సర్కార్, సాలెటోర్ అభిప్రాయ పడ్డారు.

ప్రతి శ్రేణికి ఒక సలహా సంఘం ఉండేది. అందులో ముగ్గురు సభ్యులు ఉండేవారు. వారు నగర శ్రేష్ఠి(నగర షాహుకారు), 'సార్థవాహ' (ప్రధాన వ్యాపారస్తుడు), 'ప్రథమ కులిక' (ప్రధాన చేతిపనివాడు). వారిలో నగర శ్రేష్ఠి సలహా సంఘానికి అధ్యక్షుడుగా ఉండేవాడు. మిగిలిన ఇద్దరు దానిలో సభ్యులు. బసార్ (వైశాలి)లో దొరికిన మట్టిముద్రల మీద ఉన్న శాసనాల ద్వారా కూడ గుప్తుల కాలం నాటి శ్రేణి వ్యవస్థ గురించి తెలుస్తుంది. అవి ఈ క్రింది శ్రేణులను (నిగమ) పేర్కొన్నాయి.

BRAOU

1. శ్రేష్ఠి - సార్థవాహ - కులిక - నిగమ = షాహుకార్లు, వ్యాపారస్తులు, చేతిపనివార్ల శ్రేణి

2. శ్రేష్ఠి - కులిక - నిగమ = షాహుకార్లు, చేతిపని వార్ల శ్రేణి

3. శ్రేష్ఠి - నిగమ = షాహుకార్ల శ్రేణి

4. కులిక - నిగమ = చేతి పనివార్ల శ్రేణి

శ్రేణులు వాటి వృత్తి సంబంధమైన పనులే కాక, సామూహిక వ్యవస్థ రూపంలో సామాజిక ప్రయోజనంగల ఇతర పనులు కూడ చేపట్టేవి. ప్రజల ఉపయోగం కొరకు సభా గృహాలు నిర్మించడం, ప్రయాణీకులకు త్రాగే నీటి వసతిని కల్పించడం కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేయడం, దేవాలయాలను కట్టించడం, కొలనులు త్రవ్వించడం, తోటలను పెంచడం వంటి పనులు కూడ శ్రేణులు చేసేవి. మొదటి కుమార గుప్తుడు, బంధువర్మన్ ల మండసోర్ శాసనాల వల్ల పట్టునేత పనివారల శ్రేణివారు క్రీ.శ. 437 - 438 లో ఒక బ్రహ్మాండమైన సూర్య దేవాలయాన్ని కట్టించారని, క్రీ.శ.473 - 474 లో ఆ దేవాలయాన్ని మరమ్మత్తు చేశారని తెలుస్తుంది.

శ్రేణులు, సంస్థలు బ్యాంకులుగా (Banks) కూడ వ్యవహరించేవి. అవి ప్రజలనుండి ధనాన్ని డిపాజిట్ల రూపంలో స్వీకరించి, వాటిపై వచ్చే వడ్డీని క్రమం తప్పకుండా చెల్లించేవి. ఈ శ్రేణి బ్యాంకులు చేసే విశ్వసనీయ సేవల వల్ల వాటికి ప్రజల్లో మంచిపేరు రావడమే గాక, రాజులు కూడ తమ వద్ద ఉన్న డబ్బుని వాటిలో డిపాజిట్ల రూపంలో దాచేవారు. రెండవ చంద్రగుప్తుడు 20 దీనారాలను రెండు వాయిదాల్లో శాశ్వతంగా డిపాజిట్ రూపంలో ఉంచి, ఆ డబ్బుపై వచ్చే వడ్డీని రెండు భిక్షు గృహాలకు దానంగా ఇచ్చాడు. అతని కుమారుడైన మొదటి కుమార గుప్తుడు ఒక సందర్భంలో 13 దీనారాలు, మరొక సందర్భంలో 12 దీనారాలు డిపాజిట్ల రూపంలో శ్రేణుల్లో దాచిపెట్టి వాటిమీద వచ్చే వడ్డీతో రెండు భిక్షు గృహాలను శాశ్వతంగా ఏర్పాటు చేశాడు.

15.6.2 భాగస్వామ్యం

భాగస్వామ్యం విజయవంతంగా (సంభూయ సముత్థానం) ఉండేందుకు అవసరమైన నియమాలు, నిబంధనలు బృహస్పతి నారదుడు రచించిన శాస్త్రుల్లో ఉన్నాయి. నారదుడు కొన్ని మౌలిక సూత్రాలను వివరించాడు. వ్యాపారస్తులు లేదా ఇతరులు ఉమ్మడిగా వ్యాపారం చేసినట్లయితే, దాన్ని భాగస్వామ్యం అనేవారు. ఆదాయం కొరకు అనేకమంది భాగస్తులు కలసి ఉమ్మడిగా వ్యాపారం చేస్తే, ఉమ్మడి పెట్టుబడికి వారు ఒక్కొక్కరుఇచ్చిన డబ్బు ఆ వ్యాపార సంస్థ నిర్వహణకు మూలాధారమై ఉంటుంది. కాబట్టి వారిలో ప్రతి ఒక్కరూ తమ భాగానికి ఇవ్వవలసిన డబ్బు కట్టాలి.

భాగస్వామ్యం విజయవంతం కావాలంటే, ఆ సంస్థ సభ్యులపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి భాగస్వాములను సరిగా చూసి ఎంపిక చేసుకొనే అవసరం ఉండేది. భాగస్వామ్య వ్యవస్థ విజయవంతం అయ్యేందుకు సామూహిక స్ఫూర్తి ఒక్కటే మార్గం.

ఏదివశాత్తు భాగస్వామ్యపు ఉమ్మడి ఆస్తికి దోపిడీదొంగలు వల్ల లేదా రాజు చర్యల వల్ల ప్రమాదం సంభవించినప్పుడు ఒక భాగస్తుడు సొంతంగా ప్రయాసపడి, ఆ ఆస్తిని లేదా దానికి చెందిన వస్తువులను కాపాడగలిగితే, అతనికి దానిలో పదో భాగం చెందుతుంది.

BRAOU

ప్రతి భాగస్తుని ప్రయోజనాలను అతడు చనిపోయిన తర్వాత కూడ ఆ భాగస్వామ్య సంస్థ కాపాడుతుంది.

కార్మికులు భూమిని దున్ని వ్యవసాయం చేయడం, వివిధ కళలు, వృత్తులు కొనసాగించడం భాగస్వామ్యం ఆధారంగా కూడ జరిగేది. నైపుణ్యంలోను, జ్ఞానంలోను మనిషికి మనిషికి మధ్య భేదం ఉన్నట్లే, ఆదాయం పంపకం విషయంలోను భేదం ఉండేది.

15.7 ద్రవ్య విధానం

గుప్తులు, కుషాణులు ద్రవ్యమారకం కోసం బంగారు, వెండి, రాగి నాణేలను ముద్రించి వాడుకలో పెట్టారు.

గుప్త రాజులు 'దీనారాలు' అనే బంగారు నాణేలను ముద్రించారు. తొలి గుప్త రాజుల బంగారు నాణేలు కుషాణుల బంగారు నాణేల ప్రామాణిక తూకంపై ఆధారపడి ముద్రిస్తే, కుషాణులు నాణేలు ముద్రణకై రోమ్ చక్రవర్తులనుసరించిన ప్రామాణిక తూకాన్ని అనుసరించేవారు. తొలి గుప్తులు, కుషాణులు మొదట బంగారు నాణేలను ముద్రించినా, తర్వాత భారతీయ ద్రవ్య వ్యవస్థ నుండి హఠాత్తుగా మాయమైన బంగారం వలన, ఇతర వెండి, రాగి నాణేలను ముద్రించారు.

15.7.1 ద్రవ్య విధానం మారకం

ప్రాచీన భారతదేశంలో బ్యాంకింగ్ (బ్యాంకుల) వ్యవస్థ తొలి దశలో ఉండి, అభివృద్ధి చెందని కాలంలో సంపదను నిలువ చేసేందుకు దాన్ని రహస్యంగా దాచిపెట్టే పద్ధతి ఉండేది. నాడు గుప్త సామ్రాజ్యం విస్తరించి ఉండిన వివిధ ప్రదేశాల్లో గుప్తుల నాణేల నిధులు అనేకం దొరికాయి. భవిష్యత్తులో సంభవించే కరువు కాటకాలు, యుద్ధాలు మొదలగు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ధనాన్ని రహస్యంగా దాచిపెట్టడానికి గల ప్రధాన కారణం. కాబట్టి, సంపద నిల్వ చేయడం గుప్తుల కాలంలో నాణేలను ఉపయోగించేవారని తెలుస్తుంది.

డబ్బు వల్ల మరొక ప్రయోజనం ఏమంటే, అది రోజువారీ నిత్యావసర లావాదేవీలు జరిపేందుకు నిర్ణీత ప్రామాణిక విలువగా ఉపయోగపడుతుంది. ప్రామాణిక విలువ అనేది ఒకే ప్రామాణిక తూకం మీద ఆధారపడి ఉంటుంది. ప్రతి ద్రవ్య వ్యవస్థకు ఒకే రకమైన ప్రామాణిక తూకం చాలా అవసరం. ఈ విషయంలో చూస్తే, గుప్తుల నాణేలు పై రెండు సూత్రాలకు అనుగుణంగా ఉన్నాయి.

15.7.2 బంగారు నాణేలు

కుషాణులు, గుప్తులు బంగారు నాణేలు ముద్రించారు. కాని ఆ తర్వాత హఠాత్తుగా భారతీయ ద్రవ్య వ్యవస్థ నుండి బంగారం మాయమైంది. తర్వాత కాలంలో ఉత్తర భారతదేశాన్ని పాలించిన రాజులు కొందరు అప్పుడప్పుడూ బంగారు నాణేలను ముద్రించారు. ఆ కాలంలో బంగారు నాణేలకు మిక్కిలి ఎక్కువగా కొనుగోలు శక్తి ఉండేది. వాటిని మామూలు లావాదేవీల్లో ఉపయోగించేవారు కాదు. వాటిని అమూల్యమైన లోహంగా పరిగణించి, రహస్య నిధి రూపంలో దాటిపెట్టేవారు. లేదా ధనికుల కోసం వాటిని కరిగించి, బంగారు నగలు తయారు చేసేవారు.

BRAOU

గుప్తుల కాలంలో బీహార్‌లోని గనులనుండి లభించిన ఖనిజంతో, బంగారం తయారు చేసేవారు. విదేశాల నుండి కూడ బంగారాన్ని ముద్దగాను, లేదా కడ్డీల రూపంలోను, లేదా నాణేలుగాను దిగుమతి చేసికొనేవారు.

గుప్తుల కాలంలో సౌభాగ్య పరిస్థితులు ఉండినందువల్ల, వ్యాపార లావాదేవీలు కూడ ఎక్కువగానే జరిగేవి. ఆనాటి అవసరాలు తీర్చేందుకు ముందు కాలంలో కుషాణులు, తర్వాత కాలంలో గుప్తులు బంగారు నాణేలు ముద్రించారు.

మొదటి చంద్రగుప్తుని నుండి విష్ణుగుప్తుని వరకు గల గుప్త వంశ రాజులందరూ బంగారు నాణేలను ముద్రించారు. ఆ నాణేలకు దీనారాలు అని పేరుండేది.

తొలి గుప్త రాజుల బంగారు నాణేలు కుషాణుల బంగారు నాణేల ప్రామాణిక తూకం మీద ఆధారపడి ముద్రించారు. కుషాణులు నాణేలు ముద్రించేందుకు రోమ్ చక్రవర్తులు ముద్రించిన 'అరై' బంగారు నాణేల ప్రామాణిక తూకాన్ని అనుసరించారు. స్కందగుప్తుని కాలంలో మాత్రం ఈ పద్ధతిని మార్చుచేసి, 80 రత్తిలు లేక 144 గింజలు బరువుగల భారతీయ సువర్ణ నాణేల ప్రామాణిక తూకాన్ని వాడారు. కాని పి.యల్.గుప్త అభిప్రాయం ప్రకారం, గుప్తులకు నాణేలు ముద్రించడానికి వారి సొంత ప్రామాణికం ఉండేది. వారు కుషాణుల ప్రామాణికం గాని, రోమన్‌ల ప్రామాణికం గాని వాడలేదు. గుప్తుల బంగారు నాణేల ప్రామాణిక తూకం ఈ క్రింద పేర్కొన్న విధంగా ఉండేది.

రాజు	గ్రాములు	గింజలు
మొదటి చంద్రగుప్తుడు	7.65-7.77	188-120
కాచ గుప్తుడు	7.65-7.77	188-120
సముద్ర గుప్తుడు	7.65-7.77	188-120
రెండవ చంద్రగుప్తుడు	7.84	121
	8.00	124
	8.30	128
మొదటి కుమార గుప్తుడు	8.30-8.43	127-130
స్కంద గుప్తుడు	8.43-8.55	130-132
	9.20-9.33	142-144
రెండవ కుమార గుప్తుడు	9.00-9.27	139-143
బుధ గుప్తుడు	9.14-9.38	141.4-144.5
వైన్య గుప్తుడు	9.38-9.60	144.5-148
నరహింహ గుప్తుడు	9.38-9.60	144.5-148
మూడవ కుమార గుప్తుడు	9.50-9.60	147-148
విష్ణుగుప్తుడు	9.66-9.79	148-151

పైన ఇవ్వబడిన పట్టిక గమనించినట్లయితే, గుప్తుల కాలంలో బంగారు నాణేల బరువు కాలక్రమేణా పెరిగిందని తెలుస్తుంది.

గుప్తుల బంగారు నాణేల్లో బంగారం శాతం ఈ క్రింద పేర్కొన్న విధంగా ఉండేది.

రాజు	బంగారం శాతం
మొదటి చంద్రగుప్తుడు	80%
కాచ గుప్తుడు	80%
సముద్ర గుప్తుడు	80%
రెండవ చంద్రగుప్తుడు	80%
మొదటి కుమార గుప్తుడు	70-78%

BRAOU

స్కంద గుప్తుడు	67-79%
రెండవ కుమార గుప్తుడు	79%
బుధ గుప్తుడు	70-78%
ప్రకాశాదిత్యుడు	77%
వైన్య గుప్తుడు	73%
నరసింహ గుప్తుడు	71%
	54%
మూడవ కుమార గుప్తుడు	54%
విష్ణు గుప్తుడు	43%

పైన ఇవ్వబడిన పట్టిక గమనించినట్లయితే, గుప్తుల కాలంలో బంగారు నాణేల్లో బంగారం శాతం కాలక్రమేణా తగ్గిందని, బంగారు నాణేల్లో క్రమంగా బంగారంతో పాటు ఇతర లోహాలు కలిసినవని తెలుస్తుంది.

బంగారు నాణేల్లో కాలక్రమేణా పెరిగిన బరువు, తరిగిన బంగారం శాతం వల్ల గుప్తుల కాలం ద్వితీయార్ధంలో ఆర్థిక పరిస్థితులు దిగజారి పోయాయిని తెలుస్తుంది.

గుప్తుల బంగారు నాణేలపై రెండు వైపులా ఈ క్రింద పేర్కొన్న చిత్రాలు ముద్రించి ఉన్నాయి. ప్రతి నాణెంపై ఒక్కొక్క రకమైన చిత్రం ఉంది. ఈ చిత్రాల ఆధారంగా నాణేలను వివిధ రకాలుగా విభజింపవచ్చు. బంగారు నాణెం పైవైపున రాజు బొమ్మ, క్రింది వైపున దేవత లేక రాణి బొమ్మ ముద్రించి ఉన్నాయి.

నాణెం పైవైపు రకాలు (బొమ్మవైపు)

1. విలుకాడు
2. దండధారుడు
3. చక్ర ధ్వజం
4. ఖడ్గవీరుడు
5. పరశుధారుడు
6. మహారాజు, మహారాణి
7. సోఫాపై మహారాజు, మహారాణి
8. వేణుగానం
9. సోఫాపై ఆసీనుడై ఉన్న రాజు
10. అశ్వమేధం
11. పులిని చంపడం
12. సింహాన్ని చంపడం

BRAOU

13. గుర్రంపై స్వారీ

14. ఏనుగుపై స్వారీ

15. ఏనుగుపై స్వారీ చేస్తూ సింహాన్ని చంపడం

16. ఖడ్గమృగాన్ని చంపడం

17. గుర్రంపై స్వారీ చేస్తూ సింహాన్ని చంపడం

18. ఛత్ర ధారుడు

19. చక్ర విక్రముడు

20. కార్తికేయుడు, వెమలి

21. అప్రతిమ వీరుడు.

నాణెం క్రిందివైపు (బొరుసు వైపు) రకాలు

1. సింహాసనం మీద దేవత

2. కలువ మీద దేవత

3. నిలబడి ఉన్న దేవత

4. ముక్కాలి పీటపై కూర్చొని ఉన్న దేవత

5. సింహం మీద దేవత

6. మొసలి మీద దేవత

7. నిలుచొని ఉన్న మహారాణి

8. సోఫామీద మహారాణి

9. కార్తికేయుడు

15.7.3 వెండి నాణేలు

వెండి నాణేలను గుప్తరాజుల్లో మొదటగా రెండవ చంద్రగుప్తుడు ముద్రించాడు. అతని తర్వాత కాలంలో మొదటి కుమార గుప్తుడు, స్కంద గుప్తుడు, బుధ గుప్తుడు వెండినాణేలు ముద్రించారు. గుప్తులు వెండినాణేలు ముద్రించడంలో పశ్చిమ క్షత్రపుల వెండి నాణేలను అనుకరించారు.

గుప్తుల వెండి నాణేల్లో పై (బొమ్మ) వైపున రాజబొమ్మను ముద్రించారు. ఆ నాణేలపై వాటిని ముద్రించిన సంవత్సరంకూడ ఉంది. క్రింది (బొరసు) వైపున మధ్యలో బొమ్మ, దాని చుట్టూ గుండ్రంగా రాజుపేర్లు, బిరుదులతో శాసనం ఉన్నాయి. గుప్తుల వెండి నాణేలు ముఖ్యంగా పశ్చిమ భారతదేశంలోని ప్రాంతాల్లో వాడుకలో ఉండేవి.

BRAOU

Dr. BRAOU LIBRARY Acc. No. 115057 954 Cla...

15.7.4 రాగి నాణేలు

గుప్త రాజులు రాగి నాణేలు కూడ ముద్రించారు. కాని అవి తక్కువ సంఖ్యలో లభించాయి. సముద్ర గుప్తుడు, రెండవ చంద్ర గుప్తుడు, రామ గుప్తుడు, మొదటి కుమార గుప్తుడు, హరి గుప్తుడు రాగి నాణేలు ముద్రించారు. ఆ నాణేలపై రాజు బొమ్మ, పేరు, బిరుదులు ఉన్నాయి. గుప్తుల రాగి నాణేలు బెంగాల్, బీహార్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రదేశాల్లో దొరికాయి.

15.8 సంగ్రహంగా

గుప్తుల కాలంలో భారతదేశంలో ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండేవి. ఆర్థికాభివృద్ధి చెప్పుకోతగినంతగా జరిగింది. భూములపై రాజుకు యాజమాన్యపు హక్కు ఉండినా, ఆ కాలంలో వ్యక్తి యాజమాన్యం కూడా వాడుకలోకి వచ్చింది. భూములు వివిధ రకాలుగా వర్గీకరింపబడ్డాయి. కౌలుదారీ విధానం అమల్లో ఉండేది. భూములు సర్వేచేసి కొలతలు, హద్దులను నిర్ణయించేవారు.

గుప్తుల కాలంలో ప్రభుత్వానికి భూమి శిస్తు ఇతర పన్నుల ద్వారా ఆదాయం వచ్చేది. నాటి ఆర్థిక జీవనం ముఖ్యంగా వ్యవసాయం పై ఆధారపడి ఉండేది. ప్రజలు తృణ ధాన్యాలు, పప్పు ధాన్యాలు మొదలైన అనేక రకాల పంటలను పండించేవారు. అడవులు, తోటలు పెంచేవారు. పశు పోషణ చెప్పుకోగలిగినంతగా ఉండేది.

గుప్తుల కాలంలో బానిసలు, కూలి పనివారు, వెట్టి పనివారు కార్మిక వర్గంగా ఉండేవారు. ప్రజల సామూహిక ఆర్థిక జీవన విధానంలో శ్రేణులు, సంస్థలు, భాగస్వామ్యం ప్రముఖ పాత్ర వహించేవి. గుప్తులు ద్రవ్యమారకం కోసం బంగారు, వెండి, రాగి నాణేలను ముద్రించి వాడుకలో పెట్టారు.

ఈ విధంగా గుప్తులు ఆర్థిక రంగంలో చేపట్టిన చర్యల వల్ల, తెచ్చిన మార్పుల వల్ల, సాధించిన అభివృద్ధి వల్ల ఆ కాలంలో భారతదేశంలో ప్రజలు భోగభాగ్యాలను అనుభవించారు.

BRAOU

15.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. గుప్త రాజులు అనుసరించిన ఆర్థిక విధానాన్ని వివరించండి
2. గుప్తుల కాలంలో ఉన్న భూమి విధానాన్ని పరిశీలించండి
3. గుప్త రాజుల పాలనలో వ్యవసాయాభివృద్ధిని గురించి రాయండి
4. గుప్తుల కాలం నాటి శిస్తు విధానం ఎట్టిది?
5. గుప్త రాజులు అమల్లో పెట్టిన ద్రవ్య విధానాన్ని వర్ణించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. గుప్తుల కాలంలో భూమి కొలుదారీ విధానం

2. గుప్తుల కాలంలో శిస్తు విధానం

3. గుప్తుల పాలనలో పశుపోషణ

4. గుప్తుల కాలంలో కార్మికుల స్థితిగతులు

15.10 ఉపయుక్త గ్రంథాలు

Bandyopadhyaya, N - **Economic Life and Progress in Ancient India**

Buch, M.A. - **Economic Life in Ancient India (2 Vols)**

Chopra, P.N., Puri, B.N. & Das, M.N. - **A Social, Cultural and Economic History of India**

Das, S.K. - **Economic History of Ancient India**

Dhar, M.K. & Mehta, R.L. - **Social and Economic History of Ancient India**

Gokhale, B.G. - **Samudra Gupta - Life and Times**

Gupta, P.L. - **The Imperial Guptas (2 Vols)**

Ghoshal, U.N. - **The Agrarian System in Ancient India**

Jha, D.N. - **Revenue System in Post-Maurya and Gupta Times**

Luniya, B.N. - **Life and Culture in Ancient India**

Maity, S.K. - **Economic Life of North India in the Gupta Period.**

Majumdar, R.C. & Altekar, A.S. - **The Vakataka Gupta Age**

Majumdar, R.C. (Ed) - **The Classical age**

Mookerji, R.K. - **The Gupta Empire**

Pran Nath - **A Study in the Economic Condition of Ancient India.**

Rai, G.K. - **Ancient Indian Economic Institutions (2 Parts)**

Romesh Dutt - **The Economic History of India**

Roy Choudhury, S.C. - **Social, Cultural and Economic History of Ancient India**

Saletore, R.N. - **Life in the Gupta Age**

Saletore, R.N. - **Early Indian Economic History**

రచయిత: ఆచార్య బి.వసంతనయ్య

BRAOU

భాగం - 16 : గుప్తుల అనంతర కాలం నాటి ఆర్థిక పరిస్థితులు

విషయక్రమం

16.0 లక్ష్యాలు

16.1 పరిచయం

16.2 హర్షుని పాలన

- 16.2.1 వ్యవసాయం
- 16.2.2 నీటిపారుదల
- 16.2.3 శ్రేణులు
- 16.2.4 నాణేలు
- 16.2.5 రుణ విధానం

16.3 కార్మిక విధానం

16.4 బాదామి చాళుక్యుల పాలన

- 16.4.1 గ్రామం
- 16.4.2 రెవిన్యూ విధానం
- 16.4.3 శ్రేణులు
- 16.4.4 తూనికలు - కొలతలు
- 16.4.5 నాణేలు

16.5 పల్లవుల పాలన

- 16.5.1 గ్రామాలు
  - 16.5.1.1 గ్రామీణ విస్తరణ
  - 16.5.1.2 గ్రామీణ ఆర్థిక జీవనం
  - 16.5.1.3 గ్రామంలో సమిష్టి ఆస్తి
  - 16.5.1.4 బ్రహ్మదేయ గ్రామాలు
  - 16.5.1.5 దేవదాన గ్రామాలు
  - 16.5.1.6 గ్రామ జనాభా
  - 16.5.1.7 గ్రామంలోని ఇళ్లు, పెరటి తోటలు
  - 16.5.1.8 గ్రామీణ వృత్తులు
  - 16.5.1.9 గ్రామీణ మార్కెట్లు

BRAOU

16.5.2 భూ యాజమాన్యం
16.5.2.1 ప్రైవేట్ యజమాన్యం
16.5.2.2 రాజు
16.5.3 భూముల దానధర్మాలు
16.5.4 భూమి సర్వే
16.5.5 కౌలుదారీ విధానం
16.5.6 నీటి పారుదల
16.5.6.1 చెరువులు
16.5.6.2 బావులు
16.5.6.3 కాలువలు
16.5.6.4 ఎత్తిపోతల పథకం
16.5.6.5 నీటితూములు
16.5.6.6 నీటిపారుదల నిర్వహణ
16.5.7 వ్యవసాయ పంటలు
16.5.8 రైతులు - పన్నులు
16.5.9 రెవిన్యూ విధానం
16.5.10 కరువు కాటకాలు
16.5.11 తూనికలు - కొలతలు
16.5.12 నాణేలు
16.6 సంగ్రహంగా
16.7 పరీక్ష నమూనా ప్రశ్నలు
16.8 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

16.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగల్గాలి.

★ గుప్తుల అనంతర కాలంలో ఉత్తర భారతదేశంలో హర్షుని పాలనలో వ్యవసాయం, నీటి పారుదల, శ్రేణులు, నాణేలు, రుణ విధానం, కార్మికుల స్థితిగతులు.

★ కర్నాటకలో బాదామి చాళుక్యుల కాలంనాటి గ్రామీణ స్వరూపం, రెవిన్యూ విధానం, శ్రేణులు, తూనికలు-కొలతలు, నాణేలు

★ తమిళ ప్రాంతంలో పల్లవుల పాలనలో గ్రామీణ ఆర్థిక జీవన స్వరూపం, భూ యాజమాన్యం, నీటి పారుదల, వ్యవసాయం, రెవిన్యూ విధానం.

16.1 పరిచయం

గుప్తుల అనంతర కాలంలో ఉత్తర భారతదేశంలో హర్షుడు, కర్నాటకలో బాదామి చాళుక్యులు, తమిళనాడులో పల్లవులు అధికారంలోకి వచ్చారు. హర్షుని పాలనలో ఉత్తర భారతదేశంలోను, బాదామి చాళుక్యులు, పల్లవుల పాలనలో దక్కన్, దక్షిణ భారతదేశంలోను రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగింది.

16.2 హర్షుని పాలన

హర్షుని పాలనలో జరిగిన ఆర్థికాభివృద్ధిని చైనా యాత్రికుడు హుయన్త్సాంగ్(Huantsang) వర్ణించాడు. ఆకాలంలో ఆర్థిక సౌభాగ్యానికి కేంద్రాలుగా కనౌజ్, ప్రయాగ (అలహాబాద్), స్థానేశ్వర (థానేశ్వర్), మంతిపుర (బిజ్నోర్ సమీపంలో), మయూర (హరిద్వార్), గోవిశన (రాంపూర్), పుణ్యవర్ధన (రంగపూర్) మొదలైన నగరాలుండేవి. రాజధాని నగరం కనౌజ్ లోని ఎత్తైన భవంతులు, అందమైన ఉద్యానవనాలు, స్వచ్ఛమైన నీటితో నిండిన తటాకాలు, వింత ప్రదేశాలనుండి సేకరించిన వస్తువులతో నిండిన ప్రదర్శన శాలలు ఆ నగర సౌభాగ్యానికి నిదర్శనాలు.. ఆ నగర ఆర్థిక ఉన్నతికి దాని పౌరుల నాగరిక సంస్కారం, వారు ధరించిన మెరిసే పట్టువస్త్రాలు, విద్య, కళలలో వారి భక్తి, వారి స్పష్టమైన ప్రసంగాలు, అధిక సంపదతో ఉండే ధనిక వర్గాలు, కుటుంబాలు కూడ ప్రత్యక్ష తార్కాణాలే.

హర్షుని కాలంలో నిర్మింపబడిన భవనాలు, సంఘారామాలు కూడ నాటి ఆర్థిక సౌభాగ్యాన్ని సూచిస్తాయి. రాజధాని నగరం కనౌజ్‌లో ఎత్తైన భవనాలుండేవి. రాజభవనాన్ని పలు అంతస్తులతో నిర్మించారు. మీది అంతస్తులకు వెళ్ళడానికి మెట్లు ఉండేవి. రాజప్రసాదంలో నాలుగు ఆవరణలు ఉండేవి. నేలమీద ఎర్రసీసం మొజాయిక్ పరిచారు. ఆ భవనాన్ని సుందర దృశ్యాల చిత్రాలతోను, మట్టితో చేసిన చేపలు, తాబేళ్ళు, మొసళ్ళు, కొబ్బరి కాయలు, అరటి కాయలు, పోకచెట్లు మొదలగు బొమ్మలతో అలంకరించారు. రాజభవనంలో విహరించడానికి కొలనులుండేవి. కొలనులోకి మొసలి నోటినుండి సువాసనతో కూడిన నీరు వచ్చే ఏర్పాటు చేశారు.

బౌద్ధ సంఘారామాల వాస్తు శైలి అత్యంత ప్రసిద్ధమైంది అని హుయన్త్సాంగ్ ప్రశంసించాడు."అవి చతురస్రాకారంలోని నాలుగు మూలల్లో ప్రతి మూలల్లోను ఒక గోపురం, ఒకదానిమీద మరొకటి నిర్మించిన మూడు పెద్ద గదులు కలిగి ఉండేవి. ఇంటి వాసాలు, కప్పు దూలాలమీద వింత వింత బొమ్మలను చెక్కారు. ద్వారాలు, కిటికీలు, గోడలమీద పలురకాల రంగులు వేశారు" అని హుయన్త్సాంగ్ వర్ణించాడు.

16.2.1 వ్యవసాయం

గుప్తుల తర్వాత కాలంలో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన మార్పు వచ్చింది. భూముల దాన గ్రహీతలు తమ యాజమాన్యంలోని భూములను తామే సాగు చేసుకొనేవారు కాదు. వారి భూముల మీది శిస్తును కూడ వసూలు చేయకుండేవారు. వారి భూముల సాగును రైతులకు లేక కౌలుదార్లకు అప్పగించేవారు. ఆ భూములు రైతులు లేక కౌలుదార్ల అధీనంలో ఉండేవి. కాని వారికి ఆ భూముల మీద యాజమాన్యం హక్కు లేకుండేది.

భారతదేశంలోని సంఘారామాల యాజమాన్యంలోని భూములను సేవకులు, ఇతరులు సాగు చేసేవారని చైనా యాత్రికుడు ఇట్సింగ్(Itsing) పేర్కొన్నాడు. శూద్రులు వ్యవసాయదారులని హుయన్త్సాంగ్ తెలిపాడు. అతని రచలవల్ల ఆకాలానికే శూద్రులు బానిసలుగా , వ్యవసాయ కార్మికులుగా భూములు సాగుచేయలేదని తెలుస్తుంది. అంటే శూద్రుల యాజమాన్యంలో కూడ భూములు ఉండేవని విశదమౌతుంది.

ఆదివాసి ప్రాంతాల్లో గ్రామాలను దానంగా ఇచ్చినపుడు మత సంబంధ దానగ్రహీతల అధీనంలో వ్యవసాయదారులను ఉంచేవారు. దాన గ్రహీతలు ముఖ్యంగా బ్రాహ్మణులే. ఎందువల్లంటే క్రీ.శ.5, 6 శతాబ్దాల నుండి భూములను ఎక్కువగా బ్రాహ్మణులకే దానంగా ఇచ్చేవారు.

ఒరిస్సా, దక్కన్ మొదలగు వెనుకబడిన ప్రాంతాలు, పర్వత ప్రాంతాల్లో క్రీ.శ. 6వ శతాబ్దం నుండి దానగ్రహీతలకు ఇవ్వబడిన భూములనే కౌలుదార్లు, రైతులు సాగుచేయాలనే నియమం అమల్లో పెట్టారు.

BRAOU

ఉత్తర భారతదేశంలోని చేతి పనులవారు, రైతులు దానగ్రహీతలకు ఇవ్వబడిన గ్రామాలను వదలివెళ్ళకూడదనే నియమం పెట్టారు. దాని ఫలితంగా వారు ఒక గ్రామం వదలి మరొక గ్రామంలో నివాసం ఏర్పరచుకొనే వీలుండేది కాదు. వారు వారి గ్రామాల్లోనే నివసిస్తూ, ఆ గ్రామాల అవసరాలను తీర్చవలసి ఉండేది.

భారతదేశంలో క్రీ.శ.7వ శతాబ్దం నాటి వ్యవసాయ ఉత్పత్తులను గురించి వ్యాఖ్యానిస్తూ, ప్రజలు ఎక్కువగా వరి, గోధుమ పండించేవారని, అల్లం, ఆవాలు, గుమ్మడి కూడ సాగుచేసేవారని హుయంగ్‌త్సాంగ్ తెలిపాడు. మామిడి, ఖర్జూర, కొబ్బరి, పనస, అరటి, చింత, వెలగ, దానిమ్మ, కమలాలు మొదలగు పండ్లు కూడ పండించేవారు. ఉద్యాన, డరెల్, కాశ్మీర్‌లలో కుంకుమ పువ్వు (కేసరి), కాశ్మీర్, కులటల్లో ఔషధ మొక్కలు సాగుచేసేవారు. పూంచ్, మథుర ప్రాంతాల్లో పండ్లతోటలు ఎక్కువగా ఉండేవి. పరియాత్ర (బైరట్) ప్రాంతాల్లో 60 రోజుల్లో కోతకువచ్చే అనేక రకాల వరి ధాన్యం పండించేవారు. మగధలో పెద్ద పరిమాణంలో ఉండే, సువాసనలిచ్చే వరిధాన్యం రకాన్ని సాగుచేసేవారు. 'ఓట' (ఓడ్ర) ప్రాంతంలో మిగిలిన ప్రదేశాల్లో పండే పండ్లకంటే పెద్దవైన పండ్లను పండించేవారు. చందనం, కర్పూరం మొదలగు సుగంధాలనిచ్చే చెట్లను తమిళనాడులో సముద్రతీరానికి సమీపంలో మలయా కొండల్లో పెంచేవారు.

భారతదేశంలో వరిధాన్యం, ఖర్జూర పండ్లు, చెరకు, దుంపలు ఎక్కువగా పండించేవారని, కాని జొన్నలు చాలా తక్కువగ సాగుచేసేవారని క్రీ.శ.7వ శాతబ్దం నాటి చైనా యాత్రికుడు ఇట్సింగ్ పేర్కొన్నాడు. భారతదేశ వాయువ్య ప్రాంతంలో గోధుమ, పశ్చిమ ప్రాంతంలో వరిధాన్యం లేక బార్లీ, మగధలో వరిధాన్యం సమృద్ధిగా ఉండేవని కూడ ఇట్సింగ్ తెలిపాడు.

శ్రీకంత (స్థానేశ్వర్) ప్రాంతంలోని వ్యవసాయ ఉత్పత్తుల్లో వరిధాన్యం, గోధుమ, చెరకు, వివిధ రకాల చిక్కుళ్ళు, ద్రాక్ష, దానిమ్మ ముఖ్యమైనవి అని బాణుడు 'హర్ష చరిత్ర'లో పేర్కొన్నాడు. ద్రాక్ష, దానిమ్మ తోటలు పెంచేవారని, జీలకర పంటకు వర్షియా జలచక్రాల సహాయంతో నీరు పెట్టేవారని బాణుడు పేర్కొన్నందువల్ల, ఆ కాలంలో వ్యవసాయం సాంకేతికంగా అభివృద్ధి చెందిందని తెలుస్తుంది. మొత్తంమీద హర్షుని కాలంలో వ్యవసాయ రంగం ఆర్థికంగా మార్పుచెంది, గణనీయంగా పురోగతి సాధించిందని ఆనాటి బాణుడు, చైనా యాత్రికులైన హుయన్‌త్సాంగ్, ఇట్సింగ్ రచనల వల్ల తెలుస్తుంది.

16.2.2 నీటిపారుదల

హర్షుని కాలంలో వ్యవసాయ భూములకు నీటిపారుదల సదుపాయం కల్పించేందుకు కాలువలు, చెరువులను నిర్మించేవారు. బావులను త్రవ్వేవారు. వాటి నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టేది. అంతే కాక వాటి నిర్మాణంలో ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల పాత్ర కూడ ఉండేది. గ్రామీణ భూములకు నీటిపారుదలకు ఏతాములు కూడ ఉపయోగించేవారు. నీటి పారుదలకు నీటి పంపులు (లూలా యంత్రాలు) కూడ ఉపయోగించేవారు అని బాణుడు పేర్కొన్నాడు.

16.2.3 శ్రేణులు

హర్షుని కాలంలో దేశంలోని పారిశ్రామిక జీవనం కులాలు, పెద్ద కార్పోరేషన్లు లేక శ్రేణుల ఆధారంగా ఏర్పడి ఉండేది. దేశీయ, విదేశీ వాణిజ్యాలు వైశ్యుల అధీనంలో ఉండేవి. దేశంలో వ్యవసాయం ప్రధాన పరిశ్రమగా ఉండేది. అది శూద్రుల అధీనంలోనే ఉండేది. చైనా యాత్రికుడు హుయన్‌త్సాంగ్ సంకీర్ణ కులాలను పేర్కొన్నాడు. అవివిధ

BRAOU

రకాల వారికి ప్రవేశం కల్పించే కార్పొరేషన్లు అని, అందువల్ల అవి శ్రేణులు అని వాట్టర్స్ వివరించాడు. రాజకుమారి రాజ్యశ్రీ వివాహం సందర్భంగా, ప్రతి దేశంలోని వడ్రంగులు, చిత్రకారులు, శిల్పకారులు మొదలగువారు ఏర్పాటు చేసుకొన్న శ్రేణులను ఆహ్వానించారని బాణుడు పేర్కొన్నాడు.

శ్రేణులకు కార్యనిర్వహణాధికారులుగా అధ్యక్షులు లేక ముఖ్యులు ఉండేవారు. వారికి సహాయంగా ఇద్దరు, ముగ్గురు లేక ఐదుగురు సభ్యులుగల సంఘాలు ఉండేవి. ఆ సభ్యులను ప్రజల బాగు కొరకు సలహాదారులు (సమూహ హితవాదినులు) లేక ప్రజా కార్యాల నిర్వహణ సలహాదారులు (కార్య చింతకులు) అనేవారు. శ్రేణిలో అధికార వికేంద్రీకరణ ఉండేది. శ్రేణి సభ్యులు తప్పు చేసినయెడల వారిని మందలించడం, అభిశంసించడం, లేక బహిష్కరించడం చేసే అధికారం అధ్యక్షునికి ఉండేది. శ్రేణి అధ్యక్షులు వారి విధి నిర్వహణలో భాగంగా ఇచ్చిన తీర్పులను రాజు కూడ గౌరవించి, ఆమోదించేవాడు. సలహాదారుల అభిప్రాయాలను శ్రేణులు గౌరవించెవి.

ఆచరణలో ఉండే నియమాల్ని పద్ధతుల్ని సంరంక్షించేందుకు శ్రేణులు 'స్థితి పత్రాలు' లేక 'సంవిత పత్రాలు' అనే పేరుతో సాంప్రదాయ పత్రాలను తయారు చేసేవి. వాటిని అమలు చేసే బాధ్యత రాజుది. రాజు ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండే, ప్రజల ఆమోదం లేని, ప్రజలకు హాని కలిగించే సాంప్రదాయ పత్రాల విషయంలో మాత్రం రాజుకు వాటిని అమలు చేసే బాధ్యత ఉండేది కాదు. శ్రేణి సభ్యులు సాంప్రదాయాలు, నియమాలు, వారి విధులను పాటించి, రాజు ఆజ్ఞలకు విధేయులుగా ఉండేవారు. శ్రేణి సభ్యుడు సాంప్రదాయ నియమాలకు విరుద్ధంగా ప్రవర్తించిన యెడల వారి ఆస్తి స్వాధీనం చేసుకొనేవారు లేదా అతడిని బహిష్కరించేవారు.

శ్రేణి సభ్యులు ఆయుధాలు ధరించడం, తమలో తాము పొట్లాడుకోవడం నిషేధించేవారు. శ్రేణి సభ్యుల ప్రయోజనాలను దెబ్బతీసేవారిని బహిష్కరించేవారు. ఘోరమైన నేరాలు చేసేవారికి, చీలికలు తెచ్చేవారికి, శ్రేణి ఆస్తులను ధ్వంసంచేసేవారికి కఠిన శిక్ష వేసేవారు. అటువంటి వారికి కొన్ని సందర్భాల్లో, రాజు మరణ శిక్ష కూడ విధించేవాడు. శ్రేణికి వచ్చే ఆదాయంలోను, రాజు అనుగ్రహంతో లభించినదానిలోను, శ్రేణి నిర్వహణ ఫలితంగా కలిగే అప్పుల్లోను సభ్యులకు సమాన వాటా ఉండేది.

16.2.4 నాణేలు

హర్షుని కాలంలో భారతదేశంలో బంగారం, వెండి నాణేలే కాక, గవ్వలు, చిన్న ముత్యాలుకూడ నాణేలుగా చలామణిలో ఉండేవని హుయాన్త్సాంగ్ పేర్కొన్నాడు. 'ప్రతాపశీల' పేరుతో ఉన్న వెండినాణేలు కూడ లభించాయి. 'సలవత్త' అంటే శీలాదిత్యుడుగా గుర్తించారు. హర్షుని పేరుతో ఉన్న నాణెం మీద 'విజేత, అవనీపతి అయిన శ్రీశీలాదిత్యుడు స్వర్గలోకాన్ని జయిస్తాడు' అన్న శాసనం ఉంది.

16.2.5 రుణ విధానం

రుణాలు మూడు రకాలుగా ఉండేవి. అవి 1.హామీ లేకుండ ఇచ్చే రుణాలు, 2. హామీ మీద ఇచ్చే రుణాలు, 3. హామీ లేక తాకట్టు మీద ఇచ్చే రుణాలు. హామీలు, తాకట్లు కూడ పలురకాలుగా ఉండేవి. మొదటి రకం రుణాలు ఎటువంటి హామీ అవసరం లేకుండా ఇచ్చేవారు. రెండో రకం రుణాలు పొందడానికి వ్యక్తిగత హామీ అవసరం. మూడో రకం రుణాలు వస్తువులు లేక స్థిరాస్తుల తాకట్టు మీద ఇచ్చేవారు.

BRAOU

రుణాల మీద పలురకాల వడ్డీ రేట్లు వాడుకలో ఉండేవి. న్యాయసమ్మతంగా వసూలు చేయదగిన వడ్డీ రేటు నెలకు అసలుమొత్తంమీద 1 1/4% నుండి 2% వరకు ఉండేది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వడ్డీ రేటు 5% వరకు ఉండేది. ఈ వడ్డీని రోజువారీ లేదా నిర్ణీత కాలంవారీగా వసూలు చేసేవారు. వడ్డీ మొత్తం అసలుమొత్తం కంటె ఎక్కువ ఉండకూడదనే నియమం ఉండేది. కాని కొన్ని ప్రత్యేక వస్తువుల మీద వడ్డీ అసలు మొత్తాన్ని దాటడానికి అనుమతించేవారు. అసలు రుణమొత్తంమీద అధిక వడ్డి బంగారం, వెండి మొదలగు వాటికి రెండు రెట్లుగా, ధాన్యానికి మూడురెట్లుగా, వస్త్రాలకు నాలుగురెట్లుగా, ద్రవాలకు ఎనిమిదిరెట్లుగా ఉండెది.

రుణదాత బాకీదారుల వస్తువులు లేక ఆస్తి తాకట్టుగాను లేదా బాకీదారుడు, సాక్షుల సంతకాలతో ఉన్న హామీ పత్రం మీద ఆధారపడి అప్పు ఇచ్చేవాడు. నోటిమాట హామీ కంటే పత్రాలమీద ఇచ్చే హామీ విశ్వాసనీయమైందిగా పరిగణించేవారు. హామీ పత్రాన్ని న్యాయబద్ధమైందిగా పరిగణించేవారు. బాకీదారుడు రుణదాతకు అప్పుతీసుకొన్న మొత్తాన్ని తిరిగి ఇవ్వకపోతే, దాన్ని బాకీదారునుండి వసూలు చేసుకొనేందుకు రుణదాతకు అధికారం ఉండేది. అప్పు తిరిగి రాబట్టుకొనేందుకు యుక్తిద్వారా, బలం ఉపయోగించడం, పనులు చేయించడం, ప్రజల ఒత్తిడి, న్యాయస్థానంలో దావా వేయడం మొదలగు ఆమోదయోగ్యమైన పద్ధతులు ఉండేవి. బాకీదారుడు న్యాయస్థానంలో విచారణ కోరినట్లయితే, దాన్ని ఖాతరు చేయక బాకీదారుని రుణదాత హింసిస్తే, రుణదాతకు ఆ అప్పు తిరిగి రాబట్టుకొనే హక్కు ఉండదు. అంతేగాక రుణదాత తాను ఇచ్చిన అప్పుకు సమానంగా అపరాధ రుసుం చెల్లించవలసి ఉండేది.

16.3 కార్మిక విధానం

హర్షుని కాలం నాటికి దేశంలో చిరకాలంగా ఉండే దేశీయ వ్యవస్థతో బాటు, ఉత్పత్తి, సంపిణీల్లో పెట్టుబడిదారీ పద్ధతులు వాడుకలోకి వచ్చాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో వెట్టి పనివారిని, బానిస పనివారిని నియోగించడం ముఖ్య లక్షణంగా ఉండేది. ప్రభుత్వం పనులకు వెట్టి పనివారిని ఉపయోగించేది. ధనిక వర్గాలకు చెందిన ప్రజలు బానిసలను సేవకులుగాను, నీచమైన పనులకు నియోగించేవారు.

జీతం మీద పనిచేసేవారిని వ్యవసాయం, పశుపోషణ, పరిశ్రమలు, వాణిజ్య రంగాల్లోను, ఇంటిపనులకు నియోగించేవారు. వారిలో మూడు తరగతులు ఉండేవి. 1. సైనికులు మొదటి తరగతికి చెందినవారు. 2.వ్యవసాయదారులు రెండవ తరగతి వారు. 3.బరువులు మోసేవారు, ఇంటిసేవకులు మూడవ తరగతికి చెందిన వారు. కార్మికులకు రోజులెక్కన జీతం ఇచ్చేవారు. వారికి జీతం డబ్బురూపంలోగాని లేక ధాన్యం రూపంలో గాని ఇచ్చేవారు.

పనివారు తమ యజమాని నిర్దేశించిన పనిని సక్రమంగా నిర్వహించక మోసానికి పాల్పడిత, అటువంటి వారు జీతం పొందే హక్కును కోల్పోయేవారు. వారిని న్యాయస్థానంలో విచారించేవారు. పనివారు జీతం తీసుకొని తమకు నిర్దేశించిన పని చేయకపోతే, వారు జీతాన్ని తిరిగి ఇవ్వడమేగాక, దానికి రెండురెట్లు అపరాధ రుసుంగా రాజుకు చెల్లించవలసి వచ్చేది. పనివారు తమకు నిర్దేశించిన పనిపూర్తి చేసేందుకు ఒప్పుకొన్న తర్వాత కూడా ఆ పని అసంపూర్తిగా వదలిపోస్తే, అతని చేత బలవంతంగా ఆపని పూర్తిచేయించే అధికారం రాజుకు ఉండేది. అంతేగాక, అటువంటి పనివారు, అపరాధ రుసుం కూడా చెల్లించవల్సి ఉండేది. పనివారి అధీనంలో ఉంచిన వస్తువులు దొంగలు తీసుకొని పోవడం, అగ్నిప్రమాదంలో కాని లేదా వరదలవల్ల కాని నష్టపోవడం జరిగితే, ఆ పనివారికిబాధ్యత

BRAOU

ఉండేది కాదు. యజమాని తనక్రింద జీతానికి పనిచేసే జబ్బుతో ఉన్న సేవకుడ్ని రహదారి మీద వదలివేస్తే అపరాధ రుసుం చెల్లించే శిక్ష యజమానికి వేసేవారు.

16.4 బాదామి చాళుక్యుల పాలన

కర్నాటకలో కాదంబుల అనంతరం బాదామి చాళుక్యులు అధికారంలోకి వచ్చారు. వారి పాలనలో చైనా యాత్రికుడు హూయన్‌త్సాంగ్ దక్కన్ దర్శించాడు. ఆకాలంలో దక్కన్‌లో అన్ని రంగాల్లో బాదామి చాళుక్యులు సాధించిన అభివృద్ధిని హూయన్‌త్సాంగ్ వర్ణించాడు. క్రీ.శ.6వ శతాబ్దం నుండి క్రీ.శ.8వ శతాబ్దం మధ్య భాగం వరకు గల కాలంలో కర్నాటకలో రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో గణనీయంగా అభివృద్ధి జరిగింది.

16.4.1 గ్రామం

బాదామి చాళుక్యుల పరిపాలనా వ్యవస్థలో గ్రామం అట్టడుగున ఉండేది. గ్రామాధికారిని 'గాముండ' అని పిలిచేవారు. అతడు ప్రభుత్వానికి, ప్రజలకు, మధ్య సంధానకర్తగా వ్యవహరించేవాడు. అతడిని కేంద్ర ప్రభుత్వం నియమించేది. గ్రామానికి సంబంధించిన మరోక అధికారిగా కరణం ఉండేవాడు. గ్రామ పరిపాలనకు సంబంధించిన సాంఘిక, ఆర్థిక వ్యవహారాల క్రమబద్ధీకరణ 'మహాజనుల' (గ్రామ పెద్దలు) అజమాయిషీలో ఉండేది.

బాదామి చాళుక్యుల పాలనలో రాచరిక ప్రభుత్వానికి, గ్రామీణ సంస్థలకు మధ్యగల సంబంధాలుగురించిన విలువైన సాక్ష్యాధారాలు యువరాజు విక్రమాదిత్యుని 'లక్ష్మేశ్వర్ శాసనం' వల్ల లభిస్తాయి. మహాజనులు, నగరులు, ప్రాకృతులకు యువరాజు విక్రమాదిత్యుడు ఇచ్చిన హక్కులు, విధులు శాసన పత్రం (ఆచార వ్యవస్థ) ఈ శాసనంలో ఉంది. ఈ పత్రం వల్ల స్థానిక వ్యవహారాలు చివరగా రాజు నియంత్రణలో ఉండేవని తెలుస్తుంది. అది రాజ్యాధికారులను (రాజ పురుష) పేర్కొని, ఇదివరకే ఏర్పడిన కొన్ని హక్కులను సంరక్షించే బాధ్యత వారి విధిగా నిర్ణయించింది. మహాజనులను, నగరులను, పారిశ్రామిక, వాణిజ్య ప్రయోజనాలను, 18 ప్రాకృతులను అది పేర్కొంది. దేశాధిపతులకు వైశాఖ మాసంలోను, శ్రేణులకు కార్తీక మాసంలోను చెల్లింపవలసిన పన్నుల (తెర్రె) రేట్లను లక్ష్మేశ్వర్ శాసనం వివరంగా పేర్కొంది. ఇత్తడి పనివారి శ్రేణి (కంచర సేణి), నూనె గానుగ పనివారి శ్రేణి (తెల్లిగ సేణి), వాటికి చెందవలసిన చెల్లింపులు కూడ ఈ శాసనం పేర్కొంది. లక్ష్మేశ్వర్ శాసనంలోని ఈ వివరాల వల్ల నాటి ఆర్థిక, రాజకీయ వ్యవస్థ గురించి స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది.

16.4.2 రెవిన్యూ విధానం

బాదామి చాళుక్యుల కాలంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో భూమిశిస్తు అత్యధిక భాగంగా ఉండేది. భూమిశిస్తును ధాన్యం రూపంలో చెల్లించేవారు. దానికి 'భాగకార' లేక 'వడ్డరావుళ' అని పేరుండేది. భూమిశిస్తు వసూలు చేసేందుకు నిర్ణీత సమయాల్లో విచారణలు జరిపి, శిస్తు నిర్ణయించేవారు. వ్యవసాయ ఉత్పత్తిలో ఆరో భాగం (1/6),భూమిశిస్తుగా ఉండేది. కాని యుద్ధ సమయంలోను, ప్రభుత్వ ఖజానా లోటుగా ఉన్న సమయాల్లోను పన్నులు పెంచేవారు.

BRAOU

భూమిశిస్తు తర్వాత వ్యాపార సరుకుల మీద వేసే పన్ను (పెర్జుక) ప్రభుత్వానికి ముఖ్యమైన ఆదాయంగా ఉండేది. ఆ పన్నును డబ్బురూపంలోకాని, వస్తురూపంలో కాని వసూలు చేసేవారు. ఇవి కాక ఇంటి పన్ను, ఆక్ట్రాయ్ సుంకాలు, ఎక్సయిజ్ సుంకాలు, సైన్య నిర్వహణకు పన్నులు మొదలగు పన్నులను కూడ బాదామి చాళుక్యుల పాలనలో విధించారు.

బాదామి చాళుక్యుల పాలనలో దానధర్మాలకు సంబంధించిన గ్రామాలు లేదా పన్నుల ద్వారా వచ్చే ఆదాయం మీద హక్కులు ఇచ్చే సందర్భంలో పేర్కొనే మినహాయింపులను పరిశీలిస్తే, నాటి ప్రభుత్వం విధించే పన్నులు తెలుస్తాయి.

ప్రజలు చెల్లింపవలసిన పన్నులను గురించి యువరాజు విక్రమాదిత్యుని 'లక్ష్మేశ్వర్ శాసనం' మాత్రమే ప్రత్యక్షంగా పేర్కొంది. సొంత ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు కలిగి ఉన్న యజమానులు వాటి మీద పన్నులు చెల్లించేవారు. ఇంటికి సంబంధించిన ఆస్తిలేని కుటుంబాలవారు వారి స్తోమతును బట్టి, 15, 10, 7 లేక 5 పణాలు సంవత్సరానికి పన్నుగా ప్రభుత్వాధికారులకు కట్టేవారు. ప్రజలు పండుగ సందర్భంగాను, లేదా ఆనందంగా జరుపుకునే వేడుకల సందర్భంగాను, అన్ని కుటుంబాలవారు ప్రభుత్వానికి నిర్ణయించిన పన్నులను చెల్లింపవలసి ఉండేది.

ఆలంద తీర్థం గ్రామానికి సంబంధించి అధికార పత్రం ఇచ్చిన తేదీనుండి ఆ గ్రామానికి 'చాటులు', భటుల (సైనికులు) నుండి, వడ్డీవ్యాపారుల (కుసీద)నుండి, అన్ని రకాల పన్నుల (సర్వ ఆలన విశుద్ధ) నుండి స్వేచ్ఛ, మినహాయింపులు ఉండేవని యువరాజు విష్ణువర్ధనుని 'సతార దాన శాసనం' పేర్కొంది. 'తలమంచి శాసనం'లో వాడిన 'సర్వోపధా పరిహారం', 'సోరబ్ శాసనంలో' వాడిన 'సర్వ బాధా పరిహారం' అనే పదజాలాల్ని పరిశీలించినట్లయితే, కొన్ని సందర్భాల్లో అన్ని పన్నుల నుండి పూర్తి మినహాయింపు ఇచ్చేవారని తెలుస్తుంది.

రెండవ పులకేశికి చెందిన క్రీ.శ.612నాటి హైదరాబాద్ దాన శాసనం వల్ల, మాకరప్పి గ్రామాన్ని దానికి సంబంధించిన, నిధి, ఉపనిధి, క్షిప్త (భూమిశిస్తు) ఉపరికర (ఇతర పన్నులు)తో సహా దానంగా ఇచ్చారని తెలుస్తుంది. శ్యాశ్రయ శీలాదిత్యునికి చెందిన క్రీ.శ.671 నాటి 'నౌసారి తామ్ర శాసనం' ఒక గ్రామాన్ని ఉద్రంగ పరికరాలతో సహా దానంగా ఇచ్చారని తెలుస్తుంది. 'ఉద్రంగ' అంటే మార్కెట్ పన్నులు. 'పరికర' అనగా దారి సుంకాలు అని కర్నూలు జిల్లాలో దొరికిన శాసనాలు భూమికి సంబంధించిన పన్నులు 'మారుంచ', 'ఆదిత్యంచ,' 'ఉంచమన్న', 'మరుమన్న'లను పేర్కొన్నాయి. కాని అవి వీరకమైన పన్నులో, వాటి స్వభావం ఎట్టిదో స్పష్టంగా తెలియదు.

విక్రమాదిత్యుని పాలనలో మహారాజు పొగిలి క్రింది అధికారి కందర్భ అనే వ్యక్తి రాజునుండి ఒక అధికార పత్రాన్ని (రాజ శాసనం) పొందాడు. పెద్ద పండుగలు (పేరియా ఒనగె), ఉప్పు, పిల్లలు లేని వారి ఆస్తి అను పద్దుల క్రింద రాజు కోశాగారానికి చెల్లింప వలసిన సొమ్మును కట్టినట్లుగా ఆ పత్రం పేర్కొంది.

నియమానుసారం చెల్లింపవలసిన సాధారణ పన్నులే కాక, అప్పుడప్పుడు కట్టవలసిన ఇతర పన్నులు కూడ ఉండేవి. రెండో పులకేశి రాజైన బాణరాజు విషయను జయించిన తర్వాత, ఆ జిల్లా లోని ప్రతి గ్రామం మీద 'తెర్రిపాస్' (బంగారు రూపంలో కప్పం) విధించాడు. ఆ పన్నేకాక కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఖర్చుల నిమిత్తం కాని, సంస్థలకు కాని, వస్తురూపంలో చెల్లింపవలసినవి కూడ అప్పుడప్పుడు కట్టవలసిన పన్నుల క్రింద వచ్చేవి.

విజయాదిత్యుని పాలనా కాలానికి చెందిన బాదామి శాసనం దానంగా ఇచ్చిన అనేక పన్నులను, ఆదాయాలను పేర్కొంది. వాటిని నూనె, చక్కెర, మొదలగు సరుకుల రూపంలో ప్రతి దుకాణదారుడు ముందుగా నిర్ణయించిన రేట్ల ప్రకారం, మహారాజు తల్లిగారైన వినయవతి నిర్మించిన త్రిమూర్తులు దేవాలయానికి చెల్లింపవలసి ఉండేది.

BRAOU

విజయాదిత్యుని క్రీ.శ.709 నాటి శాసనం వల్ల 'ఎల్బగొలు గసణి' అనే వ్యక్తి ప్రోత్సాహ కారణంగా, ప్రతి మూడు మిల్లు ఒకింటికి ఒక 'సాంటిగె' మూడును అయిహోలెలోని భటారునికి దానంగా ఇచ్చినట్లు తెలుస్తుంది. ఇటువంటి దానాన్ని, 'తమలపాకుల ప్రతి' పేరుమీద 50 ఆకుల లెక్కన రెండవ విక్రమాదిత్యుని పాలనా కాలంలో అయిహోలె వద్ద ఉన్న 'ఆటడ ఆలే కొమరసింగ' ఆలయంలోని ఆదిత్యభటారుని కోవెలకు దానంగా ఇచ్చారు. ఈ దానానికి రాజు, నగరులు, మహాజనులకు ముందుగా అనుమతి ఇచ్చారు. దీన్ని బట్టి ఆదిత్య దేవాలయం ప్రయోజనం కోసం రాజు అనుమతితోను, స్థానికంగా తగిన ప్రచారం చేసిన తర్వాత వ్యాపార సంఘాలు స్వచ్ఛందంగా వేసిన పన్ను అని తెలుస్తుంది.

16.4.3 శ్రేణులు

ప్రాచీన భారతదేశంలో స్థానిక పరిపాలనలో శ్రేణులకు మూడు రకాలుగా సంబంధం ఉండేది. 1. శ్రేణులు దాతల నుండి ప్రత్యేక ప్రయోజనాల కోసం ఉద్దేశింపబడిన దానాలను స్వీకరించి, వారి కోరికలను నెరవేర్చేవి. స్థానిక సంస్థల నుండి కూడ డబ్బురూపంలో చెల్లింపులు స్వీకరించేవి. అంటే శ్రేణులు ప్రజలకు, స్థానిక సంస్థలకు కూడ ధర్మకర్తలుగాను, బ్యాంకర్లుగాను వ్యవహరించేవి. 2. పట్టణాల్లోని ఇతర సంఘాలతో పాటు, శ్రేణులకు కూడ స్థానిక పరిపాలనలో ప్రత్యక్ష పాత్ర ఉండేది. 3. శ్రేణులకు స్థానిక వ్యవహారాలలో ఉన్న ఈ పాత్ర వల్ల, వాటికి జిల్లా పరిపాలనతోకూడ సంబంధం ఉండేది.

'పులిగేరె'లో ఉన్న స్థానిక సంస్థలకు అక్కడ నివసించే ప్రజలకు శ్రేణులు బ్యాంకర్లుగా వ్యవహరించేవని యువరాజు విక్రమాదిత్యుని లక్ష్మేశ్వర్ శాసనంవల్ల తెలుస్తుంది. స్థానిక సంస్థ తరుపున దొంగతనాలకు, ఇతర అపరాధాలకు, దశాపరాధాలకు వేసే జరిమానాలను, పిల్లలులేని వారి ఆస్తిని శ్రేణులు స్వీకరించేవి. వీటిన్నంటిని కార్తీకమాసంలోనే శ్రేణికి జమచేసే పద్ధతి ఉండేది. ఈ శ్రేణి అక్కడ ఉండిన అన్ని శ్రేణుల్లోను ముఖ్యమైంది కాబట్టి, దానిలోనే జమచేసేవారు. స్థానిక ప్రభుత్వం తరుపున దాని ఖర్చులకోసం ఈ డబ్బును శ్రేణి భద్రపరిచింది. 'పులిగేరె'లో మరోక శ్రేణి కూడ ఉండేది. అది ఇత్తడి పనివారు ఏర్పాటుచేసుకొన్న శ్రేణి. ఈ శ్రేణి అక్కడ పన్నులు కట్టేవారి ఆర్థిక స్తోమతను బట్టి, ఒక పండుగను నిర్వహించేదానికి ప్రజలనుండి డబ్బు స్వీకరించేది.

స్థానిక పరిపాలనలో శ్రేణుల పాత్ర గురించిన సమాచారం 'లక్ష్మేశ్వర్ శాసనం', 'అయిహోలె శాసనం' వల్ల లభిస్తుంది. విక్రమాదిత్యుడు పులిగేరెకి కొత్త రాజ్యాంగం ఇచ్చాడని లక్ష్మేశ్వర్ శాసనం పేర్కొంది. దాని ఉపోద్ఘాతంలో ఈ రాజ్యాంగాన్ని మహాజనులకు, నగరులకు, 18 ప్రాకృతులకు విక్రమాదిత్యుడు ఇచ్చినట్లుగా ఉంది. ఇక్కడ నగర అనేపదం శ్రేణికి, నగరవాసులకు కూడ వర్తిస్తుంది. నగర వ్యవస్థ, శ్రేణి వ్యవస్థల మధ్య సన్నిహిత సంబంధం ఉండేది. వ్యాపారులు వాణిజ్య వ్యవహారాలు నిర్వహించే సమయంలో శ్రేణులుగాను, స్థానిక పరిపాలనా వ్యవహారాలు నిర్వహించే సందర్భంలో నగరవాసుల తరుపున వ్యవహరించేవారు. వారి నాయకుడు పట్టణ సెట్టి లేక నగర శేఠ్. అతడు నగరానికి మేయరుగాను, శ్రేణికి అధ్యక్షుడుగాను ఉండేవాడు. అయిహోలె రాజ్యాంగం కూడ అదేవిధంగా ఉండేది. అయిహోలెలోని మహాజనులను, నగరులను పరిపాలనాధికారులుగా రెండో విక్రమాదిత్యుని పాలన (క్రీ.శ.733-744) నాటి అయిహోలె శాసనం పేర్కొంది. బాదామి చాళుక్యుల కాలంనాటి మరొక శాసనం దీన్ని ధృవపరుస్తుంది. అంతేకాక ఈ శాసనం వల్ల అయిహోలె పరిపాలన గురించి మరికొంత సమాచారం లభిస్తుంది. ఈ శాసనం 500 చతుర్వేదులు (మహాజనులు), 8 నగరులు, 120 ఉరలిలు లేక ఊరులు చేసిన దానాన్ని పేర్కొంది. పులిగేరె,

BRAOU

అయిహోలె లాంటి పట్టణాలకు ఒక పట్టణ సమితి ఉండేదని, ఆ సమితిలో మహాజనులు, నగరులు, సామాన్య ప్రజలు సభ్యులుగా ఉండేవారని పైన పేర్కొన్న రెండు అయిహోలె శాసనాల వల్ల తెలుస్తుంది. పట్టణ పరిపాలనలో వ్యాపారుల నాయకుడు నిర్వహించే పాత్రను గురించి కూడ లక్ష్మేశ్వర్ శాసనంవల్ల తెలుస్తుంది. సెట్టిల ప్రభుత్వాన్ని గురించి ఆ శాసనం పేర్కొంది. సెట్టిలు అంటే, తర్వాత కాలం నాటి పట్టణ శేఠ్‌లు.

అయిహోలెలోని వ్యాపారుల శ్రేణుల గురించి ఇతర శాసనాల వల్లకూడ తెలుస్తుంది. విక్రమాదిత్యుని కాలంనాటి శాసనం కూడ శ్రేణిని పేర్కొంది. అయిహోలెలోని క్రీ.శ.733-747 కాలంనాటి శాసనం నగరులను, మహాజనులను పేర్కొంది. అయిహోలెలో వారు ఏర్పాటు చేసుకొన్న శ్రేణిని గురించి మొట్టమొదట పేర్కొన్నది ఈ శాసనమే. అయిహోలె శ్రేణుల సభ్యుల ఆరాధ్య దేవత అయిన దుర్గ భగవతికి 500 మహాజనులు, ఇతరులు ఇచ్చిన దానాన్ని బాదామి చాళుక్యుల కాలంనాటి మరొక శాసనం పేర్కొంది.

16.4.4 తూనికలు - కొలతలు

స్థానికంగా వాడుకలో ఉన్న వివిధ రకాల తూనికలు, కొలతలు భారతదేశంలోని ఆనాటి ఆర్థిక జీవనానికి ప్రత్యేక లక్షణాలుగా ఉండేవి. బాదామి చాళుక్యులకాలంనాటి కొన్ని శాసనాలు రాజమానం (రాజు కొలత) పేర్కొన్నందువల్ల, తూనికలు కొలతల్లో ప్రామాణికాన్ని సాధించే ప్రయత్నాలు జరిగాయని స్పష్టమౌతుంది.

భూమిని 'నివర్తన'లుగా విభజించేవారు. శాసనాలు రాజమానాన్ని గూర్చి పేర్కొన్నాయి. నివర్తనం అయిదు ఎకరాలకు సమానం. ఖజ్జాణ, వకుల క్షేత్రం అనే రకాల భూములు కూడ ఉండేవి. ప్రతి పేరు మీద ఒక మానం, ప్రతి 'భండపేరు' మీద 5వీసాలు, తమలపాకుల ప్రతి పేరుమీద 50 తమలపాకులు అని క్రీ.శ.732-733 నాటి శాసనం పేర్కొంది. ధాన్యానికి నాటిమానం కొలత ఇదివరకు వాడుకలో ఉన్న మణుగుకు సమానం. వీసం సుమారుగా 31 కిలోగ్రాములకు సమానం. 'భండపేరు' అంటే ఒక బండినిండా పట్టే సరుకు (బండిపేరు).

ఆలుప రాజ్యంలో కూడ 'పేరు', 'మళవె', 'పల' వాడుకలో ఉండేవి. మానం (మణుకూ) లాగే పేరుకూడా వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా ఉండేవి. మానెను సాంతిగల్లో కొలిచేవారు. సోపారలాంటి పెద్ద రేవు పట్టణాల్లో ప్రామాణిక తూకాలైన పల, కర్ష, మాష, రత్తలు వాడుకలో ఉండేవి. దేశీయ వాణిజ్యంలో ముఖ్యంగా వస్తు మార్పిడి పద్ధతి ఉన్నా, విదేశీ వాణిజ్యంలో మాత్రం బంగారం, వెండి ఉపయోగించి కొనుగోలు, అమ్మకాలు చేసేవారని కాస్మాస్ రచనలవల్ల తెలుస్తుంది.

16.4.5 నాణేలు

బాదామి చాళుక్యులకు చెందిన నాణేలు చాలా తక్కువ సంఖ్యలో దొరికాయి. వారి రాజ్య చిహ్నం వరాహం. అందువల్ల వారు ముద్రించిన బంగారు నాణేలు మీద వరాహం బొమ్మ ఉంది. ఈ నాణేలు ఎక్కువగా దక్కన్ లోను, దక్షిణ భారతదేశంలోను దొరికాయి.

బాదామి చాళుక్యుల బంగారు నాణేల ప్రామాణిక బరువు 120 గ్రెయిన్లు. దక్షిణ భారతదేశానికి చెందిన నాణేల ప్రామాణిక బరువు 55-60 గ్రెయిన్లు. గుప్త వంశ రాజులకు చెందిన బంగారు నాణేల బరువు 120 గ్రెయిన్లు. దీన్ని బట్టి బాదామి చాళుక్యులు తమ నాణేల ముద్రణకు గుప్తుల బంగారు నాణేల ప్రామాణిక బరువును అనుసరించారని తెలుస్తుంది.

BRAOU

బాదామి చాళుక్యులకు చెందిన బంగారు నాణేలేకాక, వారు ముద్రించిన బంగారం, వెండి మిశ్రమ నాణేలు కూడా కొన్ని దొరికాయి. ఇవి గుండ్రని ఆకారంలో ఉన్నాయి. ఈరకం నాణెం బరువు 153 గ్రెయిన్లు. ఈ నాణేల్ని 30 శాతం (30%) బంగారం, 70 శాతం (70%) వెండి మిశ్రమంతో తయారుచేసి ముద్రించారు.

16.5 పల్లవుల పాలన

దక్షిణ భారతదేశాన్ని పరిపాలించిన వారిలో పల్లవులకు విశిష్ట స్థానం ఉంది. వీరి కాలంలో ఆర్థిక వ్యవస్థ గ్రామాలపై ఆధారపడి ఉండేది. పల్లవుల పాలనలో సాంఘిక, మత సంబంధ కార్యక్రమాలకు దేవాలయం కేంద్రంగా ఉండేది. సామంత రాజ్యాలకు స్వతంత్ర్య ఆర్థిక ప్రతిపత్తిని కల్గించటం జరిగింది. వ్యవసాయం ప్రధాన వృత్తి కాబట్టి, రాజులు నీటి పారుదల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించేవారు.

16.5.1 గ్రామాలు

పల్లవుల కాలంలో దక్షిణ భారతదేశంలో మూడు రకాల గ్రామాలు ఉండేవి. అవి 1. ఊర్, 2. సభ, 3. నగరం గ్రామాలు. 'ఊర్' అనేది సాధారణంగా ఉండే గ్రామం. దానిలో రైతు కులాలవారు నివసించేవారు. వారు ఆ గ్రామానికి చెందిన భూములను అందరూ కలసి సాగుచేసేవారు. వారి తరుపున ఆ గ్రామపెద్ద పన్నులు వసూలు చేసి, ప్రభుత్వానికి చెల్లించేవాడు.

బ్రహ్మదేయ గ్రామాలు లేక బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన గ్రామాలు, అగ్రహార గ్రామాలు 'సభ' రకానికి చెందిన గ్రామాలు. సభ గ్రామాల్లో బ్రాహ్మణ యజమానులకు భూముల మీద వ్యక్తి పరమైన హక్కులు ఉండేవి. కాని వారి వ్యవహారాలను సామూహికంగా నిర్వహించేవారు.

వ్యాపారులు, వర్తకులు స్థిరపడి ఆధిపత్యం చెలాయించే గ్రామాలు 'నగరం' రకానికి చెందినవి. వాణిజ్యం క్షీణించిన కారణంగా, వ్యాపారులు గ్రామాలకు వలసపోయి అక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకొన్న పరిస్థితుల ఫలితంగా, నగరం గ్రామాలు ఏర్పడ్డాయి.

ప్రతి గ్రామంలో ఇళ్ళు, తోటలు, చెరువులు, బావులు, పెలదేర్లు, వ్యర్థపదార్థాలు (కస్రుమెయిసల్) 'ఉడయిప్పు', 'ఉనరి', సమిష్టి భూములు, చిన్న అడవులు, 'మన్రు', 'ఊరిరుక్కై', 'కొట్టారం', 'పడిల్గై', మాగాణి భూములు, మెట్ట భూములు, దేవాలయం, దేవాలయ భూములు, వీధులు, బజార్లు, శ్మశాన భూమి ఉండేది.

క్రీ.శ.300-750 మధ్యకాలంలో గ్రామీణ విస్తరణ, పటిష్టమైన గ్రామీణ వ్యవస్థ భూములను సాగుచేయడంలో మెరుగైన పద్ధతులు అవలంబించడం వంటి విషయాల గురించి స్పష్టమైన సమాచారం తెలుసుకొనేందుకు సాక్ష్యాధారాలు ఉన్నాయి.

16.5.1.1 గ్రామీణ విస్తరణ

పల్లవుల కాలంలో భారతదేశంలో అనేక కొత్త రాజ్యాలు ఏర్పడ్డాయి. ప్రతి రాజ్యంలోను చిన్న చిన్న సామంత రాజ్యాలు ఉండేవి. ఈ రాజ్యాలు పెద్దవైనా, చిన్నవైనా, సార్వభౌమ రాజ్యాలైనా, సామంత రాజ్యాలైనా ప్రతిదానికి సొంతంగా సైన్యం, పన్నుల వ్యవస్థ, పరిపాలనా యంత్రాంగం, వాన్ని సమర్థించేందుకు మత గురువులు మొదలగు మద్దతుదారులు చాలా అవసరం. కాబట్టి, ప్రతి రాజ్యానికి గ్రామీణ ప్రాంతాలనుండి లభించే వనరులు సమృద్ధిగా ఉండాలి. రాజ్యం అభివృద్ధిచెందాలంటే, గ్రామీణ ప్రజల సంఖ్య, వ్యవసాయ ఉత్పత్తులు రెండింటిలోను పెరుగుదల ఉండాలి.

BRAOU

బ్రాహ్మణులకు గిరిజన ప్రాంతల్లో భూములు దానంగా ఇచ్చేవారు. దాని ఫలితంగా వారినుండి గిరిజన తెగలకు చెందినరైతులు పశువుల సంరక్షణకు గల విలువను గురించి, వ్యవసాయంలో మెరుగు పద్ధతుల గురించి నేర్చుకొన్నారు. కొన్ని ప్రాంతల్లో కార్మికుల కొరత ఉండేది. అటువంటి ప్రాంతాల ఆర్థిక పరిస్థితి తీణించకుండా బ్రాహ్మణులకు సహాయంగా ఉండేందుకు పంట కొలుదార్లను, నేతపనివారిని పంపేవారని పల్లవుల తొలి కాలానికి చెందిన దాన శాసనం వల్ల తెలుస్తుంది. క్రి.శ.300-750 మధ్య కాలంలో బ్రాహ్మణులకు అధిక సంఖ్యలో ఇచ్చిన దానాలు గ్రామీణ విస్తరణకు, గ్రామీణ ప్రజల సంఖ్య పెరుగుదలకు , వ్యవసాయంలో మెరుగైన పద్ధతుల వ్యాప్తికి దోహదం చేశాయి.

16.5.1.2 గ్రామీణ ఆర్థిక జీవనం

పల్లవుల పాలనలో గ్రామీణ ఆర్థిక జీవనం గురించిన సమాచారం 'పల్లంకోపిల్', 'కూరం', 'కళాకుడి', 'పట్టత్తాళ్', 'మంగళం', 'తండంతోట్టం' తామ్రపత్ర శాసనాల నుండి, నాయనార్లు, ఆళ్వారుల కీర్తనల నుండి, 'తేవారం', 'నాలాయిర ప్రబంధం' మొదలగు రచనల నుండి లభిస్తుంది.

16.5.1.3 గ్రామంలో సమిష్టి ఆస్తి

గ్రామంలోని చెరువులు, బావులు, సెలయేర్లు, కాలువలు, సమిష్టి యాజమాన్యంలోని పచ్చిక బయళ్ళు, భూములను సమిష్టి ఆస్తిగా పరిగణించేవారు. గ్రామ సభ, దాని సంఘాలు ముఖ్యమైన సందర్భాల్లో సమిష్టి యాజమాన్యంలోని భూమి (మన్ను) వద్ద సమావేశమయ్యేది. వ్యవసాయదారులు ధాన్యాన్ని ఊర్చేటప్పుడు సమిష్టి యాజమాన్యంలోని భూమిని ఉపయోగించుకొనేవారు. దానికి గాను వారినద్దనుండి ధాన్యంలో కొంత భాగాన్ని వసూలుచేసి సమిష్టి గిడ్డంగిలో నిలువచేసేవారు.

16.5.1.4 బ్రహ్మదేయ గ్రామాలు

రాజులు, వారి సామంతులు కొత్త గ్రామాలు ఏర్పాటు చేసి, వాటికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేవారు. పండితులైన బ్రాహ్మణులను ఆ గ్రామాల్లో స్థిరపడేందుకు ప్రోత్సాహించేవారు. బ్రాహ్మణులు స్థిరపడిన గ్రామాలను అగ్రహారాలు అనేవారు. అగ్రహారాల్లో స్థిరపడిన బ్రాహ్మణ కుటుంబాల సంఖ్య వివిధ రకాలుగా ఉండేది. ఇతర సామాన్య గ్రామాలకు ప్రభుత్వం ఇచ్చిన పన్నులు మొదలగు మినహాయింపులన్నీ అగ్రహారాలకు కూడ ఇచ్చేవారు కాబట్టి, ఆ గ్రామాల ఆర్థిక పరిస్థితి చాలా మెరుగ్గా ఉండేది.

16.5.1.5 దేవదాన గ్రామాలు

పల్లవుల పాలనలో సాంఘిక, సాంస్కృతిక, మత సంబంధ కార్యక్రమాలన్నింటికి దేవాలయం కేంద్రంగా ఉండేది. దేవాలయానికి ఇచ్చిన దానాల్లో భూములే కాక, కొన్ని సందర్భాల్లో మొత్తం గ్రామం, దానినుండి వచ్చే పూర్తి ఆదాయం కూడ ఉండేది. పల్లవుల రాజ్యంలో అన్ని స్థదేశాల్లో ఉండే దేవాలయాలకు ఇవ్వబడిన దానధర్మాలను అనేక శాసనాల్లో రికార్డుచేశారు. అందువల్ల గ్రామీణ ఆర్థిక జీవనంలో ఈ దేవాలయాలు ప్రముఖ పాత్ర వహించే వీలైంది.

BRAOU

16.5.1.6 గ్రామ జనాభా

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉండేది. అందువల్ల గ్రామంలో ముఖ్యంగా భూస్వాములు, కౌలుదార్లు ఉండేవారు. రైతులను తమిళంలో 'కుడి' లేక 'కుడి మక్కళ్' అని, సంస్కృతంలో 'కుడుంబి' అని పిలిచేవారు. దంతివర్మకు చెందిన ఉత్తరమేరూర్ శాసనం రైతులను 'అహంబడి ఉడైయన్' అని పేర్కొంది.

16.5.1.7 గ్రామంలోని ఇళ్ళు, పెరటి తోటలు

గ్రామంలోని వ్యవసాయదారులు చిన్న ఇళ్ళలో నివసించేవారు. ఆ ఇళ్ళను మట్టిగోడలతో నిర్మించి, ఆకులతో కప్పేవారు. కాల్చిన ఇటుకలు, సున్నంతో నిర్మించిన డాబా ఇళ్ళు, భవంతులను ఆకాలంలో విశేష భోగంగా పరిగణించేవారు. వాటిని యజమానులు, స్వాధీనదారులు, దానగ్రహీతల ఉపయోగం కోసం ప్రత్యేకించేవారు. ఆ కాలంలో పల్లవుల రాజ్యంలోని ఎక్కువ ఇళ్ళలో పెరటితోట, బావి ఉండేది. పెరటి తోటలో కూరగాయలు, పూలు పండించేవారు. గ్రామానికి సమీపంలోనే పశువుల కోసం సచ్ఛిక బయళ్ళు ఉండేవి.

16.5.1.8 గ్రామీణ వృత్తులు

గ్రామంలోని బ్రాహ్మణులు తప్ప మిగిలిన వారందరూ వ్యవస్థీకృత పరిశ్రమలమీద ఆధారపడి జీవించేవారు. గ్రామ జనాభాలో నూలువడికేవారు, నేతపనివారు, కుమ్మరులు, పశుపోషకులు, కంసాలి వారు, వడ్రంగులు, చేత పనివారు, మానె గాసుగ యజమానులు, మధ్యవర్తులు, వ్యాపారులు ఉండేవారు.

16.5.1.9 గ్రామీణ మార్కెట్లు

పల్లవుల రాజ్యంలో ప్రతి గ్రామంలోను ఒక మార్కెట్ ఉండేది. ఆ మార్కెట్లో వాణ్యమైన సరుకులను అమ్మేవారు. దానిలో 18 రకాల ధాన్యాలు (కూలం) కూడ అమ్మేవారు. గ్రామంలోని మార్కెట్లో జరిగే అన్ని అమ్మకాల మీద పన్ను వేసేవారని పల్లవుల కాలానికి చెందిన తామ్ర శాసనాల వల్ల తెలుస్తుంది. గ్రామంలోని మార్కెట్లో నూనె, నెయ్యి, కొబ్బరికాయలు, వక్కలు, చక్కెర, కాయగూరలు పూలు కూడ అమ్మేవారు. వ్యాపారులు గ్రామంలోని మార్కెట్లో దుకాణం ప్రారంభించాలంటే, లైసెన్సు తీసుకోవలసిన అవసరం ఉండేది.

16.5.2 భూ యాజమాన్యం

పల్లవుల రాజ్యంలో వ్యవసాయం ముఖ్య పరిశ్రమగా ఉండేది. చాలామంది గ్రామాల్లో భూములు, ఆస్తులు కొనుగోలుచేసి యజమానులు అయ్యారు. భూముల మీద యాజమాన్యం వంశపారంపర్య హక్కుగా ఉండేది. అది కుటుంబంలో తర్వాత తరాల వారికి స్వచ్ఛందంగానే చెందేది. యజమానికి సొంత భూములను, ఆస్తులను దానం చేయడానికి, అమ్మడానికి హక్కు ఉండేది.

16.5.2.1 ప్రైవేట్ యాజమాన్యం

ప్రైవేట్ యజమానుల భూములను కౌలుదార్లు కూడ సాగు చేసేవారు. కాని ప్రైవేట్ యజమానులకు, కౌలుదార్లకు మధ్యగల ఖచ్చితమైన సంబంధాలను గురించి తెలుసుకొనేందుకు పల్లవుల కాలంనాటి శాసనాల్లో తగినంత స్పష్టమైన

BRAOU

సమాచారం లేదు. పల్లవుల శాసనాలు పేర్కొన్న 'పురపుపాన్' అనేది వ్యవసాయ భూములమీద వాటి యజమానులు ప్రభుత్వానికి డబ్బురూపంలో చెల్లించే పన్ను.

16.5.2.2 రాజు

శాతవాహన రాజుల లాగే పల్లవ రాజులకు కూడ సొంతయాజమాన్యంలో గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలు ఉండేవి. 'కవచకార మండలం' (భోగ) లోని చెందలూరు గ్రామంలో రాజు యజమాన్యంలో 800 పట్టికలు భూములు ఉండేవని కుమారవిష్ణుకు చెందిన చెందలూరు శాసనం వల్ల తెలుస్తుంది.

16.5.3 భూముల దానధర్మాలు

పల్లవుల కాలంలో భూములను వాటి యజమానులు బ్రాహ్మణులకు, దేవాలయాలకు దానంగా ఇచ్చే సద్ధతి ఉండేది. పండితులైన బ్రాహ్మణులకు భూములు దానంగా ఇచ్చేవారు. దేవాలయాల్లో పూజలకు, ఉత్సవాలకు అయ్యే ఖర్చులకు అవసరమయ్యే ఆదాయం నిమిత్తం భూములను దానం చేసేవారు. జైన దేవాలయాలకు ఇచ్చే దానధర్మాలకు 'పల్లిచ్ఛందం' అని పేరుండేది. చెరువుల ఆనకట్టలు, తూములు, మొదలగు వాటిని బాగుచేసే మరమ్మత్తు పనులను నిర్వహించేందుకు అవసరమయ్యే ఆదాయం కోసం కూడా భూములు దానం చేసేవారు.

16.5.4 భూమి సర్వే

పల్లవుల పాలనలో భూములన్ని సర్వే చేసి, కొలతలు కొలిచి వాటికి హద్దులను గుర్తించేవారు. గ్రామాలను కూడా సర్వేచేసి, వాటికి హద్దులను నిర్ణయించేవారు. సర్వేచేసిన భూములకు, వాటి మీద యాజమాన్యపు హక్కులకు సంబంధించిన రికార్డులను గ్రామాధికారులు భద్రపర్చేవారు.

భూముల సర్వే, వాటి కొలతలకు సంబంధించిన సమాచారం 'ఉరువపల్లి', 'కూరం', 'పెట్టత్తాల్', 'మంగళం', 'ఉదయేందిరం', 'బాహుర్' మొదలైన ప్రదేశాల్లో లభించిన తామ్ర శాసనాల వల్ల తెలుస్తుంది. ఉరువపల్లి తామ్ర శాసనం ఈ విధంగా పేర్కొంది. "ఈ గ్రామంలో 200 'నివర్తనాలు' ఉన్నాయి. నివర్తనాల హద్దులు ఇవి: పడమర వైపు కొండుకుర గ్రామ ఎల్లలే హద్దు;దక్షిణాన సుప్రయోగ నది హద్దు; తూర్పున కూడ అదే హద్దు; ఈ శాస్యం వైపున ముఖ్యర హచారి ప్రక్కన ఒక శిల ఉంది; అక్కడనుండి ఉత్తరంగా పోయినయెడల కురుపుర, కొండుకుర గ్రామాలకు వెళ్ళే రహదారిమీద ఒక శిల ఉంది"

16.5.5 కౌలుదారీ విధానం:

భూస్వాముల యాజమాన్యంలోని భూములను కౌలుదార్లుకూడా సాగుచేసేవారు. గ్రామంలోని వ్యవసాయ భూములు వివిధ రకాల కౌలుదారీ పద్ధతుల ప్రకారం సాగుచేయబడేవి. అవి 1.'పయత్ నిలం'. ఈ విధానంలో సాగుచేయబడిన భూములనుండి వచ్చే ఉత్పత్తిని భూస్వామి, కౌలుదారు సమానంగా పంచుకొనేవారు. 2. 'అడైనిలం'. ఈపద్ధతిలో వ్యవసాయ ఉత్పత్తిలో కొంత భాగం రాజుకు చెందేది. దీన్ని 'అడై కొడుత్తల్' అని కూడ అనేవారు. 'అడై' అనగా భూములనుండి వచ్చిన ఉత్పత్తిని రాజుకు చెందిన భాగం. అది సాధారణంగా వ్యవసాయ

BRAOU

ఉత్పత్తిలో ఆరో వంతు (1/6) ఉండేది. 3.'కరైనిలం'. ఈ రకమైన పొలాలు అప్పుడప్పుడు కౌలుదార్లకు మరల పంపిణీ చేసేవారు. శాసనాలు వీటిని 'కరైఇడుదల్'అని పేర్కొన్నాయి. దీన్ని బట్టి కౌలుదార్లకు భూములు పంపిణీ చేసేవారని తెలుస్తుంది.

వ్యవసాయ క్షేత్రాలు ప్రభుత్వం యాజమాన్యంలోకూడ ఉండేవి. వాటిని కౌలుదార్లు సాగుచేసేవారు. పల్లవ రాజులకు చెందిన 'బాహూర్', 'కశాక్కుడి' తామ్ర శాసనాలు 'పూర్వపు కౌలుదార్లను తొలగించడం' అని పేర్కొన్నాయి. అంటే ప్రభుత్వ క్షేత్రాలు పూర్వం నియమించిన కౌలుదార్లను తొలగించి, దానగ్రహీతలకు వారికి దానంగా ఇచ్చిన భూములను సాగులోకి తెచ్చేందుకు క్రొత్తగా కౌలుదార్లను నియమించుకొనేందుకు హక్కు ఇవ్వడం.

16.5.6 నీటిపారుదల

తొండై మండలంలోని వ్యవసాయ యోగ్యమైన భూములు వర్షాల మీద ఆధారపడేవి. అందువల్ల కరవు కాటకాలు ఏర్పడకుండా నీటిపారుదల సౌకర్యం కల్పించేందుకు కాలువలు, చెరువులు, సరస్సులు, పెద్ద బావులు మొదలగువాటి నిర్మాణాల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టడమే కాక, ప్రైవేట్ వ్యక్తులు కూడ ముందుకు రావల్సిన అవసరం ఉండేది. ఆ ప్రాంతలోని నదుల్లో నీరు అన్ని కాలాల్లోను ఉండేది కాదు. అవికూడ వర్షాల మీదే ఆధారపడేవి. దానిఫలితంగా, వర్షాకాలంలోనే ఆ నదుల్లో నీరు సమృద్ధిగా ఉండేది. నీటి సరఫరా, నీటిపారుదలకు సంబంధించిన సమస్యలను అధిగమించేందుకు చెరువులను నిర్మించడం, బావులు త్రవ్వడం, కాలువలు త్రవ్వి వాటికి తూములు, ఆనకట్టలను నిర్మించడం వంటి చర్యలు ప్రభుత్వం చేపట్టవలసిన అవసరం ఉండేది.

16.5.6.1 చెరువులు

పల్లవుల పాలనలో నీటిపారుదల కోసం అనేక చెరువులను నిర్మించారు. పల్లవుల కాలంలో నీటిపారుదల సౌకర్యం కలిగించే అనేక చెరువులను నాటి శాసనాలు పేర్కొన్నాయి. వాటిలో కొన్ని చెరువులు ఇప్పటికీ ఉపయోగంలో ఉన్నాయి. ఈ చెరువులకు పల్లవ వంశ రాజులు పేర్లను లేదా స్థానికంగా సుప్రసిద్ధుడైన సామంత రాజుల పేర్లను పెట్టారు.

పల్లవ రాజుల కాలంలో చెరువులు అనేకం ఉండేవి. అవి 1. రాజ తటాకం. ఇది కటక్ దగ్గర నిర్మించారు. దీన్ని బ్రిటిష్ మ్యూజియంలోని తామ్ర శాసనం పేర్కొంది. 2.'తిరియనేరి'. ఇది కాంచీపురానికి 16కి.మీ.దూరంలో ఉంది. దీనికి ఇప్పుడు 'తెన్నేరి' అని పేరు. నందివర్మ పల్లవమల్లుని 'కశాక్కుడి' తామ్ర శాసనం దీన్ని పేర్కొంది. 3. 'మహేంద్ర తటాకం', షోలింగూర్ సమీపంలోని మహేంద్రవాడివద్ద దీన్ని నిర్మించారు. 4.'చిత్రమేఘ తటాకం''మామడూర్' చెరువు. దీన్ని మొదటి మహేంద్రవర్మ పాలనలో నిర్మించారు. ఈ చెరువు చాలా పెద్దది. దీనితో నీరు సంవత్సరమంతా ఉండేది. 5. 'పరమేశ్వర తటాకం'. దీన్ని మొదటి పరమేశ్వర వర్మ కాలంలో నిర్మించారు. అందువల్ల దీనికి ఆ రాజు పేరు పెట్టారు. దీన్ని మొదటి పరమేశ్వరవర్మకు చెందిన 'కూరం' తామ్ర శాసనం పేర్కొంది. 6. 'వైరమేఘ' తటాకం. దీన్ని చెంగల్పట్టు జిల్లాలోని ఉత్తరమేరూర్ వద్ద దంతివర్మ పాలనలో నిర్మించారు. దీన్ని దంతివర్మకు చెందిన 'ఉత్తరమేరూర్ శాసనం' పేర్కొంది. 7.'వాలి ఏరి'. దీన్ని పుదుక్కోట్టయి జిల్లాలోని కుంద్రండార్ కోయిల్ వద్ద దంతివర్మ కాలంలో నిర్మించారు. ఆ ప్రదేశం లోని శాసనం దీన్ని పేర్కొంది. దీని నిర్మాణం చేపట్టిన వారి పేరే ఈ చెరువుకు పెట్టారు. 8. 'మారప్పిడుగేరి'. దీన్ని తిరుచిరాపల్లి జిల్లాలోని

BRAOU

'తిరువెళరై ' సమీపంలోని 'ఆలంబాక్కం' వద్ద నిర్మించారని ఆ ప్రదేశంలోని శాసనం దీన్ని పేర్కొంది. 9. 'వెళ్ళేరి', 'తుంబనేరి'. ఈ రెండు చెరువులను దంతివర్మకు చెందిన 49వ పాలనా సంవత్సరం నాటి శాసనం పేర్కొంది. 10. 'కావేరిపాక్కం' చెరువు. దీన్ని మూడవ నందివర్మ కాలంలో కావేరిపాక్కం వద్ద నిర్మించారు. దీనికి 6కి.మీ. పైగా ఆనకట్ట ఉంది. 11. 'మరుదాడు ఏరి'. దీన్ని వండివాష్ తాలూకాలోని 'మరుదాడు' వద్ద నిర్మించారు. నృపతుంగవర్మ 12 వ పాలనా సంవత్సరానికి చెందిన శాసనం వల్ల, ఈ చెరువును ఆరాజు పాలనలో అతని సామంతుడు నిర్మించాడని తెలుస్తుంది. 12. 'కనకవల్లి తటాకం'. కంప వర్మ 23వ పాలనా సంవత్సరానికి చెందిన శాసనం దీన్ని పేర్కొంది. 13. 'వెనలప్పూండి ఏరి.' దీన్ని రెండవ నందివర్మకు చెందిన పుల్లూర్ తామ్ర శాసనం పేర్కొంది. 14. చక్రతీర్థం, 'ఉరగహ్రద' (సర్ప సరస్సు), 'సింధువారహ్రద' (సింధువార చెట్లు మూట్టూ ఉండే సరస్సు). వీటిని నందివర్మ పల్లవమల్లుని 'ఉదయేందిరం' తామ్ర శాసనం పేర్కొంది. 15. 'కర్వాడి ఏరి' దీన్ని కంపనవర్మకు చెందిన 'తిరువల్లియూర్' శాసనం పేర్కొంది. పైన పేర్కొన్న చెరువుల్లో అధికభాగం వర్షం నీటితోను లేదా సమీపంలోని నదులనుండి కాలువల ద్వారా తెచ్చిన నీటితో నిండేవి.

16.5.6.2 బావులు

పల్లవుల పాలనలో క్రీ.శ.7, 8 శతాబ్దాల్లో రాజ్యంలోని గ్రామాల్లో అధికసంఖ్యలో బావులను త్రవ్వారు. బ్రహ్మదేయ, దేవదాన గ్రామాలు దానంగా ఇచ్చినప్పుడే, దానం తీసుకొనే వారికి రాజు ఇచ్చే విశేషాధికారాల్లో బావుల త్రవ్వకంకూడా ఉండేది. పల్లవుల శాసనాల్లో బావి (సమియ కూప) త్రవ్వకంగురించి మొట్టమొదట చారుదేవికి చెందిన 'గణపదేయ' తామ్ర శాసనం పేర్కొంది. 'మర్విడుగు చెరుంగినరు' అనే పేరుతో ఒక పెద్ద బావిని స్వస్తిక ఆకారంలో నాలుగు వైపుల మెట్లతో తిరిచిరాపల్లి సమీపంలోని తిరువెళ్ళరై గ్రామంలో నిర్మించారు.

16.5.6.3 కాలువలు

కాలువల ద్వారా నీటి పారుదల సౌకర్యం కల్పించడం అనేక ప్రాంతాల్లో ఎక్కువగా వాడుకలో ఉండేది. నదుల నుండి నేరుగా సమీపంలోని వ్యవసాయ భూములకు నీటి పారుదల సౌకర్యం కల్పించేందుకు త్రవ్వే కాలువలకు 'ఆర్రుక్కాల్' అని పేరుండేది.

ఊర్రు కాట్టు కొట్టం గ్రామానికి చెందిన పొలాలకు నీటి పారుదల పాలార్ నది నుండి నేరుగా వచ్చే కాలువ (నాట్టుక్కాల్) ద్వారా జరిగేదని మొదటి పరమేశ్వర వర్మ పాలనా కాలానికి చెందిన 'కూరం' తామ్ర శాసనం పేర్కొంది. దంతివర్మ పాలనలో 'వైరమేఘ వాయక్కాల్ ' కాలువ నిర్మించారు.

ముఖ్యమైన నదుల నుండి పెద్ద కాలువలు నిర్మించి, వాటి ద్వారా చెరువులకు నీటిని పంపేవారు. చెరువుల నుండి చిన్న కాలువలు త్రవ్వి, పంటపొలాలకు నీటిసదుపాయాన్ని కలుగచేసేవారు. కూరం మండలంలోని పరమేశ్వర మంగళం గ్రామంలో పరమేశ్వర తటాకంలో నీరు పంపేందుకు పాలార్ నది నుండి పెరుంబిడుగు వాయక్కాల్ కాలువను త్రవ్వారు.

ప్రధానమైన పెద్ద కాలువలనుండి త్రవ్వే చిన్న కాలువలకు 'కురంగు', 'కాల్', 'కిళైక్కాల్', 'ఓడై' అనిపేర్లు ఉండేవి. వైరమేఘ చెరువు నుండి త్రవ్విన 'గణపతి వాయక్కాల్', 'శ్రీధర వాయక్కాల్' అనేపేర్లు గల చిన్న కాలువలను ఉత్తరమేరూర్ శాసనాలు పేర్కొన్నాయి.

BRAOU

వ్యవసాయ భూములకు వరదనీటి కాలువల ద్వారా కూడ నీటి పారుదల సదుపాయం కలుగచేసేవారు. వరదలు, వచ్చిన సమయాల్లో నదుల్లోని నీటి పరిమాణం పెరిగినప్పుడు నదుల ఆనకట్టలకు గండ్లు పెట్టి, వాటిద్వారా వచ్చిన నీటిని కాలుల ద్వారా పొలాలకు పంపేవారు. పల్లవుల కాలంలో ఈ పద్ధతి సాధారణంగా వాడుకలో ఉండేది, క్రొత్తగా ఏర్పడిన 'ఏకధీరం మంగళం' గ్రామంలోని ప్రజలకు వేగవతి. పాలార్ నదులకు వరద నీరువచ్చి పొంగిపోయే సమయాల్లో, వాటి ఆనకట్టలకు గండ్లు పెట్టి, ఆ గ్రామానికి చెందిన అన్ని పొలాలాకు నీటిపారుదల సౌకర్యాన్ని కలిగించేందుకు అనుమతి లభించింది.

వేసవి కాలంలోను, వర్షాలు లేని కారణంగాను నదుల్లో నీరు లేనప్పుడు తాత్కాలికంగా ఊట నీటి కాలువల (ఊర్రుక్కాల్) ద్వారా నీటిని సరఫరా చేసేవారు. ఊట నీరుకోసం నదీతలంలో చెలమలు త్రవ్వేవారు. కాని వీటిద్వారా లభించే నీరు కొద్ది పరిమాణంలోనే ఉండేది. పాలార్, వేగవతి నదీ తలాల నుండి ఊటనీటి కాలువలను త్రవ్వేందుకు దానగ్రహీతలకు అనుమతి ఇచ్చారని 'కూరం' తామ్ర శాసనం పేర్కొంది.

16.5.6.4 ఎత్తిపోతల పథకం

పల్లవుల కాలంలో ఎత్తిపోతల పద్ధతి ద్వారా కూడా, పొలాలకు నీటిపారుదల సదుపాయాన్ని కలుగచేసేవారు. ఒక పెద్ద లోలు బక్కెట్‌ను (పికోట) గెడకు కట్టి, తాగెడ చివర భాగాన్ని సమతలంలో ఉండే ఒకపెద్ద లావుపాటి కర్రకు కట్టేవారు. ఆ కర్రకు రెండవ వైపున పెద్ద బరువు పెట్టేవారు. ఈ పద్ధతి వల్ల నీటిని బక్కెట్‌లో నింపి సులభంగా అడుగు భాగన్నుండి పైకి ఎత్తిపోసి, పంటపొలాలకు చిన్న కాలువల ద్వారా పంపేవారు. పెద్ద ఏతాములకు 'పేరేట్టం' అని పేరుండేది.

తెన్నేరి నది ఒడ్డున ఉన్న పొలాలకు 1 లేక 2 బకెట్లు ఉపయోగించేవారని అపరాజితుని శాసనాలు, 4 బకెట్లు ఉపయోగించే వారని కంపవర్మ శాసనాలు పేర్కొన్నాయి. కుమారమంగళ వెల్లిట్టూర్ గ్రామంలో నీటిపారుదల కోసం జలయంత్రాలు వాడుకలో ఉండేవని నందివర్మ పల్లవమల్లునికి చెందిన శాసనాల వల్ల తెలుస్తుంది.

16.5.6.5 నీటి తూములు

పల్లవుల కాలంలో కాలువలనుండి, చెరువుల నుండి నీటి తూముల ద్వారా కూడ నీటిపారుదల సదుపాయం కలుగ చేసేవారు. నీటి తూములు ఏర్పాటు చేసి, వాటికి గేట్లు అమర్చేవారు. అవసరమైనప్పుడు తూములకు ఉన్న గేట్లను ఎత్తివేయడం వల్ల, పెద్ద కాలువనుండి చిన్న కాలువల్లోకి నీరు వదిలేవారు. ఈపద్ధతి వల్ల రైతులందరికి వారి పొలాలాకు సమానంగా నీరు లభించేది. చెరువుల ఆనకట్టలకు తూములు నిర్మించి, వాటికి గేట్లు ఏర్పాటు చేసేవారు. చెరువులో నీరు ఎక్కువైనప్పుడు, మిగులు నీరు వెలుపలికి వదిలేందుకు గేట్లు ఎత్తివేసే వారు. దానివల్ల చెరువులో నీటి పరిమాణం ఉధృతంగా పెరిగినప్పుడు, వాటి ఆనకట్టలు తెగిపోకుండా కాపాడేందుకు వీలయ్యేది.

వళువూర్ గ్రామంలో నృపతుంగవర్మ 6వ పాలనా సంవత్సరంలో ఒక నీటి తూము నిర్మించారని అతని శాసనం వల్ల తెలుస్తుంది. 'తండలం శిలా శాసనం' కూడ ఒక నీటి తూము నిర్మాణాన్ని పేర్కొంది. నంది వర్మ పల్లవమల్లుని 25వ పాలనా సంవత్సరంలో పుదుక్కోట్టయ్ జిల్లాలోని రాసలిప్పట్టి చెరువుకు తూము నిర్మించారు.

BRAOU

నదినుండి ప్రధాన కాలువ ప్రారంభమయ్యే ముఖద్వారంలో పెద్ద తూము లేక నీటిపారుదలను క్రమబద్ధంచేసే పంతెన (కుర్రవ్వాయి) నిర్మించేవారు. ఇది నది నుండి కాలువలోకి ప్రవేశించే నీటిని అదుపులో పెట్టేది. మొదటి పరమేశ్వర వర్మకు చెందిన కూరం తామ్ర శాసనం, స్కందశిష్యుని రాయకోట తామ్ర శాసనం మొదలగు పల్లవుల శాసనాలు పేర్కొనే 'కుర్రవ్వాయి', 'వాయిట్టలై', 'తలైనాయి', 'ముకవాయి' ఈ ప్రధాన తూమును గురించినవే.

16.5.6.6 నీటిపారుదల నిర్వహణ

గ్రామ సభ, దాని సంఘాలకు సరివాలనాధికారం ఉన్నందు వల్ల, వాటికి నీటిపారుదల పని కూడ అప్పగించేవారు. చెరువుల్లోను, కాలువల్లోను ఎక్కువగా బురదమట్టి చేరినప్పుడు, ఆ మట్టిని త్రవ్వి, దాన్ని వాటి ఆనకట్టల మీద వేసేవారు. చెరువు సంఘం వ్యవహారాలను గ్రామ సభ పర్యవేక్షించేది. చెరువు సంఘం దాతలు చెరువులకు ఇచ్చిన దానాలను నిర్వహించేది.

16.5.7 వ్యవసాయ పంటలు

పల్లవుల కాలంలో అనేక రకాల వ్యవసాయ పంటలను పండించేవారు. అవి 1. వరి ధాన్యం: పల్లవుల రాజ్యంలో గ్రామాల్లోని వ్యవసాయ భూములల్లో చాలావరకు వరి ధాన్యమే పండించే వారు. అది దేశంలో ప్రధానమైన ఆహారపంటగా ఉండేది. వస్తుమార్పిడి పద్ధతి లావాదేవీల్లో కూడా వరిధాన్యాన్ని ప్రధానమైన వస్తువుగా ఉపయోగించేవారు. అంతేకాక పల్లవుల కాలంలో వరిధాన్యం ముఖ్యమైన వాణిజ్య ఉత్పత్తిగా కూడా ఉండేది. 2. కొబ్బరి: పల్లవుల కాలంలో మత సంబంధమైన సందర్భాల్లోను, ఇళ్ళలో నిత్యం ఉపయోగానికి కూడ కొబ్బరికి అధిక గిరాకీ ఉండేది. కొబ్బరి పంట పండించే భూముల యజమానులకు ఎక్కువ ఆదాయం వచ్చేది. 3. తాటిచెట్లు: పల్లవ రాజ్యంలోని గ్రామాల్లో తాటిచెట్లను అధిక సంఖ్యలో పెంచేవారు. కల్లు లభించే తాటిచెట్లమీద 'శార్వరి', 'పనంపాగు' అనే పన్నులను వేసేవారు. ఆ పన్నులను తాటిచెట్లు పెంచే భూముల యజమానులు కట్టేవారు. 4. పోకచెట్లు: ఆ కాలంలో గ్రామాల్లో పోక చెట్లను అధికంగా పెంచేవారు. ఎందువల్లంటే పల్లవ రాజ్యంలోని ప్రజలు ఎక్కువగా వక్కలు వాడేవారు. వక్కలను సముద్రయానం ద్వారా ఓడల్లో విదేశాలకు కూడ ఎగుమతి చేసేవారు. దేశంలో అమ్మే వక్కల మీద 'కడై అడైక్కాయ్' అనే పన్ను వేసేవారు. పాతపోక చెట్లలో నాలుగో భాగం మీద రాజుకు హక్కు ఉండేది. 5. ఇతరచెట్లు: పల్లవుల కాలంలో గ్రామాల్లో పెంచే మామిడి, తమాలం, నాగం, పున్నాగం, అశోక, మాధవి, కనికార మొదలగు చెట్లను కూడా వాటి తామ్ర శాసనాలు పేర్కొన్నాయి. 6. ప్రత్తి: పల్లవుల కాలంలో ప్రత్తి పండించేందుకు అనుకూలంగా ఉండే విశాలమైన ప్రాంతాల్లో దాన్ని సాగు చేసేవారు. ఎందువల్లంటే, నేతపని ఒక ముఖ్యమైన గ్రామీణ పరిశ్రమగా ఉండేది. నేతపని ప్రారంభించే ముందు తయారుచేసిన దారాల్లో రాజుకు భాగం ఉండేది. దానికి 'పదంగళి' అని పేరుండేది. పల్లవ రాజ్యంలో కాంచీపురం ప్రధాన నేత కేంద్రంగా ఉండేది. 7. ఔషధం మొక్కలు: ఆయుర్వేద వైద్యంలో ఉపయోగించే చిత్రమూలం, కొడివేలి, శెంగొడివేలి, కన్ని, కరసరంగన్ని, కరుసలాంగన్ని మొదలగు ఔషధం మొక్కలను కూడా పెంచేవారు. 8. కలువ పూలు మొక్కలు: పల్లవ రాజ్యంలోని అనేక గ్రామాల్లో కలువ పూలు మొక్కలను పెంచేవారు. వాటి మీద 'కువళై' అనే పన్ను వేసేవారు. 9: ఇతర తోటలు: ఆ కాలంలో 'ఉళ్ళి', 'ఇరువేలి', 'శెంగళునిర్', 'దమనగం' అనే మొక్కలు పెంచేందుకు తోటలు వేసేవారు.

EGRAOU

16.5.8 రైతులు - పన్నులు

పరిపాలనా యంత్రాంగాన్ని పోషించేందుకు, యుద్ధాలు చేసేందుకు, కళా సాహిత్య రంగాల వ్యాప్తికి, మతాన్ని ప్రోత్సహించేందుకు భారీగా ఆర్థిక వనరులు అవసరం. ఆ కాలంలో వాటిని ఇవ్వగలిగే శక్తి రైతులకు మాత్రమే ఉండేది.

రాజు రైతుల నుండి భూమిశిస్తు రూపంలో వ్యవసాయ ఉత్పత్తిలో కొంత భాగం వసూలు చేసేవాడు. అంతేకాక రైతులు ప్రత్యేకంగా తృణ ధాన్యాలు, బంగారం ఇవ్వవలసి వచ్చేది. ఉప్పు, చక్కెర, మద్యం లభించే చెట్లు రాజు అధీనంలో ఉండేవి. గ్రామాలకు చెందిన భూముల నుండి లభించే గుప్తనిధులు రాజుకు చెందేవి. రాజు గ్రామీణుల నుండి పూలు, పాలు, కలప, గడ్డి కూడ వసూలు చేసేవాడు. అంతేకాక రాజుకు చెందిన సరుకులను గ్రామీణులు ఉచితంగా మోసుకొని పోవలసి వచ్చేది. ప్రజలు రాజుకు వెట్టి-పని (విష్టి) చేయవలసి వచ్చేది.

పన్నులు వసూలు చేసేందుకు, నేరస్తులను పట్టుకొని శిక్షించేందుకు, సైన్యం యుద్ధానికి తరలివెళ్ళే స్కందర్భాల్లో ప్రభుత్వాధికారులు లేదా సైనికులు గ్రామాలకు వచ్చినపుడు గ్రామీణ ప్రజలు అనేక రకాల విధులను నిర్వహించవలసి వచ్చేది. వారికి గ్రామీణులు ఎద్దుబండ్లు, మంచాలు, బొగ్గు, పాయ్యలు, వంటపాత్రలు, సేవకులను సరఫరా చేయవలసి వచ్చేది.

పైన పేర్కొన్న పన్నులు, సుంకాలను పరిశీలిస్తే, ప్రభుత్వం రైతుల శ్రమను దోచుకొనేదని, వారి వ్యవసాయ ఉత్పత్తుల్లో అధిక భాగం పన్నుల రూపంలో వసూలు చేసేదని తెలుస్తుంది. ఈ పన్నులు సుంకాలు అన్నీ, క్రీ.శ.4వ శతాబ్దంలో బ్రాహ్మణులకు ఇచ్చిన 18 రకాల మినహాయింపులకు చెందినవే. తర్వాత కాలంలో రైతుల నుండి ఇంకా అధిక సంఖ్యలో పన్నులు, సుంకాలు వసూలు చేయడం వల్ల, వారి మీద అధిక భారం పడింది.

16.5.9 రెవిన్యూ విధానం

ప్రభుత్వానికి ఆదాయం అనేక రకాల పన్నులు సుంకాల వల్ల వచ్చేది. ఆ కాలం నాటి పన్నులను పల్లవులకు చెందిన అనేక శాసనాలు పేర్కొన్నాయి. ఈ శాసనాలు బ్రాహ్మణులకు, శైవ వైష్ణవ దేవాలయాలకు, జైన, బౌద్ధ సంస్థలకు ఇచ్చిన దానధర్మాలను రికార్డు చేశాయి.

పన్నుల వల్ల కలిగే భారం గురించి పల్లవుల శాసనాలు స్పష్టంగా వివరించాయి. వ్యవసాయ భూముల మీద ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి సంబంధించి రాజు భాగం ఎంత ఉండేదో, నాటి శాసనాలు స్పష్టంగా పేర్కొనలేదు. శాసనాలు సాధారణంగా 'ఇరై' అనే పన్నును తరచుగా పేర్కొన్నాయి. వివిధ తామ్రపత్ర శాసనాల్లో పొందుపర్చబడిన పరిహారాల పద్ధతులు పరిశీలిస్తే, ప్రభుత్వానికి ఇతర పన్నులు, సుంకాల ద్వారా వచ్చే ఆదాయం గురించి తెలుస్తుంది. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. 'అలొనగులచ్చోభం' - ఉప్పు తయారీ మీద పన్ను.
2. 'అపరంపర బలి వాదం' - ప్రయాణీకులు, అధికారులు మొదలగు వారికి ఎద్దులను సరఫరా చేయుట లేదా ప్రభుత్వాధికారుల ప్రయాణానికి ఎద్దులను సరఫరా చేయుట.

BRAOU

3. 'ఇళంపూచ్చి' - కల్లుతీయడమే వృత్తిగా గలవారి మీద పన్ను.

4. 'ఇడై పూచ్చి' - పశువులను పెంచి అమ్మేవారిమీద పన్ను.

5. బ్రాహ్మణరాశక్కాణం' - బ్రాహ్మణ పూజారులు రాజుకు కట్టవలసిన పన్ను.

6. 'కల్లాణక్కాణం' - వివాహ సందర్భంగా రాజుకు కట్టవలసిన డబ్బు.

7. 'కుశక్కాణం' - కుమ్మరి వారిమీద వేసే పన్ను.

8. 'తట్టుక్కాయం' - కంసాలి వారు కట్టవలసిన వృత్తి పన్ను.

9. 'విషక్కాణం' - గ్రామపెద్దకు కట్టవలసిన డబ్బు.

10. 'పారైక్కాణం' - చాకలి వారి మీద పన్ను (మీనాక్షి అభిప్రాయం.)

-రాతిగనుల (క్వారీల) మీద పన్ను (కృష్ణశాస్త్రి అభిప్రాయం)

11. 'పుట్టుకవిలై - వస్త్రాలు అమ్మేవారి మీద పన్ను లేక గుడారాల మీద పన్ను లేక ప్రభుత్వానికి కట్టవలసిన అద్దె

12. 'పట్టైగై కాణం' - రెవు వద్ద వేసే సుంకం
లేక రేవు దాటించే సరుకుల మీద వేసే పన్ను

13. 'తరుగు' - దళారీ మజూరి

14. 'శెక్కు' - నూనె గానుగల మీద, ఉత్పత్తి చేసిన నూనె మీద పన్నులు

15. 'తరి' - నేతపని వారిమీద పన్ను లేక వస్త్రాలు అమ్మేవారి మీద పన్ను.

16. 'పడాంకళి' - నూలు వడికే వారిమీద పన్ను. ఈ పన్నును నూలుదారాల రూపంలో కట్టేవారు.

17. 'వట్టినాళి' - ధాన్యం అమ్మకం మీద పన్ను

18. 'పుదినాళి' - క్రొత్తగా తయారైన ధాన్యం మీద పన్ను

19. 'ఊదుపొక్కు' - ధాన్యం మీద పన్ను లేక వివాదాలు పరిష్కారం చేసేదానికి పన్ను

20. 'పట్టిన శేరి' - చేపలు పట్టేవారు రాజుకు చెల్లింపవలసిన డబ్బు, నిర్ణయించిన మొత్తానికి చేపలు పట్టి అమ్మేవారు.

21 'తిరుముక్కాణం' - రాజపత్రాల మీద తపాలా చార్జీలు లేక రవాణా చార్జిలు.

22 'పత్తూర్ శారు' - తాటి చెట్లనుండి తీసిన తీపి కల్లుమీద పన్ను.

23. 'ఉళైయవయప్పళ్ళివత్తు' - గ్రామంలోని దేవాలయ సేవకులు రాజుకు వస్తురూపంలో చెల్లించే పన్ను లేక శివారు గ్రామానికి లభించే అన్ని రకాల ఆదాయంలో భాగం. అది రాజుకు ఉండే న్యాయబద్ధమైన భాగం

BRAOU

24. 'నాట్టువగై' - నాడుకు చెల్లింపవలసినవి

25. 'నెయ్ విళై' ఋు నేయి అమ్మేవారు కట్టవలసిన ఫీజు

26. 'కళ్ళిక్కాణం' - ఆయుధాలు కలిగి ఉండేవారు చెల్లింపవలసిన లైసెన్సు ఫీజు లేక ఆయుధాలు తయారు చేసే కమ్మరి వారు కట్టవలసిన పన్ను.

27. 'నెడుంబరై' - గ్రామంలో డోలు వాయించే వారిమీద పన్ను

28. 'ఎక్కోడు' - పన్నులు వసూలు చేసేందుకు వచ్చే అధికారులకు చెల్లింపవలసిన దినసరి భత్యం

29. 'శోర్రుమట్టు' - భూమిశిస్తు వసూలు చేసేందుకు వచ్చే అధికారులకు భోజన సదుపాయం కలుగచేయుట

30. 'మన్రుపాడు' - న్యాయస్థానాలు వేసే జరిమానా, జప్తులు మొదలగు వాటినుండి వచ్చే ఆదాయం

31. 'ఆత్తుక్కాణం' - గొర్రెల మీదవేసే పన్ను, లేదా ఫశువుల మీదవేసే పన్ను

32. 'కల్కోట్టుక్కాణం' - కొన్ని రకాల మొక్కలు నాటడం మీద పన్ను

33. 'అరప్పురత్తండం' - న్యాయస్థానాలు వేసే జరిమానాలు.

34. 'ఎత్తక్కాణం' - నీటి పారుదలకు ఉపయోగించే ఏతాముల మీద పన్ను.

పైన పేర్కొన్న పన్నులే కాక,'విరదుక్కుకాణం','నావిలాకాణం', 'ఉరాచ్చి', 'నెర్వాయం', 'తరిక్కూలై', 'కూలం', 'జూడిప్పాన్', 'అరప్పురతండం', 'పరిక్కాణం', 'ఉరిక్కాణం' మొదలగు పన్నులను కూడా పల్లవుల కాలం నాటి శాసనాలు పేర్కొన్నాయి. జూదాలను నిర్వహించే సంస్థలు (తంతువాయర్), లోహం పనివారు, గారడీ వాళ్ళు, చర్మం పనివారు, దుకాణదారుల మీదవేసే పన్నులు, సుంకాలను కూడ పల్లవుల శాసనాలు పేర్కొన్నాయి.

పైన చెప్పబడిన విషయాల్ని పరిశీలిస్తే పన్నులను, సుంకాలను పల్లవుల శాసనాలు వర్ణి 'ఆయం', 'కాణం', 'దండం', 'కరై', 'కడమై' అని పేర్కొన్నాయి.

పల్లవుల తర్వాత కాలంలో ప్రజలమీద విధించే పన్నులు, సుంకాలు అధికంగా పెరిగి కొన్నివందలకు చేరాయి.

16.5.10 కరువు కాటకాలు

పల్లవుల కాలంలో వచ్చిన కరువులను గురించిన సమాచారం మొట్టమొదటగా తమిళ గ్రంథం 'మణిమేకళై' పేర్కొంది. అది కాంచీపురంలో సంభవించిన తీవ్రమైన కరువును గూర్చి చెప్పు, వర్షాలు లేనందువల్ల పల్లవుల రాజ్యంలో సంబరం సండలేదని, కాంచీపురంలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొంది.

తర్వాత కాలంలో క్రీ.శ.7వ శతాబ్దం చివరలో పల్లవ రాజ్యంలో మరొక కరువు సంభవించింది. దాన్ని గురించిన వివరాలు కీర్తనలు తెలిపాయి. సంబందార్, తిరునావుక్కరసుల ప్రార్థనలను మన్నించి, శివుడు వారికి ప్రత్యక్షమై కరువు కాలంలో వారి అనుచరులకు ప్రతిదినం భోజన సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన డబ్బు వారికిచ్చేందుకు వాగ్దానం చేశాడు. ఈ కరువు క్రీ.శ. 7వ శతాబ్దం చివరి సంవత్సరాల్లో సంభవించింది. కరువు

పరిస్థితులు మూడు సంవత్సరాలు అంటే, క్రీ.శ.686 నుండి క్రీ.శ.689 వరకు ఉన్నాయని చైనా గ్రంథాలు పేర్కొన్నాయి. చైనా యాత్రికుడు వాంగ్ హుయన్‌త్సే కథనం ప్రకారం, కాంచీపురం రాజు తన రాజ్యంలో సంభవించిన కరువు పరిస్థితుల వల్ల తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నాడు.

మధ్య భారతదేశం పరిపాలించే రాజు ఈశానవర్మ కుమారుడు వజ్రబోధి క్రీ.శ.7వ శతాబ్దంలో దక్షిణ భారతదేశం సందర్శించే సమయంలో, పల్లవ రాజు అభ్యర్థన మీద దేవుని సహాయం కొరకు ప్రార్థనలు చేశాడు. ఆ ప్రార్థనలు ఫలించి, పల్లవ రాజ్యంలో వర్షాలు కురిసి, కరువు వల్ల కలిగిన దురవస్థలు తొలిగిపోయాయి. కాని పల్లవుల కాలం నాటి చరిత్రకు ఇతర ఆధారాలైన పల్లవ రాజులకు, శిలాశాసనాల్లో కాంచీపురంలో కాని, పల్లవ రాజ్యంలో ఏ ప్రాంతంలో కాని కరువు కాటకాలు సంభవించినట్లుగా ఎటువంటి సమాచారం లేదు.

మొదటి పరమేశ్వర వర్మ, మొదటి విక్రమాదిత్యుడు మధ్య యుద్ధాలు సంభవించి, వాటిలో పల్లవులు విజయం సాధించినా, ఆ యుద్ధాల ఫలితంగా పల్లవ రాజ్యంలోని ఆర్థికవనరులన్నీ ఖాళీ అయిపోయి, అక్కడ ఆర్థిక పరిస్థితులు క్షీణించాయి. దానికితోడు వర్షాలు పడక కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ వివరాలన్నీ రాజసింహుని సమకాలీనుడైన దండి రచించిన 'అవంతిసుందరి కథ'లో విపులంగా ఉన్నాయి. ఈ కరువు క్రీ.శ.7వ శతాబ్దం చివర సంభవించింది. కాంచీపురంలో వచ్చిన కరువు రాజసింహుడు సింహాసనం అధిష్ఠించక పూర్వం సంభవించింది.

తర్వాత కాలంలో పల్లవ రాజులు కరువువల్ల కలిగే దుర్భర పరిస్థితుల నుండి కాపాడుకొనేందుకు రాజ్యంలోని కరువు వచ్చే ప్రాంతాల్లో నీటిపారుదల సౌకర్యాలు పెంచేందుకు, నీటిపారుదల సదుపాయం కల్పించడంకోసం అధిక సంఖ్యలో నిర్మాణాలను చేపట్టేందుకు చర్యలు తీసుకొన్నారు. ప్రైవేట్ వ్యక్తులు కూడ చెరువులు, బావులు త్రవ్వించారు. 'క్రొత్తగా ప్రవేశపెట్టిన 'పంచవార' అనే పన్ను కరువు పరిస్థితుల నివారణకు ఉద్దేశించిందే' అని నీలకంఠశాస్త్రి అభిప్రాయపడ్డారు. 'పంచవార' అనేది కరువును ఎదుర్కొనేందుకు విధించిన పన్నులేక శిస్తు. ''పంచవార' సంఘానికి నిర్దేశించబడిన విధులు ఈ క్రొత్త పన్ను అంచనా, వసూలుకు సంబంధించినవి' అని నీలకంఠ శాస్త్రి వివరించారు.

16.5.11 తూనికలు - కొలతలు

పల్లవుల శాసనాలు అనేకం భూములు, బంగారం, ఇతర వస్తువులు, ఉత్పత్తులకు సంబంధించినవి కాబట్టి, ఆ శాసనాలు పరిశీలిస్తే, ఆ కాలంలో దేశంలో వాడుకలో ఉండిన తూనికలు, కొలతల గురించిన వివరాలు తెలుస్తాయి. వీటిలో అనేకం పల్లవుల తర్వాత కాలంలో కూడా తమిళదేశంలో వాడుకలో ఉండేవి. నాటి తూనికలు, కొలతలు కొన్ని ఇప్పటికి తమిళనాడులోని దక్షిణ జిల్లాలో వాడుకలో ఉన్నాయి.

భూములను కొలిచేందుకు 'నాగలి', 'నివరత్తు', లేక 'పట్టిక'లను కొలబద్దగా వాడేవారు. నాగలికి సమానమైన భూమి అంటే ఒక వ్యక్తి నిర్ణీత సమయంలో ఒక నాగలి, రెండు ఎద్దులతో సాగు చేయగలిగినంత భూమి. 'నివరత్తు' అంటే 20 కొలత బద్దలకు, లేక 200 మూరలకు, లేక 40,000 హస్తాలకు సమానమైన కొలతలు గల భూమి. 'నివరత్తు'కు సమానంగా ఖచ్చితమైన కొలతలు గల భూమి ఎంత ఉంటుందో పల్లవుల శాసనాలు స్పష్టంగా పేర్కొనలేదు. నివరత్తు అంటే , 3 రజ్జులు అని అర్థశాస్త్రం పేర్కొంది.

'పట్టిక' అనేది భూముల కొలతల్లో వాడే పరిమాణం అని చెందలూరు తామ్రపత్ర శాసనంవల్ల తెలుస్తుంది.పల్లవులకు చెందిన తమిళ శాసనాలు పట్టిని పేర్కొన్నాయి. 'నివరత్తు', 'పట్టి' అనే పదాలు రెండూ ఒకే అర్థం వచ్చేవి అని 'కశాక్కుడి' తామ్రపత్ర శాసనం వల్ల తెలుస్తుంది.

BRAOU

'వేలి', 'కుల్లి' అనేవి అత్యంత సాధారణంగా వాడే భూమి కొలతలు. వేలి అనే పదం ఒకవ్యక్తి వేసే కంచె నుండి లేదా అతని పొలం చుట్టూ వేసే కంచె (వేలి) నుండి వచ్చి ఉండవచ్చు. ఆ కాలంలో ఒక కుళి 81 చదరపు అడుగులకు సమానంగా ఉండేదని నృపతుంగవర్మకు చెందిన శాసనం వల్ల తెలుస్తుంది.

భూములను కొలిచేందుకు 'కోల్'లు లేక వివిధ సైజుల కొలతబద్దలు ఉపయోగించేవారని పల్లవ శాసనాలు పేర్కొన్నాయి. 'నాలుశాణ్ కోల్', 'పన్నీరు శాణ్ కోల్', 'పదినారు శాణ్‌కోల్' అనేవి ఉండేవి.

పల్లవుల కాలంలో అనేక రకాల కొలతలు వాడుకలో ఉండేవి. వాటిలో ప్రతిదానికి ఒక ప్రమాణం ఉండేది. తిరువొర్రియూర్‌లో 'కరునాళి' అనే ఒక నాళి కొలత ఉండేది. దానితో బియ్యం కొలిచే వారు. తెళ్ళారు నందికు చెందిన ఒక శాసనం 'నల్వానాళి' అనే కొలతను, నృపతుంగకు చెందిన చెంగల్పట్టు జిల్లాలో దొరికిన శాసనం 'మానాయనాళి' అనే కొలతలు పేర్కొన్నాయి.

వస్తువులను కొలిచే వాటిలో అతి తక్కువ కొలత 'పిడి'. ఈ కొలతలో నేయి, నూనెలను అరచేతి పిడికిలిలో నిండుగా కొలిచేవారు. నేయి, నూనె, పాలు, పెరుగు కొలిచేదానికి 'శెవిడు', 'శొడు', 'ఆళాక్కు', 'ఉళక్కు', 'ఉరి', 'నాళి' అనే కొలతలను ఉపయోగించేవారు. పల్లవుల కాలంలో బియ్యం, ధాన్యాలను కొలిచేందుకు 'నాళి', 'మరక్కాల్', 'కురుణి', 'పదక్కు', 'కాడి', 'కలం' అనే తూకాల్ని వాడేవారు.

పల్లవుల కాలంలో దేశంలో 'కళంజు', 'మంజాడి' అనే బంగారం తూనికలు వాడుకలో ఉండేవి. 'కళంజు' అనే తూనిక 'క్రిష్ణకాచ', 'నిష్కల'కు సమానమని నాటి శాసనాలవల్ల తెలుస్తుంది. 'కళంజు' అనేది 45-50 గ్రెయిన్ల బరువుగల ఒక రకం గింజల చెట్టు పేరు అని, దక్షిణ భారతదేశంలోని బంగారు నాణేల సరాసరి బరువు కూడ 45-50 గ్రెయిన్లు ఉండేదని ఆల్టేకర్ అభిప్రాయ పడ్డారు.

16.5.12 నాణేలు

పల్లవుల కాలం నాటి నాణేలను గురించిన సమాచారం రెండు రకాల ఆధారాల వల్ల తెలుస్తుంది. అవి 1.దేశంలోని వివిధ ప్రదేశాల్లో దొరికిన నాణేలు 2. పల్లవుల కాలం నాటి శాసనాలు, రచనలు పేర్కొన్న విషయాలు. ఈ ఆధారాలు వల్ల పల్లవుల కాలంలో వాడుకలో ఉన్న నాణేలు, వాటి స్వభావం, రకాలను గురించి తెలుసుకొనే వీలవుతుంది. పల్లవుల కాలంలో ఈ క్రింది రకాల నాణేలు వాడుకలో ఉండేది.

1. నాణేల మీది భాగాన 'శ్రీనిధి' లేక 'శ్రీభర' అనే పదాలు, ఎద్దు బొమ్మ, క్రింది భాగాన చక్రం, అర్ధ చంద్రుడు, పింజామరలు, చైత్యం, రాజ్య ఛత్రం, తాబేలు బొమ్మలు ఉండేవి.

2. నాణేల మీది భాగాన 'శ్రీభర' లేక 'శ్రీనిధి' అనే పదాలు, వెనుక వైపు ఒకటి లేక రెండు చేపల బొమ్మలు ఉండేవి.

3. నాణేలమీది భాగాన ఎద్దుబొమ్మ, 'మానపార' అనే పదం, వెనుక వైపు ఒక పీఠం మీద శంఖం, దాని చుట్టూ

BRAOU

గుండ్రంగా కిరణాలు ఉండేవి.

4. నాణేల మీద రెండు తెరచాప కొయ్యలు ఉండేవి.

5. సింహం బొమ్మలతో ఉండే నాణేలు. తొలి పల్లవుల కాలంలో సింహం, సింహవిష్ణు కాలం నుండి ఎద్దు పల్లవుల రాజ్య చిహ్నాలుగా ఉండేవి.

6. 'కళంజు'. ఇది పల్లవుల కాలంలో నాణెంగా చెలామణిలో ఉండేది. క్రీ.శ.9వ శతాబ్దం నాటి పల్లవుల శాసనాలు అనేక సందర్భాల్లో ఈ రకం నాణేల్ని పేర్కొన్నాయి.

7. శాసనాలు పేర్కొన్న నాణేలు. దేవాలయాలకు దానాల్ని బంగారం రూపంలోను, బంగారు నాణేల రూపంలోను ఇచ్చేవారని పల్లవుల కాలంనాటి శాసనాల వల్ల స్పష్టమౌతుంది. తర్వాత కాలం నాటి పల్లవులకు చెందిన తమిళ శాసనాలు 'కాణం', 'పళంగాశు', 'తుళైప్పొన్', 'విడెల్విడుగుపొన్' అనే పేర్లుగల నాణేల్ని తరచుగా పేర్కొన్నాయి. ఈ శాసనాలు పేర్కొన్న 'పొన్' అంటే, నిర్ణీత బరువుగల బంగారు నాణేలు.

16.6 సంగ్రహంగా

గుప్తుల అనంతర కాలంలో హర్షుని పాలనలో ఉత్తర భారతదేశంలో వ్యవసాయం అభివృద్ధి చెందింది. నీటిపారుదల సౌకర్యాలు మెరుగయ్యాయి. వివిధ వృత్తుల వారు తమ ప్రయోజనాలు కాపాడుకొనేందుకు శ్రేణులను ఏర్పాటు చేసుకొన్నారు. శ్రేణులు ఆర్థిక వ్యవహారాలను కూడ నిర్వహించేవి. నాడు బంగారం, వెండి నాణేలేకాక గవ్వలు, చిన్న ముత్యాలు కూడ నాణేలుగా చెలామణిలో ఉండేవి.

బాదామి చాళుక్యుల పాలనలో, కర్ణాటకలో, ఆర్థిక రంగంలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. పటిష్టమైన రెవిన్యూ విధానాన్ని అమలు చేశారు. శ్రేణులకు ఆర్థిక వ్యవహారాల్లోనే కాక, స్థానిక పరిపాలనలో కూడా ప్రత్యక్ష పాత్ర ఉండేది. నిర్దిష్టమైన తూనికలు, కొలతలు వాడేవారు. బంగారం, వెండి నాణేలే కాక, బంగారం, వెండి మిశ్రమంతో తయారుచేసి ముద్రించిన నాణేలు కూడ నాడు వాడుకలో ఉండేవి.

పల్లవుల కాలంలో గ్రామీణ వ్యవస్థ పటిష్టంగాను, గ్రామీణ ఆర్థిక జీవనం స్వయం సమృద్ధిగాను ఉండేవి. వ్యవసాయం గణనీయంగా అభివృద్ధి చెందింది. భూములు ప్రైవేట్ యజమానుల అధీనంలోను, రాజు యాజమాన్యంలోను ఉండేవి. నీటి పారుదల సదుపాయం కల్పించేందుకు చెరువులు, బావులు, కాలువలను నిర్మించారు. పలురకాల పంటలు పండించేవారు. నాటి రెవిన్యూ విధానం ఫలితంగా అనేక రకాల పన్నులు, సుంకాల వల్ల ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. కరువు నివారణ చర్యలు చేపట్టేవారు. పల్లవుల పాలనలో ప్రజలు తూనికలు, కొలతలు వాడేవారు. వాటిలో కొన్ని ఇప్పటికి తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో వాడుకలో ఉన్నాయి. పల్లవ రాజులు పలు రకాల నాణేలను ముద్రించి, చెలామణిలోకి తెచ్చారు. పల్లవుల పాలనలో దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తమిళనాడులో ప్రజల ఆర్థిక పరిస్థితులు గణనీయంగా మెరుగయ్యాయి.

BRAOU

16.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

I ఈక్రింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. గుప్తుల అనంతర కాలంలో భారతదేశంలో జరిగిన ఆర్థికాభివృద్ధిని గురించి రాయండి.
2. హర్షుని పాలనలో ఆర్థిక పరిస్థితులను వర్ణించండి.
3. బాదామి చాళుక్యుల పాలనలో ఆర్థిక జీవన విధానాన్ని వివరించండి.
4. పల్లవుల పాలనలో దక్షిణ భారతదేశంలోని ఆర్థిక పరిస్థితులను తెల్పండి.

II. ఈక్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలు రాయండి.

1. హర్షుని కాలంలో వ్యవసాయం
2. బాదామి చాళుక్యుల సన్నుల విధానం
3. బాదామి చాళుక్యుల పాలనలో శ్రేణులు
4. పల్లవుల కాలంలో గ్రామీణ ఆర్థిక జీవనం
5. పల్లవుల పాలనలో నీటి పారుదల
6. పల్లవుల రెవిన్యూ విధానం.

BRAOU

16.8 ఉపయుక్త గ్రంథాలు

Appadorai, A - **Economic Conditions in South India**

Buch, M.A. - **Economic Life in Ancient India**

Cowell, E.B. and Thomas, F.W. - **Harshacharita of Bana**

Das, Sukia - Socio -**Economic Life of North India (550 - 650 A.D.)**

Desai, P.B. - **A History of Karnataka**

Dutt, Romesh - **The Economic History of India**

Ghoshal, U.N. - **Agrarian System in Ancient India**

Gopalan - **History of the Kanchi**

Hears, H - **Studies in Pallava History**

Jain, Beena - **Guild Organisation in North India From earliest times to 1200 A.D.**

Mahalingam, T.V. - **Kanchipuram in Early South India History**
Mahalingam, T.V. - **South Indian Polity**
Majumdar R.C., - Pusalker A.D. , - **The Classical Age & A.K.Majundar (Ed)**
Minakshi, G. - **Administration and Social Life under the Pallavas**
Mookerji, R.K. - **Harsha**
Nagaraja Rao, M.S.(Ed) - **The Chalukyas of Badami**
Nilakanta Sastri, K.A. - **A History of South India**
Nilakanta Sastri, K.A. - **The History and Culture of the Tamils**
Rangaswamy, C.V. - **Government and Administration under the Chalukyas of Badami**
Ray, N.R. - **Harsha - Siladitya - A Provised study**
Sinha, G.P. - Post - **Gupta Polity**
Watters - **On Yuan Changs Travels in India**

రచయిత: ఆచార్య బి. వసంతయ్య.

BRAOU

భాగం-17 : వాణిజ్యం-పరిశ్రమలు (కీ.పూ.2500-క్రీ.శ.700)

విషయక్రమం

17.0 లక్ష్యాలు

17.1 పరిచయం

17.2 వాణిజ్యం

17.3 హరప్పా కాలం

17.4 వేద కాలం

- 17.4.1 వ్యాపార నియమాలు
- 17.4.2 వాణిజ్య మార్గాలు
- 17.4.3 విదేశీ వాణిజ్యం

17.5 వేదానంతర కాలం

17.6 మౌర్యుల కాలం

- 17.6.1 దేశీయ వాణిజ్యం
  - 17.6.1.1 ప్రభుత్వ నియంత్రణ
  - 17.6.1.2 వాణిజ్య మార్గాలు
- 17.6.2 విదేశీ వాణిజ్యం
  - 17.6.2.1 సముద్రయాన వాణిజ్యం
  - 17.6.2.2 భూమార్గాలు
  - 17.6.2.3 భారతదేశం-ఈజిప్టు

17.7 శాతవాహనుల కాలం

- 17.7.1 దేశీయ వాణిజ్యం
  - 17.7.1.1 వ్యాపార పట్టణాలు
  - 17.7.1.2 వ్యాపారులు
  - 17.7.1.3 నాణేలు-వ్యాపారం
  - 17.7.1.4 వ్యాపార శ్రేణులు
  - 17.7.1.5 వడ్డీరేటు
- 17.7.2 విదేశీ వాణిజ్యం
  - 17.7.2.1 దిగుమతులు-ఎగుమతులు
  - 17.7.2.2 రేవు పట్టణాలు
  - 17.7.2.3 భారతదేశం-పశ్చిమ దేశాలు
  - 17.7.2.4 భారతదేశం-గ్రీస్
  - 17.7.2.5 భారతదేశం-రోమ్
  - 17.7.2.6 భారతదేశం-పార్థియా
  - 17.7.2.7 భారతదేశం-మలయా

BRAOU

17.8 కుషాణుల కాలం

17.8.1 దేశీయ వాణిజ్యం

17.8.1.1 వ్యాపారులు

17.8.1.2 వ్యాపార వస్తువులు

17.8.1.3 వ్యాపార నియమాలు

17.8.1.4 వాణిజ్య మార్గాలు

17.8.1.5 వాణిజ్య నియంత్రణ

17.8.1.6 వాణిజ్య వర్గాలు

17.8.2 విదేశీ వాణిజ్యం

17.8.2.1 వాణిజ్య మార్గాలు

17.8.2.2 భారతదేశం-పశ్చిమ దేశాలు

17.8.2.3 భారతదేశం-రోమ్

17.8.2.4 భారతదేశం-మధ్య ఆసియా

17.8.2.5 భారతదేశం-ఆగ్నేయ ఆసియా

17.8.2.6 భారతదేశం-పట్టు మార్గం

17.9 గుప్తుల కాలం

17.9.1 దేశీయ వాణిజ్యం

17.9.1.1 వాణిజ్య మార్గాలు

17.9.1.2 వ్యాపార వస్తువులు

17.9.1.3 వ్యాపారులు

17.9.2 విదేశీ వాణిజ్యం

17.9.2.1 సముద్రయానం

17.9.2.2 రేవు పట్టణాలు

17.9.2.3 భారతదేశం-శ్రీలంక

17.9.2.4 భారతదేశం-చైనా

17.9.2.5 భారతదేశం-పశ్చిమ దేశాలు

17.9.2.6 భారతదేశం-ఇథియోపియా

17.9.2.7 భారతదేశం-ఆగ్నేయ ఆసియా

17.10 గుప్తుల అనంతర కాలం

17.11 పరిశ్రమలు

17.12 హరప్పా కాలం

17.13 వేద కాలం

17.13.1 కుండలు-జాడీలు

17.13.2 పాత్రలు

17.13.3 వస్త్ర పరిశ్రమ

17.14 మౌర్యుల కాలం

17.15 శాతవాహనుల కాలం

17.15.1 పారిశ్రామిక వృత్తులు

17.15.2 ఇనుము-ఉక్కు పరిశ్రమ

17.15.3 వస్త్ర పరిశ్రమ

17.15.4 అద్దకం పరిశ్రమ

17.15.5 నూనె పరిశ్రమ

BRAOU

17.15.6 దంతం పరిశ్రమ
17.15.7 ఎర్రమట్టి పరిశ్రమ
17.15.8 నాణేల ముద్రణ
17.15.9 ఆభరణాలు
17.16 కుషాణుల కాలం
17.16.1 సాంకేతిక అభివృద్ధి
17.16.2 లోహ పరిశ్రమ
17.16.3 ఇనుము పరిశ్రమ
17.16.4 ఆయుధాల పరిశ్రమ
17.16.5 వస్త్ర పరిశ్రమ
17.16.6 నూనె పరిశ్రమ
17.16.7 దంతం, గాజు, పూసల పరిశ్రమలు
17.16.8 నాణేల ముద్రణ
17.16.9 మట్టి బొమ్మలు
17.17 గుప్తుల కాలం
17.17.1 గనులు-ఖనిజాలు
17.17.2 ఇనుము పరిశ్రమ
17.17.3 ఆభరణాల తయారీ పరిశ్రమ
17.17.4 రాగి, కంచు, ఇత్తడి పరిశ్రమలు
17.17.5 అద్దాల తయారీ పరిశ్రమ
17.17.6 విలువైన రాళ్ళ పరిశ్రమ
17.17.7 ఉప్పు పరిశ్రమ
17.17.8 మట్టి పరిశ్రమ
17.17.9 చర్మ పరిశ్రమ
17.17.10 దంత పరిశ్రమ
17.17.11 పట్టు పరిశ్రమ
17.17.12 కలప పరిశ్రమ
17.17.13 వస్త్ర పరిశ్రమ
17.17.14 అద్దకం, ఎంబ్రాయిడరీ పరిశ్రమలు
17.17.15 నూనె పరిశ్రమ
17.17.16 అలంకరణ సామాగ్రి, సుగంధ ద్రవ్యాల పరిశ్రమలు
17.17.17 మద్యం పరిశ్రమ
17.17.18 లోహ పరిశ్రమ
17.18 గుప్తుల అనంతర కాలం
17.18.1 భవన నిర్మాణ పరిశ్రమ
17.18.2 వస్త్ర పరిశ్రమ
17.19 సంగ్రహంగా
17.20 పరీక్ష నమూనా ప్రశ్నలు
17.21 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

17.0 లక్ష్యాలు

ఈ భాగం చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

★ క్రీ.శ. 2500 నుండి క్రీ.శ.700 వరకు హరప్పా కాలం, వేద కాలం, మౌర్యుల కాలం, శాతవాహనుల కాలం, కుషాణుల కాలం, గుప్తులు, గుప్తుల అనంతర కాలంలోని వాణిజ్యం, పరిశ్రమల స్వభావం, వాటి పరిస్థితులు, అభివృద్ధి.

17.1 పరిచయం

భారతదేశంలో క్రీ.పూ.2500 నుండి క్రీ.శ.700 వరకు వాణిజ్యం, పరిశ్రమలు గణనీయంగా అభివృద్ధి చెందాయి. నాటి పాలకులు దేశంలో సుస్థిరత, శాంతి, రక్షణలను కల్పించి, దేశీయ, విదేశీ వాణిజ్యాలు, వివిధ రకాల పరిశ్రమలను తగిన విధంగా ప్రోత్సహించి, అవి త్వరితగతిన అభివృద్ధి చెందేందుకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. దాని ఫలితంగా భారతదేశంలో వాణిజ్య కార్యకలాపాలు పెరిగాయి. పరిశ్రమలు అధిక సంఖ్యలో స్థాపింపబడి, ఉత్పత్తులు పెరిగాయి. ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యాయి. ప్రభుత్వానికి అధిక మొత్తంలో ఆదాయం రాసాగింది. దేశ సంపద కాలక్రమేణా గణనీయంగా పెరిగింది. ప్రజలు భోగభాగ్యాలతో తులతూగారు.

17.2 వాణిజ్యం

ప్రాచీన భారతదేశంలో క్రీ. పూ 2500 నాటి హరప్పా నాగరికత కాలం నుండి క్రీ.శ 700 వరకు, వాణిజ్యం గణనీయంగా అభివృద్ధి చెందింది. నాటి రాజుల ప్రోత్సాహంతో, దేశీయ, విదేశీ వాణిజ్యం సుభిక్షంగా కొనసాగించబడింది. దేశీయ వాణిజ్యం రహదారులు భూమార్గాలు, నదులు, కాలువలు ద్వారా కొనసాగించేవారు. జల మార్గాల ద్వారా విదేశీ వాణిజ్యం కొనసాగింపబడేది.

17.3 హరప్పా కాలం

హరప్పా నాగరికత ప్రధానంగా నగర సంస్కృతితో వర్ధిల్లింది. హరప్పా కాలంలో పట్టణాలు, నగరాలు నిర్మించారు. దాని ఫలితంగా వాణిజ్య కార్యకలాపాలు పెరిగాయి. ప్రజల నిత్యావసర వస్తువులను, వ్యవసాయ ఉత్పత్తులను పల్లె ప్రాంతాల నుండి పట్టణాలకు రవాణా చేసేవారు. సరుకుల రవాణాకు ముఖ్యంగా బండ్లు, జంతువులను ఉపయోగించేవారు. వ్యాపార కేంద్రాలైన పట్టణాల్లో సరుకుల అమ్మకాలు, కొనుగోలు జరిగేవి. వస్తు మార్పిడి పద్ధతి కూడా ఉండేది. హరప్పా కాలంలో దేశీయ వాణిజ్యాన్ని గురించి మనకు తెలిసిన సమాచారం చాలా తక్కువ.

హరప్పా కాలంలో విదేశీ వాణిజ్యం అభివృద్ధి చెందిందనడానికి ఆధారాలు లభించాయి. మెసొపొటేమియాలో సింధూ ముద్రలు దొరికాయి. వాటిని బట్టి సింధూ ప్రజలకు మెసొపొటేమియాతో వ్యాపార సంబంధాలు ఉండేవని స్పష్టమౌతుంది. ఒక ముద్ర మీద ఉన్న చిత్రాన్ని బట్టి, మెసొపొటేమియా ప్రజలు భారతదేశాన్నుండి వస్త్రాలు దిగుమతి చేసుకొనేవారని తెలుస్తుంది. సింధూ ప్రాంతం నుండి దంతం కూడ దిగుమతి అయ్యేది. ఎందువల్లంటే, ఆ కాలంలో సింధూ ప్రాంత ప్రజలు దంతంతో తయారుచేసిన దువ్వెనలను వాడేవారు.

BRAOU

సుమేరియాలో దొరికిన శాసనాల వల్ల భారతదేశం (మెలుహా) నుండి దంతం, బంగారం, నల్లచేవ మ్రాను (ebony), యమున రాయి (cornelian) దిగుమతి అయ్యేవని తెలుస్తుంది.

ఉర్‌ను పాలించిన మూడవ వంశానికి చెందిన మొదటి రాజు ఉర్ సముద్ర తీరప్రాంతాల ద్వారా విదేశీ వ్యాపారం చేసేవాడు. అతని రాజధాని అగేడ్‌కు భారతదేశం (మెలుహా) నుండి ఓడలు రాకపోకలు సాగించేవి.

సింధూ ప్రాంతం, ఇరాక్ మధ్య వ్యాపారానికి స్థావరంగా పర్షియా సింధు శాఖలోని బహ్రీన్ ఉండేది. బహ్రీన్, భారతదేశం మధ్యగల సముద్ర తీరప్రాంతంలోని 'మగాన్' లేక 'మక్కాన్' మరొక కేంద్రంగా ఉండేది.

భారతదేశం నుండి నెమళ్ళు, దంతం, దంతంతో తయారు చేసిన దువ్వెనలు మొదలగు వస్తువులు, ముత్యాలు, నూలు వస్త్రాలు ఎగుమతి అయ్యేవి. భారతీయులు వెండి మొదలగు వస్తువులను దిగుమతి చేసుకొనేవారు.

హరప్పా నాగరికతా కాలంలో భారతీయ వ్యాపారస్తులు కొందరు మెసొపొటేమియాలో నివాసం ఏర్పాటు చేసుకొని, రెండు దేశాలమధ్య ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన వ్యాపార లావాదేవీలను నిర్వహించేవారు.

17.4 వేద కాలం

వేద కాలం నాటి సాంఘిక వ్యవస్థలో వైశ్యులు మూడో తెగకు చెందినవారు. వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారం వైశ్యుల నిర్వహణలో ఉండేవి. వ్యాపారం చేసే వైశ్యునికి 'వణిక్' అని పేరుండేది.

వ్యాపారం చేసేందుకు మూడు రకాల అనుకూల పరిస్థితులు అవసరమని వేదాలు పేర్కొన్నాయి. అవి (1) అంతర్జాతీయ సుహృద్భావం, సహకారం, (2) దేశంలో శాంతి భద్రతలు, (3) అడపులగుండా సరుకుల రవాణాకు రక్షణ.

"దేవా మా పట్టుదలను క్షమించు. మేము చాలా దూరం వచ్చాము. మా అమ్మకాలు, వస్తు మార్పిడి సమృద్ధిగా ఉండాలి. సరుకుల మారకం వల్ల నేను ధనవంతుడ్ని కావాలి"అని వ్యాపారులు ప్రార్థించేవారని అథర్వణ వేదం పేర్కొంది.

17.4.1 వ్యాపార నియమాలు

వేదాలు వ్యాపారాన్ని ప్రోత్సహించాయి. కాని వేదాలు అన్నిటిమీద కొన్ని పరిమితులను విధించాయి. వ్యాపారస్తుడు నాటి సంఘంలో సంపద ఉత్పత్తిచేసే ప్రతినిధిగా వ్యవహరించాలేగాని, దోపిడీదారు కాకూడదు. వ్యాపారస్తుని లోని మానవ బలహీనత అవధులు దాటితే, అతడు వణిక్ కాడు, 'పణి' అవుతాడు. పణి అంటే దుర్మార్గంగా సంపాదించే వ్యాపారి. దొంగ వ్యాపారస్తుడు. దొంగ వ్యాపారం చేసే పణులను రుగ్వేదం పలుమార్లు నిరసించింది. పణులు దొంగతనంగా సరుకులను దాచిపెట్టేవారని, వారు యాగాలు చేసేవారు కాదని రుగ్వేదం పేర్కొంది. పణులకు నాయకుడ్ని 'పలుడు' అనేవారు. ఇటువంటి దొంగ వ్యాపారులు, నల్ల బజారు వర్తకుల నుండి ప్రజలను రక్షించడం రాజు విధ్యుక్తధర్మంగా పరిగణించేవారు.

BRAOU

17.4.2 వాణిజ్య మార్గాలు

వ్యాపారానికి, సరుకుల రవాణాకు రహదారులు చాలా అవసరం. ఋగ్వేదం పలుమార్లు రహదారులను (పథ) పేర్కొంది. ఆ గ్రంథంలో రహదారులను గురించి ఈ క్రింది పేర్కొన్న విషయాలు ఉన్నాయి.

1. రహదారుల దూరం చాలా తక్కువగా ఉండాలి.
2. సమృద్ధి కేంద్రాలతో రవాణా సంబంధాలు ఉండాలి
3. దొంగలు, దారి దోపిడీదారులు, మోసగాళ్ళు, క్రూర జంతువుల నుండి రహదారుల మీద రక్షణ అవసరం.
4. సురక్షితమైన, వేగవంతమైన వార్తా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఒక నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
5. ప్రజలు పై వ్యవస్థతో సహకరించాలి కాని దాని జోక్యాన్ని నిరసించ కూడదు. ఎందువల్లంటే, అది ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు పనిచేసేది.

17.4.3 విదేశీ వాణిజ్యం

సముద్రయానాన్ని గురించి వేదాలు పలుమార్లు పేర్కొన్నాయి. ఋగ్వేదం భూమార్గాలకు 'పూషణుని', జల మార్గాలకు 'వరుణుడ్ని', వాయు మార్గాలకు 'సవిత'ను పేర్కొంది. సముద్రంమీద ప్రయాణం చేసే వ్యాపార నౌకలు, గాలిలోను, నీటిమీద పయనించే పడవల గురించి ఋగ్వేదం తెలిపింది. ఒక మంచి ఓడ ఎక్కడం గురించి ఋగ్వేదం తెలిపింది. ఒక మంచి ఓడ ఎక్కడం గురించి యజుర్వేదం, ఓడ ఎక్కడం గురించి అథర్వణ వేదం పేర్కొన్నాయి.

వైదిక సాహిత్యంలో పడవ, ఓడలను రూపకాలంకార పదాలుగా వాడడం సర్వ సాధారణం. ఆ పదాల వాడుక ఎంతవరకు పోయిందంటే, ప్రాపంచిక జీవితాన్ని ఒక మహాసముద్రంగాను, దాన్ని దాటి స్వర్గాన్ని చేరేందుకు ధర్మం అనే పడవ మీద ప్రయాణం చేయడం అవసరమని నాటి కవులు నర్ణించారు.

BRAOU

17.5 వేదానంతర కాలం

వేదానంతర కాలంలో భారతదేశం నుండి పత్తిని అస్సిరియాలో సెన్నాచెరిబ్ (క్రీ.పూ.704-681) పాలనలో ప్రవేశపెట్టారు. అతడు పర్షియా సింధు శాఖలో ఫోనీషియా పడ్రంగులచేత యుద్ధ నౌకలను నిర్మించాడు. యుద్ధాలు అయిపోయిన తర్వాత ఆ నౌకలను వ్యాపారానికి కూడ ఉపయోగించి, భారతదేశం నుండి పత్తి చెట్లు, బియ్యం, నెమళ్ళు దిగుమతి చేసుకొన్నాడు. భారతీయ వ్యాపారులు బాబిలాన్ (బవేరు) వెళ్ళారని, అక్కడికి మొట్టమొదటగా నెమళ్ళు తీసుకెళ్ళారని జాతక కథల వల్ల తెలుస్తుంది.

సాలమన్ రాజు క్రీ.పూ.10వ శతాబ్దంలో ఫోనీషియా నౌకల ద్వారా భారతదేశం (ఓఫిర్) నుండి బంగారం, వెండి, దంతం (స్వెబ్బీమ్), కోతులు (గోఫీం), నెమళ్ళు (తుక్కిమ్మీమ్) దిగుమతి చేసుకొన్నాడని క్రైస్తవ మత గ్రంథాల వల్ల తెలుస్తుంది. "వ్యాపార సరుకులకు భారతీయ పేర్లు ఉన్నందువల్ల, అవి భారతదేశంలోనే ఉత్పత్తి అయ్యాయని భావించవలసి ఉంటుంది" అని ఆర్.సి. మజుందార్ అభిప్రాయ పడ్డారు. పైన పేర్కొన్న విషయాల వల్ల భారతదేశం, మధ్య ప్రాచ్య దేశాల మధ్య వ్యాపార సంబంధాలు క్రీ.పూ. 10వ శతాబ్దం నుండే ఉన్నాయని స్పష్టమౌతుంది.

భారతదేశం - పర్షియా :

పర్షియాను పాలించిన ఆకెమెనిడ్ చక్రవర్తుల కాలంలో ఆ దేశానికి భారతదేశంతో సంబంధాలు ఉండేవి. మొదటి సైరస్ (క్రీ.పూ. 558-530) గాంధారను (గాందారిటిస్) జయించాడు. మొదటి డేరియస్ (క్రీ.పూ. 522-486) భారతదేశంపై దండెత్తి పంజాబ్‌ను జయించాడు. భారతదేశంలోని ఆ ప్రాంతాలు పర్షియా వారి అధీనంలో మూడో డేరియస్ పాలనలో క్రీ.పూ. 328 వరకు ఉన్నాయి. దాని ఫలితంగా పర్షియా, భారతదేశాల మధ్య వ్యాపార సంబంధాలు ఏర్పడ్డాయి.

17.6 మౌర్యుల కాలం

మౌర్యుల కాలంలో శాంతి సుస్థిరత వల్ల వ్యాపార, వాణిజ్య రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగింది. వాణిజ్యంపై పూర్తిగా ప్రభుత్వ నియంత్రణ ఉండేది. ఆనాటి వర్తక వాణిజ్య కార్యకలాపాలను గురించి ముఖ్యంగా కౌటిల్యుని 'అర్థశాస్త్రం', 'మెగస్తనీస్' 'ఇండికా' (Indica) వల్ల మనకు సమాచారం తెలుస్తుంది. పీరి కాలంలో దేశీయ వ్యాపారం బండ్లు, బిడారుల ద్వారా రహదారుల్లో, జలమార్గాల ద్వారా జరిగింది. సముద్ర మార్గాల ద్వారా విదేశీ వర్తకం కొనసాగింపబడింది.

17.6.1 దేశీయ వాణిజ్యం

మౌర్యుల కాలంలో దేశీయ వాణిజ్యం గణనీయంగా అభివృద్ధి చెందింది. విశాల సామ్రాజ్య స్థాపన, చక్రవర్తుల ప్రోత్సాహం, దేశంలో శాంతి భద్రతలు మొదలగు కారణాల వల్ల, వ్యాపార కార్యకలపాలు పెరిగాయి.

వ్యాపారం విషయంలో ప్రభుత్వానికి ఒక ప్రత్యేక బాధ్యత ఉండెది. ప్రభుత్వ కర్మాగారాల్లో నిరంతరం అత్యధిక మొత్తాల్లో పేరుకుపోయిన ఉత్పత్తుల నిల్వలను లాభదాయకంగా అమ్మడంపై ప్రభుత్వం ఆదాయం కూడ ఆధారపడి ఉండేది. అందువల్ల దేశంలో ప్రభుత్వమే బడా వ్యాపారిగా ఉండేది. తన ప్రయోజనాలను కాపాడుకొనేందుకు ప్రభుత్వానికి వ్యాపారం మొత్తాన్ని నియంత్రించే అవసరం ఎంతైనా ఉండేది.

దేశీయ వాణిజ్యంలో ముత్యాలు, రత్నాలు, వజ్రాలు, పగడాలు, సుగంధ చెక్కలు, చర్మాలు, కంబళ్ళు, పట్టు, జరీ, నూలు వస్త్రాలు మొదలగు సరుకులతో వ్యాపారం చేసేవారు.

17.6.1.1 ప్రభుత్వ నియంత్రణ

మౌర్యుల కాలంలో వ్యాపారం, సరుకుల ధరలు, కొలతలు, తూనికల మీద ప్రభుత్వ నియంత్రణ ఉండేది. అందువల్ల వ్యాపారంలో తప్పనిసరిగా కొన్ని నియమ నిబంధనలు ఉండేవి. సరుకులను అవి ఉత్పత్తి అయిన ప్రదేశంలో కాని, పాలంలో కాని, కర్మాగారంలో కాని అమ్మే వీలుండేది కాదు. వాటిని నిర్ణీత మార్కెట్లకు (పణ్యశాల) తీసుకొని పోయేవారు. అక్కడ వ్యాపారస్తుడు సరుకుల మొత్తాన్ని, వాటి నాణ్యత, ధరలను ప్రకటించేవాడు. అధికారులు వాటిని పరిశీలించి, రిజిస్టర్లలో రికార్డు చేసేవారు. ప్రతి వ్యాపారి అమ్మకాలు సాగించేందుకు లైసెన్సు తీసుకోవలసి ఉండేది. ఇతర ప్రాంతాలు, దేశాల నుండి వచ్చిన వర్తకుడు పాస్‌పోర్టు కూడ తీసుకోవలసిన అవసరం ఉండేది.

BRAOU

వాణిజ్యాధికారి (పణ్యాధ్యక్షుడు) కస్టమ్స్ కేంద్రానికి వచ్చిన సరుకుల టోకు ధరలను నిర్ణయించేవాడు. వాటి చిల్లర ధరలు నిర్ణయించే విషయంలో అతడు వ్యాపారులకు న్యాయమైన లాభాలు వచ్చే విధంగా చూసేవాడు. సరుకుల దొంగ రవాణాదారులను, కల్తీ చేసేవారిని కఠినంగా శిక్షించే వారు. నల్ల వ్యాపారాన్ని, సరుకులు నిలువ చేసి అధిక ధరలకు అమ్మడాన్ని అనుమతించేవారు కాదు. అధిక వేతనాల కోసం కార్మికులు సమ్మె చేయడం చట్ట విరుద్ధంగా పరిగణించేవారు.

అధిక ధరలు, దొంగ వ్యాపారుల నుండి ప్రజలను, ఖాతాదారులను, వినియోగదారులను రక్షించేందుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించేది. సరుకులు గురించి దొంగ ప్రకటనలు చేసేవారిని పట్టుకునేందుకు, ఆ విషయం ఇతర వ్యాపారులకు తెలియ చేసేందుకు ప్రభుత్వం వ్యాపార మార్గాల్లో గూఢచారులను, మార్కెట్ ఇన్‌స్పెక్టర్లను అధిక సంఖ్యలో నియమించేది.

వ్యాపారంలో అన్ని దశల్లో ఎగుమతి సుంకాలు, దిగుమతి సుంకాలు, ఆక్ట్రాయి, ఎక్సయిజు మొదలగు సున్నులను వసూలు చేసేవారు. ప్రభుత్వం సరుకుల రవాణాకు పూర్తి రక్షణను కల్పించేది. రవాణాలో సరుకుకు నష్టం జరిగితే, ఆ మార్గం పోయే ప్రదేశానికి సంబంధించిన ప్రభుత్వాధికారి జరిగిన నష్టం పూరించవలసి వచ్చేది. దోపిడీ దొంగలు, కిరాటులు మొదలగు అల్లరి చిల్లరి మ్లేచ్ఛ తెగల వారు, ఆటవికుల నుండి వ్యాపారానికి ఆటంకం కలుగకుండా ప్రభుత్వం రక్షించేది.

17.6.1.2 వాణిజ్య మార్గాలు

మౌర్యుల కాలంలో దేశీయ వ్యాపారం బండ్లు, బిడారుల ద్వారా జరిగేది. మౌర్యులు తమ సామ్రాజ్యంలో సుదూర ప్రాంతాలను కలుపుతూ రహదారులను నిర్మించారు. ప్రజల ప్రయాణానికి, వ్యాపార సరుకుల రవాణాకు ఈ రహదారులు ఎంతో అనుకూలంగా ఉండేవి. అంతే కాక, మౌర్యుల పాలనలో శాంతి భద్రతలు, రహదారుల మీద రక్షణ ఏర్పాట్లు పటిష్టంగా ఉండేవి. దానివల్ల సరుకుల రవాణా నిరాటంకంగా జరిగి, వ్యాపారం అభివృద్ధి చెందింది.

మౌర్య సామ్రాజ్యంలో ఈ క్రింది రహదారులు నిర్మించారు. 1. వైశాలి, చంపారన్‌ల మీదుగా పాటలీపుత్రం నుండి నేపాల్ వరకు నిర్మించిన రాజ రహదారి. 2. చంపారన్, కపిలవస్తు, కల్పి, సాంచారల మీదుగా వైశాలి నుండి పెషావర్ వరకు గల రహదారి. 3. పాటలీపుత్రాన్ని వాయవ్య భారతదేశంతో కలిపే రహదారి. 4. పాటలీపుత్రాన్ని సహారంతో కలుపుతూ, అక్కడ నుండి మీర్జాపూర్, మధ్య భారతదేశం వరకు నిర్మించిన రహదార్లు. 5. పాటలీపుత్రాన్ని కళింగతో కలుపుతూ, తూర్పు మధ్యప్రదేశ్ గుండా నిర్మించిన రహదారి. 6. కళింగను ఆంధ్ర, కర్నాటకలతో కలుపుతూ నిర్మించిన రహదార్లు.

వ్యాపారం జల మార్గాల ద్వారా కూడ జరిగేది. కౌటిల్యుడు మూడు రకాల జల మార్గాలను పేర్కొన్నాడు. అవి 1. తీర మార్గాలు (కూల పథ), 2. సముద్ర మధ్య మార్గాలు (విదేశాలకు) (సాంయాన పథ), 3. నదులు.

17.6.2 విదేశీ వాణిజ్యం

మౌర్యుల కాలంలో సముద్రాల ద్వారా, భూ మార్గం ద్వారా వర్తక వాణిజ్యాలు జరిగాయి. ఈ భూ, జల మార్గాలు వర్తక వాణిజ్యాల కొరకు కాక, విదేశాలతో సత్సంబంధాలు ఏర్పడడానికి దోహదపడ్డాయి.

BRAOU

17.6.2.1 సముద్రయాన వాణిజ్యం

మౌర్యుల కాలంలో సముద్ర జలాల మీదుగా విదేశాలతో వ్యాపారం జరిగినట్లు ఆధారాలు ఉన్నాయి. రాజకుమారుడు మహాజనకుడు చంప నుండి సువర్ణ భూమికి, మహేంద్రుడు పాటలీపుత్రం నుండి తామ్రలిప్తికి, అక్కడ నుండి శ్రీలంకకు ప్రయాణం చేసినట్లు నాటి రచనలు పేర్కొన్నాయి. భారతదేశం నుండి వ్యాపారులు 'భారుకచ్చ' (బ్రోచ్) నుండి శ్రీలంకలోని రేవు పట్టణానికి, అక్కడ నుండి సువర్ణ భూమికి సరుకులతో ప్రయాణం చేసినట్లుగా జాతక కథల వల్ల తెలుస్తుంది.

కొత్తగా వచ్చిన నౌకలోని సరుకులను కొనేందుకు వందమంది వ్యాపారులు వచ్చేవారని జాతక కథలు పేర్కొన్నాయి. సముద్రంలో మునిగిపోయిన ఓడల్లో 500 మంది వ్యాపారులు ఉన్నారని, సుప్పారకుడు నావికుడుగా ఉన్న ఓడల్లో 700 నుంది వ్యాపారులు సురక్షితంగా చేరారని జాతక కథలు తెలిపాయి.

17.6.2.2 భూమార్గాలు

భారతదేశాన్ని విదేశాలతో కలుపుతూ అనేక రహదారులు కూడ ఉండేవి. ఈ భూమార్గాల ద్వారా విదేశాలతో సంబంధాలు ఏర్పడటమే కాక, వాటితో వ్యాపార కార్యకలాపాలు జరిపేందుకు కూడ అనుకూలంగా ఉండేది. అని 1. నాయవ్య సరిహద్దు నుండి పాటలీపుత్రం వరకు గల రహదారి (మెగస్తనీస్). 2. ప్రధాన నగరాలైన బాహ్లిక, కాసీసి, పుష్కలావతి, మసకావతి, తక్షశిల, సాకల, హస్తినాపురం, కౌశాంబి, కాశి, పాటలీపుత్రల గుండా వాటిని కలుపుతూ ఉండిన రహదారి. 3. అలెగ్జాండర్ కాలంలో ఆక్సస్ నదిలో నౌకలు ప్రయాణం చేసేందుకు అనుకూలంగా ఉండేది. అందువల్ల భారతదేశం నుండి భూ మార్గాల ద్వారా సరుకుల్ని రవాణా చేసి, ఈ నదీ.మార్గం ద్వారా కాస్పియన్ సముద్రానికి తీసుకొని పోయి, అక్కడనుండి పశ్చిమ దేశాలకు రవాణా చేసేవారు.

17.6.2.3 భారతదేశం - ఈజిప్టు

భారతదేశానికి, ఈజిప్టుకు మధ్య సంబంధాలు ఉండేవని, ఈజిప్టు రాజు రెండవ టాలెమీ భారతదేశానికి డయొనిసియోస్ అనే రాయబారిని పంపాడని ప్లిని రచన వల్ల తెలుస్తుంది. ఆ సంబంధాల ఫలితంగానే, క్రీ.పూ. 271-270 లో అలెగ్జాండ్రియాలో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో భారతదేశం నుండి దిగుమతి చేసుకొన్న స్త్రీలు, వృషభాలు, చలువరాళ్ళను ప్రదర్శించారని ప్లిని కథనం వల్ల స్పష్టమౌతుంది. ఈ ఉత్సవంలో భాగంగా భారతదేశం నుండి దిగుమతి అయిన స్త్రీలు, నేట కుక్కలు, ఆవులు, మసాలా దినుసులు ఉన్నాయని ఏథెనాయియోస్ కూడ పేర్కొన్నాడు.

నాలుగవ టాలెమీ ఫిలోపేటర్ (క్రీ.పూ. 221-204) రాజు తన సొంత ఓడలో భారతదేశం నుండి దిగుమతి చేసుకొన్న చలువరాళ్ళతో ఒక పెద్ద గదిని నిర్మించాడు. మెంఫిస్‌లో దొరికిన ఏడవ టాలెమీ (క్రీ.పూ. 200-180) రాజు కాలం నాటి ప్రతిమల్లో, భారతీయ ప్రతినులు కూడ ఉన్నాయి. అంటే దీనివల్ల క్రీ.పూ. రెండవ శతాబ్దంలో కూడ ఈజిప్టు, భారతదేశం మధ్య వ్యాపార సంబంధాలు కొనసాగాయని తెలుస్తుంది.

BRAOU

17.7 శాతవాహనుల కాలం

శాతవాహనుల కాలంలో దేశీయ వ్యాపారం, విదేశీ వాణిజ్యం గణనీయంగా అభివృద్ధి చెందాయి. ఆ కాలంలో జరిగిన వాణిజ్య కార్యకలాపాలను గురించిన సమాచారం"పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ",(Periplus of the Erithrian Sea), టాలెమీ రచించిన "ఎ గైడ్ టు జాగ్రఫీ" (A guide to the Geography), మొదలగు రచనలు, భారతదేశంలో లభించిన విదేశీ రోమన్ నాణేలు, శాతవాహనులు ముద్రించిన నాణేలు, వారు ఇచ్చిన శాసనాలు మొదలగు ఆధారాల వల్ల తెలుస్తుంది.

17.7. 1 దేశీయ వాణిజ్యం

శాతవాహన రాజ్యంలో తూర్పు, పశ్చిమ ప్రాంతాలు అధిక జనాభాతోను, సౌభాగ్యంతోను తులతూగేవని, కాని లోతట్టు ప్రాంతాల్లో మాత్రం ఎడారులు, పర్వతాలు, పులులు, చిరుతపులులు, ఏనుగులు, విషసర్పాలు, సివంగులు, కోతులు ఉండేవని పెరిప్లస్ పేర్కొంది. దక్కన్ పీఠభూమి పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో, పైఠాన్, తగర, జున్నార్, నాసిక్, వైజయంతి మొదలగు వ్యాపార పట్టణాలు ఉండేవని కూడ పెరిప్లస్ వల్ల తెలుస్తుంది. తూర్పు ప్రాంతంలో కేపూరూర, విజయపుర, కుదురలు వ్యాపారులు నివసించే ప్రదేశాలుగా అమరావతి శాసనాలు పేర్కొన్నాయి.

మధ్య దక్కన్‌లోని కొన్ని ప్రాంతాల్లో అనాగరిక పరిస్థితులు ఉన్నప్పటికీ, శాతవాహన సామ్రాజ్యంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల మధ్య నిరంతరం రాకపోకలు సాగేవి. పటాలు అధ్యయనం చేయడం వల్ల తొలి కాలంలో వ్యాపార మార్గం ఉండేదని, అది తూర్పు తీరం నుండి గోల్కొండ లేక హైదరాబాద్, తెర్, పైఠాన్‌ల మీదుగా బ్రోచ్ వరకు ఉండేది అనడానికి స్పష్టమైన గుర్తులు దొరికాయి అని జె.ఎఫ్.ఫ్లీట్ తెలిపాడు. బిడారులు, నదుల్లో ప్రయాణం చేసే పడవలు ప్రధాన రవాణా సౌకర్యాలుగా ఉండేవి.

దక్కన్‌లో వివిధ ప్రాంతాల మధ్య సంబంధాలు, రాకపోకలు ఉండేవని నాసిక్‌లో దశపుర వాసులు, కార్లేలో వైజయంతి, ధనకటక, సోపార వాసులు, జున్నార్‌లో భారుకచ్ఛ, కళ్యాణ వాసులు, నానాఘాట్‌లో సోపార వాసులు ఇచ్చిన దానాల వల్ల తెలుస్తుంది. నహపానుని అల్లుడైన ఉషభదత్తుడు ప్రయాణీకుల సౌకర్యాల కోసం ప్రత్యేక శ్రద్ధ వహించేవాడు. ప్రయాణీకులతో ఎల్లప్పుడూ రద్దీగా ఉండే ప్రధాన మార్గాల్లో విశ్రాంతిగృహాలు, బావులు, మంచినీటి కోసం చలివేంద్రలు, స్నానాల కోసం ప్రత్యేక స్థలాలు, ఉచితంగా రేవు దాటించడం వంటి సౌకర్యాలను ఉషభదత్తుడు ఏర్పాటు చేశాడు.

17.7.1.1 వ్యాపార పట్టణాలు

శాతవాహన రాజ్యంలో వ్యాపార పట్టణాలు అయిన పైఠాన్, తగర, జున్నార్, కరహాకట, నాసిక్, గోవర్ధన, వైజయంతి పశ్చిమ దక్కన్‌లోను, ధనకటక, కేపురూర, విజయపుర, నారసల, చదక; తూర్పు దక్కన్‌లోను ఉండేవి. పశ్చిమ దక్కన్‌లోని వాటితో పోలిస్తే, తూర్పు దక్కన్‌లోని వ్యాపార పట్టణాలు సంఖ్యలోను, ప్రాముఖ్యతలోను తక్కువ స్థానంలో ఉండేవి. క్రీ.పూ. 2 లేక 3వ శతాబ్దానికే ధనకటక పట్టణం వ్యాపార కేంద్రంగా ఏర్పడింది. కేపురూర, విజయపుర, నారసల పట్టణాలు వ్యాపారులు నివసించే ప్రదేశాలుగా అమరావతిలోని కొన్ని శాసనాలు పేర్కొన్నాయి. లుడర్స్ (సెట్టిపముఖ), చడకలోని వ్యాపారుల శ్రేణికి చెందిన ఒక సభ్యుని పేర్కొంది.

BRAOU

17.7.1.2 వ్యాపారులు

వ్యాపారులకు 'వణిజ' లేక 'నిగమ' అని పేరుండేది. వ్యాపారుల శ్రేణిలో సభ్యునికి 'నిగమ' అని, శ్రేణి అధ్యక్షునికి 'శ్రేష్ఠి' (శెట్టి) అని పేర్లుండేవి. 'సాథవాహ' లేక 'సార్థవాహ' అనగా బిడారు వ్యాపారి. 'వణియుని' (వణిజుని) భార్యను 'వణియానీ' అని, 'సార్థవాహుని' భార్యను 'సాతకవాహినీ' అని పిలిచేవారు. 'గహపతి' లేక 'గవాత' (గృహస్థ) అనేది వ్యాపారుల బిరుదు అని శాసనాల వల్ల తెలుస్తుంది. ఈ బిరుదు సాధారణంగా బ్రాహ్మణులకు బ్రహ్మచర్య (విద్యార్థి) దశ పూర్తైన తర్వాత అన్వయిస్తుంది.

17.7.1.3 నాణేలు - వ్యాపారం

ద్రవ్య వ్యవస్థను బట్టి, అంటే వినియోగంలో ఉన్న లేదా ముద్రించిన నాణేల రకాలు, సంఖ్యను బట్టి శాతవాహనుల తొలి కాలం క్రీ.పూ. 2వ, 3వ శతాబ్దాల్లోను, క్షత్రప పాలన మొదటి కాలం క్రీ.శ. 1వ శతాబ్దంలోను పశ్చిమ దక్కన్‌లో వ్యాపారం, పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందాయని తెలుస్తుంది.

మహారాణి నాయనిక పలు సందర్భాల్లో 14,000 కార్షాపణలు, 40,001 కార్షాపణలు, 14,000 కార్షాపణలు దానంగా ఇచ్చినట్లు నానేఘాట్ శాసనం పేర్కొంది. ఉషవదత్తుడు అధిక మొత్తంలో అంటే, ఒకసారి 70,000 కార్షాపణలు, మరొక సారి 3,000 కార్షాపణలు దానంగా ఇచ్చాడు. ఉషవదత్తుడు ఇచ్చిన ఇతర దానాల వల్ల కూడా ఆ కాలంలో వ్యాపారం విరివిగా జరిగేదని తెలుస్తుంది.

తూర్పు దక్కన్‌లో రాగి నాణేల కంటే, సీసపు నాణేలు అధిక సంఖ్యలో దొరికాయి. కాని అక్కడ వెండి నాణేలు మాత్రం దొరకలేదు. ఆ ప్రాంతంలోరెండవ పులమావి పాలనలో వాణిజ్య, పారిశ్రామిక రంగాలు గణనీయంగా అభివృద్ధి చెందడం ప్రారంభమై, సిరియన (యజ్ఞశ్రీ శాతకర్ణి) కాలానికి పరాకాష్ఠకు చేరాయి. సిరియమని పాలనలో అరేబియా సముద్రం నుండి బంగాళాఖాతం వరకు విస్తరించి ఉండిన శాతవాహన సామ్రాజ్యానికి అవసరమైన నాణేలను అత్యధిక సంఖ్యలో ముద్రించారు. అంతేకాక ఆ కాలంలో పశ్చిమ దక్కన్‌లో కంటే, ఆంధ్ర దేశంలో నాణేలు అధిక సంఖ్యలో ముద్రించారు. ఈ నాణేలన్నీ ముఖ్యంగా వ్యాపారంలో సరుకుల అమ్మకాలు, కొనుగోళ్ళు చేసేందుకు ఉపయోగపడేవి. దాని ఫలితంగా దక్కన్‌లోను, ఆంధ్రదేశంలోను వాణిజ్యం గణనీయంగా పెరిగింది.

17.7.1.4 వ్యాపార శ్రేణులు

శాతవాహనుల కాలంలో వ్యాపార, వాణిజ్య రంగాల్లోని వ్యక్తులు అధిక సంపదను ఆర్జించేవారు. వారిని 'శెఠ్‌లు' అని పిలిచేవారు. వారు ధనికులు అయినందువల్ల విలువైన దానాలు చేసేవారు; చైత్య గృహాలను నిర్మించేవారు. మందులు అమ్మేవారు, ధాన్యం వర్తకులు, నూనె ఉత్పత్తిదారులు మొదలగు వారు వ్యాపార శ్రేణులను ఏర్పాటు చేసుకొనేవారు. శ్రేణులు డబ్బు రూపంలో శాశ్వత డిపాజిట్లను స్వీకరించి, వాటి మీద తరతరాలుగా వడ్డీ ఇచ్చేవి. దేశంలోని నాటి పరిపాలనా వ్యవస్థలో ఆటువంటి శ్రేణుల, గ్రామ సంఘాల స్వపరిపాలన ఒక ముఖ్యమైన భాగంగా ఉండేది.

17.7.1.5 వడ్డీరేటు

ఉషవదత్తుడు చేసిన డిపాజిట్ల మీద వార్షిక వడ్డీరేటు 2,000 కార్షాపణల మీద 100 కార్షాపణలు, 1,000 కార్షాపణల మీద 75 కార్షాపణలుగా ఉండేది. అంటే పాలుసరి వడ్డీరేటు 5 నుండి 71/2 శాతం. దీన్ని బట్టి వార్షిక వడ్డీరేటు

చాలా ఎక్కువగా ఉండేది కాదు. అందువల్ల వ్యాపారానికి అవసరమయ్యే పెట్టుబడి, మూలధనం తక్కువ వడ్డీకే లభించేదని తెలుస్తుంది.

వ్యాపారస్తుడు ఇచ్చే హామీ మీద, అప్పటి ప్రభుత్వ పాలనా సమర్థత మీద వడ్డీరేటు ఆధారపడి ఉంటుంది కాబట్టి, శాతవాహనుల కాలంలో రాజకీయ విషయాలు ఉన్నా, దేశంలో సమర్థవంతమైన ప్రభుత్వ పాలన ఉండేదని తెలుస్తుంది. అటువంటి పాలన విజయవంతమయ్యేందుకు స్థానిక సంస్థలు, సంఘాలు కూడ తమ వంతు పాత్రను నిర్వహించాయి.

17.7.2 విదేశీ వాణిజ్యం

శాతవాహనుల కాలంలో విదేశీ వాణిజ్యం గణనీయంగా అభివృద్ధి చెందింది. పశ్చిమ దేశాల నుండి ఓడలు 'బారిగజ' లేక 'బారుకచ్చ' (బ్రోచ్) రేవు పట్టణానికి వచ్చేవని, వాటిలో తెచ్చిన సరుకులను లోతట్టు ప్రాంతాలకు రవాణా చేసేవారని పెరిప్లస్ పేర్కొంది. ఎగుమతి నిమిత్తం బారిగజ రేవుకు వాగన్ల ద్వారా, రహదారులు సరిగాలేని సుదూర ప్రాంతాల గుండా, పైఠాన్ నుండి అధిక మొత్తంలో విలువైన కురువింద రాళ్ళు, తగర నుండి సాధారణ వస్త్రాలను, తీర ప్రాంతంలో ఉన్న ప్రదేశాల్లో స్థానికంగా లభించే ఇతర సరుకులను తెచ్చేవారని పెరిప్లస్ తెలిపింది. క్రైస్తవ మత గ్రంథాల వల్ల దక్కన్ నుండి బంగారాన్ని పశ్చిమ తీరాన ఉన్న రేవుపట్టణాల ద్వారా, మధ్యధరా ప్రాంత దేశాలకు ఎగుమతి చేసేవారని తెలుస్తుంది.

రోమన్లు ఆభరణాలను, విలాస వస్తువులను ముఖ్యంగా దక్కన్, శ్రీలంకలోని రేవుపట్టణాల ద్వారా దిగుమతి చేసుకొనేవారు. మొదట్లో ఈజిప్షియన్లు, అరబ్బులు దళారీలుగా వ్యవహరించి, అన్ని రకాల నాజూకైన మెత్తని వస్త్రాలు, వస్తువులను రోమన్ వర్తకులకు, పంపిణీదారులకు సరఫరా చేసేవారు. అరబ్బులు బారిగజ రేవుపట్టణానికి తమ నౌకలను పంపి వ్యాపారం చేసేవారని పెరిప్లస్ పేర్కొంది. రోమన్లకు ఆభరణాలు, పట్టు, సుగంధాల మీద ఉండే సరదా తీర్చుకొనేందుకు వాటిని ఎంత ఎక్కువ ధర పెట్టి అయినా కొనేవారు. ఆక్టేవియస్ (ఆగస్టస్) క్రీ.పూ. 30లో ఈజిప్టును జయించిన తర్వాత రోమన్లు భారతదేశంలో పశ్చిమ తీరాన ఉన్న రేవుపట్టణాల ద్వారా, నేరుగా వ్యాపారం చేయడం ప్రారంభించారు. ఐరోపావాసులు క్రీ.శ. 45లో రుతుపవనాలు కనుగొన్న తర్వాత రోమన్ ప్రపంచానికి, ప్రాక్ ప్రపంచానికి మధ్య సముద్రయానం ద్వారా జరిగే వాణిజ్యం శీఘ్రగతిన అభివృద్ధి చెందడం ప్రారంభమైంది.

17.7.2.1 దిగుమతులు - ఎగుమతులు

శాతవాహన రాజులు రెండవ పులమావి పాలనలో సౌకర్యవంతమైన వాణిజ్య కార్యకలాపాలు గణనీయంగా పెరిగి, యజ్ఞశ్రీ పాలనలో అవి పరాకాష్ఠకు చేరాయి. దాని ఫలితంగా భారతదేశానికి వచ్చే దిగుమతులు వివిధ రకాల సరుకులు అధిక సంఖ్యలోను, అధిక మొత్తంలోను ఉండేవి. భారతదేశంలోని రేవుపట్టణాల నుండి వివిధ రకాల సరుకులను అధిక మొత్తంలో విదేశాలకు ఎగుమతి చేసేవారు.

భారతదేశంలోని రేవుపట్టణాల ద్వారా జరిగే దిగుమతులు, ఎగుమతులను పెరిప్లస్ గ్రంథకర్త సవివరంగా పేర్కొన్నాడు. దిగుమతుల్లో ముఖ్యమైనవి మద్యం, రాగి, తగరం, సీసం, పగడాలు, గోమేధికం, సన్నని వస్త్రాలు, తక్కువ వాణ్యత గల అన్ని రకాల వస్త్రాలు, ప్రకాశవంతమైన రంగులు గల ఒడ్డాణాలు, వెలిగారం, తీపి లవంగాలు, మెరుగుపెట్టే రాళ్ళు, గాజు, సింధూరం, పాదరసం, బంగారం, వెండి నాణేలు. ఇంకా రాజుల కోసం విలువైన వెండిపాత్రలు, పాటగాళ్ళు, అంతఃపురానికి అందమైన స్త్రీలు, వాణ్యమైన మద్యాలు, సన్నని వస్త్రాలు, లేపనాలు కూడా దిగుమతి అయ్యేవి.

EMRO U

భారతదేశం నుండి విదేశాలకు పంపే ఎగుమతుల్లో ముఖ్యమైనవి జటామాంసి, కోస్టస్ (Costus), గుగ్గిలం, దంతం, కెంపు మణులు, కురువింద రత్నాలు, లైసియం (Lycium), అన్ని రకాల నూలు వస్త్రాలు, పట్టు వస్త్రాలు, మెత్తని వస్త్రాలు, నూలుదారం, పిప్పళ్ళు, ఇతర సరుకులు ఉండేవి.

17.7.2.2 రేవుపట్టణాలు

శాతవాహనుల కాలంలో భారతదేశంలోని పశ్చిమ తీరాన ఉన్న ముఖ్యమైన రేవు పట్టణాలను పెరిప్లస్ పేర్కొంది. అవి 1. బారిగజ లేక భారుకచ్ఛ (బ్రోచ్), 2. సోపార (బేసిన్ దగ్గర నేటి సూపార లేక సూపరెమ్), 3. కల్యాన (కళ్యాణ), 4. సెముల్ల (చెంబూర్ లేదా చాల్), 5. మండగొర (మందాడ్), 6. పలైపట్మై (మహాడ్ సమీపంలోని పాల్), 7. మెలిజైగర (జయగడ్), 8. బైజంటియాన్ లేక వైజయంతి (ఉత్తర కెనరాలోని విజయదర్గ్), 9. హిప్పోకుర (కొలాబ సమీపంలోని గోరెగాం) మొదలైనవి.

తూర్పు తీరాన కంటకొస్సిల (శాసనాలు పేర్కొన్న కంటకసెల), కొద్దూర (కృష్ణా జిల్లాలోని గూడూరు), అల్లోసిగ్నె, అపెటెరియన్, మోటుపల్లి రేవు పట్టణాలను టాలెమీ పేర్కొన్నాడు.

శాతవాహన సామ్రాజ్యంలో తూర్పుతీరాన, పశ్చిమ తీరానపైన పేర్కొన్న రేవు పట్టణాల ద్వారా నిరంతరం వ్యాపారం జరిగేది. కాని పశ్చిమ తీర రేవు పట్టణాలతో పోల్చిస్తే, తూర్పు తీరాన ఉన్న రేవుపట్టణాలు సంఖ్యలోను, ప్రాముఖ్యతలోను తక్కువగా ఉండేవి.

17.7.2.3 భారతదేశం - పశ్చిమ దేశాలు

శాతవాహనుల కాలంలో భారతదేశానికి, పశ్చిమ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు ఉండేవి. భారతీయ సరుకుల అమ్మకాల వల్ల ఐరోపానుండి దక్కన్‌కు నాణేల రూపంలో అత్యధిక మొత్తంలో ద్రవ్యం వచ్చేది.

17.7.2.4 భారతదేశం - గ్రీస్

రెండవ టాలెమీ యూర్గెటస్ పాలనలో (క్రీ.పూ. 146 - 117) గ్రీక్ దేశీయుడైన యూడోక్సస్ భారతదేశానికి నౌకాయానం చేశాడని, అది వ్యాపార సంబంధమైంది అని స్ట్రాబో రచన వల్ల తెలుస్తుంది. యూడోక్సస్ భారతదేశం చేరిన తర్వాత అతడు తెచ్చిన సరుకులు ఇచ్చి, వాటికి బదులుగా సుగంధ ద్రవ్యాలు, రత్నాలతో తిరిగి స్వదేశం పోతే, వాటిని రాజు తీసుకొన్నాడు.

రెండవ సోటర్ పాలనలో (క్రీ.పూ. 117-80) యూడోక్సస్ మరల రెండోసారి భారతదేశానికి నౌకాయానం చేశాడు. కాడిజ్ వద్దతన నౌకలో వైద్యులను, గాయకురాండ్రను, నేర్పరులైన చేతిపనివారిని, సరుకులను ఎక్కించుకొని భారతదేశం ప్రయాణం అయ్యాడు. కాని దురదృష్టవశాత్తు దారిలోనే అతని ఓడ సముద్ర జలాల్లో మునిగిపోయింది.

గ్రీక్ దేశీయులకు భారతదేశంతో నౌకా వాణిజ్యం చేయాలనే ఆసక్తి ఉండేదని క్రీ.పూ. 151-110 మధ్య కాలంనాటి శాసనాల వల్ల తెలుస్తుంది. ఆ శాసనాలు గ్రీక్ దేశానికి, ఎర్ర సముద్రం, హిందూ మహాసముద్రంల మధ్య సంబంధ వ్యవహారాలు చూసే పర్యవేక్షణాధికారులను పేర్కొన్నాయి.

17.7.2.5 భారతదేశం - రోమ్

శాతవాహనుల కాలంలో భారతదేశం, రోమ్ మధ్య వాణిజ్య సంబంధాలు ఉండేవి. వాయవ్యాన దర్ధాల్, నాగ్దార నుండి దక్కన్ పీఠభూమి, ఆగ్నేయ సరిహద్దుల్లోని వినుకొండ, నెల్లూరు, కడప వరకు గల విశాలమైన ప్రాంతంలో అనేక ప్రదేశాల్లో దొరికిన రోమ్ నాణేల వల్ల ఆగస్టస్ కాలం (క్రీ.పూ. 30) నుండి దక్కన్‌కు రోమ్ సామ్రాజ్యంతో సన్నిహిత వ్యాపార సంబంధాలు ఉండేవని, వాటి ఫలితంగా శాతవాహన, శక రాజ్యాలు అపారమైన సంపదతో తులతూగేవని స్పష్టమౌతుంది.

BRAOU

సుదూర ప్రాంతాలైన భారతదేశం, రోమ్‌ల మధ్య నౌకాయానం ఎంతో శ్రమతో కూడినదైనా, వాటి మధ్య వాణిజ్యం కాలక్రమేణా అభివృద్ధి చెందిందని ప్లినీ పేర్కొన్నాడు. భారతదేశం, చైనా, అరేబియా దేశాలనుండి దిగుమతి చేసుకొనే పట్టు మొదలగు విలాస వస్తువుల కోసం, రోమ్ పదికోట్ల సెస్టర్సెస్ నాణేలను చెల్లించవలసి వచ్చేది. ఈ వ్యాపారం మొత్తంలో సగానికి పైగా భారతదేశంతోనే జరిగేది. భారతీయ వస్తువులకు రోమ్‌లో వాటి మూలధరకు వందరెట్లకు పైగా ధర పలికేది. ఈ లాభాల వల్ల భారతదేశం రోమ్‌కు సన్నిహితం అయిందని ప్లినీ అభిప్రాయ పడ్డాడు.

రోమ్‌కు భారతదేశం నుండి ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు, రత్నాలు, మందులు విరివిగా దిగుమతి అయ్యేవి. దిగుమతుల్లో కొన్ని కళాఖండాలు కూడా ఉండేవి. పాంపై వద్ద జరిపిన త్రవ్వకాల్లో భారతదేశంలో దంతంతో తయారైన క్రీ.శ. 1వ శతాబ్దం నాటి యక్షిణి విగ్రహం దొరికింది.

భారతదేశానికి రోమ్‌తో గల వ్యాపారానికి ప్రధాన సాక్ష్యం మనదేశంలో అధిక మొత్తాల్లో దొరికిన రోమ్ నాణేలే. బారిగజ వద్ద బంగారం, వెండి నాణేల లాభదాయక మారకం జరిగేదని, భారతదేశంలోకి అధికమొత్తాల్లో నాణేలు దిగుమతి చేసుకొనేవారని పెరిప్లస్ పేర్కొంది.

తూర్పు తీరంలో జరిపిన త్రవ్వకాల్లో రోమ్‌తో వ్యాపారం జరిపే కేంద్రం ఒకటి బయటపడింది. అది పాండిచ్చేరి సమీపంలోని అరికమేడు రేవుపట్టణం. నాసిక్ వద్ద జరిపిన త్రవ్వకాల్లో సమియా వస్తుసామాగ్రి దొరికింది. అందువల్ల భారతదేశానికి రోమ్‌తో క్రీ.శ. 50-200 మధ్య వ్యాపార సంబంధాలు ఉండేవని తెలుస్తుంది.

17.7.2.6 భారతదేశం - పార్థియా

సింధునదీ మైదాన ప్రాంతంలో క్రీ.శ. 1వ శతాబ్దంలో పహ్లవ రాజ్యం ఉండేదని పెరిప్లస్ గ్రంథకర్త తెలిపాడు. భారతదేశానికి, పహ్లవుల అధీనంలోని మెసొపొటేమీయాకు మధ్య వాణిజ్య సంబంధాలు ఉండేవని, రాగి, చందనపు చెక్క, టేకు, విరుగుడు మ్రానుు, నల్లచేవ మ్రానులతో ఓడలు భారతదేశంలోని బారిగజ (బ్రోచ్) నుండి యూఫ్రేట్స్ ముఖద్వారంలో ఉన్న అపోలోగోస్ నౌకాశ్రయానికి వచ్చేవని పెరిప్లస్ వల్ల తెలుస్తుంది.

17.7.2.7 భారతదేశం - మలయా

భారతదేశంలోని తూర్పు తీరం, 'బంగారు క్రీస్' (Golden Chryse) అని పిలువబడే మలయా ద్వీపకల్పం, ద్వీపసమూహాల మధ్య వాణిజ్యం జరిగేదని టాలెమీ పేర్కొన్నాడు. ఆ ప్రాంతంలో శాతవాహనుల కాలంలోని భారతీయులు పలసలు స్థాపించారు. అరకాన్ రాజధాని త్రిలింగ్, సయాం సింధు శాఖలోని కాకుల, అన్నాంలోని అమరావతి పేర్లు అంధ్రదేశంలోని పట్టణాల పేర్లు చూసే పెట్టి ఉండాలి.

17.8 కుషాణుల కాలం

కుషాణుల కాలంలో వాణిజ్య వ్యాపారాలు గణనీయంగా అభివృద్ధి చెందాయి. ప్రభుత్వం, వాణిజ్య, వ్యాపార రంగాలను నియంత్రించేది. వాటి అభివృద్ధిలో పాలకుల ప్రోత్సాహం అధికంగా ఉండేది. కుషాణుల కాలంలోని, వర్తక వాణిజ్యాల గూర్చి ముఖ్యంగా మనకు ప్లినీ రచన, 'పెరిప్లస్ ఆఫ్ ఎంత్రియన్ సీ' (Periplus of Erithrian Sea) భారతదేశంలో దొరికిన రోమ్ నాణేలు, కుషాణుల నాణేల వల్ల తెలుస్తుంది. విదేశీ వాణిజ్యం మూలంగా వీరి పాలనలో భారతదేశ సంపద గణనీయంగా పెరిగి, ప్రజల జీవన పరిస్థితులు మెరుగయ్యాయి.

BRAOU

17.8.1 దేశీయ వాణిజ్యం

భారతదేశంలో కుషాణుల కాలంలో దేశీయ వాణిజ్యం అభివృద్ధి చెందింది. దక్కన్ కనుములగుండా దక్షిణ ప్రాంతాలతో వ్యాపారం జరుగుతున్నందు వల్ల, బిడారు వర్తకుల వ్యాపారం చిరకాలం కొనసాగింది. వారు ఉప్పు, కొబ్బరికాయల్ని దక్కన్‌కు తీసుకొనిపోయి, అక్కడ వాటిని వస్త్రాలు, లోహంతో తయారు చేసిన పాత్రలు, ధాన్యం మొదలగు సరుకులతో మార్పిడి చేసుకొనేవారు. నెండి నాణేలు కాలక్రమేణా అదృశ్యం కావడాన్ని బట్టి, ఉత్తరాది వ్యాపారం క్రమంగా కులీనులు వాడే, అధిక ధరలకు లభించే పట్టు, కేసరి, ఆభరణాలు, మద్యం మొదలగు వస్తువులతో కూడినదని తెలుస్తుంది.

17.8.1.1 వ్యాపారులు

కుషాణుల కాలంలో రెండు రకాల వ్యాపారులు ఉండేవారు. మొదటి రకం వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకొని, ఒక ప్రదేశంలోనే ఉండేవారు. వారికి 'వణిక్'లు అని పేరుండేది. దుకాణదారులు ఉత్పత్తుల క్రయవిక్రయాలను చేస్తూ, జీవనం సాగించేవారు. రెండవ రకం వారు వ్యాపారం నిమిత్తం ఒక ప్రదేశంలోనే ఉండక, సుదూర ప్రాంతాలకు వెళ్ళేవారు. వారు బిడారులతో వెళ్ళేవారు కాబట్టి, వారికి 'సార్థవాహులు' అని పేరుండేది. సార్థవాహుల నాయకుని 'సార్థవాహ జేఠకుడు' లేక ప్రముఖుడు అని పిలిచేవారు.

ఒక వణిక్ భార్య అయిన పుశికానాగప్రియ దానం ఇచ్చిన సందర్భంలో, ఒక శాసనం వణిక్ పదాన్ని పేర్కొంది. అశ్వఘోషుడు మాత్రం దుకాణదారుల్ని, బిడారు వ్యాపారుల్ని కూడ వణిక్‌లు అని పేర్కొన్నాడు. అశ్వఘోషుడు తన గ్రంథం 'బుద్ధచరిత్ర'లో ఒక బిడారు నుండి తప్పిపోయి వేరైన వ్యాపారస్తుని బాధలను వర్ణించాడు. దోపిడీదొంగల పాల్పడిన బిడారు వ్యాపారులను గురించి 'లలితవిస్తార' పేర్కొంది.

17.8.1.2 వ్యాపార వస్తువులు

కుషాణుల కాలం దేశీయ వాణిజ్యంలో ముత్యాలు, చందనం, సుగంధాలు, మూలలు, నగలు, పిండి, ధాన్యం, బార్లీ, ఉప్పుడు బియ్యం (ఓదనిక), రొట్టెలు (పూనిక), చేపలు (మచ్చిక), మాంసం, బెల్లపు నీరు, తేనె, చక్కెర, మిఠాయిలు, మసాలా దినుసులు, పంటచెరకు, నూనె, ఆహారధాన్యాలు, పప్పుదినుసులు మొదలైనవి ముఖ్యమైన సరుకులుగా ఉండేవి.

17.8.1.3 వ్యాపార నియమాలు

కుషాణుల కాలం నాటి ఆధారాలు వ్యాపార నియమాలను పేర్కొన్నాయి. లావాదేవీలు జరిపే సమయంలో ఆరోపంతు బయానా సొమ్ము డిపాజిట్ చేయాల్సి ఉండేదని, తర్వాత కొనుగోలుదారుడు ఆ బేరానికి సంబంధించిన సరుకుల మీద తన ముద్ర వేసేవాడు (స్వముద్రా లక్షితం క్రిత్వా) అని 'దివ్యవదాన' వల్ల తెలుస్తుంది.

ఒక వ్యాపారస్తుని గుత్తాధిపత్యానికి అవకాశం ఇవ్వకుండా ఉండేందుకు, టోకు బేరాలను ప్రోత్సహించేవారు కాదని, ఈ పద్ధతికి వ్యతిరేకంగా వ్యవహరించే సభ్యులను కనిపెట్టి, వాణిజ్య శ్రేణి వారి మీద చర్యలు తీసుకొనేదని, సరియైన నోటీసు తనకు గాని, తన సోదరునికి గాని పంపలేదనే కారణం చూపిన సభ్యుడు వర్తక సంఘం నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నట్లుగా పరిగణించేవారని 'దివ్యవదాన' తెలిపింది.

BRAOU

వాణిజ్య వ్యవహారాల్లో పైన పేర్కొన్న నియమం ముఖ్యంగా కొనుగోలు సమయంలో సరుకుల ధరలు పడిపోయేందుకు, తర్వాత ఆ సరుకులను క్రమంగా నిలువచేసి అత్యధిక ధరలకు అమ్మకం చేసి, అన్యాయంగా లాభాలు ఆర్జించే పద్ధతికి వ్యతిరేకంగా ఉద్దేశించింది.

17.8.1.4 వాణిజ్య మార్గాలు

కుషాణ రాజులు వాణిజ్యానికి గల ప్రాముఖ్యతను గుర్తించి, వాణిజ్య మార్గాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించారు. ప్రధానమైన పట్టణాలను, ప్రదేశాలను కలుపుతూ రహదారులను నిర్మించడం వల్ల కుషాణుల కాలంలో దేశీయ వాణిజ్య పురోగతికి ఈ భూమార్గాలు ఎంతగానో దోహదపడ్డాయి. అంతేకాక విశాలమైన కుషాణ సామ్రాజ్యంలో మహానదులైన సింధు, గంగ, యమున నదులేగాక చిన్న, చిన్న నదులు, వాగులు కూడ వ్యాపార జలమార్గాలుగా ఉపయోగించేవారు.

17.8.1.5 వాణిజ్య నియంత్రణ

కుషాణుల కాలంలో వ్యాపార, వాణిజ్య రంగాలను క్రమబద్ధీకరించడం, నియంత్రించడం ప్రభుత్వ బాధ్యతగా పరిగణించేవారు. న్యాపారుల మీద, సరుకుల మీద పన్నులు వేసేముందు ప్రభుత్వ కొనుగోలు ధరలు, అమ్మకం ధరలు, రహదారి మార్గాల దూరం, ఆహార వ్యయం, గురుకుల రక్షణకు అయ్యే వ్యయం మొదలగు వాటిని పరిగణనలోకి తీసుకొనేవారు.

సరుకుల రవాణాకు, వ్యాపారం అభివృద్ధికి రహదారులు చాలా అవసరం. అందువల్ల రహదారుల రక్షణకోసం కొన్ని నియమాలు ఉండేవి. రాజమార్గాన్ని అపరిశుభ్రం చేసేవారికి 2 కార్షాపణలు, వంతెనలు ధ్వంసం చేసేవారికి 500 పణలు జరిమానా వేసేవారు. వ్యాపారంలో లాభాలు, బజారు ధరలు మీద ప్రభుత్వ నియంత్రణకు సంబంధించి ఖాతాదారులను లేదా ధరల విషయంలోను మోసం చేసేవారికి శిక్షలను విధించేవారు. సరుకులను కల్తీ చేసి అమ్మేవారిని శిక్షించేవారు.

17.8.1.6 వాణిజ్య వర్గాలు

కుషాణుల కాలంలో వర్తక వాణిజ్య రంగాలు నాటి పాలకుల ప్రోత్సాహంతో గణనీయంగా అభివృద్ధి చెందాయి. దాని ఫలితంగా వ్యాపారమే ప్రధాన వృత్తిగా గల వైశ్యులు అధిక లాభాలను ఆర్జించి, కాలక్రమేణా ధనవంతులయ్యారు. దేశీయ వాణిజ్యం అభివృద్ధి చెందడం వల్ల వణిక్‌లు, వడ్డీవ్యాపారులు (శ్రేష్ఠులు), బిడారు వ్యాపారులు (సార్థవాహులు), కుషాణులు నిదేశీ వాణిజ్యం ప్రోత్సహించడం వల్ల సముద్రయానం చేసే నిదేశాలతో వ్యాపారం చేసేవారు (సార్థవాహ మహా సముద్రావతీర్ణ) ధనిక వ్యాపార వర్గాలుగా ఏర్పడ్డారు.

17.8.2 విదేశీ వాణిజ్యం

సముద్రయానం ద్వారా వ్యాపారం చేసే వర్తకులకు 'సార్థవాహ మహాసముద్రావతీర్ణ' అని పేరుండేది. ఓడల మీద సరుకులను తీసుకొని మహాసముద్రాలను దాటి వాణిజ్యం చేసే వ్యాపారులను 'మహావస్తు' పేర్కొంది. సరుకులను నౌక నుండి పడవల్లోకి మార్చి ఎక్కించడాన్ని కూడ మహావస్తు వర్ణించింది. ఓడల మీద సముద్రాలు దాటే సమయంలో పడే బాధలు, నౌకలు సముద్ర తరంగాల నుండి, తుఫాను గాలుల నుండి ఎదుర్కొనే విపత్కర పరిస్థితులను అశ్వఘోషుడు తన రచనలు 'సౌందరానందం', 'బుద్ధచరిత్ర'ల్లో వర్ణించాడు.

BRAOU

సముద్రయానం ద్వారా వ్యాపారం చేసి తిరిగి క్షేమంగా స్వస్థలం రావడం వర్తకుని జీవితంలో సంతోషదాయకమైన సంఘటనగా పరిగణించేవారు. సముద్రం మీద ప్రయాణంలో నావికుడు తన నేర్పరితనంతో ఓడకు ప్రమాదం జరుగకుండా రక్షించేవాడు. ఓడ బయలుదేరే ముందు నౌకాశ్రయానికి, ప్రభుత్వానికి చెల్లించాల్సిన సుంకాలను చెల్లించేవారు.

భారతీయ సముద్రయాన వ్యాపారం తీరప్రాంతాలైన బెంగాల్ (వంగ), కోరమాండల్ తీరం (కోలోపట్టణ) మధ్య, సోపీర (సోపీర), సూరత్ (సురట్ట) మధ్య జరిగేది. అంతేకాక వ్యాపార నౌకలు పశ్చిమాన అలెగ్జాండ్రియా (అలసంద), టక్కోల, తూర్పున చైనా (చినం), జావా, సుమత్ర (సువర్ణభూమి) లకు కూడా నిదేశయానం చేసేని.

17.8.2.1 వాణిజ్య మార్గాలు

పెరిప్లస్ ఆధారంగా, బేగ్రాం, తక్షశిల వద్ద జరిపిన త్రవ్వకాల్లో లభించిన గ్రీకులు, రోమనుల కాలం నాటి సాక్ష్యాధారాల వల్ల తూర్పుదేశాలతో వాణిజ్యానికి కేంద్రం అయిన అలెగ్జాండ్రియాను మధ్య ఆసియా, చైనాలతో కలిపే ప్రధాన వాణిజ్య మార్గాలు కుషాణ సామ్రాజ్యంలోని వాయవ్య భారతదేశం గుండా పోయేవని తెలుస్తుంది. ఈ భూమార్గాల ద్వారానే కాక పశ్చిమ, తూర్పు దేశాలతో సముద్రయాన మార్గాల ద్వారా కూడా నిదేశీ వాణిజ్యం జరిగేది.

17.8.2.2 భారతదేశం - పశ్చిమ దేశాలు

భారతదేశం, పశ్చిమ దేశాల మధ్య కుషాణుల కాలంలో ఉన్న వర్తక, వాణిజ్యాల సంబంధాలను గురించిన సమాచారం స్లిని రచన, పెరిప్లస్ గ్రంధం, భారతదేశంలో దొరికిన రోమ్ నాణేలు మొదలగు ఆధారాల వల్ల తెలుస్తుంది. ముఖ్యంగా కుషాణుల కాలంలో భారతదేశానికి రోమ్ సామ్రాజ్యంతో గల నిదేశీ వాణిజ్యం ఫలితంగా, భారతదేశం నుండి ఎగుమతి అయ్యే సరుకులకు రోమ్ మార్కెట్లో అత్యధిక లాభాలు లభిస్తున్నందు వల్ల, భారతదేశ సంపద గణనీయంగా పెరిగి ప్రజల జీవన పరిస్థితులు బాగా మెరుగయ్యాయని నాటి ఆధారాల వల్ల స్పష్టమౌతుంది. లంతేకాక కుషాణ చక్రవర్తులు కూడా నిదేశీ వాణిజ్యాన్ని ప్రోత్సహించేవారని కూడ తెలుస్తుంది.

17.8.2.3 భారతదేశం - రోమ్

భారతదేశంలో ఖనిజ వనరులు సమృద్ధిగా ఉన్నందువల్ల నిదేశీ మార్కెట్లు ముఖ్యంగా పశ్చిమ దేశాల్లోని మార్కెట్లు భారతదేశం వశం అయ్యాయి. భారతదేశం విలువైన రాళ్ళకు తల్లి అని, అత్యంత విలువైన రత్నాలు ఆ దేశంలో ఉత్పత్తి అయ్యేనని స్లిని చెల్లడించాడు. "భారతదేశం రోమ్ సామ్రాజ్యం నుండి పదికోట్ల సెస్టార్సెస్ (నాణేలు) పొందని సంవత్సరం లేదు. మన సుఖాల కోసం, మన స్త్రీల కోసం అంత డబ్బు ఖర్చు పెట్టేస్తున్నాం" లని స్లిని పేర్కొన్నాడు.

మార్క్ ఆంటోని కాలం నుండి, జస్టీనియన్ కాలం వరకు, అంటే క్రీ.పూ. 30 నుండి క్రీ.శ. 550 వరకు భారతదేశం, రోమ్‌ల మధ్య సంబంధాలకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. దక్షిణ భారతదేశంలో దొరికిన రోమ్ నాణేలను అధ్యయనం చేసి, దాని ఆధారంగా భారతదేశం, రోమ్‌ల మధ్య వ్యాపార సంబంధాలు అగస్టస్ కాలంలో అత్యున్నత దశకు చేరాయని, అవి నెరో కాలం క్రీ.శ. 65 వరకు కొనసాగాయని సెనెక్ అభిప్రాయ పడ్డాడు. ఆ కాలంలోనే భారతదేశం విలాస వస్తువులను రోమ్‌కు సరఫరా చేసిందని, వాటికి రోమ్ అధికమొత్తంలో డబ్బు చెల్లించాల్సి వచ్చిందని తెలుస్తుంది.

BRAOU

16.8.2.4 భారతదేశం - మధ్య ఆసియా

విదేశీయులు భారతదేశానికి రావడం వల్ల మధ్య ఆసియా, భారతదేశాల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. వాణిజ్య కార్యకలాపాలు పారంభమయ్యాయి. భూమార్గాల ద్వారా సరుకుల రవాణా జరిగేది. మధ్య ఆసియాలోని అటవీ, పర్వతశ్రేణుల్లో లభించే బంగారం భారతదేశం చేరింది. రోమ్ సామ్రాజ్యంతో గల వ్యాపార సంబంధాల వల్ల కూడ భారతదేశానికి బంగారం లభించింది.

17.6.2.5 భారతదేశం - ఆగ్నేయ ఆసియా

కుషాణుల కాలంలో భారతదేశం, ఆగ్నేయ ఆసియా దేశాల మధ్య వాణిజ్యం అభివృద్ధి చెందింది. ఆగ్నేయ ఆసియా దేశాల్లో సుగంధ ద్రవ్యాలు విరివిగా లభించేవి. సుగంధ ద్రవ్యాలకు రోమ్‌లో ఎక్కువ గిరాకీ ఉండేది. అందువల్ల భారతీయ వ్యాపారులు ఆ సరుకులు లభించే మలయా, జావా, సుమత్రా, బోర్నియోలకు ఓడల మీద వెళ్ళి, అక్కడి మార్కెట్లలో సుగంధ ద్రవ్యాలను కొనుగోలు చేసి, వాటిని సముద్రయాన మార్గాల ద్వారా రవాణా చేసి, రోమ్ మార్కెట్లో అత్యధిక ధరలకు విక్రయించి అధిక లాభాలు గడించేవారు.

17.8.2.6 భారతదేశం - పట్టు మార్గం

పట్టు మార్గం (Silk Route) కుషాణుల అధీనంలో ఉండేది. ఆ మార్గం చైనాలో ప్రారంభమై, మధ్య ఆసియా, ఆఫ్ఘనిస్తాన్‌లోని కుషాణ సామ్రాజ్యం గుండా తూర్పు మధ్యధరా సముద్ర ప్రాంతమైన రోమ్ సామ్రాజ్యంలో భాగమైన ఇరాన్ (పర్షియా), పశ్చిమ ఆసియా వరకు ఉండేది. ఈ మార్గం వల్ల కుషాణులకు అధికంగా ఆదాయం వచ్చేది. వ్యాపారుల మీద విధించే సుంకాల ద్వారా వచ్చే ఆదాయంతో, భోగభాగ్యాలతో తులతూగే విశాల సామ్రాజ్యాన్ని కుషాణులు స్థాపించారు.

17.9 గుప్తుల కాలం

మౌర్యుల కాలం నుండి దేశీయ విదేశీ వాణిజ్య రంగాలు భారతదేశంలోని అధిక ప్రాంతాల్లో త్వరితగతిన అభివృద్ధి చెందాయి. భారతీయ ప్రజల జీవనం, సంస్కృతి మీద వాణిజ్య రంగ ప్రభావం చెప్పుకోతగినంతగా ఉండేది. ఎందువల్లంటే, ఆ కాలం నుండి భారతదేశంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఒక ప్రాంతంలోని ఉత్పత్తుల మీద రెండవ ప్రాంతం కొంతవరకు ఆధారపడవలసి వచ్చేది. అంతేకాక ఆ కాలం నుండి భారతదేశం తూర్పు, పశ్చిమ దేశాలతో భూమార్గాలు, సముద్రయాన మార్గాల ద్వారా నిజయవంతంగా వ్యాపారం కొనసాగించింది.

గుప్తుల కాలంలో భారతదేశానికి ఈజిప్ట్, గ్రీక్, రోమ్, పర్షియా, అరేబియా, సిరియా, శ్రీలంక దేశాలతోను, తూర్పున కాంబోడియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా, చైనా దేశాలతోను వ్యాపార సంబంధాలు ఉండేవి. దాని ఫలితంగా అంతర్జాతీయ వాణిజ్యానికి భారతదేశం ముఖ్య కేంద్రంగా ఉండేది.

17.9.1 దేశీయ వాణిజ్యం

గుప్తుల కాలంలో కొన్ని గ్రామాల అవసరాలు తీర్చేందుకు ఒక మార్కెట్ ఉండేది. ఆ మార్కెట్లో స్థానిక ప్రజల నిత్యోపయోగం కోసం గ్రామీణుల ఉత్పత్తుల్లో కొంత భాగం అమ్మేవారు లేదా వస్తుమార్పిడి చేసుకొనేవారు. కాని మిగులు ఉత్పత్తుల్లో అధిక భాగం పట్టణాల్లోని వ్యాపారులకు అమ్మేవారు. అక్కడ నుండి ఆ వస్తువులను దేశంలోని ఇతర ప్రాంతాలకు రవాణా చేసేవారు, లేదా విదేశాలకు ఎగుమతి చేసేవారు. ఈ వ్యాపార యంత్రాంగమే దిగుమతి చేసుకొన్న సరుకులను పంపిణీ చేసేది.

BRAOU

వ్యాపార కార్యకలాపాల వల్ల కొన్ని ప్రదేశాలు ప్రాముఖ్యత పొందాయి. వ్యాపార కేంద్రాల చుట్టూ పట్టణాలు అభివృద్ధి చెందాయి. ఒక పట్టణంలోని మార్కెట్లో ప్రధాన మార్గానికి రెండు వైపులా ఉండే పెద్ద దుకాణాల్ని గురించి కాళిదాసు వర్ణించాడు. ఇతర దుకాణాలతో బాటు, మద్యం దుకాణాలు కూడ ఉండేవి.

17.9.1.1 వాణిజ్య మార్గాలు

గుప్తుల కాలంలో దేశంలో రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందాయి. ప్రజల ప్రయాణాలకు, సరుకుల రవాణాకు అనుకూలంగా ఉండే రహదారులను ప్రధాన నగరాలు, ముఖ్య ప్రదేశాలను కలుపుతూ నిర్మించారు. రహదారుల మీద ప్రయాణీకులకు, వ్యాపారులకు రక్షణ కల్పించారు. దేశీయ వాణిజ్యంలో సరుకుల రవాణాకు భూ మార్గాలే కాక, జల మార్గాలను కూడ ఉపయోగించేవారు. నదులు, కాలువల మీద సరుకులను పడవల్లో రవాణా చేసేవారు. వంగ (బెంగాల్) ప్రజలు పడవలను నడపడంలో నిపుణులని కాళిదాసు రచనల వల్ల తెలుస్తుంది.

17.9.1.2 వ్యాపార వస్తువులు

దేశీయ వాణిజ్యంలో పాలు, వెన్న, జున్ను, తేనె, లక్క, మిరియాలు, మద్యంలో వాడే పరిమళ ద్రవ్యాలు, మాంసం, ఉప్పుడు బియ్యం, నువ్వులు, సోమరసం, పూలు, పండ్లు, విలువైన రాళ్ళు, స్త్రీ పురుష బానిసలు, విషం, ఆయుధాలు, ఉప్పు, రొట్టెలు, మొక్కలు, వస్త్రాలు, పట్టు, చర్మాలు, ఎముకలు, దుప్పట్లు, జంతువులు, మట్టి పాత్రలు, నుజ్జిగ, కూరగాయలు, అల్లం, మూలికలు, నూలుదారం, లోహంతో తయారు చేసిన వస్తువులు ముఖ్యమైన సరుకులుగా ఉండేవి.

సుదూర ప్రాంత వ్యాపారంలో విలాస వస్తువులు ప్రధానంగా ఉండేవి. అని మిరియాలు, చందనం, పగడాలు, కస్తూరి, కేసరి, హిమాలయా ప్రాంతంలో లభించే యాక్ జంతువు తోక, కళింగ, అంగ, అస్సాంల నుండి ఏనుగులు, వాయవ్య భారతదేశం నుండి గుర్రాలు, దక్షిణ బీహార్‌లో లభించే బంగారం, రాగి, ఇనుము, అభ్రకం, కర్ణాటకలోని కోలార్ నుండి బంగారం, సముద్ర తీరప్రాంతంలోను, పంజాబ్, హిమాచల ప్రదేశ్‌ల్లోని గనుల నుండి లభించే ఉప్పు మొదలైనవి. కొరత, కరువు సంభవించిన సమయాల్లో ఆహార ధాన్యాలు సమృద్ధిగా లభించే ప్రాంతాల నుండి వాటిని కొరత ఉన్న ప్రాంతాలకు రవాణా చేసి అమ్మేవారు.

17.9.1.3 వ్యాపారులు

వాణిజ్య రంగంలో బడా వ్యాపారులు, చిన్న వ్యాపారులు ఉండేవారు. చిన్న వ్యాపారులు స్థానిక ప్రజల అవసరాలను తీర్చేవారు. కాని బడా వ్యాపారులు ఉత్పత్తి కేంద్రాల నుండి అధిక మొత్తాల్లో సరుకులను సేకరించి, సుదూర ప్రాంతాలకు రవాణా చేసి, వాటిని అధిక ధరలకు అమ్మేవారు. దేశంలో సరుకుల రవాణాకోసం ఎద్దుబండ్లు, జంతువులు, కూలీలను ఉపయోగించేవారు.

గుప్తుల కాలంలో రెండు రకాల వ్యాపారులు ఉండేవారు. వారు 1. 'శ్రేష్ఠి' లేక వ్యాపారి, 2. సార్థవాహుడు లేక బిడారు వ్యాపారి. శ్రేష్ఠి సరుకులతో వ్యాపారం చేయడమే కాక, వడ్డీ వ్యాపారం కూడ చేసేవాడు. శ్రేష్ఠికి గల సంపద, పలుకుబడి ఫలితంగా అతడు నగరంలోని వాణిజ్య వర్గానికి నాయకుడు (నగర శ్రేష్ఠి) అయ్యేవాడు. నగర పరిపాలనలో కూడ అతనికి ప్రముఖ స్థానం ఉండేది. బిడారు వ్యాపారులు సుదూర ప్రాంతాలకు సరుకులు రవాణా చేసి అమ్మేవారు. నగర జీవనంలో సార్థవాహుడు ఒక ముఖ్య వ్యక్తిగా ఉండేవాడని, సార్థవాహుల ప్రతినిధి నగర సభ (అధికరణ) లో సభ్యుడుగా ఉండేవాడని దామోదర్‌పూర్ తామ్ర శాసనం వల్ల తెలుస్తుంది.

BRAOU

17.9.2 విదేశీ వాణిజ్యం

భారతదేశంలో దేశీయ వాణిజ్యం భూ మార్గాల గుండా, నదుల మీద నిర్వహించినట్లే, విదేశీ వాణిజ్యం భూ మార్గాలు, సముద్రయాన మార్గాల ద్వారా చేసేవారు. గుప్త రాజులు విదేశీ వాణిజ్యాన్ని ప్రోత్సహించేవారు. దాని ఫలితంగా ఆ కాలంలో సముద్రయాన వ్యాపారం గణనీయంగా అభివృద్ధి పొంది, దేశసంపద త్వరితగతిన పెరిగిందని నాటి రచనల వల్ల తెలుస్తుంది.

17.9.2.1 సముద్రయానం

సముద్రయానంలో దోపిడీ దొంగలు, శిలజాలు, తుఫానులు, ఓడల అధ్వాన్న స్థితి వల్ల ప్రమాదాలు జరిగేవి. నౌక ధ్వంసం కావడం వల్ల, హస్తినాపుర నివాసి అయిన ఒక బడా వ్యాపారి చనిపోవడం గురించి 'అభిజ్ఞాన శాకుంతలం' పేర్కొంది. సముద్రయాన వ్యాపారం వల్ల కలిగే లాభాలు, నష్టాలు, నౌకల్లో సరుకుల రవాణా, సముద్రంమీద ప్రయాణం చేసే వ్యాపారుల, నావికుల బాగోగులు గురించి 'బృహత్సంహిత' వివరంగా వర్ణించింది. సముద్రయానంలోను, సముద్ర మార్గాల ద్వారా చేసే వ్యాపారంలోను అనేక కష్టాలు ఉండేవని ఫాహియాన్ పేర్కొన్నాడు.

సముద్రమార్గాలే కాక విదేశాలకు పోయే భూ మార్గాలు కూడ బిడారు వ్యాపారులకు సురక్షితంగా ఉండేవి కావు. ఎందువల్లంటే చైనాను భారతదేశంతో కలిపే మధ్య ఆసియా మార్గం అనేక అపాయాలతో, కష్టాలతో కూడుకొన్నదని ఫాహియాన్ రచన వల్ల తెలుస్తుంది.

17.9.2.2 రేవు పట్టణాలు

భారతదేశంలో ప్రధాన రేవుపట్టణాలు సింధు (సింద్), ఒర్రత (గుజరాత్), కల్లియాన (కళ్యాణ), సిబర్ (చాల్), మాలె (మలబార్), మంగ్‌లౌర్ (మంగుళూరు), నలోపటన (నెల్సిండ), పండోపటన (కాలికట్ మంగుళూరు మధ్య, టాలెమీ పేర్కొన్న పొడౌరౌర), అని కాస్మాస్ రచన వల్ల తెలుస్తుంది. తూర్పున తామ్రలిప్తి (పశ్చిమ బెంగాల్‌లోని తామ్లుక్) పెద్ద వాణిజ్యకేంద్రం అని ఫాహియాన్ పేర్కొన్నాడు. ఈ రేవు పట్టణాల ద్వారా శ్రీలంక, పర్షియా, అరేబియా, ఇథియోపియా, బైజాంటిన్ సామ్రాజ్యం, చైనా, హిందు మహాసముద్రంలోని దీవులతో వ్యాపారం చేసేవారు.

17.9.3 భారతదేశం - శ్రీలంక

భారతదేశం, శ్రీలంకల మధ్య ప్రాచీన కాలం నుండి వాణిజ్య సంబంధాలు ఉండేవి. కాని గుప్తుల కాలంలో ఆ సంబంధాలు అత్యంత సన్నిహితంగా అభివృద్ధి చెందాయి. వ్యాపార కేంద్రంగా శ్రీలంక ప్రాముఖ్యత గురించి కాస్మాస్ వర్ణించాడు. భారతీయులు శ్రీలంకను 'సిల్‌అడిబ' (సింహళ ద్వీపం) అని పిలిచేవారని కాస్మాస్ తెలిపాడు. మాలె (మలబార్) నుండి మిరియాలు, లవంగాలు, చందనపు చెక్క, కల్లియాన (కళ్యాణ) నుండి వస్త్రాలు, రాగి, నువ్వులు, సింధు (సింద్) నుండి కస్తూరి, ఆముదం మాను, జటామాంసి, భారతీయ మర్కెట్ల నుండి ఏనుగులు, గుర్రాలు, మొదలగువాటిని శ్రీలంక దిగుమతి చేసుకొనేది.

BRAOU

శ్రీలంక చేసే ఎగుమతులను గురించి మనకు తెలిసిన సమాచారం చాలా తక్కువ. మంచి ముత్యాలకు శ్రీలంక కేంద్రమని వరాహమిహిరుడు పేర్కొన్నాడు. శ్రీలంక తీర సముద్రం నుండి స్వచ్ఛం, ప్రకాశవంతమైన ముత్యాలు సేకరించేవారని ఫాహియాన్ తెలిపాడు. ఈ ముత్యాలను శ్రీలంక నుండి భారతదేశంలోని తామ్రలిప్తి తదితర మార్కెట్లకు ఎగుమతి చేసేవారు. భారతదేశంలో వెండి గనులు లేనందువల్ల, శ్రీలంకలోని వెండిగనుల నుండి తీసిన వెండిని కూడా భారతదేశానికి ఎగుమతి చేసేవారు.

17.9.2.4 భారతదేశం - చైనా

భారతదేశానికి చైనాతో వాణిజ్య సంబంధాలు ప్రవర్ధమానంగా ఉండేవి. రెండు దేశాల మధ్య వ్యాపారం గుప్తుల కాలంలో గణనీయంగా అభివృద్ధి చెందింది. భారతదేశం నుండి సరుకులను చైనాకు ఎగుమతి చేసి, ఆ దేశం నుండి పట్టు, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకొనేవారు. భూమి, నీరు నుండి ఉత్పత్తి అయ్యే అన్ని విలువైన వస్తువులు భారతదేశం నుండి దిగుమతి అయ్యేవని చైనా దేశపు చారిత్రక గ్రంథం"సుంగ్‌చు" పేర్కొంది. ఖడ్గమృగం కొమ్ములు, లకుముకి పిట్ట రాళ్ళ నుండి తయారు చేసిన రత్నాలు, సర్పముత్యాలు (పేము), రాతినార వస్త్రాలు వంటి వివిధ రకాల అపురూపమైన వస్తువులు భారతదేశం నుండి చైనాకు ఎగుమతి అయ్యేవి. వజ్రాలు, చందనపు చెక్క, కేసరిలను భారతదేశం చైనాకు, ఇతర దేశాలకు ఎగుమతి చేసేదని టాంగ్ చారిత్రక గ్రంథాలు తెలిపాయి.

భారతదేశం చైనా నుండి చేసుకునే దిగుమతుల్లో పట్టు తప్పించి, మిగిలిన సరుకుల గురించి మనకు తెలిసిన సమాచారం చాలా తక్కువ. ప్రాచీన ప్రపంచంలో చైనా దేశపు పట్టుకు మిక్కిలి ప్రజాదరణ ఉన్నందువల్ల కాస్మాస్ చైనాను 'పట్టు భూమి' అని వర్ణించాడు. చైనా పట్టుకు భారతదేశంలోని మార్కెట్లలో ఎక్కువ గిరాకీ ఉండేది. చైనా పట్టు (చినాంశుక)'భారతదేశంలోని ధనిక వర్గాల ప్రజలు వాడే అత్యంత ఫ్యాషన్‌గల వస్త్రం' అని కాళిదాసు వర్ణించాడు.

17.9.2.5 భారతదేశం - పశ్చిమ దేశాలు

క్రీ.శ. తొలి శతాబ్దాల్లో భారతదేశానికి పశ్చిమ దేశాలతో వాణిజ్యం ఉచ్ఛ దిశలో వర్ధిల్లుతూ ఉండేది. ఎందువల్లంటే, రోమ్ సామ్రాజ్యంలో తూర్పు దేశాల్లో ఉత్పత్తి అయిన విలాస వస్తువులకు అధిక మొత్తాల్లో గిరాకీ ఉండేది. కాని రోమ్ సామ్రాజ్యం పతనం అయిన తర్వాత పశ్చిమ దేశాలతో భారతదేశానికి గల వాణిజ్యం కాలక్రమేణా క్షీణించింది. ఆ తర్వాత బైజాంటిన్ చక్రవర్తుల పాలనలో అది మరల పుంజుకొంది.

రోమ్‌లో క్రీ.శ. 5వ శతాబ్దంలో భారతదేశం నుండి దిగుమతి అయిన మిరియాలు, పట్టు లభించేవి. భారతీయ సుగంధ ద్రవ్యాలు, జాజికాయ, దుంప, లవంగాలు, కాన్‌స్టాంటినోపిల్‌లో సులభంగా దొరికేవి. భారతదేశంలో క్రీ.శ. 4వ, 5వ, 6వ శతాబ్దాలకు చెందిన బైజాంటిన్ నాణేలు దొరకడం వల్ల, ఆ కాలంలో భారతదేశానికి, బైజాంటిన్ సామ్రాజ్యానికి మధ్య వాణిజ్య సంబంధాలు ఉండేవని తెలుస్తుంది.

పశ్చిమ దేశాలు, ఇతర దేశాల నుండి భారతదేశం దిగుమతి చేసుకొన్న సరుకుల పట్టికలు జస్టినియన్ తన న్యాయశాస్త్ర గ్రంథంలో పొందుపరిచాడు. ఆ సరుకుల్లో ముఖ్యమైనవి ఇనుము, పరిమళ ద్రవ్యాలు, ముత్యాలు, వజ్రాలు, ఇంద్రనీల మణులు, వైఢూర్యాలు, పచ్చలు, మత్తుపదార్థాలు, ముడి పట్టు, పట్టు వస్త్రాలు, పట్టు దారం, కొబ్బరి, చిరుతపులులు, సెర్వ పులులు, దాల్చిన చెక్క, పిప్పళ్ళు, మిరియాలు, అల్లం, ఏలకులు, దంతం మొదలైనవి.

BRAOU

17.9.2.6 భారతదేశం - ఇథియోపియా

భారతదేశానికి ఇథియోపియాతో సముద్రాయాన వాణిజ్య సంబంధాలు నిరంతరంగా ఉండేవని కాస్మాస్ రచనల వల్ల తెలుస్తుంది. ఎగువ ఈజిప్టులోని గనుల్లో పచ్చరాళ్ళు అడులే రేవు పట్టణం నుండి భారతదేశానికి ఎగుమతి అయ్యేవి. ఇథియోపియా దేశంలోని ఏనుగులకు పెద్ద దంతాలు ఉండేవని, వాటిని భారతదేశానికి, ఇతర దేశాలకు సముద్రయానం ద్వారా ఎగుమతి చేసేవారని కూడ కాస్మాస్ పేర్కొన్నాడు. ఆఫ్రికా ఏనుగు దంతాలు పెద్ద సైజుని అయినందువల్ల, వాటిని ఉపయోగించి భారతదేశంలోని దంతం పనివారు పెద్దసైజుగల వస్తువులను తయారుచేస్తున్నందు వల్ల, వాటికి భారతదేశంలో బాగా గిరాకీ ఉండేది. ఇథియోపియాలోని బార్బేరియా నుండి సుగంధ ద్రవ్యాలు, సాంబ్రాణి, కసింద, మూలికలు, ఇతర సరుకులు కూడా భారతదేశానికి ఎగుమతి చేసేవారు.

17.9.2.7 భారతదేశం - ఆగ్నేయ ఆసియా

భారతదేశానికి ఇండోచైనా, కాంబోడియా, చంప, బర్మా, సయాం, మలయా, సుమత్ర, జావా, బాలి, బోర్నియోలతో రాజకీయ, సాంస్కృతిక సంబంధాలే గాక, సముద్రయాన వాణిజ్య సంబంధాలు కూడా ఉండేవి. భారతదేశం వజ్రాలు, చందనం చెక్క, కేసరిలను కాంబోడియా, ఇతర దేశాలకు ఎగుమతి చేసేదని టాంగ్ చరిత్ర గ్రంథాలవల్ల తెలుస్తుంది.

ఆగ్నేయ ఆసియా దేశాల ప్రజల జీవనం, సంస్కృతుల మీద భారతదేశంతో ఉన్న వాణిజ్య సంబంధాల ప్రభావం ఎక్కువగా ఉండేది. వ్యాపార మార్గాల ద్వారా భారతీయ సంస్కృతి ఆగ్నేయ ఆసియా అంతా వ్యాపించింది. అంతేకాక మలయా, థాయ్‌లాండ్, కాంబోడియా, ఇండోచైనా, జావా, సుమత్రా, బాలి, బోర్నియా, ఇండోనేషియాల్లో భారతీయులు వలసలను స్థాపించారు.

17.10 గుప్తుల అనంతర కాలం

గుప్తుల తర్వాత కాలంలో భారతదేశం సింధు (సింద్), కల్లియాన (కళ్యాణ్), సిబర్ (చాల్), పర్తి (భత్కల్), మంగ్‌రౌత్ (మంగుళూరు) మొదలగు రేవుపట్టణాల ద్వారా విదేశాలతో వాణిజ్యం చేసేదని కాస్మాస్ రచన వల్ల తెలుస్తుంది. ఈ రేవుపట్టణాలకు చైనా నుండి పట్టు, మలయా నుండి కలబంద, గంధపు చెక్క, ఆఫ్రికా నుండి దంతం, పచ్చలు దిగుమతి అయ్యేవి. కల్లియాన (కళ్యాణ్) నుండి కంచు, నువ్వులు, వివధ రకాల వస్త్రాలు, మెరెల్లో లేక కోరమాండల్ నుండి గుళ్లలు, గవ్వలు ఎగుమతి చేసేవారు. శ్రీలంక మీదుగా తూర్పు దేశాలకు భారతదేశం నుండి సరుకులు ఎగుమతి అయ్యేవి.

భారతదేశం క్రీ.శ. 8వ శతాబ్దంలో వాణిజ్య కార్యకలాపాలను గురించిన సమాచారాన్ని 'కువలయమాల' వివరంగా తెలిపింది. చైనా, సోపారల మధ్య, తక్షశిల, సుమత్రల మధ్య నిరంతరం వ్యాపారం జరిగేది. సోపార మిక్కిలి పెద్ద రేవుపట్టణం. అక్కడ నిరంతరం వ్యాపారులావాదేవీలతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు క్షణం తీరికలేకుండా ఉండేవారు. ఆ నగరంలో వాణియనేళ అనే క్లబ్బు (Club) ఉండేది. దానిలో వివిధ దేశాల నుండి వచ్చిన వ్యాపారులకు విందులు, వినోదాలు ఏర్పాటు చేసేవారు. వారందరు వివిధ దేశాల్ని గురించి, వాణిజ్య సరుకులను గురించిన సమాచారాన్ని తెలుసుకొనేవారు. కోసలలో గుర్రాలను ఏనుగులకు బదులుగా

BRAOU

అమ్మేవారు. ఉత్తరాపథంలో వక్కలకు అధికంగా గిరాకీ ఉండేది. తూర్పు దేశాల్లో ముత్యాలు ఇచ్చి, వాటికి బదులుగా ఏంజామరలు కొనేవారు.

కాని గుప్తుల తర్వాత క్రీ.శ. 6వ శతాబ్దం నుండి వాణిజ్యం క్రమంగా క్షీణించింది. రోమ్ సామ్రాజ్యంలోని పశ్చిమ ప్రాంతంతో గల వ్యాపారం క్రీ.శ. 3వ శతాబ్దంలోనే అంతరించిపోయింది. ఇరాన్ (పర్షియా)తోను, బైజాంటియంతోను గల పట్టు వ్యాపారం క్రీ.శ. 6వ శతాబ్దం మధ్యలోనే ఆగిపోయింది.

భారతదేశానికి చైనాతోను, ఆగ్నేయ ఆసియా దేశాలతోను గల వాణిజ్యం కొంతవరకూ కొనసాగింది. కాని దానివల్ల వచ్చే లాభాలను మధ్యవర్తులుగా ఉండిన అరబ్బులు పొందేవారు. మహమ్మదీయ యుగానికి పూర్వం భారతదేశానికి గల ఎగుమతి వ్యాపారం మొత్తం అరబ్బుల గుత్తాధిపత్యంలో ఉండేది.

క్రీ.శ. 6వ శతాబ్దం తర్వాత 300 సంవత్సరాలు వాణిజ్యం క్షీణించింది అనే దానికి భారతదేశంలో బంగారు నాణేలు లేక పోవడమే నిదర్శనం. క్రీ.శ. 6వ శతాబ్దం తర్వాత బంగారు నాణేల కొరత ఉత్తర, దక్షిణ భారతదేశాలు రెండింటిలోను ఉండేది.

17.11 పరిశ్రమలు

ప్రాచీన భారతదేశంలో పరిశ్రమలు హరప్పా కాలం నుండే గణనీయంగా అభివృద్ధి చెందాయని చెప్పవచ్చు. కాలక్రమేణా అనేక రకాల పరిశ్రమలు స్థాపించబడి, వివిధ రాజవంశాల కాలంలో అభివృద్ధి చెందాయి. అంచెలంచెలుగా పారిశ్రామిక సంబంధ సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం అభివృద్ధి చెందింది. ప్రాచీన కాలంలో ఇనుము, ఉక్కు, వస్త్రాలు, మూసె, దంతం, చర్మ, లోహ, కలప, ఆభరణాలు, భవన నిర్మాణానికి సంబంధించిన పరిశ్రమలు అభివృద్ధి చెంది, ప్రజల జీవన పరిస్థితి మెరుగుదలకు తోడ్పడ్డాయి. నాటి సమాజంలో ముఖ్యంగా గుప్తుల కాలం నాటికి పారిశ్రామిక చేతిపని వారలు గౌరవభావాన్ని పొందబడుటంతో, వారి అభివృద్ధి మరింత శ్రీఘ్రతరమైంది.

17.12 హరప్పా కాలం

హరప్పా నాగరికతా కాలంలో వివిధ రకాల పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ముద్రలు, పూసలు, తాయెత్తులు, రాతి శిల్పాలు, లోహ ప్రతిమలు, మట్టి బొమ్మలు, మట్టి పాత్రలు తయారుచేసే పరిశ్రమలు ఉండేవి. మట్టి పాత్రలను చక్రం ఉపయోగించి తయారు చేసేవారు. వీటి మీద రంగులు కూడ వేసేవారు. మట్టితో మనుషులు, జంతువుల బొమ్మలు తయారు చేసేవారు. ఆటబొమ్మలు, అమ్మతల్లి మొదలగు దేవతా విగ్రహాలను కూడ తయారు చేసేవారు.

ఇటుకల పరిశ్రమ భారీ పరిశ్రమగా అభివృద్ధి చెందింది. ఎండబెట్టిన ఇటుకలు, కాల్చిన ఇటుకలను తయారు చేసేవారు. వాటి పరిమాణం పెద్దదిగా ఉండేది. సింధు ప్రాంతంలో జరిపిన త్రవ్వకాల్లో, ఇటుకలతో నిర్మించిన విశాలమైన భవనాలు బయల్పడ్డాయి. ఆ కాలంలో వస్త్ర పరిశ్రమ కూడా ఉండేది. బట్టలు నేసేవారు. ప్రపంచంలో మొట్టమొదటగా ప్రత్తి పండించినవారు సింధు ప్రాంత ప్రజలు. సింధు ప్రాంతంలో జరిపిన త్రవ్వకాల్లో నేతనేసిన గుడ్డ ముక్కలు దొరికాయి.

BRAOU

సింధు నాగరికత కంచు యుగానికి చెందింది. రాగి, తగరం లోహాల మిశ్రమంతో కంచు తయారు చేసేవారు. రాజస్తాన్ లోని ఖేత్రి గనుల నుండి రాగి లభించేది. బీహార్‌లోని హజారిబాగ్ ప్రాంతం నుండి తగరం లభించేది. ఆఫ్ఘనిస్తాన్ నుండి కూడ తగరం దిగుమతి చేసుకొనేవారు. కంచుతో పనిముట్లు, ఆయుధాలు, విగ్రహాలు తయారు చేసేవారు. గొడ్డళ్ళు, రంపాలు, కత్తులు, బల్లెం మొదలైనవి కంచుతో తయారు చేసేవారు.

సింధు నాగరికత కాలంలో ఆభరణాల తయారీ పరిశ్రమ కూడ ఉండేది. బంగారం, నెండి లోను, మణులు, రత్నాలు, వజ్రాలు మొదలగు విలువైన రాళ్ళతోను ఆభరణాలు తయారు చేసేవారు. బంగారం వెండిని ఆఫ్ఘనిస్తాన్ నుండి దిగుమతి చేసుకొనేవారు. దక్షిణ భారతదేశంలో విలువైన రాళ్ళు లభించేవి. ఆ కాలంలో ఓడల తయారీ పరిశ్రమ కూడ ఉండేది. విదేశాలతో చేసే వ్యాపారానికి సరుకులను నౌకల్లో తీసుకొని పోయేవారు. ఆ కాలం నాటి ముద్రల మీద ఓడల బొమ్మలు చిత్రించి ఉన్నాయి.

17.13 వేద కాలం

వేద కాలంలో ప్రజలకు ఉపయోగకరమైన అనేక పరిశ్రమలు వచ్చాయి. ఆ కాలంలో కలపతో వస్తువులు తయారుచేసే వడ్రంగికి అత్యంత ప్రాముఖ్యత ఉండేది. ఎందువల్లంటే అతడు యుద్ధానికి, పోటీలకు అవసరమైన రథాలు, వ్యవసాయానికి అవసరమైన బండ్లు తయారు చేసేవాడు. లోహంతో వస్తువులను తయారు చేసే కార్మికులకు కూడ చాలా ప్రాముఖ్యత ఉండేది. వారు ఇళ్ళలో నిత్యం ఉపయోగించే వంటపాత్రలు, నీళ్ళు మరిగించే పాత్రలు ముఖ్యంగా లోహంతోనే తయారు చేసేవారు.

వేద కాలంనాటి ప్రజలు బంగారంతో తయారు చేసిన ఆభరణాలు వాడేవారు కాబట్టి, స్వర్ణకారులకు కూడా ఆ కాలంలో ప్రాముఖ్యత ఉండేదని తెలుస్తుంది. చర్మకారులు చర్మంతో వివిధ రకాల వస్తువులను తయారు చేసేవారు. స్త్రీలు కుట్టడం, చాపలు అల్లడం, వస్త్రాలు నేయడం మొదలైన పనులు చేసేవారు.

పైన పేర్కొన్న విషయాల్ని బట్టి, వేద కాలంలో కలప, లోహం, ఆభరణాలు, చర్మం, వస్త్రాలు మొదలగు వాటికి సంబంధించిన పరిశ్రమలు ఉండేవని తెలుస్తుంది. అంతేకాక ఆ కాలంలో సమాజంలో కార్మికులకు ఉన్నత స్థానం ఉండేదని, తర్వాత కాలంలో లాగా వారిని గౌరవహీనంగా చూసేవారు కాదని, వాటి ఆధారాల వల్ల తెలుస్తుంది.

17. 13.1 కుండలు - జాడీలు

ఋగ్వేదం కలశ, కుంభలను పేర్కొంది. అవి మట్టి లేదా లోహంతో తయారుచేసిన జాడీలు, కుండలు. కలపతో చేసినవాటినుండి బంగారంతో చేసిన పాత్రల వరకు వివిధ రకాలు, విలువలుగల వస్తుసామాగ్రిని, నాటి సమాజంలో వివిధ తరగతులకు చెందిన ప్రజలు ఉపయోగించిన కుండలు, జాడీలు, పాత్రలను ఋగ్వేదం పేర్కొంది. యజుర్వేదం బంగారంతో తయారు చేసిన మూత లేక కవరును పేర్కొంది. బంగారం ఖనిజం కనుక్కోవడం, దాన్ని శుద్ధి చేయడం, తర్వాత దాన్ని కరిగించి, నాణ్యమైన జాడీలను తయారుచేయడానికి అవసరమైన పలురకాల పరిశ్రమలు వేద కాలంలో ఉండేవి.

17.13.2 పాత్రలు

హోమం నిర్వహించే సమయంలో అనేక రకాల పాత్రలను యజుర్వేదం పేర్కొంది. అవి గరిటె (స్రుక్), పెద్ద గరిటె (స్రువ), చెంచా లేక స్పూను (చమస), పయవ్య, ద్రోణకలశం, గ్రవన, అధిస్థావన్, పుతభృత్, అధవనీయ

మొదలైనని. ఇతర సందర్భాల్లో కూడ శత, వయవ్య,కుంభి, ద్రోణకలశం, అంబ్రిన, స్థలి మొదలగు పాత్రలను యజుర్వేదం పేర్కొంది.

వేదాలు పేర్కొన్న కర్మార, రథకర్మార, మొదలైన పేర్లను బట్టి, ఆ గ్రంథాలు పరిశ్రమలను అలక్ష్యం చేయలేదని తెలుస్తుంది. ఇతర విషయాలను గురించి తెలిపేటప్పుడు పరిశ్రమలను గురించి కూడ వేద గ్రంథాలు పేర్కొన్నాయి. భారతదేశంలో పరిశ్రమల ఆవిర్భావానికి ఆర్యులు కూడ కారకులని భావింపవచ్చు.

17.13.3 వస్త్ర పరిశ్రమ

నాణ్యమైన తెల్లని వస్త్రాలను ధరించడం, తల్లులు తమ కుమారులకోసం వస్త్రాలు నేయడం, యుద్ధ సమయాల్లో వీరులు వాడే కోటును తయారు చేయడం, ఉన్నితో అందమైన వస్త్రాలను నేయడం, నేసిన వస్త్రాలతో స్త్రీలు తమ శరీరాన్ని కప్పుకోవడం మొదలగు వర్ణనలు అనేకం రుగ్వేదంలో ఉన్నాయి. ఉన్నిలాంటి మెత్తని వస్త్రాన్ని యజుర్వేదం పేర్కొంది. పెళ్ళికుమార్తె మృదువుగాను, నాజూకుగాను ఉండి ఆహ్లాదం కలిగించే వస్త్రాన్ని ధరించినట్లు అథర్వణ వేదం వర్ణించింది. ఈ విషయాల్ని బట్టి, వేద కాలంలో నూలు, ఉన్ని పరిశ్రమలు ఉండేవని, నాణ్యమైన వస్త్రాలను తయారుచేసేవారని స్పష్టమౌతుంది.

17.14 మౌర్యుల కాలం

మౌర్యుల కాలంలో కొత్తగా ప్రారంభించవలసిన, అధిక పెట్టుబడులు అవసరమైన అనేక పరిశ్రమల మీద ప్రభుత్వానికి గుత్తాధిపత్యం ఉండేది. ఆ పరిశ్రమలు 1. బంగారం, వెండి, వజ్రాలు, రత్నాలు, విలువైన రాళ్ళు, రాగి, సీసం, తగరం, ఇనుము, శిలాజిత్తు లభించే గనులు, 2. ఖనిజాలు, 3. ప్రత్తి, 4. నూనె, 5. చక్కెర, 6. పాడి పరిశ్రమ, 7. మద్యం, 8. ఆయుధాలు, 9. నౌకా నిర్మాణం, 10. నాణేలు. కాని దేశంలోని పరిశ్రమలన్నీ ప్రభుత్వం అధీనంలోనే ఉండేవి కావు. వాటిలో చాలా వరకు పరిశ్రమలు ప్రైవేట్ యాజమాన్యంలో కూడా ఉండేవి.

ప్రభుత్వం యాజమాన్యంలో నూలు వడికే కేంద్రం ఉండేది. అది నూలు వడికి, వస్త్రాలు నేసే కర్మాగారం. దానిలో ప్రత్తి, పట్టు, జనుము నుండి దారాలు, వస్త్రాలు, త్రాళ్ళు, దుప్పట్లు, కర్టెన్లు తయారు చేసేవారు.

కారాగారాల్లో కూడ కర్మాగారాలు ఉండేవి. వాటిలో ఖైదీలు పని చేసేవారు. ప్రభుత్వ నూలు వడికే కేంద్రం మగవారితోపాటు, అసహాయులైన స్త్రీలను కూడా పనివారిగా నియమించేది. సాధారణంగా ప్రభుత్వ కర్మాకారాల్లో కార్మికులను కాంట్రాక్టు పద్ధతి మీద నియమించేవారు. కార్మికులకు జీతాలు ఇవ్వకుండా ఆసేయడం శిక్షార్హంగా పరిగణించేవారు.

ప్రభుత్వం యాజమాన్యంలోని వ్యవసాయ భూములు అడవులు, గనుల నుండి లభించిన ఉత్పత్తులు ఉపయోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వమే కర్మాగారాలను నడిపేది. ఉత్పత్తులను ప్రభుత్వ గిడ్డంగుల్లో (కోష్ఠాగార) నిలువ చేసేవారు. ఆ కాలంలో సరుకులు, ఉత్పత్తులను నిలువ చేసేందుకు గిడ్డంగుల అవసరం చాలా ఉండేది. ఎందువల్లంటే ప్రజలు ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులు మొదలగు వాటిని ధన రూపంలో కాక, వస్తు రూపంలో చెల్లించేవారు. గిడ్డంగుల ఏర్పాటు ఫలితంగానే, కాలక్రమేణా కర్మాగారాలు స్థాపింపబడ్డాయి.

మౌర్యుల కాలంలోని ముఖ్యమైన 18 రకాల చేతివృత్తుల వారిని 'జాతక కథలు' పేర్కొన్నాయి. వారు వడ్రంగులు, లోహకారులు, చర్మకారులు, రంగులు వేసేవారు, రాతి పనివారు, దంతపు పనివారు, నేత పనివారు, మిఠాయిలు

మొదలగు తినుబండారాలను తయారుచేసేవారు, నిలువైన లోహాలతో వస్తువులు తయారుచేసేవారు, ఆభరణాలు తయారుచేసే పనివారు, కుమ్మరులు, విల్లు, బాణాలు తయారుచేసేవారు మొదలైన వారు చేసే చేతిపనులు ముఖ్యంగా ఉండేవి.

కొన్ని పరిశ్రమలు ఒకే ప్రాంతంలోగాని, ఒకే ప్రదేశంలో గాని ఉండేవి. ఒక గ్రామంలో పూర్తిగా కమ్మరులు ఉండేవారు. మరొక గ్రామంలో పూర్తిగా ఇనుప పనివారు ఉండేవారు. ఇంకొక గ్రామంలో పూర్తిగా గీత పనివారు నివసించేవారు. అందువల్ల ఆయా గ్రామాలు ఒక ప్రత్యేక వృత్తి పనివారికి చెందినవిగా ప్రసిద్ధి చెందాయి. అలాగే పట్టణాల్లో వివిధ వృత్తుల పనివారు నివాసం ఉన్న వీధులకు దంతపు పనివారి వీధి, అద్దకం పనివారి వీధి, నేతపనివారి నివాస ప్రాంతం అని పేర్లు ఉండేవి.

ఉప్పు తయారీపై ప్రభుత్వానికి గుత్తాధిపత్యం ఉండేది. ముందుగా ప్రభుత్వం నుండి పొందిన అనుమతితో మాత్రమే ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు ఉప్పు తయారు చేసే వీలుండేది. లైసెన్సు లేకుండా ఉప్పు తయారుచేసిన వారిని, ఉప్పు కల్తీ చేసిన వారిని అత్యధిక జరిమానాతో శిక్షించేవారు. రాజ్యంలోని కర్మాగారాల్లో తయారైన ఉప్పుకు తోడు, ఇతర రాజ్యాల నుండి కూడ ఉప్పు దిగుమతి చేసుకొనేవారు. ఉప్పు ఉత్పత్తిలో ప్రభుత్వానికి నిర్ణీత భాగం ఉండేది. దిగుమతి చేసుకొన్న ఉప్పులో ఆరో భాగం రాజుకు చెందేది.

17.15 శాతవాహనుల కాలం

శాతవాహనుల కాలంలో దేశ ప్రజల ఆర్థిక జీవనంలో వ్యవసాయం తర్వాత పరిశ్రమలు, వాణిజ్యాలకు రెండో స్థానం ఉండేది. శాతవాహన రాజుల శాసనాల ద్వారా, ఆ కాలంలో చేనేత, కమ్మరి, కుమ్మరి, చర్మకార, వడ్రంగి, స్వర్ణకార, తదితర వృత్తులవారు ఉండేవారని తెలుస్తుంది. దేశంలో నలుమూలలా లోహ సంపదను త్రవ్వి, ఉపయోగంలోకి తెచ్చే కర్మాగారాలు ఉండేవి. శాతవాహనుల కాలంలో ఇనుము, ఉక్కు, వస్త్రాలు, నూనె, దంతం, మట్టికి సంబంధించిన పరిశ్రమలు అభివృద్ధి చెందాయి.

17.15.1 పారిశ్రామిక వృత్తులు

శాతవాహనుల కాలం నాటి శాసనాలు వివిధ తరగతులకు చెందిన వృత్తి పనివారిని పేర్కొన్నాయి. వారు 'ధమ్మికులు' (ధాన్యం వర్తకులు), 'మాలాకారులు' (పూల వ్యాపారులు), 'కొలికులు' (నేతపనివారు), 'తిలాపిషకులు' (నూనెగానుగ పనివారు), 'ఒదయాంత్రికులు' (జలయంత్రాలు తయారు చేసేవారు), 'కాసాకారులు' (braziers), 'తేసకారులు' (మెరుగు పెట్టేవారు), 'కమారులు' (ఇనుప పనివారు), 'లోహవాణియలు' (లోహపు పనివారు), 'కులరికలు' (కమ్మరులు), 'అవేసణిలు' (చేలిపనివారు) 'కొమ్మకారులు' (చర్మకారులు), 'సువణకారులు' (సువర్ణకారులు), 'మణికారులు' (ఆభరణాలు తయారుచేసేవారు), 'మీఠికులు' (రాయికి మెరుగు పెట్టేవారు), 'సెలవఢకినులు' (తాపీ పనివారు), 'వఢకిలు' (వడ్రంగులు), భవన నిర్మాణ పనులు చేసే నాయగమిసులు, కఢిచకులు, మహాకటకులు. శాతవాహనులు కాలం నాటి వృత్తిపనివారు మధ్య యుగం నాటి పనివారలవలె ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉండేవారు. వారి కళా నైపుణ్యానికి మించినది లేదు.

17.15.2 ఇనుము - ఉక్కు పరిశ్రమ

శాతవాహనుల కాలంలో ఇనుము పరిశ్రమకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం గణనీయంగా అభివృద్ధి చెందింది. శాతవాహనులు, కుషాణుల కాలంనాటి ఇనుప పనిముట్లు, వస్తువులు అధిక సంఖ్యలో దొరికాయి. ఇనుము పరిశ్రమ

BRAOU

తెలంగాణా ప్రాంతంలో ప్రత్యేకంగా అభివృద్ధి చెందింది. కరీంనగర్, వరంగల్ ప్రాంతాల్లో లభించే ఇనుప ఖనిజాన్ని వినియోగంలోకి తెచ్చారు. ఇనుముతో తయారుచేసిన ఆయుధాలు, తూకాలు, గొడ్డళ్ళు, పారలు, కొడవళ్ళు, నాగేటి కర్రులు, గునపాలు, బాడిసెలు, కత్తులు, గరిటెలు అధిక సంఖ్యలో కరీంనగర్, నల్గొండ జిల్లాల్లోదొరికాయి. భారతదేశంలో తయారు చేసిన ఇనుము, ఉక్కు వస్తువులను అబిస్సీనియాలోని రేవు పట్టణాలకు ఎగుమతి చేసేవారు. వాటికి పశ్చిమ ఆసియా ప్రాంతంలో గొప్ప గిరాకీ ఉండేది.

17.15.3 వస్త్ర పరిశ్రమ

శాతవాహనుల కాలంలో వస్త్ర పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. ప్రత్తి పంటలను విశాలమైన ప్రాంతాల్లో వేసేవారు. నేతపనివారిని కొలికులు అనేవారు. మూలు, పట్టు నుండి దారాలుతీయడం, నేయడం, వస్త్రాలు తయారుచేయడం ముఖ్యమైన పరిశ్రమగా ఉండేది. నాటి సమాజంలో నేతపనివారికి గుర్తింపు, గౌరవం ఉండేవి.

17.15.4 అద్దకం పరిశ్రమ

దక్షిణ భారతదేశంలో కొన్ని పట్టణాల్లో, ప్రత్యేకంగా అద్దకం పరిశ్రమ అభివృద్ధి చెందింది. తమిళనాడులో తిరుచిరాపల్లి పట్టణానికి సమీపంలో ఉరైయూర్ వద్ద అద్దకంలో ఉపయోగించే, ఇటుకలతో నిర్మించిన పెద్దతొట్టి బయల్పడింది. అరికమేడు వద్ద జరిపిన త్రవ్వకాల్లో కూడ అద్దకంలో వాడే తొట్టెలు దొరికాయి. ఈ నిర్మాణాలు క్రీ.శ. 1-3 శతాబ్దాల నాటివి. వీటి వల్ల ఆ కాలంలో ఈ పట్టణాల్లో అద్దకం పరిశ్రమ అభివృద్ధి చెందించని తెలుస్తుంది.

17.15.5 నూనె పరిశ్రమ

శాతవాహనుల కాలంలో నూనె పరిశ్రమ గణనీయంగా అభివృద్ధి చెందింది. ఆ కాలంలో పలురకాల నూనె పంటలను పండించేవారు. ముఖ్యంగా నువ్వుల ఉత్పత్తి పెరిగింది. నూనె ఉత్పత్తికి అవసరమయ్యే గానుగలు అధిక సంఖ్యలో తయారు చేసేవారు. దాని ఫలితంగా నూనె ఉత్పత్తితో గానుగల వాడకం పెరిగింది. అధిక మొత్తంలో నూనె ఉత్పత్తి చేయడం ప్రారంభమైంది. నూనె గానుగ పనివారిని 'తిలాపిషకులు' అనేవారు.

17.15.6 దంతం పరిశ్రమ

శాతవాహనుల కాలంలో దంతం పరిశ్రమ కూడ ఉండేది. భారతదేశంలో ఏనుగులు అధిక సంఖ్యలో ఉండేవి. ఆ ఏనుగుల నుండి సేకరించిన దంతాలతో విలాస వస్తువులను తయారుచేసేవారు. దంత వస్తువుల ధరలు అధికంగా ఉండేవి. అందువల్ల వాటిని ధనిక వర్గాలకు చెందిన ప్రజలే వాడేవారు. భారతదేశంలో ఉత్పత్తి చేసిన దంతం వస్తువులను విదేశాలకు కూడ ఎగుమతి చేసేవారు. అఫ్ఘనిస్తాన్, రోమ్‌లతో జరిపిన త్రవ్వకాల్లో, భారతదేశంలో తయారైన దంతం వస్తువులు దొరికాయి. అవి చక్కనితో జరిపిన త్రవ్వకాల్లో బయల్పడిన శాతవాహనుల కాలం నాటి దంతం వస్తువులను పోలి ఉన్నాయి.

17.15.7 ఎర్రమట్టి పరిశ్రమ

శాతవాహనుల కాలంలో ఎర్రమట్టితో అందమైన వస్తువులను అధిక సంఖ్యలో తయారు చేసేవారు. శాతవాహనులు, కుషాణుల కాలం నాటి ప్రదేశాల్లో జరిపిన త్రవ్వకాల్లో అని చోట్ల ఎర్రమట్టితో తయారు చేసిన వస్తువులు దొరికాయి. ఎర్రమట్టి పరిశ్రమకు సంబంధించి నల్గొండ జిల్లాలోని ఏలేశ్వరంను ప్రత్యేకంగా పేర్కొనవచ్చు. అక్కడ ఎర్రమట్టితో

తయారుచేసిన బొమ్మలు, వస్తువులు, వాటి తయారీలో వాడే అచ్చులు అధిక సంఖ్యలో దొరికాయి. ఎర్రమట్టితో తయారు చేసిన వస్తువులు, వాటి అచ్చులు హైదరాబాద్‌కు 65 కి.మీ. దూరాన ఉన్న కొండాపూర్‌లో కూడ దొరికాయి. నగరాల్లోని ఉన్నత వర్గాలకు చెందిన ప్రజల ఉపయోగం కోసమే, ఎర్రమట్టితో వస్తువులను తయారు చేసేవారు.

17.15.8 నాణేల ముద్రణ

శాతవాహనుల కాలంలో నాణేల ముద్రణ కూడ ఒక ముఖ్యమైన పరిశ్రమగా ఉండేది. ఆ కాలంలో బంగారం, వెండి, రాగి, ఇత్తడి, సీసం, పోటిన్ (Potin) లతో నాణేలను తయారుచేసేవారు. రోమ్ నాణేలను పోలిన నకిలీ నాణేలను కూడ ముద్రించేవారు. శాతవాహనుల కాలంలో నాణేలు తయారుచేయడానికి వాడే వివిధ రకాల అచ్చులు ఉత్తర భారతదేశంలోను, దక్కన్ ప్రాంతంలోను జరిపిన త్రవ్వకాల్లో దొరికాయి. వాటిలో ఒక నాణెం అచ్చును పరిశీలిస్తే, దాన్ని ఉపయోగించి ఒకే సమయంలో ఆరు నాణేలను తయారు చేసేవారని తెలుస్తుంది.

17.15.9 ఆభరణాలు

శాతవాహనుల కాలంలో ఆభరణాల తయారీ కూడ ఒక ముఖ్యమైన పరిశ్రమగా ఉండేది. అజంతా గుహల్లోని చిత్రాల వల్ల ఆ కాలంలో ప్రజలు బంగారంతో తయారు చేసిన ఆభరణాలను ధరించడం నాగరిక సౌందర్య లక్షణంగా పరిగణించేవారని, స్త్రీలు, పురుషులు కూడ ఆభరణాలను ధరించేవారని తెలుస్తుంది. సుప్రసిద్ధమైన కోలార్‌లోని బంగారం గనులే కాక, హత్తి, పాండవల్లి, మస్కిలలోని గనుల నుండి కూడ బంగారం లభించేది. బంగారం పరిశ్రమకు మస్కి ముఖ్య కేంద్రంగా ఉండేది.

శాతవాహనుల కాలం నాటి ప్రజలు బంగారాన్ని ముద్ద బంగారం రూపంలోను, ఆభరణాల రూపంలోను వాడేవారు. కాని కుషాణులు ముద్రించినట్లు శాతవాహనులు బంగారు నాణేలను ముద్రించలేదు. బంగారంతో చేసిన ఆభరణాలు ముఖ్యంగా ధనిక వర్గాల ప్రజలు వాడేవారు. క్రింది తరగతులకు చెందిన ప్రజలు వెండి, రాగి, ఇతర లోహాలతో తయారు చేసిన ఆభరణాలు ధరించేవారు.

BRAOU

17.16 కుషాణుల కాలం

కుషాణుల కాలం నాటి రచనలు యంత్ర పరిశ్రమలకు, భవన నిర్మాణానికి సంబంధించిన వివిధ రకాల వృత్తిపనివారిని పేర్కొన్నాయి. యంత్ర సంబంధమైన పనివారు (శిల్పిక), జల యంత్రాలు తయారు చేసేవారు (యంత్రకారక), బండ్లు, రథాలు తయారు చేసేవారు (రథకారక), మూగె గానుగలు నిర్మించేవారు, యంత్ర నిపుణుల తరగతికి చెందినవారు. వాస్తుశిల్పులు (పేశలక), గచ్చు (Plaster) వేసేవారు (లేపక), బావులు త్రవ్వేవారు (కూపఖానక), బురదమట్టి పనివారు (ఇట్టిక వాహక), భవన నిర్మాణ పనివారి తెగకు చెందినవారు.

కమ్మరులు (కర్మర), లోహకారులు, సూదులు తయారుచేసేవారు (సుచికార), బంగారం పనివారు (సువర్ణకార), రాగిపనివారు (తామ్రకుట్టక), గాజు, సీసం పనివారు (సీసకార), తగరం పనివారు (తిపుకార), ఇత్తడి పనివారు (తట్టకార), దంతకారులు, ఇనుము పనివారు (అయకార) లోహ పరిశ్రమకు సంబంధించిన వృత్తులకు చెందినవారు. అద్దకం పనివారు, అద్దకం సామగ్రి తయారుచేసేవారు (రంగకార), చర్మకారులు, త్రాళ్ళు అల్లేవారు (రజ్జుకార), దువ్వెనలు తయారుచేసేవారు (ధమకార), నేతపనివారు (పేసకార) ఇతర వృత్తులకు చెందినవారు.

17.16.1 సాంకేతిక అభివృద్ధి

బంగారం, వెండి, సీసం, తగరం, రాగి, ఇత్తడి, ఇనుము, రత్నాలు, మణులు మొదలగు ఖరీదైన రాళ్ళు, ఆభరణాలకు సంబంధించి ఎనిమిది రకాల చేతిపరిశ్రమలు ఉండేవి. వివిధ రకాల ఇత్తడి, తుత్తునాగం, సౌవీర(antimony), ఎర్రపాషాణం (arsenic) మొదలైన వాటిని కూడా నాటి గ్రంథాలు పేర్కొన్నాయి. దీన్ని బట్టి కుషాణుల కాలంలో గనుల త్రవ్వకం, లోహం తయారుచేసే విధానాల్లో గొప్ప సాంకేతిక అభివృద్ధి జరిగిందని తెలుస్తుంది.

17.16.2 లోహ పరిశ్రమ

కుషాణుల కాలంలో వివిధ రకాల లోహ పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. లోహాలతో వివిధ రకాల వస్తువులు, పరికరాలు, ప్రతిమలను తయారుచేసేవారు. ఇవి చేతిపరిశ్రమలుగా ఉండేవి. లోహంతో వస్తువులను తయారుచేసే చేతివృత్తి పనివారిని లోహకారులు అనేవారు. లోహాన్ని కరిగించి, పోతపోసి, వస్తురూపంలోకి మలచడంలో, నాటి లోహకారులు ప్రావీణ్యతను సంపాదించారు.

17.16.3 ఇనుము పరిశ్రమ

కుషాణుల కాలంలో ఇనుము ఉపయోగం, దానితో వస్తువులు, పరికరాలు తయారుచేసే విధానం గురించిన సాంకేతిక పరిజ్ఞానం గొప్పగా అభివృద్ధి చెందింది. త్రవ్వకాలు జరిగిన వివిధ ప్రదేశాల్లో కుషాణులు, శాతవాహనుల కాలం నాటి ఇనుప వస్తువులు అధిక సంఖ్యలో దొరికాయి. అవి ఆయుధాలు, త్రాసులో వాడే కడ్డీలు (balance rods), గొడ్డళ్ళు, పారలు, కొడవళ్ళు, నాగలి కర్రులు మొదలైనవి.

17.16.4 ఆయుధాల పరిశ్రమ

కుషాణుల కాలంలో భారతదేశంలో ఆయుధాల తయారీ పరిశ్రమ సాంకేతికపరంగా బాగా అభివృద్ధి చెందింది. నాణ్యమైన, కొత్త రకాల ఆయుధాలు ఉత్పత్తి చేయడం ప్రారంభించారు. కళ్ళిపువార్లు, గుర్రపుజీన్లు, కొరడాలు, తలపాగలు, లోనధరించే వస్త్రాలు, షరాయిలు, కోట్లు, టోపీలు, శిరస్త్రాణాలు, బూట్లు కూడా తయారుచేసేవారు. యుద్ధసంబంధమైన సాంకేతిక పరిజ్ఞానం భారతదేశమంతా వ్యాప్తి చెందింది. దాని ఫలితంగా భారతదేశంలోని రాజులు విదేశీ రాజుల దండయాత్రలను విజయవంతంగా ఎదుర్కొనేందుకు వీలైంది

17.16.5 వస్త్ర పరిశ్రమ

కుషాణుల కాలంలో వస్త్ర పరిశ్రమ సాంకేతికంగా అభివృద్ధి చెందింది. నాణ్యమైన, నాజూకైన వస్త్రాలను తయారు చేసేవారు. నూలు, పట్టు వస్త్రాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఆ కాలంలో 'శతక' అనే పేరు గల ప్రత్యేకమైన వస్త్రం తయారీకి సుధుర ప్రధాన కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. నేతనివారిని 'సేసకారులు' అనేవారు.

17.16.6 నూనె పరిశ్రమ

కుషాణుల పాలనలో నూనె తయారీ పరిశ్రమకు ప్రాముఖ్యత ఉండేది. శాతవాహన రాజ్యంలో లాగే, కుషాణ రాజ్యంలో కూడా నూనె తయారీ పరిశ్రమలో గానుగ యంత్రాలను ఉపయోగించడం ప్రారంభించారు. దాని ఫలితంగా నూనె ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయి. అంతేకాక నూనె గానుగ యంత్రాలను తయారు చేయడంలో కూడా, సాంకేతికపరంగా నైపుణ్యాన్ని సంపాదించారు.

BRAOU

17.16.7 దంతం, గాజు, పూసల పరిశ్రమలు

విలాస వస్తువుల తయారీకి సంబంధించిన చేతిపనుల్లో దంతం, గాజు, పూసల పరిశ్రమలు ముఖ్యమైనవి. కుషాణుల కాలం నాటి ప్రదేశాల్లో జరిపిన త్రవ్వకాల్లో, ఈ చేతిపనుల ఉత్పత్తులు అనేకం దొరికాయి. దంతంతో తయారు చేసిన వస్తువులను విదేశాలకు, ముఖ్యంగా రోమ్‌కు ఎగుమతి చేసేవారు. రోమ్‌లో తయారైన గాజు వస్తువులు తక్షశిల, ఆఫ్ఘనిస్తాన్‌లలో దొరికాయి. క్రీస్తు శకం ప్రారంభంలో గాజు తయారీకి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం భారతదేశానికి చేరి, గాజు పరిశ్రమ త్వరితంగా అభివృద్ధి చెందింది. మౌర్యుల తర్వాత కాలం నాటి ప్రదేశాల్లో జరిపిన త్రవ్వకాల్లో, మధ్య రకం విలువ గల రాళ్ళతో తయారుచేసిన పూసలు అధిక సంఖ్యలో దొరికాయి.

17.16.8 నాణేల ముద్రణ

కుషాణుల కాలంలో నాణేలు తయారుచేసి ముద్రించడం ఒక ముఖ్యమైన పరిశ్రమగా ఉండేది. ఆ కాలంలో బంగారం, వెండి, రాగి, కంచు, సీసం, పోటిన్‌లతో తయారైన నాణేలు వాడుకలో ఉండేని. కొందరు చేతపనివారు నకిలీ రోమ్ నాణేలను కూడా తయారు చేసేవారు. కుషాణుల కాలం నాటి వివిధ రకాల నాణేల అచ్చులు ఉత్తర భారతదేశంలోను, దక్కన్‌లోను దొరికాయి.

17.16.9 మట్టిబొమ్మలు

కుషాణుల కాలంలో నగరాలు, పట్టణాల్లో ఉండే చేతిపనుల ఉత్పత్తుల్లో అందంగా తయారుచేసిన మట్టిబొమ్మలు కూడా అధిక సంఖ్యలో ఉండేని. అవి కుషాణుల కాలంనాటి ప్రదేశాల్లో జరిపిన త్రవ్వకాల్లో దొరికాయి. మట్టిబొమ్మలను ముఖ్యంగా ధనిక వర్గాలకు చెందిన ప్రజలు వాడేవారు.

17.17 గుప్తుల కాలం

గుప్తుల కాలంలో మట్టి పాత్రలు, లోహం, ఆభరణాలు, నాణేల ముద్రణ, నేత, బుటేదారి (embroidery), అద్దకం, రాయి, దంతం, కలప పరిశ్రమలు ముందు ఎన్నడూ లేనంతగా త్వరితగతిన అభివృద్ధి చెందాయి. పారిశ్రామిక ఉత్పత్తుల్లో ప్రభుత్వం స్వయంగా ఏవిధమైన పాత్ర వహించినట్లుగా ఆధారాలు లభించలేదు. పరిశ్రమల్లో ఎక్కువ భాగం ప్రైవేట్ కుటుంబాలు లేదా శ్రేణుల యాజమాన్యంలో ఉండేవి.

పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి ఒక ముఖ్య కారణం, నాటి సమాజంలో చేతిపనివారికి ఎక్కువగా గౌరవ మర్యాదలు లభించడమే. నాటి శాసనాలు కూడా వారిని గౌరవభావంతో చేర్చాయి. అంతేకాక గుప్తుల కాలంలో శాంతి భద్రతలు పటిష్టంగా ఉండడం వల్ల, పరిశ్రమలు ఎటువంటి అడ్డంకులు లేకుండా అభివృద్ధి చెందాయి.

17.17.1 గనులు - ఖనిజాలు

గుప్తుల కాలంలో ఖనిజ సంపద, రిజర్వు అడవులు ప్రభుత్వం అధీనంలో ఉండేవి. ఉత్తర భారతదేశంలో ఛోటానాగపూర్ ప్రాంతాలు లోహ ఖనిజాలకు మూలాధారంగా ఉండేవి. అక్కడ బంగారం, రాగి, ఇనుము, అభ్రకం

BRAOU

లభించేవి. కుషాణుల చివరి కాలంలో ఈ గనుల నుండి ఖనిజాలు తీసేపని ఎక్కువగా జరిగింది. బంగారం, ఇనుము, ఇనుప కడ్డీలు, గనులను గురించి 'అమరకోశం' పేర్కొంది. 'బృహత్సంహిత' కూడ గనులను గురించి అనేక సందర్భాల్లో పేర్కొంది. కాని ఈ గ్రంథాలు వెండి గనులను మాత్రం పేర్కొనలేదు. భారతదేశంలో గనుల నుండి వెండి లభించలేదు. వెండిని శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి దిగుమతి చేసుకొనేవి.

17.17.2 ఇనుము పరిశ్రమ

ప్రజల నిత్య జీవనంలో అన్ని లోహాల్లోను ఇనుము ఎక్కువ ఉపయోగకారిగా ఉండేది. నాటి గ్రామీణ సమాజంలో రైతుల తర్వాత కమ్మరి వారికే అధిక ప్రాముఖ్యత ఉండేది. ఇనుముతో పారలు, కొడవళ్ళు, నాగలి కర్రులు, గొలుసులు, పాత్రలు, కత్తులు ఇతర ఆయుధాలు, కలప, వెదురు, చర్మాలతో పనిచేసే పరికరాలను తయారు చేసేవారు. గుప్తుల కాలంనాటి ప్రదేశాల్లో జరిపిన త్రవ్వకాల్లో ఇనుముతో తయారుచేసిన ఉలి, సుత్తి, గొడ్డలి, లాళం, పాత్ర, చెంచా, తలుపు రింగు, కత్తి, కుండ మొదలగు వస్తువులు దొరికాయి.

రెండవ చంద్రగుప్తుని కాలం నాటి ఇనుప స్తంభం ఢిల్లీ సమీపంలోని మెహ్రౌలిలో ఉంది. అది నాటి ఇనుప పనిలో సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనం. దాని ఎత్తు 7మీ. 11సెంమీ., వ్యాసం 43సెం.మీ., బరువు 6 మెట్రిక్‌టన్నులు. దాని ఒకే పోతతో తయారు చేశారు. అనేక వందల సంవత్సరాలుగా అది ఎండ, వానల్లో బయటనే ఉన్నా, దానికి తుప్పు పట్టలేదు. దీని వల్ల గుప్తుల కాలంలో భారీ ఇనుప కర్మాగారాలు ఉండేవని, ఇనుప పనివారు అత్యంత నిపుణులు అని తెలుస్తుంది.

17.17.3 ఆభరణాల తయారీ పరిశ్రమ

గుప్తుల కాలం నాటి సమాజంలో ధనిక వర్గాల్లో ఆభరణాలకు గిరాకీ అధికంగా ఉండేది. రాజవంశాలకు, కులీన, ధనిక వర్గాలకు చెందిన స్త్రీలు ఎక్కువగా ఆభరణాలను ధరించేవారు. ధనిక వర్గాలకు చెందిన పురుషులు కూడ ఆభరణాలు వాడేవారు. బంగారం, వెండి, విలువైన రాళ్ళు మొదలైన వాటితో ఆభరణాలు తయారు చేసేవారు. పేద వర్గాలకు చెందిన స్త్రీలు పూసలతో చేసిన ఆభరణాలు ధరించేవారు.

కాళిదాసు రచించిన గ్రంథాలు, మండసోర్, మాలియా మొదలగు శాసనాలు వివిధ రకాల ఆభరణాలను పేర్కొన్నాయి. భీటా వద్ద జరిపిన త్రవ్వకాల్లో బంగారంతో చేసిన ఉంగరం, పూసలు, చక్రం, బిళ్ళ దొరికాయి. దీన్ని బట్టి గుప్తుల కాలంలో ఆభరణాల తయారీ పరిశ్రమ గణనీయంగా అభివృద్ధి చెందిందని తెలుస్తుంది.

17.17.4 రాగి, కంచు, ఇత్తడి పరిశ్రమలు

గుప్తుల కాలంలో ఇనుము తర్వాత రాగి అత్యంత ఉపయోగకరమైన లోహం. రాగి, కంచు లోహాల్ని ముఖ్యంగా ప్రతిమలు, పంటపాత్రలు, కుండలు, నాణేలను తయారుచేసేందుకు వాడేవారు. తామ్రపత్రాల మీద అక్షరాలు చెక్కడం సాంకేతిక కళగా ప్రసిద్ధి చెందింది. ఈ విధంగా అక్షరాలు చెక్కేవారికి ప్రభుత్వం ఉద్యోగాలు కూడ ఇచ్చేది.

గుప్తుల కాలం నాటి ప్రదేశాల్లో జరిపిన త్రవ్వకాల్లో రాగితో చేసిన బుద్ధుని విగ్రహాలు ఉత్తర ప్రదేశ్, బీహార్‌లలో

దొరికాయి. అలహాబాద్ సమీపంలోని భిటా వద్ద రాగితో చేసిన స్త్రీ ప్రతిమ, భాండలి, ముక్కాలి పీట, సాసరు, కప్పు, గుండ్రని మూత, వంటపాత్ర, గాజులు దొరికాయి. బయానా వద్ద రాగి కలశం, కాళిఘాట్ వద్ద ఇత్తడి పాత్ర లభించాయి. రాజఘాట్ వద్ద రాగి ముద్రలు, సుల్తాన్‌గంజ్ వద్ద రాగితో తయారుచేసిన ఎత్తైన బుద్ధుని విగ్రహం దొరికాయి.

17.17.5 అద్దాల తయారీ పరిశ్రమ

గుప్తుల కాలంలో ప్రజలు అలంకరణలో భాగంగా అద్దాలు వాడేవారు. అద్దాలు తయారు చేసేందుకు గాజును ఉపయోగించేవారు కారు. లోహాలకు బాగా మెరుగు పెట్టి, అద్దాలుగా వాడేవారు. అద్దాల తయారీకి రాగి, కంచు, ఇత్తడిని వాడేవారు. బంగారంతో తయారు చేసిన అద్దాన్ని 'రఘువంశం' పేర్కొంది. అజంతా చిత్రాల్లో లోహంతో చేసిన గుండ్రని అద్దాలు కనిపిస్తాయి.

17.17.6 విలువైన రాళ్ళ పరిశ్రమ

గుప్తుల కాలంలో వజ్రాలు, ముత్యాలు మొదలగు విలువైన రాళ్ళు, పగడాలు, శంఖాలు కూడా ఆభరణాలుగా వాడేవారు. 'బృహత్సంహిత'లో వరాహమిహిరుడు వజ్రాలు, ముత్యాలు, మాణిక్యాలు, వాటి నాణ్యం, లక్షణాలు, పరినూణం, ధరలను గురించి సవివరంగా వర్ణించాడు. పచ్చరాళ్ళు, కెంపులు, ముత్యాలు, పగడాలు, శంఖం చిప్పలు మొదలగువాటిని 'అమరకోశం' పేర్కొంది. మణులు, వజ్రాలు, గోమేధికం, ఇంద్రనీల మణులు, వైఢూర్యాల్ని కాళిదాసు తన రచనల్లో పేర్కొన్నాడు.

17.17.7 ఉప్పు పరిశ్రమ

ఉప్పు పరిశ్రమ గుప్తుల కాలంలో అభివృద్ధి చెందింది. ఉప్పు నిత్యావసర వస్తువు. ఉప్పును సాధారణంగా ఉప్పు నీటి నుండి తయారు చేస్తారు. అమరకోశం రెండు రకాల ఉప్పును పేర్కొంది. ఒకటి ఉప్పునీటి నుండి, రెండవది శిలనుండి లభించేని. రెండవ రకం ఉప్పును గనుల నుండి, శిలల నుండి తీసేవారు. వాకాటక రాజ్యంలో ఉప్పు పరిశ్రమ మీద ప్రభుత్వానికి గుత్తాధిపత్యం ఉండేది. దానివల్ల ప్రభుత్వానికి అధికంగా ఆదాయం వచ్చేది. గుప్తుల పాలనలో ప్రభుత్వానికి ఉప్పు పరిశ్రమ మీద గుత్తాధిపత్యం ఉండేదనడానికి స్పష్టమైన ఆధారాలు లేవు.

17.17.8 మట్టి పరిశ్రమ

నిత్య జీవనంలో వాడే వస్తువుల తయారీలో లోహం తర్వాత మట్టికి అత్యధిక ప్రాముఖ్యత ఉండేది. గుప్తుల కాలంనాటి మట్టి పనివారు పోతపోయడం, అచ్చు వేయడం, రంగులు వేయడం, కాల్చడంకు సంబంధించిన పనుల్లో మిక్కిలినైపుణ్యం కలిగి ఉండేవారు. మట్టి పాత్రలు ముఖ్యంగా ఎర్రమట్టితో చేసేవారు. మట్టి పాత్రలను చేతితోను లేదా చక్రం ఉపయోగించి తయారు చేసేవారు.

రాజఘాట్, అహిచ్ఛత్ర, భిటా, బసార్ (వైశాలి) మొదలగు ప్రదేశాల్లో జరిపిన త్రవ్వకాల్లో మట్టితో తయారు చేసిన వివిధ రకాల గిన్నెలు, కుండలు, జాడీలు, కూజాలు, సీసాలు మొదలగు పాత్రలు, స్త్రీ పురుష ప్రతిమలు,

BRAOU

దేవతా విగ్రహాలు, జంతువుల బొమ్మలు, పేద స్త్రీలు అలంకరించుకొనే పూసలు దొరికాయి. అజంతా చిత్రాల్లో కూడా మట్టితో చేసిన వస్తువులు కనిపిస్తాయి. నలంద, బసార్ మొదలగు ప్రదేశాల్లో రాజులు, సామంతులు, ప్రభుత్వాధికారులకు చెందిన మట్టి ముద్రలు లభించాయి.

17.17.9 చర్మ పరిశ్రమ

గుప్తుల కాలంలో చర్మాన్ని పలురకాల ప్రయోజనాలకు ఉపయోగించేవారు. పాదరక్షలు తయారుచేసేవారిని, వారు ఉపయోగించే కత్తులు, నూనెమొదలగు పరికరాల్ని, వివిధ రకాల పాదరక్షల్ని అమరకోశం పేర్కొంది. భూములు దానం చేసిన తర్వాత కూడ ప్రభుత్వానికి చర్మాల మీద హక్కు ఉండేది. దీన్ని బట్టి ప్రభుత్వానికి చర్మం మీద గుత్తాధిపత్యం ఉండేదని తెలుస్తుంది. ప్రభుత్వమే చర్మాల్ని వర్తకులకు, చర్మకారులకు అమ్మకం చేసేది. సన్యాసులు పులి, జింక మొదలైన జంతువుల చర్మాలను వాడేవారు.

17.17.10 దంత పరిశ్రమ

గుప్తుల కాలంలో దంతం పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. దంతాల్ని ఏనగుల నుండి సేకరించేవారు. ఆ దంతాలనుండి విలాస వస్తువులను తయారు చేసేవారు. వాటిని ధనిక వర్గాల ప్రజలు వాడేవారు. రఘువంశంలో కాళిదాసు దంతంతో తయారుచేసిన ఆసనాలను పేర్కొన్నాడు. భిటా వద్ద జరిగిన త్రవ్వకాల్లో, క్రీ.శ. 4వ, 5వ శతాబ్దాలకు చెందిన దంతం ముద్రలు దొరికాయి.

17.17.11 పట్టు పరిశ్రమ

గుప్తుల కాలంలో పట్టు, పట్టు ఉత్పత్తుల తయారీ పరిశ్రమ సాంకేతికంగా అభివృద్ధి చెందింది. పట్టు నేయడం గురించి 'అమరకోశం' వివరంగా వర్ణించింది. పట్టు పురుగు నుండి పట్టుదారాన్ని తీసి, వాటితో వస్త్రం నేసి, ఆ వస్త్రానికి బ్లీచింగ్ సెట్టేవారు. రాజవంశీయులు, ధనిక వర్గాలకు చెందిన ప్రజలు నాజూకైన పట్టువస్త్రాలను చైనా నుండి దిగుమతి చేసుకొనేవారు. పట్టువస్త్రాలను సాధారణంగా వివాహాల్లోను, పండుగల్లోను వాడేవారని 'మాళవికాగ్నిమిత్రం' వల్ల తెలుస్తుంది.

పట్టునేత పనివారు శ్రేణులను ఏర్పాటు చేసుకొనేవారని 'మండసోర్' శాసనం వల్ల తెలుస్తుంది. దీన్నిబట్టి అనేక మంది పట్టు ఉత్పత్తి చేసేవారని, వారి ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండేవని, దేవాలయ నిర్మాణాలకు వాటి మరమ్మతులకు పట్టు నేతపనివారి శ్రేణులు అధిక మొత్తంలో డబ్బు ఖర్చుపెట్టేవని తెలుస్తుంది.

17.17.12 కలప పరిశ్రమ

గుప్తుల కాలంలో కలప పరిశ్రమ, బొమ్మలు చెక్కడం అభివృద్ధి చెందాయి. వడ్రంగులు, వారి నాయకుడు, వారు ఉపయోగించే బల్ల, ఉలి, రంపం మొదలగు పరికరాల్ని అమరకోశం పేర్కొంది. చెక్కతో పెద్ద విగ్రహాలు తయారు చేసేవారు. సింధు నది పశ్చిమ ఒడ్డున డారెల్‌లో కొయ్యతో చేసిన ఒక బ్రహ్మాండమైన బుద్ధ విగ్రహాన్ని అక్కడి ప్రజలు పూజించేవారని ఫాహియాన్ పేర్కొన్నాడు.

BRAOU

గృహనిర్మాణాలకు, గృహోపకరణాల తయారీకి కలప, వెదురు, పేము వాడేవారు. అతిథులు ఆసీనులయ్యేందుకు పేము కుర్చీలు ఇచ్చేవారని కాళిదాసు పేర్కొన్నాడు. పండుగల సందర్భంగా జరిపే ఊరేగింపులో నాలుగు చక్రాల రథం మీద వెదురుతో నిర్మించిన అయిదు అంతస్తుల నిర్మాణం ఉండేదని ఫాహియాన్ పేర్కొన్నాడు. వెదురు, పేము ఉపయోగించి బుట్టలు, గంపలు కూడ తయారు చేసేవారు.

17.17.13 వస్త్ర పరిశ్రమ

గుప్తుల కాలంలో వస్త్ర పరిశ్రమకు ప్రాముఖ్యత ఉండేది. దానికి అవసరమయ్యే ప్రత్తి విశాలమైన భూముల్లో పండించేవారు. నేతపనివాడు, మగ్గం, దారాలు తీయడం, వస్త్రాలు నేయడం గురించి అమరకోశం పేర్కొంది. నాజూకైన వస్త్రాలు ధనిక వర్గాల ప్రజల కోసం, ముతక వస్త్రాలు బీద వర్గాల వారికోసం ఉత్పత్తి చేసేవారు. గాలిలో తేలిపోయేంత నాజూకైన వస్త్రాన్ని గురించి కాళిదాసు వర్ణించాడు. గుడారాలకు, పరదాలకు వాడే ఒక రకమైన దళసరి వస్త్రం కూడ తయారు చేసేవారు.

17.17.14 అద్దకం, ఎంబ్రాయిడరీ పరిశ్రమలు

గుప్తుల కాలంలో అద్దకం, ఎంబ్రాయిడరీ పరిశ్రమలు ప్రసిద్ధి చెందాయి. అజంతా చిత్రాల్లో వస్త్రాల మీద స్పష్టమైన రంగుల డిజైనులు, ఎంబ్రాయిడరీ కనిపిస్తాయి. వీటిలో నాలుగు రకాలు ఉండేవి. అవి 1.సాధారణ అద్దకం, 2 రెండు సార్లు అద్దకం, 3. జరీ అల్లకం, 4. సన్నని బట్ట నేయడం. డిజైనుల్లో ముఖ్యమైనవి వలయాలు, నిలువు అడ్డం గీతలు, పూలు, హంసలు, చుక్కలు మొదలైనవి.

17.17.15 నూనె పరిశ్రమ

గుప్తుల కాలంలో నూనె తయారీని నిత్యావసర పరిశ్రమగా పరిగణించేవారు. నూనెను సాధారణంగా ఆవాలు, నువ్వులు, అవిసెలు, ఆముదాల నుండి ఉత్పత్తి చేసేవారు. దీపాలు వెలిగించేందుకు, శరీరం మీద బొబ్బలకు, తల వెంట్రుకలకు ఆముదం వాడేవారని కాళిదాసు పేర్కొన్నాడు. ఒక ప్రదేశంలోని నూనె తయారీ పనివారు (తెలికులు) తమ ప్రయోజనాలను సంరక్షించుకొనేందుకు శ్రేణులను ఏర్పాటు చేసుకొనేవారు. స్కందగుప్తుని పాలనలో ఇంద్రపుర (ఇండోర్) లో సుప్రసిద్ధమైన నూనె తయారీ పనివారి శ్రేణి (తేలిక శ్రేణి) ఉండేది. దానికి అధ్యక్షుడుగా 'జీవంతుడు' ఉండేవాడు.

17.17.16 అలంకరణ సామగ్రి, సుగంధ ద్రవ్యాల పరిశ్రమలు

గుప్తుల కాలంలో అలంకరణ సామగ్రి, సుగంధ ద్రవ్యాలు, తైలాలను స్త్రీలు, పురుషులు కూడ వాడేవారు. వివిధ రకాల విలాస వస్తువులను 'రుతుసంహారం', 'కుమార సంభవం', 'రఘువంశం'లో కాళిదాసు పేర్కొన్నాడు. సుగంధ ద్రవ్యాలు, తైలాలు మొదలైన వాటిని తయారుచేసే విధానాన్ని గురించి 'బృహత్సంహిత'లో వరాహమిహిరుడు వివరంగా వర్ణించాడు

BRAOU

వివిధ రకాల పరిమళాన్నిచ్చే పొడులు, సువాసనతో కూడిన తలనూనె, సాంబ్రాణి, కాటుక, తైలాలు, లేహ్యాలు, పాదాలకు వాడే ఎర్రరంగు లత్తుక (lac dye) మొదలగువాటిని ఉత్పత్తి చేసేవారు. అలంకరణ సామగ్రిలో కాలేయకం, నల్ల అగురు, తెల్ల అగురు, హరిచందనం, మనఃశిలం, సింధూరం, హరితాళకం, లోధ్రపొడి, ధూపం, కుంకుమ, గోరోచనం, ఎర్ర లత్తుక, గంధం మొదలైనవి ముఖ్యమైనవి.

17.17.17 మద్యం పరిశ్రమ

గుప్తుల కాలంలో భారతదేశంలో అన్ని ప్రాంతాల్లో మద్యం ఉత్పత్తి చేసేవారు. మద్యపానం, మద్యం అమ్మకాల్ని గురించి కాళిదాసు అనేక సందర్భాల్లో పేర్కొన్నాడు. పురుషులు, స్త్రీలు కూడ మద్యం సేవించేవారు. మద్యం ఇచ్చే మత్తువల్ల స్త్రీలకు ఒక ప్రత్యేకమైన సౌందర్యాకర్షణ వచ్చేదని నమ్మేవారు. అగ్నిమిత్రుని భార్య ఐరావతి మత్తులో ఉన్న పరిస్థితిని 'మాళవికాగ్నిమిత్రం' వర్ణించింది. శివుడు సుద్యం త్రాగి తన భార్యకు కూడ త్రాగించేవాడని 'కుమారసంభవం' పేర్కొంది. ఒక నగర నివాసి, ఇద్దరు రక్షకభటులు మద్యం సేవించాడాన్ని 'అభిజ్ఞాన శాకుంతలం' వర్ణించింది. రఘు మహారాజు సైనికులు అందరూ కొబ్బరి చెట్లనుండి తీసిన కల్లు త్రాగేవారని 'రఘువంశం' పేర్కొంది. గుప్తుల కాలం నాటి రచనలు పలు సందర్భాల్లో మద్యం దుకాణాలు నడపడాన్ని పేర్కొన్నాయి. ఈ ఆధారాల వల్ల ఆ కాలంలో మద్యాన్ని పెద్దమొత్తంలో తయారుచేసేవారని, మద్యం పరిశ్రమ అనేక మందికి జీవనాధారంగా ఉండేదని, మద్యం ఉత్పత్తిదారులకు, దాన్ని అమ్మేవారికి అధిక లాభాలు వచ్చేవని తెలుస్తుంది.

17.17.18 లోహ పరిశ్రమ

గుప్తుల కాలంలో చేతిపనివారికి లోహాలతో వస్తువులను తయారుచేయడంలో నైపుణ్యం ఉండేదని రాగితో చేసిన బ్రహ్మాండమైన అనేక బుద్ధుని విగ్రహాలు, ఢిల్లీ సమీపంలోని మెహ్రౌలి వద్ద ఉన్న ఇనుప స్తంభం వల్ల తెలుస్తుంది. ఈ స్తంభాన్ని గుప్తుల కాలంనాటి లోహ తయారీ సాంకేతిక పరిజ్ఞానానికి, నైపుణ్యానికి నిదర్శనంగా పేర్కొనవచ్చు.

17.18 గుప్తుల అనంతర కాలం

గుప్తుల తర్వాత కాలానికి చెందిన బాణుడు, హుయాన్‌త్సాంగ్ రచనల వల్ల, నాటి ఉత్పత్తుల రకాలు, వాటి నాణ్యత తెలుస్తుంది. హర్షుని కాలంలో ఆభరణాలు పొదిగి, నారపట్టుతో తయారు చేసిన గొడుగు, కొప్పున అలంకరించుకొనే ఆభరణాలు, ముత్యాల కంఠాభరణాలు, పట్టు తువాళ్ళు, ముత్యాలతో చేసిన పానీయ పాత్రలు, బంగారు రేకుతో అలంకరించిన తోలు డాలు, సన్నని నాజూకైన వస్త్రాలు, జింక చర్మంతో చేసిన దిండ్లు, సేముతో చేసిన ఆసనాలు, తాళపత్రాలు, అందంగా చెక్కిన పెట్టెలు మొదలగు ఖరీదైన వస్తువులను ఉత్పత్తి చేసేవారు.

కనౌజ్ సమావేశంలో పూజించేందుకు బంగారంతో బుద్ధుని నిలువెత్తు విగ్రహం తయారు చేశారని, ఆ విగ్రహానికి రాజు "ఒక బంగారు పాత్ర", "ఒక బంగారు కప్పు", "ఏడు బంగారు కూజాలు", "ఒక బంగారు దండం", "3,000 బంగారు నాణేలు", 3,000 నాణ్యమైన వస్త్రాలు బహుమతిగా ఇచ్చాడని హుయాన్‌త్సాంగ్ తెలిపాడు.

భారతదేశం నుండి గ్రంథాలు, చేతిప్రాత పుస్తకాలు, బంగారం, వెండి, చందనపు చెక్కలతో తయారుచేసిన బుద్ధుని విగ్రహాలు మొదలైన వస్తువులను హుయాన్‌త్సాంగ్ చైనాకు తీసుకొని పోయాడు. భారతదేశంలో బంగారం, వెండి, తెల్లని జేడ్(jade), స్ఫటికా కారపు అద్దాలు సమృద్ధిగా లభించేవని కూడ హుయాన్‌త్సాంగ్ పేర్కొన్నాడు.

BRAOU

17.18.1 భవన నిర్మాణ పరిశ్రమ

హర్షుని కాలంలో నగరాల్లో నిర్మించిన భవనాల వాస్తుశైలిని, పట్టణ ప్రణాళికలను పరిశీలిస్తే, ఆ కాలంలో ఆర్థికాభివృద్ధి ఉన్నత శిఖరాలకు చేరిందని తెలుస్తుంది. ప్రభుత్వ భవనాలు, రాజప్రసాదాలు, బౌద్ధ సంఘారామాల వాస్తుశైలి "అత్యంత ఉత్కృష్టమైనది" అని హ్యూయన్‌త్సాంగ్ పొగిడాడు. "చతురస్రంలోని నాలుగు మూలల్లో ఒక్కొక్కదానిలో ఒక గోపురం, మూడు అంతస్తుల్లో ఎత్తైన పెద్ద గదులు ఉండేవి. ఇంటివాసాలు, కప్పుకు ఉండే దూలాల మీద వింతవింత బొమ్మలను చెక్కేవారు. ద్వారాలు, కిటికీలు, గోడల మీద వివిధ రకాల రంగులు వేసేవారు" అని హ్యూయన్‌త్సాంగ్ వర్ణించాడు. కాని ప్రైవేట్ ఇళ్ళ లోపలి భాగం దివ్యంగాను, వెలుపల సాధారణంగాను ఉండేవి.

17.18.2 వస్త్ర పరిశ్రమ

హర్షుని కాలంలో వస్త్ర పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. నాటి ప్రజలు ఉపయోగించే వివిధ రకాల వస్త్రాలను హ్యూయన్‌త్సాంగ్ పేర్కొన్నాడు. అవి 1. కాషాయ వస్త్రం. దీన్ని పట్టు, నూలుతో తయారు చేసేవారు. 2. క్షామ లేక నార వస్త్రం. దీన్ని గోగు, జనప నారలతో తయారు చేసేవారు. 3. కంబల లేక ఉన్నితో చేసిన వస్త్రం. 4. ఒక క్రూర జంతువు ఉన్నితో చేసిన వస్త్రం. చలి, మంచు నుండి కాపాడుకొనేందుకు అస్సాం రాజు తనకు బొచ్చుగల చర్మంతో తయారు చేసిన టోపీ బహుమతిగా ఇచ్చాడని హ్యూయన్‌త్సాంగ్ పేర్కొన్నాడు.

17.19 సంగ్రహంగా

హరప్పా కాలం (క్రీ.పూ. 2500) నుండి క్రీ.శ. 700 వరకు భారతదేశంలో వాణిజ్యం, పరిశ్రమలు గణనీయంగా అభివృద్ధి చెందాయి. నాటి రాజుల ప్రోత్సాహ సహకారంతో దేశీయ విదేశీ వాణిజ్యాలు పురోగతిని సాధించాయి. దేశీయ వాణిజ్యంలో రహదారులతో భూమార్గాలు, సరులు, కాలువలతో జలమార్గాలు సరుకుల రవాణాకు ఉపయోగించేవారు. పశ్చిమ తీరాన ఉన్న బ్రోచ్, కళ్యాణ్ మొదలగు రేవు పట్టణాల ద్వారా పశ్చిమ దేశాలతోను, తూర్పుతీరాన ఉన్న తామ్రలిప్తి, గూడూరు, మోటుపల్లి మొదలగు రేవుపట్టణాల నుండి తూర్పు దేశాలతోను నౌకల మీద సముద్రయాన మార్గాల ద్వారా విదేశీ వాణిజ్యం చేసేవారు. విదేశీ వాణిజ్యం వల్ల భారతదేశానికి అధికలాభాలు వచ్చి, దేశ సంపద పెరిగింది.

ఆ కాలంలో భారతదేశంలో పలురకాల పరిశ్రమలు స్థాపింపబడి, కాలక్రమేణా అభివృద్ధి చెందాయి. పారిశ్రామిక సంబంధమైన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కూడ అభివృద్ధి చెందాయి. నాటి సమాజంలో అనేక రకాల పారిశ్రామిక వృత్తులకు చెందిన వివిధ వర్గాలవారు గౌరవ మర్యాదలు పొందేవారు. వారి ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండేవి. ఇనుము, ఉక్కు, వస్త్రాలు, నూనె, దంతం, చర్మ, లోహాలు, కలప, ఆభరణాలు, భవన నిర్మాణం మొదలగు వాటికి సంబంధించిన పరిశ్రమలు ప్రముఖంగా ఉండేవి. పారిశ్రామికాభివృద్ధి వల్ల ఉత్పత్తులు పెరిగి, ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యాయి.

BRAOU

17.20 పరీక్ష నమూనా ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. హరప్పా కాలంలో వాణిజ్యం, పరిశ్రమలను గురించి రాయండి.
2. శాతవాహనుల పాలనలో వాణిజ్యం, పరిశ్రమల అభివృద్ధిని వివరించండి.
3. కుషాణుల పాలనలో వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధిని అంచనా వేయండి.
4. గుప్తుల కాలంలో వాణిజ్యం అభివృద్ధి చెందిన విధానాన్ని వర్ణించండి.
5. గుప్తుల కాలంలో జరగిన పారిశ్రామికాభివృద్ధిని వివరించండి.

II ఈ క్రింది వాటికి లఘు వ్యాఖ్యలు రాయండి.

1. మౌర్యుల కాలంలో వాణిజ్యం మీద ప్రభుత్వ నియంత్రణ
2. శాతవాహనుల కాలంనాటి రేవు పట్టణాలు
3. రోమ్‌తో విదేశీ వాణిజ్యం
4. హరప్పా కాలం నాటి పరిశ్రమలు
5. ఇనుము - ఉక్కు పరిశ్రమ
6. వస్త్ర పరిశ్రమ

BRAOU

17.21 ఉపయుక్త గ్రంథాలు

Agarwal. R.S. : **Trade Centres and Routes in North India** (322 B.C-500 A.D)

Bandyopadhyya. N. : **Economic Life and Progress in Ancient India.**

Buch. M.A. : **Econimic Life in Ancient India.**

Chakraborti. D.K.C. . **The External Trade of the Indus Civilization**

Chakraborty. H. : **Trade and Commerce in Ancient India**

Chandra. Moti : **Trade and Trade Routes in Ancient India**

Chopra. P.N.,Puri.B.N,

and Das.M.N : **A Social, Cultural and Econimic History of India (Ancient)**

Das. D.R : **Econimic History of the Deccan from 1st to 6th century A.D.**

Gupta. P.L. : **The Imperial Guptas (Vol.II)**

Hussaini. H.A.G. : **The Economic History of India**

Maity. S.K. : **Economic Life in Northern India in the Gupta Period (300-500A.D)**

Puri. B.N. : **India under the Kushanas.**

Rai. G.K. : **Ancient Indian Economic Institutions - Part II - Trade and commerce.**

Rawlinson. H.G. : **Intercourse Between Indian and Western World.**

Ray. Aniruddha and

Bagchi. S.K. : **Technology in Ancient and Medieval India.**

Singh. V.B. : **Econimic History of India**

Srivatsava. B. : **Trade and Commerce in ancient India**

Warmington. E.H. : **The commerce Between the Roman Empire and India**

BRAOU

రచయిత : బి. మస్తానయ్య

భాగం 18 - భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ

విషయక్రమం

18.0 లక్ష్యాలు

18.1 పరిచయం

18.2 ఆధారాలు

18.3 పరిణామ క్రమం

18.4 భూస్వామ్య వ్యవస్థను ప్రోత్సహించిన అంశాలు

18.4.1 భూమి పంపణీ విధానం

18.4.2 సామాజిక స్తరీకరణ (Social Stratification)

18.4.3 వర్తక, వాణిజ్యాల క్షీణత

18.4.4 ద్రవ్య విధానం

18.4.5 ఆర్థిక సంబంధ రాహిత్యం

18.4.6 ధర్మ శాస్త్ర నిషేధాలు

18.4.7 సామ్రాజ్యాల క్షీణత

18.4.8 ప్రాంతీయీకరణ

18.5 భూస్వామ్య వ్యవస్థ స్వభావం

18.6 సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలపై భూస్వామ్య వ్యవస్థ ప్రభావం

18.7 సంగ్రహంగా

18.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

18.9 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

18.0 : లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు క్రింది విషయాలను తెలుసుకోగలగాలి

★ భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థను గూర్చి తెలుసుకోడానికి ఉపయోగపడే ఆధారాల సమీక్ష

★ భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులు

★ భూస్వామ్య వ్యవస్థ పరిణామ క్రమం

★ సామాజికార్థిక వ్యవస్థపై భూస్వామ్య వ్యవస్థ ప్రభావం.

18.1: పరిచయం

భూస్వామ్య వ్యవస్థ అనే పదం, ప్రధానంగా మధ్య యుగంలో ఐరోపా దేశాల్లో విలసిల్లిన 'ఫ్యూడలిజం' (Feudalism) అనే సామాజిక, ఆర్థిక జీవన విధానానికి సరిపోల్చదగిన, భారతీయ జీవన విధానాన్ని సూచించడానికి

చరిత్రకారులచే ఉపయోగించబడుతున్నది. స్టబ్స్(stubbs) ప్రకారంగా, భూస్వామ్య వ్యవస్థ సమాజాన్ని భూమి పంపణీ నిధానం ద్వారా సంపూర్ణంగా వ్యవస్థీకరించడం. దీనిలో రాజు మొదలుకొని, అతి కనిష్ఠ స్థాయిలోని భూమి పతనుదారు వరకు అందరూ పరస్పర ఒప్పందం ద్వారా, పరస్పర రక్షణ నియమాల ద్వారా కట్టుబడి ఉన్నవాళ్ళే. ఈ రకమైన కట్టుబడి వల్లనే ఈ వ్యవస్థను 'ఫ్యూడల్ వ్యవస్థ'(Feudal System) అని పిలవడం జరిగింది. ఈ వ్యవస్థ మధ్య యుగపు ఐరోపాలో ఎంతో ప్రాముఖ్యత సంతరించింది. రాచరికం కేవలం నామమాత్రమై, 'పోప్' (Pope) అనగా ప్రధాన క్రైస్తవ పీఠాధిపతి. అధికారం సర్వే సర్వత్ర నియంత్రణాధికారంగా ఉన్నప్పుడు, ప్రాంతీయ ప్రభువులు పోప్ ఆజ్ఞతో పాలిస్తూ, ఆ భూమిని కౌలుదార్లకు ప్రత్యేక ప్రతిపత్తితో పంపణీ చేస్తూ ఉండేవారు. ఈ మొత్తం వ్యూహంలో రాజులు, లార్డు(Lords)లు, మార్క్విస్‌లు(Marquises)లు, బారన్(Baron)లు, స్టివార్డ్ (Stiward)లు వంటి వివిధ ఉద్యోగులు ప్రాంతీయ రాచరిక ప్రతిపత్తిని అనుభవిస్తూ, ప్రధాన భూస్వామి అయిన రాజుకు తమ ఆర్థికపరమైన, సైనికపరమైన లొంగుబాటును వ్యక్తం చేసేవారు. ఈరకమైన కట్టుబాటును ఆధునిక యుగంలో వచ్చిన కొన్ని నిష్ఫలాత్మక పరిణామాలు రద్దుచేయడంతో, జాతీయ రాజ్యాలు, ప్రజాహిత నిరంకుశ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

భారతదేశంలో కూడా, ఐరోపాలోవలెనే, బృహత్ సామ్రాజ్యాలు క్షీణించిన కాలంలో ఇటువంటి పరిణామాలు తలెత్తాయి. ఫలితదృష్ట్యా భారతదేశ సామాజిక, ఆర్థిక పరిణామంలో నిజంగా ఈ రకమైన భూస్వామ్య వ్యవస్థ స్థిరత్వాన్ని పొందిందా లేదా అనే చర్చ తలెత్తి, చాలాకాలం వివాదాస్పదంగా కొనసాగింది. అనేక ఆధారాలు ఈరకమైన భూస్వామ్య వ్యవస్థ పరిణామాన్ని గూర్చి తెలుసుకొనడానికి తోడ్పడుతున్నాయి.

18.2 ఆధారాలు

సామాజిక స్థితిని ఉన్నది ఉన్నట్లుగా తెలిసుకొని, దానిలోని ప్రకంపనాలను అవగాహన చేసుకొనడానికి వివిధ సాహిత్యాధారాలు వర్ణనాత్మక ప్రక్రియల ద్వారా చరిత్రకారునికి తోడ్పడుతున్నాయి. క్రీ.శ.12వ శతాబ్దంలో భట్ట భువనదేవుడు రాసిన 'అపరాజిత పృచ్ఛ' అనే గ్రంథం మహామండలేశ్వరుడు, మాండలికుడు, మహాసామంతుడు, సామంతుడు, బహుసామంతుడు అనే పాలక వర్గీయుల్లోని వైవిధ్యాలను తెల్పుతున్నది. అదేవిధంగా 'శుక్రనీతిసారం' ఆదాయం ప్రమాణంగా వివిధ పాలక వర్గీయులను సామంతుడు, మాండలికుడు, రాజు, మహారాజు, స్వరాట్, సామ్రాట్, విరాట్, సార్వభౌముడు అని పేర్కొన్నది. సామంతునికి సాలీనా 1,00,000 నుండి 3,00,000 వెండి కార్షపణాలు, మాండలికునికి 3,00,000 నుండి 10,00,000 వెండి కార్షపణాలు, రాజుకు 10,00,000 నుండి 20,00,000 వెండి కార్షపణాలు, మహారాజుకు 20,00,000 నుండి 50,00,000 వెండి కార్షపణాలు, స్వరాట్‌కు 50,00,000 నుండి 1,00,00,000 వెండి కార్షపణాలు, సామ్రాట్‌కు 1,00,00,000 నుండి 10,00,00,000 వెండి కర్షపణాలు, విరాట్‌కు 10,00,00,000 నుండి 50,00,00,000 వెండి కార్షపణాలు, సార్వభౌమునికి 50,00,00,000 వెండి కార్షపణాలసైన ఆదాయం ఉండేది.

సాహిత్యధారాల్లో తొలిదశలో ఉన్న ఆధారాల్లో జాతక కథలు ముఖ్యమైనవి. బౌద్ధ మతానికి చెందిన వీనిలో వివిధ ప్రభు వర్గీయులు, రాజోద్యోగులు, వర్తకులు, రైతులు, బానిసలు వంటి వారి స్థితిగతులు వివరించబడ్డాయి. ఈకథలన్నీ గంగా, యమున మైదానంలోని వివిధ నగర రాజ్యాల్లో గల ఆర్థిక వర్గాలు ఏ విధంగా గుర్తింపబడ్డాయో వివరిస్తాయి.

BRAOU

వేరొక ప్రధానమైన ఆధారం జ్యోతిష్య గ్రంథాల్లో లభ్యమౌతున్నదని ఆచార్య బి.ఎన్.ఎస్. యాదవ సోపపత్తికంగా బుజువు చేశారు. స్ఫుజిధ్వజుని, 'యవన జాతకం', 'మీనరాజు' రాసిన 'వృద్ధ యవన జాతకం', వరాహమిహిరుని 'బృహజ్జాతకం', 'లఘుజాతకం', కళ్యాణ వర్మ రాసిన 'సారావళి', నరపతి రాసిన 'నరపతి జయ చర్యాస్వరోదయం' అనే ప్రసిద్ధ జ్యోతిష గ్రంథాలు మొత్తంమీద జ్యోతిష గ్రంథాల్లో వివిధ సూత్రాల్లో చెప్పబడ్డ సామాజిక వ్యవస్థ స్థిరమైంది-సైద్ధాంతికమైంది కాదు. అతివాస్తవికమైంది-ఊహాజనితం కాదు, అభ్యస్తనతిని పొందునది-స్థావరం కాదు' అన్న రీతిలో అనేకాంశాలను విపరిస్తున్నాయి.

జ్యోతిష సూత్రాలు కేవలం ప్రభువులు, సామంతులు, కనిష్ఠ స్థితిలోని భూస్వాములు, రాజోద్యోగులు, వర్తకులు, ధనికులైన కర్షకులు వంటివారిని గూర్చి మాత్రమేకాక, సమాజంలోని ఇతర తక్కువ స్థాయి వ్యక్తులనుగూర్చి, వర్గాలను గూర్చి కూడా వివరిస్తున్నాయి.

ఈ గ్రంథాలేకాక ఇతరాల్లో పేర్కొన దగ్గవి కుషాణుల కాలంలో రాయబడ్డ 'అంగనిజ్జి' బెంగాల్‌లో ప్రసిద్ధి పొందిన 'బృహన్నారద పురాణం', 'దేవీభాగవత పురాణం', 'విష్ణుధర్మోత్తర పురాణం' వంటివి. వీనిలో 'బద్ధహలులు'గాను, 'పరపరిభూతులు' గాను చెప్పబడ్డ రైతులను గూర్చి తెలుస్తుంది. అదేవిధంగా 'మను స్మృతి', 'వృద్ధహరిత స్మృతి' వంటి ధర్మశాస్త్ర గ్రంథాలు కూడా, ఈ వ్యవస్థలోని వివిధ వర్గాలను గూర్చి వివరిస్తున్నాయి.

విదేశీ ఆధారాలైన మెగస్తనీస్ రాసిన 'ఇండిక', ఫాహియన్, హ్యూయెన్‌త్సాంగ్‌లు రాసిన విశేషాలు, 'అల్‌బెరుని' రాసిన వివరాలు సామాజిక స్థితిగతులను ఈ వ్యవస్థ దృష్ట్యా వివరిస్తున్నాయి. ఉదాహరణకు ఫాహియాన్ వైశ్య ప్రముఖులు ప్రత్యేక ప్రతిపత్తిగల కులంగా ఉన్నప్పుడు వారు చూపిన దౌర్యాన్ని, వారి దానవిశేషాలను కొనియాడాడు. కాగా, అల్‌బెరూనీ తన రాతల్లో, బ్రాహ్మణేతరులైన వర్గాల వారందరూ ప్రభువులకు తమ సేవలద్వారా, పన్నుల చెల్లింపుద్వారా లోబడి ఉంటారని పేర్కొన్నాడు.

ఇవేకాక కొన్ని పురావస్తాధారాలు ముఖ్యంగా శాసనాలు, ఈ వ్యవస్థను గూర్చి తెలిసికొనడానికి తోడ్పడుతున్నాయి. మౌలిక్, రోమిలా థాపర్ మొదలగు వారి ప్రకారం, హరప్పా త్రవ్వకాల్లో సంక్లిష్టమైన ధనిక-పేద వర్గీయులకు చెందిన సామాజిక ఆర్థిక స్పర్ధలో సూచింపబడుతున్నాయి.

శాసనాల్లో పేర్కొనదగ్గవానిలో మౌర్య ఆర్జిత వర్మ 'బందోర' తామ్ర శాసనాలు, మైత్రకుల శాసనాలు, చాళుక్యుల, రాష్ట్ర కూటుల శాసనాలు వంటివి స్థూలంగా ఛత్ర, చామర, గజ, తురగ, పల్యంకికాదివాహనాలను, పంచమహాసబ్దాతి భోగాలను గల సామంత ప్రభువులను, ఇతర సామాన్య రైతులను కూడా పేర్కొంటున్నాయి. రైతులను 'కుటుంబినః ఇత్థమాజ్ఞాపయతి' (కుటుంబములుగలవారిని ఈ విధంగా ఆజ్ఞాపింపబడుచున్నారు) అని పేర్కొనడం చాళుక్యుల శాసనాల్లో సర్వసామాన్యమైన విషయం.

ఈ రకంగా ఈ ఆధారాలన్నీ భూస్వామ్య వ్యవస్థలోని మౌలికమైన, అనుషంగికమైన అంశాలను గూర్చి తెలిసికొని, పరిణామ క్రమాన్ని అవగాహన చేసికొనడానికి తోడ్పడుతున్నాయి.

18.3 పరిణామ క్రమం

సామాజికపరంగాను, ఆర్థికపరంగాను పేరొందిన భూస్వామ్య వ్యవస్థ గుప్తుల అనంతర యుగం నుండి అనగా ఇంచుమించు క్రీ.శ. 6వ శతాబ్ద ప్రారంభం నుండి బాగా ప్రస్ఫుటమౌతున్న వ్యవస్థగా రూపొందినప్పటికీ, దాని పరిణామ క్రమం భారతీయ నాగరకత తొలి దశ నుండే ప్రారంభం అయినట్లు కొందరు చరిత్రకారులు రాస్తున్నారు.

వారి ప్రకారం భూస్వామ్య వ్యవస్థ ఏర్పాటు ఒక అసహజమైన, ప్రమాదకరమైన పరిణామంకాక, ఒక సహజమైన, పరిణామ పరిశీలమైన అంశమే.

భారత సమాజంలో తొలి దశలో ఏర్పడ్డ నగరీకరణలోనే ఈ రకం ప్రాబల్యం ఉన్నట్లు గుర్తించారు. ఐరావతీ కార్వే హరప్పా నాగరకత నాటికే, వర్గీకరణ, ముఖ్యంగా వర్ణ వ్యవస్థను పోలిన, ఒక విభజన ఉందని చెప్తూ, అప్పట్లో అంటరానితనం కూడా ఉన్నట్లు ప్రామాణికంగా పేర్కొన్నారు. కాగా, ఎస్.సి.మాలిక్ తన పరిశోధనల్లో హరప్పా నాగరకతలో మత ప్రమాణీతగల పాలకులుండేవారని, వారికి ఒక వీధికూడా కేటాయించారని, చెప్తూ, జన్మ ప్రమాణంగా వర్గ విభజన ఉండేదని, ధనిక పేద వర్గాలకు సంఘర్షణ జరిగిన సూచనలు ఉన్నాయని చెప్పారు. రోమిలా థాపర్ దీనిని బలపరచడమేకాక, అప్పట్లో 'సేవక-సేవిత సంబంధాలను' కూడా పరిశీలించవచ్చని పేర్కొన్నారు. అంటే, ఆ తొలి దశ నగరీకరణలోనే పాలక, పాలిత సంబంధం జన్మ వల్ల, వృత్తి వల్ల ఏర్పడ్డ విభజన ఆధారంగా కూడా నిర్ణయింపబడేదని చెప్పారు.

ఈ దశ సిదప ఋగ్వేద కాలంలో పేర్కొనబడ్డ వర్ణ వ్యవస్థ, ముఖ్యంగా పురుష సూక్తంలో చెప్పబడ్డ నిరాటపురుషుని నుండి జన్మించినట్లు చెప్పడం, కేవలం మలి వేద కాలపు సాంప్రదాయాన్ని సూచిస్తుందని ఎక్కువమంది చరిత్రకారులు పేర్కొనడం గమనించవచ్చు. దీని ప్రకారం వారంతా ఈ వర్ణ వ్యవస్థ ఎప్పుడూ, ఎక్కడా ఆర్యుల ద్వారా భారతీయులకు తెలిసింది కాదని, ఇది పూర్తిగా స్థానికమైన, అనగా భారతీయమైన నమ్మకమేనని ధ్రువీకరించారు. దీని ప్రకారంగా వర్ణ వ్యవస్థలోని 'స్తరత్వం' సమాజంలో సహజమైన వైవిధ్యాన్ని, విభజనను, అంతరాలను సూచిస్తుందని, దీని దృష్ట్యా ఒక వర్గం నుండి వేరొక వర్గానికి ఏర్పడే సంబంధం భూస్వామ్య వ్యవస్థ పరిణామంలో ఎంతో ముఖ్యమైందని గ్రహించవచ్చు. ముఖ్యంగా 'ఆర్య సాహిత్యంలో వాడిన 'దాస', అనే శబ్దం ఊరకమైన అంతరాన్ని స్ఫురింపచేస్తున్నది' అని ఆర్.ఎస్.శర్మ, బి.ఎస్.ఎస్.యాదవ పేర్కొన్నారు.

అనంతర మలి వేద కాలంనాటికి ఎక్కువగా అడవులను నరకడం వల్ల వ్యవసాయిక వ్యవస్థ పరిణమించింది. ఈ వ్యవస్థలోని యజ్ఞయాగాది కర్మలు, ఉపనిషత్తుల్లో జరిపిన సిద్ధాంతపరమైన చర్చలు, ధర్మ సాహిత్యం, సమాజంలోని నిర్ణీతమైన కట్టుబాటును, సంబంధాలను సూచిస్తున్నది.

క్రీ.శ.500 నాటికి బౌద్ధ, జైన మతాలు వర్ణ వ్యవస్థను, యజ్ఞయాగాది కర్మలను ఖండించినా, సమాజంలో గల వర్ణ విధానాన్ని పూర్తిగా తుడిచి వేయలేకపోయాయి.

కాని క్రీ.శ. 4వ శతాబ్దం నాటికి చక్రవర్తి క్షేత్ర నిర్మాణం జరగడం, మగధ రాజ్య ఆవిర్భావం సమాజంలో తప్పనిసరి అంతరాలను ఏర్పర్చాయి. కౌటిల్యుని అర్థశాస్త్రం ప్రకారం కూడా ప్రభువు సంక్షేమ రాజ్యాన్ని నిర్వహించినా, ప్రజల్లో గల వర్గ విభజన స్థూలంగా అంగీకరింపబడిందని తెలుస్తున్నది. రాజకీయ చర్య క్షేత్రంలో మౌర్యుల కాలంనుండి ఏర్పడ్డ పరిపాలక వైనిధ్యం పైనుండి క్రిందకు వివిధ అధికారులను పేర్కొని, వారి పరస్పర చర్య సంబంధాలను, చర్య క్షేత్రాలను చూపించడం జరిగింది.

ఆర్థకుడు బౌద్ధ మతాన్ని సామాన్యుల ద్వారా సంబంధాలను ఎంత వరకు తీసికొని వెళ్ళినా, అతడు అనుసరించిన పాలనా యంత్రాంగం ద్వారా భూస్వామ్య వ్యవస్థకు ఆధారభూతమైన స్తరత్వాన్ని తుడిచివేయలేకపోయాడు.

అందువల్లనే, పుష్యమిత్రుడు అశ్వమేధంచేసి, బ్రాహ్మణ వంశ ప్రభుత్వాన్ని స్థాపించింది మొదలు , గుప్తుల కాలంలోను, ఆ తర్వాత బాగా విస్తరించిన పౌరాణిక హిందూ మత సాంప్రదాయం భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భావానికి ఎంతో తోడ్పడ్డాయి.

BRAOU

అదే విధంగా దక్షిణ పథంలో కూడా శాతవాహన, పల్లవ, చాళుక్య రాష్ట్రకూటల ప్రభువుల కాలాల్లో ఏర్పడ్డ పాలనా యంత్రాంగం భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భావానికి తగిన వ్యూహాన్ని ఏర్పర్చగలిగింది.

18.4 భూస్వామ్య వ్యవస్థను ప్రోత్సహించిన అంశాలు

ఈ క్రింది అంశాలు భూస్వామ్య వ్యవస్థను ప్రోత్సహించినట్లు గుర్తించగలం.

18.4.1 భూమి పంపణీ విధానం:

పౌరాణిక హిందూ మతం బాగా వ్యాప్తి చెందిన దగ్గర నుండి భూమి పంపిణీ విధానంలో విశేషమైన మార్పు వచ్చింది. ధర్మార్థ కామ మోక్షాలను సాధించడానికి యజ్ఞయాగాదులకు బదులుగా, బ్రాహ్మణేతర వర్ణాలకు సప్త సంతానాలను ఏర్పర్చారు. సప్త సంతానాలు అనగా వాపి, కూప, తటాక, ఆరామ, దేహ, లయ, అగ్రహార, కావ్యములు ఒక వ్యక్తి పేరున ఉండటం. వానిలో గల అగ్రహారం ఏర్పాటు అనేది దేవతల పేరుగా ఇచ్చిన దేవదేయాలను, వేద, శాస్త్ర, పురాణ, ఇతిహాస, ధర్మనాదుల్లో పండితులైన బ్రాహ్మణులకు ఇచ్చిన బ్రహ్మదేయాలను ఏర్పడేటట్లు చేసింది. వీనికి తోడుగా కార్మికులకు ఇచ్చిన భోగాలను కూడా చూడవచ్చు. వీనన్నింటిని సాధారణంగా 'అష్టభూగతేజస్వామ్యం'గా ఇవ్వడం జరిగింది. అనగా నిధి, నిక్షేప, జల, పాషాణ, అక్షణ, ఆగామి, సిద్ధ, సాధ్యములైన అన్నిరకాల ఆదాయాలను ప్రభుత్వం వివిధ వ్యక్తులకు ధారాదత్తం చేసింది. ఒక్కొక్కసారి ప్రభుత్వం పన్ను వసూలు అధికారాన్ని కూడా రద్దుపర్చుకోవడం జరిగింది. దానిని 'సర్వకరపరిహారేణ' అని శాసనాల్లో పేర్కొన్నారు.

అంతేగాక:

'స్వదత్తా ద్విగుణంపుణ్యం పర దత్తాను పాలనం

పర దత్తా పహారేణ స్వదత్తం నిష్ఫలం భావేత్'

(ఇతరులు ఇచ్చిన దానిని రక్షించడం వల్ల తమ దానం కన్న రెట్టింపు ఫలితం వస్తుంది. ఇతరులు ఇచ్చిన దానిని రద్దుచేసినచో, తన దానం కూడా నిష్ఫలం అవుతుంది) అనే నిధిని:

'వస్వదత్తాం పర దత్తాం వా యోహరేఖి వసుంధరాం

షష్టివర్ష సహస్రాణి విష్ఠా యాంజాయతే క్రిమిః'

(తనచే ఇవ్వబడిన, లేదా ఇతరులచే ఇవ్వబడిన భూమిని అపహరిస్తే, ఆరు వేల ఏండ్లు క్రిమిగా జన్మిస్తాడు)

అనే నిషేధం ఏర్పర్చడం ద్వారా, బలవంతులైన భూస్వాములు ఆర్థిక బలంలో అవతరించారు. గుజరాత్‌ను ఏలిన మైత్రకులు గుప్తుల నుండి దానాలు పొందినవారే. అదేవిధంగా దక్కన్‌లో సైనిక సేవలకు ప్రతిఫలంగా ఏర్పర్చిన గ్రామదానాలు కాలక్రమంలో చిన్న చిన్న రాజ్యాలుగా, భూస్వామ్య వ్యవస్థకు కేంద్రాలుగా ఏర్పడడానికి అవకాశం

BRAOU

వచ్చింది. కేంద్ర ప్రభుత్వానికి, స్థానికులకు మధ్యగల సంబంధాలు, ప్రతిగ్రహీతలకు పరిపాలన, ఆర్థికపరమైన స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా దెబ్బతిన్నాయి.

18.4.2 సామాజిక స్తరీకరణ (Social Stratification)

పౌరాణిక హిందూ సాంప్రదాయం ప్రకారం పునర్వ్యవస్థీకరింపబడిన సమాజంలో, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులతో కూడిన వ్యవస్థ ఏర్పడింది. దీనిలో క్షత్రియులు బలహీనులవడం, వైశ్యులకు, శూద్రులకు ఇంచుమించు సామాజికపరమైన గుర్తింపుపరంగా భేధం లేకపోవడం, కాయస్థులు మొదలైన కొత్త కులాలవారు ఏర్పడడం, సమాజంలో వైవిధ్యానికి అవకాశం ఇవ్వడమేకాక, వివిధ వర్గాల మధ్యగల సంబంధాలను తిరిగి నిర్వచించవలసిన అవసరం ఏర్పడింది.

గుప్తుల కాలంలో, ఫాహియాన్ పేర్కొన్నట్లు, ఎంతో లబ్ధి ప్రతిష్ఠలైన వైశ్యులు తమకుగల శక్రధ్వజం వంటి ప్రత్యేకతలను కోల్పోయి, అల్‌బెరుని గుర్తించినట్లు, శూద్రులతో సమంగా ప్రభుత్వానికి పన్నులను చెల్లించడమేకాక, సేవలను అందించవలసిన స్థితి కూడా దాపురించింది. ఈ రకమైన సామాజిక స్తరీకరణలోని పరిణామం కేంద్రీకృతమైన రాచరిక వ్యవస్థకు, బదులుగా వికేంద్రీకృతమైన వ్యవస్థకు అవకాశం ఇచ్చింది.

18.4.3. వర్తక-వాణిజ్యాల క్షీణత

రోమన్ సామ్రాజ్య పతనం పిదప భారతదేశంలో వర్తకపరంగా క్షీణత ప్రారంభమైంది. రోమన్ సామ్రాజ్యానికి జరిపే ఎగుమతులు అన్నీ ఆగిపోవడం వల్ల, తీరప్రాంతాలైన ఓడరేవులో తమ ఆర్థిక వ్యక్తిత్వాన్ని కోల్పోయాయి. ఈ స్థితిలో తీరప్రాంతాలలోని ఓడరేవులకు, పట్టణాలకు కేంద్రప్రాంతంలోని, దానికి పరిసరాలలోనున్న నగరంతో సంబంధాలు క్షీణించడం వల్ల, వర్తక వ్యవస్థ క్షీణించి, హరప్పా వర్తక వ్యవస్థ క్షీణత పిదప నీవిధంగా ఆర్యులకు చెందిన వ్యవసాయిక వ్యవస్థ ఆవిర్భవించిందో, మరల వర్తక వ్యవస్థ క్షీణత పిదప వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థ పునరుత్పన్న మైంది.

18.4.4 ద్రవ్య విధానం

ఈ పరిస్థితులలో ప్రభుత్వ ద్రవ్య విధానం కూడా ఎంతో పరిగణనీయమైన మార్పు పొందింది. గుప్తుల కాలం పిదప బంగారు నాణాల తయారీ బాగా తగ్గిపోయింది. క్రీ.శ. 650 నుండి 100 వరకు పూర్తిగా ద్రవ్య నిధులు లభ్యంకాకుండా పోయాయి. ఈరకమైన ఆ ద్రవ్య కరణ విధానం (demonetisation) మారక వ్యవస్థలో వస్తుమార్పిడి విధానానికి అవకాశాన్ని తెచ్చింది. అంతేకాక గుప్తుల యుగం పిదప ఏర్పడ్డ ఈ పరిస్థితులు నగరీకరణ క్షీణతకు కూడా తోడ్పడ్డాయి. నగరాలు ఎప్పుడైతే సంఖ్యాపరంగా తగ్గుతూ వచ్చాయో గ్రామాల సంఖ్యా పరమైన పెరుగుదల, దానితోబాటుగా గ్రామీణమైన వృత్తులతో కూడుకొన్న వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థ వ్యాప్తి తప్పనిసరి ఫలితాలుగా భారతీయ సామాజిక-ఆర్థిక వ్యవస్థలో సంభవించాయి.

18.4.5 ఆర్థిక సంబంధరాహిత్యం

గ్రామాల అభివృద్ధి నగరాల క్షీణత వల్ల, ఒకదానితో ఇంకొకదానికి ఆర్థికంగా సంబంధంలోని చిన్న చిన్న ప్రాంతీయ సమాజాలు, గ్రామీణ సమాజాలు ఆవిర్భవించాయి. శ్రామికులు ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి వలసపోవడం అరుదైంది. ఒకే సర్వకర సహితంగా ఉన్న గ్రామాలనుండి సర్వకర పరిహారంగా ఉన్న గ్రామాలకు శ్రామికులు వలస పోవడం నిషిద్ధమైంది. అంతేగాక ప్రతి గ్రామం తనదైన ఉత్పాదక వ్యవస్థను, మారక వ్యవస్థను ఏర్పరుచుకొని, స్థానిక పాలకుల అధికారానికి పరిమితమైన చిన్న చిన్న రాజకీయ సమూహ్యాలుగా రూపొందడం జరిగింది. ఈ స్థితిని, వాస్తవానికి, 'భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భావానికి ఒక ఫలదీకరణ దశ' అని అభిష్టంచవచ్చు. కారణం పరిమితమైన వనరులు, పరిమితమైన శ్రామిక శక్తి, పరిమితమైన మారక వ్యవస్థ అన్నీకూడా పరిమిత రాజకీయ పరిధిలో నిర్దేశింపబడటం భూస్వామ్య వ్యవస్థలోని మౌలిక లక్షణం. ఈ లక్షణానికి ఆర్థిక సంబంధరాహిత్యం అనేది ఎంతో తోడ్పడింది.

PRAOU

18.4.6 ధర్మశాస్త్ర నిషేధాలు

ఈ స్థితిలో మనం గమనించదగ్గ ఇంకొక అంశం ధర్మశాస్త్రాలు ఏర్పర్చిన నిషేధాలు. సముద్రయానం పూర్తిగా నిషేధింపబడింది. సముద్రయానం చేసిన వారిని శ్రాద్ధంలో పూర్వపంక్తికి పిలవరాదని స్మృతులు ఆదేశించాయి. అంతేగాక దూరప్రాంతాలతో నివాహపరమైన సంబంధాలు ఏర్పర్చుకొనడం నిషేదింపబడింది. దూర ప్రాంతాల్లో ఉన్న పుణ్యక్షేత్రాలకు తీర్థయాత్రలు చేయరాదని కూడా ధర్మశాస్త్రాల్లో చెప్పబడింది. ఈ పరిణామం ఆర్థిక సంబంధాలులేని ప్రాంతీయ సమాజాల్లో సామాజిక, నైతిక జీవనాలను నియమించే ప్రయత్నమే.

18.4.7 సామ్రాజ్యాల క్షీణత

గుప్త సామ్రాజ్యం పిదప 'త్రిసముద్రతోయ పీత వాహనులు' (మూడు సముద్రాలలో నీరు త్రాగిన వాహనాలు గలవారు). 'చతురదధి మేఖలా' (చుట్టబడిన భూమండలాన్ని ప్రారంభించేవారు) వంటి సార్వభౌములు, వారేర్పరచిన రాజకీయాధికారాలు క్షీణించాయి. అంతేగాక అశ్వమేధంవంటి యజ్ఞాలు క్రీ.శ. 5, 6 శతాబ్దాల్లో హెచ్చుగా ఉన్నప్పటికీ, 'హూణుల' దండయాత్రల పిదప వాటి ఔన్నత్యాన్ని, ఉనికిని కోల్పోయాయి. హర్షవర్ధనుడు సకలోత్తర పధానాదుడై పాలించినా, అతడు అనుసరించిన బౌద్ధసాంప్రదాయం మరల కొన్ని మార్పులను తీసికొని వచ్చింది.

18.4.8 ప్రాంతీయీకరణ

గతిశీలతలేని కార్మిక శక్తి, చలన శీలత లేని వివిధ సామాజిక వర్గాలు ఒకే ప్రాంతంతో పూర్తిగా ముడివడి జీవించడంతో, ఆయావసరులను సమతౌల్యబద్ధంగా పంపిణీ చేయడంలోను, నినియోగించుకొనడంలోను అనివార్యమైన ప్రాంతీయీకరణ ఏర్పడింది. సమాజంలో ధర్మశాస్త్రాల నిషేధాలు, వర్తక క్షీణతవంటి అంశాలు అనుత్ప్రేరక స్థితిని కల్పించడం వల్ల గ్రామ సమాజాలు, విషయ సమాజాలు ఆవిర్భవించాయి.

ఈ సమాజాలలో పాలనా విధానం ఇంకా ప్రభు కేంద్ర వ్యవస్థకే చెందినది కావడం వల్ల, ప్రభువుకు నచ్చిన కొందరు స్థానిక భూస్వాములు సైనిక, ఆర్థిక, పాలనాపరమైన నిధులను, హక్కులను పొంది, పాలకులుగా అవతరించారు. ఈ అవతరణనే భూస్వామ్య వ్యవస్థ ప్రాదుర్భావంగా మనం గుర్తించవచ్చు.

18.5 భూస్వామ్య వ్యవస్థ స్వభావం

భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థను గూర్చి కొశాంబి వ్యాఖ్యానిస్తూ, రెండు రకాలైన భూస్వామ్య పద్ధతులను పేర్కొన్నారు. వానిలో తొలిది భూస్వామ్య వ్యవస్థలో ఎగువనుండి దిగువకు జరిగే పరిణామం. ఒకే రాజ్యంలో ఉండే చిన్న చిన్న ప్రభువులంతా పెద్దరాజుకుగాని, చక్రవర్తికిగాని సన్ను చెల్లిస్తూ, పన్ను చెల్లిస్తున్నంత కాలం స్వంతదారుల్లా ఆ ప్రాంతాలను పాలించుకొనేవారు. వీరు కొన్ని అటవి తెగలకు చెందిన నాయకులుగా కూడా ఉండేవారు. భూనిపై యాజమాన్యం హక్కుగలిగిన వేరొక వర్గంవారి ప్రమేయం లేకుండానే, వీరు భూమిని

ప్రత్యక్ష పాలన ద్వారా పాలించేవారు. ఈ విధానాన్నే ఎగువ నుండి దిగువకు పరిణమించే భూస్వామ్య వ్యవస్థ అని కొశాంబి పేర్కొన్నారు.

భారతదేశంలో ఉండే ఈ రకమైన భూస్వామ్య వ్యవస్థను ఐరోపాలో ఉండే వ్యవస్థతో సరిపోల్చడం వల్ల, ఇక్కడి భూస్వామ్య వ్యవస్థ స్వభావాన్ని అవగాహన చేసికొనవచ్చు.

మేరియన్ గిబ్స్ ఐరోపాలోని భూస్వామ్య వ్యవస్థలో ఈ క్రింది లక్షణాలను సూచించాడు.

1. అతి తక్కువ స్థాయి సాంకేతిక విజ్ఞానం.
2. కేవలం నిత్యావసరాలకే పరిమితమైన, వర్తకంకోసం కాని ఉత్పత్తి విధానం.
3. భూస్వామ్య సాగుబడి నేలలో వ్యవసాయాన్ని తప్పనిసరిగా నిర్వహించడం.
4. రాజకీయ వికేంద్రీకరణ.
5. కొన్ని ఇదమిత్థమైన సేవాపరమైన షరతులతో కూడా కొన్ని ఒప్పందం ద్వారా భూమిపై యాజమాన్యాన్ని కలిగి ఉండడం.
6. స్థానిక ప్రభువులకు వారి పాలితులపై న్యాయపరమైన అధికారాలుండటం.

కాని భారతదేశంలో, ఏవో కొన్ని శతాబ్దాల్లో మినహా, ఎప్పుడూ ఉత్పత్తి విధానం కేవలం ప్రాంతీయ అవసరాలకోసం పరిమితం కావడం జరగలేదు. నగరీకరణ మాత్రం కొంతకాలం క్షీణత పొందినా, విదేశీ వాణిజ్యం సామ్రాజ్యంలో తగ్గినా, తూర్పు దేశాలతో వాణిజ్యం కొనసాగుతూనే ఉంది. భారతదేశంలోగల భూస్వామ్య వ్యవస్థ కాలంలో సాంకేతిక పరిణామాన్ని కూడా విశేషంగా చూడవచ్చు. ముఖ్యంగా ఆలయ నిర్మాణాల వంటి ఉదాహరణలు ఏరకంగా శిల్పం, వస్తువువంటి శాస్త్రాలు సాంకేతిక విధానాలు పెంపొందాయో తెల్పుతున్నాయి. ఉత్పాదక శక్తుల పెరుగుదల, చేతి వృత్తులలో గల సాంకేతిక పరిణామం, వర్తక వినియోగ వస్తువుల మధ్యగల సంబంధాల్లో మార్పు భారతీయ భూస్వామ్య వ్యవస్థను ఒక విలక్షణమైందిగా తీర్చిదిద్దాయి. పశ్చిమ ఐరోపాలోని భూస్వామ్య వ్యవస్థ తొలిదశలో రైతుల బానిసత్వాన్ని సూచించే కట్టుబానిస విధానంతో కూడిన దాస్యం, భారతదేశం లోని ఉత్పాదక సంబంధాల్లో ఎప్పుడూ లేదని, ఆచార్య. నిహార్ రంజన్ రే కూడా పేర్కొన్నారు. హర్బన్స్ ముఖియా దీనిని 'ఆసియా శైలికి చెందిన ఉత్పాదక విధానం'(**Asiatic Mode of Production**) అని వివరించారు. కాగా, నూర్ ఉల్ హసన్, 'భారతదేశంలో సమాజం వాస్తవంగా భూస్వామ్య వ్యవస్థాపరమైంది కాదు. కేవలం వ్యవసాయిక ఉత్పత్తి దృష్ట్యా మాత్రమే దానిని భూస్వామ్య వ్యవస్థ అనవచ్చు' అని పేర్కొన్నారు. ఎబాల్కిన్ వ్యాఖ్యానిస్తూ, 'భూస్వామ్య సంబంధాలు వర్గపరమైన హోదాలతోను, రైతులకు భూమికిగల యావజ్జీవ సంబంధంతోను, సామాజిక అభివృద్ధి దశను సూచించినా, ఉత్పాదక శక్తుల పెరుగుదలను అరికట్టినవి', అన్నారు. ఆ అభిప్రాయం ప్రకారం చూసినా, భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ ఐరోపా శైలికి చెందిన భూస్వామ్య వ్యవస్థ కాదని, ఇది ఒక భారతీయమైన ఆర్థిక పరిణామానికి సూచన అని అనవచ్చు. మత ప్రమేయంలేని, వర్ణపరమైన అంతరాల ద్వారా నిర్దిష్టమైన ఉత్పాదక విధానంతో కూడుకున్న ఈ వ్యవస్థలో సార్వభౌములు, రాజాధిరాజులు లేకపోయినా మహామండలేశ్వరులు, మండలేశ్వరులు పాలనా సాంప్రదాయాలను కొనసాగించడమే దీని స్వభావం, స్వరూప ఈ వ్యవస్థలో గుర్తింపబడిన సేవకా వృత్తిపర దాసత్వాన్ని సూచిస్తుందేకాని, తాత్కాలికమైన భూయాజమాన్య హక్కులను గాని, దానితో మాత్రమే కూడిన పాలక-పాలిత సంబంధాన్ని కాని సూచించదు. దీని దృష్ట్యా భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ ఒక ప్రత్యేక ఆర్థిక స్థితిని సూచిస్తుందని గ్రహించవచ్చు.

BRAOU

18.6 సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలపై భూస్వామ్య వ్యవస్థ ప్రభావం

సామాజిక పరంగా భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భావం వల్ల, గ్రామ వ్యవస్థ ప్రధాన ప్రమాణంగా రూపొందింది. గ్రామాల్లో వారివారి నివాసాలను కూడా ఇదమిత్థంగా వర్గీకరించడం జరిగింది. 'మయమతం' అనే వాస్తు శాస్త్ర గ్రంథంలో భూమిని ఏలేరాజు పదకొండు అంతస్తుల ఇంట్లో ఉండాలని, బ్రాహ్మణులు లేదా ద్విజాతివారికి తొమ్మిది అంతస్తుల ఇల్లు ఉండాలని, సామాన్య ప్రభువులు లేదా నృపులు ఏడు అంతస్థుల ఇల్లు కలిగి ఉండాలని, వైశ్యులు, సైనికాధికారులు నాలుగు అంతస్థుల ఇళ్ళలో ఉండాలని, శూద్రులు మూడు అంతస్తుల ఇళ్ళలో ఉండాలని, సామంత ప్రముఖులు మొదలగువారు ఐదంతస్థుల ఇళ్ళలో ఉండాలని పేర్కొన్నది. కాగా, 'అపరంజిత పృచ్ఛ' అనే గ్రంథంలో మహామండలేశ్వరుడు, మాండలికుడు, మాహాసామంతుడు, సామంతుడు, లఘుసామంతుడు అనే వివిధ పాలక వర్గీయులు తొమ్మిది రకాలైన నివాసాల్లో ఉన్నట్లు పేర్కొనడం జరిగింది. ఈ రకమైన విభాగం సమాజంలోని పాలనాపరమైన అంతరాలను గృహనిర్మాణాల పరంగా సూచిస్తుంది.

కాగా, సమాజంలో వర్ణపరంగా ఇతరాలైన అంతరాలు సంభవించాయి. పెద్ద పెద్ద యాజమాన్యపు హక్కుగల భూస్వామ్యులు సమాజంలో వివిధ చిహ్నాలచేత గుర్తింపబడ్డారు. సామంత ప్రభువులుగా ఉన్నవారు ఛత్రం, చామరం, అశ్వములు, గజములు, పల్యంకికలు, పంచమహాశబ్దములు వంటి చిహ్నాలను కలిగి ఉండేవారు. కాగా, చక్రవర్తులు, మహాసామంతులు, సామంతులు వంటివారు మాత్రం ఇళ్ళకు సింహద్వారాలు కలిగి ఉండవచ్చని, ఇతరులకు అరకమైన హక్కులేదని తెలుస్తున్నది.

ప్రభువులు వర్తకులకు, వృత్తిపని వారికికూడా ప్రత్యేక గౌరవాలను, గుర్తింపు చిహ్నాలను ఇవ్వడం జరిగింది. పల్లవుల కాలంలో కవచకారులకు భూభాగాలను ఇస్తున్నట్లు కూమార విష్ణుని చందలూరు శాసనంద్వారా తెలుస్తున్నది.

సేన వంశానికి చెందిన విజయసేనుని కాలంలో, 'శూల పాణి' అనే వృత్తి సంఘ ప్రముఖులకు 'రణకుడు' అనే బిరుదు ఇచ్చినట్లు తెలుస్తున్నది. అదే విధంగా క్షత్రియులకు, కాయస్థులకు, ఠాకూరు, రావుత్తు, నాయకుడు అనే బిరుదులు ఇచ్చినట్లు తెలుస్తున్నది.

ఈ కాలంలోనే కొన్ని ప్రత్యేక కులాలు కూడా అవతరించాయి. మధ్య యుగంలో విస్తృతంగా నిర్వహింపబడిన భూమి పంపకాలు కాయస్థులనే ఒక ప్రత్యేక 'వ్రాయసగాళ్ళ' కులం అవతరించడానికి తోడ్పడినవి. రానురాను బ్రాహ్మణులను కూడా కాయస్థ వృత్తికి నియమించినట్లు తెలుస్తున్నది. అలాగే ఉత్తర భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో, 'మహత్తరులు' అనబడే గ్రామాధిపతుల వర్గం ఆవిర్భవించింది. పశ్చిమ భారతదేశంలో, 'నట్టకిలు' అనబడే గ్రామాధిపతులు ఆవిర్భవించారు. దక్కన్‌లో 'గావుండులు' అనబడే వర్గం అవతరించింది.

సమాజంలో వచ్చిన ఈరకమైన పరిణామాల్లో వైశ్య, శూద్రులకు స్థితిగతులలో మార్పులు వచ్చాయి. గుప్తుల అనంతర కాలంలో అనగా ఇంచుమించు క్రీ.శ.500 నుండి శూద్రులు బానిసలుగాను, చేతివృత్తుల వారిగాను, వ్యవసాయిక శ్రామికులుగానో మాత్రమే కాక, వైశ్యులవలె వ్యవసాయదారులయ్యారు. హ్యుయన్‌త్సాంగ్ శూద్రుల మధ్య వివక్షలేదని పేర్కొన్నాడు. ఈ పరిణామం క్రీస్తు శకారంభం నుండి సంభవించింది. ఆరవ శతాబ్దం నాటికి వైశ్యులు వ్యవసాయిక కులంగా తను గుర్తింపు కోల్పోయారు. వైశ్యులను, శూద్రులను-ఇరువురనూ వైదిక పఠనానికి నాలుక ఖండించే శిక్షకు గురి చేసేహరని అల్‌బెరూని పేర్కొన్నాడు. ఈ ప్రత్యేక పరిణామం కేవలం వాణిజ్య

BRAOU

వ్యవస్థలోని క్షీణతవల్ల సంభవించిందే.

అంతేకాకుండా, ఈ పరిణామాలలోనే వివిధ ఉపకులాలు ఆవిర్భవించాయి. బ్రాహ్మణులలో గోత్రం, మూలం, వంశం, ప్రాంతం ప్రధానంగా గల ఉపశాఖలు ఆవిర్భవించాయి. కాయస్థులవంటి 56 ప్రధానమైన ఉపశాఖలను బెంగాల్‌లో చూడవచ్చు. క్షత్రియులుగా తమనుతాము పేర్కొన్న రాజపుత్రులనే వేరొక శాఖ ఆవతరించింది.

కుల వ్యవస్థలో ఈ రకమైన పరిణామాల్లో ఔన్నత్యాన్ని గుర్తించడానికి వేర్వేరు విధానాలు వచ్చాయి. చాళుక్యులు తమను తాము, 'అశ్వమేధావ బృథస్నాన పవిత్రీకృతపుష్కలం' (అశ్వమేథం చివర జరిపే స్నానం ద్వారా పవిత్రంచేసి కొన్న శరీరంగల వారం) అని, 'చంద్రవంశస్థులం' అని పేర్కొన్నారు. చోళులు 'వరయూరు పట్టణాధీశ్వరులమని' 'దినకర కులతిలకుల' మని చెప్పుకొన్నారు. రైతులు తమ ఔన్నత్యాన్ని నిలుపుకొనడానికి 'ఖల యజ్ఞం' అనే విధానాన్ని నిర్వహించినట్లు తెలుస్తున్నది. 'ఖల యజ్ఞం' అనే పదం సంస్కృత నిఘంటువులలో పేర్కొనబడలేదని, హేమచంద్రుడు, 'దేశీనామమాల' లో పేర్కొన్న 'ఖలభిక్ష' అనే పదం దీనికి సమమై ఉంటుందని బి. ఎస్. ఎస్. యాదవ పేర్కొన్నారు. దీని ఉద్దేశ్యంనూతనంగా వచ్చిన కులస్థులు, ప్రధానంగా వ్యవసాయక వృత్తులవారు గుర్తింపు పొందడమే.

ఈ పరిణామాల్లో గుర్తింపదగిన ఇంకొక అంశం బానిస వ్యవస్థ. అనేక మంది చరిత్రకారులు భారతదేశంలో బానిస వ్యవస్థ పరిణామాన్ని కూడా సూచిస్తున్నారు. ఐరావతి కార్వే హరప్పా నాగరికతలో అంటరానితనం ఉండేదని చెప్పగా, ఋగ్వేదంలో వాడబడిన 'దాసుడు' 'దస్యుడు' అనే పదాలు సేవకులను సూచిస్తాయని పేర్కొనడం జరిగింది. జ్యోతిష గ్రంథాల్లో వాడబడిన 'బహుభృత్యధనః' (అనేక మంది సేవకులను ధనంగా కలవాడు), 'జనధన సంపదాయే' (సేవకులు, డబ్బుతో కూడిన సిరిని), 'ధనజన సంపద్యుతో' (డబ్బు, సేవకులతో కూడిన సిరి గలవాడు), 'సుఖధన జనసహక యశెభాక్' (భోగములు, డబ్బు, సేవకులు, వాహనములు, కీర్తితో ప్రకాశించువాడు) వంటి పదాలలోని 'భృత్య', 'జన' అనేపదాలు సేవకులను, లేదా బానిసలను సూచిస్తాయని యాదవ పేర్కొన్నారు. అదేవిధంగా 'విష్టికార' అనే పదం వెట్టిచాకిరీ చేసేవారికి పర్యాయపదంగా 'బృహజ్జాతకం'లో వాడబడింది. ఈ 'విష్టి' అనేదాన్ని ఒకరకమైన పన్నుగా కూడా గుర్తించడం జరిగింది. మౌర్యుల కాలంలోను, ఆ పిదప కూడా 'విష్టి' అనేది ఒక ఆదాయాధారంగా పరిణమించింది. మౌర్య ప్రభుత్వంలో ఈ రకమైన చాకిరీకి తగిన పనివారిని సమకూర్చడానికి అనువుగా 'విష్టి' బంధకుడు అనే ఉద్యోగి కూడా ఉండేవాడు. అర్థ శాస్త్రంలో ఉపయోగింపబడిన 'విష్టి ప్రధానీ' 'కోశవిష్టి' 'విష్టిర్వాహన' 'కర్మంతోవిష్టి', 'విష్టికార ప్రతీకారం', 'హిరణ్య విష్టి' వంటి పదాలు ఈ 'విష్టి' అనేది సర్వసామాన్యమైందని చూపిస్తున్నాయి. బుద్ధఘోషుడు క్రీ.శ. 5వ శతాబ్దంలో రాసిన 'మహాసుసీన జాతకం', ప్రకారంగా, గ్రామీణులు వెట్టిచాకిరీతో దోచుకోబడేవారని తెలుస్తున్నది. ఈ రకమైన విష్టికారులను, అనగా వెట్టిచాకిరీ చేసేవారిని, 'పదపరిభూతులు' (ఇతరులచే అవమానింప బడే వారు) అని కళ్యాణ వర్మ 'సారావళి' లో పేర్కొన్నాడు. ఈ రకంగా వెట్టిగా సాగుచేసేవారిని 'బద్ధహాలులు' అని బృహన్నారదీయ పురాణం పేర్కొంటున్నది. మనుస్మృతికి భారుచి రాసిన వ్యాఖ్య వలన వైశ్య, శూద్రులనుండి బలవంతంగా పని చేయించుకోవచ్చు (బలాత్కారయితవ్యో) అని తెలుస్తున్నది. ఈ ప్రమాణం ప్రకారం చూచినట్లయితే, దాసత్వాన్ని స్మృతిపరంగా కూడా అంగీకరించినట్లు గ్రహించవచ్చు. కొన్ని రకాల దానాలలో విష్టిని రద్దు చేసినట్లు గ్రహించవచ్చు. ఉదాహరణకు కాటవ రెండవ ప్రవరసేనుని యుమక్ తామ్ర శాసనాలు ఈ రకమైన విష్టిని రద్దుచేశాయి. కాగా రెండవ ధారసేనుని పాలితానా తామ్రశాసనాలు, మొదటి శీలాదిత్యుని నవలఖి తామ్రశాసనాలు వంటివి రాజుకు విష్టిని పొందే హక్కుతోనే దానం ఇచ్చినట్లు సూచిస్తున్నాయి.

BRAOU

క్రీ.శ. 6వ శతాబ్దంలో అలెగ్జాండ్రియాలో భారతీయ ఖొజ్జాలను పన్ను వసూలు చేసి దిగుమతి చేసి కొనేవారని, 'జస్టినియన్ లా డైజెస్ట్' (Justinian La Digest) తెల్పుతున్నది. అదే విధంగా లోర్నియోనుండి, ఇతర ఆగ్నేయ ఆసియా ప్రాంతాలనుండి నల్ల బానిసలు భారతదేశానికి దిగుమతి అయినట్లు తెలుస్తున్నది. కాని ఈ బానిస వ్యాపారం స్థానికమైన భారతీయ ధర్మశాస్త్రాలలో పేర్కొనబడలేదు.

అరబ్బుల, తురుష్కుల సంపర్కంతో ఈ బానిస వ్యాపారం ఎంతగానో అభివృద్ధి చెందింది. క్రీ.శ.14వ శతాబ్దానికి చెందిన లేఖన పద్ధతి ప్రకారం యుద్ధాల్లో ఆక్రమిత ప్రాంతాల్లో లొంగదీసికొన్న స్త్రీలను సైనికులను కూడా బానిసలుగా అమ్మేవారని తెలుస్తున్నది. కాని క్రీ.శ.8వ శతాబ్దం దాకా ఈ విధానం వ్యాప్తిలో ఉన్నట్లు మనం చెప్పడానికి తగిన ఆధారాలు లేవు.

కాగా, మత విధానంలో కూడా సామాజిక అంతరాలు ప్రతిబింబించినట్లు గమనించగలం. ఉదాహరణకు వజ్రయానంలో మూలంగా గల 25 మంది బోధిసత్వాలు, వారిపై నగల ఏడుగురు మానుషి బుద్ధులు, వారిపైగల ఐదుగురు ధ్యాన బుద్ధులు, అందరి కంటేపైన వజ్రసత్వుడు అనే త్రికోణాత్మకమైన నమూనా సమాజంలోని వివిధ అంతరాలను ప్రతిబింబిస్తుంది.

మొత్తం మీద ఈ భూస్వామ్య వ్యవస్థకాని భూస్వామ్య వ్యవస్థ, వర్ణ వ్యవస్థ ద్వారా ఏర్పడ్డ సామాజిక అంతరాలను మతప్రమేయతలేని, మరింత లౌకిక ప్రయోజనంతో కూడిన రీతిలో పెచ్చుగా మార్చడమే కాక, ఆరకమైన వ్యవస్థీకరణను అతి సహజంగాను, గ్రామీణ, విషయసమాజాలంలో ప్రధాన నిర్ణీయ కాలశం గాను ఉండేటట్లు పరిణమింపచేసింది.

18.7 సంగ్రహంగా

భారతదేశంలో పౌరాణిక హిందూ మత వ్యాప్తి వల్ల ఏర్పడ్డ భూమి పంపణీ విధానంలో మార్పులు, సామాజిక స్తరీకరణలో ఏర్పడ్డ నూతనత్వం, రోమన్ సామ్రాజ్య పతనం వల్ల ఏర్పడ్డ వర్తక, వాణిజ్యాల క్షీణత, దానినమసరించిన అద్రవ్యీకరణ విధానం,పరస్పరం ఆర్థికంగా సంబంధంలోని వివిధ భౌగోళిక పాలనా మండలాల ఏర్పాటుకు అవకాశం ఇచ్చాయి. అంతవరకు ఉన్న గొప్ప, గొప్ప సామ్రాజ్యాలు క్షీణించి, ప్రాంతీయీకరణ సర్వసామాన్యమైన దశలో ఒక భూయాజమాన్య వ్యవస్థ ఆవిర్భవించింది. దానిని భారతీయ చరిత్రకారులు ఐరోపాలో మధ్యయుగంలో విలసిల్లిన మత ప్రమేయంగల భూస్వామ్య విధానంతో సరిపోల్చడానికి యత్నించారు. ఆ ప్రయత్నం ఎంతో కాలంగా చరిత్రలో ఒక సమస్యగాను, వివాదంగాను ఏర్పడింది. కాని కేవలం పూర్తి భారతీయత ప్రతిబింబించే ఈ వ్యవస్థను ఐరోపా వ్యవస్థతో సరిపోల్చలేం. ఈ వ్యవస్థ వల్ల సమాజంలో వివిధ అంతరాలు సంభవించాయి. పాలకులలో మాండలికుడు, సామంతుడు, లఘుసామంతుడు వంటి వర్గాలు, కాయస్థుల వంటి కొత్త కొత్తకులాలు ఏర్పడ్డాయి. వైశ్యులవంటి వారు తమ గౌరవాలు కోల్పోగా, శూద్రులు ఔన్నత్యాన్ని పొందారు.

ఈ వ్యవస్థలో ప్రాక్పశ్చిమ దేశాలతో భారతీయులు బానిస వ్యాపారాన్ని కొనసాగించడం, పరపరిభూతులైన ఒక వర్గాన్ని సృష్టించే స్థితి ఏర్పడడం సంభవించింది. ఈ పరిణామాలలో వర్ణ వ్యవస్థ తనదైన మత ప్రమేయతను కోల్పోయి, కుల వ్యవస్థగా లౌకికతతో రూపొంది, గ్రామ సమాజాలలో, విషయ సమాజాల్లో భూస్వామ్య వ్యవస్థ ఒక ప్రధాన నిర్ణాయకాంశంగా రూపొందింపబడడం గమనించవచ్చు.

18.8 పరీక్ష నమూనా ప్రశ్నలు:

I. ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. భూస్వామ్య వ్యవస్థను గూర్చి తెలియడానికి గల ఆధారాలను వివరించండి.
2. భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భవించడానికి తోడ్పడ్డ అంశాలను పేర్కొనండి.
3. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలపై భూస్వామ్య వ్యవస్థ ప్రభావాన్ని అంచనా వేయండి.

II. ఈ క్రింది వానిపై లఘువ్యాఖ్యలు రాయండి.

1. నిష్టి అనగానేమో తెల్పి, దానిని వివరించండి.
2. భారతీయ భూస్వామ్య విధానపు స్వభావాన్ని విశ్లేషించండి.
3. భారతీయ భూస్వామ్య వ్యవస్థ పరిణామ క్రమాన్ని తెల్పండి.

18.9 ఉపయుక్త గ్రంథాలు

Kosambi D.D. ; **An introduction to the Study of Indian History** 1955 (1956)

Lunia B.N. ; **Life and Culture in Ancient India** 1982 (1978)

Maity S.K. ; **Forced Labour in Ancient India** 1979

Malik S.C. ; **Understanding Indian Civilisation** 1975

Ram Saran Sarma ; **Social Change in Early medieval India** 1969

Rubenvanet ; **Conditions of Slaves in Ancient Indian Society** 1987 (1979)

Sailendranath Sen ; **Ancient Indian History and Civilisation** 1988

Satya Murty K. ; **Hand Book of Research Methodology in History** 1995

Sinha B.P. ; **Readings in Kautilya's Artha Sastra** 1976

Srivatsava O.P. ; **Slave Trade in Ancient and Early Medieval India** 1979

Vivekanand Jha ; **Social Sratification in Ancient India Some Reflectections** 1990

Yadava B.N.S. ; **Presidential Address, Indian History Congress** 1980

BRAOU

రచయిత : డా. కె. సత్యమూర్తి

BRAOU

ఖండం-5 సాంఘిక సంస్థలు

ఈ ఖండంలో 19, 20, 21 భాగాలున్నాయి. 19వ భాగంలో యుగయుగాలుగా ఉన్న కుల వ్యవస్థ విధానం, సంఘంలో పరిణామాలు, 20వ భాగంలో సంఘంలో స్త్రీ స్థానం, 21వ భాగంలో భారతదేశంలో విద్యా విధానం, విద్యా సంస్థలను గురించిన వివరణ ఉంది.

BRAOU

BRAOU

భాగం-19 యుగయుగాలుగా కుల వ్యవస్థ

విషయక్రమం

19.0 లక్ష్యాలు

19.1 పరిచయం

19.2 కుల వ్యవస్థ పుట్టుక

19.2.1 పురుష సూక్త సిద్ధాంతం

19.2.2 వర్ణ సిద్ధాంతం

19.2.3 వృత్తి విభజన సిద్ధాంతం

19.2.4 వేద కాలం నాటి వర్ణ వ్యవస్థ

19.2.5 మలి వేద కాలంలో కుల వ్యవస్థ

19.2.6 క్రీ.పూ. ఆరవ శతాబ్ది నాటి కుల వ్యవస్థ

19.2.7 అస్పృశ్యులు

19.2.8 గోత్రం, ప్రవరం

19.2.9 కుల వ్యవస్థలో సరళత

19.3 వర్ణ వ్యవస్థ : సంఘంలో పరిణామాలు

19.3.1 వర్ణ వ్యవస్థ వల్ల లాభాలు

19.3.2 వర్ణ వ్యవస్థలో లోపాలు

19.4 సంగ్రహంగా

19.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

19.6 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

19.0 లక్ష్యాలు

ఈ భాగం చదవడం వల్ల మీరు క్రింది విషయాలను తెలుసుకోగలగాలి

- ★ వర్ణం నిర్వచనం
- ★ వేద కాలంలో కుల వ్యవస్థ ఆవిర్భావం, ఉద్దేశ్యాలు, పరిణామం
- ★ వేద కాలానంతర కాలంలో కుల వ్యవస్థ పరిణామాలు
- ★ కుల వ్యవస్థలో లోపాలు, ప్రయోజనాలు

19.1 పరిచయం

వేద కాలంలోనే కుల వ్యవస్థ ఉద్భవించింది. నాడు బీజ రూపంలో ఉన్న ఈ వ్యవస్థ నేడు మహావృక్షమై, తన కూకటి వ్రేళ్ళను హిందూ సమాజంలో బలంగా నాటింది. ప్రస్తుతం హిందూ సమాజం 3000 కులాలుగా విభజింప బడింది. సంఘాన్ని ఇది చీల్చి వేయడానికి కారణభూతంగా మారి పోయింది. అందుకే ప్రాచీన కాలంలో బుద్ధుడు, మహావీరుడు, నానక్, కబీర్ మతప్రవక్త లందరూ కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ, మానవులంతా ఒక్కటే అనే నినాదానికి దోహదం చేశారు.

గోవాలో పోర్చుగీస్‌వారు మొట్టమొదటిసారిగా 'గకాస్ట్' అనే పదాన్ని వాడినట్లు మనకు తెలుస్తుంది. పోర్చుగీస్ పదంనుండి కాస్ట్ (Caste) అనే పదం వచ్చినట్లు మనకు తెలుస్తుంది. 1563లో కార్‌సెయ-డి-ఆర్ టా అనే పోర్చుగీసు దేశస్థుడు భారతీయ కుల వ్యవస్థను గూర్చి పేర్కొంటూ, 'ఎవ్వరూ వారి పితృమూర్తుల నుండి సంక్రమించిన కులాన్ని మార్చుకొనరు' అన్నారు. 1567 లో యూలే, బూరిల్ కులాన్ని గూర్చి తెలుపుతూ, 'గన్‌టూస్' (Gantoos) అంటే హిందుపులు వారిలో వారు జాతులుగా, కులాలుగా విభజింపబడి, వారికి వారు ఒక స్థానాన్ని ఆక్రమించుకున్నారు. అందులో ప్రధమ శ్రేణి, క్రింది శ్రేణిగా స్థానాలు చేసుకొన్నారు. వారు క్రిస్టియన్లను తక్కువ జాతిగా భావిస్తారు. వారికి వారు గొప్పగా అనుకొని, పైకులం వారు, క్రింది కులం వారితో తినుటకాని, త్రాగుటకాని చేయరు' అని వ్యాఖ్యానించారు.

కొన్ని శాతాబ్దాల తరబడి అవిచ్ఛిన్నంగా కొనసాగిన ఈ కులం ఒక వ్యవస్థగా మారి, సంస్థ రూపం దాల్చి, చాలా విశాలంగా వ్యాపించింది. ఇది ఎంతగా భారతదేశంలో పాతుకొని పోయిందంటే, దానిని పూర్తిగా తొలగించుట కష్టతరమనే స్థితికి దిగజారింది. ఇట్టికుల వ్యవస్థ మన భారతదేశానికే పరిమితం. ఈ పరిస్థితి మిగిలిన ప్రపంచంలో మరెక్కడా మనకు కనిపించదు.

గ్లాసినప్ (Glassenapp) కులాన్ని ఈ విధంగా నిర్వచించారు "కులం కొంతమంది వ్యక్తుల సముదాయం. అంటే ఆ వ్యక్తులకు పితృపరంగా వృత్తి లభిస్తుంది. సంప్రదాయంగా, వారసత్వంగా లభించిన హక్కులు బాధ్యతలు, భావాల మూలంగా, వారంతా ఒక వ్యవస్థగా కలసి ఉంటారు".(*A Caste is a group of persons traditionally given upto the same occupation, drawing their origin from the same human or divine ancestor, and found in one body by determined rights, duties and opinions inherited from their traditions)*

వి.ఎ. స్మిత్ కులాన్ని గూర్చి "కొన్ని కుటుంబాల సముదాయం. వారికి వారు కొన్ని నియమాలను ఐక్యంగా అమర్చుకొని, వాటిని తమ ఆహారమందు, వివాహాల్లోను సాంప్రదాయపరంగా అమలుపర్చుకొంటారు". (A group of families internally united by peculiar rules for the observance of ceremonial purity especially in matters of diet and marriage.) అని నిర్వచించారు. కాని ఇటువంటి నిబంధనలు (ఆహారం వంటివి) ఈనాటి కాలమందు పూర్తిగా ఒక కుటుంబంలో కూడా వారి సాంప్రదాయపు ఆహారం అలవాట్లను పాటించుట లేదు. ఇటువంటివి నామమాత్రంగా నిలచిపోయాయి.

BRAOU

రిస్లే "ఒక జాతిగా చెప్పడానికి వీలయ్యే విధంగా వారసత్వపు భావాలు కలిగిన, ఒక మూల పురుషుడు కలిగిన కొన్ని కుటుంబాల లేక వ్యక్తుల సముదాయమే కులం"*(Caste is a Collection of families or groups of families being a common name, claiming a common descent from a mythical ancestor, human or divine, professing to follow the hereditary calling and regarded by those who are competent to give an opinion as forming a single homogeneous Community)* అని చెప్పారు.

ప్రతి కులానికి కొన్ని ముఖ్య నిబంధనలు ఉన్నాయి. అవి ఆహార వ్యవహారాలకు, వివాహాలకు, వృత్తికి సంబంధించినవి. అందులో ఆచార వ్యవహారాలు ముఖ్యంగా పేర్కొనదగినవి. కుల సభ్యులు ఇతర కులాల వారితో తినటం, త్రాగటం, వివాహాలు జరపటం నిషిద్ధం, అటువంటి సంఘాచారం పూర్వం ఉండేది. ఆహారం విషయంలో పూర్తిగా ఇటువంటి నిబంధనలు పాటించినప్పటికీ, ఆయా కులాల వృత్తిలో మాత్రం అది ముఖ్యంగా పాటించబడేది. సాధారణంగా ప్రతి కులానికి ఆహార వ్యవహారాల్లోను, చావుపుట్టుకల్లోనూ వివాహ పద్ధతుల్లోను, దుస్తులు, అలంకరణలు, భాష, ఇళ్ళు వంటివి ప్రత్యేక లక్షణాలుగా కనిపిస్తాయి. ప్రతి కులంలోను ఇటువంటి నిబంధనలకూ, ఆచార వ్యవహారాలకు ఆ కుల పెద్దలే బాధ్యులు. వారే ఆ కులాన్ని రక్షించుకొనే రక్షకులు. ప్రతి కులానికీ ఇటువంటి పద్ధతులుండేవి. ఆ పద్ధతులే ఒక కులం నుండి మిగిలిన కులాలను వేరుగా చూపించేవి. ప్రతి కుల సంఘాచారాలు, మతాచారాలు, హక్కులు, బాధ్యతలు నిబద్ధమై, వ్యవహారంలో ఉంటాయి. ఒక విధంగా పూర్వం కులాభివృద్ధి ఒక సంఘాభివృద్ధి లక్షణంగా ఉండేది.

19.2 కుల వ్యవస్థ పుట్టుక

కుల వ్యవస్థ పుట్టుకను గూర్చి అనేక రకాలైన వివాదాంశాలు, అనేక రకాలైన సిద్ధాంతాలున్నాయి.

19.2.1 పురుష సూక్త సిద్ధాంతం

ఋగ్వేదమందలి (x90) పురుషసూక్త సిద్ధాంతంలో మొట్టమొదటగా కుల క్రమం గూర్చి మనకు తెలుస్తుంది. అందులో పురుషుని గూర్చి (విధాత) పేర్కొంటూ, దేవతలు పురుషుని ఏ విధంగా విభజించారు? అతని నోరు ఏది? అతని భుజాలేవి? అతని తొడలు, పాదాలు ఏవి?అని చెపుతూ, బ్రాహ్మణుడే అతని నోరు, రాజన్యులు (క్షత్రియులు) అతని బాహువులు, వైశ్యులు అతని తొడలు, శూద్రులు అతని పాదాలు అని చెప్పబడినది.

ఇలా పేర్కొన్న పురుషసూక్తాన్ని కొందరు విజ్ఞులు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు విధాత ముఖం, భుజాలు, తొడలు, పాదాలనుండి సృష్టించబడినారని అన్నారు. విరాట్పురుషుని అంగాలుగా వీరిని మనం గుర్తించటం మనకు చాలా హాస్యాస్పదంగా కనిపిస్తుంది. ఏది ఏమైనప్పటికీ ఋగ్వేద కాలంలోనే ఈ కుల క్రమముున్నట్లు మనకు తెలుస్తుంది.

19.2.2 వర్ణ సిద్ధాంతం

ఎప్పుడు ఏవిధంగా ఈ కుల క్రమం పుట్టిందో, అభివృద్ధి చెందిందో చెప్పటం కష్టం. దీని పరిణామ దశలను గూర్చి కూడా సందేహాలున్నాయి. ఇండో ఆర్యుల సంఘంలో వృత్తి పరమైనట్టి విధానాలు తొలి దశలో ఎట్లున్నాయో

BRAOU

చెప్పటం కూడా కష్టమే. మొట్టమొదట వీరు ఒక జాతిగా(Homogeneous) లేదా ఒక వర్గానికి చెందిన వారుగా తెలుస్తుంది. ఋగ్వేద కాలంలో ఈ రెండు తరగతులకు చెందిన వారిని ఆర్యులు, అనార్యులుగాను లేదా తెల్లటివారు, నల్లటివారుగాను (వర్ణ ఆధారంగా) పేర్కొన్నారు. నల్లటి వర్ణం వారిని శూద్రులుగా, తరువాత వచ్చిన సాహిత్యం పేర్కొన్నది. అంటే వర్ణపరంగా (రంగు) పురాతన ఆర్య సంఘం విభజింపబడినట్లు తెలుస్తుంది. అనార్యులను గెలిచినటువంటి విజయ గర్వమే ఒక విధంగా ఆర్యులచేత వారిని 'దస్యులు' అని వ్యవహరింపజేసి ఉండవచ్చు.

తెల్లటి వర్ణం వారైన ఆర్యులు, నల్లటి వర్ణం వారైన దస్యులను తమతో కలవనివ్వలేదు. ఈ నల్లటి వర్ణంవారు పల్లెల్లో, కొండల్లోను, అరణ్యాల్లోను నివసిస్తూ, తమ జీవనాన్ని వేటాడుతూ, చేపలు పడుతూ గడుపు కొనేవారని తెలుస్తుంది. వీరిని ఆర్యులు మతపరమైన ఆచారాలకు దూరంగా ఉంచేవారు.

మే క్లవర్ కూడా ఈ కుల వ్యవస్థ జాతి వ్యవస్థనుండి పుట్టినట్లు తమ అభిప్రాయాన్ని తెలిపారు. జాతిపరంగా గొప్పతనం, చిన్న తనపు భావనలు కనిపిస్తున్నాయి. దీని మూలంగా జాతికీ జాతికీ సాంఘిక భేదాలు, జాతి భేదాలు అవతరించాయి. దీనితో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణ భేదాలు సృష్టింపబడి ఉండవచ్చుకూడా. ఇదే బహుశా సాంఘిక విభేదాలకు కారణమై ఉండొచ్చు.

19.2.3 వృత్తి విభజన సిద్ధాంతం

కాలక్రమేణా ఆర్యులు భారతదేశంలో స్థిరపడి, శాంతి సుఖమయమైన జీవితాలకు అలవడ్డారు. అంతకు పూర్వం వారికి స్థిర జీవితం లేక వివిధ ప్రదేశాలకు వలసలు పోతూ ఉండడంతో, వారి శాంతికి భంగం వాటిల్లుతూ ఉండేది. వారు అనార్యులతో (Non Aryans) లేదా ఆ ప్రాంతీయ వాసులతో యుద్ధాలు చేస్తూ, స్థిర జీవనం లేక చంచలమైన జీవితంతో కొట్టుమిట్టాడుతూ ఉండేవారు. అటువంటి వారి జీవితాలకు స్థిరత్వం ఏర్పడి, ప్రశాంతత చేకూరింది. తరువాతి వేద కాలంలో, వారికి మతపరమైన సంస్కారాల పైన ప్రేమ జనించింది. అట్టి పరిస్థితిలో మతం చాలా ప్రాధాన్యత సంతరించుకుంది. అందుచేత సంస్కారాలకు, యజ్ఞయాగాదులకు నిశిత నిబంధనలు నెలకొన్నాయి. ఈ కారణంగా సగటు మనిషి కూడా తత్వ సూత్రాలను, యజ్ఞయాగాదులను తెలిసికొనటంలో, అర్థం చేసుకోవడంలో లీనమై ఉండిపోయాడు. అతని కాలం కూడా ఈ విషయానికే పరిమితమై పోయింది. మత ప్రాధాన్యతకు సంబంధించిన అంశాలను, వాటి విలువలను అర్థం చేసుకోవటంలో అతని ధ్యాస పూర్తిగా మళ్ళింది. దానితో ఇటువంటి పనిలో నిపుణుల బృందం తయారైంది. వీరు ఋగ్వేద కాల సమాజంలోని వారితో తమ పూర్వీకుల సంబంధాన్ని ఆపాదించుకున్నారు. వీరు సంస్కారపరమైన, మత సంబంధమైన కార్యాలను నిర్వర్తించటం ప్రారంభించారు. సామాజిక, ఆధ్యాత్మిక కార్యాలకు వారు తమ జీవితాలను వెచ్చించడం మొదలుపెట్టారు. వారు ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని ఆర్జించి, పూజా కార్యక్రమాలను నిర్వర్తించి, సంఘంలో ఒక ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించుకున్నారు. సంఘంలో ఒక ప్రాధాన్యతను సంతరించుకున్నారు. ఇందువల్లనే ఈ ఆధిపత్యమే బ్రాహ్మణ కుల ఆవిర్భవానికి తోడ్పడింది.

ఇలా ఎప్పుడైతే ఒక వర్గం ఏర్పడి, ఒక పనిలో ఆధిక్యతను, ప్రాముఖ్యతను ఏర్పర్చుకున్నదో, అదే విధంగా మిగిలిన వారు కూడ తమ పని వలన సంఘంలో ప్రాముఖ్యతను సంపాదించి, వివిధ వర్గాలుగా ఏర్పడడం ప్రారంభించారు. ఋగ్వేద కాలంలో ఇటువంటివారు యుద్ధ సమయాల్లో తమ నాయకులకు సహాయంగా యుద్ధాల్లో పాల్గొని, మిగిలిన ప్రశాంత సమయాల్లో పొలం పనులలో పాలు పంచుకొనేవారు. కానీ ఆర్య సంఘంలో సైనికుల ప్రాధాన్యత అవసరమైంది. ఎప్పుడూ యుద్ధాలు జరుగుతూ ఉండటంవల్ల కొందరు ఈ యుద్ధాల్లో పాల్గొనడానికి సామర్థ్యులుగా రూపొంది, తమ కాలాన్ని సద్వినియోగపర్చుకున్నారు. వీరు ఆపద కాలాల్లో సంఘ క్షేమ భాద్యతలను నిర్వహించేవారు. అట్టివారు ఒక వర్గంగా తయారయ్యారు. ఇట్టి వీరులు, యోధులు సంఘ క్షేమానికి, రాజనీతి

BRAOU

తత్పరతకు ముఖ్యులయ్యారు. వీరే క్షత్రియులయ్యారు. ఈ క్షత్రియ కులంలో రాజు, రాజ బంధువులు, అతని సంబంధ పాలకులు, చిన్న చిన్న రాష్ట్ర పాలకులు, ఈ వర్గానికి చెందినవారు. వీరు తమ దేశ సంరక్షణకు, దేశ సుఖశాంతుల పరిరక్షణకు మూలస్తంభాలయ్యారు.

మరికొందరు పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపార, వర్తక రంగాల్లో ఆసక్తి చూపి, అట్టి పనులను చేపట్టి, సంఘానికి బలం చేకూర్చారు. వీరిని వైశ్యులని పిలవడం మొదలు పెట్టారు. వీరు క్షత్రియులకన్నా క్రింది వర్గంగా వ్యవహరింపబడినారు.

ఇలాగే వృత్తిపరంగా, ఒకే కులంలోకూడా మరికొన్ని ఉప కులాలు పుట్టాయి. ఈ విధంగా కులాలు, ఉపకులాలుగా విభజింపబడినాయి (వృత్తి సంబంధంగా). పంచాణం కులంవారు కంచర, కమ్మర, కంసాలి, వడ్రంగి, శిల్పి అను ఐదు ఉప కులాలుగా ఏర్పడినారు.

ఇక నాల్గవ వర్ణంవారు శూద్రులు. వీరుపైన చెప్పిన మూడు పై కులాల వారికి సహాయకులుగా ఉండేవారు.

ఇలా సంఘ క్షేమం కొరకు ఆర్య జాతి వృత్తిపరంగా పై నాలుగు విధాలుగా విభజింపబడింది. మత, సాంఘికపరంగా తమ విధులను, బాధ్యతలను, హక్కులను పంచుకొన్నారు. వారి వారి విధుల మూలంగా, బాధ్యతల మూలంగా, వారి వారి స్థానాలు స్థిరపడినాయి.

'శతపథ బ్రాహ్మణం'లో పై చతుర్వర్ణాలవారు అనుసరించవలసిన సంస్కారాలు కూడా పేర్కొనబడినవి.

19.2.4వేద కాలం నాటి వర్ణ వ్యవస్థ

ఆర్యులకు గల 'వర్ణ' (రంగు) 'జాడ్యం' (తెల్లని వారు, నల్లనివారు), కుల వ్యవస్థకు మూల కారణమైంది. వీరికిగల తాము అధికులనే భావం 'దస్యులు' అనే జాతిని సృష్టించింది. వీరు మతాన్ని కూడా సంఘ క్షేమం కొరకు ఒక ధర్మంగా వాడుకున్నారు. ఉపనయనం మొదలైన సంస్కారాల మూలంగా ద్విజులుగా గుర్తింపబడ్డారు. ఈ సంస్కారాల ద్వారా వేదాల రహస్య సూత్రాలను తెలుసుకొనుటకు అర్హులయ్యేవారు. దీనిచే వారు మతపరమైన సంస్కారాలలో ప్రముఖులైనారు. ఈ ముఖ్య సూత్రం మూలంగా చతుర్వర్ణ సిద్ధాంతం ప్రాముఖ్యతను పొందింది. ఇది కుల విభజనకు దోహదమైంది. ధర్మ సూత్రాల్లో చతుర్వర్ణాలవారు అనుసరించవలసిన నియమాలు, విధులు, హక్కులు వివరింపబడినాయి.

రంగు కారణంగా నల్లజాతి వారు తక్కువ జాతిగా పరిగణింపబడినారు. ఇలా ఉన్నప్పటికీ ఈ కాలంలో మిశ్రజాతి సంక్రమణం జరిగింది. నల్లటివారు కూడా ఋషులుగా పేర్కొనడం జరిగింది. బాదరాయణ వేద వ్యాసుడు వేదాల విభజనకు తోడ్పడిన వాడు, అతడు ఒక మత్స్య కన్యకు జన్మించినవాడు. ఈతడు ఋషియే, సుదాస రాజు ద్విజులు కానివారిని తన సహాయకులుగా అంగీకరించాడు. మిశ్రవర్ణ వివాహాలు జరిగినట్లు మనకు తెలుస్తుంది. దీనివలన మనకు ఆర్యులకు, దస్యులకు కుల వ్యవస్థ సరిగ్గా ఏర్పడక ముందే, రక్తసంబంధాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఆర్యులకు జాతి సిద్ధాంతం ఉన్నప్పటికీ, రానురాను ఆర్య సిద్ధాంతాలు ఒక స్థానానికి, సంస్కృతికి ప్రతీకగా నిలచిందేకాని, రంగుకు లేదా వర్ణానికి ప్రాధాన్యత వహించలేదు.

19.2.5మలి వేద కాలంలో కుల వ్యవస్థ

ఈ కాలంలో వర్ణాశ్రమ ధర్మం మిక్కిలి ప్రాచుర్యం వహించింది. ఇది ఒక సాంఘిక సూత్రం, జీవితాన్ని నాలుగు విభాగాలు చేసి, బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలకు నిబద్ధం చేశారు. బ్రహ్మచర్యాశ్రమంలో విద్యను అనుసరించి, గృహస్థ జీవితం గడపటం, వాన ప్రస్థాశ్రంలో జ్ఞాన సముపార్జన చేయడం, సన్యాశాశ్రమంలో పూర్తిగా భవబంధాలను తెంచుకొని, పరమాత్మలో ఐక్యం చెందటానికి కృషి సల్పటం అనే నిబంధనలు ఏర్పడినాయి.

ఇట్టి నీతి సూత్రాలను ఈకాలంలో వివిధ విధాలుగా రూపొందినది. పితృ సంక్రమణం, గోత్ర సాంప్రదాయ ఆర్య జాతి సిద్ధాంతం, దశ్య వర్ణం, మిశ్రమ వివాహాలు కుల వ్యవస్థ వ్యాప్తికి కారణాలు. చతర్వర్ణాల విధులు, భాద్యతలు, హక్కులు, స్థాయి, మత సాంఘిక ప్రవృత్తికి నిబద్ధమై ఉండేవి.

వేద కాలం తొలి దశలో బ్రహ్మణ, రాజన్య (క్షత్రియ), విష్ (వైశ్యులు) అనే మూడు కులాల విభజన వృత్తి పరంగా సంక్రమించింది. ఇది తరువాత జరిగిన పరిణామాలకు సంబంధం లేనట్టిది. అప్పటిలో ఈ విభజన పితృసంక్రమణకు చెందినట్టిది కాదు. కానీ తరువాత వేద కాలంలో కుల వ్యవస్థ వివిధ పరిణామాలు చెందినది. అభ్యసించుట, ఉపదేశించుట, మార్గ వివరణ అనేవి బ్రాహ్మణుల విధులు. క్షత్రియులు, వీరులు, యోధులు రాజులు పరిపాలించేవారు. వైశ్యులు ఆర్థిక వ్యవస్థకు అనుసంధానమైనవారు. శూద్రులు వైకులాల విధులకు సహాయపడుతూ సంఘంలో ప్రాముఖ్యత సంతరించుకొన్నారు. ఈ కాలంలో (తరువాతి వేదకాలంలో) వేద కాల పరిస్థితులు లేవు. సూత్రముల ప్రాముఖ్యత కూడా పెరిగింది. ఒక విధంగా ఇది వేద, సూత్ర కాలాల మధ్య కాలం. బ్రాహ్మణులు ప్రాధాన్యత వహించడం, ఆధిక్యతను చూపడం మొదలైంది. వీరికి యజ్ఞయాగాదుల నిర్వహణం పూర్తి బాధ్యత సంక్రమించింది. దీనితో వారు మిగిలిన వారిపై ఆధిపత్యం వహించడం జరిగింది.

క్షత్రియులు పరిపాలకులు, యుద్ధవీరులుగా రూపొందారు. వీరు యుగ తత్వాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించారు. అప్పుడప్పుడు వీరు బ్రహ్మణులతో వివాదాలు చేసేవారు. వీరు ప్రావీణ్యతలో ఒక్కోసారి బ్రాహ్మణులను అధిగమించేవారు. ఆ స్థాయికి ఎదిగిపోయిన వారిలో అట్టి జ్ఞాన సముపార్జన ఉండేది. క్షత్రియులైన జనకుడు, విశ్వామిత్రుడు ఇందుకు ఉదాహరణగా పేర్కొనదగిన వారు. జనకుడు రాజయోగి, బ్రాహ్మణులు అతని పాదాల చెంత కూర్చొనేవారు. విశ్వామిత్రుడు ఒక ఋషిగా మారి, వేదాలకు వ్యాఖ్యానం రాశాడు. అలాగే, కేకయ అశ్వపతి. కాశీరాజు అజాత శతృవు బ్రాహ్మణ విద్యార్థులకు పాఠాలు చెప్పారు. వీరిద్దరూ క్షత్రియులే. ఇటువంటి ఎన్నో నిదర్శనాలు మనకు క్షత్రియుల, బ్రాహ్మణుల మధ్య వైరాన్ని కూడా చాటుతున్నాయి. క్షత్రియులు చివరకు బ్రాహ్మణులకు ఎట్టి ఆధిక్యతా లేదని, వారు రాజును అనుసరించ వలసిన వారు మాత్రమేనని ప్రభోదించారు.

వైశ్యులు వర్తక, వ్యవసాయ, పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో ప్రాధాన్యత వహించారు. వీరికి పరిపాలక, గురుతత్వ లక్షణాలు లభించలేదు. వీరికి బ్రాహ్మణులకు, క్షత్రియులకు ఉన్నట్టి సౌఖ్యాలు లభించలేదు. వీరు ఒకరిని అనుసరించి, ఒకరిపై ఆధారపడి జీవించసాగారు. వీరిలో ధనికులై, అధికులైన వారిని శ్రేష్ఠి అని, గృహపతులని పిలిచేవారు. వీరికి రాజాస్థానంలో ఎక్కువ గౌరవం, ప్రాధాన్యం లభించలేదు.

శూద్రుల పరిస్థితి చాలా హీనంగా ఉండేది. వీరు శ్రామికులు. వీరు ఒకరికి సేవకులుగా, ఒకరి అధీనంలో, కృపతో బ్రతికేవారు. వీరికి శాస్త్రసంస్కారాలకు అర్హత లేదు. వీరు అపవిత్రులుగా వ్యవహరింపబడేవారు. అగ్నికి సమర్పించే పాలను వీరు ముట్టుకొనరాదు. వీరు ఒక్కోసారి వైశ్యులతో కలసి బ్రాహ్మణ, క్షత్రియులను ఎదురించేవారు. దానితో వారి పరిస్థితి మెరుగైంది. వారి బానిసత్వం పోయి, సంఘంలో వారి స్థానం పెరిగింది. వారికి కూడా సంఘంలో ఒక గుర్తింపు రాసాగింది. కాని ఎప్పుడైతే మిగిలిన కొండజాతి వారు ఆర్య సమాజంలోనికి రావడం మొదలుపెట్టారో, అప్పుడు తిరిగి శూద్రుల పరిస్థితి అస్తవ్యస్థమైంది.

ఈ నాలుగు వర్ణాలేకాకుండా, ఈ కాలమందు మరి రెండు రకాలైన వారు 'వ్రత్యులు', 'నిషాదులు' కూడా మనకు కనిపిస్తారు. వ్రత్యులకు వైదిక మతంతో సంబంధం లేకుండా ఉండేది. వీరు ప్రాకృత భాషను మాట్లాడేవారు. వారు స్థిరనివాసులు కాదు. మగధ యందలి దస్యులతో వీరికి సంబంధముండేది. వీరు బహుశా శివుని ఆరాధించేవారై ఉండవచ్చు. తరువాత ఆర్యులు వీరిని కూడా వైదిక సంఘంలో చేర్చుకొన్నారని తెలుస్తుంది. వీరుకూడా కొన్ని సంస్కారాలు చేసుకొనేవారు.

BRAOU

నిషాదులు గ్రామీణ వాసులు, వారికి ఒక పాలకుడు (స్థపతి) ఉండేవాడు. బహుశా వీరిని ఈ కాలపు భిల్లులతో పోల్చవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే, తరువాతి వేద కాలంలో కుల వ్యవస్థ జటిలమైంది. సంఘ అవసరాలకు, ఆర్థికాభివృద్ధికి, వర్తక వాణిజ్యాలకు వృత్తిపరంగా, పితృసంక్రమణ విధానంగా కళాకారులు, వర్తకులు, అభివృద్ధి చెందసాగారు. మామూలు సగటు మనుషులు వివిధ గుంపులుగా, కులాలుగా విభజింపబడసాగారు. వృత్తి సంబంధంగా రథసారథులు, కంసాలి, వడ్రంగి, మత్స్యకారులు వివిధ కులాలు ఏర్పడ్డాయి. ఒక కులం వారు మరొక కులం వారితో భుజించటం నిషిద్ధమే కానీ, అది తరువాతి కాలంలోని నిషిద్ధ పద్ధతులంత భయంకర రూపం దాల్చలేదు. అసవిత్ర బ్రాహ్మణులైన కావేషి, వత్సవంటి వారు తరువాత వేద కాలంలో ఉండేవారు.

శూద్రులకు ద్విజత్వం లేదు. వారికి ఉపనయన సంస్కారం లేదు. శూద్రుల్లో రెండు తెగలు ఉండేవి. వారు అనిర్వాసితులు, నిర్వాసితులు, రెండవ తెగకు చెందిన నిర్వాసితులు హిందూ సంఘ సభ్యులు కారు. బహుశా వీరినే అంటరాని వారుగా తరువాత ప్రవచించారు. ఇదికూడా శూద్రులు అనుసరించే పద్ధతులవల్లనే కలిగింది. లేదా వారి వృత్తుల మూలంగా వారికి నర్తించింది. ముఖ్యమైన వైదిక సిద్ధాంతాలు శూద్రుడు మిగిలిన మూడు తరగతుల వారికి సేవ చేయవలసినదిగా పేర్కొన్నాయి. శూద్రులు వస్తువుల తయారీ, వర్తకంలో కూడా తోడ్పడేవారు. మౌర్యుల కాలంలో వీరు వ్యవసాయం ముఖ్య వృత్తిగా చేపట్టినట్లు తెలుస్తుంది. శూద్రుడు వేదాభ్యాసం చేయకున్నను, ఇతిహాసక, పురాణ శ్రవణంలో పాలుపంచుకొనవచ్చునని గ్రంథాలు తెలుపుతున్నాయి. భగవద్గీతలో కూడా శ్రీకృష్ణుడు నాలుగు వర్ణాల వారిని పేర్కొంటూ, శూద్రుడు కూడా మోక్షం పొందుటకు పూర్తి అర్హుడు కాదని పేర్కొన్నాడు.

19.2.6 క్రీ.పూ. ఆరవ శతాబ్దంనాటి కుల వ్యవస్థ

క్రీ.పూ. ఆరవ శతాబ్దకాలం నాటికి పరిస్థితులు పూర్తిగా విరుద్ధంగా మారిపోయాయి. బ్రాహ్మణుల ఆధిపత్యం విపరీతంగా పెరిగిపోయింది. వీరి యజ్ఞ యాగాదులు కాని, పూజా విధానాలుగాని పూర్తిగా సంస్కృత యుక్తమైనవి. అప్పటిలో ప్రాకృత భాషసామాన్య ప్రజలు వాడే భాష, కనుక సంస్కృతంలో బ్రాహ్మణులు అనుసరించు విధానాలు సగటు మనిషికి అర్థంకాని పరిస్థితులు ఏర్పడ్డాయి. సంస్కృతం అభ్యసించని వానికి సైతరగతులు వారు అనుసరించు చర్యలు, పాఠ్య రీతులు యజ్ఞయాగాదులు పూర్తిగా అర్థమయ్యేవికావు. సంస్కృతం నేర్చుకొనుట సామాన్యునికి అందుబాటులో ఉండేదికాదు. ఇట్టి విపరీత పరిస్థితులు బౌద్ధ, జైన మతాల ప్రాముఖ్యానికి హేతువులయ్యాయి. బుద్ధుడు, మహావీరుడు తమ మతాలను, సిద్ధాంతాలను ప్రాకృత భాషలో ప్రవచించటం మొదలుపెట్టారు. వీరు వేదాల ఆధిపత్యాన్ని నిరసించారు. వీరి ప్రవచనాలు అందరికీ సులువుగా అర్థమయ్యే విధంగా ఉండేవి. అందుచేత సామాన్య మానవుడు వీరు ప్రవచనాలను వినడం, ఆచరించటం మొదలు పెట్టాడు. అందువల్ల బౌద్ధ, జైన మతాలు ప్రబలసాగాయి. వీరి కులాల ఆవశ్యకతను నిరసించారు. అందరూ ఒక్కడే అనే భావనను ప్రదర్శించారు. కాబట్టి అందరూ ఆ మతాలను స్వీకరించడం మొదలు పెట్టారు.

దీనికి తగినట్లు తరువాతి కాలంలో మౌర్య, శుంగ, శాతవాహన, ఇక్ష్వాకు రాజులు బౌద్ధ మతానికి చాల సేవచేయసాగారు. బౌద్ధ మతానికి అశోకుడు మొదలైన రాజులు బహు ప్రచారం చేయసాగారు. విదేశాల్లో కూడ ఈ మతాన్ని ప్రచారం చేయసాగారు. దీనితో రాజులతో బాటు ప్రజలు బౌద్ధ మతాన్ని అనుసరించసాగారు కాలక్రమేణా ఈ మతంలో కూడా చీలికలు వచ్చాయి. 'హీన యాన', 'మహాయాన' బౌద్ధ మత ఆవిర్భావ జరిగింది. హిందూ మత ప్రభావం కూడా బౌద్ధ మతంపై పడింది. బౌద్ధ మతం కూడా విగ్రహారాధనపై మక్కువ పడింది. అప్పటి కుషాణ రాజుల (క్రీ.శ. 1వ శతాబ్దం) కాలమందు గ్రీక్ ప్రభావం కూడా బౌద్ధ మతంపై పగాంధార కళ జనించింది. అదే కాలంలో మథురలో, మధ్యదేశంలోను (అమరావతి) బౌద్ధ విగ్రహాలు వెల మహాయాన సిద్ధాంతాలు ప్రబలాయి.

BRAOU

కాలక్రమేణా, నాల్గవ శతాబ్దంనాటికి (గుప్తుల కాలమందు) తిరిగి సర్వ మత సఖ్యత ఏర్పడింది. ఇప్పటికీ రాజులు మూడు మతాలను ఆదరించడంతో, ఆ యుగాన్ని స్వర్ణయుగంగా పేర్కొనడం జరిగింది. అప్పటికి తిరిగి హిందూ మతం సంస్కరణల ద్వారా తన లోపాలను దిద్దుకోవటం, జరిగింది. హిందూ మతంపై బౌద్ధ మత ప్రభావం వల్ల శాంతి నెలకొల్పబడింది. ఇలా మత ప్రభావం పూర్తిగా కుల వ్యవస్థపై దాని ఫలితాలను చూపింది. అయినా చతుర్వర్ణ వ్యవస్థ అలాకొనసాగుతూనే, ఒక్కొక్క కులం శాఖోపశాఖలుగా (ఉప కులాలుగా) విస్తరించడం జరిగింది. దానితో కులాలు, ఉపకులాలు వృత్తుల పరంగా కూడా విపరీతంగా పెరిగిపోయాయి. తరువాత వేద కాలం నుండి విస్తరించిన కుల వ్యవస్థ ఈ సరికి ఇంకా ఎక్కువ రూపాంతరాలను సంతరించుకున్నది.

19.2.7 అస్పృశ్యులు

శూద్ర కులంలో క్రింది జాతి వారిని అంటరాని వారుగా వెలివేయబడు తరగతిగా పేర్కొన బడినారు. బౌద్ధ సాహిత్యం తొలిధర్మ సూత్రాలను కూడా (అంటే క్రీ.పూ. శతాబ్దములందే) కొన్ని గుంపులవారు ఆర్యసమాజానికి సేవచేస్తూ, నగర జీవితానికి దూరంగా ఉండేవారని పేర్కొన్నాయి. కొన్నిసార్లు వీరు 'పంచములు' అనే ఐదవతరగతిగా పేర్కొన బడినారు. కానీ కొంతమంది వీరిని పూర్తిగా ఆర్య సాంఘికాచారాలకు నిషిద్ధులుగా ప్రకటించారు. బహుశా వీరు ఆర్య జాతికి చెందినవారు కాకపోవచ్చు. లేదా వీరు మన్య జాతి వారైనా అయి ఉండవచ్చు. ఇట్టి వారిలో ప్రాధాన్యులు చండాల తెగకు చెందినవారు. వీరిని అంటరానివారుగా పరిగణించారు. చండాల అను పదం సామాన్య వాచకంగా కనిపిస్తుంది. ఇది చాలా తెగలవారికి వాడబడింది. ఆర్యుల నివాస స్థలంలో వీరు జీవించకూడదు. వీరు నగర పరిధులకు దూరంగా నివసించాలి. వీరిలో కొందరికి వివిధ రకాలైన జీవన భృత్తి ఉన్నప్పటికీ, సిద్ధాంతపరంగా వీరు శ్మశాన వాటికలో భృత్యులుగా, శవశకటాలను నడిపేవారుగా, లేదా రాజాస్థానాల్లో శిక్షలను అమలు పరిచేవారుగా వృత్తులు చేసేవారు. ధర్మసూత్రాల్లో చండాలులు ముదురు రంగు వస్త్రాలను ధరించాలని, విరిగిన పాత్రల్లో భుజించాలని, ఇనుప ఆభరణాలు ధరించాలని పేర్కొన్నాయి. పైతరగతుల వారు ఎన్నటికీ వీరితో సంబంధ బాంధవ్యాలు కలిగి ఉండకూడదు. గుప్తుల కాలం నాటికి చండాలులు పూర్తిగా అంటరానివారుగా పేర్కొనబడినారు.

వీరిలోని కొన్ని తెగలవారు నిషాదులు (వేటగాళ్ళు), కైవర్తులు (చేపలు పట్టువారు), కారావారులు (చెప్పులు కుట్టేవారు, చర్మకారులు). బౌద్ధ గ్రంధాల్లో పుక్కాసులు (వీధులు చిమ్మేవారు) ఈ జాతివారే. వీరే తరువాతి కాలంలో మద్యం తయారు చేయువారుగా తయారయ్యారు. వేణులు (బుట్టలు అల్లేవారు), రథకారులు కూడా చండాలులుగా వ్యవహరింపబడినారు. రథకారులు వేద కాలంలో చాలా గౌరవింపబడేవారు. కానీ తరువాత వీరి స్థాయి దిగజారిపోయింది. మనువు 'అంత్య వాసయినులు' అనే తెగను పేర్కొన్నాడు. వీరు చండాలులకు, నిషాద తెగకు మధ్యవారు. వీరిని చండాలులు కూడా బహిష్కరించేవారు. తరువాత కాలంలో వీరిలో వీరు ఒకరికన్నా ఇంకొకరు హీనంగా భావించుకున్నారు. వీరందరినీ హిందూ సమాజంలో దేవాలయ ప్రవేశం నుండి బహిష్కరించినప్పటికీ, వీరిని బౌద్ధులు ఆదరించారు. వీరిలో కొందరు ప్రముఖ బౌద్ధ సన్యాసులు కూడా కాగలిగారు.

ఈ అంటరాని వారిలో ఇంకొక తెగ 'మ్లేచ్ఛులు'. ఈ పదం సర్వసాధారణంగా ఒక జాతికి లేదా ఒక రంగు (వర్ణం) వారికి వర్తిస్తుంది. సాధారణంగా వీరు వేరే దేశస్థులుగా వచ్చి, భారతీయులతో సంబంధాలను నెలకొల్పుకున్నవారు.

ఈ అంటరానితనం నిజానికి ఒక వ్యక్తికి కాకుండా, ఒక వర్గ ప్రజలకు వర్తించింది. ఏది ఏమైనా జన్మతహా కాకుండా, మనిషి ప్రవర్తనే ప్రాతిపదిక సిద్ధాంతంగా, అతన్ని పై తరగతి వానిగా మార్చవచ్చును. భారత కుల వ్యవస్థే నిజానికి ద్రవ రూప స్థితి కలిగి ఉంది.

BRAOU

నిజానికి తరగతికి, కులానికి, జాతికి పూర్తి అనుగాహన లేకుండా పోయింది. ఒకదానితో ఒకదానిని తికమక పరిస్థితి ఉన్నది. దక్షిణ భారతదేశంలో చోళుల తరువాతి కాలంనుండి ప్రస్తుత కుల స్వరూపం ఏర్పడింది. ఇలా రూపాంతరం చెందడానికి ఎన్నో వేల సంవత్సరాలు పట్టింది. ఎన్నెన్నో కారణాలు దీనికి దోహదం చేశాయి. ప్రపంచ చరిత్రలో కనిపించే బానిసత్వపు లక్షణాలు మనదేశ చరిత్రలో అంతగా కనిపించలేదు. ఆ స్థితికి ఎదిగేసరికి, తిరుగుబాటు జరగడం మనదేశ చరిత్రలో కనిపిస్తూనే ఉంది.

19.2.8 గోత్రం, ప్రవరం (Gotra, Pravara)

ఇవి ఒక కులానికి, జాతికి సంబంధించినవి కావు. గోత్ర, ప్రవరాలు కూడా ఎక్కువగా తరువాతి వేద కాలంలోనే కనిపిస్తాయి. మొట్ట మొదట అథర్వణ వేదంలో గోత్రం యొక్క అర్థం వంశం(Clan) అని ఉన్నది. దానికో ప్రత్యేకత ఉంది, ఇది మొదట బ్రాహ్మణ తరగతి వారు పాటించారు. తరువాత ద్విజులందరూ ఉపయోగించసాగారు. అందరు బ్రాహ్మణులు, తాము ఋషుల సంతతి వారని నమ్మేవారు. ఆ ఋషుల పేర్లతో వివిధ గోత్రాలు వచ్చాయి (ఉదా: భరద్వాజ, వశిష్ఠ మొ॥) వైదిక మత సాహిత్యం మామూలుగా ఏడెనిమిది గోత్రాలను పేర్కొన్నది. అవి కశ్యప, వశిష్ఠ, భృగు, గౌతమ, భరద్వాజ, అత్రి, విశ్వామిత్ర, అగస్త్య అనేవి. అగస్త్యుడు ద్రావిడుల ముఖ్యుడైన ఋషి. అందువల్ల ఇతని పేరు సప్తఋషులతో పాటు, జాబితాలో చేర్చబడినది. ఈ గోత్రాల సంఖ్య తరువాత కాలంలో మిక్కుటంగా పెరిగి, వేరే వేరే వేద పండితుల, మునుల, సిద్ధుల పేర్లుకూడా కలపబడినాయి. ఈ గోత్రం ప్రాధాన్యత వివాహ సమాయాల్లో మనకు కనిపిస్తుంది. స్వగోత్రులందరూ రక్త సంబంధీకులుగా పేర్కొనబడినారు. అందుకే స్వగోత్రుల్లో వివాహాలు జరుగవు.

ప్రవరం మిక్కిలి క్లిష్టమైంది. బ్రాహ్మణుల నిత్య పూజా విధానంలో వారు ఏ ఋషి వంశస్థుడో చెప్పడం, అతని వంశం మిగిలిన ఋషి పుంగవులకు ఎట్టి సంబంధం కలిగిందో కూడా చెబుతుంది. ఇది మూడు, నాలుగు, ఐదు పేర్లను కలిగి ఉంటుంది. ప్రవరం ఒక్కటే అయినట్లయితే, వివాహం నిషిద్ధం, గోత్రం, ప్రవరంతో వివాహానికి బహు పరిధులు ఏర్పడ్డాయి. గోత్ర, ప్రవారాలతో, మధ్య చరిత్ర కాలానికి వ్యవస్థ బహుముఖమైంది.

గోత్రాల వలన బ్రాహ్మణులకు ఒక ప్రాధాన్యత, విశిష్టత ఏర్పడ్డాయి. అదే విధంగా క్షత్రియులు, వైశ్యులు గోత్ర పద్ధతిని అనుసరించారు. కానీ వీరు బ్రాహ్మణులవలె, వివాహ సంబంధాలకే కాకుండా, ఇంటిలో యజ్ఞయాగాదులకు, పూజావిధానాలకు ఉపయోగించుకొనేవారు. వీరి విధానం (క్షత్రియుల, వైశ్యుల) కృత్రిమంగా కనిపిస్తుంది. కారణం వీరు బ్రాహ్మణులను అనుసరించడమే. క్షత్రియుల, వైశ్యుల ప్రవరం లౌకికపరంగా కూడ ఉంటాయి. శిలా శాసన శాస్త్రాలను కూడా వివిధ రాజుల, వైశ్యుల గోత్రాలు, ప్రవరాలు గోచరిస్తాయి. ఈ గోత్రాలు, ప్రవరాలు ధర్మసూత్రాల్లో లేవు. ఇవి బహుశా తరువాత చేర్చబడినవై ఉండవచ్చు. ఏది ఏమైనప్పటికీ, గోత్రాలు, ప్రవరాల వలన ద్విజుల స్థానంలో భేదాలు కలగడానికి కారణాలయ్యాయి.

19.2.9 కుల వ్యవస్థలో సరళత

చారిత్రాత్మక దృష్టితో పరిశీలించినట్లయితే, కుల వ్యవస్థ పని భారాన్ని సమంగా పంచుకొనే విధానంగానే కనిపిస్తుంది. అంటే అది తరగతి విభజనే తప్ప కుల విభజన కాదు. వేద కాలంలో ఈ నిషయం స్పష్టంగా గోచరిస్తుంది. సాంఘిక, మతపరమైన ఉల్లంఘనలు మొదటలేవు. అందుకే సంఘంలో నిశ్చలత ఉన్నట్లు తెలుస్తుంది. సాంఘిక బాధ్యత నిర్వహణా భారం ప్రాతిపదికగా, వృత్తివిభజన తరగతి విభజన జరిగినట్లు అనిపిస్తుంది. అంటే వృత్తిపరంగా ఒకమనిషి ఒక తరగతినుండి ఇంకొక తరగతికి మారవచ్చు. వృత్తి పరంగా ఒకకులం నుండి ఒక కులానికీ మారవచ్చు. అంటే ఒక మనిషి కులం అతనుచేసే వృత్తిని బట్టే ఉండేదన్నమాట. మహాభారతం నందలి ద్రోణుడు పుట్టుకతో

బ్రాహ్మణుడు. కానీ అతను కౌరవులకు, పాండవులకు గురువై, మహాభారత సమయంలో క్షత్రియునివలె సైనిక దళానికి సంరక్షకుడిగా వ్యవహరించాడు. మహాభారతాన్ని రచించిన వ్యాసుడు ఒక మత్స్య కన్య కుమారుడు. వేద సూత్రాలను, ధర్మసూత్రాలను ప్రవచించిన విదురుడు దాసీపుత్రుడు. కర్ణుని కథ లోకానికంతా విదితమే. ఆర్యులు కానివారు కొన్ని యజ్ఞయాగాదులు చేయటం వల్ల ఆర్యులయ్యారు. అలాగే వివాహాలు ఒక కులం వారు వేరే కులం వాళ్ళతో జరిగిన సంఘటనలు మన ఐతిహాసిక, పురాణ కాలాల్లో కనిపిస్తాయి. అలాగే శూద్రులు కూడా కొన్ని పూజావిధానాల్లో పాల్గొనేవారు. వృత్తిపరంగా శూద్రులు వ్యవసాయ, గృహ, నర్తకాల్లో సేవకులు. వారు రైతులు కూడా, అంతేకాదు ఈ రోజు వ్యాపించిన అస్పృశ్యతా దృష్టి తరువాతి వేద కాలంలో కూడా కనిపించరు. ఈ వికృత స్వరూపం ఆ రోజు లేదు.

ఎప్పుడైతే ఆధిక్యత అనేది ప్రాధాన్యతను వహించిందో, కుల వ్యవస్థ వేళ్ళు బలపడ్డాయి. ఇది చతుర్వర్ణాలతో ప్రారంభమై, బహుముఖ రూపాలను ప్రదర్శించింది. జనక, జన్య కులాలు జనియించాయి. అవి ఈరోజు వృత్తిపరంగానో, మతపరంగానో, తాత్విక లక్షణాలు కలవనికాదు. అవి మనిషి పుట్టుకకీ ప్రాముఖ్యత ఇస్తున్నాయి. ఈ విధంగా జరగడానికి అనేక కారణాలు ఉన్నాయి.

1. బ్రాహ్మణుల ఆధిక్యత: బ్రాహ్మణుల ప్రాధాన్యత ఎప్పుడు పెరిగిందో, అప్పుడే మిగిలిన కులాలు వాటికి అవి జటిలమయ్యాయి. బ్రాహ్మణులు దేవతల ప్రతిబింబాలన్న అభిప్రాయం వారిలో ఏర్పడటంతో, వారు న్యాయ స్థానాల్లో, రాజాస్థానాల్లో ప్రాముఖ్యతను సంపాదించుకున్నారు. వీరే న్యాయ నిర్ణేతలు. రాజును నియమించేవారు. వీరి ఆధిపత్యమే క్రీ.పూ. ఆరవ శతాబ్దంలో సామాన్యుని వేద పఠనానికి దూరం చేసింది. ఈ కారణమే బౌద్ధ, జైన మతాల వ్యాప్తికి కారణమైంది. ఇదే ప్రతి కులం వారు వారి కుల ప్రాధాన్యతను చెప్పుకొనే అవకాశమిచ్చింది.

2. వృత్తి మార్పిడి: వృత్తులు మార్చుకున్నప్పుడు క్రొత్త కులాలు పుట్టాయి. వృత్తిపరంగా కొన్ని కులాలు జనించాయి. ఉదాహరణకు నేత పనివారు, మత్స్యకారులు, మొదలైనవారు వేరువేరు ఉపకులాల వారయ్యారు.

3. పరిస్థితుల ప్రభావం

కాలక్రమేణా ఏ కులంవారు ఆ కులానికి సాంఘిక నిబంధనలు, ఆచారాలను ప్రవేశపెట్టుకొని, ఒక కులానికి ఇంకొక కులానికీ నిభేదాలు సృష్టించుకున్నారు. ఇది వంశపారంపర్యంగా, సంక్రమిస్తూ వచ్చింది. దానితో అంతరాలు ఎక్కువయ్యాయి. ఇందుచేతనే పై తరగతులైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాల్లో కూడా, ప్రతీ చర్యకు నియమ నిబంధనలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు ఉపనయన వయస్సు కూడా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు వేరైపోయింది. బ్రాహ్మణులు, క్షత్రియులు బలవంతులయ్యారు. వైశ్యులు వృత్తిపరంగా తక్కువయ్యారు. చివరకు శూద్రులు హీన స్థితికి చేరుకున్నారు. దీనికి పరిస్థితుల ప్రభావమే కారణం.

4. విదేశీయులను చేర్చుకొనుట:

ఆర్యులు కానివారు ఆర్యావర్తంలోనికి వచ్చి, స్వదేశీయుల్లో చేరారు. అందుచేత కొన్ని క్రొత్త కులాలు ఆవిర్భవించాయి. ఉదా. గ్రీకులు, శకులు, పార్థీయులు, హూణులు హిందూ మతంలో చేరడం వల్ల క్రొత్త కులాలు ఏర్పడ్డాయి. అలాగే మిశ్రమ వివాహాలు కూడా క్రొత్త కులాల పుట్టుటకు కారణమైనాయి.

5. వలస

కొందరు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వలస పోయేవారు. మెల్లగా ఆ దేశ పరిస్థితులకు లోబడి, వారి ఆచార వ్యవహారాలు మార్చుకొని, క్రొత్త కులాలుగా ఆవిర్భవించారు. దీనితో వారు క్రింది స్థాయికి చేర్చబడినారు.

BRAOU

6. మిశ్రమ వివాహాలు:

ఒక కులంవారికి వేరొక కులంవారితో వివాహాలు జరిగాయి. అప్పుడు క్రొత్త కులాలు పుట్టాయి.

7. అహింస, క్రొత్త కులాల ఆవిర్భావం

బౌద్ధ, జైన మతాలు అహింసా తత్వాన్ని బోధిస్తూ, సామాన్య ప్రజలకు సాధారణ భాషలో ప్రవచనాలు చేసి, హిందువులను బౌద్ధులుగా, జైనులుగా మార్చివేయడం జరిగింది. అప్పుడు కుల ప్రసక్తి రాలేదు. కానీ కాలక్రమేణా పరిస్థితుల ప్రభావంతో ఈ మార్పిడి చేసుకున్నవారు తిరిగి క్రొత్త కులాల పుట్టుకకు కారణమయ్యారు. అహింసా సిద్ధాంతాన్ని అనుసరించి శాఖాహారులు, మాంసాహారులు అని వేరు వేరు శాఖలు జనించాయి.

8. ఇస్లాం ప్రవేశం

ముస్లింల భారతదేశ ప్రవేశం హిందూ కుల వ్యవస్థకు మరిన్ని ఆంక్షలను తెచ్చి పెట్టింది. వారు పరదేశీయులు. వారికి వారి మత సూత్రాలు, సిద్ధాంతాలు, ఆంక్షలు ఉన్నాయి. దానితో స్వదేశీయులైన హిందువులు ముస్లింలతో ఐక్యమవ్వలేకపోయారు. హిందువులు వారి ప్రాధాన్యత చూపించుకోవడానికి, కుల వ్యవస్థలో మరిన్ని ఆంక్షలు, నియమాలు తెచ్చుకొని, తమ ప్రాముఖ్యతను ప్రదర్శించుకున్నారు.

పైన చెప్పిన కారణాలన్నీ కలసి కుల వ్యవస్థకు వేరువేరు రూపాలను తెచ్చిపెట్టాయి.

19.3 వర్ణ వ్యవస్థ: సంఘంలో పరిణామాలు

వర్ణ వ్యవస్థ వల్ల సంఘానికి బలం చేకూరింది. అలాగే నష్టాలూ కలిగాయి. జాతి సమైక్యతకు మూలమైన కుల వ్యవస్థ స్వరూపం ఎలా లాభాలను చేకూర్చిందో, ఎలా వక్రించిందో కూడా తెలుసుకుందాం.

19.3.1 వర్ణ వ్యవస్థ వల్ల లాభాలు

జాతి సమైక్యతే ముఖ్య లాభం, కుల వ్యవస్థలోని ఆచార, వ్యవహార, నిబంధనలు అప్పటినుండి సంక్రమించిన (వేదాల) సాంప్రదాయ సిద్ధాంతాలను బలపర్చి, నిలబెట్టి పరిరక్షించింది. ఆ కాలపు ఆర్య, ద్రావిడ సాంప్రదాయ లక్షణాలకు ప్రతిబింబమై, జాతి సమైక్యతకు తోడ్పడింది. అందుకే రాధాకృష్ణన్ "ఈ ఇనుప సంకెళ్ళే ఒకవిధమైన జాతి పరిరక్షణ, సంరక్షణకు ముఖ్య లక్షణాలు అయ్యాయి." అని చెప్పారు. ఒక విధంగా అది జాతికి ఊపిరినిచ్చి, చేయూత నిచ్చింది. తరువాత వచ్చిన వివిధ మత ప్రభావాలకు కూడా తట్టుకొని నిలబెట్టేలా చేసింది. ఉదాహరణకు ఇస్లాం మతం తెచ్చిన వొరవడి.

ఈ కుల విధానమే హిందువుల వ్యాప్తికి తోడ్పడింది. విదేశీయులైన గ్రీకులు, పార్థులు, శకులు, హూణులు, హిందూ మతంలోనికి చేరడం వలన హిందూ మత వ్యాప్తికూడా జరిగింది. హిందువుల స్థాయిని పెంచింది. వారు ఈ మతంలో ఐక్యమైనప్పటికీ, హిందూ తత్వాన్ని నిలబెట్టగలిగింది. క్రొత్త కులాలు వచ్చినా, హిందూ మత వ్యాప్తే జరిగింది.

ఈ విభిన్న మార్గాల ఐక్యతే మనజాతిని విదేశీయులనుండి కాపాడింది. ద్రవిడులు కూడా సాంస్కృతిక పరంగా ఆర్యులకు విరుద్ధం కాదు. అన్ని జాతులు, సాంఘిక శాఖలూ కలిసి సమైక్యంగా జీవించడానికి ఈ కుల వ్యవస్థే కారణమైంది. వీరిలో వీరికి తగువులు రాకుండా నిలబెట్టగలిగింది.

BRAOU

4. స్రావరం

5. వర్ణాశ్రమ ధర్మం

6. చండాలులు

7. అంటరానితనం

8. శూద్రులు

9. క్షత్రియులు

19.6 ఉపయుక్త గ్రంథాలు

Bhasham A.L. - **The wonder that was India**

Chanana D.R. - **Slavery in Ancient India**

Dutta N.K. - **Origin and Growth of Caste in India**

Hastings J. (Edited by) - **Caste in Encyclopaedia of Religion and Ethics (By E.A. Gait)**

Hutton - **Caste in India**

Ketkar S.V. - **The History of Caste in India**

Luniya B.N. - **Life and Culture in Ancient India**

Sarma R.S. - **Sudras in Ancient India**

రచయిత్రి: డా. వి. మీనా కుమారి.

BRAOU

భాగం - 20 సమాజంలో స్త్రీల పాత్ర

విషయక్రమం

20.0 లక్ష్యాలు

20.1 పరిచయం

20.2 వేద కాలంలో స్త్రీ

20.3 పురాణ, ఇతిహాసాల్లో స్త్రీ

20.4 స్మృతుల్లో స్త్రీ

20.5 చారిత్రక యుగంలో స్త్రీ

20.6 వివాహ వ్యవస్థలో స్త్రీ

20.7 పాలకులుగా స్త్రీలు

20.8 స్త్రీలు : వినోదాలు

20.9 కుటుంబ జీవనంలో స్త్రీ

20.10 సంగ్రహంగా

20.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

20.12 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

20.0 లక్ష్యాలు

ఈ భాగం చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

- ★ వేద కాలం, పురాణ ఇతిహాస కాలం, స్మృతుల కాలం, చారిత్రక యుగంలో స్త్రీకి స్థానం.
- ★ వివాహ వ్యవస్థలో స్త్రీ స్థానం.
- ★ పాలకులుగా ఉన్న స్త్రీల వివరణ.
- ★ వినోదాల్లో స్త్రీలు.
- ★ కుటుంబ జీవనంలో స్త్రీ స్థానం.
- ★ ఆధునిక యుగంలో స్త్రీ స్థానం.

20.1 పరిచయం

భారత స్త్రీ పురాతన కాలం నుండి, ఆధునిక యుగం వరకు ఎంతో విశిష్ట స్థానాన్ని సంతరించుకొంది. వేద కాలంలో, పురాణ ఇతిహాసాల్లో, స్మృతుల కాలంలో, చారిత్రక యుగంలో కూడా ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించుకొంది. వివాహ వ్యవస్థలో, పాలకురాలిగా, కుటుంబ జీవితంలోనూ ఆమె తన విధులను నిర్వహిస్తూ, ప్రకృతిలో పురుషునికి స్త్రీకి ఎటువంటి బేధం లేదని నిరూపించుకొంది.

అందరిలోను బ్రహ్మ స్వరూపమైన ఆత్మ ఉన్న దనే ఉన్నతమైన తాత్విక భావం కలిగిన భారతదేశంలో స్త్రీ పురుషుల మధ్య భేదం లేదు. కాని తల్లిగా సృష్టికారకురాలుగా స్త్రీకి కొన్ని బాధ్యతలు, అనుసరించవలసిన మార్గాలు ఉన్నాయి. అవి ఆమె వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేవిగాని, ఆమె అంతస్తును కించపరచేవిగాని కాదు. అంతేగాక అవి ఆమెకు గొప్పదనం చేకూర్చేవిగా ఉంటాయి. ప్రత్యేకించి ఈ విషయంలో తప్ప మిగిలిన అన్నింటిలోను స్త్రీ పురుషునితో సమానమే. స్త్రీలో ఉన్నట్టి ఐకమత్యం సమానత్వం, గొప్పదనం, పరిపూర్ణత్వం, పవిత్రత అనే ఈ లక్షణాలు గృహ జీవితంలోను సంఘ జీవితంలోను ఆధ్యాత్మిక జీవితంలోను ఎంతో ప్రభావం చూపుతాయి.

ఆధ్యాత్మిక చింతన కలిగిన స్త్రీని 'బ్రహ్మవాదిని' అనీ, గృహిణియైన స్త్రీని 'సద్యోవధు' అనీ ప్రాచీన కాలంలో వ్యవహరించేవారు. బ్రహ్మవాదిని గొప్ప ఆధ్యాత్మిక చింతనలో, సత్య జ్ఞానం, ఆత్మ జ్ఞానం, బ్రహ్మ జ్ఞానం కలిగి ముక్తి మార్గంలో పయనిస్తుంది. సద్యోవధు గృహిణిగా గృహ కృత్యాలను నిర్వహిస్తూ, కుటుంబ సేవకు అంకితమై ఉంటుంది. ఎవరి మార్గంలో వారు ఉత్తమ స్త్రీలుగా గుర్తింపబడటం చేత, బ్రహ్మవాదినులకు సద్యోవధులకు మధ్య స్పర్ధ ఎప్పుడూలేదు. బ్రహ్మ జ్ఞానం కలిగి బ్రహ్మవాదినులైన స్త్రీలు ఎందరో వివాహితులు కూడ ఉన్నారు. అలాగే సద్యోవధులు కూడ ఉత్తమ గృహిణులుగా ఉంటూనే పరబ్రహ్మ జ్ఞానం కలిగి, ముక్తి మార్గంలో నడుచుకొన్నవారు ఉన్నారు. అంటే ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండటంలో, స్త్రీ వివాహిత, అవివాహిత అనే భేదం లేదు.

BRAOU

20.2 వేద కాలంలో స్త్రీ

వేద కాలంలో స్త్రీకి సమాజంలో గొప్పగౌరవమర్యాదలు ఉండేవి. ఆమె ఇంటా బయటా చక్కగా ఆదరించబడింది. ఏ.విషయంలోను ఆమెను కించపరచిన సంఘటనలు కనిపించవు. నాటి స్త్రీలలో అన్ని విధాలుగా పురోభివృద్ధి కనిపిస్తుంది. వారిలో మంచి సంస్కారం, గొప్ప స్థాయిలో విజ్ఞానం ఉండేదనడానికి అనేక ఆధారాలు ఉన్నాయి.

ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన రచన ఋగ్వేదం. దీనిలో ఇరవై ఏడుమంది బ్రహ్మవాదినుల సూక్తాలు చేర్చబడినాయి. అంటే నాటి స్త్రీల విజ్ఞాన మెంత గొప్పదో మనం ఊహించవచ్చు. ఈ ఇరవై ఏడుమంది బ్రహ్మవాదినులు అరణ్యాల్లో తిరుగుతూ గుహల్లో ధ్యానం చేస్తూ, తపోవృత్తిలో ఉన్నవారు కాదు. అందులో చాలామంది వివాహితులై, ఉత్తమ గృహిణులుగా ఉన్నవారే.

ఈ బ్రహ్మవాదినులు రచించిన సూక్తాల్లో స్త్రీ సహజమైన భావాలే కనిపిస్తాయి. తనను ప్రేమించేవాడు సమర్థుడు అయిన భర్తను గురించి స్త్రీకి ఉండే కోరికలను గూర్చి, సుఖసంతోషాలతో గృహస్థ జీవితం గడపాలనీ, సవతి పోరుండకూడదనీ, స్త్రీలు భావించే విధానాన్నిగురించి, సద్యోవధు ఆదర్శాలను గురించి బ్రహ్మవాదినుల సూక్తాలు రచింపబడినాయి.

బ్రహ్మవాదినియైన గార్గి గొప్ప విద్యావంతురాలు. ఈమె వచక్ను ముని కుమార్తె. ఈమె జనకుని సభలో పలువురు పండితుల మధ్య యాజ్ఞవల్క్య మునితో చేసిన తాత్త్విక చర్చ 'బృహదారణ్యకోపనిషత్తు'లో కనిపిస్తుంది.

యాజ్ఞవల్క్య మునికి మైత్రేయి, కాత్యాయని అని ఇద్దరు భార్యలు ఉండేవారు. ఆ ముని సంసారాన్ని విడిచి, తపోవనానికి పోతూ తన ధనాన్ని భార్యల కివ్వబోయినాడు. కాని మైత్రేయి ధనాన్ని తిరస్కరించి, అది అశాశ్వతమైందని చెప్పి, తనకు శాశ్వతానందాన్నిచ్చేదాన్ని ఉపదేశించమని కోరింది. అప్పుడా ముని ఆమెకు బ్రహ్మ జ్ఞానాన్ని ఉపదేశించాడు. సద్యోవధువులు కూడ ఉన్నతమైన జ్ఞాన సంపన్నులుగా ఉండేవారు అనడానికి బృహదారణ్యకోపనిషత్తులోని ఈ మైత్రేయి ప్రస్తావన చక్కని నిదర్శనం.

పాణిని కాలం నాటికి కూడ వేద కాలం నాటి సంప్రదాయం, సంస్కృతి, విద్య మొదలైన అంశాలు స్త్రీలలో కనిపిస్తాయి. స్త్రీలు విద్యా బోధన కూడ చేసేవారు. అటువంటి వారిని ఉపాధ్యాయ లేక ఉపాధ్యాయి లేక ఆచార్య అనేవారు. విద్యా బోధకుని భార్యను ఉపాధ్యాయిని లేక ఆచార్యని అనేవారు. భట్టోజీ దీక్షితుడు తన 'సిద్ధాంత కౌముది'లో విద్యా బోధన చేసే స్త్రీని అధ్యాపిక అని పేర్కొన్నాడు.

20.3 పురాణ, ఇతిహాసాల్లో స్త్రీ

రామాయణ మహాభారతాల్లో కూడ బ్రహ్మవాదినులు, సద్యోవధువులైన స్త్రీలు కనిపిస్తారు. రామాయణంలో అత్రిముని భార్య అనసూయ అత్యున్నతమైన జ్ఞాన సంపన్నురాలుగా ప్రఖ్యాతిగాంచింది. శబరి అనే బోయకాంత మాతంగముని శిష్యురాలు. ఈమె గొప్ప తాత్త్విక జ్ఞానిగా ఖ్యాతిగాంచింది. సీత ఆదర్శ నారిగా యుగయుగాలుగా కీర్తించబడుతూ ఉన్నది. భారత స్త్రీకి ఉండవలసిన ఉత్తమ గుణాలన్నీ సీతలో మూర్తీభవించి ఉన్నాయని స్వామి వివేకానంద పేర్కొన్నాడు. పవిత్రత, సచ్ఛీలం, స్థైర్యం, ధైర్యం, ఆత్మ విశ్వాసం, మాతృత్వం మొదలైన సద్గుణాలన్నీ సీతలో రాశీభూతమై ఉన్నాయి.

మహాభారతంలో గాంధారి, కుంతి, ద్రౌపది, సావిత్రి, దమయంతి, శకుంతల, సత్యభామ మొదలైన వారు ఉదాత్తమైన స్త్రీలుగా పతివ్రతలుగా ప్రసిద్ధి చెందారు. గాంధారి భర్త ధృతరాష్ట్రుడు అంధుడు కాబట్టి, ఆమె కూడా కళ్లకు గంతలు కట్టుకొని, అంధకార జీవితం గడిపింది. భర్త అడుగుజాడల్లో సహధర్మచారిణిగా ఆమె నడచుకొని, ఆదర్శనారిగా ప్రసిద్ధిచెందింది. అధర్మ మార్గంలో నడుస్తున్న తన కుమారుని చర్యలను ఖండించింది. కుమారుని దుండగాలను ఆపి, ధర్మాన్ని రక్షించమని భర్తను హెచ్చరించింది. ఆనాడు ఆమె పల్కిన సూక్తి 'యతోధర్మః తతోజయః' అనేది నేటికీ లోకంలో నిలిచి ఉన్నది. ఇటువంటి ఆదర్శ గృహిణుల గురించేకాక, మత తత్త్వమెరిగిన స్త్రీ సులభ అనే బ్రహ్మవాదిని ప్రస్తావన కూడ మహాభారతంలో కనిపిస్తుంది. ఈమె అసామాన్యమైన జ్ఞాన సంపన్నురాలు కావడం చేత, ఈమెకు సమానమైన జ్ఞాన సంపన్నుడైన పురుషుడు భర్తగా ఎవరూ లభించక, ఈమె అవివాహితగానే ఉండిపోయింది.

మార్కండేయ పురాణంలో మదాలస అనే ఆమె గొప్ప విద్వాంసురాలు, యోగిని అయినా కూడా గృహిణిగా, పతివ్రతగా, మాతృమూర్తిగా కర్తవ్య నిర్వహణ గావించిన ఆదర్శ నారిగా పేర్కొనబడింది.

'భాగవత పురాణం'లో దేవహూతి అనే యోగ మార్గమెరిగిన స్త్రీ ప్రస్తావన కనిపిస్తుంది. దేవహూతి కర్దముని భార్య. కపిల మహర్షి తల్లి. ఈమె కుమారుడైన కపిలుని ద్వారా యోగ మార్గాన్నెరిగి భారతీయ తత్త్వంలో సాంఖ్య పద్ధతిని ప్రవేశపెట్టినది.

BRAOU

20.4 స్మృతుల్లో స్త్రీ

స్త్రీల జీవితంలో వేదకాలం నాటి స్వర్ణ యుగం స్మృతుల కాలంలో కనిపించదు. ఈ సమాజంలో స్త్రీకి పురుషునితో సమానమైన గౌరవం లేదు. స్త్రీలు శూద్రులతో సమానంగా చూడబడినారు. వేద మంత్రాలను, వైదిక క్రతువులను స్త్రీలు, శూద్రులు చేయకూడదనే నియమం ఏర్పడింది. వేద కాలంలో వలె స్మృతుల కాలంలో స్త్రీలు ఆధ్యాత్మిక మార్గంలో బ్రహ్మవాదినులుగా కాని, గృహస్థ మార్గంలో గృహిణులుగా కాని తమ ఇష్టానుసారం ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకోవడానికి వీలు లేదు. స్త్రీలు ఈ కాలంలో వివాహం చేసుకొని, గృహిణిలుగానే జీవించాలి. అందుకు భిన్నంగా నడచుకొన్న స్త్రీకి సంఘంలో గౌరవం ఉండదు. కాబట్టి నాటి స్త్రీలు తప్పనిసరిగా వివాహితులై, గృహిణిగా కర్తవ్యాన్ని నిర్వహించవలసి ఉండింది. స్త్రీ భర్తకు నిధేయురాలై, భర్తతో మత కర్మల్లోను పుణ్యకార్యాల్లోను, వేడుకలు, ఉత్సవాల్లోను పాల్గొంటూ, సహధర్మచారిణిగా గుర్తింపును కలిగి ఉంటుంది. అలాగే స్త్రీకి ఆనాడు మాతృమూర్తిగా మంచి గౌరవం లభించేది.

పదిమంది ఉపాధ్యాయులకంటే ఒక ఆచార్యుడు గొప్పవాడు, నూరు మంది ఆచార్యులకంటే తండ్రి గొప్పవాడు, వెయ్యిమంది తండ్రులకంటే ఒక తల్లి గొప్పది అని మనువు స్త్రీకి అత్యున్నతమైన స్థాయిలో మాతృ స్థానాన్ని కల్పించాడు. అంతేకాక పురుషుడు సతీ సమేతంగా చేయని పుణ్య కార్యాలుగాని, మత కర్మలుగాని, క్రతువులుగాని వ్యర్థమేనని మనువు పేర్కొన్నాడు. అంటే దాంపత్య జీవితంలో కూడ స్త్రీకి అత్యుత్తమ స్థానం ఉన్నదని తెలుస్తుంది. భర్తతో మతకర్మలు లేక మతపరమైన కార్యాలన్నిట పాలు పంచుకొనేది పత్ని అని పాణిని పత్ని పదాన్ని నిర్వచించాడు. అర్ధాంగి అనే పదం కూడ స్త్రీ ప్రాముఖ్యాన్ని తెలిపేది, గృహిణిగా ఆమె పాత్రను సూచించేది. అయినా స్త్రీ జీవితం అస్వతంత్రంగా ఉండేది. ఆమె అవివాహితగా ఉన్నప్పుడు తండ్రి అధీనంలోను, వివాహానంతరం భర్త అధీనంలోను, వృద్ధాప్యంలో పుత్రుల అధీనంలోను ఉండాలి అనే మనుధర్మ సూత్రం అందుకు నిదర్శనం.

20.5 చారిత్రక యుగంలో స్త్రీ

ఈ కాలంలో బాలికలకు సంగీత నృత్యాలను చిన్ననాటినుండే నేర్పించేవారు. బాలికలకు ఇంటివద్దనే విద్య నేర్పించడానికి వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులను నియమించేవారు. అందువల్ల బీదవారైన బాలికలు విద్యావంతులయ్యేవారు. అందుకు అనేకమైన చారిత్రకాధారాలున్నాయి.

దక్కన్ రాజైన రెండవ చాళుక్య విక్రమాదిత్యుని భార్య కేతలదేవి అభినవ సరస్వతిగా ప్రసిద్ధి వహించింది. శైలభట్టారిక అనే ఆమె పాంచాలి శైలిలో చక్కని పద్యాలను రచించింది. కర్ణాటకకు చెందిన విజయాంక సరస్వతీ సమానురాలుగాను, కాళిదాసుతో సమానమైన ప్రతిభావంతురాలుగాను ఖ్యాతి గాంచింది. గుజరాత్‌కు చెందిన దేవి అనే కవయిత్రి కవిత్వం శాశ్వతంగా ప్రజల హృదయాల్లో నిలిచింది. రాజశేఖరుని భార్య అవంతీ సుందరి గొప్ప విమర్శకురాలుగాను, కవయిత్రిగాను పేరుగాంచింది. ఇంకా ఇతర కవయిత్రులు భావదేవి, సరస్వతి, ఫల్గుహస్తిని, మోరిక, విజ్జిక మొదలైన వారి కవితలు వివిధ సంకలన గ్రంథాల్లో ఉదాహరించబడి ఉన్నాయి. ఋషి అనే ఆమె స్త్రీ రోగాలకు సంబంధించిన వైద్యశాస్త్ర గ్రంథాన్ని రచించింది. ఇది క్రీ.శ. 8వ శతాబ్దంలో అరబిక్ భాషలోనికి అనువదించబడింది. మండన మిశ్రుని భార్య ఉభయ భారతి శంకరాచార్యునికి తన భర్తకు మధ్య జరిగిన చర్చకు న్యాయనిర్ణేతగా ఉంది. ఈ విధంగా ప్రాచీన కాలంలో భారత స్త్రీలు విద్యాధికులై, శాశ్వతమైన ఖ్యాతిని గడించారు.

BRAOU

20.6 వివాహ వ్యవస్థలో స్త్రీ

బాలికలకు ఎనిమిది నుండి పన్నెండు సంవత్సరాల లోపల వివాహం చేయాలని దక్ష, అంగీరస, యమ, పరాశర మొదలైన వారు పేర్కొన్నారు. కుమార్తెకు వివాహం చేయలేకపోయిన తండ్రి గొప్ప పాపం చేసిన వాడవుతాడనే నమ్మకం ఉన్నది. థానేశ్వర్ రాజైన ప్రభాకరవర్ధనుడు తన కుమార్తెకు వివాహం చేయడానికి మిక్కిలి తాపత్రయం పడినట్లుగా బాణుడు పేర్కొన్నాడు. బ్రాహ్మణులు బలికలకు పన్నెండు సంవత్సరాలకే వివాహం చేసేవారు. రాజ కుటుంబాల్లో బలికలు స్వయంవర సభలో భర్తలను ఎన్నుకొనేవారు. దక్కన్ రాజైన నాల్గవ చాళుక్య విక్రమాదిత్యుని చంద్రరేఖ స్వయంవర సభలో వరించింది. ధర్మశాస్త్రాల ప్రకారం బాలికకు తండ్రిగాని, తల్లిగాని, సోదరుడుగాని, తాతగాని, మామగాని వివాహం చేయవచ్చు. వీరెవరు లేని పక్షంలో బాలిక తనంత తానే వరుడిని పొందవచ్చు.

వివాహిత స్త్రీలు పసుపు, కుంకుమ, కాటుక, కేశాలంకరణకు ప్రత్యేకమైన ఆభరణాలను వాడుకొనేవారు. మేలిముసుగు ఉన్నతమైన కుటుంబాల్లో పాటించబడేది. ప్రభాకర వర్ధనుని కుమార్తె రాజ్యశ్రీ మొట్టమొదటిసారి భర్తకడకేగినపుడు మేలిముసుగుతో వెళ్లింది. గొప్ప కుటుంబాల్లో స్త్రీలు పరదా లేకుండా బయటకు వెళ్లేవారుగారు. కాని పరదా వర్ధతి అన్ని చోట్ల సాధారణమైన సంప్రదాయంగా ఉండేదికాదు. 12వ శతాబ్దం నాటి రచన 'పవనదూత' వల్ల బెంగాల్‌లో పరదా పద్ధతి లేదని తెలుస్తుంది. హర్షవర్ధనుని తల్లి యశోమతి మంత్రులకు స్వయంగా సూచనలిచ్చేది. అరబ్ భూగోళ శాస్త్రజ్ఞుడు ఆబుజయిద్ (9వ శతాబ్దం) భారతదేశంలోని రాజులు తమ రాణులను సభకు తీసుకొని వెళ్లేవారని, వారు పరదా లేకుండా అందరికి దర్శన మిచ్చేవారని పేర్కొన్నాడు.

ధర్మశాస్త్రాలు పురాణాలు స్త్రీని గృహారాణిగా పేర్కొన్నాయి. 'బాధలను పోగొట్టి ఆనందాన్నిచ్చేది, గృహంలోని దేవతలను అతిథులను తృప్తిపరచేది, ఇంటిలో అందరికంటే ముందుగా నిద్రలేచి, గృహకృత్యాలను నిర్వహించి కుటుంబ సభ్యులందరినీ సుఖపెట్టేది గృహిణి' యని ఆయా గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. భర్తను హరిహరాదుల కంటె మిన్నగా పూజించేది, భర్తను దైవంగా సేవించేదీ, భర్త భుజించిన తర్వాతనే భుజించేది ఉత్తమ గృహిణి లక్షణమని ఆ గ్రంథాలు తెలుపుతున్నాయి. స్త్రీలు తమ భర్త పేరు ఉచ్చరించరాదనే నమ్మకం ఉండేది. భర్త పేరు భార్యోచ్చరిస్తే, అతని ఆయుస్సు తగ్గుతుందనే విశ్వాసం అనాడు ఉండేది. భర్త దేశాంతరం పోయినపుడు అతని భార్య అలంకరించుకొనేదికాదు. ఉత్సవాలు వేడుకలు మొదలైన వాటిలో పాల్గొనేదికాదు. సామాన్యమైన ఆహారం తీసుకొంటూ, భర్త రాకకై ఎదురు చూస్తుండేది.

బయటినుండి ఇంటికి వచ్చిన భర్తను కూర్చుండబెట్టి పాదాలు కడగటం, అతనికి విసనకర్రతో గాలి విసురుతూ సేవలు చేయటం భార్య కర్తవ్యంగా ఉండేది. ఇటువంటి గృహిణిని పతివ్రతగా ఆయా గ్రంథాలు కీర్తించాయి. పతివ్రతమైన స్త్రీ పవిత్రమైన గంగానదివలె ఇంటిని పావనం చేస్తుందని ధర్మశాస్త్రాలు పేర్కొన్నాయి. అందుకే మన పూర్వులు

'కార్యేషు దాసీ కరణేషు మంత్రీ

భోజ్యేషు మాతా శయనేషు రంభా

రూపేచ లక్ష్మీ క్షమయా ధరిత్రీ

షట్కర్మయుక్తా కుల ధర్మపత్నీ' - అని

వ్యాఖ్యానించారు.

BRAOU

పురుషుడు కూడ తన భార్య విషయంలో కొన్ని బాధ్యతలను వహించాలి. భార్య రక్షణ భారం పూర్తిగా భర్త వహించాలి. ఆమెను ప్రేమతో చూచుకోవాలి. అంతేగాక అతడు ఆమె ఎడల నిరంకుశంగా వ్యవహరించకూడదు; హింసించకూడదు.

స్త్రీ తన భర్త అనుమతితోనే మతపరమైన కార్యక్రమాలను, వ్రతాదులను, తీర్థయాత్రలను చేయవలసి ఉంటుంది. రాజకుటుంబాల్లో బహుభార్యాత్వం ఉన్నది. కనోజ్ రాజైన గోవింద చంద్రునికి (క్రీ.శ. 1114 - 1156) చాలా మంది భార్యలుండేవారు. అందులో ఇద్దరు బౌద్ధమతానుయాయులు కూడ ఉన్నట్లు తెలుస్తుంది.

స్త్రీకి మత విషయంలో భర్త తోడ్పాటు బాగా ఉండేది. పాల వంశీయుడైన మదన పాలుడనే రాజు (క్రీ.శ. 1150) తన భార్యకు భారతం చదివి వినిపించిన బ్రాహ్మణునికి ధనమిచ్చాడు. బెంగాల్ రాజు విజయసేనుని భార్య విలాసదేవి (క్రీ.శ. 1158) తమ విక్రమపుర రాజసౌధంలో హోమం చేయించి, మనిషెత్తు బంగారాన్ని దానమిచ్చింది. జైనుడైన చాళుక్య రాజు రెండవ జయసింహ జగదేకమల్ల (క్రీ.శ. 1015 - 1043) భార్య సుగ్గలదేవి వలన శైవుడుగా మారినాడు. ఆ రోజుల్లో బౌద్ధ సన్యాసినులైన స్త్రీలు చాలమంది ఉండేవారు కాబట్టి, స్త్రీలకు మతపరమైన స్వాతంత్ర్యం ఉండేదని స్పష్టమౌతుంది.

'బృహస్పతి ధర్మం' ప్రకారం గృహిణియైన స్త్రీ రేయింబవలు అత్త దృష్టిని దాటి పోకూడదు. నాటి సమాజంలో సంతానవతియైన స్త్రీకే ఎక్కువ గౌరవం ఉండేది. భార్యనొల్లని పురుషుని ఆస్తిని తీసుకొని, ప్రభువు అతనిని గాడిద మీద ఊరేగించాలని ధర్మశాస్త్రాలు పేర్కొంటున్నాయి. స్మృతులు పురాణాలు పతివ్రతలైన స్త్రీలే గౌరవనీయులుగా తెలుపుతున్నాయి. కాని వరాహమిహిరుని ప్రకారం సాధారణంగా స్త్రీలందరు పవిత్రమైనవారు గౌరవనీయులు. అయితే కాళిదాసు, బాణుడు, భవభూతి మొదలైన వారి రచనల్లో మంచి నడవడిక కలిగిన స్త్రీలే గౌరవనీయులనే అభిప్రాయం కనిపిస్తుంది.

భర్త మరణించిన స్త్రీ సతీ సహగమనం చేయవచ్చు లేదా విధవగా ఉదాత్తమైన జీవితం గడపవచ్చునని స్మృతులు తెలుపుతున్నాయి. స్మృతులు పురాణాలు ఎక్కువగా సతీ సహగమనాన్ని ప్రోత్సహిస్తున్నాయి. భార్య భర్త జీవించి ఉన్నపుడు అతనిని భక్తితో సేవించాలి. భర్త మరణించినపుడు అతనిని అనుసరించి సహగమనం చేసి, సహధర్మచారిణి కావాలి అని బృహస్పతి స్పష్టం చేశాడు. 'బృహద్ధర్మ పురాణం'లో భార్యసతీ సహగమనం చేసి భర్తను అనుసరించక పోతే, మహాపాపమని చెప్పబడింది. సహగమనం వల్ల భర్త ఆత్మకు శాంతి లభిస్తుందని, గర్భవతిగాని, చిన్నపిల్లలున్న స్త్రీగాని, ముసలిదైన స్త్రీగాని సతీ సహగమనం చేయనవసరం లేదని స్పష్టం చేయబడి ఉన్నది. ఒక్కొక్కసారి స్త్రీలు కొందరు తమకు తామే సతీ సహగమనం చేసేవారు. భర్తపై ప్రేమగాని, భర్త మరణానంతరం బంధువులు సరిగ్గా చూడరనే భయంవల్లగాని, స్త్రీలు తమకు తామే సహగమనం చేయడానికి ప్రత్యేక కారణాలుగా కనిపిస్తాయి.

స్త్రీ సహగమనం చేసిన అనేక సంఘటనలు చరిత్రను పరిశీలించినపుడు మనకు తెలుస్తాయి. భానుగుప్తుని ఆస్థాన ఉద్యోగియైనగోపరాజు భార్య సతీ సహగమనం చేసింది (క్రీ.శ. 510). నేపాల్ రాణి రాజ్యవతి (క్రీ.శ. 8) సహగమనం చేసింది. చాళుక్య రాజైన సత్యాశ్రయుని మంత్రి బాగదేవుడు యుద్ధంలో మరణించినపుడు అతని భార్య గుండాంబ (క్రీ.శ. 10వ శతాబ్దం) సతీ సహగమనం చేసింది. దక్షిణ దేశంలోని రాజేంద్రచోళుని (క్రీ.శ. 1057) రాజ్యంలోని దేకాంబ అనే శూద్ర వనిత భర్త మరణవార్తను విని, తవంతటతానే ఒళ్లుకాల్చుకొని మరణించింది. హర్షవర్ధనుని తల్లి యశోమతి తన భర్త కాసేపట్లో మరణించబోతున్నాడని తెలిసి, తనను తాను కాల్చుకొని మరణించింది. అయితే సతీ సహగమనం అనేది సర్వసాధారణమైన ఆచారంగా నాడు లేదు.

మహాభారతంలో పాండురాజు మరణించినపుడు చిన్నపిల్లలైన పాండవుల సంరక్షణ కోసం కుంతి సహగమనం

BRAOU

చేయలేదు. మాద్రి మాత్రమే పాండు రాజుతో సహగమనం చేసింది. అప్పుడు కూడ అదొక ఆచారంగా జరుగలేదు. పాండు రాజు మరణానికి తానే కారకురాలు కాబట్టి, తాను సహగమనం చేయాలని మాద్రి నిర్ణయం తీసుకొన్నది. అనంతర కాలంలో కూడ పతివ్రతలుగా ప్రసిద్ధి చెందినవారు కొందరు స్త్రీలు సహగమనం చేయలేదు. దక్కన్ రాజ్యంలోని వాకాటక వంశంలోని ప్రభావతిదేవి, గుజరాత్ రాజ్యంలోని జయసింహుని తల్లి మయనాలాదేవి, అజ్మీర్‌లోని ముడో పృథ్వీరాజ్ తల్లి కర్పూరదేవి మొదలైనవారు భర్త మరణించినపుడు వితంతువులుగానే ఉదాత్తమైన జీవితం గడిపారు కాని సతీ సహగమనం చేయలేదు.

స్మృతుల్లో వితంతువులకు నియమపూర్వకమైన నడవడి నిర్దేశించబడి ఉన్నది. వితంతువులు నేల మీదనే నిద్రించాలి. మంచం మీద పడుకొనరాదు. అలంకరణలను, అత్తరు, గంధం వంటి సుగంధ ద్రవ్యాలను, పసుపు, కుంకుమ, కాటుక వంటి మంగళద్రవ్యాలను వాడకూడదు. ఒక్కపూట మాత్రమే భుజించాలి. ప్రతిరోజు భర్త స్మారకంగా పూజలు నిర్వహిస్తూ, పురాణ కాలక్షేపం చేస్తూ ఉండాలి. వితంతువులకు స్మృతుల్లో ఈ విధంగా నిష్ఠాపూర్వకమైన జీవన విధానం విధించబడి ఉన్నది.

స్మృతులు పురాణాలు స్త్రీ పునర్వివాహాన్ని అంగీకరించలేదు. భర్త మరణించిన స్త్రీకి పుత్రులు లేనట్లయితే, ఆమెకు ఆస్తి హక్కు ఉండేది కాదు. క్రీ.శ. 12వ శతాబ్దం మధ్యలో గుజరాత్ రాజైన చాళుక్య కుమారపాలుడు ఈ పద్ధతిని తొలగించి, సంతతిలేని వితంతువుకు భర్త ఆస్తిపై హక్కులభించే విధంగా చట్టం చేశాడు. ఇదే పద్ధతి భారతదేశమంతటా నేటికి అమలు జరుగుతున్నది.

20.7 పాలకులుగా స్త్రీలు

అత్యంత ప్రాచీన కాలంలో స్త్రీలు పరిపాలనా రంగంలో ప్రవేశించలేదు కాని క్రీ.శ. 7వ శతాబ్దంలో దక్కన్ రాజ్యాన్ని చాళుక్య వంశానికి చెందిన విజయ భట్టారిక అనే ఆమె పరిపాలించింది. 8వ శతాబ్దం పూర్వార్ధంలో దక్కన్ రాజ్యాన్ని రాణి సుగంధ, దిడ్డ అనేవారు కాశ్మీరును పరిపాలించారు. 11వ శతాబ్దంలో త్రిభువన మహాదేవి, ఆమె మనుమరాలు దండి మహాదేవి ఒరిస్సా రాజ్యాన్ని పాలించారు. 13వ శతాబ్దంలో కాకతీయ రుద్రమాంబ వరంగల్‌లో రాజ్య పాలన చేసింది. రుద్రమాంబ కాకతీయ సామ్రాజ్యాన్ని సర్వసమర్థంగా, ధర్మయుతంగా, శాంతి భద్రతలతో పరిపాలించినట్లు మార్కోపోలో వర్ణించాడు 13వ శతాబ్దంలోని బాల మహాదేవి దక్షిణ కెనరాను పరిపాలించింది. గుజరాత్‌కు చెందిన చాళుక్య జయసింహ సిద్ధరాజు ప్రతినిధిగా అతని తల్లి మయనాలాదేవి పరిపాలించింది. అజ్మీర్ రాణి కర్పూరదేవి తన కుమారుడు ముడో పృథ్వీరాజ్ ప్రతినిధిగా రాజ్యాన్ని పాలించింది.

గుజరాత్‌కు చెందిన రెండో చాళుక్యభీముని తల్లియైన నాయికాదేవి చిన్నవాడైన తన కుమారుని తరపున రాజ్య పాలన చేసింది. దక్కన్ రాజైన రెండోచాళుక్య జయసింహుని సోదరి అక్కాదేవి రాజ్య పాలన చేసింది. పాలకులుగానే కాక, స్త్రీలు మంత్రులుగాను న్యాయాధికారులుగాను కూడ వ్యవహరించినట్లు చారిత్రకమైన ఆధారాలు కనిపిస్తున్నాయి. 11వ శతాబ్దంలో భోద్, బొంబాయి రాష్ట్రాలను సిరిమాదేవి, మహలదేవి పరిపాలించారు. సిరిమాదేవి దగ్గర సోమనాథ్య అనే ఆమె మంత్రిగా ఉండేది. బాల్య అనే ఆమె మహలదేవి దగ్గర న్యాయాధికారిగా ఉండేది.

ఒక్కొక్కసారి స్త్రీలు కూడ యుద్ధ రంగానికి వెళ్లేవారని తెలుస్తున్నది. అక్కాదేవి యుద్ధ రంగంలో ఎందరో శత్రు రాజులను జయించింది. ఆమె క్రీ.శ. 1047లో సైన్యాధికారిగా గూడ వ్యవహరించింది. క్రీ.శ. 1197 మాధవవర్మ పరిపాలించే సమయంలో ఉమాదేవి మైసూర్ రాష్ట్రంలోని షిమోగా జిల్లాకు చెందిన బెల్గవట్టి మీద

BRAOU

దండయాత్ర చేసింది. క్రీ.శ. 1178లో మహమ్మద్ గోరీ గజరాత్‌పై దండయాత్ర చేసినపుడు నాయికాదేవి అతనిని యుద్ధరంగంలో ఎదుర్కొన్నది. కాకతీయ రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి పాలకులుగా ఉండి, యుద్ధరంగంలో కూడ తమ ప్రతాపాన్ని ప్రదర్శించినవారే.

20.8 స్త్రీలు : వినోదాలు

స్త్రీలు సాధారణంగా స్వగృహంలోనే సంగీత నృత్యాలతో వినోదించేవారు. స్త్రీలు భర్త పరదేశంలో ఉన్నప్పుడు నృత్యం చేయకూడదని బృహస్పతి శాసించాడు. హర్షవర్ధనుని జన్మదినవేడుకల్లో స్త్రీలు నృత్యం చేసినట్లు, బాణుడు వర్ణించాడు. గాంగ వంశీయుడైన ఉదయాదిత్యుని భార్య సంగీత నృత్యాల్లో విద్వాంసురాలని తెలుస్తున్నది. మొదటి హొయసలభళ్లాలుని భార్యలు ముగ్గురు నృత్యంలో నిపుణులుగా ప్రసిద్ధి చెందారు. కల్చూరి సోమదేవుని భార్య శావలదేవి సంగీత నృత్యాల్లో నిపుణురాలేకాక, ప్రదర్శనలను కూడ ఇచ్చేదట.

ప్రాచీన కాలంలో దేవాలయాల్లో నృత్యం చేయడానికి స్త్రీలను దేవదాసీలుగా నియమించేవారు. మొదటి చోళరాజరాజు కాలంలో తంజావూరు బృహదీశ్వరాలయంలో నాలుగు వందలుమంది దేవదాసీలున్నట్లు తెలుస్తున్నది. రాజా హరివర్మ మంత్రియైన భట్టభవదేవ తూర్పు బెంగాల్‌లోని అనంతవాసుదేవాలయానికి నూరుమంది దేవదాసీలను సమర్పించాడు. నీలకంఠేశ్వరుని ఆలయంలోని నృత్యాంగనలకు పద్మావతి అనే ఆమె నాయకురాలుగా ఉండేది. సాధారణంగా దేవదాసీలు అనీతి మార్గంలో జీవించేవారు. తల్లి దండ్రులు కూడ తమ కుమార్తెలను వివాహం అయ్యేవరకు భక్తితో ఆలయాల్లో ఉత్సవాలు జరిగే సందర్భంలో నృత్యం చేయించేవారని మార్కోపోలో రచించాడు. నృత్యాంగనలు అప్పుడప్పుడు నాటకాలు కూడ వేసేవారు. దక్షిణదేశంలోని వీరపాండ్యుని కాలంలో వీరశేఖరనంగై అనే నాట్యకత్తె ఉత్సవంలో నాటకప్రదర్శన ఇచ్చి, ప్రభువు నుండి భూమిని బహుమతిగా పొందినది.

20.9 కుటుంబ జీవనంలో స్త్రీ

ప్రాచీన భారతీయుల అభిప్రాయం ప్రకారం, వివాహం ఒక పవిత్రమైన బంధం. అంతేగాని అదొక ఒడంబడికగాని ఒప్పందంగాని కాదు. చతుర్విధ పురుషార్థ సాధనకు, పారమార్థిక సాధనకు ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పాటు చేయబడిన ఐక్యతే వివాహం. వివాహ మంత్రాల్లో ఇదే ప్రముఖంగా పేర్కొనబడిన అంశం. వివాహం దైవ నిర్ణయంగా భావించబడింది. కాబట్టి దైనం కలిపిన జంటను ఏరెవరు విడదీయలేరనే భావం బలంగా ఉన్నది. సతి పతిలో సగభాగంగా భావించబడింది. భర్త ప్రక్కన భార్య కష్టసుఖాల్లో జీవితాంతం నిలబడుతుంది.

వివాహం అయిన తర్వాత యువకుడు బండిలో భార్యతో పాటు అగ్నిని కూడ తీసుకొనివెళ్లి, తన ఇంటిలో దాన్ని వెలిగిస్తాడు. అది అతని వైవాహిక జీవితానికి గుర్తు. దాన్ని అతడు మరణాంతంవరకు వెలిగిస్తూనే ఉంటాడు (నిత్యాగ్నిహోత్రుడు). ఆ నిప్పునుండే భార్యపంట చేయడానికి నిప్పును తీసుకొంటుంది. ఆ అగ్నికి అతడు ఉభయసంధ్యల్లో సతీసమేతంగా నమస్కరిస్తుంటాడు. యజ్ఞయాగాదులుగాని, హోమంగాని పురుషుడు సతీసమేతంగానే చేయాలి. ఈ విధంగా భార్యాభర్తలు రథానికి కట్టిన జోడుగుర్రాలవలె నడచుకొనేవారు. వేద కాలంనాటి స్త్రీ గృహిణిగా భర్తతో అన్ని విధాల సమానమైన స్థాయిలో ఉండేది.

B R A O U

పురుషుడు భార్య లేకుండా చేసే ఏ క్రతువూ లేదని 'తైంతిరీయ బ్రాహ్మణం'లో పేర్కొనబడి ఉన్నది. పత్ని అనే పదానికి భర్తతో అన్ని క్రతువుల్లోను పాల్గొనేది అని అర్థం. ఏ హోమమైనా, ఏ యజ్ఞమైనా దంపతులిద్దరు కలిసి చేయాలని అత్రిముని చెప్పాడు. కుటుంబ జీవనంలో భర్త తన కర్తవ్యాన్ని నిర్వహించినా, లేకపోయినా, భార్య మాత్రం తన ధర్మాన్ని నిర్వర్తించాలి. ఎందుకంటే పతి సేవ చేతనే, స్త్రీ పరమార్థాన్ని సాధించగలదనే భావన ఉండేది. 'వర్ణాశ్రమ ధర్మ నిర్వహణలోకూడ స్త్రీ తన భర్తకు సహకరించాలి. స్త్రీ స్వయంగా పుణ్య కార్యాలను గాని మత కర్మలనుగాని, నిర్వహించకూడదు. భర్త ఎడల తన కర్తవ్యాన్ని విస్మరించకూడదు. భర్తను ధిక్కరించకూడదు. స్త్రీకి భర్తే సర్వస్వం; స్వర్గం కంటె మిన్న' అని గౌతముని పేర్కొన్నాడు. 'విష్ణు స్మృతి'లోను, మహా భారతంలోను ఇటువంటి సిద్ధాంతాలే ఉన్నాయి. అయితే అంత మాత్రం చేత స్త్రీ తక్కువ అనే భావం ఎక్కడా కనిపించదు.

రామాయణ భారతాల్లో స్త్రీలు ఉదాత్తంగాను,గౌరవనీయులుగాను కనిపిస్తారు. సీత, కౌసల్య మొదలైనవారు సుకుమారులుగాను, మృదువైన స్వభావం కలిగిన వారుగాను, ఆదర్శ మాతృమూర్తులుగాను, ఉత్తమ గృహిణులుగాను ప్రసిద్ధి చెందారు. భారతంలో వీరోచితమైన స్త్రీలు కనిపిస్తారు. కుంతి, గాంధారి, ద్రౌపది వంటి వీరమాతలు, యముడినే ఎదిరించిన సావిత్రి వంటి పతివ్రతలు ఖ్యాతి వహించారు. సింధు నదీ తీరంలో ఉన్న సేవీరదేశరాజు సింధీలతో యుద్ధం చేయజాలక నిముఖుడైనపుడు అతని తల్లి విదుల అతనికి ఉత్తేజాన్ని కలిగించింది. మదాలస అనే ఆమె తన నలుగురు కుమారులను లౌకిక జీవనం నుండి ఆధ్యాత్మిక జీవనం వైపు మరల్చింది. ఈవిధంగా స్త్రీ గృహిణిగా, మాతృమూర్తిగా బాధ్యతలను, కష్టసాధ్యమైన కర్తవ్యాన్ని నిర్వహించి, విశిష్టమైన స్థానాన్ని పొందింది.

మనసు కలిసిన దంపతులిద్దరు కలిసి చేసిన ప్రార్థనకు దేవుడు ప్రసన్నుడై, దీవెనల వర్షం కురిపిస్తాడని ఋగ్వేదంలో చెప్పబడి ఉన్నది. ఏడడుగులు కలిసి నడిస్తే, ఇద్దరు స్నేహితులవుతారు. కాబట్టి వివాహ సంప్రదాయంలో దంపతులను ఏడడుగులు నడిపించి, భార్యాభర్తలు స్నేహంగా ఉండాలని సూచించడం జరిగింది. 'నాతో ఏడడుగులు నడిచి స్నేహితురాలైనావు. నీ స్నేహాన్ని పొందిన నేను దాన్నెప్పుడు పోగొట్టను. ఇద్దరం కలసి ప్రేమ బంధంతో ఒకరి సాన్నిహిత్యంలో ఒకరం సార్థకమైన జీవితాన్ని గడుపుతూ, సుఖ సంతోషాలను, బాధ్యతలను కలిసి పంచుకొంటూ ఆదర్శంగా జీవిద్దాం' - అని పెళ్లికొడుకు పెళ్లి కూతురుతో వివాహ మంత్రాల్లో పలుకుతాడు.

తమ మనసులు, హృదయాలు శాశ్వతంగా కలసి ఉండాలని దంపతులు కలసి ప్రార్థన చేసినట్లు, అథర్వణ వేదంలో ఉన్నది. అంకిత భావంతో భర్తకు సేవచేసే పతివ్రతలు దైవాన్ని కూడ శాసించగలరని, అటువంటి స్త్రీల గాథల నెన్నింటినో కవులు వర్ణించారు. అనసూయ, సుకన్య, సావిత్రి, లోపాముద్రమొదలైన పతివ్రతలు దైవాలను శాసించిన సతీమణులే.

గృహిణి లేని గృహం గృహమే కాదని 'శతపథ బ్రాహ్మణం'లో చెప్పబడి ఉన్నది. అందుకే 'ఇల్లాలు లేని ఇల్లు చెయ్యాలకొంప' అనే సూక్తి ఏర్పడింది. వైదిక కాలంలో భార్య మరణిస్తే, పురుషుడు తన ఇంటిలోని నిప్పుతోనే భార్యకు దహన సంస్కారం చేస్తాడు. అనంతరం అతడు మరొక వివాహం చేసుకొని, ఆ రెండవ భార్యతో తెచ్చిన నిప్పుతో మరల అగ్ని హోత్రాన్ని ప్రారంభిస్తాడు. లేదా నాటి నుండి అతడు అడవికి పోయి, వానప్రస్థాశ్రమాన్ని స్వీకరిస్తాడు. భార్య మరణించినవాడు గృహస్థాశ్రమంలోనే కాలం గడపదలచుకొంటే, భార్య మరణం వల్ల కలిగిన అంటుపోకముందే, వెంటనే వివాహం చేసుకోవాలి. అలా చేయకపోతే అతడు నిత్యాగ్ని హోత్రి కాజాలడు. అలా చేయని వాడు ఆశ్రమ ధర్మాలను అతిక్రమించిన వాడవుతాడు.

ప్రాచీన సాహిత్యంలో అనేక చోట్ల ఉదాత్త చరిత్ర, ఉన్నతమైన భావాలు, ఆత్మ జ్ఞానం, విశిష్టమైన వ్యక్తిత్వం, ధైర్యం, ప్రేమ, ఆత్మీయత, పాతివ్రత్యం కలిగిన గృహిణుల ప్రస్తావనలు కనిపిస్తాయి.

అత్రిమువి కుటుంబానికి చెందిన స్త్రీ వైశ్వనర అనే ఆమె కుటుంబంలో ప్రేమ పూరితమైన వాతావరణం ఉండాలని ప్రార్థించిన సూక్తం ఋగ్వేదంలో కనిపిస్తుంది. తన రథాన్ని తానే నడుపుకొంటూ భర్తతో కలసి దొంగలతో యుద్ధం చేసి, ఆలమందను కాపాడుకొన్న ధైర్యశాలియైన ఇంద్రసేన ప్రస్తావన యజు ర్వేదంలో కనిపిస్తుంది. తన భర్తయైన అగస్త్యుని రాక్షస ఎదురు చూస్తూ తన ఆకలిని కూడ నిగ్రహించుకొన్న పతివ్రత లోపాముద్ర.

BRAOU

మనుస్మృతిలో ఉన్న ధర్మం 'స్త్రీ వృద్ధాప్యంలో పుత్రుని సంరక్షణలో ఉండాల'నేది స్త్రీని న్యూనపరచడమని అర్థం కాదు. కుమారునికి తల్లి దేవతతో సమానం. తల్లి దృష్టిలో కుమారుడు ఎంత పెద్దవాడైనా రెండేళ్ల పసిబిడ్డతో సమానమని భారతంలో చెప్పబడి ఉన్నది. వసిష్ఠుడు, యాజ్ఞవల్క్యుడు తల్లి స్థానం లోకంలో అందరికంటే వెయ్యిరెట్లు గొప్పదిగా చెప్పారు.

వివాహ వ్యవస్థ పవిత్రతను బట్టి, భారతదేశంలో వితంతు వివాహం సాధ్యం కాదు. ఆడపిల్ల తండ్రి కన్యాదానం పేరుతో ఆమెను ఒక పురుషునికి అప్పగించిన తర్వాత, ఆమె శాశ్వతంగా అతని సొత్తు అవుతుంది. కాబట్టి అతడు మరణించిన తర్వాత కూడ అతని భార్య అతని సొత్తుగానే పరిగణించబడుతుంది. కన్యాదానం తండ్రి ఒక్క సారే చేయగలడు. దానం చేయబడిన దానిపై దాతకు ఎటువంటి హక్కు ఉండదు. అంతేగాక మరణించిన భర్త పరలోకంలో తనభార్యకై ఎదురుచూస్తుంటాడు. పతి భక్తి కలగిన భార్య తన పతికొరకు అతని స్మృతితో అలాగే ఉండాలి అనే భావం ఉండేది.

అనంతర కాలంలో ధర్మశాస్త్రాలు స్త్రీ పునర్వివాహాన్ని అంగీకరించాయి. పునర్వివాహితయైన స్త్రీని 'పునర్భువు' అంటారు. భర్త విడిచిపెట్టిన, మరణించిన, నపుంసకుడైన, సన్యాసియైన; కులం నుండి బహిష్కరించబడిన - ఈ అయిదు పరిస్థితుల్లోను స్త్రీ పునర్వివాహం చేసుకోవచ్చునని ధర్మశాస్త్రాలు నిర్దేశించాయి. అయితే పరాశరుడు పై సందర్భాల్లో, స్త్రీ పునర్వివాహం చేసుకోవచ్చు. కాని వింతంతువు బ్రహ్మచర్యాన్ని అవలంబించడం మంచిదని సూచించాడు.

వాత్సాయనుడు స్త్రీపునర్వివాహం చేసుకోవచ్చునన్నాడు. వితంతుస్త్రీ తన రెండవ భర్తను తన హృదయానుసారంగా ఎంచుకోవచ్చునని చెప్పాడు. వితంతువు భోగపురుషుని కూడా భర్తగా చేసుకోవచ్చునన్నాడు. అయితే ఆమె అతని భార్యగా అన్ని విధాలుగా వ్యవహరించవచ్చు. కాని మత కర్మలలో మాత్రం పాల్గొనడానికి అర్హురాలు కాదని పేర్కొన్నాడు. పునర్వివాహిత తన భర్తతో ఉత్సవాలు, వేడుకలు, వినోదాలు మొదలైన వాటిలో పాల్గొనవచ్చు. అయినా వివాహిత స్త్రీకి ఉండే గౌరవం పునర్వివాహిత స్త్రీకి సంఘంలో ఉండదని స్పష్టమవుతుంది. మనువు కూడ వితంతువును వివాహం చేసుకొన్న, పురుషుని శ్రద్ధాదికర్మల నుండి బహిష్కరించాలని చెప్పాడు. దీన్నిబట్టి వితంతువుని వివాహం చేసుకొన్న పురుషునికి కూడా సంఘంలో గౌరవం ఉండదని తెలుస్తుంది. 'పరాశర స్మృతికి' వ్యాఖ్యానం వ్రాసిన మాధవాచార్యుడు కలియుగంలో స్త్రీ పునర్వివాహం చేసుకోకూడదని చెప్పాడు.

వాత్సాయన నారద పరాశరాదులు భర్త మరణించినపుడు స్త్రీ పునర్వివాహం చేసుకోవచ్చునన్నారు. వసిష్ఠ మనుకౌటిల్యాదులు భర్త మరణించినపుడేకాక భర్త విడిచిపెట్టినపుడు కూడా స్త్రీ పునర్వివాహం చేసుకోవచ్చునన్నారు. మొత్తం మీద భారతదేశంలో వితంతు వివాహం గురించిన అభిప్రాయ భేదాలు అధికంగా ఉన్నట్లు తెలుస్తుంది.

20.10 సంగ్రహంగా

సృష్టిలో స్త్రీ, పురుష భేదం లేదు. ఇద్దరికీ సమానమైన భాధ్యత సంఘంలో ఉంది. సృష్టికారకురాలుగా స్త్రీకి మరిన్ని బాధ్యతలు చేకూరాయి. అవి ఆమె స్థాయిని పెంచేవేకాని, తక్కువ చేసేవి కావు. వీటివలన ఆమెకు మరింత శోభ చేకూరుతుంది. ప్రత్యేకించి ఈ విషయంలో తప్ప, మిగిలిన అన్నిటిలోనూ స్త్రీ పురుషునితో సమాన స్థాయిలో ఉంది.

అందుకనే ఆమె తనలో ఉన్నటి ప్రత్యేక గుణాలైన ఏకమత్యం, సమానత్వం, గొప్పతనం, పరిపూర్ణత్వం, పవిత్రత అనే లక్షణాలు గృహ జీవితంలోను, సంఘ జీవితంలోను, ఆధ్యాత్మిక జీవితంలోనూ ఎంతో ప్రభావాన్ని చూపాయి. అందుకే ఆమె వ్యక్తిత్వం అనాదిగా వేద కాలంలో, పురాణ ఇతిహాసాల్లో, స్మృతుల కాలంలో, చారిత్రిక యుగంలో, వివిధ విధాలుగా వివాహ వ్యవస్థలో, పాలకురాలిగా, కుటుంబ జీవనంలో మనకు దర్శనమిచ్చింది.
ఏది ఏలాగున్నా, స్త్రీ అనేక విషయాల్లో తన ఔన్నత్యం ప్రదర్శించుకో గలుగుతూ ఉంది. తనకంటూ ఒక

ప్రత్యేక స్థానం సంపాదించుకోగలుగుతూ ఉంది. ఆధునిక యుగంలో స్త్రీలు విద్యావంతురాలై అన్ని, రంగాల్లోను ముందడుగు వేస్తున్నారు.
స్త్రీ ఎన్ని కష్టాలకు గురి అవుతున్నా, తనలోని మమకారం పవిత్రత, సహజ మాధుర్యాన్ని, సేవా గుణం, సాత్విక స్వభావాన్ని వదల లేదు. అంతటి గొప్పది భారతీయ స్త్రీ.

20.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

I **ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి**

1. వేద కాలంలో స్త్రీ స్థానాన్ని వివరించండి.
2. పురాణ ఇతిహాసాల్లో స్త్రీ ప్రాధాన్యతను తెల్పండి.
3. పాలకులుగా స్త్రీ ఒనర్చిన సేవను విశ్లేషించండి.
4. ప్రాచీన భారతదేశంలో స్త్రీ స్థానాన్ని తెల్పండి.
5. వివాహ వ్యవస్థలో స్త్రీ ప్రాధాన్యతను రాయండి.

II **ఈ క్రింది ప్రశ్నలకు లఘు వాఖ్యలు రాయండి.**

1. బ్రహ్మవాదిని
2. సద్యోవధు
3. కుంతి
4. ద్రౌపది
5. సీత

BRAOU

20.12 ఉపయుక్త గ్రంథాలు

Aiyangar P.T.S	:	**Life in Ancient India**
Altekar A.S.	:	**The Position of Women in Hindu Civilization**
Basham. A.L	:	**The wonder that was India**
Indra	:	**The Status of Women in Ancient India**
Luniya. B.N.	:	**Life and Culture in Ancient India**
Majumdar. R.C	:	**History and Culture of the Indian Peple**
Mary E.R. Martin	:	**Women in Ancient India**

రచయిత: డా. వి. మీనాకుమారి

భాగం - 21 విద్య-విద్యా కేంద్రాలు

విషయక్రమం

21.0 లక్ష్యాలు

21.1 పరిచయం

21.2 వేద కాలం (వైదిక యుగం) నాటి విద్యా విధానం

21.3 మలి వేద యుగం నాటి విద్యా విధానం

21.4 సూత్ర యుగం నాటి విద్యా విధానం

21.5 ఐతిహాసిక యుగం నాటి విద్యా విధానం

21.6 బౌద్ధ యుగం నాటి విద్యా విధానం

21.7 ప్రాచీన కాలంలో ప్రసిద్ధమైన విద్యా కేంద్రాలు

21.8 సంగ్రహంగా

21.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

21.10 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

21.0 లక్ష్యాలు

ఈభాగాన్ని చదవడం వల్ల మీ క్రింది విషయాలను తెలుసుకోగల్గాలి.

★ ప్రాచీన భారతదేశంలోని విద్యావిధానం తీరుతెన్నులు

★ ప్రాచీన కాలంలో హిందూ, బౌద్ధ బోధనా పద్ధతులు

★ ప్రాచీన భారతదేశంలోని అనేక విద్యా సంస్థలు

21.1 పరిచయం

'విద్య లేనివాడు వింత పశువు' అనే నానుడి ప్రత్యక్షర సత్యం. ఎందుకంటే విద్య మానవుని మేధస్సుకు పదునుపెట్టి,అతని జ్ఞానాభివృద్ధికి దోహదం చేస్తుంది. అంతేగాక విద్య దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడంలో కూడా ప్రముఖమైన పాత్రను నిర్వహిస్తుంది.

సంస్కృతి ప్రజా జీవన విధాన సమగ్ర స్వరూపాన్ని వెల్లడిస్తుంది. అయితే ఆ సంస్కృతి పరిరక్షణకు, దాని పురోభివృద్ధికి విద్య తోడ్పడుతుంది. సంస్కృతిలో అంతర్భాగమైన విద్య సంస్కృతి సంరక్షణ, పునర్వ్యవస్థీకరణ అనే రెండు విధులను నిర్వర్తిస్తుంది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు మొదలైన సంస్థల ద్వారా, విద్య సాంస్కృతిక వైభవాన్ని, విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని, విలువలను తరతరాలకు అందిస్తూ ఉంటుంది.

భారతదేశానికి శతాబ్దాల చరిత్ర ఉన్నది. భారతీయ సంస్కృతిని గుర్తించడానికి మొట్టమొదటి ఆధారం సింధూ నాగరికత. సింధూ లోయలోని ప్రజలు విద్యావంతులనీ, వారు చిత్రలిపిని అభివృద్ధి పరుచుకొన్నారని తెలుస్తున్నదేకాని, వారి విద్యా విధానాన్ని గురించి తెలుసుకోవడానికి సరైన చారిత్రక ఆధారాలు లభించడం లేదు. కాబట్టి భారతదేశంలో వేద కాలం నుండి మహమ్మదీయుల కాలం వరకు అనేక శతాబ్దాలుగా అభివృద్ధి చెందిన విద్యా విధానాన్ని గూర్చి మాత్రమే చెప్పగలం. అందులోను వేద కాలం నాటి బ్రాహ్మణ విద్య మొదటిది. దాని తర్వాత బౌద్ధ విద్యా విధానం ప్రచురమైంది.

21.2 వేద కాలం నాటి విద్యా విధానం

ప్రాచీన కాలంలో భారతదేశంలో వైదిక విద్య వైయక్తిక విషయంగా ఉండేది. ప్రభుత్వం విద్యా శాఖను నిర్వహించడంగాని, దాన్ని అభివృద్ధి పరచడంగాని చేసేది కాదు. అంతేగాక అప్పుడు ఇప్పటివలె ప్రాథమిక స్థాయినుండి విశ్వవిద్యాలయ స్థాయివరకు సువ్యవస్థితమైన విద్యా విధానం ఉండేది కాదు.

వేద కాలంలో కుటుంబమే ఒక విద్యా సంస్థగా వ్యవహరించే పద్ధతి ఉండేది. కుటుంబంలో పెద్దవాడైన తండ్రి తన పుత్రులకు గురువై, వేద విద్యా జ్ఞానాన్ని అందించేవాడు. తర్వాత సమాజంలో ఏర్పడిన కొన్ని సంక్లిష్ట పరిస్థితులవల్ల కొందరు మత గురువులు, బ్రాహ్మణులూ అధ్యాపక వృత్తిని స్వీకరించారు. ఆ గురువుల విద్యా బోధనా నైపుణ్యం, ప్రతిభా పాండిత్యాలు ఎందరో విద్యార్థులను ఆకర్షించి, వారిని ఆశ్రయించేటట్లు చేశాయి. ఆ విధంగా వేద విద్య కొందరు మత గురువుల, తత్వవేత్తల, బ్రాహ్మణుల చేతుల్లోకి పోవడం జరిగింది. అనంతర కాలంలో అనేకమైన వేద పాఠశాలలు భారతదేశమంతట నెలకొల్పబడినాయి.

విద్యార్థులను ఆదర్శవంతమైన వ్యక్తిత్వం, ఉదాత్తమైన శీలం కలవారుగా తయారుచేయడం, సాంఘిక ఆర్థిక మతపరమైన విధులను సక్రమంగా నిర్వహించేటట్లు వారికి మంచి శిక్షణ నివ్వడం, ఆత్మగౌరవం, ఆత్మ విశ్వాసం, ఆత్మ నిగ్రహం వారిలో పెంపొందేటట్లు చేయడం, వారి ఆలోచనలు నిర్మలంగాను జీవితం స్వచ్ఛంగాను ఉండేటట్లు తీర్చిదిద్దడం మొదలైనవి ఆనాటి విద్యా విధానం లక్ష్యాలు.

తత్వవేత్తల దృష్టిలో పరబ్రహ్మ జ్ఞానమే నిజమైన విద్య. ఆత్మ, పరమాత్మ స్వరూపమేనని ఈ విద్యవల్ల తెలుస్తుంది. యోగం, ఇంద్రియ నిగ్రహం, కోరికలను జయించడం, ప్రాపంచిక విషయాలపట్ల అనాసక్తి మొదలైన లక్షణాలు ఈ విద్యవల్ల లభిస్తాయి.

ఉపనయన సంస్కారంచేసి బాలుని విద్యార్థి దశలో ప్రవేశపెట్టడం అనే పద్ధతి ఉన్నత కులజులైన బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల్లో ఉన్నది. ఉపనయనం జరిగిన తర్వాత పిల్లవానికి మరొక జన్మ కలిగినట్లుగా భావించబడుతుంది. కాబట్టి, ఉపనయన సంస్కారం జరుపుకొనే బ్రాహ్మణ క్షత్రియ వైశ్య కులజులను ద్విజులని వ్యవహరిస్తారు. ఉపనయనం అయిన పిల్లవానిని బ్రహ్మచారి లేక వటువు అంటారు.

ఉపనయన సంస్కారం గురించి అథర్వణ వేదంలో ప్రస్తావన ఉంది. దీని నర్ణన 'శతపథ బ్రాహ్మణం'లో కూడా

BRAOU

ఉన్నది. దీనికి సంబంధించిన వివరణ 'గృహ్యసూత్రం'లో ఈ విధంగా చెప్పబడింది. 'ఉపనయనం' జరిగిన తర్వాత గురువు బ్రహ్మచారిని తన శిష్యునిగా స్వీకరిస్తాడు. అనంతరం మంత్రోపదేశం చేస్తాడు. నాటినుండి శిష్యుడు గురువుతోనే కలిసి ఉండాలి. బ్రహ్మచారికి శారీరక, మానసిక క్రమ శిక్షణలు అలవడటానికి అవసరమైన కొన్ని నియమాలు నిర్ణయించబడినాయి. అందులో మొదటిది శారీరకమైన క్రమశిక్షణకు సంబంధించింది. ఇందుకు బ్రహ్మచారికి కౌపీనం, అజినంతో కూడిన ప్రత్యేక వస్త్రధారణ విహితమైంది. అది ఈనాటి విద్యార్థుల 'స్కూలు యూనిఫారం' వంటిది. గురు శుశ్రూష, భిక్షాటన, అగ్నిహోత్రం మొదలైన పనులన్నీ బ్రహ్మచారికి శారీరకమైన క్రమశిక్షణకు విధింపబడిన నియమాలు. అందులోను బ్రహ్మచారి వస్త్రధారణ, భిక్షాటన అనేవి అతని అంతస్తును లేక సాంఘికమైన హోదాను విస్మరింపజేసి, అతనిలో నిరాడంబరత్వాన్ని పెంపొందేటట్లు చేయడానికి నిర్దేశించబడినాయి.

రోజుకు రెండుసార్లు అగ్నిహోత్రం చేయడం, ప్రార్థన చేయడం, ఇంద్రియాలను వశంలో పెట్టుకోవడం, నియమపాలన, అంకిత భావం, నిరాడంబరత్వం, గురువును కానుకలతో తృప్తిపరచడం మొదలైనవి బ్రహ్మచారి మానసిక క్రమశిక్షణకు విహితమైన ధర్మాలు.

ఆనాడు గురువు శిష్యుని పూర్తి బాధ్యతను వహించేవాడు. శిష్యుని భోజనం, వసతి గురువుతోనే ఉండేది. అందుకు బదులుగా శిష్యుడు తన విద్యార్జన కాలంలో శుశ్రూషతోను, విద్య పూర్తికాగానే, గురుదక్షిణగా కానుకలతోను గురువును మెప్పించేవాడు. ఆనాటి గురుశిష్యుల సంబంధం ఎంతో పవిత్రంగా ఉండేది. అంధకారంలో వెలుగును చూపించే వాడు గురువు కాబట్టి, శిష్యులు గురువును దైవ సమానంగా భావించే వారు. శిష్యునికి గురువే తల్లి, తండ్రి, స్నేహితుడు, మార్గదర్శకుడు. గురువు కూడ తన శిష్యులను సొంత కుమారులనలె ప్రేమించేవాడు. రాత్రింబవళ్ళు గురువే శిష్యుల బాగోగులను చూచుకొనేవాడు. ఆ రోజుల్లో గురుశిష్యులిరువురు జ్ఞానాన్ని సంరక్షించి, ప్రచారం చేయడమే ధ్యేయంగా కలిగి ఉండేవారు. అయినప్పటికీ విద్యార్థి మాత్రం ఎల్లప్పుడు శ్రద్ధ, ప్రజ, ధనం, ఆయుస్సు, అమృతత్వమనే లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని విద్యార్జన చేసేవాడు.

ఉపనిషత్తుల్లో విద్యార్థికి ఏకాగ్రత, సహనం, జితేంద్రియత్వం, వినయం, ఆత్మ సంయమనం, ప్రశాంతమైన మనస్సు, నిర్మలమైన స్వభావం, మంచి ఆరోగ్యం అవసరమని పేర్కొనబడి ఉన్నది. విద్యార్థి కర్తవ్య పాలనం, గురుభక్తి కలిగి ఉండాలని చెప్పబడి ఉన్నది. విద్యార్థి దురభ్యాసాలకు, కోపతాపాలకు, కోరికలకు, జిహ్వాచాపల్యానికి, అతి నిద్రకు, అలంకరణలకు, ఆడంబరాలకు దూరంగా ఉండాలి. విద్యార్థి దశ పన్నెండు సంవత్సరాల వరకు ఉంటుంది. లేదా వేదాల్లో పాండిత్యం సంపాదించేవరకు ఉంటుంది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో విద్యార్థి దశను ఇరవై నాలుగు లేక ఇరవై ఎనిమిది సంవత్సరాల వరకు పొడిగించవచ్చు.

వేద కాలం ప్రారంభంలో గణితం, వ్యాకరణం, ఛందస్సు విద్యా బోధనలో ప్రధానమైన అంశాలుగా ఉండేని. సంహితలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు మొదలైన వైదిక సాహిత్యం ప్రధానంగా బోధించబడుతుండేది. వేద విజ్ఞానమంతా మౌఖికంగానే గురుపుద్వారా శిష్యునికి అందించబడేది.

ఉపనిషత్తుల్లో పేర్కొనబడిన విషయాలను పరిశీలించినప్పుడు ఆనాటి విజ్ఞానం అపారం అని తెలుస్తుంది. బ్రహ్మ విద్య, వ్యాకరణం, గణితం, ఖగోళ శాస్త్రం, నిధి శాస్త్రం, మాండలిక విజ్ఞానం, నీతి శాస్త్రం, యుద్ధ శాస్త్రం, సర్ప శాస్త్రం, దేవ విద్య, పితృ విద్య, భూత విద్య, నృత్యం, సంగీతం, మొదలైన అంశాలు బోధించబడేవని ఉపనిషత్తులవల్ల తెలుస్తున్నది.

వేదాంగాలు ఆరు. శిక్ష, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషం అనేవి. ఇవి వేదాలను సరిగ్గా అర్థం చేసుకోవడానికి, కంఠస్థం చేయడానికి, ఉపయోగపడతాయి. ఆనాటి విద్యా విధానంలో భాషకు కూడ ప్రాధాన్యమివ్వబడింది. చాలామంది భాష వ్యాకరణాల్లో పండితులు ఉండేవారు. ఇదంతా పరిశీలించినప్పుడు

BRAOU

వైదిక కాలంలో విస్తృతంగా పాఠ్యాంశాలను బోధించే విద్యా విధానం ఉండేదని స్పష్టమవుతుంది. వేదపండితుడుగా స్థిరపడాలనుకొన్న బ్రాహ్మణ విద్యార్థికి కొంత యుద్ధ శాస్త్రం, రాజనీతి శాస్త్రం కూడా నేర్పబడే విధానం ఉండేది. అలాగే క్షత్రియ విద్యార్థికి కొంత వేదాంతాన్ని, బ్రహ్మ విద్యను బోధించడంకూడా ఉండేది.

ఆనాడు విద్యా బోధన అంతా మౌఖికంగానే జరిగేది. వేద మంత్రాల ఉచ్చారణ ప్రధానంగా చదువబడేది. గురువు వేద మంత్రాలను చెప్తూ ఉంటే, విద్యార్థులు పలుకుతూ ఉండాలి. ఆ విధంగా శ్లోక పాదం, శ్లోకం, అధ్యాయం క్రమంగా విద్యార్థిచేత కంఠస్థం చేయించేవారు. కంఠస్థం, గ్రహణం, మననం అనేవి నాటి విద్యా విధానంలో ప్రముఖమైన అంశాలు.

ప్రత్యేకమైన సమావేశాల్లో విద్యార్థులకు సాహిత్యపరమైన వివాదాలు, చర్చలు జరుగుతుండేవి. ఇందుకు జనక మహారాజు ఆస్థానంలో ఏర్పాటు చేయబడిన తాత్త్వికమైన, సాహిత్యపరమైన వాదాలే నిదర్శనం.

విద్యా బోధన శ్రావణ పూర్ణిమ రోజు ప్రారంభమై, నాల్గైదు నెలలపాటు జరుగుతుంది. అది సాధారణంగా పుష్యమి లేక మాఘ మాసంలో ముగుస్తుంది. విద్యా బోధన ప్రారంభాన్ని ఉపకర్మణమనీ, ముగింపును ఉత్సాయనమనీ పేర్కొంటారు. వేదాలను శుక్ల పక్షంలోను, వేదాంగాలను కృష్ణపక్షంలోను అధ్యయనం చేయాలని ధర్మసూత్రంలో చెప్పబడింది. అధ్యయన కాలంలో జననం, మరణం, వర్షం, ఉల్కాపాతం, గ్రహణం వంటివి సంభవించినపుడు అధ్యయనానికి అంతరాయాలు కలుగవచ్చు. అటువంటి సమయాలను అధ్యయనా కాలం అని అంటారు.

బ్రహ్మచారి విద్యార్జన కాలం పూర్తి అయిన తర్వాత సమవర్తనం జరుపుతారు. ఆ సమవర్తనం అయిన వానిని స్నాతకుడు అని అంటారు. సమవర్తనంలో బ్రహ్మచారిని పవిత్ర స్నానం చేయిస్తారు. కాబట్టి అతడిని స్నాతకుడని వ్యవహరిస్తారు. స్నాతకుడు వివాహం చేసుకొని గృహస్థుడవుతాడు.

ఆ కాలంలో విద్యార్థికి వ్యాయామానికి సంబంధించిన శిక్షణ కూడ ఉండేది. వేద మంత్రాలను ప్రతి రోజు వల్లించడం వల్ల విద్యార్థికి మౌఖిక వ్యాయామం సమకూరేది. యోగం, ప్రాణాయామం, సంధ్యావందనం విద్యార్థి శరీరానికి, ఊపిరితిత్తులకు, మనస్సుకు సరైన వ్యాయామంగా ఉండేది. దండప్రదానం అనే సంప్రదాయం వల్ల, విద్యార్థికి ఆత్మరక్షణ మార్గం కూడ నేర్పించబడేది.

వేద కాలంలో కేవలం పారలౌకిక విద్యనే కాదు. లౌకిక విద్యను కూడ బోధించేవారు. సాంఘికంగాను రాజకీయంగాను పారిశ్రామికంగాను ఉన్నతిని సాధించడానికి అవసరమైన జ్ఞానాన్ని అందించేవారు. కేవలం మతపరమైన విద్యనే కాక, ఆనాడు వృత్తి విద్యలను కూడ నేర్పించేవారు. వ్యవసాయం, పశుపోషణ, తోటల పెంపకం, లలితకళలు, హస్తకళలు మొదలైన వాటిల్లో శిక్షణ ఇచ్చేవాళ్ళు. ఇందుకు నిదర్శనాలు యజుర్వేదం లోను అథర్వణ వేదంలోను కనిపిస్తాయి.

ఆనాడు ఆడపిల్లలకు కూడా విద్య నేర్పించేవారు. వారికి ప్రాథమిక విద్యతో పాటే సంగీతం, నృత్యం, గృహకృత్యాలు నిర్వహించడం కూడా నేర్పించేవారు. విద్యార్థినులను 'బ్రహ్మచారిణి' అంటారు. బ్రహ్మచారిణి విద్యనార్జించిన తర్వాత వివాహం చేసుకొని, గృహిణులుగా మారటం కలదు. నదులు సముద్రంలో కలిసిపోయే విధంగా, బ్రహ్మచారిణిలు విద్య నేర్చుకొన్న తర్వాత వివాహం చేసుకొని భర్తతో కలిసిపోతారని ఋగ్వేదంలో చెప్పబడి ఉన్నది. స్త్రీలు ఉపాధ్యాయులుగాను, తత్త్వవేత్తలుగాను, కవయిత్రులుగాను ఉన్నట్లు తెలుస్తుంది. వేద మంత్రాలకు స్వరకల్పన చేయగల గొప్ప విజ్ఞానం కలిగిన స్త్రీలు కూడ ఉండేవారు. మైత్రేయి, గార్గి, లోపాముద్ర, కద్రు, యమి, ఇంద్రాణి మొదలైనవారు అందుకు ఉదాహరణగా పేర్కొన దగినవారు.

BRAOU

21.3 మలి వేద యుగం నాటి విద్యా విధానం

వైదిక యుగంలో మత గురువులు, తత్వవేత్తలు, యోగులు గహనమైన అరణ్యాల్లో నివసిస్తూ, ఆత్మ తత్వాన్ని గూర్చి ఆలోచించసాగినారు. వారు నిరంతర ధ్యానంతో ఆత్మ పరమాత్మకంటే భిన్నం కాదని తెలుసుకొన్నారు. వారు తమ అనుభవాలను అనుభూతులను అరణ్యకాల్లోను, ఉపనిషత్తుల్లోను వివరించారు. వీటి ప్రభావం విద్యా విధానంమీద పడింది. వైదిక సాహిత్యం అనంతరవైదిక యుగంలో దేశమంతటా విద్యా బోధనలో చోటు చేసుకొన్నది. వేరు వేరు వేదాలకు ప్రత్యేకించి వేద పాఠశాలలు ఏర్పడినాయి. వేదాలకు ప్రత్యేకమైన వ్యాఖ్యానాలు వెలువడినాయి. వేద పాఠశాలలు మతానికి, విద్యకు, సంస్కృతికి కేంద్రాలుగా తయారైనాయి.

వైదిక యుగంలో విద్యార్థి అర్హతనుబట్టి గురువే శిష్యుని స్వీకరించే పద్ధతి ఉన్నది. కాని అనంతర వైదికయుగంలో గురువు తన తత్వ విద్యా సంప్రదాయాన్ని, తను కనుగొన్న సత్యాన్ని ప్రచారం చేసుకోవడానికి, తరతరాలు నిలుపుకోవడానికి మంచి శిష్యులను సంపాదించడానికి ప్రయత్నం చేసేవాడు. ఈ విషయంలో గురువుల మధ్య పోటీ కూడా ఉన్నట్లు తెలుస్తున్నది.

వైదిక యుగంలో వలెనే అనంతర వైదిక యుగంలోకూడ బ్రహ్మచారి గురువుతోనే ఉండి భిక్షాటనం, సమిధలు సేకరించడం, గురువుకు శుశ్రూష చేయడం మొదలైన పనులు చేయడమేగాక, కఠినమైన నియమాలకు లోబడి మిక్కిలి క్రమశిక్షణతో విద్య నేర్చుకొనడం ఉన్నది. సాధారణ విద్యతో పాటు అత్యున్నతమైన బ్రహ్మ విద్య కూడా విద్యార్థికి నేర్పించేవారు.

అనంతర వైదిక యుగంలో విద్యా బోధన గురుశిష్యుల మధ్య ప్రశ్నోత్తరాల రూపంలో జరిగేది. అది క్రమంగా చర్చల రూపం దాల్చేది. అవే తర్వాత తర్క శాస్త్రంగా, అనంతరం న్యాయ శాస్త్రంగా తయారైనాయి.

బృహదారణ్యకాన్ని బట్టి, ఆ కాలపు బోధన క్రమం ఈ విధంగా ఉండేదని తెలుస్తున్నది. 1.శ్రవణం: పాఠ్యాంశాలను వినడం. 2.మననం: వాటిని గూర్చి ఆలోచించడం. 3.నిది ధ్యానం: వాటిని మరిమరి తలచడం.

ఆ కాలంలో బోధనాంశాలు చాలా విస్తృతంగా ఉండేవని తెలుస్తున్నది. వేదాలు (ఋగ్వేదం, యజుర్వేదం, అథర్వణ వేదం, సామ వేదం), వేదాంగాలు (శిక్ష, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిష్యం), ఉపనిషత్తులు, తర్క, న్యాయ మీమాంసలు, పురాణాలు, ఇతిహాసాలు, గాథలు, నిధి, సూత్ర, ఏకాయనాలు, గణితం, వ్యాకరణం, రాశి, నక్షత్ర విద్య, దేవ విద్య, భూత విద్య, సర్ప విద్య, గాంధర్వ విద్య (సంగీత నృత్యాలు) ఆయుర్వేదం మొదలైన విషయాలన్నీ బోధింపబడేవి. యోగాభ్యాసం ఎనిమిది పద్ధతుల్లో అభివృద్ధిపర్చబడింది. 1.యము 2.నియమ 3.ఆసనం 4.ప్రాణాయామం 5.ప్రత్యాహారం 6.ధారణం 7.ధ్యానం 8.సమాధి.

పై విషయాలనే గాక విద్యార్థులకు పర విద్యను కూడ నేర్పించేవారు. ఇదే అత్యంత ఉన్నతమైన జ్ఞానంగా పరిగణించబడింది. శ్వేతకేతువనేవాడు అన్ని విద్యల్లోను పన్నెండు సంనత్సరాలకే ఉత్తీర్ణుడైనప్పటికి, పర విద్యలో ఉత్తీర్ణుడు కాలేక, అందుకొరకు మరికొన్ని సంవత్సరాలను వెచ్చించ వలసి వచ్చినట్లు తెలుస్తున్నది. అనంతర వైదిక యుగంలో ఇంకొందరు పర విద్యకై జీవితమంతటినీ వెచ్చించినట్లు కూడ తెలుస్తున్నది. అటువంటి వారిని నైష్ఠికులని అంటారు.

విద్యా సంస్థలు: అనంతర వైదిక యుగంలో విద్యా సంస్థలు ఈ విధంగా అభివృద్ధి చెందినాయి.

1. గురు కులం:- గురువు నివాసంలోనే బ్రహ్మచారులకు నియమనిబంధనలతో విద్య నేర్పించే పద్ధతినే గురుకుల

BRAOU

విద్య అంటారు. గురువు నివాసమే విద్యా సంస్థ. ఇందులో విద్యార్థులను మానసికంగాను శారీరకంగాను తీర్చిదిద్దడం జరుగుతుంది. ఇక్కడ విద్యార్థి గురువు పర్యవేక్షణ లో రాత్రింబవళ్ళు తన వ్యక్తిత్వాన్ని చక్కదిద్దుకొంటూ జ్ఞానాన్ని ఆర్జిస్తాడు. భిక్షాటన, సమిధల సేకరణ, గురు శుశ్రూషమొదలైన తన కర్తవ్యాలను నిర్వహించి, పన్నెండవ సంవత్సరం విద్యార్జనా కాలాన్ని పూర్తిచేసుకొని, విద్యార్థి గృహస్థాశ్రమంలో ప్రవేశిస్తాడు. సత్యకామ, జాబాల, ఉపకోసల, కమలాయన అనే వారు గురుకుల విద్యనార్జించిన వారిలో పేర్కొనదగినవారు.

2. పరిషత్తులు:- విద్యార్థులు చర్చల ద్వారా, వాదోపవాదాల ద్వారా ఉన్నతమైన జ్ఞానాన్ని సంపాదించడానికి ఏర్పడిన సంస్థలే పరిషత్తులు. జ్ఞానసంపన్నులైన వారితో ఈ పరిషత్తులు పరమోత్తమమైన జ్ఞానానికి క్షేత్రాలుగా ఉండేవి. అన్ని వైపుల నుండి జ్ఞాన తృష్ణగల వారు పరిషత్తుల్లో సమావేశమై, అక్కడ జరిగే వాదోపవాదాల్లోను, చర్చల్లోను పాల్గొనేవారు. ఉద్దాలక-అరుణి, శ్వేతకేతు-అరుణేయ, సోమ-సష్మ, సత్యయజ్ఞి-యాజ్ఞవల్క్య మొదలైన వారిమధ్య జరిగిన వాదోపవాదాలు ఇందుకు నిదర్శనంగా పేర్కొనదగినవి.

3. సదస్సులు:- వివిధ ప్రాంతాల్లో పండిత సదస్సులు జరుపబడుచుండేవి. ఈ సదస్సులకు జాతీయ స్థాయిలో విద్వాంసులు, తత్వవేత్తలు, గురువులు, ఋషులు ఆహ్వానింపబడేవారు. ఆయా సమావేశాల్లో జ్ఞానులైన వారు తమ అభిప్రాయాలను వెల్లడించేవారు. ఈ సదస్సులో గొప్ప పండితులకు బహుమతులు కూడ ఇచ్చేవారు. ఇందుకు దృష్టాంతాలు, బృహదారణ్యకంలోను, శతపథ బ్రాహ్మణంలోను కనిపిస్తున్నాయి. విదేహ రాజైన జనకుడు అశ్వమేధ యాగం చేస్తూ, ఇటువంటి సదస్సును ఏర్పాటు చేసి, అందులో యాజ్ఞవల్క్య మహర్షికి కొమ్ములకు బంగారు తొడుగులు కలిగిన వెయ్యి ఆవులను బహూకరించినట్లు తెలుస్తున్నది.

4. రాజాస్థానాలు:- రాజాస్థానాలు కూడ విద్యా వ్యాప్తికి, జ్ఞానాభివృద్ధికి కేంద్రాలుగా పనిచేసినాయి. రాజులు తమ సభలకు పలుప్రాంతాలనుండి పండితులను, తాత్వికులను, జ్ఞానులను ఆహ్వానించి, వివిధ వైజ్ఞానిక విషయాలను గురించి ప్రసంగాలు చేయించేవారు, చర్చలు ఏర్పాటు చేసేవారు. కాశీ రాజైన అజాతశత్రు, విదేహ రాజైన జనకుడు, కేకయ రాజైన అశ్వపతి, కోసల, పాంచాల, అయోధ్య రాజులుకూడా ఇటువంటి పండిత సమావేశాలను నిర్వహించినట్లు తెలుస్తున్నది.

5. వన్య సంస్థలు (Sylvan Institutions):- మహాజ్ఞానులు గొప్పపండితులు అడవులలో ప్రకృతి ఒడిలో ప్రశాంత వాతావరణంలో ధ్యానమగ్నులై ఉండేవారు. విద్యార్థులు అటువంటి వారిని కూడా ఆశ్రయించి, వారి మార్గ దర్శకత్వంలో ప్రధానంగా ఆరణ్యకాలను అధ్యయనం చేసేవారు.

వైదిక యుగంలో వలెనే అనంతర వైదిక యుగంలో కూడా స్త్రీలు విద్యావంతులై, సంస్కారవంతులుగా సంఘంలో గౌరవాన్ని పొందేవారు. స్త్రీలు తమ భర్తలతో కలిసి అన్ని క్రతువుల్లోను, మతపరమైన కర్మకాండల్లోను పాల్గొనేవారు. స్త్రీలు అధ్యాపక వృత్తిని కూడా స్వీకరించినట్లు ఉపనిషత్తులవల్ల తెలుస్తున్నది. అటువంటివారిని శిక్షికలు అనేవారు.

అనంతర వైదిక యుగం తర్వాత క్రీ.పూ. 7వ శతాబ్ది నుండి 2వ శతాబ్దం వరకు సూత్ర యుగంగాను క్రీ.పూ. 2వ శతాబ్దం నుండి క్రీ.శ.4వ శతాబ్దం వరకు ఇతిహాసిక యుగంగాను పేర్కొనవచ్చు. సూత్ర యుగంలో బౌద్ధ జైన మతాలు ప్రసిద్ధి చెందాయి. మహాసామ్రాజ్యాలు ఏర్పడినాయి. ఇతిహాసిక యుగంలో విదేశీయులు అనేక మంది భారతదేశంలో ప్రవేశించారు. అందువల్ల భారతదేశానికి అంతర్జాతీయ సంబంధాలు ఏర్పడినాయి. దానితో భారతీయ సంస్కృతిపై విదేశీ సంస్కృతుల ప్రభావం పడింది.

BRAOU

21.4 సూత్ర యుగం నాటి విద్యా విధానం:

వేదవేదాంగాలు చాలా విస్తృతంగా పెరిగిపోయినాయి. కాబట్టి వైదిక సాహిత్యం సామాన్యులకు అందుబాటులోకి రాకుండా పోతున్నది. జైన బౌద్ధ మతాల ధాటినుండి వైదిక సంస్కృతీ సాహిత్యాలను కాపాడాలనే అభిప్రాయాలు పండితులకు కలిగినవి. అవి ప్రచారం చెందాలన్నా, సామాన్యులకు అందుబాటులోనికి రావాలన్నా, అవి సంగ్రహ రూపం దాల్చాలి. అందువల్ల సూత్ర రచన ప్రారంభమైంది.

1. శ్రౌత సూత్రం:- ఇది మతసంబంధమైన ఆచారాలకు సంబంధించినది.

2. గృహ సూత్రం:- ఇది గృహస్థాశ్రమానికి సంబంధించిన సంప్రదాయాలను తెలిపేది.

3. ధర్మ సూత్రం:- ఇది సంఘానికి సంబంధించిన నియమనిబంధనలను తెలిపేది.

ఈ సూత్రాలు కొత్తగా తాత్త్విక విషయాలనుగాని, సిద్ధాంతాలను గాని చెప్పక పోయినప్పటికీ, ఇవి మానవుడు వ్యక్తి పరంగాను, సంఘపరంగాను నిర్వహించవలసిన విధులను తెలుపుతూ, సంస్కృతిని పరిరక్షించే లక్ష్యాన్ని కూడా సాధించడానికి ఏర్పడినాయి. సూత్ర యుగంలోనే స్మృతులు కూడా మిక్కిలి ప్రసిద్ధి చెందింది. మనుస్మృతిలో మానవ జాతి మిక్కిలి ప్రసిద్ధి చెందింది. మనుస్మృతిలో మానవ జాతి సక్రమమైన మార్గంలో నడవడానికి అవసరమైన కొన్ని ధర్మాలు పేర్కొన బడినాయి. సూత్ర యుగంలో తాత్త్విక విజ్ఞాన వాహిని ఆరుపాయలుగా సాగినది. కపిలుని 'సాంఖ్యం', పతంజలి 'యోగం', గౌతముని 'న్యాయం', కాణాదుని 'వైశేషికం', జైమిని 'పూర్వమీమాంస', బాదరాయణుని 'ఉత్తర మీమాంస' అనేవి.

విద్యారంభం లేక అక్షర స్వీకారం అనేది బాలునికి ఐదవ ఏట చేస్తారు. అక్షర స్వీకారం సమయంలో బాలునిచేత దైవ ప్రార్థన చేయించి, అక్షరాలు, అంకెలు దిద్దిస్తారు. అనంతరం ఉపనయనం జరుగుతుంది. 'మనుస్మృతి', 'యాజ్ఞవల్క్య స్మృతి' ప్రకారం, ఉపనయనం వరుసగా బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల్లో 8, 11, 12 సంవత్సరాల్లో చేయాలి. తర్వాత బ్రహ్మచారి గురువు దగ్గరే ఉండి విద్యాభ్యాసం చేయాలి.

గురు నివాసంలో విద్యార్థి శారీరకంగాను మానసికంగాను ఆదర్శవంతమైన వ్యక్తిత్వం కలవాడుగా తీర్చిదిద్దబడతాడు. విద్యార్థి కూడ గురువును ఆశ్రయించి ఆవులను మేపడం, దర్భలను సమిధలను సేకరించడం, భిక్షాటన చేయడం, గురుశుశ్రూష చేయడం అనే కార్యక్రమాలను నిర్వహిస్తూ, విద్యార్జన చేయాలి. బ్రహ్మచారికి విహితమైన అజినం, దండం, యజ్ఞోపవీతం అనేవి తప్ప విద్యార్థి వేరే వస్త్రాలుగాని, ఆభరణాలుగాని ధరించకూడదు. విలాస జీవితానికి, సంగీత నృత్యాలవంటి వినోదాలకు విద్యార్థి దూరంగా ఉండాలి. విద్యార్థి క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించినా, నియమోల్లంఘనం చేసినా, గురువు అతడిని ఆశ్రమం నుండి పంపించి వేయవచ్చు.

విద్యార్థి ఎంతో కఠినమైన నియమాలకు లోబడి విద్య నభ్యసించేవాడు. ఉదాహరణకు ఒక విద్యార్థి తన దీపానికి తాను నూనె తెచ్చుకోలేకపోతే, అతడు ఆవు పిడకలను కాల్చి ఆ వెలుగులోనే చదువుకోవాలి. ఇటువంటి కఠోర నియమాలకు భయపడి కొందరు విద్యార్థులు పారిపోయేవారు. అటువంటి విద్యార్థులను 'ఖట్వారుద్ధులు' అనేవారు. పతంజలి ఈ రకం విద్యార్థులను ఆరు రకాలుగా విభజించి పేర్లు పెట్టాడు.

1. తీర్థంకకుడు : గురువులను విద్యా సంస్థలను మార్చే విద్యార్థి అని అర్థం. ఇతడిని ఒకచోట నిలకడగా ఉండక, చపలచిత్తంతో తిరిగే ఆవుతో పోల్చారు.

2. కుమారి దత్య : అమ్మాయి కొరకు విద్యార్థిగా మారినవాడు.

3. భిక్షామానవ : భిక్ష కొరకు విద్యార్థియైనవాడు.

4. ఓదన పాణినీయ : ఉచిత భోజనం కొరకు పణినీయం చదివేవాడు.

5. ఘృతకౌధి : నేతి కొరకు విద్యార్థియైనవాడు.

6. కంబళ చరణి : కంబళి కొరకై విద్యార్థిగా మారినవాడు.

అనాడు తిండికొరకు, బట్ట కొరకు, స్త్రీ లోలత్వంతోను విద్యార్థిగా మారినవారు కూడా ఉండేవారని స్పష్టంగా తెలుస్తున్నది.

గురువు శిష్యునికి ఉచితంగా విద్య నేర్పించాలి. విద్య పూర్తికాగానే శిష్యుడు గురుదక్షిణగా కానుకలను సమర్పించవచ్చు. కాని గురువు శిష్యుని దగ్గర జీతం తీసుకోకూడదు. అలా జీతం తీసుకొని విద్యనేర్పే గురువును 'వృత్తిక' అంటారు. అనాడు జీతం ఇచ్చిన విద్యార్థిని, తీసుకొన్న గురువును గూడ సాంఘికాచారాలు, ఉత్సవాలు, వేడుకలు మొదలైన వాటి నుండి వెలివేసేవారు..

సూత్ర యుగంలో గురువులు మూడు రకాలుగా విభజింపబడినారు.

1. యుజు నైష్ఠికుడు : తన పాండిత్యం చేత ఎంతో దూరం నుండి కూడా విద్యార్థులను ఆకర్షించగలవాడు.

2. ఉపాధ్యాయుడు : ఇతడు తన జీవనానికి విద్యా బోధనము వృత్తిగా స్వీకరించినవాడు. ఇతడు వేద వేదాంగాలను సూత్రమే బోధిస్తాడు.

3. ఆచార్యుడు : ఇతడు విద్యా బోధన సమయంలో విద్యార్థినుండి ఏమీ తీసుకోకుండా విద్య పూర్తి అయిన తర్వాతగురు దక్షణగా కానుకలను గ్రహించేవాడు. ఇతడు వేదవేదాంగాలను, ఉపనిషత్తులను, సూత్రాలను బోధిస్తాడు.

పూర్వ యుగంలో వలెనే సూత్ర యుగంలో కూడ విద్యా బోధనా విధానం మౌఖికంగానే ఉండేది. కౌటిల్యుడు విద్యా బోధన పద్ధతులను ఆరు విధాలుగా చెప్పినాడు.

1. శుశ్రూష : గురువు నోటినుండి వెలువడే పదాలను వినాలనే ఆత్రుతను చూపడం.

2. శ్రవణం : గురువు పలికిన పదాలను జాగ్రత్తగా వినడం.

3. గ్రహణం : వాటిని బాగా గ్రహించడం.

4. ధారణం : వాటిని చక్కగా కంఠస్థం చేయడం.

5. ఊహాపోహాలు : వాటిని గూర్చి చర్చలు చేయడం.

6. విజ్ఞానం : గురువు చెప్పిన అంశాల్లోని అంతరార్థాన్ని తెలుసుకోవడం.

ఈ యుగంలో బ్రాహ్మి లిపి అభివృద్ధి చెందినది. కాని దాన్ని ప్రభువులు పరిపాలనా వ్యవహారాలకు, బౌద్ధ సన్యాసులు మతపరమైన వ్యవహారాలకు మాత్రమే వినియోగించేవారు. విద్యా బోధన లిపి ద్వారా జరిగేది కాదు.

సూత్ర యుగంలో విద్యా బోధనాంశాలు విస్తృతంగా పెరిగినాయి. వేదవేదాంగాలు, పురాణేతిహాసాలు, ఛందోవ్యాకరణ జ్యోతిషాది శాస్త్రాలు, చివరగా సాంఖ్యయోగాది తాత్త్విక విషయాలను బోధించేవారు. రాజకుమారులకు మాత్రం పైఅంశాలే గాక, ధర్మ శాస్త్రం, అర్థ శాస్త్రం, దండనీతి, యుక్తిప్రయుక్తి, ప్రహరణం అనే విషయాలను కూడ బోధించేవారు.

BRAOU

ఆయుర్వేదం ఆనాడు శాస్త్రీయంగా అభివృద్ధి చెందింది. వివిధ రోగాలకు వనమూలికలనుండి, ఆకులనుండి అనేక ఔషధాలు భస్మాలను తయారుచేడం, చర్మ రోగాలకు, కంటిజబ్బులకు విశేషమైన మందులు కనుగొనడం జరిగింది. ఔషధ చికిత్సా విధానమేకాక, శస్త్రచికిత్సా విధానం కూడా అభివృద్ధి చెందినది.

బ్రహ్మచారి విద్యార్జనను పూర్తి చేసుకొన్న తర్వాత సమవర్తన సంస్కారం చేస్తారు. విద్యా కాలం పూర్తి కాక ముందే, వేదాలను పుర్తిచేస్తే సమవర్తనం జరిపి, అతడిని విద్యా స్నాతకుడంటారు. విద్యా కాలం పూర్తి అయిన తర్వాత వేదాలను నేర్చుకొన్న బ్రహ్మచారికి సమవర్తనం జరిపితే, అతడిని వ్రతస్నాతకుడంటారు. వేదాలనేగాక, సమస్త విద్యాంశాలను పూర్తిచేసుకొన్న బ్రహ్మచారికి సమవర్తనం జరిపితే, అతడిని 'విద్యావ్రత స్నాతకుడంటారు'. అన్నిటి కంటే ఇది ఉత్తమ దశ. ఇది నేటి ఉన్నత డిగ్రీ వంటిది. 'విద్యావ్రత స్నాతకునికి వస్త్ర ధారణకూడ ప్రత్యేకంగా ఉంటుంది. అతడు అన్ని విధాలైన విద్యా పరిషత్తుల్లోను, సమావేశాల్లోను పాల్గొనడానికి అర్హుడుగా నిర్ణయించబడతాడు. సూత్ర యుగంలో విద్యా పరిషత్తులు ఉన్నట్లు తెలుస్తున్నది. మనుస్మృతిలో విద్యా పరిషత్తును గూర్చి వివరణ కనిపిస్తుంది. విద్యా పరిషత్తులో పదిమంది సభ్యులుంటారు. త్రివేదులు ముగ్గురు, తర్కశాస్త్రజ్ఞుడొకడు, మీమాంసకుడొకడు, నిరుక్తకారుడొకడు, ఒక ఆశ్రమవాసి, ఒక ధర్మశాస్త్రజ్ఞుడు, ఒక గురుకుల విద్యార్థి, ఒక గృహస్థుడు ఈ విద్యా పరిషత్తులో సభ్యులుగా ఉంటారు. అంటే విద్యా పరిషత్తులో అన్ని రకాల వారికి ప్రాతినిధ్యం ఉండేదని తెలుస్తుంది.

21.5 ఐతిహాసిక యుగం నాటి విద్యా విధానం

ఐతిహాసిక యుగంలో వర్ణాశ్రమ ధర్మాలు బలపడినాయి. వాల్మీకి చేత రచింపబడిన రామాయణం వ్యాసునిచేత రచింపబడిన భారతం అద్భుతమైన ఇతిహాసాలుగా ఖ్యాతి చెందాయి. ఈ గ్రంథాల ద్వారా ఆనాటి విద్యా విధానాన్ని గూర్చి తెలుసుకోవడానికి కొంత అవకాశమున్నది.

బ్రహ్మచారి గురువుదగ్గర ఇరవై అయిదు సంవత్సరాలు విద్యనార్జించాలి. తర్వాత గురువును విడిచి స్వగృహం చేరి, గృహస్థాశ్రమంలో ప్రవేశించాలి. అరుణ, ఉదంక, ఉపమన్యు మొదలైనవారు ఐతిహాసిక యుగంలో పేరుగాంచిన విద్యార్థులు. కణ్వ, వ్యాస, వసిష్ఠ, విశ్వామిత్ర, ద్రోణాచార్య మొదలైనవారు నాటి ప్రసిద్ధులైన గురువులు.

ఈ యుగంలో వర్ణధర్మాలు బలపడటంవల్ల వేద విద్య, యుద్ధ విద్య శూద్రులకు నిషిద్ధం చేయబడినవి. అందుకు భారతంలోని ఏకలవ్యుడే ఉదాహరణ. ఆనాడు బ్రాహ్మణులే గురువులుగాఉండి, విద్యా బోధన చేయడమేగాక యజ్ఞయాగాది క్రతువులు, కర్మకాండలు కూడ చేయించి, ప్రతిగా కానుకలు పొందేవారు. బ్రాహ్మణులకు వేద విద్యను, క్షత్రియులకు యుద్ధ విద్యను ప్రత్యేకించి విలు విద్యను, వైశ్యులకు వ్యవసాయం, వృత్తి విద్యలను నేర్పించేవారు.

ఐతిహాసిక యుగంలో విద్యా సంస్థలు వాటి స్థాపకుల పేరుమీదనే ప్రసిద్ధిచెందాయి. ఘను, బృహస్పతి, పరాశర, అంభి మొదలైనవారి పేర్లమీద విద్యా సంస్థలుండినట్లు కౌటిల్యుడు పేర్కొన్నాడు. మహర్షుల ఆశ్రమాలు కూడ విద్యా సంస్థలుగా పనిచేసినట్లు రామాయణం, మహాభారతం వల్ల తెలుస్తున్నది. వ్యాస, వసిష్ఠ, విశ్వామిత్రాది మహర్షుల ఆశ్రమాలు కూడా గొప్ప విద్యా సంస్థలుగా ఖ్యాతి గాంచినాయి. నైమిశారణ్యంలోని నైమిశాశ్రమం, మాలినీ నదీ తీరంలోని కణ్వాశ్రమం ఈ సందర్భంలో ప్రత్యేకంగా పేర్కొనదగినవి. కణ్వాశ్రమాన్ని అడవిలో నెలకొన్న విశ్వవిద్యాలయమని చెప్పవచ్చు. ఇందులో వేదవేదాంగాది సమస్త విషయాల్లో ప్రత్యేకమైన విజ్ఞానం కలవారు ఉండేవారు. వారే ఆయా అంశాలను బోధించేవారు.

BRAOU

సాధారణంగా ఈ ఆశ్రమాలు నగరాలకు దూరంగా అరణ్యాల్లో నదీతీరాల్లో ఉండేవి. అప్పుడప్పుడు నగర ప్రజలు కూడా ఈ ఆశ్రమాల్లో జరిగే చర్చలు, వాదోప వాదాల్లో పాల్గొనేవారు. పరిపూర్ణమైన విద్యా సంస్థగా రూపొందిన ఆశ్రమంలో నిర్వహింపబడే శాఖలు ఎనిమిది. అవి 1. అగ్ని స్థానం : ఇక్కడ సామూహిక ప్రార్థనలు జరుగుతాయి. 2. బ్రహ్మ స్థానం : ఇక్కడ వేద విద్య నేర్పబడుతుంది. 3. విష్ణు స్థానం : ఇక్కడ రాజనీతి, అర్థనీతి నేర్పబడుతాయి. 4. మహేంద్ర స్థానం : ఇక్కడ యుద్ధ విద్య నేర్పబడుతుంది. 5. వైవస్వత స్థానం : ఇక్కడ ఖగోళ శాస్త్రం నేర్పబడుతుంది. 6. సోమ స్థానం : ఇక్కడ వృక్ష శాస్త్రం బోధింపబడుతుంది. 7. గురుడ స్థానం : ఇక్కడ రహదారి రవాణా శాస్త్రాలు బోధింపబడుతాయి. 8. కార్తికేయ స్థానం : ఇక్కడ సైనిక విద్య నేర్పబడుతుంది.

ఆశ్రమ విద్యా సంస్థలేగాక, పౌరాణిక విద్యాసంస్థలు కూడ ఉన్నట్లు రామాయణంలో ప్రస్తావనలు కనిపిస్తునాయి. ఇవేగాక పౌరులు నిర్వహించే విద్యా సంస్థలు కూడ ఉన్నట్లు రామాయణం వల్ల తెలుస్తున్నది. ఉదారులు, దాతలు అయిన పౌరుల చేత నిర్వహింపబడిన ఇటువంటి విద్యా సంస్థ కాశీలో ఉండేది. అందులో 500 మంది బ్రాహ్మణ విద్యార్థులు ఉండేవారు. ఆ విద్యార్థులకు గృహస్థులు తమ ఇళ్లలో భోజనం ఏర్పాటుచేసి, వాటి విద్యా వ్యాప్తికి దోహదం చేశారు.

ఐతిహాసిక యుగంలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రలనే చాతుర్వర్ణ్య వ్యవస్థ బలపడింది. ప్రతి కులంలోను శాఖలు, ఉప శాఖలు కూడ ఏర్పడినాయి. వృత్తి విద్య ప్రాతిపదికగా కుల సంఘాలు తయారైనవి. ఈ సంఘాలవారు యువకులకు వృత్తి విద్యలను నేర్పి, వారిని సమాజానికి ఉపయోపడే విధంగా తీర్చిదిద్దేవారు.

బ్రాహ్మణులు ప్రధానంగా విద్యా బోధకులుగాను, యజ్ఞయాగాది క్రతువులు, కర్మకాండలు చేయించేవారుగాను, పూజారులుగాను ఉండేవారు. ఇందుకు తగిన శిక్షణ వారికి వంశ పారంపర్యంగా లభించేది. క్షత్రియులకు ప్రజా రక్షణ, ఆత్మ రక్షణ, ప్రజా పాలన అనేవి ధర్మాలుగా ఏర్పడినాయి. కాబట్టి వారికి యుద్ధ విద్య నేర్పించబడేది. ద్రోణాచార్యుడు పాండవులకు ఇచ్చిన శిక్షణ ఇటువంటిదే. రాజకుమారులకు ఆఖ్యాయికల ద్వారా రాజనీతి బోధించే పద్ధతి కూడ ఉండేంది. జాతక కథలు, పంచతంత్ర హితోపదేశాది కథలు ఇటువంటివే. వైశ్యులకు వాణిజ్యంలోను వ్యవసాయంలోను శిక్షణ ఇచ్చేవారు. శూద్రులకు వేద విద్య నిషిద్ధం చేయబడింది. వారు కేవలం వృత్తి విద్యలకే పరిమితం చేయబడినారు.

ఈ యుగంలో ఆయుర్వేద విద్య బాగా వికాసం చెందింది. ఆయుర్వేద శాస్త్రం నేర్చుకోవడానికి అన్ని కులాల వారు అర్హులే. అయితే వారికి కొన్ని విశిష్ట లక్షణాలు ఉండాలి. ఆరోగ్యం, సహనం, దయ, నీతి వృత్తి పట్ల అంకిత భావం, తెలివితేటలు మొదలైన గుణాలు కలవారెవరైనా, ఆయుర్వేద విద్య నభ్యసించవచ్చు. ఈ శాస్త్రం రెండు రకాలుగా ఉంటుంది. 1. శాస్త్రం 2. ప్రయోగం. ఆయుర్వేద శాస్త్ర విద్యార్థి ఈ రెండింటిలోను విజ్ఞానాన్ని సంపాదించాలి. ఆయుర్వేదంలో శల్య చికిత్సా విధానం కూడ బాగా అభివృద్ధి చెందింది. అనాటి ఆయుర్వేద వైద్యులు అపూర్వమైన శాస్త్ర జ్ఞానం కలిగి ఉండేవారు. వారి కీర్తి దేశ విదేశాల్లో కూడా వ్యాపించింది. 8వ శతాబ్దంలో అరేబియా ఖలిఫా భారతదేశం నుండి కొందరు వైద్యులను ఆయుర్వేద విద్యను నేర్పించడానికి తమ దేశానికి తీసుకొనిపోయాడు. కొందరు వైద్యులు బాగ్దాదు నుండి కూడ భారతీయ వైద్య విధానాన్ని నేర్చుకోవడానికి సంస్కృతంలోని వైద్య గ్రంథాలను అరబిక్‌లో భాషాంతరీకరించడానికి మనదేశానికి వచ్చారు.

భారతదేశం ప్రధానంగా వ్యవసాయిక దేశం కాబట్టి, పశుపోషణ బాగా జరిగేది. రాజులు కూడా యుద్ధానికి ఏనుగులను గుర్రాలను ఉపయోగించేవారు. కనుక పశు వైద్యం కూడ ఆనాడు బాగా అభివృద్ధిచెందింది. ఈ శాస్త్రంలో శాలిహోత్రుడు ప్రసిద్ధుడు. పశు వైద్య బోధనకు ప్రత్యేకమైన విద్యా సంస్థలు ఉండేవికావు. భారతంలో నకుల సహదేవులు పశు వైద్యంలో నిపుణులనే ప్రస్తావన ఉన్నది.

BRAOU

భారతదేశంలో ఐతిహాసిక యుగం నాటికే చతుష్షష్టి కళలు అభివృద్ధి చెందాయి. 'భాగవత పురాణం' 'భారతం', 'దశకుమార చరిత్ర', 'జాతకమాల', వాత్స్యాయనుని 'కామసూత్రాలు', బాణుని 'కాదంబరి', శుక్ర 'నీతి సారం', అశ్వఘోషుని 'సూత్రాలంకారం', జైన గ్రంథమైన 'సమవాయ సూత్రం', బౌద్ధ గ్రంథమైన 'లలిత విస్తారం' మొదలైన రచనల్లో సంగీతం, నృత్యం, నటన, చిత్రలేఖనం, అలంకరణ, మొదలైన ఈ చతుష్షష్టి కళల ప్రస్తావనలు కనిపిస్తాయి. భారతదేశంలో ఎక్కువ మంది ప్రజలు ఈ చతుష్షష్టి కళలనే వృత్తులుగా స్వీకరించి, తమ జీవనాధారంగా చేసుకొన్నారు. ఇని గొప్ప కూటీర పరిశ్రములుగా అభివృద్ధి చెంది, దేశ ఆర్థిక ప్రగతికి దోహదం చేశాయి. ఈ కళలో నిపుణులైన వారు ఆయా కళలందు ఆసక్తిగల యువకులకు నేర్పించేవారు. ఈ కళలను నేర్చుకోదలచిన విద్యార్థులు నిర్ణీతమైన శిక్షణకాలం గురువు దగ్గర ఉండి నేర్చుకోవాలి. ఒకవేళ నిర్ణీత శిక్షణాకాలానికి ముందే, ఆ విద్యలో నిపుణత్వం సంపాదించితే, ఆ విద్యార్థి తన కృషి ద్వారా గురువుకు తోడ్పడుతూ అతని దగ్గరే ఉండాలి కాని, విడిచివెళ్ల కూడదు.

వైదిక యుగం, అనంతర వైదిక యుగం, సూత్ర యుగంలోవలె ఐతిహాసిక యుగంలో స్త్రీలకు విద్యావకాశంగాని, సమాజంలో ఆదరణగాని ఉండేది కాదు. వారు ఆదర్శ గృహిణులుగా ఇంటి పనిచేసుకొంటూ ఇంటివరకే పరిమితం కావలసి ఉండేది. పతి భక్తి పేరుతో భర్తకు పరిచర్యలు చేయడమే కర్తవ్యంగా స్త్రీలకు బోధించబడేది. అందువల్లనే స్త్రీ పురుషునికి అణిగిమణిగి ఉండాలనే దురభిప్రాయం ఐతిహాసిక యుగం నుండే ప్రారంభమైంది.

21.6 బౌద్ధయుగం నాటి విద్యా విధానం

బౌద్ధ యుగం క్రీ.శ. 6వ శాతాబ్దం నుండే ప్రారంభమైంది. బౌద్ధ జాతక కథలవల్ల బౌద్ధ యుగం నాటి విద్యా విధానం తెలుస్తుంది. నాటి విద్యా వ్యవస్థ అంతా బౌద్ధ భిక్షువుల చేతుల్లో ఉండేది. విద్య నేర్చుకోవాలి అంటే, విద్యార్థి మొదట బౌద్ధ సంఘంలో చేరాలి. బౌద్ధ సంఘంలో చేర్చుకోవడానికి చేసే సంస్కారాన్ని 'పబ్బజ్జ' అంటారు. దీనిని అన్ని కులాల వారు అర్హులే. ఉపాలి అనే మంగలి ఈ పబ్బజ్జ సంస్కారాన్ని పొందడమే ఇందుకు నిదర్శనం. పబ్బజ్జ సంస్కారం పిల్లవానికి ఎనిమిదవ సంవత్సరంలో చేస్తారు. ఆ తర్వాత అతడు 'శ్రమణుడు' అని పిలవబడతాడు. శ్రమణుడు నాటినుండి పసుపుపచ్చని వస్త్రాలను ధరించాలి. బౌద్ధ సంఘంలో చేరి, బౌద్ధ భిక్షువు దగ్గర విద్యనభ్యసించాలి. 'ఉప సంపద' అనేది విద్యాభ్యాసం పూర్తి అయిన తర్వాత చేసే సంస్కారం. ఇది జరిగిన అనంతరం శ్రమణుడు భిక్షువుగా పిలవబడతాడు. బౌద్ధ యుగానికి ముందు యుగాల్లో బ్రహ్మచారి విద్యాభ్యాసం పూర్తిచేసుకొన్న తర్వాత వివాహం చేసుకొని, గృహస్థుగా మారేవాడు. కాని బౌద్ధ యుగంలో విద్య పూర్తిచేసుకొన్న శ్రమణుడు వివాహం చేసుకోకుండా భిక్షువుగా అంటే సన్యాసిగా మారుతాడు.

బౌద్ధ గురువులు రెండు రకాలుగా ఉండేవారు.

1. ఉపాధ్యాయుడు:- ఇతడు పది సంవత్సరాలుగాబౌద్ధ భిక్షువుగా ఉన్నవాడు.

2. ఆచార్యుడు:- ఇతడు ఆరు సంవత్సరాలుగా బౌద్ధ భిక్షువుగా ఉన్నవాడు.

విద్యార్థులకు విద్య బోధించే బాధ్యత ఉపాధ్యాయునిది కాగా, వారి నడవడిక క్రమశిక్షణల బాధ్యత ఆచార్యునిది. నియమనిబంధనల విషయంలో విద్యార్థులను జాగ్రత్తగా కనిపెట్టి ఉండేవారు. ఏమైనా పొరపాట్లు జరిగితే, వెంటనే మందలించేవారు.

బౌద్ధ విద్యార్థులను శ్రమణులేగాక 'సిద్ధివిహారికులని' కూడా అంటారు. వీరు గురు పరిచర్య చేయడం, భిక్షాటన చేయడం, బౌద్ధ విధులను నిర్వహించేవారు. గురువు అనుమతి లేకుండా ఎక్కడికి వెళ్ళేవారు కాదు. శ్రమణులు

BRAOU

సమీప గ్రామాలకు వెళ్ళి, ఆ రోజుకు సరిపోయే అంతవరకే భిక్షార్జన చేసేవారు. అవసరానికి మించి దేన్ని అధికంగా పొందకూడదనే విషయంలో చాలా ఖచ్చితంగా ఉండేవారు. బౌద్ధ విహారాల్లో గురుశిష్యుల అనుబంధం ఎంతో ప్రేమాదరాలతోను, ఆత్మీయతా భావంతోను ఉండేది.

స్త్రీలకు కూడ బౌద్ధ సంఘాల్లో ప్రవేశం ఉండేది. బౌద్ధ సన్యాసినులకు 'భిక్షుణి' అనేవారు. భిక్షుణిలు జన్మాంతం పవిత్రమైన జీవితాన్ని గడపడానికి బౌద్ధ సంఘం ప్రత్యేకమైన నియమనిబంధనలను ఏర్పాటుచేసింది. అవి భిక్షుణిలకు మంచి శీలాన్ని, నిజ్ఞానాన్ని కలిగించటానికి దోహదం చేసే విధంగా ఉండేవి. స్త్రీలు విదుషీమణులై సమాజానికి ప్రయోజనకరంగా ఉండే తాత్త్వికమైన, మతపరమైన ఉపన్యాసాలిచ్చేవారు. సమాజాన్ని మంచి మార్గంలో నడిపించటానికి ప్రయత్నించేవారు. కొందరు మంచి కవయిత్రులుగా కూడా తయారైనారు. అటువంటి విదుషీమణులు కవయిత్రులు అయిన భిక్షుణిల్లో విజయాంక, ధమ్మదీన, మహా ప్రజాపతి, సోమ, అనుపమ సుందరి, సుమేధ మొదలైన వారు ప్రఖ్యాతి చెందినారు.

చైనా యాత్రికుడైన హ్యూయన్ సాంగ్ రచన ద్వారా బౌద్ధ యుగం నాటి విద్యా విధానం తెలుస్తున్నది. నాటి విద్యా విధానం పూర్తిగా మతపరంగాను ఆధ్యాత్మికంగాను ఉండేది. ప్రధానంగా మోక్షమే బౌద్ధ విద్యా లక్ష్యంగా ఉండేది. దీన్నే 'నిర్వాణం' అన్నారు. విద్యార్థికి మొదట పంచ విద్యలు బోధించబడేవి. 1.శబ్ద విద్య 2.శిల్ప స్థాన విద్య 3.చికిత్సా విద్య 4.హేతు విద్య 5.ఆధ్యాత్మ విద్య.

శబ్ద విద్య వ్యాకరణానికి, శిల్ప విద్య కళలకు చికిత్సా విద్య వైద్యానికి, హేతు విద్య తర్కానికి, ఆధ్యాత్మ విద్య తత్త్వానికి సంబంధించినవి.

వీటితో విద్యార్థికి ప్రాథమిక విద్య పూర్తి అవుతుంది. ఇవే గాక తులనాత్మక అధ్యయనం కొరకు వేద విద్య కూడా నేర్పించబడేది. పతంజలి 'మహాభాష్యం', భర్తృహరి 'సుభాషితాలు'; వాక్యపదీయం, పురాణేతిహాస్యాలు కూడా బోధింపబడేవి. ఇవి మాత్రం విద్వాంసులైన బ్రాహ్మణులచేత బోధింపబడేని.

ఆనాడు విద్యా బోధనకు ప్రత్యక్ష పద్ధతిని (Direct Method) అనుసరించేవారు. భిక్షువు శ్రమణునికి మౌఖికంగానే నిద్యాంశాలు నేర్పించేవాడు. వాటిని శ్రమణులు వల్లెవేసి, కంఠస్థం చేసేవారు అంతేగాక, అనాడు తార్కిక పద్ధతిని (Inductive Method) కూడా అవలంబించేవారు. వివిధ అంశాలపై చర్చలను, పోటీలను, వాదోపవాదాలను నిర్వహించి, విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంచేవారు. వివిధ విషయాల్లో నిపుణులైన వారిని రప్పించి, ప్రసంగాలిప్పించే పద్ధతి కూడ అనాడు ఉండేది.

'వినయ' అనే అంశాన్ని ఉపాలి అనే పండితుడు బోధించేటప్పుడు తరగతుల నిండా విద్యార్థులు ఉండేవారట. ఉపాలి మంచి ఉపన్యాసకుడుగా ప్రఖ్యాతి గాంచినాడు. ఇటువంటి వాడే సారిపుత్ర అనేవాడు కూడ.

బౌద్ధ విహారాలే నాటి విద్యా సంస్థలు. బౌద్ధ విద్యా వ్యవస్థకు నిదర్శనంగా నలందా విహారం ప్రఖ్యాతి గాంచినది.

21.7 ప్రాచీన కాలంలో ప్రసిద్ధమైన విద్యా కేంద్రాలు

తక్షశిల:- గాంధార దేశంలోని తక్షశిల గొప్ప విద్యా కేంద్రంగా ఖ్యాతిగాంచింది. ఇది భారతదేశానికి పశ్చిమోత్తర దిశలో ఉన్నది. ఇప్పుడిది పాకిస్తాన్‌లో భాగమైంది. ఆనాడు తక్షశిల భారతదేశం, చైనా ఆసియా దేశాలమధ్య వాణిజ్య సంబంధాలకు కేంద్రమై, సుసంపన్నమైన నగరంగా వాసికెక్కింది. దీన్ని భరతుడు తన కుమారుడైన తక్షుని పేరుమీద నిర్మించడం చేత, అది తక్షశిలగా పేరుగాంచింది.

BRAOU

తక్షశిలలో మొదట వైదిక విద్యయే బోధింపబడేది. బౌద్ధ యుగంలో బౌద్ధ నిహారంగా రూపుదాల్చింది. బౌద్ధ జాతక కథల్లో ఉన్నత విద్య కోసం విద్యార్థులు వారణాసి, మిథిల మొదలైన సుదూర ప్రాంతాలనుండి కూడా వచ్చేవారని పేర్కొనబడి ఉన్నది. ప్రాచీన కాలంలో తక్షశిలలో ఒక సువ్యవస్థితమైన విద్యా కేంద్రం గాని విశ్వవిద్యాలయంగాని ఉండేది కాదు. అనంతర కాలంలో విద్వాంసులు పండితులు అన్ని వైపులనుండి తక్షశిలకు చేరుకున్నారు. వారు తమ స్వగృహాల్లోనే విద్యా బోధన చేయడం ప్రారంభించారు. వారు విద్యార్థులనుండి ముందుగానే జీతం తీసుకొనేవారు. బీదవారైన విద్యార్థులచేత శుశ్రూష చేయించుకొని, ఉచితంగా విద్యా బోధన చేసేవారు. విద్యార్థులు గురువుతోనే ఉండాలనే నిబంధన లేదు. విద్యార్జన కాలంలోనే గురువు దగ్గర ఉండి, అనంతరం స్వగృహాలకు పోయేవారు కూడ ఉండేవారు.

తక్షశిలలో వేదత్రయం, వ్యాకరణం, ఆయుర్వేదం, అష్టాదశ కళలు, యుద్ధ విద్య, విలు విద్య ఖగోళ శాస్త్రం, వ్యవసాయం, ఇంద్రజాలం విద్య మొదలైన అంశాలు బోధించబడేది. తక్షశిలలో వివిధాంశాలకు ప్రత్యేకమైన పాఠశాలలు కూడ ఉండేవి. అందులో వేద విద్యా పాఠశాల, ధర్మ శాస్త్ర పాఠశాల, సైనిక విద్యా పాఠశాల పేర్కొన దగినది. ధర్మశాస్త్ర పాఠశాలకు ఉజ్జయిని నుండి కూడ విద్యార్థులు వచ్చేవారు. సైనిక విద్యా పాఠశాలకు ఎంతో దూరంనుండి రాజకుమారులు శిక్షణకై వచ్చేవారు. ఈ పాఠశాల్లో విలువిద్యకు ప్రాధాన్యం ఎక్కువగా ఉండేది. దీన్నిబట్టి ఆనాడు తక్షశిల వైజ్ఞానిక నగరంగా ఖ్యాతి గాంచిందని చెప్పవచ్చు. ప్రఖ్యాత అర్థశాస్త్ర రచయిత కౌటిల్యుడుకూడా తన ఉన్నత విద్యను తక్షశిలలోనే అభ్యసించాడు. తక్షశిలలో గ్రీక్ సంస్కృతికూడా కనిపిస్తుంది. అందుకు కారణం అక్కడ కొందరు గ్రీకులు కూడ బోధకులుగా ఉండటమే.

నలంద:- నలంద బీహార్ రాష్ట్రంలో పాట్నాకు 65 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. జైన తీర్థంకరుడైన మహావీరుడు 14 వర్ష ఋతువులో నలందలో నివసించినట్లు 'భగవతి సూత్రం'లో పేర్కొనబడి ఉన్నది. లేపుడనే సంపన్నుడైన పౌరుడు నలందాలో బుద్ధునికి ఆతిథ్యమిచ్చి, అభిమానిగా మారినట్లు బౌద్ధ గ్రంథమైన 'సూత్రకృతాంగ'లో రాయబడి ఉన్నది. తారానాథుడు తన బౌద్ధ మత గ్రంథంలో నలంద శారిపుత్రుని జన్మ స్థలంగా పేర్కొన్నాడు. శారిపుత్రుడు ప్రసిద్ధుడైన బౌద్ధ భిక్షువు. ఇతని స్మృతి చిహ్నంగా నలందాలో చైత్యం కూడ నిర్మింపబడింది. తర్వాత అశోక చక్రవర్తి దానికి స్తూపాన్ని, విహారాన్ని కూడా ఏర్పాటు చేసినాడు. ఆ విధంగా అశోకుడు నలందా విహారానికి స్థాపకుడైనాడు. బ్రాహ్మణ పండితుడు, ప్రసిద్ధమైన బౌద్ధ భిక్షువు మహాయాన మత స్థాపకుడు అయిన ఆచార్య నాగార్జునుడు కూడ తన జీవితంలో ఎక్కువ కాలాన్ని నలందాలోనే గడపినాడు.

నలందాకు ప్రపంచవ్యాప్తంగా బౌద్ధ యాత్రికులు సందర్శించేవారు. క్రీ.పూ. 412 సంవత్సరంలో ఫాహియాన్ అనే చైనా యాత్రికుడు నలందాను సందర్శించాడు.

నలందా ఆనాడు ప్రసిద్ధమైన విద్యా కేంద్రంగా ప్రఖ్యాతిగాంచింది. నలందా విశ్వవిద్యాలయానికి భవనాలను, స్థలాన్ని గుప్త చక్రవర్తులు సమకూర్చారు. రత్నసాగరం, రత్నోదధి, రత్నరంజక అనే మూడు భవనాలు గల గ్రంథాలయం నలందా విశ్వవిద్యాలయంలో ఉన్నది. దీన్నిబట్టే నలందా సమస్త విజ్ఞానానికి గని వంటిదని స్పష్టంగా తెలుస్తుంది.

నలందా విశ్వవిద్యాలయం పండితులకు విద్యా బోధకులకు పుట్టినిల్లని ప్రఖ్యాతి గాంచింది. అక్కడ పదివేల మంది విద్యార్థులు ఉండేవారు. 1510 బోధకులు ఉండేవారు. విద్యార్థులకు ఉచితంగా విద్యా బోధన చేయబడేది. అక్కడ వేదాలను, హేతు విద్య, శబ్ద విద్య, చికిత్సా విద్య ఇంద్రజాలం విద్య, యోగ విద్య, సాంఖ్య న్యాయ విద్యలు, ఖగోళ శాస్త్రం మొదలైన విషయాలు బోధింపబడేవి. అంతేగాక 10 వ శతాబ్దం నాటికి తంత్రాయన, కాల చక్రాయన

అనే విషయాలు కూడ బోధనాంశాలుగా చోటుచేసుకొన్నాయి. ఆనాడు నలంద అంతర్జాతీయ విద్యా కేంద్రంగా ప్రసిద్ధిచెందింది.

నలంద విద్యా వికాసానికి, విద్యాభివృద్ధికి, మత సంస్కారానికి, సంస్కృతి పరిరక్షణకు కృషిచేసిన గొప్ప విద్యా కేంద్రంగా కీర్తి గడించింది. 800 సంవత్సరాలు అద్భుతంగా, విజ్ఞాన కాంతులను విరజిమ్ముతూ వెలిగిన నలంద సైశ్వ విద్యాలయం మహమ్మదీయుల దండయాత్రలతో సర్వనాశమైంది. ముఖ్యంగా 12వ శతాబ్దంలో ఖాజీ దండయాత్రలో భవనాలు కూలగొట్టబడినవి. గ్రంథాలయం తగులబెట్టబడింది. విద్యార్థులు, బోధకులు హింసకు గురైనారు. శతాబ్దాల తరబడి తన విజ్ఞాన జ్యోతితో ఎందరికో వెలుగును చూపి, మార్గదర్శిగా నిలిచిన నలంద నాటితో కాంతిహీనంగా మారింది.

వల్లభి (Vallabhi)

వల్లభి లేదా వల్లభిపురం పశ్చిమ భారతదేశంలో ఆరో శతాబ్దం నుండి పన్నెండో శతాబ్దం వరకు ప్రఖ్యాతి గాంచిన విద్యా సంస్థ నలందావలే వల్లభి యందుకూడా భారతదేశంలో పలు ప్రదేశములనుండి విద్యార్థులు వచ్చి చదువుకొనేవారు. ఇట్సింగ్ (it sing)నలంద వల్లభి విద్యా సంస్థల్లో విద్యార్థులు మూడు, నాలుగు సంవత్సరాలు ఉండి, వారి విద్యను ఆర్జించేవారు అని పేర్కొన్నాడు. వల్లభి ప్రముఖ వాణిజ్య సంస్థకూడా. చాలా వర్తకులు కూడా ఇక్కడ నివసించేవారు, వాళ్ళు ఈ విద్యా సంస్థను పోషించేవారు కూడా. ఇది హీనయాన బౌద్ధ సంస్థకూడా. ఇచ్చటి గ్రంథాలయంలో చాలా చాలా విలువైన పుస్తకాలు లభించెడివట.

విక్రమశిల (Vikramasila)

ఉత్తర మగధలో గంగానదీ తీరంలో ఒక కొండపై విక్రమశిల విహారాన్ని బెంగాల్ రాజు ధర్మపాలుడు స్థాపించాడు. ఈ విహారం చుట్టూ ఒక బలమైన ఎత్తైన గోడ ఉండెడిది. ధర్మపాలుడు ఈ విద్యా సంస్థకు చాలా విరాళాలు ఇచ్చాడు. దీనికి అనుబంధంగా ఆరు కళాశాలలు ఉండెడివట. ఈ విశ్వవిద్యాలయం విద్యా విధానానికి ఒక మార్గదర్శకంగా పేరుగాంచింది. ప్రముఖ ఆచార్యులు వివిధ శాఖల్లో పనిచేసేడివారు. వీరికి ఒక గొప్ప పండిత భిక్షువు అధికారిగా ఉండెడి వాడు.

మిథిల (Mithila)

మిథిల బీహార్‌లో కలదు. వైదికానంతర కాలంలో దీనిని 'విదేహా' అనెడివారు. ఉపనిషత్కాలంలో ఇది ఒక బ్రాహ్మణ నాగరికతకు ప్రాముఖ్యత నిచ్చింది.

ఐతిహాస, బౌద్ధ కాలంలో కూడా మిథిల ప్రముఖ విద్యా సంస్థగా పేరుగాంచింది. 12వ శతాబ్దం నుండి 16 వ శతాబ్దం వరకుకూడా ఇది చాలా ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం. మిథిలలో అభ్యసించిన విద్యార్థులు వారు తయారుచేసిన తాళపత్రాలనుకాని, పుస్తకాలను కాని, వారి విద్యాభ్యాసం తరువాత తీసికొని పోరాదని ఒక నిబంధన ఉండేది, వారి డిగ్రీని మాత్రమే తీసుకొని పోయెడి వారట. అలా అక్కడి ఆచార్యులు, గురువులు మిథిలలోని విద్య నిక్షేపాలను కాపాడుకొనెడివారు.

ఇటువంటి విద్యా సంస్థలు దక్షిణ భారతదేశంలో కూడా చాలా ఉండెడివి. పల్లవుల కాలంలో, చోళుల కాలంలో, విజయనగర కాలంలో కూడా ప్రముఖ విద్యా సంస్థలు ఉండేవి. అనేక ఆలయాల్లో, మఠాల్లో కూడా విద్యా విధానం జరిగెడిది.

BRAOU

21.8 సంగ్రహంగా

విద్యార్థి జీవితం మన ప్రాచీన భారతదేశంలో క్రమబద్ధంగా ఉండేడిది. గురుశిష్యుల సంబంధం చాలా అన్యోన్యంగా ఉండేది. జ్ఞాన సముపార్జనే కాక, ప్రపంచ వ్యవహారబద్ధంగా కూడా ఉండేది. అంచెలంచలుగా గ్రహించిన జ్ఞానం జీవిత అర్థానికి, సంఘ సేవకు, చాలా విలువను ప్రసాదించేది. పరిపూర్ణతను సంతరించుకొనెడిది. ప్రాచీన భారతంలో విద్య మతపరమైంది అనే నానుడి చాలా అనాలోచితమైంది. పరిశీలించి చూస్తే, ఆ క్రమశిక్షణలోని పరమార్థం వ్యక్తమౌతుంది. 'తైతరేయ ఉపనిషత్'లో కాన్వకేషన్ ఉపన్యాసంలో (Convocation address) ''నిజమునే పలుకుము. ధర్మమును నీవు నిర్వర్తించుము. స్వాధ్యాయము మరువకుము. మంచి చెడుల విచక్షణ కలిగియుండుము. వేదములను చదువుట, మిగిలిన వారికి నేర్పించుట మరువకుము. నీ విధి నిర్మాహణ సక్రమముగా చేయుము. తల్లిని, తండ్రిని, గురువుని దేవతలవలె పూజింపుము. అతిథులను సేవించుము. మంచి చేసిగౌరవమును సంతరించుకొనుము. మంచితనము, భయభక్తులు, మంచి నడవడిక, క్రమశిక్షణ, స్నేహభావము కలిగిన స్వభావము గౌరవాన్ని సంతరించుకుంటుంది. ఇదే నీ విధి నిర్వహణ. ఇవే నీవు గుర్తుంచుకోవలసిన, అభ్యసించగలసిన పద్ధతులు.'' అని చెప్పబడింది.

ఇట్టి విద్యా విధానమే మన భారతదేశ సంఘ గౌరవాన్ని పెంపొందించింది. ఇట్టి సంఘాన్నే మెగస్థనీస్ క్రీ.పూ. నాల్గవ శతాబ్దంలో వివరించినాడు. ''ఇక్కడ బ్రాహ్మణులు బంగారాన్ని ప్రేమించరు. మృత్యువుకు భయపడరు. సంఘమునందలి ప్రతి ఒక్కరూ నీతి, నిజాయితీ కలవారు. క్రమబద్ధ జీవితం కలవారు అని వర్ణించినాడు. ఇటువంటి క్రమ శిక్షణాసహితమైన జీవితమే, మన ప్రాచీన భారతదేశ సంఘ ప్రతిష్ఠలకు కారణమైంది. అటువంటి క్రమశిక్షణా జీవితానికి అవసరమైనది విద్య. అట్టి విద్యాభ్యాసమే ఆనాటి జీవిత విధానానికి సోపానమైంది. వైదిక, బౌద్ధ, జైన విద్యా సంస్థలన్నీ అట్టి విద్యనే ప్రసాదించాయి, మార్గదర్శకాలూ కూడా అయినాయి. జీవితాన్ని తీర్చిదిద్దేది విద్యే అని నిరూపించాయి. మన దేశంలోని విద్యార్థులు వారి నాగరికతను, సంస్కృతిని అర్థం చేసుకొని, గౌరవాన్ని ఇస్తే, మనకు మన పితృలు అందించిన విలువైన సాంప్రదాయాలకు విలువనిచ్చిన వాళ్ళవుతారు.

BRAOU

21.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

I **ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ప్రాచీన భారతదేశమందలి విద్యావిధానాన్ని వివరించండి.
2. ప్రాచీన భారతదేశ బౌద్ధ విద్యా విధానాన్ని చర్చించండి.
3. వైదిక కాల విద్యావిధానమును వర్ణించండి.
4. ప్రాచీన ప్రముఖ విద్యా సంస్థలను పేర్కొనండి.
5. ప్రాచీన భారతదేశమందలి గురు శిష్యసంబంధాలను వివరించండి.
6. ప్రాచీన భారతదేశమందలి బ్రహ్మ చర్యాశ్రమాన్ని గూర్చి చర్చించండి.

II ఈ క్రింది వాటికి లఘు వ్యాఖ్యలు రాయండి.

1. నలందా విద్యాలయం
2. వైశాలి
3. కాశీ
4. తక్షశిల
5. విక్రమశిల
6. ఐతిహాసిక యుగంలో విద్యా విధానం
7. సూత్రయుగంలో విద్యా విధానం
8. వైదిక యుగాంతర గురు శిష్య సంబంధం

21.10 ఉపయుక్త గ్రంథాలు

Aiyanger P.T.S : **LIfe in Ancient India**

Altekar A.S : **Education in Ancient India**

Basham A.L : **The Wonder that was India**

Buhler .G : **The Sacred Books of the East**

Keay F.E : **Education in Ancient and Later Times**

Kosambi D.D : **An Introduction to the study of Indian History**

Luniya B.N : **Life and culture in Ancient India**

Max Muller F : **Thirteen Principal Upanishads**

Mookerji R.K : **Ancient Indian Education**

" : **Ancient Indian Education from the Satakas**

Sharma D.S : **The Upanishads, An anthology**

Sharma R.S : **Perspective in Social and Economic History of Early India**

రచయిత్రి : డా. వి. మీనాకుమారి

BRAOU

BRAOU

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రం విభాగం

చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

రెండవ సంవత్సరం

కోర్స్ - I భారతదేశ సామాజికార్థిక చరిత్ర (అనాది నుండి క్రీ.శ. 700 వరకు)

పాఠ్యప్రణాళిక

ఖండం - I : హరప్పా సంస్కృతి

భాగం - 1 : ప్రాక్ హరప్పా సంస్కృతి, సమాజం

భాగం - 2 : హరప్పా సమాజం, మతం

భాగం - 3 : హరప్పా ఆర్థిక వ్యవస్థ: వ్యవసాయం, పరిశ్రమలు

భాగం - 4 : హరప్పా సంస్కృతి: నగర వ్యవస్థ

ఖండం - II : వేద యుగం

భాగం - 6 : వైదిక మతం, కర్మకాండలు

భాగం - 7 : వేద కాలపు సమాజం - కుల వ్యవస్థ

భాగం - 8 : వేద కాలం: ఆర్థిక వ్యవస్థ

ఖండం - III : క్రీ.పూ 6వశతాబ్దం నాటి మతోద్యమాలు : సామాజిక, ఆర్థిక వ్యవస్థలపై వాటి ప్రభావం

భాగం - 9 : బౌద్ధ మతం

భాగం - 10 : జైన మతం

భాగం - 11 : భాగవత, శైవ మతాలు

భాగం - 12 : ఆజీవకులు, లోకాయతులు

ఖండం IV : ఆర్థిక పరిస్థితులు

భాగం 13 : మౌర్యుల కాలంనాటి ఆర్థిక పరిస్థితులు

భాగం 14 : శాతవాహనుల కాలంనాటి ఆర్థిక పరిస్థితులు

భాగం 15 : గుప్తుల కాలంలో ఆర్థిక పరిస్థితులు

భాగం 16 : గుప్తుల అనంతర కాలంనాటి ఆర్థిక పరిస్థితులు

భాగం 17 : వాణిజ్యం, పరిశ్రమలు (క్రీ.శ. 2500-క్రీ.శ. 700)

భాగం 18 : భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ, దాని స్వభావం

ఖండం - V : సాంఘిక పరిస్థితులు

భాగం 19 : యుగయుగాలుగా కుల వ్యవస్థ

భాగం 20 : సమాజంలో స్త్రీల పాత్ర

భాగం 21 : విద్య, విద్యా కేంద్రాలు.

BRAOU

BRAOU

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమాలు

రెండవ సంవత్సరం

మాదిరి పరీక్షా పత్రం

కోర్స్-I: భారతదేశ సామాజికార్థిక చరిత్ర (అనాదినుండి క్రీ.శ. 700 వరకు)

సమయం : 3 గంటలు మార్కులు:100

భాగం - ఎ

I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి **4x15=60**

1. ప్రాక్ హరప్పా సంస్కృతి భౌగోళిక పరిధి, గమనశీలత, స్వభావాన్ని గూర్చి విశ్లేషణాత్మకంగా చర్చించండి.
2. హరప్పా సంస్కృతిలో నెలకొన్న రూపకళ, చిత్రకళ, చేతి పనులను గూర్చి తెల్పి, వాటి ప్రయోజనాత్మకతను అంచనా వేయండి.
3. వైదిక మత విశిష్టతను తెల్పి, ఋగ్వేద కాలంలో దైవాల వర్గీకరణను గూర్చి వివరించండి.
4. భాగవత, శైవ మతాల ప్రాముఖ్యత, ప్రత్యేకతలను కూలంకషంగా పరిశీలించండి.
5. మౌర్యుల కాలంనాటి ఆర్థిక వ్యవస్థ లక్షణాలను సమగ్రంగా పరిశీలించండి.
6. గుప్తుల కాలంలో ఉన్న భూముల వర్గీకరణను, భూ యాజమాన్య విధానాన్ని విశ్లేషించండి.
7. క్రీ.శ. 2500 నుండి, క్రీ.శ. 700 వరకు ప్రాచీన భారతదేశంలో నెలకొన్న వాణిజ్య, పరిస్థితులను, పారిశ్రామికాభివృద్ధిని సమీక్షించండి.
8. ప్రాచీన భారతదేశమందలి విద్యా విధానాన్ని విశ్లేషించి, ఆ కాలంలో వెలసిన విద్యా సంస్థలను గూర్చి రాయండి.

భాగం - బి.

II. క్రింది ప్రశ్నలకు లఘువ్యాఖ్యలు రాయండి. **5x8=40**

9. హరప్పా సంస్కృతిలోని పారిశ్రామిక వ్యవసాయికేతర ఉత్పత్తులను గూర్చి రాయండి.
10. వేద కాలం నాటి వర్తక వాణిజ్యాలను సమీక్షించండి.
11. బౌద్ధ మత క్షీణతకు కారణాలను వివరించండి.
12. జైన మత ప్రాముఖ్యత, ప్రత్యేకతలను విశ్లేషించండి.
13. ఆజీవక, లోకాయతుల మత తత్వాన్ని, జీవిన విధానాన్ని పోల్చి, పరిశీలించండి.
14. కుషాణుల పాలనలోని ద్రవ్య వ్యవస్థ ఎట్టిదో తెల్పండి.
15. పల్లవుల కాలంలో గ్రామీణార్థిక జీవనాన్ని గూర్చి వివరించండి.
16. శాతవాహనుల కాలం నాటి దేశీయ, విదేశీయ వ్యాపార కార్యకలాపాలను సమీక్షించండి.
17. ప్రాచీన భారతదేశంలో నెలకొన్న భూస్వామ్య వ్యవస్థ లక్షణాలెవ్వి?
18. పురాణ, ఇతిహాసాల్లో స్త్రీల పాత్ర, ప్రాధాన్యతను విశ్లేషించండి.

BRAOU

BRAOU

డా.బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

I చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం

రెండవ సంవత్సరం

కోర్స్-I: భారతదేశ సామాజికార్థిక చరిత్ర (ఆనాది నుండి క్రీ.శ. 700 వరకు)

అభ్యాసం - I

గమనికలు:

★ పుస్తకాలను చూచి జవాబులు రాయకూడదు

★ సాధ్యమైనంత వరకు జవాబులను మీ స్వంత పదాల్లో రాయాలి

★ జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకంనుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.

★ అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.

★ మీరు రాసే జవాబునకు ఇరువైపులా మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి

★ ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

భాగం - ఎ

I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. హరప్పా కాలంనాటి నగర నిర్మాణాన్ని, నగర వ్యవస్థపై సామాజిక ప్రక్రియల ప్రభావాన్ని గూర్చి చర్చించండి.
2. వేద కాలంలో మానవుని జననానికి ముందు, తర్వాత జరుపబడే కర్మకాండలను తెల్పి, వాటి ఆవశ్యకతను వివరించండి.

భాగం - బి

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. ప్రాక్ హరప్పా సంస్కృతుల్లో ఉపయోగించిన వివిధ రకాల పనిముట్లు, వాటి స్వభావాన్ని తెల్పండి.
2. వేద కాలంలో పుత్తులు, ఉపవృత్తులు ఏర్పడిన క్రమాన్ని పరిశీలించండి.

BRAOU

BRAOU

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం

రెండవ సంవత్సరం

కోర్స్-I: భారతదేశ సామాజికార్థిక చరిత్ర (అనాదినుండి క్రీ.శ. 700 వరకు)

అభ్యాసం - 2

గమనికలు

★ పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.

★ సాధ్యమైనంత వరకు జవాబులను మీస్వంత పదాల్లో రాయాలి.

★ జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.

★ అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.

★ మీరు రాసే జవాబునకు ఇరువైపులా మూల్యాంకనం కోసం, అవసరమైన స్థలాన్ని వదలండి.

★ ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి, రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

భాగం - ఎ

I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. బౌద్ధ మత ప్రాముఖ్యతను తెల్పి, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలపై బౌద్ధ మత ప్రభావాన్ని అంచనా వేయండి.
2. గుప్తుల కాలంలోని ఆర్థిక విధాన స్వభావాన్ని తెల్పి, ఆ కాలంలో జరిగిన పారిశ్రామికాభివృద్ధిని వివరించండి.

భాగం - బి

II క్రింది ప్రశ్నలకు లఘువ్యాఖ్యలను రాయండి.

1. భాగవత, శైవ మతాల పరిణామ క్రమాన్ని తెల్పండి.
2. ఆజీవక, లోకాయత తత్వాలను పోల్చి, పరిశీలించండి.

BRAOU

BRAOU

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం

రెండవ సంవత్సరం

కోర్స్ - I : భారతదేశ సామాజికార్థిక చరిత్ర (అనాది నుండి క్రీ.శ 700 వరకు)

అభ్యాసం - 3

గమనికలు

- ★ పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- ★ సాధ్యమైనంత వరకు జవాబులను మీ స్వంత పదాల్లో రాయాలి.
- ★ జాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- ★ అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- ★ మీరు రాసే జవాబునకు ఇరువైపులా మూల్యాంకనం కోసం, అవసరమైన స్థలాన్ని వదలండి.
- ★ ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి, రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

భాగం - ఎ

I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. ప్రాచీన భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భావానికి తోడ్పడ్డ ప్రధానాంశాలెవ్వి? సామాజికార్థిక రంగాలపై దాని ప్రభావమెట్టిది?
2. ప్రాచీన భారత సమాజంలో స్త్రీ స్థానాన్ని గూర్చి కులంకషంగా చర్చించండి.

భాగం - బి

II క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.


1. మౌర్యులనాటి పన్నుల విధానాన్ని క్లుప్తంగా పరిశీలించండి.
2. ప్రాచీన భారతదేశంలోని కుల వ్యవస్థ లక్షణాలను విమర్శనాత్మకంగా విశ్లేషించండి.

BRAOU

BRAOU

BRAOU

అందరికీ అందుబాటులో ఉన్నత విద్య




డా॥ బి. ఆర్. అంబేద్కర్

సార్వత్రిక విశ్వవిద్యాలయం
రోడ్డు నెం: 46
జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33

M.A.H(F)A-1

చరిత్ర

1



PRASAD

రచయితల బృందం

సంపాదకులు

ఆచార్య అల్లాడి వైదేహి కృష్ణమూర్తి

సహ సంపాదకులు

ఆచార్య వి. రామకృష్ణారెడ్డి

కుమారి ఇ. సుధారాణి

రచయితలు

ఆచార్య బి. మస్తానయ్య

డా. కె. సత్యమూర్తి

డా. వి. మీనాకుమారి

డా. కె. జానకి

ముఖచిత్రం : చంద్ర

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

ప్రథమ ముద్రణ

1996 **2002** 2004

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగాన్నైనా ఉపయోగించదలుచుకుంటే, విశ్వవిద్యాలయ అనుమతిని పొందాలి. ఈ పుస్తకం సార్వత్రిక విశ్వవిద్యాలయ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ఒక భాగం.

BRAOU

ఇతర వివరాలకు

డైరెక్టర్ (అకడమిక్)

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

రోడ్ నెం. 46, జూబ్లీ హిల్స్

హైదరాబాద్ - 500 033. ఆం.ప్ర.

Printed by : Siddeshwar Printers, Market Street, Secunderabad - 500 003.

Lr. No.960/Dr.BRAOU/DMP/PTG/F.No.38/J.O.271/Dt: 07-09-2004 - 200 Copies.

పరిచయం

చరిత్ర నిరంతరంగా సాగే ఒక సామాజిక ప్రక్రియ. మానవ సమాజంలో అభివృద్ధి, పరిణామాలు అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంటాయి. "చరిత్ర మరింత ఆకర్షవంతంగా ఉండాలంటే, మానవుడు తోటి మానవులందరి సహకారంతో తన అవసరాలు తీర్చుకొంటూ, ఎలా పురోగమిస్తూ వచ్చాడో చూపాలి" అన్న డి.డి. కొశాంబి మాటలు అక్షరాలా సత్యం. కాని, మనకున్న చరిత్రల్లో చాలావరకు సాధారణంగా రాజవంశాలనో, పాలకులనో, పరిపాలననో వర్ణించేవిగా ఉన్నాయి. మానవుడు తన సృజనాత్మక శక్తిచే నిర్మించి, ఉపయోగించి, వదిలి వెళ్ళిన అవశేష దృశ్య చిహ్నాలు, లిఖిత, మౌఖిక వాఙ్మయం ద్వారా, భారతదేశ చరిత్ర పునర్నిర్మింపబడి, కొంత వైధ్యంతో కూడిన వాస్తవాలు ఇటీవలి కాలంలో వెలుగులోకి వస్తున్నాయి. వాటి ఆధారంతో, వినూత్న దృక్పథంతో కూడిన రచనలు వచ్చాయి. చరిత్ర అంటే, ప్రభువుల, పాలకుల చరిత్రతో పాటు, సామాన్యుల చరిత్ర కూడా అన్న భావం ఉత్పన్నమై, సామాజికార్థికాంశాలకు ప్రాధాన్యత పెచ్చింది. చరిత్రగతినే నిర్దేశించే కీలకాంశాలైన సామాజికార్థికాంశాల ప్రస్తావన లేనిదే, చరిత్ర పరిపూర్ణం కాదు.

చరిత్రలో ద్వితీయ సంపత్సర స్నాతకోత్తర పాఠ్యాంశాలను అధ్యయనం చేసే డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థులకు, భారతదేశ సామాజికార్థిక చరిత్ర (అనాది నుండి క్రీ.శ. 700 వరకు) కోర్స్‌గా రూపొందించబడింది. ఇటీవలి కాలంలో చరిత్ర రచన, బోధనల్లో వచ్చిన మార్పుల కనుగుణంగా, ఈ కోర్స్ పాఠ్యాంశాలు రూపొందించబడ్డాయి. దీనిలో, మానవ సమాజ పరిణామ క్రమంలోని ప్రధాన ధోరణులు, మానవుని వైజ్ఞానిక, ఆర్థిక, పురోగతి, సామాజిక కట్టుబాట్లు, మత విశ్వాసాలు, నమ్మకాలు, దేశ విదేశాల్లో వారికున్న వ్యాపార సంబంధాలు మొదలైన అంశాలను విశ్లేషించడం జరిగింది.

ఈ కోర్స్‌లో మొత్తం ఐదు ఖండాలకు చెందిన ఇరవై ఒక్క భాగాలున్నాయి. పఠనా సౌలభ్యం కోసం, దీన్ని రెండు పుస్తకాలుగా ముద్రించడమౌతుంది. మొదటి పుస్తకంలో, మొదటి మూడు ఖండాలకు సంబంధించిన పన్నెండు భాగాలను చేర్చడం జరిగింది. వీటిలో భారతదేశ సంస్కృతీ పరిణామంలో ముఖ్య ఘట్టాలైన, మానవ నాగరికతా ఔన్నత్యాన్ని చాటిచెప్పే హరప్పా నాగరికత, మానవ మేధో పరిణామ క్రమాన్ని తెల్పే వేద కాలం, మత సంస్కరణవాద కాలం నాటి మహావీరుని జైన మతం, గౌతమ బుద్ధుని బౌద్ధం, హైందవ సంస్కృతీ మూలమైన భాగవత, శైవ మతాలు, నాస్తికవాదాలైన ఆజీవక, లోకాయత మతాలు సవివరంగా చర్చించబడ్డాయి.

రెండో పుస్తకంలో, చివరి రెండు ఖండాలకు చెందిన తొమ్మిది భాగాలను పొందుపర్చడమైంది. వీటి ద్వారా, ప్రాచీన భారతదేశంలో, మౌర్యుల, శాతవాహనుల, గుప్తుల కాలంనాటి ఆర్థిక స్థితిగతులు, అనాది నుండి క్రీ.శ. 700 వరకు నెలకొన్న వాణిజ్య, పారిశ్రామికాభివృద్ధి క్రమం, భారతదేశంలో నెలకొన్న భూస్వామ్య వ్యవస్థ లక్షణాలు, యుగయుగాలుగా పాతుకుపోయిన కుల వ్యవస్థ పరిణామం, ప్రాచీన భారత సమాజంలో స్త్రీల పాత్ర, విద్యా వికాసం గూర్చి విపులంగా విశ్లేషించబడ్డాయి. వీటి అధ్యయనం ద్వారా, మానవ సామాజికార్థికాభివృద్ధి పరిణామాలు ఏ విధంగా అవిచ్ఛిన్నంగా సాగాయో తెలుసుకొని, చరిత్ర గతిలో సామాజిక చైతన్యాన్ని, ఆర్థిక ప్రగతిని గూర్చి విద్యార్థులు సరైన అవగాహనను పొందగలరని ఆశిస్తున్నాం.

భారతదేశ సంస్కృతీ ఔన్నత్యాన్ని చాటిచెప్పే ప్రాచీన భారతీయుల సామాజికార్థిక చైతన్యాన్ని, మానవాళి మనుగడను, సమాజంలో ఉన్న వాస్తవాల వైరుధ్యాన్ని గూర్చి క్షుణ్ణంగా తెలుసుకొనేందుకు ఈ పాఠ్యభాగాలు తోడ్పడగలవని విశ్వవిద్యాలయం ఆశిస్తుంది.

BRAOU

విషయ సూచిక

			పుట నెం.
ఖండం – I	:	**హరప్పా సంస్కృతి**	
భాగం - 1	:	ప్రాక్ హరప్పా సంస్కృతి, సమాజం	3
భాగం - 2	:	హరప్పా సమాజం, మతం	12
భాగం - 3	:	హరప్పా ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, పరిశ్రమలు	19
భాగం - 4	:	హరప్పా సంస్కృతి, కళలు, చేతిపనులు	25
భాగం - 5	:	హరప్పా సంస్కృతి, నగర వ్యవస్థ	31
ఖండం – II	:	**వేద యుగం**	
భాగం - 6	:	వైదిక మతం, కర్మకాండలు	41
భాగం - 7	:	వేద కాలపు సమాజం, కుల వ్యవస్థ	62
భాగం - 8	:	వేద కాలం : ఆర్థిక వ్యవస్థ	84
ఖండం – III	:	**క్రీ.పూ. 6వ శతాబ్దం నాటి మతోద్యమాలు : సామాజికార్థిక వ్యవస్థలపై వాటి ప్రభావం**	
భాగం - 9	:	బౌద్ధ మతం	99
భాగం - 10	:	జైన మతం	118
భాగం - 11	:	భాగవత, శైవ మతాలు	128
భాగం - 12	:	ఆజీవకులు, లోకాయతులు	134
		పాఠ్య ప్రణాళిక	
		మాదిరి పరీక్షా పత్రం	
		అభ్యాసాలు	

BRAOU

ఖండం – I: హరప్పా సంస్కృతి

హరప్పా సంస్కృతుల్లో సామాజిక, ఆర్థిక విశ్లేషణలో ఐదు ప్రధానాంశాలున్నాయి.

మొదటిది, ప్రాక్-హరప్పా సంస్కృతులను, ఆ సమాజాలను విశ్లేషణ చేయడం. భారతదేశంలో సింధు, బెలూచిస్తాన్ ప్రాంతాల నుండి దిగువ పంజాబ్ ప్రాంతాల వరకు వివిధ స్థావరాలు పెంపొందాయి. ఇవి పర్వత ప్రాంతంలో ఉన్న కిలిఘుల్ మహమ్మద్ మొదలుకొని రాణా ఘుండై, పెరియానో ఘుండై, ముండిగక్, ఆమ్రి, అంజీరా, కోట్‌డిజి, హరప్పా వంటి చోట్ల వరకు విస్తరించి ఉన్నాయి. ముందుగా సంచార జాతుల ప్రభావంతో మొదలైన ఈ స్థావరాలు, రానురాను గట్టి ఉన్ముఖిత్వాన్ని పొందాయి. వీరు గొఱ్ఱె, మేక, జింక, ఎద్దు వంటి జంతువులతో తమ సాహచర్యాన్ని పెంచుకొన్నారు. వానిని పోషించడమేకాక, బార్లీ, గోధుమ వంటి వివిధ ఆహార ధాన్యాలను సాగు చేసేవారు. సారెతోను, చేతితో కూడా కుండలు తయారుచేయడం, వాటిని ఏకవర్ణకాలైన బహువర్ణకాలైన, రేఖాగణితం కాని (అజ్యామితీయ), రేఖా గణితయుక్త (జ్యామితీయ) నమూనాలతో అలంకరించడం గమనించగా వీరు మృణ్మయకర్మ సాంప్రదాయాలను కూడా పెంపొందించుకొన్నారు.

రెండో అంశం సామాజిక మతాంశాలకు చెందింది. సామాజికంగా వీరిని 'దస్యులు' (Dasyus) అనే జాతికి చెందిన వారుగా గుర్తించారు. ఆ సమాజంలో గమనశీలత దృష్ట్యా, వైవిధ్యం గల వృత్తుల దృష్ట్యా, వివిధ అలవాట్లు, ఆచార సంప్రదాయాలు పెంపొందాయి. మతపరంగా వారు ఖననాది మృత సాంప్రదాయాలను పెంపొందించుకోడమేకాక, స్త్రీ దేవతలను, వృక్షాలను, పశుపతి వంటి దేవుళ్ళను పూజించేవారు.

మూడో అంశంగా ఆనాటి ఆర్థిక వ్యవస్థను గుర్తించవచ్చు. ఆనాటి ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం, పరిశ్రమలు రెండు ప్రధాన భాగాలుగా పెంపొందాయి. పరిశ్రమల్లో మృణ్మయ పాత్రలను తయారుచేయటం, రాతితో ముద్రలు, పూసలు, బ్లేడులు వంటి వస్తువులు, రాగి, కంచు వస్తువులు తయారు చేసేవారు. వారి ఆర్థిక వ్యవస్థలో వాణిజ్యం ప్రధానంగా పెంపొందింది. వారు సుమేరియాతో, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, తూర్పు, దక్షిణ భారతదేశాలతోను వర్తక సంబంధాలను కల్గి ఉండేవారు.

నాల్గో అంశం, ఆనాటి కళలు, చేతిపనులు. చేతిపనులన్నీ కళలైనా, కళలన్నీ చేతిపనులు కావు. హరప్పాలో చిత్రకళ, నృత్యకళ, శిల్పకళ మొదలైనవి ప్రధానంగా పెంపొందాయి. శిల్పకళకు రాతిముద్రలు, చిత్రకళలకు మట్టిపాత్రలు, నృత్యకళకు కాంస్య విగ్రహాలు ప్రధానాధారంగా ఉండగా, మృణ్మయ శిల్పాలు రూపకళా సాంప్రదాయాన్ని సూచించాయి. లోహకర్మ వంటి కొన్ని చేతిపనులు కూడా పెంపొందాయి.

ఐదో అంశం, నగర వ్యవస్థ. హరప్పా సంస్కృతిలోని వివిధ నగరాలు ఏకరూపత కల్గిన ప్లానింగ్‌తో పెంపొందింపబడ్డాయి. దీనిలో స్నానవాటికలు, ధాన్యాగారాలు, మండపాలు, వంటి వివిధ నిర్మాణాలు కాల్చిన ఇటుకలతో చేయబడ్డాయి. వ్యవసాయికేతర వృత్తుల్లోని వైవిధ్యం, గ్రామీణ సంబంధాలు నగర వ్యవస్థను ఎంతగానో ప్రభావితం చేశాయి.

స్థూలంగా చెప్పాలంటే, హరప్పా సంస్కృతులు భారతీయ సామాజిక, ఆర్థిక జీవనానికి ఒక విశిష్టమైన పునాది వంటివి. కాని, సాంకేతికంగా తక్కువ విలువలు గల ఈ సంస్కృతులు, చారిత్రక కాలంలోని సామాజికార్థిక జీవనాలను, నగర జీవనాన్ని ప్రభావితం చేయలేకపోయాయి.

BRAOU

BRAOU

భాగం–1 : ప్రాక్ హరప్పా సంస్కృతి, సమాజం

విషయక్రమం

1.0 లక్ష్యాలు
1.1 పరిచయం
1.2 భౌగోళిక విస్తీర్ణత
1.3 స్థావర నిర్మాణ విశేషాలు
1.4 పరిసరాల పరిజ్ఞానం
1.5 మట్టి వస్తువులు
1.5.1 ఇటుకలు
1.5.2 చేతితో చేసినకుండలు
1.5.3 సారెతో చేసిన కుండలు
1.5.4 మృణ్మయ శిల్పాలు
1.6 రాతి వస్తువులు
1.7 లోహపు వస్తువులు
1.8 వృత్తులు
1.9 నమ్మకాలు
1.10 గమనశీలత, స్వభావం
1.11 తులనాత్మక పరిశీలన
1.12 సంగ్రహంగా
1.13 పరీక్ష నమునా ప్రశ్నలు
1.14 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

1.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

* భారత ఉపఖండంలో ప్రాచీన నాగరికతైన హరప్పా నాగరికతకు ముందున్న నాగరికతల భౌగోళిక విస్తీర్ణతను పరిశీలించగల్గాలి.
* ప్రాక్ హరప్పా సమాజాల స్థావర విధానాల పరిణామ పరిస్థితులు, ఆ కాలం ప్రజల పరిసరాల పరిజ్ఞానాన్ని విశ్లేషించగల్గాలి.
* ప్రాక్ హరప్పా ప్రజల వనరుల వినియోగాన్ని, వారి వృత్తులను, వారుపయోగించిన వివిధ పనిముట్లను గురించి వివరించగల్గాలి.
* ప్రాక్ హరప్పా సమాజ గమనశీలతను, స్వభావాన్ని, ప్రజల నమ్మకాలను గూర్చి విశ్లేషించగల్గాలి.

1.1 పరిచయం

క్రీ.శ.1922లో మొదటిసారిగా, భారత ఉపఖండంలో ముఖ్యంగా, సింధు లోయలో, పశ్చిమ ఆసియాలోని యూఫ్రటిస్, టైగ్రెస్ నదీ పరీవాహక ప్రాంతంలోని నాగరికతను, ఆఫ్రికాలోని నైలునదీ పరీవాహక ప్రాంతంలోని నాగరికతను పోలిన గొప్ప నాగరికత విశేషాలను యాదృచ్ఛికంగా కనుగొనడం జరిగింది. సింధు రాష్ట్రంలోని మొహంజొదారో, పంజాబ్‌లోని హరప్పా ప్రధాన కేంద్రాలుగా విలసిల్లిన ఈ నాగరికత తొలి నమూనా స్థలం (type site) హరప్పా ఆధారంగా, 'హరప్పా సంస్కృతి' అని పిలవబడింది. కాగా, ఈ నాగరికత ఎక్కువగా, సింధునది దాని ఉపనదులైన ఝీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ నదుల ప్రాంతాలన్నింటిలోను కనుగొనబడ్డం వల్ల దీన్ని 'సింధునదీ నాగరికత' అని కూడా వ్యవహరించడం జరిగింది. అదే రీతిలో, ఈ నాగరికత పరిధి సింధునదిని దాటి, దక్షిణంగా, సౌరాష్ట్రం వరకు విస్తరించడం వల్ల, దీన్ని ఎక్కువమంది ప్రాచీన భారతీయ నాగరికత అని కూడా వ్యవహరించారు. కాని, ఈ నాగరికత హఠాత్తుగా ఏర్పడ్డది కాదని, అది కేవలం ఒక క్రమ పరిణామమేనని గ్రహించడానికి తగిన వివిధ ఆధారాలను పురావస్తు శాస్త్రజ్ఞులు త్రవ్వకాల ద్వారా సేకరించారు. ఆ ఆధారాల వల్ల తెలియబడుతున్న సమాజాలనే, ప్రాక్ హరప్పా సంస్కృతుల సమాజాలని గుర్తించడం జరిగింది. ఈ ఆధారాలన్నీ, భౌగోళిక విస్తీర్ణతలోను, సహజమైన, మానవపరమైన వనరులను ఉపయోగించడంలోను, ఒక క్రమబద్ధమైన గతిశీలతను, శైలీపరమైన ఏకరూపత(uniformity)ను వ్యక్తం చేస్తున్నాయి. ఈ భాగంలో హరప్పా సంస్కృతులకు పూర్వకాలంలో పెంపొందిన ఈ నాగరికతల, సంస్కృతుల విశ్లేషణను, వివరణను గమనించగలం.

1.2 భౌగోళిక విస్తీర్ణత

ప్రాక్ హరప్పా సమాజాలకు చెందిన సాంస్కృతికావశేషాలను, వాయవ్య సరిహద్దు ప్రాంతాల్లోను, ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లోను, బెలూచిస్థాన్, సింధు, పంజాబ్ రాష్ట్రాల్లోను కనుగొనడం జరిగింది. 1950లో ఫెయిర్ సెర్వీస్ (Fair Servis)నముద్ర మట్టానికి ఇంచుమించు, 4000–5000 అడుగుల ఎత్తుగల ప్రాంతాల్లో క్వెట్టా(Quetta) నదీ ప్రాంతంలో గల కిలిఘుల్ మహమ్మద్ (Kili Ghul Mohammad)వద్ద కనుగొనడం జరిగింది. లోరలాయి (Loralai)నదీ ప్రాంతంలో బ్రిగేడియర్ రాస్, రాణాఘుండై (Rana Ghendai) వద్ద 1930లో కనుగొనడం జరిగింది.

సురాబ్(Surab)లోయలో డికార్డి(Decordi) అంజీరాలో ఇదే సంస్కృతిని కనుగొన్నారు. ఆర్ఘందాబ్(Arghandab)నదీ ప్రాంతాల్లో జె.ఎం. కాసల్ (J.M. Casal), ముండిగక్ (Mundigak)వద్ద గొప్ప ప్రాక్ హరప్పా సంస్కృతికి చెందిన స్థావరాన్ని కనుగొన్నారు. 1924లో ఝోబ్ (Zhob) లోయలో, ఆరెల్‌స్టీన్ (Aurel Stein) పెరియానో ఘుండై (Periano Ghundai)అనే వేరొక స్థావరాన్ని కనుగొన్నారు. కాగా, సింధునదీ పరీవాహక ప్రదేశంలో 1929లో మజుందార్ ఆమ్రి వద్ద, ఆ పిదప, కోట్‌డిజి (Kotdiji) మొహంజొదారోల వద్ద ఈ సంస్కృతులను కనుగొనడం జరిగింది. ఆ పిదప, 1946లో వీలర్ (Wheeler) హరప్పా వద్ద, ఘుఘర్ లోయలోని కాలీబంగన్ వద్ద, 1950–1953ల్లో ఎ. ఘోష్ బేతాంగ్ లోయలోను వేర్వేరు స్థావరాలను కనుగొనడం జరిగింది.

ఈ స్థావరాల స్థూల పరిశీలన ద్వారా, క్రీ.పూ. 3712 ప్రాంతాల్లో కిలిఘుల్ మహమ్మద్ వంటి ఎత్తైన ప్రాంతాల్లో

BRAOU

ఉన్న నాగరికతకర్తలు క్రమంగా సింధుసదిని, దాన్ని దాటి తూర్పుగా రాజస్థాన్‌లో గల ఘఘర్, చేటాంగ్‌ల వరకు హరప్పా – మొహంజొదారోల్లోని నగర సంస్కృతుల కన్న ముందుగానే విస్తరించినట్లు గమనించగలం.

1.3 స్థావర నిర్మాణ విశేషాలు

అంజీరా, రాణా ఘుండై ల్లోను, ముండిగక్‌లోను తొలి దశల్లో, సంచార జాతులవారి ఉనికి వ్యక్తమౌ తున్నది. వారు ఆయా కాలాల్లో కాల్చిన పచ్చి ఇటుకలనుపయోగించినా, ఏ రకమైన నిర్మాణాలను ఏర్పర్చుకోలేదు. ముండిగక్ మొదటి దశ మూడో భాగంలో (Ic) లో లభ్యమౌతున్న దిమ్మిస చేయబడిన భూమివల్ల, కొంతవరకు వీరు సంచారత్వాన్ని త్యజించి, స్థిరత్వాన్ని ఏర్పర్చుకొనే ప్రయత్నాలను కొనసాగించారని తెలుస్తుంది. పచ్చి ఇటుకల ఉనికి ఈ ప్రయతాన్ని సూచిస్తుంది. క్రీ.పూ. 3712 - 3688 మధ్య దశలో కిలిఘుల్ మహమ్మద్‌వద్ద పచ్చి ఇటుకలతో ఇళ్ళను, గోడలను నిర్మించుకొన్న దాఖలాలున్నాయి. ముండిగక్‌లోని రెండోదశలో, చక్కని ఇటుకలతో నిర్మించబడ్డ సుందరమైన స్థావర నిర్మాణం కనుగొనబడింది. ఇళ్ళ మధ్యలో అగ్నికుండాలతో చక్కని గదులు నిర్మించబడ్డాయి. ఈ స్థితి క్రీ.పూ. 2360కి ముందు గలదు. కాగా, ముండిగక్ నాల్గో దశలోనే చక్కని నగర నిర్మాణం పెంపొందింది. దానికిగల ప్రాకారాలు, సమచతురస్రాకారపు బురుజులు, స్తంభ సమూహాలతో కూడుకొన్న ఇటుక గోడలు, ఎంతో అభివృద్ధిని సూచిస్తున్నాయి. ఈ దశలోని చివరి భాగం హరప్పా సంస్కృతికి సమకాలీనమైంది. ఇదే విధంగా, ఆమ్రి మొదటి దశ రెండోభాగం (Ib)లో అనియతమైన రూపాలుగల పచ్చి ఇటుక కట్టడాలుండగా, మూడో భాగం (Ic)లో, రాతితో నిర్మించిన ఇళ్ళు కూడా లభించాయి. రాతి ఉపయోగం దృష్ట్యా, ఆమ్రి ముండిగక్ కన్న తర్వాతదేనని నిర్ద్వంద్వంగా చెప్పొచ్చు. ముండిగక్ నాల్గోదశలోని నిర్మాణాలను పోలినవానిని కోట్‌డిజిలో క్రీ.పూ. 2605-2335 మధ్య చూడొచ్చు. అక్కడ క్రీ.పూ. 2090 నుండి హరప్పా సంస్కృతితో మిళితమైన అవశేషాలను కనుగొనడం జరిగింది.

ఈ ఉదాహరణల దృష్ట్యా పరిశీలించినట్లైతే, ఇక్కడి స్థావరాలు పచ్చి ఇటుక, కాల్చిన ఇటుక, రాయి అనేవి ప్రధాన కట్టడపు పదార్థాలుగా, అనియత రూపస్థితి నుండి, క్రమబద్ధమైన నగర దశ వరకు రూపొందినట్లు గ్రహించొచ్చు.

1.4 పరిసరాల పరిజ్ఞానం

అక్కడ లభ్యమౌతున్న రాతి, మట్టి, లోహపు వస్తువులను పరిశీలించడం ద్వారా, కుండల మీద గల అలంకరణ సమూనాలను పరిశీలించడం ద్వారాను, వారికి తమ చుట్టుపట్ల గల పరిసరాలతో ఎంత సంబంధం గలదీ, వానిపట్ల వారికి ఎంత అవగాహన ఉన్నదీ గ్రహించగలం.

క్రీ.పూ. 3712 ప్రాంతంలోనే, ఎద్దులు, మేకలు, గొఱ్ఱెలను మచ్చిక చేసికొన్నట్లు, కిలిఘుల్ మహమ్మద్‌లోని ఆధారాలు తెల్పుతున్నాయి. అదేవిధంగా రాణా ఘుండై కు చెందిన 14 అడుగుల తొలిదశ నాటి మేటల్లో గొఱ్ఱె, మేక, గాడిద, భారతీయ జాతికి చెందిన పశువుల (Bosindias) వంటివి కన్పించాయి. ఇక్కడే రెండో దశలో, ఆబోతు (Humped Bull)లను వరుసలుగా కుండల మీద చిత్రించడం జరిగింది. ముండిగక్‌లో మట్టితో కాల్చి చేసిన ఆబోతు బొమ్మలు తొలిదశలో, మూడోదశ ఆరోభాగంలోను లభించాయి. ఇదేరకమైన బొమ్మలు డాంబ్ సదాత్ (Daamb Sadat) వద్ద గల మూడోదశలో, క్రీ.పూ. 2625-2528ల మధ్య; ఝోబ్

BRAOU

(Zhob) లోయకు చెందిన పెరియానో ఘుండై (Periano Ghundai), ఆమ్రి (Amri) (Id)ల్లోను లభించాయి. ఆమ్రి (Id)లో కుండల మీద వివిధ నాల్గు కాళ్ళ జంతువుల శ్రేణులు లభ్యమయ్యాయి. వీనిలో కాప్రిడ్ (caprid)లు అంటే, మేకల వంటి జంతువులు కొన్ని మాంసాహార జంతువులు (cornivores)లభ్యమయ్యాయి.

వీటి పరిశీలనవల్ల మానవుడు కేవలం వ్యావసాయిక సంపదపై న మాత్రమే ఆధారపడకుండా, పర్యావరణంలోని ఆనుషంగిక (secondary) అంశమై న జంతువులపై కూడా ఆధారపడ్డట్లు, తద్వారా, వాటిని ఆహార, వ్యవహారాల్లో వినియోగించుకొన్నట్లు తెలుస్తుంది. ఇది ఒకవంక మానవుడు ప్రకృతిపై సాధించిన విజయాల పరంపరకు తోడ్పడగా, మరోవంక ఎదుగుతున్న మానవజాతి సమతౌల్యతను కోల్పోకుండా చూడ్డానికి అనుగుణంగా ఎంచుకొన్న, అనుపరించిన చర్యగా భావించొచ్చు.

లభ్యమౌతున్న పురావస్తూధారాల్లో గల రాతి, లోహాలతో చేసిన వస్తు విశేషాలను పరిశీలన చేసినప్పుడే కూడా ఇదే అంశాన్ని గ్రహించొచ్చు. ఖనిజాల ఉపయోగం, మానవుడు తన పరిసరాలను ఎంతో దీక్షతో గమనిస్తూ, నశించే వస్తువులను త్యజించి, నశించని వస్తువులను ఏర్పర్చుకొనే మార్గం ద్వారా, తన జీవితంలో ప్రకృతితో పోరాటంలోని తరచు జరిగే సంఘటనలను తగ్గించుకొంటూ, ఒకవంక తన స్థిరత్వానికి, వేరోవంక ప్రకృతి స్థిరత్వానికి దోహదం చేసిన రీతిని గుర్తించొచ్చు. రాగిని ప్రవేశపెట్టడమనేది రాతికి రసాయన చర్య చేసి, రాతి నుండి స్థిరమై న లోహాన్ని సాధించినట్లే, సామాజిక స్థిరత్వాన్ని సాధించడానికి ముందడుగు వేసినట్లే భావించొచ్చు. ఎముకలవంటి వాటిని కూడా వ్యర్థ పదార్థాలని భావించకుండా, వాటితో, సూదులు, రంధ్రాలు లేని సూదులు వంటి వాటిని చేయడంలో పరిసరాల్లోని ఏ వస్తువును త్యజించకుండా సద్వినియోగపర్చు కొన్న రీతిని గుర్తించొచ్చు. ఇది మానవుడు ప్రకృతితో ఏర్పర్చుకొన్న ప్రయోజనాత్మక దృక్పథంతో కూడుకొన్న సంబంధాలకు పరాకాష్ఠ. వేర్వేరు రకాలుగా ఈ క్రింద వివరింపబడే వస్తువుల వివరాలు ఈ రకమై న సంబంధాలు పరాకాష్ఠకు చెందడంలోని ఒక ఏకరూపతను వ్యక్తం చేసే వివిధ దశలకు నిదర్శనాలే.

1.5 మట్టి వస్తువులు

మట్టి వస్తువుల్లో ప్రధానమై నవి ఇటుకల కుండలు. ఇటుకలను కాల్చని పచ్చి ఇటుకలుగాను, కాల్చిన ఇటుకలుగాను రెండు రకాలుగా వర్గీకరించొచ్చు. కాగా, కుండలన్నీ కాల్చినవే. కాని వాటిని చేతితో చేసినవి (hand - made) అని, సారెపై ఏర్పరచినవి (wheel - thrown) అని రెండు రకాలుగా గుర్తించొచ్చు. సారెపై ఏర్పరచిన కుండలను నిరలంకృతాలని (non-decorative). సాలంకృతాలని (decorative) వర్గీకరించొచ్చు. సాలంకృతాలై న వాటిని ద్వివర్ణకములు(chrome) అని, బహువర్ణకాలు (multichrome/polychrome) అని రంగునుబట్టి, జ్యామితీయ లేక రేఖాగణితయుక్తాలంకృతాలు (geometric motifs) 'జంత్వాలంకృతాలు' (animal motifs) అని అలంకరణ స్వరూపాన్ని బట్టి వర్గీకరించొచ్చు. ఇవికాక, మట్టితో కాల్చి చేసిన బొమ్మలు, మూడవ తరహాకు చెందిన మృణ్మయ శిల్పానికి ఉదాహరణలు.వీని విశేషాలను మరింత వివరంగా ఈ క్రింద వివరించొచ్చు.

1.5.1 ఇటుకలు

ఇటుకల్లో కాల్చకుండా, కేవలం, ఎండబెట్టి గట్టిపర్చబడిన వాటిని క్రీ.పూ. 3688 ప్రాంతంలో కిథిముల్ మహమ్మద్ వద్ద సంచారజాతుల కాలంలో రాణాఘుండై వద్ద, మొదటి దశ మూడో భాగం(Ic)లో ముండిగక్ వద్ద, మొదటి దశ రెండో భాగం (Ib)లో ఆమ్రివద్ద, క్రీ.పూ. 2605 ప్రాంతంలో, కోటడిజిల వద్ద తొలి ఉదాహరణలుగా

BRAOU

గమనించొచ్చు. ఈ ఇటుకలన్నీ రానురాను పూర్తిగా కాల్చబడినవై నట్లు గుర్తించొచ్చు.

1.5.2 చేతితో చేసిన కుండలు

ఇవి కుండల్లో తొలి దశను, అనాగరకమైన, సుకుమారం కాని వస్తువులను సూచిస్తాయి. కిలిఘుల్ మహమ్మద్‌లో క్రీ.పూ. 3688 ప్రాంతంలో, రాణాఘుండై లో సంచార జాతుల స్థావరాల కాలంలోను, అంజీరా, ముండిగక్‌ల్లో రెండో దశల్లోను, ఆమ్రిలో మొదటి దశ, మొదటి భాగం (Ia) లోను లభ్యమయ్యాయి. ముండిగక్ రెండో దశలో లభ్యమయ్యే ఈ చేతితో చేసిన కుండలు, సాంస్కృతిక జీవనంలో పురోగమన రాహిత్యానికి గుర్తులుగా చెప్పబడ్డాయి. కారణం, ముండిగక్ మొదటి, మూడో, నాల్గో దశల్లో సాంస్కృతికాభివృద్ధి ఉండగా, చేతితో చేయబడ్డ కుండలు లేకపోవడమే. ఈ ఉదాహరణవల్ల చేతితో చేసిన కుండల ఉనికి, సాంస్కృతిక ప్రగతి లేకపోవడాన్ని గాని, సాంస్కృతిక ప్రగతిలో గతిశీలత లోపించినదానికి గాని, లేదా అవరోధాల పరివ్యాప్తికిగాని గుర్తుగా పరిగణించొచ్చు.

1.5.3 సారెతో చేసిన కుండలు

క్రీ.పూ. 3688 ప్రాంతంలో, కిలిఘుల్ మహమ్మద్ వద్ద సారెతో చేసిన కుండలు లభించాయి. అవి ఎరుపు లేక పసుపుపచ్చ, ఎరుపు కలిసిన ఉపరితలంపై పసుపు, నలుపు, ఎరుపు పూతల్లో అలంకృతమై ఉండేవి. కాగా, రాణాఘుండై రెండో మూడో దశల్లో, అంజీరాపద్ద కుండలు లేత ఎరుపు నుండి ఎరుపు వరకుగల ఉపరితలంపై నల్లని రంగుతోను, ఎరుపు మెరుగుతోను చేసినవి. కాగా ముండిగక్‌లోని మూడో, నాల్గో దశల్లో ఎరుపురంగుపై నలుపు ఛాయగాని, బహువర్ణకాల ఛాయలుగాని ఉండి, నల్లని పూత గల్గి ఉండి, కలాత్ వద్ద ఎర్రరంగు, మీగడ రంగుపై ఎర్రని ఛాయ, నలుపుపై ఎర్రని-అలంకరణ కల్గినవీ లభ్యమౌతున్నాయి. ఆమ్రి(Id)లోను, (Ic)లోను గోధుమ రంగు ఉపరితలంపై నల్లని ఛాయతోగాని, ముదురు ఎరుపుపై సాదా నారింజపండు రంగు ఛాయతోగాని ఉన్నవి దొరికాయి. వీనిలో అనేక ప్రయోజనాలు కలవు. రాణా ఘుండై లో చిన్నచిన్న కప్పులు, పెద్దవి చిన్నవి కాని, గుండ్రటి మట్టుతో ఉన్న గిన్నెలు (Bowls) లభ్యమయ్యాయి. ముండిగక్‌లో జాడీలు, నీటిపాత్రలు లభించాయి.

ఈ కుండల అలంకరణలో రకరకాల విశేషాలు కన్పిస్తున్నాయి. కిలిఘుల్ మహమ్మద్‌లో రేఖలు, త్రిభుజాలు, వృత్తాలు, అర్ధవృత్తాలు వంటివి రాణా ఘుండై లో ఆబోతుల వరుసలు, అంజీరాలో బుట్ట అల్లికల వంటి చారలు, ముండిగక్‌లో వృక్షాలు, ఎద్దులు, ఐబెక్స్ మృగాలు, అశ్వత్థ వృక్షాలు వంటివి, డాంబ్ సదాత్‌లో ఆబోతులు, కలాత్, ఆమ్రి అంజీరాల్లో మేకలవంటి జంతువులు, కోట్‌డిజిలో జంతువులు, పుష్పాలు, కాలిబంగన్‌లో లతలు, వక్రరేఖలు వంటివి కన్పిస్తున్నాయి. ఈ రకమైన అలంకరణలు ఆనాటి సమాజంలో పెరుగుతున్న సౌందర్యారాధన, భోగలాలసత వంటి వానికి సూచనలే.

1.5.4 మృణ్మయ శిల్పాలు

మట్టితో బొమ్మలు చేసి, కాల్చిన వాటిని ప్రసిద్ధ మృణ్మయ శిల్పాలుగా గుర్తించొచ్చు. దీనిలో ముఖ్యమైనవి, ఆబోతుల శిల్పాలు. వీటిని ముండిగక్ ,మొదటి దశ , మూడో భాగం (IC) లోను, మూడో దశ ఆరో భాగం (III E) లోను, పెరియానో ఘుండై లోను గమనించొచ్చు. కాగా, మట్టితో చేసిన స్త్రీ మూర్తులను రాణా ఘుండై (III C). డాంబ్ సదాత్ (III). ముండిగక్ (IV) పెరియానో ఘుండై ల్లో చూడొచ్చు. ఈ రకమైన స్త్రీ మూర్తులు శిరోజాలంకరణలు, వక్షోజాలంకరణలు వంటివానితో తీర్చిదిద్దబడ్డాయి.

BPAOU

1.6 రాతి వస్తువులు

రాతి వస్తువులను కొంచెం విలువైన రాళ్ళైన చర్ట్ (Chert), జాస్పర్ (Jasper), చాల్సిడోనీ (Chalcedony), లాపిస్ లజూలి (Lapis Lazuli) వంటి వానితోను, కొంచెం సామాన్యమైన రాళ్ళైన అలబాస్టర్, స్టియటైట్, ఫ్రిట్, సున్నపురాయి (Lime stone) మొదలైన వానితో చేయడం జరిగింది. బ్లేడులు, మొద్దుబర్చిన అంచుగల బ్లేడులు, పూసలు, బాణపు మొనలు, విలువైన రాళ్ళతో చేశారు. కాగా పాత్రలు, రోళ్ళు, పాత్రాలు, నూరుకొనే రాళ్ళను అలబాస్టర్, ఫ్రిట్ వంటి వాటితో చేసేవారు. బాణపు మొనల్లో రెండువైపుల చెక్కినవి ముండిగక్, పెరియానో ఘుండై, కోట్‌డిజి మొదలైన చోట్ల దొరికాయి. నూరుకొనే పలకలు, చిన్నచిన్న రాతిగుళ్ళు డాంబ్ సదాత్, ఆమ్రి, కోట్ డిజిల్లో లభ్యమౌతున్నాయి. సున్నపురాతిని కేవలం ప్రయోజనకరమైన వస్తువుల కోసంగాక, అలంకరణలుగా శిల్పాలవంటివి చెక్కడానికి ఏర్పర్చుకొన్నారు. ముండిగక్ నాల్గోదశ మూడోభాగం (IV C)లో, తెల్లని సున్నపురాతి పై చెక్కిన మగవాని శిరస్సు శిల్పం దొరికింది. దీనిలో శిరోజాలను ఒక రిబ్బను వంటి దానితో కట్టినట్లు ఏర్పర్చబడింది. ఈరకమైన శిల్పాలు హరప్పా సంస్కృతికి తక్షణ పూర్వ యుగంలో లభించడం గమనార్హం.

1.7 లోహపు వస్తువులు

రాగి, ఇత్తడిలతో చేయబడిన వివిధ వస్తువులు లభించాయి. రాగితో సూదులు, వంచిన బ్లేడులు, గాజులు చేయబడగా, కంచుతో గొడ్డళ్ళు, నరకు పనిముట్లు (Adzes) చేయబడ్డాయి. కిలిఘుల్ మహమ్మద్, ముండిగక్, కోట్‌డిజి వంటి అన్నిచోట్ల ఈ లోహపు వస్తువులు దొరికాయి. రాగిని తొలిసారిగా క్రీ.పూ. 3688 పిదప దశల్లో, కిలిఘుల్ మహమ్మద్ వద్ద కనుగొనడం జరిగింది. ఆమ్రిలో లభ్యమైన ఈ వస్తువులకు సమకాలీనంగా, C14-రేడియో కార్బన్ తేదీలు లభ్యం కావడం లేదు. కాని ఇవి మొదటి దశ మొదటి భాగం (Ir)లో, ఆమ్రిలో లభించడం దృష్ట్యా, ఈ స్థావరమే కిలిఘుల్ మహమ్మద్ కన్న తర్వాతదని తెలుస్తున్నది.

1.8 వృత్తులు

వీరు వ్యవసాయాన్ని, పశుపోషణను ప్రధానంగా నిర్వహించేవారు. గోధుమల్లో ట్రిటికం కంపాక్టం (Triticum Compactum), ట్రిటికం స్ఫారొకోకం (Triticum Sphorococum) అనే రెండు రకాలను బార్లీ (Hordeum vulsar)ని, ఆవాలు, బఠాణీలను పండించేవారు. గొఱ్ఱెలు, మేకలు, దున్నపోతులు (Bosbubalis), ఎద్దులు (Bostrolicus) అనేవాటిని పెంచేవారు. గొఱ్ఱెల, మేకల పెంపకం క్రీ.పూ. 3712 నుండి ఉందని తెలుస్తుంది. వీరు ఆహార వ్యవస్థలో పక్షులను, ఐబెక్స్ వంటి మృగాలను కూడా వేటాడి ఉండొచ్చని, ముండిగక్ నాల్గో భాగంలో గల ఆధారాలదృష్ట్యా ఊహించొచ్చు. వ్యవసాయికేతర వృత్తుల్లో కుమ్మరివని, లోహకర్మ, శిలాకర్మ ప్రధానమైనవిగా గుర్తించొచ్చు. కుండలు, ఇటుకలు వంటివి ఈ పనులకు గల ప్రాచుర్యాన్ని, కౌశల్యాన్ని చూపించగా, చిత్రలేఖనం, శిల్పం వంటి వృత్తులు పైతరగతికి చెందిన చేతిపనులుగా గుర్తించొచ్చు. రాగి, దాని మిశ్రమ లోహమైన కంచు-తఱుచూరి, క్లిష్టమైన రసాయనిక కర్మతో కూడుకొన్న వృత్తిని సూచిస్తుంది. ఎముకలతో

చేయబడ్డ పనిముట్లను కూడా, ఒకస్థాయిలో గుర్తింపదగ్గ వృత్తిగా గ్రహించినట్లు తెలుస్తున్నది.

1.9 నమ్మకాలు

ప్రాక్ హరప్పా సమాజాల్లో కూడా కొన్ని నమ్మకాలను గమనించొచ్చు. ఈ నమ్మకాలు కాలగమనంలో ఎప్పుడు, ఎలా ఏర్పడిందీ, ఇదమిత్థంగా చెప్పలేకపోయినా, పురావస్తవశేషాల దృష్ట్యా, కొన్ని నమ్మకాలున్నాయని మనం గ్రహించొచ్చు. వీనిలో మొదటిది, మృతి పిదప నమ్మకాలకు చెందినది. మానవుడు తిరిగి జన్మిస్తాడు అన్న నమ్మకం ఉండడం వల్లనే, ఈ శరీరాంశాలను తిరిగి గ్రహిస్తాడని విశ్వసించడం వల్లనే, ప్రస్తుత జన్మలోని శరీరాలను అగ్నికాహుతం చేయకుండా, ఖననం చేయడమనే సాంప్రదాయాన్ని గుర్తించవలసి వచ్చింది. బూర్జుహోం వంటి కొత్త రాతియుగపు స్థావరాల్లో కుక్కలు, ఐబెక్స్ వంటివానికి విస్తరించిన ఈ విధానాన్నే, మానవ సమాజాల్లో కూడా విస్తరించడం జరిగింది. ఈ దశలో, సమూహులు ఏర్పడ్డం జరిగింది. క్రీ.పూ. 2360కు చెందిన ముండిగక్ మూడో దశలో, ఈ రకమైన సమూహులు వ్యక్తిగతమైనవిగా కాక, సామూహికమైనవిగా ఏర్పడ్డాయి. వీనివల్ల సమాజంలో ఇంకా వ్యక్తిగతమైన నమ్మకాలు ముదరలేదని గ్రహించొచ్చు. రెండో అంశంగా, 'అమ్మతల్లి' (Mother Goddess) అని పిలవబడ్డ స్త్రీమూర్తి ఆరాధన విపులంగా ఉండేది. 'మోచ్ దేవతలు' అని గుర్తించబడ్డ వివిధ దేవతామూర్తులను గుర్తించడం జరిగింది. మూడో అంశంగా 'ఎద్దును', 'ఆబోతును' పూజించినట్లు భావించొచ్చు. హరప్పా నాగరకత కాలంలో 'పశుపతి' అని పిలువబడ్డ మూర్తిని కనుగొనడం, ముట్టిబొమ్మల్లో ఎక్కువగా 'ఆబోతు' బొమ్మలు కనిపించడం వ్యవసాయ ప్రధానమైన ఆ సమాజాల్లో ఎద్దును గౌరవించి, పూజించడానికి గల అవకాశాలను వాస్తవంగా భావించొచ్చు. ఇవేకాక, రావి వంటి వృక్షాలను గుర్తించడం రావి ఆకుల పొలికలో, బాణపు మొనలను చేయడం వంటి వాని ద్వారా, వారు తర్వాతి కాలంలో 'అశ్వత్థ వృక్షారాధన'గా పేరుపొందిన పూజకు శ్రీకారం చుట్టినట్లుగా గుర్తించొచ్చు. కాని, ఇక్కడ నదులను, ప్రకృతి దేవతలను పూజించే ఆచారాలను చూడలేకపోతున్నాం. కాని, ముండిగక్ రెండోదశలో ఇళ్ళలోని గదుల మధ్యలో కన్పించిన అగ్నికుండాలను పోలిన నిర్మాణాల దృష్ట్యా, ఈ సమాజంలో అగ్నిపూజను ఒక నమ్మకంగా ప్రతిపాదించొచ్చు.

1.10 గమనశీలత – స్వభావం

ఈ నాగరకత విలసిల్లిన స్థలాల్లో జీవన గమనశీలత ఎంతో విశిష్టతను వ్యక్తం చేస్తున్నది. కాలానుక్రమణిక ప్రకారం, క్రీ.పూ. 3712 ప్రాంతం నుండి 2500 వరకు ఈ నాగరకత కేవలం కొండవాగులనాధారంగా చేసికొని విలసిల్లిందే. కాని, డాంబ్ సాదత్ (Daamb Sadat)ముండిగక్ మూడోదశ నుండి నాగరకతలో వేగం పెరిగింది. ముండిగక్ రెండోదశలో గల సాంస్కృతిక గమనశీలతా రాహిత్యం, ఆమ్రి మొదటి దశ నాల్గో భాగం (Id) పిదప సంభవించిన స్థల పునర్నిర్మాణం, కోట్‌డిజిలో క్రీ.పూ. 2335-2090ల మధ్య ఏర్పడ్డ రెండు సామూహిక దహనస్థితుల (conflagrations) వల్ల ఈ నాగరకత క్రీ.పూ. 2500-2090 మధ్య కాలంలో, ఎంతో అభివృద్ధి పొందినట్లు గ్రహించగలం.

కాని ఈ స్థితిలో ఒక చిన్న సాధారణ ప్రశ్న తలెత్తుతుంది. మార్షల్ వంటి కొందరి ప్రకారం, సింధులోయ

BRAOU

నాగరకత క్రీ.పూ. 2750 నుండి 1500 వరకు విలసిల్లింది. దాని దృష్ట్యా, ముండిగక్ మూడో దశలో క్రీ.పూ. 2360 ప్రాంతాల నుండి వ్యాప్తి పొందిన నాగరకత, డాంబ్ సదాత్ వద్ద క్రీ.పూ. 2625–2220లో విలసిల్లిన నాగరకత, కోట్‌డిజిలో క్రీ.పూ. 2335 ప్రాంతం నుండి విలసిల్లిన నాగరకత కేవలం హరప్పా సంస్కృతినే కాని, ప్రాక్ హరప్పా సమాజాల సంస్కృతిని ప్రతిపాదించదు గదా? అనే ప్రశ్న తలెత్తుతుంది. దీని దృష్ట్యా కిలిఘుల్ మహమ్మద్, రాణాఘుండై, అంజీరా, ముండిగక్ మొదటి రెండు దశల్లోను, పెరియానో ఘుండై, కలాత్, ఆమ్రి తొలిదశలోను విలసిల్లిన నాగరకతనే, సిసలైన ప్రాక్ హరప్పా సమాజాలకు చెందిన సంస్కృతిగా భావించొచ్చు. పర్వత భూముల నుండి సింధునదీ మైదానాన్ని ఈ నాగరకత తాకిన పిదప, అది సింధు నాగరకత అనే పట్టణ నాగరకత ప్రవాహంలో, ఒక సెలయేరుగా కలిసిపోయినట్లు తెలుస్తుంది. అందువల్లనే, ప్రాక్ హరప్పా స్థలాలను బెలూచిస్థాన్ సింధులోయలో ఎక్కువగాను, పంజాబ్‌లో తక్కువగాను, ఘుఘర్, చేతాంగ్ లోయల్లో చాలా తక్కువగాను గుర్తించొచ్చు. గమనశీలత దృష్ట్యా ఇది వాయవ్యంలో పుట్టి, తూర్పుకు పెరిగి, జరుగుతూ సింధునదీ తూర్పు తీరప్రాంతాల్లో అంతరించిన పట్టణ నాగరకతని, పర్యవసించిన గ్రామీణ నాగరకత అని చెప్పొచ్చు.

1.11 తులనాత్మక పరిశీలన

ప్రాక్ హరప్పా సమాజాలకు చెందిన ఈ సంస్కృతి అభివృద్ధి చెందిన వివిధ స్థలాలను, స్థలాల్లోని విశేషాలను తులనాత్మకంగా పరిశీలించడం అవసరం. గమనశీలత గల ఈ నాగరకతలో, వాయవ్యం నుండి, తూర్పుకు జరిగినకొలది, గొఱ్ఱెలు, మేకలు, గాడిదలు వంటి వాని ప్రభావం అంతరించింది. ఐబెక్స్ మృగం, ఎద్దు వంటి మైదాన ప్రాంతాలకు చెందిన జీవరాసుల ప్రాబల్యం పెరిగింది. అంతేగాక రావిచెట్టు వంటివి, ఆహార ధాన్యాల కంకులు వంటివి కుండల మీద చిత్రింపబడడం దృష్ట్యా చూస్తే, మైదాన ప్రభావం బాగా హెచ్చుగా కన్పిస్తుంది. అదేవిధంగా, పక్షుల ప్రాబల్యం పెరిగింది. రాణా ఘుండై, కిలిఘుల్ మహమ్మద్, అంజీరా వంటిచోట్ల గల కొన్ని అంశాలు పూర్తిగా ముండిగక్, ఆమ్రి, కోట్‌డిజి వంటి చోట్ల లోపించాయి. తొలిస్థలాల్లో గల సంచారజాతుల ప్రభావం, తర్వాతి స్థలాల్లో లేదు. ముండిగక్ మూడో దశను ఇరాన్‌లోని హిస్సార్, సియాల్క్ సంస్కృతులతో పోల్చడం జరిగింది. దాని దృష్ట్యా కూడా, ముండిగక్ వంటి స్థలాలనుండి పూర్తిగా నాగరకత స్వభావం మార్పు పొందినట్లు గుర్తించగలం. కోట్‌డిజి, హరప్పా, కాలీబంగన్ వంటి చోట్ల గల ప్రాక్ హరప్పా సంస్కృతుల స్వల్ప ప్రాతినిధ్యం, హరప్పా సంస్కృతితో గల సామీప్యం దీన్ని బలపరుస్తున్నాయి.

ఈ రకంగా, ప్రాక్‌హరప్పా సమాజాల సంస్కృతులను గతిశీలత దృష్ట్యా, స్వరూపం దృష్ట్యాను పట్టణ నాగరకతగా పెంపొందిన ఒక నాగరకత తొలి రూపాలుగా గుర్తించొచ్చు.

1.12 సంగ్రహంగా

కిలిఘుల్ మహమ్మద్, రాణా ఘుండై, ఆమ్రి, అంజీరా, పెరియనో ఘుండై, ముండిగక్, కోట్‌డిజి, వంటిచోట్ల పెంపొందిన ప్రాక్ హరప్పా సంస్కృతి వాయవ్యంలో ఆవిర్భవించి, ఆగ్నేయంగా, తూర్పుగా జరిగి, పెరిగి విస్తరించి సింధునదీ తూర్పుతీర ప్రాంతాల్లో పట్టణ నాగరకతగా పర్యవసించింది. ఈ నాగరకతల్లో మట్టి, రాయి,

BRAOU

లోహాలు పనిముట్లకై వాడబడ్డాయి. వ్యవసాయం, పశుపోషణ ప్రధాన వృత్తులు. వీరిలో కొన్ని మతపరమైన నమ్మకాలను కూడా గమనించొచ్చు. ఈ నాగరకతను ఇరాన్‌లోని హిస్సార్, సియాల్క్ వంటిచోట్ల గల సంస్కృతులతో సరిపోల్చవచ్చును. ఈ నాగరకతలో, పర్యావరణంతో మానవ సమాజ సంబంధాలు నిర్దిష్టంగా ఏర్పర్చుకొని, ప్రకృతిని, సమాజాన్ని రక్షించడానికి చేసిన భారీస్థాయి ప్రయత్నాలను పనిముట్లు,నివాసగృహాలు, చిత్రాలవంటి ప్రతీకల ద్వారా గుర్తించొచ్చు.

1.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. ప్రాక్ హరప్పా సంస్కృతుల్లో భౌగోళిక పరిధిని, స్థావర నిర్మాణ విశేషాలను వివరించండి.
2. ప్రాక్ హరప్పా సంస్కృతుల్లో ఉపయోగింపబడిన వివిధ రకాల పనిముట్లను, వాటి స్వభావాన్ని విశ్లేషించండి.
3. ప్రాక్ హరప్పా సంస్కృతుల్లో గమనశీలతను, స్వభావాన్ని పరిశీలించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. ప్రాక్ హరప్పా సంస్కృతులు నగర జీవనంలో అభివృద్ధి చెందిన గ్రామీణ నాగరకతలేనా?
2. ప్రాక్ హరప్పా సంస్కృతుల్లో విలసిల్లిన వృత్తులు, ప్రజల నమ్మకాల్ని గూర్చి రాయండి.

BRAOU

1.14 ఉపయుక్త గ్రంథాలు

Allichin. R & Allichin. B : **The Birth of Indian Civilization. India and Pakistan before 500 B.C.**

Basham A.L. (Ed) : **A Cultural History of India**

Sankalia H.D. : **The Pre-history and Proto-history of India and Pakistan.**

Sale S.A. : **Indian Pre-history.**

Vats M.S. : **Excavations at Harappa 2 Vols.**

రచయిత : డా. కాశీభట్ల సత్యమూర్తి

భాగం – 2 : సమాజం – మతం

విషయక్రమం

2.0 లక్ష్యాలు
2.1 పరిచయం
2.2 సామాజిక వ్యవస్థ
  2.2.1. ఆహారపుటలవాట్లు
  2.2.2. వస్త్రాభరణాలు – వినోదాలు
2.3 మత వ్యవస్థ
  2.3.1 మృత కర్మలు
  2.3.2 పూజా ప్రతిమలు
  2.3.3 ఇతరాంశాలు
2.4 సంగ్రహంగా
2.5 పరీక్ష నమూనా ప్రశ్నలు
2.6 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

2.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

* హరప్పా సంస్కృతికి చెందిన పురావస్తు ఆధారాల ద్వారా, ఆనాటి సామాజిక వ్యవస్థను, సమాజంలోని అలవాట్లను, జీవన విధానాన్ని వివరించగల్గాలి.

* హరప్పా సంస్కృతిలో ప్రాచుర్యం పొందిన మతాచారాలను, మత విశ్వాసాలను విశ్లేషించగల్గాలి.

2.1 పరిచయం

ప్రాక్ హరప్పా సంస్కృతుల నుండి పరిణమించి, పూర్తి చెందిన సంస్కృతిని హరప్పా సంస్కృతి అని వ్యవహరించారు. దీనికి చెందిన స్థలాలను సింధునదికి పశ్చిమ, పశ్చిమోత్తరాలుగా గల సుక్తా జెందార్ (Suktagendor), సోత్కాకో (Sotkakoh), బాలాకోట్ (Balakot), థారో (Tharo), ఆమ్రి (Amri), ఆలిమురాద్ (Alimurad), లోహంజొదారో (Lohanjodaro), నిందో (Nindo), మెహి (Mehi), మొహంజొదారో (Mohenjodaro), జుదీర్జొదారో (Judeirjodaro), దాబర్‌కోట్ (Dabarkot) ప్రాంతాల్లోను, సింధు నదికి తూర్పుగా, ఆగ్నేయంగా గల కోట్‌డిజి (Kot Diji), చన్హుదారో (Chanhudaro), హరప్పా (Harappa), రూపర్ (Rupar), ఆలంగీర్‌పూర్ (Alangirpur), కాలీబంగన్ (Kalibangan), సంధనవాలా (Sandhanawala), దేపల్‌పూర్ (Desalpur), లోథాల్

(Lothal), రంగపూర్ (Rangapur), రోజడి (Rojadi), భగత్రావ్ (Bhagatrav) మొదలైన స్థలాల్లోను గమనించొచ్చు. ఈ సమాజానికి వ్యవహర్తలుగా, సంస్కృతికి కర్తలుగా వ్యవహరించిన వారిపట్ల ఇదమిత్థమైన అభిప్రాయం లేదు. కాని, ప్రస్తుతం అంగీకరించడమైంది. పండితుల అభిప్రాయం ప్రకారం, ఈ నాగరకతకర్తలు దస్యులని (Dasyus) ద్రావిడులని, ఆర్యుల కన్న వేరైన ఒక జాతివారని భావించబడ్తున్నది.

2.2 సామాజిక వ్యవస్థ

హరప్పా సంస్కృతిలో సామాజిక వ్యవస్థ లక్షణాలను గూర్చి వివరించడానికి లిఖితమైన ఆధారాలేమీ లేవు. కాని, అనేక పురావస్తాధారాలను వ్యాఖ్యానించడం ద్వారా, ఆనాటి సామాజిక వ్యవస్థనే కాక, పాలక, పాలిత సంబంధాలను కూడా అవగాహన చేసుకోవడం జరిగింది. అప్పటి పట్టణాలైన మొహంజొదారో, హరప్పా, కాలీబంగన్, కోట్‌డిజి వంటిచోట్ల పట్టణ నిర్మాణ వ్యవస్థలో కనుపించిన దుర్గం, నివాస ప్రాంతం అనే విభజన ఉన్నతిని, అధికారాన్ని పొందిన ఒక వర్గాన్ని, కేవలం పాలితులుగా ఉండి అనధికారులుగా వ్యవహరిస్తున్న వేరొక వర్గాన్ని సూచిస్తున్నదని కొందరి అభిప్రాయం. కాగా, నివాస గృహాల నిర్మాణంలో గల కొన్ని మార్పులను కూడా, సామాజిక వ్యవస్థను గూర్చిన సూచికలుగా గుర్తించడం జరిగింది. ఇళ్ళ నిర్మాణంలోని పరిమాణ వైవిధ్యాలు, కొన్ని ఇరుకు ప్రాంతాల ఉనికివల్ల కొందరు చరిత్రకారులు ఉదాహరణకు, రొమిల్లా థాపర్, మాలిక్ వంటివారు ఈ సంస్కృతిలో, బానిస వ్యవస్థకు కూడా అవకాశాన్నిచ్చే ఒక సామాజికస్తర (Social Strata)నిర్మాణమని లేదా అంతరాలని భావించారు. అంతేగాక, దిబ్బలపై గల కోటలు, వానిలో గల ధాన్యాగారాలు వంటి నిర్మాణాల ద్వారా మధ్య, పశ్చిమాసియాలోని పట్టణాల్లాగా ఇక్కడ కూడా దైవపూజార్హతతో కూడిన ఒకే వర్గంవారి పాలనను ఊహిస్తున్నారు.

2.2.1 ఆహారపులవాట్లు

వీరు ప్రధానంగా గోధుమలు, బార్లీ ఆహారానికి వినియోగించేవారు. చిక్కుళ్ళు, బీన్స్, బఠాణీలు, ఖర్జూరాలు ఇతర ఆహారపదార్థాలుగా వినియోగించేవారు. నువ్వులు, ఆవాలు నూనెకు ఉపయోగించేవారు. గొఱ్ఱెలు, మేకలు, గేదెలు, కోళ్ళు వంటివానిని ఆహారానికి ఉపయోగించేవారు. దొరుకుతున్న పంది, దున్నపోతు ఎముకల ఆధారంగా, వాటిని వారు వేటాడి, ఆహారానికి వినియోగించినట్లు గ్రహించొచ్చు. రకరకాల జింకలను కూడా వేటాడి, ఆహారానికి ఉపయోగించడం గమనార్హం.

2.2.2 వస్త్రాభరణాలు – వినోదాలు

కొన్నికొన్ని స్థలాల్లో నేసిన ప్రత్తిని గమనించడం జరిగింది. దాని దృష్ట్యా, వారు ప్రతితో నేసిన, వస్త్రాలను ఉపయోగించేవారని గుర్తించొచ్చు. మొహంజొదారోలో లభ్యమైన గడ్డం కల శిరస్సు రాతిబొమ్మను పరిశీలించినట్లైతే, ఉత్తరీయం వంటి అలంకృత వస్త్ర విశేషాలను ఊహించొచ్చు. అదేవిధంగా, మొహంజొదారోలోని స్త్రీమూర్తుల మట్టి బొమ్మల ద్వారా శిరోవేష్టన (head dress) అలంకరణలోని వస్త్రధారణ, నివీ భాగం (waist) నందలి వస్త్రధారణాంశాలను చూడగలం.

వారి ఆభరణాలు మరింత విశేషమైనవి. బంగారం కంచు వంటి లోహాలు, స్టియటైట్ పూసలు, మట్టి, ఆల్చిప్పల పూసలు, అలంకరణల్లో చూడగలం. మొహంజొదారోలో దొరికిన అటువంటి ఆభరణాల్లో, ఆరు వరుసలతో

BRAOU

ఏర్పడిన చిన్నచిన్న పూసలదండలు చివర కలపబడి ఉండడం. ఒకే వరుసలో ఏకాంతరంగా రెండురకాల పూసలు మూడుమూడు ఏర్పర్చబడి, దానికి మధ్యలో 21 వేలాడే నాల్గునాల్గు పూసల మొత్తాలు గల దండలు; మూడువరుసల తీగె, మధ్యలో రెండువరుసల పూసలతో గల సరాలు వంటివి ఉన్నాయి. అక్కడే దొరికిన స్త్రీ దేవతల మూర్తుల్లో పూసల వరుసల వాడకాన్ని, వడ్డాణం వంటి ఆభరణం ఉపయోగాన్ని చూడగలం. అదేవిధంగా, మొహంజొదారోలో లభించిన స్త్రీ నర్తకి కాంస్య విగ్రహం ఆధారంగా వారు వాడిన గాజులు, మెడలో మూడు లోలకుల వంటివి వ్రేలాడదీసిన తాడువంటి దండ వంటి ఆభరణాల గూర్చి తెలుస్తున్నది.

వారి వినోదాల్లో ముఖ్యంగా గుర్తింపదగినవి, మట్టిబొమ్మలు. ఇవి పిల్లల ఆటల కోసం, గృహాలంకరణ కోసం ఉద్దేశింపబడి ఉంటాయనడంలో సందేహం లేదు. అటువంటి బొమ్మల్లో ఒకటి అద్భుతమైన మృచ్ఛకటిక. ఈ మొత్తం బండి, రెండెద్దులతో లాగబడుతున్నట్లు ఆ ఎద్దుల జంటకు బండి ఒక మట్టి కడ్డీ ద్వారా కలపబడింది. బండి మొత్తం తలకిందులు చేయబడ్డ పుటాకారం ( ) లో ఉండి, మొత్తం రెండు సమచతురస్రపు భాగాలుగా విభజించబడి ఉంది. దాని చక్రానికి ఒకవైపు నాలుగు, వేరొకవైపు నాలుగు, జల్ల పెట్టినపుడు పట్టుకోడానికి అనువుగా ఉండే, కర్రలను మట్టితో చేసినవానిని ఏర్పర్చడం జరిగింది. దానికి ఒకవైపు చక్రం మాత్రం మిగిలి ఉంది. కాగా, ముండిగక్, హరప్పా, మొహంజొదారో వంటిచోట్ల ఎద్దు, ఏనుగు వంటి బొమ్మలు, కాకి, పావురం, వంటి పక్షులను సూచించే మట్టిబొమ్మలు లభించాయి. ఇవన్నీ బాలుర, బాలికల ఆటల.కోసం ఉద్దేశించినవే అనొచ్చు. మొహంజొదారోలో దొరికిన ఓడబొమ్మ, దానిపై గల పక్షుల అలంకరణలను కూడా, ఈ కోవలోనికే చేర్చొచ్చునని చెప్పొచ్చు.

కాగా, పెద్దల వినోదాల్లో గుర్తింపదగింది నృత్యం. మొహంజొదారోలో లభ్యమైన నర్తకి కాంస్య ప్రతిమ దానికి సాక్ష్యంగా ఉంది. అదే విధంగా ,ఇక్కడి రాతిముద్రల్లో (stone seals) ఒకటిగా గుర్తింపబడిన ఒక పౌరాణికాత్మకమైన ముద్రలో గల పశుపతిని పోలిన స్థానికమూర్తి, వానికి దిగువన గుర్తింపబడిన ఏడుగురు నృత్య భంగిమలకు పోల్చదగిన భంగిమల్లో గుర్తించడమైంది. ఇతరత్రా ఆధారాలు ఏ మాత్రం లభించకపోయినా, నృత్యంతో పాటు సంగీతం, దానికి తగ్గ సాహిత్యం, గాత్ర సంగీతం వంటివి ఉన్నట్లుగా మనం ఊహించగలం. మొహంజొదారోలో కన్పడిన పెద్ద ఈత కొలను (great bath) దృష్ట్యా, దానికి నిర్మాణ విధానం దృష్ట్యా, ఆ కాలంలో ఈత పందాల వంటి వాటిని నిర్వహించి ఉండొచ్చని కూడా భావించొచ్చు.

2.3 మత వ్యవస్థ

హరప్పా సంస్కృతి ఎంత నగర జీవనాన్ని పెంపొందించుకొన్నప్పటికీ, ప్రకృతితో సంబంధాలను పూర్తిగా తెంచుకోలేదు. అందువల్లనే, అక్కడ కొన్ని మతాచారపరమైన వైవిధ్యాలను, మత విశ్వాసాలను గమనించొచ్చు. వాన్ని ఈ క్రింది విధంగా వర్గీకరించి విపులీకరించొచ్చు.

2.3.1 మృత కర్మలు

మానవునికి ఇతర ప్రపంచం పట్ల ఆధ్యాత్మికత పట్ల ఆలోచన మానవుని మృతి తోనే ప్రారంభమౌతుంది. ఈజిప్టు నాగరకతలో గల 'బుక్ ఆఫ్ ది డెడ్' **(Book of the Dead)**, కాఫిన్ టెక్ట్స్ **(Coffin Texts)** వంటి ఆధారాలు, మృతకర్మకు గల ప్రాముఖ్యతను అనాదిగా ఎత్తిచూపుతున్నాయి. ప్రపంచపు వింతల్లో ఒకటిగా గల పిరమిడ్లు, ఈ రకమైన మృతకర్మలతోను, చావు పిదప జన్మ అనే నమ్మకం తోను ముడిపడి ఉన్నదనడంలో

సందేహం లేదు.

అదేవిధంగా హరప్పా, మొహంజొదారో వంటి హరప్పా సంస్కృతికి చెందిన వివిధ స్థావరాల్లో మృతకర్మలను, మతాచారాలను సూచించే వివిధ ఆధారాలను వెలికి తీయడం జరిగింది. ఈ ఆధారాల సంఖ్య వస్తుపరంగా తక్కువగానే ఉన్నా, వాసిపరంగా గొప్పది.

1937లోను, 1941లోను వాట్స్‌చే కనుగొనబడి, 1946 వీలర్‌చే పునఃపరిశీలితమైన R 37 అనబడే హరప్పా సంస్కృతికి చెందిన శ్మశానం, H అనబడే హరప్పా అంతర సంస్కృతికి లేదా మలి హరప్పా సంస్కృతికి చెందిన సమాధిని వెలికి తీయడం జరిగింది. అదేవిధంగా, బవల్పూర్‌లోని దెరావర్ (Derawar) వద్ద, లోథాల్ (Lothal), కాలీబంగన్ (Kalibangan)లోను మరిమూడు సమాధులను వెలికి తీయడం జరిగింది.

ఈ సమాధుల్లో తల ఉత్తరంవైపుగా పెట్టి, శరీరాన్ని వెల్లకిలా పరుండబెట్టి పాతిపెట్టడం జరిగింది. శవంతోబాటుగా వివిధ రకాల మట్టిపాత్రలు, ఆభరణాలను కూడా ఉంచడం జరిగింది. కాలీబంగన్‌లో అతి పెద్ద పరిమాణానికి చెందిన 4x2 మీటర్లలో ఉండే ఇటుకతో చేసిన, సమచతురస్రపు, దీర్ఘ చతురస్రపు గదుల వంటి నిర్మాణాలలోను, హరప్పాలో శవపేటికలోను ఉంచి ఖననం చేసినట్లు ఆధారాలున్నాయి. కాలీబంగన్‌లో రెండురకాల సమాధులున్నాయి. చిన్నచిన్న వృత్తాకారపు గోతుల్లో పెద్ద పాత్రల నుంచి, ఏమాత్రం మానవ శరీరావశేషాలుంచకుండా సమాధి చేయడం ఒక రకం. కాగా కొన్నిచోట్ల కేవలం కొన్ని అస్థికలు మాత్రం ఉంచి, శరీరం ఏమాత్రం లేకుండా సమాధి చేయడం. లోథల్‌లో వేరొకరకమైన సమాధిని గుర్తించొచ్చు. ఒకే సమాధిలో స్త్రీ, పురుషుల శరీరాలను ఖననం చేయడం. ఈ విధానం తర్వాతి కాలంలోని 'సతీసహగమన' విధానాన్ని పోలి ఉందని పురావస్తు శాస్త్రజ్ఞులు వ్యాఖ్యానించారు.

2.3.2 పూజా ప్రతిమలు


హరప్పా నాగరకతలో గల కొన్ని ఇతరాంశాలు పూజా విధానంలో ప్రముఖమైనవి. 'ఝోబ్ దేవతలు' (Zhob goddesses) అని, ప్రాక్-హరప్పా సంస్కృతిలో పేరొందిన స్త్రీల కాల్చిన మట్టి ప్రతిమలను మార్షల్ మొదలైనవారు, హరప్పా సంస్కృతిలోని శక్తి ఆరాధన మూలంగా భావించడం జరిగింది. దానివల్లనే, సంతానభాగ్యం పొందాలనే కోర్కెతో రేకెత్తిన మత శాఖ స్త్రీ ఆరాధనను ప్రోత్సహించింది. అదేవిధంగా, వారు అశ్వత్థ వృక్షంలాంటి వాటిని, నాగదేవతలను పూజించేవారు. ఈనాటికీ ద్వీపకల్ప భారతదేశంలో సంతానవతులు కావాలని స్త్రీలు అశ్వత్థ వృక్షాలను నాటడం, నాగ ప్రతిమలను ఏర్పర్చి ఆరాధించడం జరుగుతున్నది. అదేవిధంగా, హరప్పా సంస్కృతిలో మొహంజొదారోలో లభ్యమైన ఒక మానవమూర్తిని 'పశుపతి' అని, ఇతడు శివునికి మూలమూర్తి అని భావించడం జరిగింది. అదేవిధంగా, ఒక పౌరాణిక ఘట్టం అని అభివర్ణింపబడిన రాతిముద్రలోని చిత్రణలో, శివుడని భావించిన మూర్తి, నిలబడిన (స్థానిక) మూర్తిగా ఉండి, ఆ మూర్తికి, కాలివద్ద వృత్తాకారపు గుండం నుండి లేస్తున్న జ్వాలలు, ఎడమవైపున గల ఎద్దును పోలిన జంతువు, క్రింద కుళ్ళాయిలను పోలిన శిరోజాలంకరణలతో కూడిన ఏడుగురు మూర్తులను చిత్రించడం జరిగింది. ఈ మూర్తిని, సప్తర్షులతో పూజింపబడుతున్న అగ్నిగా కూడా భావించొచ్చు. హరప్పా సంస్కృతిలో, ఇళ్ళలో అగ్నిగుండాలను పోలిన నిర్మాణాలున్నాయని తెలియడం వల్ల, అగ్నిపూజ కొనసాగి ఉంటుందనడానికి, సందేహ పడనవసరం లేదు.

2.3.3 ఇతరాంశాలు

సింధు నాగరకతలో మతాంశాలను సూచించే మరికొన్ని అంశాలున్నాయి. ఎద్దు, ఏనుగు, వ్యాఘ్రం మూడింటి

BRAOU







ముద్రలు :

ఎ. ఎద్దు బొమ్మ, బి. పశుపతి ముద్ర, సి. అమ్మతల్లి ముద్ర

ఉనికిని చెప్పే జంతు శిల్పాలు, ఎద్దు – జింక (antelox)లతో కూడిన జంతువు వంటివి మతపరంగా ఇదమిత్థం కాని అంశాలను తెల్పుతున్నాయి. ఏ రకంగా ఈజిప్టు నాగరకతలో, స్ఫింక్స్ (sphinx) శిల్పం చెక్కబడిందో, అదే రీతి, అవే కారణాలు హరప్పా నాగరకతలో, ఈ రకమైన శిల్పాల ఆవిర్భావానికి తోడ్పడి ఉండొచ్చని చెప్పొచ్చు. ఈ రాతి ముద్రల మీద గల లిపిని తర్కబద్ధంగా చదవగలిగితే, వాటి స్వరూపాన్ని మనం గ్రహించగలం.

2.4 సంగ్రహంగా

హరప్పా సంస్కృతిలో సమాజం, మతం రెండు ప్రత్యేకమైన కోణాలను చూపుతున్నాయి. ఈ రెండింటిని అవగాహన చేసికోడానికి తగిన, తర్కబద్ధంగా, నిర్ద్వంద్వంగా విపులీకరించదగిన ఆధారాలు లభించడం లేదు. సామాజిక వ్యవస్థ ఉన్నత వర్గాల, దిగువ వర్గాల విభేదాన్ని కొందరు చరిత్రకారులు గమనిస్తున్నారు. వారు ప్రత్తితో నేసిన బట్టలు కట్టుకోవడం, గాజులు, హారాలు, మాలలు వంటివి ధరించడం, బీన్స్, చిక్కుళ్ళు, బార్లీ, గోధుమ, పాలు, మాంసం వంటివి తినడం నృత్యం, వేట, ఈత వంటి వినోదాల్లో పాల్గొనడం చేసేవారు.

మరణించిన వారిని పూర్తిగాగాని, కేవలం అస్థికలను గాని, కేవలం కొంత పాత్ర సామగ్రితో కాని సమాధి చేయడం జరిగింది. వారు సంతానం ఇచ్చే శక్తి, స్త్రీత్వాలను, పశుపతిని, అగ్నిని పూజించేవారు. వారి పౌరాణిక విషయాలు భాషాభావం వల్ల సరిగ్గా తెలియడం లేదు.

2.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.**

1. హరప్పాలోని సామాజిక వ్యవస్థ లక్షణాలను వివరించండి.
2. హరప్పాలోని మత సాంప్రదాయాలను గూర్చి తెల్పండి.

II. **క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. హరప్పా ప్రజల వస్త్రాభరణాలు, వినోదాలను తెల్పండి.
2. హరప్పా ప్రజల మృతకర్మలను పరిశీలించండి.

BRAOU

2.6 ఉపయుక్త గ్రంథాలు

Allichin.R & Allichin B : **The Birth of Indian Civilization: India and Pakistan before 500 B.C.**

Mackay, E.H.J: **Further Excavations at Mohenjodaro, 2 Vols.**

Marshall, Sir John : **Mohenjodaro and Indus Valley Civilization 3 Vols.**

Sankalia, H.D. : **The Pre-history and Proto-history of India and Pakistan.**

Sale S.C. : **Indian Pre-history.**

Vatis M.S. : **Excavations at Harappa 2 Vols.**

Wheeler, Mortimer : **The Indus Civilization**

రచయిత : డా. కాశీభట్ల సత్యమూర్తి

BRAOU

భాగం – 3 : ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, పరిశ్రమలు

విషయక్రమం

3.0 లక్ష్యాలు
3.1 పరిచయం
3.2 ఆర్థిక వ్యవస్థ
  3.2.1 సంచార జీవన వ్యవస్థ
  3.2.2 వ్యవసాయోత్పాదక వ్యవస్థ
  3.2.3 వాణిజ్య ప్రోత్సాహక వ్యవస్థ
  3.2.4 పరిశ్రమలు
  3.2.5 వాణిజ్యం
3.3 సంగ్రహంగా
3.4 పరీక్ష నమూనా ప్రశ్నలు
3.5 ఉపయుక్త గ్రంథాలు

3.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

* హరప్పా సంస్కృతి నాటి ఆర్థిక రంగంలో మూలభాగాలైన ఉత్పాదక వ్యవస్థ, ద్రవ్యమారక వ్యవస్థ, రవాణా వ్యవస్థ, పాలక-పాలిత వర్గాల మధ్య ఆర్థిక సంబంధాలను వివరించగల్గాలి.
* హరప్పా కాలంనాటి వ్యవసాయ విధానాలు, పరికరాలు వ్యవసాయోత్పత్తులను వివరించగల్గాలి.
* హరప్పా కాలంనాటి పరిశ్రమలు, వాణిజ్య సంబంధాల్ని విశ్లేషించగల్గాలి.

3.1 పరిచయం

నగరీకరణ సాంప్రదాయాలకు అద్దంపట్టే హరప్పా సంస్కృతి అనివార్యంగా గ్రామజీవన, నగర జీవన సంబంధాల నియంత్రణను కోరుతుంది. గ్రామ జీవనం అనివార్యంగా, వ్యావసాయిక వృత్తులు కేంద్రకంగా పరిణమించగా, నగర జీవనం వ్యావసాయికేతర వృత్తుల ప్రాబల్యాన్ని, వై విధ్యాన్ని సూచిస్తుంది. ఈ రెండింటి మధ్య సహజమైన, తర్కసహమైన సమతౌల్యత కొనసాగినంత కాలం నగర జీవనంలో కాని, గ్రామీణ జీవనంలో కాని, ఎటువంటి క్షయాన్ని లేదా వికేంద్రీకరణ శక్తుల ప్రాబల్యాన్ని చూడబోం. అంతేకాక నగరజీవనాన్ని ఒక పరిపూర్ణమైన జీవిత

BRAOU

దృక్కోణాలకు నిలయంగా భావించినట్లయితే, దానిలో ఒక భిన్నత్వం గోచరిస్తుంది. ఆ భిన్నత్వం, ప్రాథమికంగా ఆర్థిక రంగంలో విస్తృతంగా, సామాజిక, రాజకీయరంగాల్లో పరిమితంగాను ఉండగలదు. వీని దృష్ట్యా, ఒక వినాశనాన్ని ప్రేరేపించే భిన్నత్వాన్ని దాన్ని నియమిస్తూ, భిన్నత్వాన్ని అభివృద్ధికి ఒక మెట్టుగా మార్చే సమతౌల్యత దృష్ట్యా, ఆర్థిక వ్యవస్థను స్థూలంగాను, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను ప్రత్యేక దృక్పథంతోను పరిశీలించడం జరుగుతున్నది.

3.2 ఆర్థిక వ్యవస్థ

హరప్పా సంస్కృతిలోని ఆర్థిక వ్యవస్థ నాలుగు ప్రధాన భాగాలను కల్గి ఉంది. అవి, సంచార జీవన వ్యవస్థ, వ్యవసాయోత్పాదక వ్యవస్థ, వాణిజ్య ప్రోత్సాహక వ్యవస్థ, పారిశ్రామిక వ్యవస్థ. ఇవన్నీ, ఉత్పత్తి రంగంలో, ప్రస్తుతం ఆర్థిక శాస్త్రవేత్తలు పిలుస్తున్న ప్రాథమిక రంగం (Primary Sector) నుండి ఆనుషంగిక రంగం (Secondary Sector) వరకూ విస్తరించినవే.

3.2.1 సంచార జీవన వ్యవస్థ

ప్రాక్-హరప్పా సంస్కృతుల్లో, కిలిముల్ మహమ్మద్, రాణాఘుండై, అంజీరా, ముండిగక్ వంటి ప్రాంతాల్లో, తాలిదశలో సంచార జీవన విధానాన్ని చూడొచ్చు. వారి స్థావరాలన్నీ, ప్రకృతి వైపరీత్యాల పల్ల కోతకు గురై ఉండొచ్చని, హరప్పా సంస్కృతికి చెందిన కోట్‌డిజి పరిశీలన పల్ల ఊహించొచ్చు. వారు కేవలం పశుపోషణ ఆధారంగా జీవించినవారే. వారి కాలంలో ఇదమిత్థంగా వారు సాగుచేసి ఉంటారని చెప్పడానికి వీలులేదు. కాని, కుండల మీద దొరికిన చిత్రలేఖనాలు, వివిధ రకాల మట్టిబొమ్మలు, లభ్యమౌతున్న వివిధ జంతువుల ఎముకల ఆధారంగా, వైవిధ్యం గల జంతు సంపదను వారు కల్గి ఉండేవారని, వారు వానిని పరిరక్షించి పాలించేవారని అవగతమౌతున్నది. వీరు ఎక్కువగా ఎద్దులు, దున్నపోతులు, కొండ గొఱ్ఱెలు, మేకలు, వంటివాటిని పెంచేవారు. కాగా, వేర్వేరు రకాల జింకలను, పందులను, తాబేళ్ళను, ఆహారం కోసం వేటాడేవారు. ఈ వ్యవస్థ ప్రాథమికంగా, హరప్పా సంస్కృతికి ముందుగా ఎంతో ప్రాబల్యం పొందినా, సమకాలీనంగా నశించలేదు. ఒక సమాంతర సాంప్రదాయంగా అది కొనసాగుతూనే వచ్చింది.

3.2.2 వ్యవసాయోత్పాదక వ్యవస్థ

హరప్పా సంస్కృతిలో, వ్యవసాయికోత్పాదక వ్యవస్థ ప్రధానంగా సింధునదికి ఉభయ తీరాల్లోను నది వరదల పల్ల, ఏర్పడ్డ మాగాణి భూముల్లో కేంద్రీకరింపబడి ఉంది. వారు నీటిని నిలవ చేయడానికి, పల్లపు ప్రాంతాల్లో మట్టితోకాని, రాతితో కాని, చిన్నచిన్న కట్టలను నిర్మించేవారు. వాటిని సింధు, బెలూచిస్థాన్ ప్రాంతాల్లో స్థానికంగా, 'గబర్ బండ్' (Gabarband)లు అని పిలిచేవారు. దీనిని, కాలమానం ప్రకారంగా నిర్ణయించడానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. ఇవి, నవీన శిలాయుగ, మహాశిలాయుగ సంధి కాలానికి చెంది ఉండి ఉండొచ్చునని ఆల్చిన్ అభిప్రాయం.

వ్యవసాయానికి ప్రత్యేకమైన, కౌశలంతో కూడిన విధానాలను కాని, పరికరాలను కాని అనుసరించ లేదు. లాంబ్రిక్ అనే పరిశోధకుడు సింధునదీ ప్రాంతాలకు చెందిన సమకాలీన వ్యవసాయిక భూములను స్వయంగా శోధించి, కొన్ని నిర్ణయాలను చేశాడు. అతని ప్రకారం, వరదనీటిని ఆసరాగా చేసికొని, సహజంగా ఏర్పడ్డ నీటికాల్వల

BRAOU

ద్వారా, కొన్ని రబీ పంటలను పండించేవారు. కాగా, ప్రత్తి, ఆవాలు, నువ్వులు వంటి దానిని ఖరీఫ్ పంటల్లో పండించేవారు. కొశాంబి అభిప్రాయం ప్రకారం, హరప్పా కాలంలో సాగు చేయడానికి నాగలిని ఉపయోగించలేదు. వారు కేవలం దున్ని విత్తులు చల్లిన భూమిని చదును చేసే నొల్ల (harrow)ను వాడేవారు. వారు సాగు చేయడంలో దున్నడంగాని, ఎరువులు వేయడం కాని, నేలను దమ్ముచేసి, నారు వేసి, కలుపుతీసాక, అదనపు నీటిని అందించడం కాని చేయలేదు.

వారు తమ ఉత్పత్తుల్లో, వివిధ ఆహార ధాన్యాలను సాగుచేసేవారు. దానిలో గోధుమ (Triticum Compactum), బార్లీ (Hordeum Vulsare) లను ఖర్జూరాలు, నువ్వులు, బఠాణీలు, చిక్కుళ్ళు, రేగిపళ్ళు (Zizyphus Jujuba) అనే ఇతర ఆహార పదార్థాలను, ప్రత్తిని పండించేవారు. ఆగ్నేయ దిశలో ఉన్న లోథాల్, రంగపూర్ ప్రాంతాల్లో మట్టిలోనూ, కుండల్లోను గమనించబడ్డ ఊకచారలను బట్టి ప్రస్తుతం మనం పిలిచే వరిని పోలిన ధాన్యాన్ని సాగుచేసినట్లే గ్రహించవచ్చు. కాని, దానిని సింధు, బెలూచిస్థాన్, పంజాబుల్లో గమనించలేం.

3.2.3 వాణిజ్య ప్రోత్సాహక వ్యవస్థ

హరప్పా సంస్కృతిలో వాణిజ్యాన్ని ప్రోత్సహించిన ద్రవ్యమారక వ్యవస్థ, రవాణా వ్యవస్థ ఎంతో పరిణతిని పొందాయి.

హెమ్మీ (Hemmy) ద్రవ్యమారక వ్యవస్థ గూర్చి, ఆనాటి తూనికలు – మానములను గూర్చి విస్తృతంగా పరిశోధించాడు. రాతితోను, మట్టితోను చేసిన ముద్రలు ఈ విషయంలో, ప్రధానాధారంగా ఉన్నాయి. ఈ ముద్రలపై ఒక జంతువు, ఒకటి, రెండు లేక అంతకన్న ఎక్కువగా సంకేతాలతో కూడి ఉన్న లిపిగల వాక్యాలు ఉన్నాయి. అటువంటి జంతువుల్లో ఆంబోతు, ఖడ్గమృగం, జింక, గొఱ్ఱె మిశ్రమ జంతువులు గమనించదగినవి. ఈ లిపి ఇంతవరకు క్రమబద్ధంగా వివరింపబడకపోయినా, ఆ లిపి కుడి నుండి ఎడమకు రాయబడ్డట్లు భావిస్తున్నారు. మట్టితో చేసిన ఇటువంటి ముద్రలను వర్తక సామాగ్రి బేళ్ళ మీద తిరగేసి ఉంచి, వాటిని తాళ్ళతో కట్టి రవాణాలో ఉపయోగించినట్లు తెలుస్తుంది. దీని ద్వారా, ఆ ముద్రలను ఒకవంక తూనికలుగాను, వేరొకవంక ద్రవ్య విశేషంగాను భావించొచ్చు.

రవాణా వ్యవస్థలో రెండురకాల విధానాలను గమనించొచ్చు. భూమి మీద రవాణా వ్యవస్థకు బళ్ళను వాడేవారు. అప్పటి బళ్ళు మొహంజొదారోలోని ఒక ఆటవస్తువై న మృచ్ఛకటిక ద్వారా సూచింపబడ్డాయి. అవి ఇంచుమించు ప్రస్తుతపు బళ్ళకు ఎంతో సన్నిహితంగా ఉన్నాయి. మనం త్రవ్వకాల ద్వారా పట్టణాల్లోని బండిచాళ్ళను పరిశీలించడం ద్వారా చక్రాల వెడల్పు ప్రస్తుతం చక్రాల వెడల్పు కన్న సన్నగానే ఉండడం గమనించదగ్గది.

కాగా, సముద్ర వ్యాపారానికి అనువుగా వివిధ రకాల ఓడలను వినియోగించేవారు. అటువంటి ఓడల ముద్రలను మనం మొహంజొదారోలో దొరుకుతున్న రాతిముద్రల మీద, మట్టితో చేయబడ్డ కాల్చిన తావీజుల మీద చూడొచ్చు.

3.2.4 పరిశ్రమలు

హరప్పా సంస్కృతిలో వ్యవసాయికేతరోత్పత్తులు పరిపుష్టమైన సాంకేతిక పరిజ్ఞానానికి దర్పణం పడ్తాయి. ఇటువంటి ఉత్పత్తులను గూర్చి వ్యాఖ్యానిస్తూ, ఆచార్య వి. గార్డన్ చైల్డ్ ఈ వ్యవస్థ స్వయంపోషకత్వాన్ని ఇంచుమించు కల్గి ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ స్వయం పోషకత్వం, నగర జీవనంలో మాత్రమే వ్యవసాయికేతరోత్పత్తుల ద్వారా సుసాధ్యమౌతుందన్నది గమనించదగ్గది. కాగా, ఈ రకమైన ఉత్పత్తుల

BRAOU

తరహాను గూర్చి పేలవంగా అన్వించేంత సమరూపత (uniformity of dull) అనడం జరిగింది. ఈ రకమైన సమరూపత వ్యవసాయికేతరోత్పత్తుల్లో మాత్రం సాధ్యమవడం ఆనాటి పారిశ్రామిక, సాంకేతిక ప్రగతికి చిహ్నం.

పారిశ్రామికోత్పత్తిలో గమనించదగిన వారు కుమ్మరులు, లోహకారులు, శిలాకర్మకారులు, ఖనకులు. వీరివీరి ప్రత్యేకమైన కృషి వల్ల, కుండలు రాగి, ఇత్తడి, కంచు వంటి లోహాల్లో, కళాత్మకమైన వస్తువులు, రాతిపూసలు, స్ఫియటైట్ ముద్రలు, గనుల త్రవ్వకం వంటివి సుసాధ్యమయ్యాయి. ముద్రల తయారీలో స్ఫియటైట్ పూతను రంపాలతో కోసి, ఆ పిదప ఆ ముక్కల మీద గట్టి దిమ్మలుగా వచ్చేటట్టు బొమ్మల వంటివి చెక్కి, వాటిని గట్టి పర్చడానికి, ఆ ముద్రల ఉపరితలం కాంతివంతమై కనిపించడానికిగాను కొలిమిలో కాల్చేవారు. రాగితో చేసిన నర్తకి బొమ్మవంటివాని దృష్ట్యా, కొంతమంది కుశలురైన పనివారు మాత్రమే సాధించదగిందని గుర్తించారు. అందువల్లనే, హరప్పా సంస్కృతిలోని సాంకేతికత బాబిలోనియా, ఈజిప్టులోని వాని కన్న ఉత్తమమైందని గార్డెన్ చైల్డ్ పేర్కొన్నాడు.

పారిశ్రామికోత్పత్తుల్లో ముఖ్యమైనవి రాతి వస్తువులు. స్ఫియటైట్‌తో చేసిన పూసలు, ముద్రలు మాత్రమే కాక, చర్ట్ వంటి రాళ్ళతో రకరకాల బ్లేడులను తయారు చేసేవారు. సుకుర్ వద్ద, అటువంటి ఒక ఫ్యాక్టరీ కూడా ఉండేది. పూసలలో చర్ట్, స్ఫియటైట్, కార్నిలియన్ వంటి రాళ్ళతో చేసినవి ఎంతో పేరు పొందినవి మాత్రమే కాక వాటిని ఎగుమతి చేసేవారు. రోహ్రి వద్ద గల సున్నపురాతి కొండ నుండి ముడిసరుకును ఎగుమతి చేసేవారు.

బొమ్మల ఉత్పత్తి మరో పరిగణనీయమైన అంశం. ఎక్కువగా ఈ బొమ్మలన్నీ మట్టితో చేసి కాల్చినవే. ఈ రకమైన మట్టిబొమ్మలు కేవలం ఆటవస్తువులుగా మాత్రమేకాక, సమకాలీనంగా వారెరిగిన వివిధ జంతువులు, పక్షులు, వస్తువులు (నౌకలు, బళ్ళు) మొదలైన వానిని సూచిస్తున్నాయి.

కుండల ఉత్పత్తి వేరొక ప్రత్యేకమైన అంశం. ఎరుపు, నలుపు, పసుపుపచ్చ రంగు, గోధుమ రంగు వంటి నేపథ్యాల మీద, రకరకాల చిత్రాలను ఏర్పర్చారు. కొన్ని జ్యామితీయసమాన (రేఖాగణిత యుక్త) మైనవి, మరికొన్ని పశుపక్ష్యాదులు.

రాగి, కంచుతో చేసిన వస్తువులు మరికొంత ప్రముఖమైనవి. ఆటువంటి వాటిలో గొడ్డళ్ళు, సూదులు, బరిసెలు, బాకులు, కొక్కేములు, క్లిప్పులు ముఖ్యమైనవి. ఇటువంటివన్నీ, తర్వాతికాలంలో వచ్చిన రూపాలకు మూలంగానే ఉన్నాయి. రాగి ఉపయోగాన్ని ముందుగా మొట్టమొదటిసారి, కిలిఘుల్ మహమ్మద్, ముండిగక్ వంటి చోట్ల లభ్యమయ్యాయి. రాగి, కంచులతో పెద్దపెద్ద గిన్నెలు, గరిటెలు, పాడవైన జాడీలు తయారు చేసేవారు. ఈ రాగిని ఉత్త ముద్దలుగాను, కొలిమి వద్ద కాల్చినప్పుడు వెలికివచ్చిన స్థితిలోను, గంధకంతో కల్సిన దానిగాను, ఆర్సెనిక్, ఆంటిమొనీ వంటి మూలకాల సమ్మిశ్రణాలతో శుద్ధి చేసిన రాగిని చూడొచ్చు. శుద్ధి చేసిన రాగిలో, రెండు నుండి ఐదు శాతం వరకు ఆర్సెనిక్ ఉండేదని తెలుస్తున్నది. వీరు రాజస్థాన్ నుండి రాగిని పొందేవారు దానిలో నికెల్, ఆర్సెనిక్ ఉండడం గమనించదగినది. కాని హరప్పా సంస్కృతుల్లో, అప్పటి రాగి ఖనిజాన్ని తవ్వి, శుద్ధి చేసే విధానాల గూర్చి ఇంకా పూర్తిగా అవగాహనలోకి రాలేదు.

3.2.5 వాణిజ్యం

ఆనాటి ఆర్థిక వ్యవస్థలో, వాణిజ్యం ఎంతో ముఖ్యమైంది. పట్టణ నాగరకత అవడం పల్ల, వాణిజ్యం జీవనాడిగా ఈ హరప్పా సంస్కృతి పెంపొందింది. హరప్పా వ్యవస్థలో అనేక వస్తువులను వారు ఇతర ప్రాంతాల నుండి, దేశాల నుండి దిగుమతి చేసుకొనేవారు. బంగారాన్ని దక్షిణ భారతదేశం నుండి, వెండిని ఇరాన్ నుండి, రాగిని రాజస్తాన్, దక్షిణ భారతదేశం, బెలూచిస్థాన్, అరేబియాల నుండి, సీసంను తూర్పు భారతదేశం నుండి,

DRAOU

ఇంద్రనీలాలను ఈశాన్య ఆఫ్ఘనిస్థాన్‌లోని బాదఖ్‌షాన్ నుండి, అగేట్, ఛాల్సిడోనీ, కార్నీలియన్‌లను సౌరాష్ట్ర, పశ్చిమ భారతదేశం నుండి, జెడ్ రాతిని మధ్య ఆసియాలోని ప్రాంతాల నుండి, వైడూర్యాన్ని (Turquoise) ఇరాన్ నుండి, నీలమణి (Amethyst)ని మహారాష్ట్ర నుండి దిగుమతి చేసికొనేవారు.

వారు మెసొపొటేమియాతో కూడా వర్తక సంబంధాలను కల్గి ఉండేవారు. సార్గన్ కాలంలో ఉర్ కేంద్రంగా ఉండగా, ఈ దేశంతో వర్తకం జరిగేదని, దీనిని మెలుహా (Meluhha) అని వ్యవహరించినట్లు గ్రహించొచ్చు. ఈ విషయాన్ని సుమేరియాలోని విఖ్యాత ఆధారాలు ధృవపరుస్తున్నాయి. భారతదేశంలో లోథాల్ ప్రధాన వర్తక కేంద్రంగా ఉండేది. వీరు మెసొపొటేమియాకు కలప, మద్ది, రాగి, బంగారం, కార్నీలియన్ వస్తువులు, ముఖ్యంగా కార్నీలియన్‌లో కోతి రూపాన్ని, మూత్రపిండాల రూపాన్ని పోలినట్లు చేసిన పూసలను, దారాన్ని వివిధ రంగుల వస్త్రాలు, దువ్వెనలను ఎగుమతి చేసేవారు. ప్రత్తి వస్తువులు, ముత్యాలను కూడ భారతదేశం నుండి ఎగుమతి చేసేవారు.

ఈ రకంగా, హరప్పా సంస్కృతిలో ఆర్థిక వ్యవస్థలో ప్రాథమిక రంగం, ఆనుషంగిక రంగం రెండింటా తగినంత ప్రగతిని, ఆర్థిక పుష్టిని ప్రోత్సహించాయి.

3.3 సంగ్రహంగా

హరప్పా సంస్కృతిలో ఆర్థిక వ్యవస్థ సంచార జీవన వ్యవస్థను, నగర వ్యవస్థను సమాంతరంగా పెంపొందడాన్ని చూడగలం. వ్యవసాయికోత్పత్తులు, వ్యవసాయికేతరోత్పత్తులు, ఎంతో ప్రాధాన్యతను పొందాయి. వివిధ వ్యవసాయికేతరోత్పత్తులు సుమేరియాకు ఎగుమతి అయ్యేవి. వివిధ లోహాలు, రత్నాలు హరప్పాకు, ఆ సంస్కృతికి చెందిన వివిధ ప్రాంతాలకు దిగుమతి చేయబడేవి. ఆఫ్ఘనిస్థాన్, దక్షిణ భారతదేశంల నుండి హెచ్చుగా వస్తువులు హరప్పా సమాజాల్లోకి దిగుమతయ్యేవి. వీరు, భూపరమైన రవాణాకు ఎద్దులబండ్లను, సముద్రయానానికి నౌకలను వాడేవారు. రాతితోను, మట్టితోను చేసిన ముద్రలను వాణిజ్య మాధ్యమంగాను, తూనికలుగాను కూడా ఉపయోగించేవారు. కాని, హరప్పా సంస్కృతికాధారాలను బట్టి, సమీప గ్రామాలను గూర్చికాని, వానికి పట్టణాలతో గల ఆర్థిక సంబంధాలనుగూర్చి కాని, ఇదమిత్థంగా తెలియడం లేదు.

3.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. హరప్పా ఎగుమతిలో వాణిజ్యం, వాణిజ్య ప్రోత్సాహక అంశాలను గూర్చి చర్చించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘువ్యాఖ్యలను రాయండి.

1. హరప్పా ప్రజల వ్యవసాయికోత్పత్తులను తెల్పండి.
2. హరప్పా వాటి వ్యవసాయికేతరోత్పత్తులను వివరించండి.

BRAOU

3.5 ఉపయుక్త గ్రంథాలు

Allichin R. Allichin B. : **The Birth of Indian Civilization: India and Pakistan before 500 B.C.**

Marshal, Sir John: **Mojenjodaro and Indus Valley Civilization, 3 vols**

Rao S.R. : **Lothol**

Sankalia H.D. : **Pre-History and Proto-history of India and Pakistan.**

Sale S.C. : **Indian Pre-History**

Vats M.S. : **Excavation at Harappa**

Wheeler, Mortiner : **The Indus Civilization**

రచయిత : డా. కౌశిభట్ల సత్యమూర్తి

BRAOU

భాగం – 4 : హరప్పా సంస్కృతి : కళలు, చేతిపనులు

విషయక్రమం

4.0 లక్ష్యాలు
4.1 పరిచయం
4.2 చిత్రకళ
4.3 రూపకళ
4.4 శిల్పకళ
4.5 లోహశిల్పం
4.6 చేతిపనులు
4.7 సంగ్రహంగా
4.8 పరీక్ష నమూనా ప్రశ్నలు
4.9 ఉపయుక్త గ్రంథాలు

4.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం పట్ల మీరు,

* హరప్పా సంస్కృతిలో విలసిల్లిన కళలు, చిత్రకళ, రూపకళ, శిల్పకళలను గూర్చి వివరించగల్గాలి.
* హరప్పా కాలంలోని చేతిపనులను, వాటి ప్రయోజనాత్మకతను విశ్లేషించగల్గాలి.

4.1 పరిచయం

హరప్పా సంస్కృతిలో ప్రజలు వ్యవసాయికేతర వృత్తుల ప్రాబల్యంతో ఆర్థిక పరిపుష్టిని పొందారు. కాని ఒక స్థితిలో చేతిపనుల్లోని కౌశల్యానికి, కళల్లోని కౌశల్యానికి భేదం ఉండదు. కళ అంటే "యోగఃకర్మసుకౌశలం" అని భారతీయ సంప్రదాయంలో తర్వాతి కాలంలో చెప్పడం జరిగింది. దాని దృష్ట్యా, హరప్పా సంస్కృతిలో ఉండే కళలను, చేతిపనులను ఈ క్రిందివిధంగా విశ్లేషించి, వ్యాఖ్యానించొచ్చు.

4.2 చిత్రకళ

హరప్పా సంస్కృతిలోని కళల్లో ముందుగా పేర్కొనదగ్గది చిత్రకళ. ఈ చిత్రకళ ఎక్కువగా కుండల మీద గమనించొచ్చు. కుండల మీద ఉండే ఊరకమైన చిత్రీకరణను లలితకళగా కాక, ప్రయోజనాత్మకమైన కళగా

BRAOU

గుర్తించడం జరిగింది. ఈరకమైన చిత్రకళకు చెందిన తొలి ఉదాహరణలను మీర్జాపూర్ జిల్లాకు చెందిన మెర్హానాపహార్ (Morhanapahar) శిలాశ్రయాల్లోను, ఆదంఘర్ శిలాశ్రయం వంటిచోట, హెచ్చుగా గమనించొచ్చు. ఆ రకమైన చిత్రాల్లో హెచ్చుగా పక్షులు, కోతులు, కుక్కలు, గొఱ్ఱెలు, పశువులు గమనింపదగినవి. హరప్పా సంస్కృతిలో కూడా, ఇదేరకమైన సాంప్రదాయం కొనసాగింది. ముండిగక్, డాంబ్ సదాత్ వంటి చోట్ల కనుపించిన కొన్ని ఉదాహరణలే, హరప్పా సంస్కృతి ప్రధాన కేంద్రాల్లో కూడా కనిపించాయి. ఈ రకమైన చిత్రకళ మూలంలో ఇరాన్ ప్రభావం కనిపించినట్లు కొందరు అభిప్రాయపడ్తున్నప్పటికీ, రానురాను, ఈ కళ పూర్తిగా భారతీయత్వాన్ని పొందింది. రావి ఆకులు, ఆబోతులు, గొఱ్ఱెలు, ఏంటిలోప్ వంటి జింకలు పూర్తిగా కళలో భారతీయమైన నేపథ్యాన్నే సూచిస్తున్నాయి. రావి ఆకులు, రావిచెట్లు తర్వాత కాలంలో కూడా పూజార్హమైనవనే విషయం గమనించదగింది. కాగా, H సమాధివంటి చోట్ల మనం కొన్ని ప్రత్యేకమైన చిత్రాలను చూడగలం. వానిలో నెమళ్ళు, ఆబోతులు గుర్తించదగినవి. ఈ ఆబోతులు, గొఱ్ఱెలను చిత్రించేటప్పుడు వాటి కొమ్ములను బాగా వంపుగా చూపిస్తూ, ఇంచుమించు భూపర్యంతం చూపడం ఒక ప్రత్యేకత.

ఈ చిత్రకళలో జంతువులు, పక్షులు మాత్రమేకాక అనేక ఇతర అలంకరణలను చూడగలం. వాటన్నిటిని స్థూలంగా జ్యామితీయ లేదా రేఖాగణితయుక్త చిహ్నాలు అని పేర్కొడం జరిగింది. ఈ రకమైన రేఖాగణితయుక్త చిహ్నాలన్నీ, ప్రాక్ హరప్పా సంస్కృతి నుండి పరిణమించి, హరప్పా సంస్కృతిలో పర్యవసించినవే. వాటిలో ముండిగక్ 1వ దశలో దొరికిన అడ్డంగాను, నిలువుగాను గీచిన సరళరేఖలు, ఒకదానికొకటి తాకేటట్లు తిరగవేసి రాసిన సమద్విబాహు త్రిభుజాలు, ముండిగక్ మూడోదశలో గల త్రిభుజాలు, సమద్విబాహు చతుర్భుజాలు, వృత్తాలు, సమచతురస్రాలు, దీర్ఘ చతురస్రాలు గుర్తింపదగినవి. ఇటువంటివే, ఆమ్రి, కోట్‌డిజిల్లో కూడా లభ్యమౌతున్నాయి. కోట్‌డిజిలోని అడ్డంగా గీసిన సరళరేఖల నమూనాలు (scale design) అని వ్యవహరించడం జరిగింది.

వీనితోబాటుగా, చిత్రకళలో కొన్ని రేఖాగణితయుక్త సమూనాలను కూడా చూడొచ్చు. వానిలో, చుక్కలు, నక్షత్రాలు, ఆరు దళాల పద్మాలు, వక్రరేఖలు, గజిబిజి రేఖలు (criss-cross lines) కంకుల వంటి నమూనాలు, ఆకులు, కాడలు మొదలైనవి పేర్కొనదగ్గవి.

ఈ రకమైన చిత్రకళ అంతా కుండలమీదనే ఉండడం గమనించదగింది. కుండలపై నలుపు, ఎరుపు, కావిరంగు, గోధుమ రంగు, పసుపుపచ్చ రంగు నేపథ్యాలను ఏర్పర్చి, వానిపై వేర్వేరు రంగుల్లో పైన సూచింపబడిన నమూనాలను గీయడం జరిగింది.


4.3 రూపకళ

చిత్రకళ పిదప గ్రహించదగింది రూపకళ. ఈ కళలో మట్టిని బొమ్మలుగా దిద్ది, కాల్చి, శిల్పాలను చేయడం జరుగుతుంది. అటువంటి వానిలో పక్షులు, కోతులు, కుక్కలు, గొఱ్ఱెలు, పశువులు వంటి వివిధ జంతువులు; బండి, ఓడ వంటి నిత్య జీవితంలో వాడే వస్తువులున్నాయి. వీనిలో రకరకాల ఆటబొమ్మలు కూడా ఉన్నాయి. ఈ కళలో కొన్ని మానవ ప్రతిమలు ఉండడం కూడా గమనార్హం. వీనిలో మొహెంజొదేవతలు అనబడేవి ఎంతో ప్రసిద్ధి పొందినవి. ఇవి వస్తుతః ప్రాక్ హరప్పా సంస్కృతులల్లో పెంపొందినా, హరప్పా సంస్కృతుల్లో కూడా రూపకళకు తోడ్పడ్డాయి.

BRAOU



ఎ. మతాధికారి శిరస్సు



బి. నర్తకి కాంస్య ప్రతిమ

4.4 శిల్పకళ

హరప్పా సంస్కృతిలో ఇంకో ప్రసిద్ధ కళారూపం, శిల్పకళ. దీనిలో రాతినుపయోగించి, వివిధ శిల్పరూపాలను తయారు చేయడం జరిగింది. అలబాస్టర్, స్టియటైట్, సున్నపురాయి వంటి వివిధ శిలలను ఉపయోగించి, శిల్పరూపాలను తయారుచేశారు. సున్నపురాతితో చేసిన 2.3 సెం.మీ.ల ఎత్తు గల శిల్పరూపాన్ని ముండిగక్ నాల్గో దశలో చూడగలం. అదేవిధంగా, స్టియటైట్‌తో చేసిన ముద్రలపైన గల ఏనుగు, ఆబోతు, ఆంటిలోప్ వంటి జింకలు, ఖడ్గమృగం, గజసింహం వంటి మిశ్రమ జంతువులు, పశుపతి అని పిలువబడే పురుషమూర్తులు కొన్ని ప్రత్యేకమైన శిల్ప సమూదాయాలకు ఉదాహరణ. మొహంజొదారోలో దొరికిన 19 సెం.మీ. ఎత్తుగల గడ్డంగల రూపంతో కూడిన, మతాధికారి శిరస్సు వంటి ఉదాహరణలో ఎంతో కళాత్మకతను చూడగలం. ఇంకో విశేషమైన ఉదాహరణ, హరప్పాలో దొరికిన 9.3 సెం.మీ. ఎత్తైన చిన్న నగ్న రాతిబొమ్మ. ఈ బొమ్మను గూర్చి సర్ జాన్ మార్షల్ ఆ బొమ్మ లక్షణాలను వివరిస్తూ "సంస్కృతమైన, ఆశ్చర్యానకమైన వాస్తవిక ధోరణిలో, మజ్జతో కూడిన భాగాలను రూపించడం" అని పేర్కొన్నాడు. ఈ రకమైన ధోరణి తర్వాతి కాలంలో భారతీయ శిల్పకళా సాంప్రదాయానికి ఒక పునాదిగా పరిణమించిందనడంలో సందేహపడనవసరం లేదు.

స్టియటైట్‌తో వస్తువులను తయారుచేసేటప్పుడు ముందుగా రాతిని రంపంతో కొన్ని దిమ్మలుగా కోయడం జరుగుతుంది. ఆ పిదప, వాటిమీద కావల్సిన జంతువులను, పక్షులను లేదా ఇతర మూర్తులను చెక్కి, వాటిని కాల్చడం ద్వారా దిమ్మలను గట్టిపర్చడమే కాక కాంతివంతంగా ఏర్పర్చేవారు.

4.5 లోహశిల్పం

హరప్పా సంస్కృతిలో పరిణమించిన లోహశిల్పం, అప్పటి కళల్లో ఒక ప్రధానమైన దశను సూచిస్తుంది. రాగి, కంచువంటి లోహాలను వినియోగించి, శిల్పాలను ఏర్పర్చేవారు. వాటిలో ప్రసిద్ధి పొందినది, మొహంజొదారోలో ధొరికిన పోతపోసిన కంచువిగ్రహం. ఈ విగ్రహం ఒక నగ్న నర్తకిని సూచిస్తున్నది. ఇటువంటి పోతపోసిన విగ్రహాల నిర్మాణం, హరప్పా నగరాల్లో ఒకదానిలో గాని, అన్నింటగాని గల లోహ కార్మికుల కార్ఖానాల్లో జరిగి ఉండేది. కంచుతో చేసిన ఇంకో శిల్పం కూడా, కేవలం పోతపోసిన పాదాల రూపంలో దొరుకుతున్నది. కొన్ని జంతుశిల్పాలు కూడా ఈ విధానంలో చూడగలం. అటువంటి వాటిలో దున్నపోతు, పొట్టేలు వంటివి పేర్కొనదగినవి.

స్థూలంగా చెప్పాలంటే, "భారతీయ ప్రాక్చారిత్రక కళ అతి తక్కువ ఆధారాలతో నిరాశాజనకంగా ఉంది. రాశిలో వాటిని ఈజిప్టులోగాని, ఇరాక్‌లోగాని లభించే ఆధారాలతో పోల్చడానికి వీలులేదు. అంతేకాకుండా, పై రెండు దేశాల్లో ఉండే భావ ప్రకటనా వైవిధ్యం, వివిధ వస్తువుల వినియోగం ఇక్కడలేదు. కొన్ని గొప్ప ఉదాహరణలు లభ్యమైనా, శిలాశిల్పం చాలా అరుదైంది. తులనాత్మకంగా అభివృద్ధి సొందనిది. రూపకళ కూడా, మెసొపొటేమియాను పోలిలేదు. గొప్ప ఉదాహరణలున్న లోహశిల్పం విస్తృతమైన అభివృద్ధి పొందలేదు. గోడలపై చిత్రరచన అసలు లేదు" అనే అల్చిన్ దంపతుల అభిప్రాయం, హరప్పా సంస్కృతిలోని కళావిలువల దృష్ట్యా గొప్పదైనా, దాని విస్తృతి, వైవిధ్యం, సాంకేతిక ఔన్నత్యం మిన్నకాదనే నిర్ణయానికి తోడ్పడుతుంది.

BRAOU

4.6 చేతి పనులు

హరప్పా సంస్కృతిలో పూర్తిగా ప్రయోజనాత్మకమైనవే అని చెప్పదగ్గ కొన్ని చేతికళలు కూడా, అభివృద్ధి పొందాయి. జెర్ట్, అగేట్, చాల్సిడోనీ (Chalcedony) వంటి రాళ్ళను ఉపయోగించి, వివిధ వస్తువులను చేయడం ఒక ఉదాహరణ. అలాగే, ఆల్చిప్పలను, ఇతర షెల్స్‌ను వినియోగించి పూసలు, దండలు తయారుచేయడం కూడా ఇటువంటిదే. తిక్కడ వెదురు, కొయ్య, దంతం, కొమ్ము, ఎముకతో చేసిన వస్తువుల ఉనికి లేదు అయినా, కుండలు, ఇటుకలు, రాగివస్తువులను చేయడంలో, కొన్ని ప్రామాణికమైన విలువలను ఏర్పర్చుకోవడం, పరిణామం, పరిమాణం ఏర్పర్చడం, చేతికళల్లో భారతీయత పెరిగి, గార్డెన్ చైల్డ్ అభిప్రాయపడ్డట్లు ఇవన్నీ 'సాంకేతికంగా ఎంతో భారతీయమైనవి' (Technically very Indian) అనే పరాకాష్ఠ స్థితిని పొందాయి.

రాళ్లను తవ్వడం, దానికోసం సమ్మెటలు వాడి, ఒక ప్రత్యేక ప్రక్రియను తీర్చిదిద్దడం, రాగిని ముద్దలుగా చేసి, కొలిమిలో కరిగించి, గందకం, ఆర్సెనిక్, ఆంటిమొనీలతో శుద్ధిచేసి, లోహాన్ని తయారుచేయడం, అలాగే రాగికి తగరం కలిపి కంచును తయారుచేయడం వంటివి ప్రత్యేకంగా చేతికళలుగా గుర్తింపబడకపోయినా, సాంకేతిక నైపుణ్యం దృష్ట్యా క్లిష్టమైన రీతులేనని చెప్పక తప్పదు. రాగివస్తువులు తయారుచేసేటప్పుడు రేకును మెత్తటి సుత్తులతో కొట్టి సాగదీయడం, సాగదీసిన రేకును అవసరం ప్రకారం, మందపాటి రేకుగా తిరిగి కొట్టడం గమనించొచ్చు. హరప్పా సంస్కృతి తుదిదశల్లో ఈ రకమైన రాగిపాత్రలను ఏకాండం (Made of one piece) పాత్రలుగా కాక, ముక్కలుగాను, పెద్ద రేకులుగాను విడివిడిగా చేసి, వాటిని తగరంతోను, నికెల్‌తోను అతికించి, ఆ భాగాన్ని అతుకు కనపడకుండా సుత్తితో కొట్టి అందంగా చేసేవారు. రాగితో పోతపోసి, విగ్రహాలు చేసేప్పుడు, మట్టిముద్రల లాంటి కొలిమి ఏర్పర్చుకొని, వానిలో రాగిని కరిగించిపోసి, ప్రతిమలను చేసేవారు. ఇటువంటి కొలుములు ఇటుకతో చేసినట్లు మొహంజొదారోలో ఉదాహరణల వల్ల తెలుస్తున్నది. ఇటువంటివి లోథాల్‌లో కూడా లభ్యమయ్యాయి. బంగారం పని కూడా పరిమితంగా ఉండేది. దీనికి తక్కువ రంగు కలిగి, వెండి పాలు ఎక్కువైన ఎలెక్ట్రమ్ (electrum) అనే బంగారు విశేషాన్ని వాడేవారు. దీన్ని కర్ణాటక నుండి తెచ్చుకొన్నట్లు భావిస్తున్నారు. వెండి కూడా పరిమితంగా ఉంది.

ఈ రకంగా హరప్పా సంస్కృతిలో చేతిపనులు, కళలు అనబడే రూపంకన్న, పరిమితమైన ప్రయోజనాన్ని ఆధారాలను కల్గి ఉన్నట్లు గ్రహించొచ్చు.

4.7 సంగ్రహంగా

హరప్పా సంస్కృతిలో కళలు ఎక్కువగా లలితకళలు అనబడేదానికన్న ప్రయోజనాత్మకమైన కళలు అనడమే సబబు. వేర్వేరు కుండల మీద గీసిన చిత్రలేఖనాలు జ్యామితీయ నమూనాలతోను, అజ్యామితీయ నమూనాలతోను, జంతు, పక్షి, వృక్ష, పత్రాది నమూనాలతోను నాగరకత అంతా విస్తృతంగా వ్యాప్తి పొందాయి. మట్టితో చేసి కాల్చిన రూపకళ స్త్రీ దేవతామూర్తులు వివిధ జంతు, పక్షి రూపాలు కలిగింది. శిల్పకళ, లోహకళ పరిమితంగా ఉన్నాయి. స్థూలంగా, ఈ కళలు రాళ్లలోగాని, వాసిలోగాని వైవిధ్యంలో గాని, సాంకేతిక విలువల్లోగాని, ఈజిప్టు ఇరాక్‌ల్లోని కళల కన్న వెనుకబడ్డవేనని చెప్పక తప్పదు. కాగా, ఓర్పుతో పనిముట్లు చేయడం, స్టియటైట్ వంటి వాని మీద శిల్పం చెక్కడం, రాగి, కంచు వంటి లోహాలు సిద్ధం చేయడం ప్రసిద్ధి పొందిన చేతిపనులుగా గుర్తించొచ్చు.

BRAOU

4.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. హరప్పా సంస్కృతిలో విలసిల్లిన కళలు చిత్రకళ, రూపకళ, శిల్పకళల ప్రగతిని గూర్చి చర్చించండి.

2. హరప్పా సంస్కృతి నాటి చేతిపనులను గూర్చి వివరించి, వాటి ప్రయోజనాత్మకతను విశ్లేషించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. హరప్పా సంస్కృతిలో చిత్రలేఖనాన్ని గూర్చి తెల్పండి.

2. హరప్పా సంస్కృతి నాటి రూపకళ, శిల్పకళల విశిష్టతను వివరించండి.

4.9 ఉపయుక్త గ్రంథాలు

Allichin R. & Allichin B. : **The Birth of Indian Civilization: India and Pakistan before 500 B.C.**

Mackay, E.H.J. : **Further Excavations at Mohenjodaro: 2 Vols.**

Marshal, Sir John : **Mohenjodaro and Indus Valley Civilization, 3 Vols.**

Rao S.R. : **Lothal**

Vats M.S. : **Excavations at Harappa 2 Vols.**

Wheeler, Mortimer : **The Indus Civilization**

BRAOU

రచయిత : కాశీభట్ల సత్యమూర్తి

భాగం – 5 : హరప్పా సంస్కృతి : నగర వ్యవస్థ

విషయ క్రమం

5.0 లక్ష్యాలు
5.1 పరిచయం
5.2 నగర ప్లానింగ్ వివరాలు
5.3 ప్రత్యేక నిర్మాణాలు
5.4 నిర్మాణ విధానాలు
5.5 నగర వ్యవస్థపై సామాజిక ప్రక్రియల ప్రభావం
5.6 సంగ్రహంగా
5.7 పరీక్ష నమూనా ప్రశ్నలు
5.8 ఉపయుక్త గ్రంథాలు

5.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం పల్ల మీరు,

* హరప్పా సంస్కృతిలోని వివిధ స్థావరాలను, నగర ప్లానింగ్, కట్టడాల విధానాల గురించి వివరించగల్గాలి.
* హరప్పా నగర వ్యవస్థలో కేంద్రప్రాయమైన సామాజిక వ్యవస్థీకరణలోని మార్పును, నగర వ్యవస్థపై దాని ప్రభావాన్ని విశ్లేషించగల్గాలి.

BRAOU

5.1 పరిచయం

హరప్పా సంస్కృతికి చెందిన నిర్మాణ విశేషాలను ఆర్మి, కోట్‌డిజి, హరప్పా, మొహంజోదారో, కాలీబంగన్, లోథాల్ వంటిచోట్ల వివరంగా తవ్వకాల నివేదికల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ స్థితిని ఆర్.ఎస్. శర్మ, మాలిక్ వంటివారు 'తొలి నగరీకరణ దశ' అని పేర్కొన్నారు. ఘోష్ ఈ నగరీకరణ దశ సాంకేతికంగా వెనుకబడ్డదని, దానిపల్లనే దీని ప్రభావాన్ని చారిత్రక యుగంనాటి నగరాలపై చూడలేకపోతున్నామని అభిప్రాయపడ్డారు. దీన్ని విజయకుమార్ ఠాకూర్ తమ **'అర్బనైజేషన్ ఇన్ ఏన్షియంట్ ఇండియా' (Urbanization in Ancient India)** లో బలపర్చారు. అంతే కాక, ఒక సుదీర్ఘమైన చర్చ ద్వారా, గార్డెన్ చైల్డ్ అభిప్రాయపడ్డట్లు, ఈ రకమైన పట్టణ నిర్మాణ వ్యవస్థ నూత్న సాంకేతిక విధాన ఆవిష్కరణ వల్ల, ఆహారోత్పాదనలో స్వయంపోషకత్వాన్ని సాధించడం వల్ల సుసాధ్యమౌతుందని పేర్కొన్నారు. అంతేకాక, డి.కె. చక్రవర్తి, ఆర్.వి. ఆడమ్స్ అనువారు నగరీకరణ సాంప్రదాయాలు ఒక సామాజిక ప్రక్రియ ద్వారా ఆవిష్కృతమై, బీర్‌స్టెడ్ (Bierstedt) అభిప్రాయ పడ్డట్లు నగరీకరణ ప్రక్రియ ఒకానొక సామాజిక బద్ధమైన మానసిక స్థితికి త్రోవతీస్తున్నట్లు గ్రహించగలం.

ಶಿವನ ಏಕಪಾದ ತಾಂಡವ

హరప్పా సంస్కృతుల్లోని నగరాలు సాంకేతికంగా ఎంత తక్కువ స్థాయి విలువలను కల్గినప్పటికీ, రాతవంటి ఆధారాలు తర్కబద్ధతతో రూపొందబడకపోయినప్పటికీ, జెరికో, సాటల్ హుయూక్ వంటి నగరాలకన్న ప్రశస్తమైన నిర్మాణ విధానాన్ని కల్గి ఉన్నట్లు చెప్పవచ్చు. వాటి లక్షణాలను ఈ క్రింది విధంగా రూపించవచ్చు.

5.2 నగర ప్లానింగ్ వివరాలు

మొహంజోదారో, హరప్పా, కాలీబంగన్‌లను పరిశీలించిన పిదప, నగర ప్లానింగ్ విషయంలో ఆనాటి పట్టణాల్లో సమరూపత ఉన్నట్లు తెలుస్తుంది. నగరంలో పశ్చిమ, వాయవ్య ప్రాంతాలు ఎత్తుగా ఉండి, తూర్పు, ఆగ్నేయ ప్రాంతాలు పల్లంగా కనపడుతున్నాయి.


ఎత్తుగా ఉండే ప్రాంతాన్ని కోట అని పిలవడం జరిగింది. కోట్‌డిజి వంటి ఉదాహరణల దృష్ట్యా, ఈ కోట చుట్టూ, అగడ్త ఉండడమే కాక, కోటపై భాగంలో బురుజులున్నట్లు, 12-14 అడుగుల ఎత్తువరకు ఈ ప్రాకారాలు సురక్షితంగా ఉంచబడ్డట్లు గ్రహించొచ్చు. ఈ కోటల్లో వేర్వేరు నిర్మాణాలను పోల్చడం జరిగింది. మొహంజొదారోలో స్నానవాటిక, రెండు స్తూపాలు, స్తంభ మండపం, కళాశాల వంటి ఒక నిర్మాణం గుర్తింపబడ్డాయి. కాగా, హరప్పాలో కోటభాగంలో పెద్ద దిబ్బ, దానికి ఉత్తర వాయవ్యంగా, ధాన్యాగారాలు, కార్మికుల వసతిగృహాలు గుర్తింపబడ్డాయి. కాలీబంగన్‌లో విశేష నిర్మాణాలు ఏవీ పేర్కొనబడలేదు. ఈ కోటలన్నిటికి రెండు నుండి నాల్గు ప్రవేశ ద్వారాలను ఏర్పర్చారు. ఒకటి తప్పనిసరిగా పేటవంటి నివాసభాగంలోకి, వేరోటి నదీముఖంగాను ఏర్పర్చడం జరిగింది.

రెండో భాగాన్ని నివాస భాగంగా, పల్లపు భాగంగాను గుర్తించారు. మొహంజోదారోలోని ఉదాహరణ ప్రకారం, ఈ భాగం అంతా మూడు ప్రధాన వీధులుగా ఏర్పర్చబడి, ప్రతి వీధిలోను కొన్ని ఉపభాగాలు, నివాస గృహాలు ఉండేవి. హరప్పాలో దిగువ ఊరు ఒక గ్రామంగానూ, ఒక దిబ్బగాను ఉండి, దిబ్బకు తూర్పువైపున పోలీస్ స్టేషన్ వంటి నిర్మాణ విశేషాన్ని గుర్తించడం జరిగింది. ప్రధానమైన వీధులు నాల్గు నుండి ఆరు మీటర్ల వరకు, సందుల వంటివి రెండు నుండి మూడు మీటర్ల వరకు వెడల్పులో ఉండేవి. రోడ్లన్నీ ఉత్తరం నుండి దక్షిణం వైపుకి వేయబడేవి. ఈ రోడ్లన్ని ఒకదాన్నొకటి లంబకోణంలో ఖండించేవి.

లోథాల్ వంటి పట్టణాల్లో దిగువ స్థలంలో కుమ్మరుల ఆవులు, రంగులు వేసేవాళ్ళ స్థావరాలు, లోహకర్మ, శిలాకర్మలు చేసేవారి కార్ఖానాలు ఏర్పడి ఉన్నాయి.

పట్టణాలన్నింటిలో రోడ్లకు ప్రక్కన మురుగునీటి కాల్వలను ఏర్పర్చడం జరిగింది. ఈ కాల్వల తయారీకి కాల్చిన ఇటుకలను ఉపయోగించడం జరిగింది. ఈ మురుగు నీటి కాల్వలను బాగు చేయడానికి అనువుగా, నియమిత అంతరాల్లో మనిషి దిగడానికి కావలసిన రంధ్రాలను ఏర్పర్చడం, అదేవిధంగా, ఎక్కువగా కారిన నీరింకడానికి చిన్నచిన్న గోతులను తవ్వడం జరిగింది.

BRAOU



మొహంజొదారోలోని స్నానవాటిక

5.3 ప్రత్యేక నిర్మాణాలు

హరప్పా నాగరక సంస్కృతిలో కొన్ని ప్రత్యేక నిర్మాణాలు ఎంతో ముఖ్యంగా గమనించదగినవి. అటువంటి వానిలో మొహంజొదారోలోని స్నానవాటిక, స్తంభ మండపం, హరప్పాలోని ధాన్యాగారాలుగా గుర్తింపబడ్డ రెండు పెద్ద నిర్మాణాలు, లోథాల్‌లోని ఓడరేవు ప్రసిద్ధమై నవి.

మొహంజొదారోలోని స్నానవాటిక 30x23x8 అడుగుల కొలతలతో ఇటుకతో నిర్మింపబడింది. దీని గోడలు నీరు ఇంకకుండా ఏర్పర్చబడ్డాయి. దీనికి ఒకవైపున మెట్ల వరుస, గ్యాలరీ వలె కూర్చోడానికి వీలుగా ఏర్పర్చబడ్డాయి. దీనికి పై భాగంలో కొన్ని వరండాలు, గదులు కూడా ఏర్పర్చబడ్డాయి. సమీపంలోని ఒక బావిలోని నీటితో దీన్ని నింపేవారు. నీటిని నింపడానికి ఉపయోగించే కాలవ కప్పు, గూడు (corbel) ఆకారంలో ఉండేది. దీని ఎత్తు ఆరడుగులు దాటి ఉండడం గమనించదగ్గది. దీనికి సమీపంలోనే వేడి ఆవిరితో స్నానం చేయడానికి అనువుగా ఉండే 'హమామ్' (Hamam) కూడా ఉండేదని చెప్పడం జరుగుతున్నది.

ఇంత పెద్ద నిర్మాణం ఉత్తర దక్షిణాలుగా తిరగవేయబడిన L ఆకారంలో, అనగా ⅂ వలె ఉండేది. దీని ప్రయోజనం గూర్చి వై విధ్యంతో కూడిన అభిప్రాయాలున్నాయి. అది కేవలం స్నానాలకు ఉపయోగపడేదని కొందరు, దానిలో ఈతల పోటీలను నిర్వహించి ఉండొచ్చని కొందరు దానిలో పండుగ దినాల్లో మతపరమై న ఉత్సవాలు నిర్వహించేవారని కొందరు అభిప్రాయపడుతున్నారు. దీని ప్రయోజనాలను కేవలం, ఊహించడమే జరుగుతున్నది.

మొహంజొదారోలోని కోటలో తూర్పున ఒక స్తంభ మండపం గుర్తించడం జరిగింది. అది ఆరేసి స్తంభాలు గల నాల్గు వరుసలుగా, మొత్తం 24 స్తంభాలతో ఏర్పర్చబడింది. దాన్ని ఒక సమావేశ స్థలంగా గుర్తిస్తున్నారు.

వేరే నిర్మాణం హరప్పాలోని ధాన్యాగారాలు ఇటువంటివి 50x20 అడుగుల కొలతతో, ఆరు నిర్మాణాలు నదీ తీరాన నిర్మించబడ్డాయి. ఇవి రెండు వరుసలుగా మొత్తం పన్నెండు, 9,000 చదరపు అడుగుల కన్న ఎక్కువగా ఉన్నాయి. దీనికి దక్షిణంగా ఉన్న ఇటుకతో కట్టిన తిన్నెలు, ధాన్యం బాగు చేయడానికి వినియోగించేవారని, అక్కడ దొరుకుతున్న గోధుమ, బార్లీల ఊక ఆధారంగా నిర్ణయిస్తున్నారు. హరప్పాలోని ఈ నిర్మాణాల్ని పోలిన ఇంకో దాన్ని మొహంజొదారోలో కూడా చూడగలం. మార్టిమర్ వీలర్ (Martimer Wheeler) దీనిని 27 బ్లాకులుగా ఇటుకతో కట్టబడిన నిర్మాణమనీ, దీనికి పంకర టింకరగా అక్కడక్కడ గాలి చొరడానికి మార్గాలు ఏర్పర్చేవారని చూపారు.

లోథాల్ నగరంలోని ఓడరేవు వంటి నిర్మాణం ఇంకో ప్రసిద్ధమై న కట్టడం. దీన్ని నదికి జతపరుస్తూ కృత్రిమమై కాల్వలను త్రవ్వారు. ఇటువంటి కాల్వల్లో ఒకటి, 2.5 కిలోమీటర్ల కన్న హెచ్చు పొడవుండడం గుర్తించదగింది. ఈ మొత్తం డాక్ అని పిలువబడుతున్న ప్రాంతం అంతా, 48.5x42.5 మీటర్ల పరిమాణంలో, 2081.25 చదరపు మీటర్ల వైశాల్యంలో ఉండి, దీనికి సమీపంలో ధాన్యాగారాలు, అంగళ్ళు, కార్ఖానాలు ఉండడం గమనించదగింది.

BRAOU

5.4 నిర్మాణ విధానాలు

ఇన్ని రకాల నిర్మాణాలను చేయడంలో ప్రధానంగా కాల్చిన ఇటుకలను వాడేవారు. ఈ నిర్మాణాల్లో వాడిన ఇటుకలు ఇంచుమించు ఒకే కొలతను కల్గి ఉండేవి. ఇటుకలు 11×5.5×2.75 అంగుళాల్లో 4:2:1 నిష్పత్తిలో పాడవు, వెడల్పు, మందాన్ని కల్గి ఉండేవి. ఈ నిర్మాణ విధానాలన్నీ విసుగు కలిగించేటంత సమరూపతను సంతరించుకొన్నాయి. స్టువర్ట్ పిగట్ (Stuart Piggott) అభిప్రాయం ప్రకారం, ఇవి ఒకదానితో ఒకటి పోటీ పడేటంత నిరసత్వాన్ని (competent dullness) కల్గి, నమూనాల్లోను, ప్లానింగ్‌లోను, వైవిధ్యాన్ని ఏ మాత్రం కల్గి ఉండేవి కావు అని చెప్పొచ్చు.

ఈ నిర్మాణ ప్రక్రియల్లో అవసరం కొద్దీ కొన్ని ప్రత్యేకమైన విధానాలను అనుసరించడం గమనించదగింది. స్నానవాటికలో ఇటువంటి ప్రత్యేకతను చూడగలం. హరశోథం (Gypsum) తో అడుగును తయారుచేసి, చక్కగా కోయబడ్డ ఇటుకలను దానిపై ఉంచేవారు. దానిపై నశిలాజిత్తు(Bitumen)తో పూతపూసి, దానిపై ఇంకో వరుస ఇటుకల వరుసను ఉంచడం జరిగింది. ఈ రకంగా, హరశోథం (Gypsum), శిలాజిత్తు (Bitumen)ల వినియోగం నిర్మాణంలో రసాయనిక పదార్థాలు వాడడం ద్వారా, వారు కట్టడాలను గట్టిపర్చడం కోసం ఉపయోగించడం, అభివృద్ధి పొందిన సాంకేతిక ప్రక్రియను సూచిస్తున్నది.

5.5 నగర వ్యవస్థపై సామాజిక ప్రక్రియల ప్రభావం

సింధులోయలో లభ్యమౌతున్న ఈ హరప్పా సంస్కృతిలో "పురావస్తు శాస్త్ర సామగ్రి సహాయంతో సింధులోయ సంస్కృతి స్వభావం పూర్తిగా పరిణతి చెందని బానిసస్వామ్య సమాజాల్లో ఒకటని చెప్పడానికి మనకు ఆధారాలు కనబడ్తున్నాయి. రాజు తన ధాన్యపు కొట్లో నిలువ చేసిన ధాన్యాన్ని దంచులకు బానసీడలనూ, బానిసలను బహుళ సంఖ్యలో వినియోగించినట్లు" వాల్టెర్ రూబెన్ అభిప్రాయపడ్తున్నాడు. వస్తుతః హరప్పాలోని కోటకు వాయవ్యంగా, ఉత్తరంగా గల ధాన్యాగారాల సమీపంలో గల 11 గదులను పనివారి గదులుగా కొందరు గుర్తించారు.

ఇళ్ళ పరిణామాల్లోని మార్పుల వల్ల, వివిధ నివాసాల ఉనికిని బట్టి కొందరు చరిత్రకారులు సమాజంలోని అంతరాలను ఊహించారు. దీన్ని మాలిక్ "సామాజికార్థిక వ్యవస్థల్లో, సంస్థల్లో కుల-వర్గ విధానాల పెరుగుదల" అని పేర్కొన్నాడు.

ఈ అభిప్రాయాలను స్థూలంగా గమనించినట్లైతే, నగరాల్లోని నిర్మాణాలు ఒక నిర్దిష్ట సామాజిక మనఃప్రవృత్తిని సూచిస్తాయి. లోథాల్ వంటి చోట్ల వైవిధ్యంతో కూడిన వృత్తుల వారి నిర్మాణాలను గుర్తించడం జరిగింది. వీరికి వైయుక్తికంగా గల ప్రయోజనాత్మక గమనశీలత (functional mobility) నగరవ్యవస్థల్లోని వివిధ వర్గాల, వాడలకు మాత్సర్యకగా ఉండే సమూనాను సృష్టించినట్లు గమనించగలం. దాని వల్లనే హరప్పా, మొహంజోదారో వంటి పట్టణాల్లో స్థిరంగా కన్పిస్తున్న ఎగువ వీధి, దిగువ వీధులను గుర్తించొచ్చు. ఎగువవీధి ప్రయోజనాన్ని కోట అని గుర్తించినప్పటికీ, ఈ గుర్తింపు సామాజిక ప్రవృత్తికి లోబడలేదని, కేవలం దాని ప్రయోజనాత్మకత దృష్ట్యా మాత్రమే గుర్తింపబడి ఉందని అవగాహన చేసుకోవచ్చు.

BRAOU

సామాజిక ప్రక్రియలో ప్రయోజనాత్మక గమనశీలత పట్టణ నిర్మాణ వ్యవస్థలోను, ప్లానింగ్‌లోను, విప్లవాత్మకమైన మార్పులకు దోహదం చేయగా, నగర గ్రామ సంబంధాలు పట్టణ వ్యవస్థ అస్తిత్వానికి తోడ్పడ్డాయి. హరప్పా సంస్కృతిలో కన్పించే వివిధ పట్టణాలు, వస్తువుల నశించని గుణం వల్ల, తమ ఉనికిని ఈనాటి వరకు ఉంచుకోగలిగాయి కాని, వ్యవసాయిక వృత్తుల ప్రాముఖ్యత గల్గిన గ్రామీణ నిర్మాణాల గూర్చి మనకు ఏ రకమైన ఆధారాలు లభించడం లేదు. పట్టణం అంతమయ్యే చోట, గ్రామం ప్రారంభమౌతుంది (city ends where the village starts) అనే నగర భౌగోళిక శాస్త్రజ్ఞుల అభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకొన్నట్లయితే, హరప్పా సంస్కృతికి చెందిన ప్రతి నగరం తనదైన ఒక పోషక ప్రాంతాన్ని కల్గి ఉండేదని అనివార్యంగా చెప్పాలి. కానట్లయితే ఈ పట్టణాలు ఆర్యుల దండయాత్ర వల్ల కాని, లేక ఇతర ప్రకృతి సంబంధమైన కారణాల వల్ల కాని నశించే వరకు కొనసాగి ఉండేవికావు. ఈ స్థితిలో మనం ఇంకో అంశాన్ని గుర్తించాలి. హరప్పా సంస్కృతిని నాశనం చేయడంలో నిమిత్తమాత్రులుగా వ్యవహరించిన ఆర్యులు ముఖ్యంగా గ్రామీణ జీవనం గలవారు. కావున హరప్పాలోని, దాని సమీప నగరాల్లోని గ్రామీణులు పట్టణాలతో అనివార్యంగా సంబంధాలను కల్గి ఉండేవారని, ఆ సంబంధాలు కేవలం నగరాల అభివృద్ధికేకాక, వాటి వినాశనానికి కూడా దోహదం చేసినట్లు గుర్తించొచ్చు.

5.6 సంగ్రహంగా

హరప్పా సంస్కృతిలో హరప్పా, మొహంజొదారో, కాలీబంగన్, లోథాల్ వంటి ప్రసిద్ధ నగరాలున్నాయి. ఈ నగరాలన్నీ సమరూపత కల్గిన ప్లానింగ్‌ను కల్గి ఉన్నాయి. ఇవి పడమటి వైపు ఎత్తైన కోట ప్రాంతాన్ని, తూర్పు ఆగ్నేయాలుగా పల్లపు ప్రాంతాల్లో నివాస గృహాల వాడకట్టును చూడొచ్చు. ఈ నిర్మాణాలన్నీ కాల్చిన, పచ్చి ఇటుకలతో చేయబడ్డాయి. అడుసుగా శిలాజిత్తు వంటివాటిని ఉపయోగించారు. ఈ సంస్కృతికి చెందిన నగరాల్లో మొహంజొదారోలోని స్నానవాటిక, హరప్పాలోని ధాన్యాగారాలు, లోథాల్‌లోని ఓడరేవు ప్రసిద్ధమైనవి. ఈ పట్టణాల ప్లానింగ్ పై వివిధ ఆర్థిక వర్గాలవారి స్వభావంలోని అంతరాలు ప్రభావాన్ని చూపగా, పట్టణాల అస్తిత్వం పైన, వినాశనాల్లోను వివిధ గ్రామాలతో వానికి గల సంబంధాలు, ప్రభావాన్ని కల్గి ఉన్నాయి.

5.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. హరప్పా నగర నిర్మాణ విధానాలు, నగర వ్యవస్థపై సామాజిక ప్రక్రియల ప్రభావాన్ని వివరించండి.
2. హరప్పా నాగరికత ఒక పట్టణ నాగరికత – వివరించండి.
3. హరప్పా నగరాలలో నిర్మాణ విధానాలను చర్చించండి.

BRAOU

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. హరప్పా సంస్కృతుల్లోని నగర ప్లానింగ్ వివరాలను తెల్పండి.

2. హరప్పా సంస్కృతుల్లోని ప్రత్యేక నిర్మాణాలను పేర్కొనండి.

5.8 ఉపయుక్త గ్రంథాలు

Allichin R. & Allichin B. : **Birth of Indian Civilization: India and Pakistan before 500 B.C.**

Mallik S.C. : **Understanding Indian Civilization.**

Tripathi R.S. : **History of Ancient India.**

Vijay Kumar Thakur : **Urbanisation in Ancient India.**

Walter Ruben : **Condition of Slaves in Indian Societies.**

Wheeler, Mortiner : **The Indus Civilization**

BRAOU

రచయిత : డా. కౌశీభట్ల సత్యమూర్తి

ఖండం – 2 : వేద యుగం

ఈ ఖండంలో 6, 7, 8 భాగాలున్నాయి. 6వ భాగంలో వైదిక మతం, కర్మకాండల ఆవిర్భావం, ప్రాముఖ్యత, 7వ భాగంలో వేద కాలపు సమాజం, సామాజిక పరిస్థితులు, కుల వ్యవస్థ పుట్టుక, పరిణామం, 8వ భాగంలో వేద కాలపు ఆర్థిక వ్యవస్థ వివరాలను తెలుసుకోవడమౌతుంది. వీటి సమగ్ర అధ్యయనం, వైదిక యుగ సామాజికార్థిక వ్యవస్థలను, పరిస్థితులను క్షుణ్ణంగా తెలుసుకోవటంలో దోహదమౌతుంది.

BRAOU

BRAOU

భాగం – 6 : వైదిక మతం – కర్మకాండలు

విషయక్రమం

6.0 లక్ష్యాలు
6.1 పరిచయం
6.2 వైదిక మతం
  6.2.1 వైదిక మత ఆవిర్భావం
  6.2.2 వైదిక మత విశిష్టత
  6.2.3 వైదిక గ్రంథాలు
  6.2.4 వేద పౌరుషేయత్వం
  6.2.5 వేద శబ్ద నిర్వచనం
6.3 వేదాల్లోని భాగాలు
6.4 ఋగ్వేద మతం
  6.4.1 దైవాల వర్గీకరణం
  6.4.2 స్వర్గాధి దేవతలు
  6.4.3 అంతరిక్ష దేవతలు
  6.4.4 పృథ్వీ దేవతలు
6.5 వైదిక మతం - కర్మకాండలు
  6.5.1 సంస్కారాలు
  6.5.2 పంచ మహాయజ్ఞాలు
  6.5.3 జననానికి ముందు జరిపే సంస్కారాలు
  6.5.4 జన్మించిన తర్వాత జరిపే సంస్కారాలు
6.6 సంగ్రహంగా
6.7 పరీక్ష నమూనా ప్రశ్నలు
6.8 ఉపయుక్త గ్రంథాలు

6.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా మీరు,

* భారతీయ సంస్కృతి మీద వైదిక మత ప్రభావాన్ని విశ్లేషించగల్గాలి.
* భారతీయ జీవన విధానాన్ని వివరించగల్గాలి.

  వైదిక మత విశిష్టతను తెల్పగల్గాలి.
* హిందూ మత ఆవిర్భావం, అర్థం, ప్రాధాన్యతను వివరించగల్గాలి.

BRAOU

6.1 పరిచయం

వైదిక మతం – హిందూ మతం ఒకదాని మీద ఇంకోటి పెనవేసుకొనిపోయిన ఏక మతం. ఆధునిక యాంత్రిక యుగంలో మన సనాతన ధర్మాన్ని, దాని ప్రాశస్త్యాన్ని జ్ఞాపకం తెచ్చుకొని, ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైదిక మత సంస్కారాలు, విధానాలను పాటించడంలో ఇటీవల వస్తున్న మార్పు ఆరోగ్యకరమైందే అయినా, బహుళ ప్రచారం కాని కారణంగా, అది అందరినీ చేరలేదు. ఈనాడు మనం ఆచరిస్తున్న మతం, మతపరమైన కార్యక్రమాలు యాంత్రికంగా జరిపిస్తున్నామే కాని, వాటిమీద గౌరవంగాని, జ్ఞానం గాని ఉండికాదు. మన పూర్వీకుల నుండి వస్తున్న సంప్రదాయంగా, లేక ఒక అలవాటుగా మాత్రమే పాటిస్తున్నాం. వాటి వెనుకున్న అద్భుతమైన, శాస్త్రీయపరమైన అర్థాన్ని, ప్రయోజనాన్ని గుర్తించినవారు ఎందరున్నారు? వైదిక మతం – హిందూత్వం – భారతీయత్వం ఒకదానితో ఒకటి ముడి వేసుకొనున్నాయి. ఈ వైదిక మతంలోని లౌకికత్వాన్ని సహన సౌశీల్యాన్ని మనం అనుభవిస్తున్నామే గాని, గుర్తించడం లేదు. వైధిక మత పరంగా ఆవిర్భవించిన కర్మకాండలు, సంస్కారాలను ఎటువంటి అనుభూతి లేకుండానే ఆచరిస్తున్నాం.

వైదిక మతంలోని ప్రతి అంశానికీ ఒక అర్థం, పరమార్థం కూడా ఉన్నాయని గుర్తించి, అనుభవిస్తే ఎంతో సంతృప్తి ఆనందం కల్గుతాయి. మనిషి పుట్టినప్పటి నుండి చనిపోయేదాక, చనిపోయాక కూడా జరిగే ఘట్టాలను సంస్కారాల పేరిట ఆచరించడంలోని పరమార్థం తెలుసుకోవడమెంతో అవసరం.

వైదిక మతానికి ప్రామాణికాలైన వేదాలు, ఇతర వేద సాహిత్యం, వాటి విలువ, ప్రాధాన్యతను తెలుసు కొంటే, అవి మనకు మరింత ఉపయోగపడ్తాయి. భారతీయ సంస్కృతీ వైభవాన్ని, సాంప్రదాయాలను గౌరవించి, గర్వపడేలా చేయాలంటే, వాటికి సంబంధించిన వివరాలు మనకు తెలియాలి.

BRAOU

6.2 వైదిక మతం

ప్రపంచంలో ఈనాడు ఎన్నో మతాలున్నాయి. వాటన్నిటికి, వారి ప్రవక్తల పేరిట పేర్లున్నాయి. బౌద్ధ మతం, క్రైస్తవ మతం మొదలైనవి. ఈ మతాలన్నీ ఒక ప్రత్యేక సమయంలో, ఒక ప్రత్యేక కారణంగా ఉద్భవించాయి. అందుకే, ఈ మతాలకు పేరు, సమయం ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. ఈనాటి హిందూ మతం, ఆ పేరును ఎలా సంతరించుకొందో మనకెవరికి తెలియదు. మరి ఆ మతం ఎప్పుడు ఆవిర్భవించింది? దాని పేరేమిటి? అది ఎలా వచ్చింది? అని పరిశీలిస్తే, ఈ మతానికి ఒక పేరు అంటూ లేకపోవడానికి కారణం, ఆ కాలంలో ఇతర మతాలేవీ లేకపోవడమే. ఒక పేరంటూ దానికి అవసరం లేకపోయింది. ఈనాడు ఈ పేర్లు ఇప్పుడున్న ఇతర మతాల నుండి గుర్తింపు కోసం మాత్రమే ఉపయోగిస్తున్నారు.

6.2.1 వైదిక మత ఆవిర్భావం

ఈ మతం ఎప్పుడు ఆవిర్భవించిందో చెప్పడానికి మనకు ఆధారాలు లేవు. ఆద్యంతాలు లేని మతం ఇది. అంటే, సనాతనం అన్నమాట. మతానికి, ధర్మానికి దగ్గర సంబంధమున్న మాట నిజం. అయినా, ఈ మతాన్ని స్థాపించినవారు మనకు ఎక్కడా కనబడరు.

6.2.2 వైదిక మత విశిష్టత

ఏ మతమైనా, ఆ మత స్థాపకుడి బోధనాశక్తి మీద నిలబడుతుందన్న విషయం మనకు తెలిసిందే. ఆ బోధనలన్నీ సంకలనం చేసి, గ్రంథ రూపంలో తీసుకురావడం, ఇస్లాం మతంలో ఖురాన్, క్రైస్తవ మతంలో బైబిల్, శిక్కు మతంలో ఆదిగ్రంథం వంటివి అన్ని మతాలల్లోనూ చూస్తాం. ఈ మత గ్రంథాలన్నీ ఆయా మతాల ఆధారంగా నిలిచాయి. మరి వైదిక మతానికి ఏది ఆధారం? అంటే వేదాలు అని చెప్పొచ్చు. వేదాలు మనకి కనిపించే ప్రత్యక్ష ఆధారాలు. అవి మనకు ధర్మ సత్యాలను తెలియజేస్తాయి. అవి ఎంత పటిష్టమైనవంటే, మనం సాధారణంగా, ఒక్కోసారి 'వేదవాక్కు' అనే మాట ఉపయోగిస్తాం. వేదవాక్కు అంటే శిరోధార్యం అని అర్థం.

6.2.3 వైదిక గ్రంథాలు

వేదాలు హిందూ సనాతన ధర్మ ప్రామాణికాలు. అయితే, వేదాల ముఖ్యోద్దేశ్యం బ్రహ్మజ్ఞానాన్ని, భగవంతుని పట్ల భక్తి భావనను అందించడం. దేవభాషైన సంస్కృతంలో ఉన్న ఈ జ్ఞాన సంపద, గురుశిష్య పరంపరగా తరతరాలుగా సాగుతూ, మనకందిన దివ్యసంపద. వరసక్రమంలో వేదాలు మొదట వెలువడిన గ్రంథాలైతే, తర్వాత ఇతర గ్రంథాలు వస్తాయి.

6.2.4 వేద పౌరుషేయత్వం

వేదాలు రచింపబడలేదు. సంకలనం చేయబడ్డాయి. ఇవి మానవ మాత్రులకు అందిన జ్ఞానం మాత్రమే. గత కల్పాంతంలో ప్రళయం వచ్చిన తర్వాత, అప్పటి దైవమైన రుద్రుడు ఒక కొత్త బ్రహ్మను ఇప్పటి ఈ శ్వేత వరాహకల్పంలోకి సృష్టించి, అతనిచేత ఒక కొత్త విశ్వాన్ని సృష్టింప జేస్తాడు కాని, ఈ నూతన బ్రహ్మ నూతన సృష్టివిధానాన్ని మర్చిపోయిన కారణంగా, తపస్సు చేసి రుద్రుని ప్రసన్నుని చేసుకొన్నాడు. ప్రజాపతి రూపంలో అవతరించిన ఈ బ్రహ్మకు, రుద్రుడు సృష్టి చేయగల సామర్థ్యాన్ని కల్పించాడు. ప్రజాపతి చేసిన తపస్సు ఫలితంగా, భగవంతుడు అతనికి ఓంకార రూపంలో ప్రత్యక్షమై, వేలకొద్దీ సూర్యుల ప్రకాశంతో ఉన్న బ్రహ్మ జ్ఞానాన్ని వేదాలుగా చేసి అందించాడు. కళ్ళు మిరుమిట్లు గొల్పుతున్న ఆ వెలుగును బ్రహ్మ భరించలేకపోవడం వల్ల, వాటి నుండి ఒక నాల్గు వేదాలను తీసి బ్రహ్మకిచ్చాడు. అవే సృష్టికి నాంది అయ్యాయి. అలా మానవాతీత శక్తిచేత ఓంకార ప్రణవ నాదం నుండి ఉద్భవించిన వేదాలు నాల్గు. కనుక వేదాలు వ్రాయబడలేదు. మహర్షుల నోటి ద్వారా వెలువడితే, మరొకరు విని స్వీకరించారు. ఇలా ఒక తరం నుండి మరో తరానికి, మంచి అధ్యాపకుని ద్వారా మంచి శిష్యునికి అందేదే వేదజ్ఞానం. అంతేగాని, గ్రంథస్తం చేయడానికి ఎవరూ ప్రయత్నించలేదు. తమిళ భాషలో వేదాలను 'దాచిపెట్టబడిన అలిఖిత గ్రంథమని' చెప్తారు. (Marai Ozhudaakkilavi) వేదాలు అధ్యయనం ద్వారా నిక్షిప్తం చేసి, బోధన ద్వారా ఇతరులకు అందజేయాల్సిన బాధ్యత బ్రాహ్మణులకు అప్పగించబడింది. ఈ బ్రాహ్మణులు వేరే వ్యాపకానికి పూనుకోకుండా, తమ జీవితమంతా ఈ వేదాధ్యయనానికి, బోధనకు వెచ్చించాలని, వేద సంస్కృతిని జీవింపజేయాలని, ఇతరులెవ్వరూ ఈ పని చేయలేరని భావించబడింది. అందుకే, వారికి సంఘంలో గౌరవప్రదమైన ఉన్నత స్థానం ఇవ్వబడింది.

6.2.5 వేద శబ్ద నిర్వచనం

వేద శబ్దం 'విద్' అనే సంస్కృత పదం నుండి తీసుకోబడింది. 'విద్' అంటే తెలుసుకోవడం లేదా విదితం కావడం. వేదాలను శ్రుతి అని, సంహితాలు అని కూడా అంటారు. విదితం కావల్సిన ఈ బ్రహ్మజ్ఞానం, సాంప్రదాయ పరంపరగా ప్రాప్తించింది.

BRAOU

6.3 వేదాల్లోని భాగాలు

వేదాల్లో ఋగ్, యజుర్, సామ, అధర్వణ వేదాలతో బాటు, ఆరు వేదాంగాలైన శిక్ష, వ్యాకరణ, నిరుక్త, ఛందస్సు, జ్యోతిష, కల్ప వేదాంగాలు, వాటి నాల్గు అనుబంధాలైన పురాణ, న్యాయ, మీమాంస, ధర్మశాస్త్రాలు ముఖ్యమైనవి.

గ్రాంథికంగా వేదాలు, మంత్రపర భాగంగానూ, బ్రాహ్మణ భాగంగాను విభజింపబడ్డాయి. బ్రాహ్మణాలు వచన రూపంలో యజ్ఞయాగాది కర్మకాండల వివరణ, వాటిని నిర్వహించాల్సిన తీరును వివరిస్తాయి. అంతేకాక, కర్మకాండలు చేసినందువల్ల కలిగే సత్ఫలితాలను కూడా వివరిస్తాయి. శతపద బ్రాహ్మణం, ఐతరేయ, తైత్తరీయ బ్రాహ్మణాలు, మనం తరచు వింటున్నవే.

అరణ్యకాలు, ఆ పేరు సూచిస్తున్నట్లే అరణ్య జీవనాన్ని, వానప్రస్థాన, సన్యాసాశ్రమాల సందర్భంలో ఆచరించాల్సిన విషయాలను వివరిస్తాయి. ఇవి ఇంచుమించు భాషలోను, విషయంలోనూ కూడా, బ్రాహ్మణాలను పోలి వుంటాయి.

ఉపనిషత్తులు భారతీయ, హిందూ మతతత్వాన్ని వేదాంత రహస్యాన్ని కల్గి ఉన్నాయి. 'ఉపనిషత్' అన్న పదానికి అర్థం, ఎవరి దగ్గరైనా అంటే గురువు దగ్గర కూర్చుని తెల్సుకోవాల్సిన విషయం అని. ఇవి బ్రహ్మకు, ఆత్మకు మధ్యగల సంబంధాన్ని వివరిస్తాయి. దీనికి మండుకోపనిషత్తు ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు.

ఈ వేద గ్రంథాల అమరికలో పురాణాల్లో భాగాలుగా, వేదాంతం మీమాంసలోని భాగంగా, రామాయణ, మహాభారతాలు, సాంఖ్య, పతంజలి, పశుపతి, వైష్ణవాలు ధర్మశాస్త్రాల్లోని భాగాలుగా, మొత్తం 14 విద్యలుగా ఏర్పడ్డాయి. వీటితో బాటు, వాల్గు ఉపవేదాలైన ఆయుర్వేద, ధనుర్వేద గాంధర్వవేద, అర్థశాస్త్రాలు వేదాల్లో భాగాలుగా ఏర్పడ్డాయి.

మరో దృష్టితో పరిశీలిస్తే, వేదాలను రెండు భాగాలుగా విభజించొచ్చు, కర్మకాండ, జ్ఞానకాండ అని. మొదటిది స్వర్గప్రాప్తికి సంబంధించింది. రెండవది శాశ్వతం కాని మానవ జన్మకు సంబంధించింది.

ఇటువంటి విశిష్ట సాంప్రదాయాన్ని వేదవ్యాసుడు క్రోఢీకరించి, తన నల్గురు శిష్యులైన పైల, వైశంపాయన, జైమిని, సుమతులకు బోధించాడు. ఈ శిష్యులు తమకందిన ఈ విజ్ఞానాన్ని తమ శిష్యులకందించారు. ఆ విధంగా వేదాలు తరువాతి తరాలకు అంది, అంతటా వ్యాపించాయి.

6.4 ఋగ్వేద మతం

వేదాల్లో అతి ప్రాచీనమైంది ఋగ్వేదం. (సుమారు క్రీ.పూ. 1000 నాటిది). ఈ వేద సంహితం ఒక్కసారిగా సంకలనం చేయబడలేదు. ఎన్నో ఆచార్య, పూజారి కుటుంబాలు చెప్పిన ఋక్కులతో కూడుకొనుంది. ఈ శ్లోకాలు ఈ కాలంనాటి దైవాలను, వారిని సంతృప్తి పర్చడానికి పూనుకొన్న కర్మకాండలను వర్ణించాయి. ఈ శ్లోకాలు ప్రకృతిని ప్రత్యక్ష దైవంగా వర్ణిస్తాయి. ప్రకృతిలోని భాగాలు, అవి చేస్తున్న పనులకు ఆలంబనగా,

BRAOU

శక్తులుగా ఏర్పడ్డాయి. మానవ సంక్షేమం కోసం, ఈ శక్తులనారాధించి, తృప్తి పర్చాలనేదే, ఆ కాలపు భావన. ఈ భావనకు రూపకల్పనే, దైవాల ఆవిర్భావం. ఉదయారంభ శ్లోకాల్లో సూర్యుడు, అగ్ని, ఉషస్సు లాంటి శక్తులను దర్శించగల్గుతున్నాం కనుక, వారందరూ ప్రత్యక్ష దైవాలుగా పూజింపబడుతున్నారు. కాని, అప్పటికి ఇంద్రుడు, వరుణుడు ఇంకా దైవాలుగా రూపకల్పన చేయబడలేదు. ఋగ్వేద కాలంలో సహజ సంఘటనలను ఆధారంగా చేసుకొని, ప్రకృతి శక్తులకు దైవత్వం ఆపాదించడం జరిగింది. సాధారణంగా దైవం పేరు, సంఘటన కలిసే విధంగానే ఉన్నా, అప్పుడప్పుడు పేర్లకు, సంఘటనలకు సంబంధం లేకుండా కూడా కన్పిస్తుంది. ప్రకృతిలో జరిగే కార్యకలాపాల కనుగుణంగా ప్రకృతి శక్తులు దైవాలుగా రూపొందడం, క్రమేపీ పెరగడం మనం గమనిస్తాం.

6.4.1 దైవాల వర్గీకరణ

ఈ ప్రకృతి శక్తుల్లో ఉన్నతమై నవేవో ఇదమిద్దంగా చెప్పలేం. కొన్నికొన్ని కార్యక్రమాల్లో కలిసికట్టుగా ఇద్దరు ముగ్గురు దైవాలుండడం కూడా కన్పిస్తుంది. వారు నిర్వహిస్తున్న కార్యాన్ని బట్టి, అప్పటికి ఆ దైవం ఉన్నతంగా భావింపబడొచ్చు. దీనికి నిదర్శనం, తర్వాతి శ్లోకాల్లో, ఆ దైవం ఇతర దైవాలతో కలపబడి పూజింపబడడమే. కాని, మెక్‌డొనల్ (Macdonell) వైదిక పురాణం (Vedic Mythology) లో చెప్పినట్లుగా, విశ్వంలోని దైవాలన్నిటినీ ఉద్దేశించిన శ్లోకాల్లో, అందరినీ కావల్సిన కర్మకాండలకనుగుణంగా స్తుతించడం కనబడుతుంది. ఇది తరువాత మలి వేద కాలంలో పెరిగిన యజ్ఞయాగాది కర్మకాండలకు నాంది అనొచ్చు.

ఇంకో వర్గీకరణ ప్రకారం ఋగ్వేదం (I. 139. II) లో దైవాలు 3 వర్గాలుగా విభజించబడ్డారు. అవి పృథ్వీస్థాన (Earth). అంతరిక్ష స్థాన లేక మధ్యమస్థాన (atmospheric), వ్యోమస్థాన దైవాలు (celestial gods).

స్వర్గాధి దేవతలైన పృథ్వి, అగ్ని, సోమ, బృహస్పతి, నదులు మొదటి వర్గానికి చెందినవారు. ఇంద్ర, రుద్ర, ఆపమ్నాపత్ (Apamnapat), వాయు, వాత, పర్జన్య, ఆపః, మాతారిశ్వన్ రెండో వర్గానికి చెందినవారు.

ద్యాయుస్, వరుణ, మిత్ర, సూర్య, సావిత్రి, విష్ణు, ఆదిత్యులు, ఉషస్సు, అశ్వినులు మూడవ వర్గానికి చెందినవారు.

ఋగ్వేదం (10.158.1) ప్రకారం, సూర్యుడు, వాత, అగ్నులు ముగ్గురు స్వర్గం, గాలి, పృథ్వీల తరపున రక్షించడానికి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేవతల గొప్పతనాన్ని వర్ణించడం కూడా కష్టమే. ఋగ్వేదం (1.27.13) ప్రకారం వారి ఉనికినిబట్టి, వారు నిర్వహించే కార్యాన్ని బట్టి, గొప్పతనాన్ని ఆపాదించడం జరిగింది. ఒక్కోక్కప్పుడు అది కూడా కష్టమౌతుంది. ఉదాహరణకు, ఇంద్రుడు యుద్ధదేవుడిగా, వరుణుడు నీతికి ప్రభువుగా ఉంటే, ఇంద్ర, అగ్ని, సోములు చాలా వాడుకలో ఉన్న దైవాలుగా స్మరిస్తారు. ఎన్నో శ్లోకాల్లో వీరి ప్రస్తావన ఎక్కువసార్లు కన్పిస్తుంది.

ఏది ఏమైనా, ఈ దేవతలందరూ మృత్యువు లేనివారు. సోమపాన కారణంగా, వీరిలో శాశ్వత్వం ఏర్పడింది. మానవుల్లాగే కనిపిస్తూ, ఆహార పానీయాలను సేవిస్తూ, మానవులకు ఎన్నో కార్యక్రమాల్లో సహాయపడడం ఒక్క రుద్రునిలో తప్ప, ఈ దేవతల్లో సర్వసాధారణ విషయంగా కన్పిస్తుంది. ఈ దేవతలందరూ దుష్టశిక్షణ, శిష్టరక్షణలో పాలు పంచుకుంటారు.

6.4.2 స్వర్గాధి దేవతలు (Celestial Gods)

ఇక వ్యక్తిగత దైవాల వైపు దృష్టిని సారిస్తే, అతి ప్రాచీన దైవం 'ద్యౌస్'(Dyaus) అంటే ఆకాశ దేవత. మెరుపులు

BRAOU

రావడానికి, వర్షం కురిపించడానికి, ఉరుములు పడడానికి ఉపయోగపడే ఈ ఆకాశదేవత, అందమైన మిణుకు మిణుకుమనే నక్షత్రాలతో పొదిగిన రాత్రిగా మనకు ఆహ్లాదాన్ని కల్గిస్తుంది. ఆకాశాన్ని సాధారణంగా పృథ్వితో జోడిస్తారు. వీరిని గురించిన వర్ణన ఆరు అధ్యాయాల్లో చెప్పబడింది.

వరుణ దేవుడికి ఇంతకంటే కొంచెం తక్కువ వర్ణన ఉంది. ఈనాటికీ వరుణదేవునికి ఒక ఆకారం, స్వరూపం లేదు. వరుణుడు నీతి రక్షకుడు. అతడిని స్తుతించే ఋక్కులు నీతిపరంగా వుంటాయి. ఋగ్వేదంలో అతనిని ఒక విశ్వసామ్రాట్‌గా వర్ణిస్తూ, స్వర్గంలో ఒక విశాలమైన వేయికి మించిన ద్వారాలుగల స్వర్ణగృహంలో అతడు నివసిస్తాడని, ధగధగమెరిసే పట్టు పీతాంబరాలు ధరిస్తాడని, ఎవ్వరూ కనుగొనలేని విధంగా గూఢచారుల ఏర్పాటు ఉందని చెప్పబడుతుంది. మొదట్లో అతడు అసురుడని పిలవబడ్డాడు. అతని మాయాశక్తి అతన్ని మంచివాళ్ళకు మంచివాడిగాను, చెడ్డవాళ్ళకు చెడ్డవాడిగానూ చూపిస్తుంది. ఈ శక్తితోనే అతడు అవసరమైనప్పుడు తన కన్నుగా భావింపబడుతున్న సూర్యుని గతిని కూడా మారుస్తాడు. వరుణుడు స్వర్గానికి, పృథ్వికి, వాయువుకి ఆధారమని, మిత్రునితో కలిసి, వర్షం కురియడానికి కారణమౌతాడని తెలుస్తోంది. ఋతువులను అతడు నియంత్రిస్తాడు. దేవతలు కాని, మానవులు కాని అతడిని వ్యతిరేకించలేరు. వరుణుడికి జలానికి ఉన్న సంబంధం ఇంతా అంతా కాదు. నీటి ప్రవాహాన్ని నియంత్రించి, నదులను సముద్రంతో కలిపి, సాగరం పొంగకుండా చూస్తాడు. వరుణుడిని 'దీతవ్రతగ' అంటే, ప్రకృతిలోని వ్యవహారాలు తారుమారవకుండా, ఒకో క్రమపద్ధతిలో నడిపే దైవంగా భావిస్తారు. అంతేకాక, పాపపాశాల పగ్గాలు అతడి చేతిలో ఉంటాయి. అందుకనే, వరుణుడిని స్తుతించే ప్రతి శ్లోకంలోనూ, తమను క్షమించమని వేడుకోలు ఉంటుంది. అయితే, ఈ వరుణ దేవునికి 'ఆపః' అంటే జలరాశి మీద ఆధిపత్యం ఉన్న విషయం కూడా గమనించాలి. వారుణాస్త్రం, ఆగ్నేయాస్త్రానికి వ్యతిరేకంగా ప్రయోగించడం అన్నది మనకు తెలిసిన విషయమే.

మిత్రదేవత వరుణునితో కలిపి చెప్పబడినప్పటికీ, ఒక ఋక్కు మాత్రం అతడిని "యతాయత్‌జన" (Bestirrer of the People) అంటే, ప్రజలను కార్యోన్ముఖులుగా చేసే దేవతగా చెప్తారు. 'మిత్రదేవత' అంటే, ఒక సూర్యుడని, ఆయన సమస్త జీవరాశులకు ప్రకృతికి మిత్ర బాంధవ్యం కల్గి ఉన్న కారణంగా, ఆయనకు మిత్ర అనే పేరు వచ్చిందని తెలుస్తోంది.

సూర్య భగవానుడు వెలుగు, వేడిమినిచ్చే దేవత, ప్రత్యక్ష నారాయణుడు. ఇతడు మిత్ర వరుణ, అగ్ని దేవతలకు నయనం వంటివాడు, అంటే ప్రధానం అని చెప్తారు. ఈ సూర్యుడు అదితి, ద్యౌస్‌ల పుత్రుడని, దివరాత్రాలను క్రమపరుస్తూ, ఆకాశమార్గాన సప్తాశ్వరథంలో పయనిస్తాడని ప్రతీతి.

సావిత్రి ఒక పోతపోసిన బంగారు దేవత. ఆయన శరీర భాగాలే కాక, రథం, ధ్వజం కూడా బంగారమే. ఆయనది బంగారు బాట. మనలోని చెడును, మనలను బాధించే దైత్యులను తరిమికొట్టే బంగారు దేవత. వేల సంవత్సరాలుగా ప్రతి ఉదయం చేసే గాయత్రీ జపంలో ఆయన ఉండి, గాయత్రి పట్ల మనసు లగ్నమయ్యేట్లు చూసే దేవత. సూర్యుని కిరణాలతో బాటు అవతరించి, మానవులను పాపవిముక్తులుగా చేయమని, వారి తరపున ప్రార్థించే దైవంగా, ఋగ్వేద (VII 63) భాగంలో చెప్ప బడ్డాడు. ఇలా సూర్యునితో ఉదయ సంధ్యల్లో కలిసి మెలిసి ఉండడం వల్ల, వారిద్దరిలో తేడా కనిపెట్టడం అంత సులభం కాదు.

'పూషన' అన్న దేవతకు ఒక ప్రత్యేక స్థానం, ఆకారమనేది సరిగా లేకపోయినా, ఆతనికి గుబురు గడ్డం, జుట్టూ ఉందని ఒకరకంగా తెలుస్తోంది. అతడి రథాన్ని మేకలు లాగుతాయి. అతడి చేతిలో ఒక బంగారు బల్లెం, ఒక గుడ్లగూబ, ఒక మంత్రదండం ఉంటాయి. పూషనునికి ప్రియమైన ఆహారం 'కరాంబ' (gruel) అంటే అంబలి. వివాహ సందర్భంలో అతన్ని స్తుతిస్తారు. అతడు సూర్య భగవానుడికి ప్రతినిధిగా, సూర్యుని రథాన్ని ముందుకు

BRAOU

సాగనిచ్చే మార్గదర్శకుడుగా, మార్గంలో ఒడిదుడుకులు, అపాయాలు లేకుండా చూసుకొనే దేవత. పశువుల పాలన అతడి విధి. 'అఘ్రిణి" (Aghrini) అన్న పేరుతో అతడు పిలుపబడ్డాడు.

'అదితి' అన్నది మరో దేవత. అదితి అంటే, బంధితులు కాకపోవడం (non-binding/bondlessness). దితి అంటే బంధితులవడం (binding). దితి తనను పూజించేవారిని బంధ విముక్తులుగా చేస్తుందని అర్థం. ఆదిత్యులు అదితి పుత్రులు. వీరు 'అదితి పుత్ర' అనబడే వారు. అంటే చీకటిలో బంధీలైన వీరు స్వతంత్రులయ్యారన్నమాట. అలా ఆరు నుండి ఎనిమిది ఆదిత్యులున్నారు. ఆదిత్యులు పవనం, తుఫానులు సృష్టించేవారు కారు. వరుణుడు, మిత్ర, ఆర్యామన్ (Aryaman) భాగ, దక్ష, అంశ అనే ఆరుగురు ఆదిత్యులైతే, ఏడవ ఆదిత్యుడు సూర్యుడు, ఎనిమిదో ఆదిత్యుడు మార్తాండుడు. వీరందరినీ సురలని అంటారు. అదితి సవతి దితి. ఈమె పుత్రులు అసురులు. సురాసురుల మధ్య శతృత్వం, పోటీలు నిరంతరం కన్పిస్తాయి.

ఉదయ దేవత 'ఉషస్సు' తూర్పున అందాలను ఫిరజిమ్ముతూ ఉదయిస్తుంది. ఆమె ఎప్పటికీ తన కాంతిని, సొగసునూ కోల్పోదు. సూర్యునితో ఆమె సాంగత్యం విడదీయలేనిది. ఆమె ముందుగా దారి తీయడం వల్ల సూర్యునికి తల్లిలాంటిదని కూడా అంటారు. ఆమె సాయంసంధ్య (రాత్రి)కి సోదరి. అగ్నితో కూడా సంబంధం కల్గి ఉంది.

ఇంద్ర, అగ్ని, సోముల తర్వాత ముఖ్యమైన వారు అశ్వినీ దేవతలనే కవల దేవతలు. వెలుగుతో వీరి సంబంధం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. 'వస్తా' అని, 'నాసత్యా' అనే పేర్లతో పిలవబడతారు. వారికి సోమ, మధువు అంటే ఎంతో ప్రీతి. వారి బంగారు రథంలో ఈ వస్తువులన్నీ ఎప్పుడూ ఉంటాయి. ఆ రథాన్ని ఒకటికన్నా ఎక్కువ మహిషాలు (ఎద్దులు) లేక పృషదాలు లాగుతాయి. ఉషస్సు వారి సోదరి. ఈ అశ్వినీ దేవతల ఆకారాల గురించి చరిత్రకారుల్లో ఈనాటికీ ఏకాభిప్రాయం లేదు. ఒక సిద్ధాంతం ప్రకారం వారిని వేగుచుక్క అనగా సంధ్యాసమయంలో కన్పించే తొలిచుక్కగా చెప్తారు.

6.4.3 అంతరిక్ష దేవతలు (The Atmospheric Gods)

ఋగ్వేదంలో ప్రధాన దేవత ఇంద్రుడు. ఇతడి ఆయుధం వజ్రాయుధం. ఇతడు సోమపానానికి అలవాటుపడిన దేవత. ఇంద్రుడి బంగారు రథాన్ని రెండు గుఱ్ఱాలు (steeds) లాగుతాయి. ఇతడిని 'రథేష్ఠ' అని కూడ అంటారు. రథేష్ఠ అంటే రథం అధిరోహించి, యుద్ధం చేసే వీరుడు. ఇతడి తండ్రిని ద్యాసుడని కొందరు, 'త్వష్ట్రి' (Tvashtri) అని మరికొందరు చెప్తారు. ఇంద్రుడి కవల సోదరుడు అగ్ని. ఇంద్రుడు తరచు అగ్నితో కలిసి పూజలందుకొంటాడు. మరుత్తులు ఆయన ముఖ్య స్నేహితులు. అందుకే ఇతడిని 'మరుత్వంతు'డని పిలుస్తారు. మరుత్తులతో కలిసి సోమపానంతో మునిగి, 'వృత్ర' అనే పామును ఎదుర్కొని, నీటిలో దాక్కున్న శత్రువును నాశనం చేస్తాడు. అందుకే, ఇతడికి 'అప్సు-జిత్' (Apsu-jit) అన్న పేరు వుంది. ఇంద్రుడు చేసే ముఖ్య కర్తవ్యం, కంపిస్తున్న పర్వతాలను, మైదానాలను సర్దుబాటు చేయడం. దుష్ట రాక్షసులను హతమార్చే ఇంద్రుడంటే అందరికీ అభిమానం. ఇంద్రుడు ఆర్యులను రక్షించి, దస్యులను అణచివేయడమే గాక, తనను పూజించిన వారిని అనుగ్రహించే దేవత కూడ. ఇలా భౌతికంగా, శారీరకంగా ఉన్నతుడై, విపరీతంగా ఆహార పానీయాలను సేవించడంలో, స్వంత తండ్రిని చంపడంలో వరుణునితో ఏ మాత్రం పోలిక లేక పూర్తిగా వేరుగా ఉంటాడు. వృత్ర ఆయనకు వ్యతిరేకి కనక, ఇంద్రుడి అసలు స్వభావం ఆయన ద్వారా తెలుస్తుంది.

ఇక ఇతర చిన్నచిన్న దేవతల గురించి పరిశీలిస్తే, మనకు కన్పించే వారు 'త్రితాఆప్త్య' (Trita Aptya) అపామ్ (Apam), నపాల్ (Napal), మాతారిశ్వన్ (Matarisvan), అహిబుధన్య (Ahi Budhunya) అజ ఏకపాద (Aja

BRAOU

Ekapada), రుద్రుడు (Rudra). నిజానికి రుద్రుడు ఋగ్వేద కాలంలో చిన్న దైవం మాత్రమే. తర్వాతికాలంలో ఇతడి ఘనత కొంచెం పెరగడం కనిపిస్తుంది. రుద్రుడు గోదుమ వర్ణంలో ఉండి, ఎర్రని జడలతో కూడిన వెంట్రుకలతో, బంగారు నగలను ధరించి, వైభవంగా కన్పిస్తాడు. ఇతడు అరివీర భయంకరుడు. ప్రపంచాధిపత్యం సాధించినవాడు. ఇతని ఆగ్రహ, అనుగ్రహాలకు గురికాదల్చిన వారు, బహుజాగ్రత్తగా మసలుకోవాలి.

రుద్ర, ప్రిశ్నిల కుమారులే మరుత్తులు. వీరు తుఫాను సృష్టించగలిగే దేవతలు. మరుత్తులు స్వయం ప్రకాశకులై, బంగారు కాంతులను విరజిమ్ముతూ, విద్యుత్తును సృష్టిస్తూ ఉంటారు. వారి రథాలు మెరుస్తూ ఉంటాయి. శరీరమంతా ధగధగ మెరిసే ఆభరణాలతో, మెరుపు వెలుగులో మరింత వెలిగిపోతూ ఉంటారు. ఉరుములతో కూడిన శబ్దం చేస్తూ, ఇంద్రుడిని ప్రసన్నం చేసుకొంటూ ఉంటారు. వర్షం కురిపించడం వారి ముఖ్య కర్తవ్యం. మెరుపు దారులను సృష్టించి, సూర్యునికి దారి చూపిస్తారు. ఇంద్రునితో ఎప్పుడూ స్నేహం కొనసాగిస్తూ అతడిని స్తుతిస్తారు.

వాయువు లేక 'వాత' కూడా ఒక దేవతే. 'పర్జన్య' అంటే, వర్షపు మేఘం. ఆపః అంటే నీరు, వీరంతా వరాలిచ్చి, చల్లగా చూసే దేవతలు.

6.4.4 పృథ్వీ దేవతలు

అగ్ని పవిత్రమైందిగా భావింపబడే దేవత. వేద కాలం నుండి ప్రతి ఇంటిలోనూ నిత్యం కనిపించే ప్రత్యక్ష దైవం. ఇంద్రుడి తర్వాత అతని సోదరుడిగా, అంతే గొప్పవాడిగా భావింపబడే దైవం అగ్ని. ఒక ఖచ్చితమైన ఆకారాన్ని మనం గుర్తించలేకపోయినా, వెలుగుతున్న మంటలు విరబోసుకున్న వెంట్రుకల లాగా, అందరిని కబళించడానికి చాస్తున్న నాలుకలలాగ తోస్తుంది. కలప, నేయి, కరగిస్తున్న వెన్న, సోమరసం అతనికి ఆహారం. యజ్ఞ యాగాదుల్లో అగ్నిని ప్రజ్వలింప జేసి, సమస్తం సమర్పిస్తున్నా, అది ఎవరి నుద్దేశించి సమర్పణ చేస్తామో, వారికే అందించే ద్వారం అవుతుంది. అగ్ని రాత్రింబవళ్ళు వెల్గుతూనే ఉండే దైవం. అతడిని 'ధూమకేతువు' అని కూడా అంటారు. తన పొగతో ఆకాశాన్ని కప్పుతూ, రక్షిస్తూ ఉంటాడు.

అగ్ని పుట్టుక గురించి అనేక కథనాలున్నాయి. మనకు కన్పించే కొన్ని సత్యాలు అగ్ని నిత్యం వెల్గుతూ ఉండడమే కాక, అగ్నిని ఎప్పుడు పడితే అప్పుడు రెండు ఆరణి ఫుడకల సహాయంతో పుట్టించొచ్చు. అందుకే, అవాదిగా ఉంటున్నా, అగ్ని నిత్య నూతనం. ఇంకో కథనం ప్రకారం, అగ్ని ఆకాశజలం నుండి ఉద్భవించాడు. ఒక ప్రత్యేక దైవంగా వ్యవహరింప బడుతున్నాడు. స్వర్గం నుండి భువికి మాతారిశ్వన్ ద్వారా తీసుకొని రాబడ్డాడు. మరొక కథలో అగ్ని స్వర్గంలోనే పుట్టిందని అంటారు. ఇతనిని త్రిమూర్తుల ప్రతినిధిగా, అప్పుడప్పుడు ద్విజన్ముడిగా పరిగణిస్తారు. అగ్నికి గృహంలో చాలా ఉన్నతమైన స్థానం ఉంది. గృహ యజమాని అగ్నిని తన ఇంటికి వచ్చిన అతిథి దేవుడిగా, ఇంటికి సంబంధించిన బంధువుగా, ద్యుతుడిగా, యజ్ఞయాగాదుల్లో ముఖ్యమైన పాత్రను రిత్విజుడిగా, విప్రుడిగా, పురోహితుడిగా, ఆధ్వర్యుడిగా, బ్రహ్మగా అన్ని పాత్రలను నిర్వహిస్తాడు. అన్ని కార్యాల్లోనూ, చివరికి చనిపోయినతర్వాత దహన సంస్కారానికి కూడ హవ్యవాహనుడు క్రవ్యాదం వరకు ఉన్నతమైన పాత్రను నిర్వహిస్తాడు.

బృహస్పతి దేవతల గురువు. ఇటు ఇంటిలోనూ, అటు బయటా, అన్ని కార్యాలల్లోనూ, అగ్నిలాగ పౌరోహిత్య స్థానాన్ని అలంకరిస్తాడు.

తర్వాత ముఖ్య దేవత సోముడు. ఋగ్వేదంలో సోమయాగం అతి ముఖ్యమైంది. సోమ అనేది ఒక మొక్క నుండి తీసిన రసం. పాలతో గాని, పెరుగుతో గాని, యవలతో గాని కలిపి, ఇంద్రాది దేవతలు రోజుకు మూడుసార్లు

BRAOU

సేవిస్తారు. సోముడికి, నీటికి దగ్గర సంబంధం వుంది. ఈ సోమరసం అమృతం. అది సేవించడం వల్ల, మరణం వుండదు. సోముడు సకల ఓషధులకు, వనస్పతులకు నాయకుడు.

'పృథ్వి' ప్రకృతిలోని మరొక దేవత. పృథ్వి అంటే భూమి. భూమి మీద ఉన్న సరస్వతి మొదలైన పుణ్యనదులు, పర్వతాలు, చెట్లు చేమలు, ఇతర ప్రకృతి సహజ వస్తువులు ఈ దేవతను ఉన్నతం చేస్తాయి.

సురలకు దేవతలకు వ్యతిరేకులు అసురులు లేక రాక్షసులు. రాక్షసులు సకల కష్టాలకు, పాపాలకు, దుఃఖాలకు, రోగాలకు కారణమౌతూ, దేవతలతో నిరంతరం ఘర్షణకు తలబడ్డారు.

6.5 వైదిక మతం – కర్మకాండలు

వైదిక మతంలోని వేల్పు (దేవతలు) లందరికి మానవాకృతి ఆపాదించగానే, మానవులకున్న బలహీనతలు కూడా ఆపాదించడం జరిగింది. అందువల్ల, వారిని ప్రసన్నం చేసుకోవాలని, ఆగ్రహం కల్గించకూడదని, వారిని చల్లబర్చి, సంతోషపర్చాలని, సంతృప్తి పర్చాలని, తమకున్నదంతా సంపద గాని, శక్తి సామర్థ్యాలు గాని ఈ వేల్పుల కుపయోగపడేలా సమర్పిస్తే, వారు తమను తప్పకుండా కాపాడుతారన్న నమ్మకం బలంగా వ్యాపించింది. అయితే, తాము భూలోకంలో సమర్పించినవన్నీ స్వర్గంలో వున్న దేవతలకు ఎలా చేరతాయి? ఎవరు తీసికెళతారు? అనే ఆలోచనల్లో అగ్ని, ఆకాశాన్ని అంటుతూ వ్యాపించే మంటలు, పొగ ద్వారా పంపవచ్చని వారు భావించారు. అంటే, అగ్ని భూమి మీద మనిషికి, స్వర్గంలోని దేవతలకు సుధ్యవర్తిగా వ్యవహరిస్తాడనే నమ్మకం ఉండేది.

ఋగ్వేదంలో యజ్ఞయాగాది కర్మకాండల ద్వారా, మనిషి దేవతను ప్రసన్నం చేసుకొని, తనకు కావల్సిన కార్యాన్ని జరిపించుకోవాలని చేసినట్లు తెలుస్తోంది. తరచుగా చేసే కొన్ని కర్మకాండలు ఏమిటంటే, ఉభయ సంధ్యల్లో అంటే ఉదయం, సాయంకాలం నిర్వర్తించే కొన్ని సంస్కారాలు, పౌర్ణమి, అమావాస్యల రోజుల్లో జరిపేవి కొన్ని చతుర్మాస సంస్కారాలు, ఋతువుల పరంగా నిర్వర్తించే సంస్కారాలు మొదలైనవి మరికొన్ని మనిషి జీవితంతో ముడివేసుకొన్నవి. జననం, వివాహం, జీవితంలోని ఇతర ముఖ్య సందర్భాలు, మరణించిన వారికి చేసే సంస్కారాలు పితృదేవతారాధన, గృహప్రవేశ కార్యక్రమం, పశుపోషణ, వ్యవసాయాది కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరగడానికి ప్రార్థనలు మొదలైనవన్ని గృహ్యకర్మలు తప్పనిసరిగా ఆచరించవలసినవి. అహితాగ్ని ఇంటిలోని రుగ్మతలను నయం చేయడానికి నిత్యం ఇంటిలో వెలుగుతూ ఉంటుంది. పాలుగాని, ధాన్యం గాని, నేయిగాని, మాంసంగాని గృహస్థు ఒక పురోహితుని సహాయంతో, ఈ అగ్నికి సమర్పించడం జరుగుతుంది. ఈ వైదిక కర్మకాండలను వేద, వనిక తేడా లేకుండా, ఎవరి శక్త్యానుసారం చేసేవారు. మొదట్లో ఈ కర్మకాండలు ప్రార్థనతో కూడుకొని ఉండేవి. కాలక్రమేణ, శత్రువులను జయించడానికి, భయంకర వ్యాధులను నయం చేయడానికి, క్రూర జంతువులను అణచడానికి, కర్మకాండలను నిర్వర్తించడం మొదలుపెట్టారు. ఋగ్వేద కాలం నుండి పెద్ద యజ్ఞ యాగాదులతో బాటు, చిన్నచిన్న గృహ సంబంధ కర్మకాండలు అభివృద్ధి అవుతూ వచ్చాయి. వాటిని ఎలా నిర్వహించాలో ఖచ్చితంగా తెలియడం కోసం బ్రాహ్మణాలు రచింపబడ్డాయి. ఒక ఇంటికి పరిమితమైన అహితాగ్ని ఇప్పుడు ఎన్నో యజ్ఞకుండాలుగా వ్యాపించింది. ఈ యజ్ఞయాగాలను నిర్వహించడానికి వాఙ్గ వర్గాలకు చెందిన నల్గురు నాయక పురోహితుల ఆధ్వర్యాన ఏర్పడ్డారు. అసలు యజ్ఞం నిర్వహించే యజమానికి ఖర్చును భరించడం తప్ప, వేరే ఏ పనుండదు. పెద్దెత్తున నిర్వహించే కర్మకాండలను శ్రౌతకర్మలు, స్మృతి మీద ఆధారపడి నిర్వహించేవని, గృహ సంబంధమైన చిన్నచిన్న కర్మకాండలను 'స్మార్త' లేకపోతే

BRAOU

'స్మృతులు' అంటే, జ్ఞాపకశక్తి ఆధారంగా నిర్వహించ బడేవి అనేవారు. అయితే, గృహ్యసూత్రాలుగ చెప్పబడుతున్న వీటిని సాంప్రదాయబద్ధంగా నిర్వర్తించడమే గాని, దివ్య వరాలను (divine sanctions) ఆశించి కాదు.

ఇక నాల్గు వర్గాల పురోహితులు ఎలా నిర్వహిస్తారంటే,

1) హోత్రి (Invoker) – దైవాలను ప్రస్తుతిస్తూ, యజ్ఞానికి ఆహ్వానిస్తూ, ఒక శాస్త్ర పద్ధతి ప్రకారం నిర్వహించడం

2) ఉద్గాత్రి (Udgatri or Chanter) అన్న వ్యక్తి ప్రతి దశలోను కార్యక్రమాన్ని తగిన విధంగా నిర్వహించడానికి మంత్రాలు పఠిస్తాడు.

3) యజ్ఞం ఎవరి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందో ఆయన ప్రార్థనా మంత్రాలను వరుసగా ఏకకాలంలో పఠిస్తూ నిర్వహించడం.

4) ముఖ్య పురోహితుడు జాగ్రత్తగా యజ్ఞ నిర్వహణను గమనిస్తూ, పొరపాట్లు రాకుండా ఏ దేవతకూ ఆగ్రహం కలగకుండా చూస్తూ ఉంటాడు.

ఈ నల్గురూ వాళ్లకు సంబంధించిన కార్యాల్లో నిష్ణాతులై ఉండాలి. అంటే హోత్రి యజ్ఞాన్ని జరిపించడంలోను, ఉద్గాత్రి సామవేదంలో సంగీతపరంగా గానం చేయగలిగి ఉండాలి.

శ్రౌత యజ్ఞాలు

ఈ యజ్ఞాల్లో మొదటి రకం సోమయాగం. సోమ, ఇంద్రులను ప్రసన్నం చేసుకొనేందుకు చేపట్టిన యజ్ఞం. అయితే, ఇది ధనికులకు, రాజులకు మాత్రమే అందుబాటులో ఉండే యజ్ఞం. ఈ యజ్ఞాన్ని విశాలమైన ఆవరణలో, మూడు నిత్యాగ్ని కుండాలతో, నల్గురు ముఖ్య పురోహితులు విరివిగా దక్షిణలు అందుకుంటూ ఎన్నో వైదిక కర్మకాండలను జరిపిస్తారు.

రెండో రకం యజ్ఞం, రాజసూయ యాగం. రాజ వైభవాన్ని చాటి చెప్పే యాగం. అగ్ని, సోమ అగ్ని ఆరాధనకు, బృహస్పతి, సోమ బ్రాహ్మణ ప్రార్థనకు, ఇంద్ర మహాభిషేకం బ్రాహ్మణ క్షత్రియ అధికారాలను పంచుకోవడానికి అని చెప్పబడ్డాయి. అంటే, సామాజిక, రాజకీయ పరిస్థితులను సంతులనం చేయడానికని చెప్పవచ్చు. ఇప్పుడే మనిషి చేతల కన్నా, జ్ఞానానికి ప్రాముఖ్యతనివ్వడం జరిగింది. బ్రాహ్మణులు భౌతిక ప్రపంచంలోని పరిస్థితులు తాత్కాలికమని, శాశ్వత సుఖాలు పొందాలంటే, భగవంతుని ప్రసన్నం చేసుకోవాలని, అతడు విరాట్ పురుషుడని, హిరణ్య గర్భుడని ఇంకా ఎన్నో పేర్లతో పిలుచుకొంటూ, సృష్టి అంతా అతనిలోని భాగాలే అని ఆరాధించడం ప్రారంభించారు.

వాజపేయ యాగం మూడో రకమైన యాగం. రథాల పోటీతో వైభవంగా జరిపించబడేది.

ఇంకో యాగం పేరు మహావ్రత. దక్షిణాయన కాలం సందర్భంగా నిర్వహించబడేది.

అశ్వమేధ యాగం అనేది, చిన్న యాగం. కాని, పెద్దెత్తున నిర్వహించబడేది.

తొలి వేద కాలంలో ప్రకృతి ఆరాధన ఎక్కువగా, యజ్ఞ యాగాది క్రతువులు తక్కువగాను కన్పిస్తుంది. మలి వేద కాలంలో ఏకేశ్వరోపాసన ఒకవైపు, వివిధ కర్మకాండలు వ్యాపించడం మరోవైపు కనిపిస్తాయి.

BRAOU

క్రమేపీ ఈ కర్మకాండల నిర్వహణ క్లిష్టంగా రూపొందడం ప్రారంభమైంది. గృహ నిర్మాణం గృహ ప్రవేశం సందర్భంలో మనిషిని బలిస్తే, ఆ గృహం కలకాలం చెక్కు చెదరకుండా ఉంటుందని నమ్మకమేర్పడింది. అయితే, పురుష సూక్తంలో మానవబలుల ప్రసక్తి లేదు. ఐతరేయ బ్రాహ్మణంలో చరిత్రకు పూర్వ కాలంలో మానవబలులు జరిగేవని వర్ణించబడింది. కానీ, క్రమేపీ జంతుపులు సర్వసాధారణమయ్యాయి. పురోహితుడు మనస్ఫూర్తిగా, ఆయాచితంగా, సాధారణంగా కాక ఆడంబరంగా, ఎన్నో కోరికలు తీర్చుకోవడానికి నిర్వహించడం ప్రారంభమైంది. అలాగే, పురోహితుడు ప్రజల సమ్మకాన్ని ఆసరాగా తీసుకొని, యజ్ఞ నిర్వహణలో కావాలని పొరపాట్లు చేయడం, యజ్ఞకర్తలను ఇబ్బంది పెట్టడం ప్రారంభమైంది. యజ్ఞం నిర్వహిస్తున్నప్పుడు మంత్రోచ్చారణ సరిగా జరగకపోతే, వాటి అర్థం మారిపోయి, దేవతల ఆగ్రహానికి గురౌతారు. అయితే, యజ్ఞయాగాదులకున్న శక్తితో దేవతలను కూడ అదుపులో పెట్టగలదన్న నమ్మకం, నెమ్మదిగా చిన్నచిన్న దేవతల నిర్మ్మాణానికి కారణమైంది. ప్రజాపతి సృష్టికర్తే కాని, మహాదేవుడైన రుద్రునిలాగ ప్రజలు కొలిచే దైవం కాదు. అలాగే, విష్ణువు రుద్రుని తర్వాత అన్ని యజ్ఞయాగాల్లో ఉన్నత స్థానం ఆక్రమించడం జరిగింది. గంధర్వులు, నాగులు, అప్సరసలు రెండో తరగతి దైవాలుగా దిగిపోయారు. నాగపూజ బహుశ దస్యుల నుండి గ్రహింపబడి ఉండాలి. దేవాసురుల మధ్య యుద్ధం ప్రారంభమైంది ఇప్పటి నుండే..

వేదత్రయంలో గల శ్లోకాల్లో మనిషి ఎలా దైవాలను తనకనుకూలంగా తిప్పుకోగలడో వివరించబడింది. ఈ వేదాలకు ఎదురు ప్రశ్నలు వేసేవారే లేరు. బ్రహ్మన్ సృష్టికర్త, సృష్టికి కారణం. ఇవన్నీ వేదాల్లో విశదీకరించడం వల్లే, పురుషసూక్తంలోని సృష్టి విధానాన్ని అందరూ అంగీకరించారు (R.V. X. 90).

బ్రాహ్మణాల్లో మనిషి జీవితం అంటే, నిర్వర్తించవలసిన విధులు. బాధ్యతలతో కూడుకొనుందని చెప్పబడింది. మనిషి జన్మలో ఋణగ్రస్తుడవడం వల్ల, అది తీరడానికి కొన్ని బాధ్యతలు స్వీకరించి, విధిగా నిర్వర్తిస్తాడు. ఈ ఋణ పడటం అనేది, భగవంతుడికి, ఋషులకు, తోటి మనుష్యులకు, ఇంకా ఇతర జీవాళికి ఉంటుంది. ఈ ఋణం తీరడం కోసమే దేవుడిని పూజించడం, వేద పఠనం చేయడం, చనిపోయిన దగ్గరి బంధువులకు సంస్కారాలు చేయడం, అతిధి సత్కారం, భూత ప్రేతాదులకు సంస్కారం లాంటివి చేస్తారు. అలా ప్రతి పనికి వెనక గొప్ప ఆశయాలు, విలువ ఉన్నాయి. స్వార్థరహిత జీవితం చాలా అవసరం. సర్వమేధ అనే సంస్కారంలో మనకున్న సర్వస్వం త్యాగం చేయడం వల్ల, ఆత్మకు విమోచనం కల్గుతుందని నమ్మకం. మంచి పనులు చేయడం, భగవత్ ధ్యానం చేయడం మంచి జీవితానికి ప్రతిబింబాలు. సత్య పరిపాలన వాక్కర్మల్లో ఆచరించవలసిన నైతిక ధర్మం. అయితే, బ్రాహ్మణాల్లో మరీ ఎక్కువగా ఆడంబరంగా కర్మకాండలు చేయడం వల్ల ప్రతిస్పందన వ్యతిరేకంగా రావచ్చునన్న హెచ్చరిక లేకపోలేదు. మానసిక పవిత్రత చాలా అవసరం. అది సాధించాలంటే చేసిన తప్పును ఒప్పుకొని, పశ్చాత్తాపపడాలి. సత్యం ధర్మ పరిపాలన, తలిదండ్రుల మీద గౌరవం, తోటివారిని ప్రేమగా చూడడం, మోసం, దొంగతనాల నుండి దూరంగా ఉండటం, హింసా దుష్కార్యాలకి పూనుకోకుండా ఉండడం లాంటివి మంచి జీవితానికి సోపానాలు.

ఋగ్వేద బ్రాహ్మణాల్లో స్వర్గం అంటే ఏమిటో వివరించారు. అధర్వణ వేదంలో చనిపోయినవాడు ఎలా మరుత్తుల ద్వారా హాయిగా చల్లని గాలులు వీస్తుంటే, తన పితృదేవతలను చేరడానికి ప్రయాణం చేస్తాడో వివరించారు. వాళ్ళను చేరుకోవాలంటే, భూమి మీదున్న వారి బంధువులు కొన్ని సంస్కారాలు చేయాలి. అవే శ్రాద్ధకర్మలుగా తర్వాత సాంప్రదాయమై పోయాయి. ఋగ్వేద బ్రాహ్మణాల్లో నరకలోక దర్శనం కూడా జరుగుతుంది. నరక జీవితం భూత పిశాచాలతో కన్ను పొడుచుకొన్నా కనబడని చీకటిలో ఎన్నో కష్టాలకు గురి చేస్తుంది. చివరికి మనకర్థమయ్యే సత్యమేమిటంటే, మనిషి తను చేసిన మంచి పనులవల్ల స్వర్గం దర్శించగలడు. చెడు పనులైతే నరకం ప్రాప్తించగలదు. మళ్ళీ మళ్ళీ హీనాతిహీనమైన జన్మ లభించగలదు. కనుక, మనిషి తన కర్మను తానే నిర్ణయించగలడు. ఆ విధంగా భవబంధాల నుండి విముక్తుడవాలంటే, జన్మరాహిత్యం పొందాలంటే

RRAO U

బ్రహ్మజ్ఞానం పొందాలి.

అరణ్యకాలు

బ్రాహ్మణాల్లో పొందుపర్చిన విపరీత కర్మకాండలను ఎదుర్కోవల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడు అరణ్యకాలు ఉద్భవించి, సరైన విధంలో ముఖ్య కర్మకాండలు నిర్వర్తించవల్సిన విధానాన్ని వివరించాయి. తపస్సు కర్మకాండల కన్నా ముఖ్యమన్నాయి. అలా మనిషిని కర్మమార్గం నుండి జ్ఞానమార్గానికి తీసుకెళ్ళడానికి అరణ్యకాలు, తర్వాత ఉపనిషత్తులు ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ కర్మకాండలను, బ్రాహ్మణ ఆధిపత్యాన్ని వ్యతిరేకించినవారు, ఆనాటి సమాజంలోని ఇతర వర్గాలవారు. ఈ పరిస్థితే, తర్వాత చతురాశ్రమ ధర్మానికి దారితీసిందని భావించవచ్చు. ఉపనిషత్తులన్నీ జ్ఞానమార్గం ద్వారా, దేవుడిని చేరే తత్వాన్ని బోధిస్తాయి. బ్రహ్మన్ – ఆత్మ ఒకదానితరో ఒకటి ఐక్యమవ్వాలని చెప్తాయి. అవే, ఉపనిషత్తుసారం అని అంటున్న తత్వమసి(Tattvamasi = Thou art that) అన్నమాట. ఈ ఉపనిషత్తు తత్వం అర్థం చేసుకోవడానికి మనిషి చాలా ఎదగాలి.

సూత్ర వాఙ్మయం

ఒక వైపు ఉపనిషత్తులు మనిషి జీవితానికి అర్థం పరమార్థం చెపుతూంటే, అవి అందుకోడానికి సులువైన మార్గాలు కర్మకాండలని, వాటిని శ్రౌత, గృహ్య సూత్రాల్లో విశదీకరించారు. శ్రౌత కర్మకాండలకు మూడు అగ్నిహోత్రాలు, పదహారు పదిహేడుమంది పురోహితులు (బలిని నిర్వహించే పురోహితులు లెక్క పెట్టకుండా) మరీ ఎక్కువగా కాకున్నా, ఒకటి కంటే ఎక్కువమంది దేవతల ఆరాధన, ఇతర కార్యక్రమాలుంటాయి. శ్రౌత కర్మల్లో రెండు రకాలున్నాయి. సోమకర్మ సామగానంతో నిర్వహించబడుతుంది. రెండవది, హవిర్ యజ్ఞం. సామగానం వీలులేకపోయినపుడు నిర్వహించేది. ఈ రెండిటి మధ్య జంతుబలులు వస్తాయి.

గృహ్య సూత్రాలు గృహ వాతావరణంలో, గృహస్తులు నిర్వహించే కర్మకాండలు. ఇంటిలోని ప్రతి వ్యక్తి నిత్యాగ్నిహోత్రం ఇంట్లో వెలుగుతూ ఉండేట్లు చూడాలి. అదిగనక బరక్క పోతే, తిరిగి ఒక ప్రత్యేక సంస్కారం ద్వారా, ఒక ధనవంతుడి ఇంటి నుండి అగ్నిహోత్రాన్ని ఇంటికి తీసుకురావాలి. సాధారణంగా, గృహ వాతావరణంలో జరిగే ఇతర సంస్కారాలు జరిపేటప్పుడు అగ్ని అవసరమౌతుంది. ఇంటి పెద్ద మరణించినపుడు, పెద్ద కుమారుడు కొత్త అగ్నిని తయారు చేసినపుడు, 12 రోజులు వరుసగా అగ్ని వెలగకపోతే, మళ్ళీ వెలిగించినపుడు, గృహస్తు అతని భార్యతో ఉదయం, సాయంత్రం నిర్వహించాలి. అవసరమనుకుంటే, పురోహితుడిని నియమించుకోవచ్చు. అయితే, పురోహితుల అవసరం పెద్ద యాగాలైన 'సూలగవ' (spit), 'ధన్వంతరి' యాగం నిర్వహించినపుడు ఒక్కొక్కప్పుడు పురోహితుని పిలవలేకపోయినపుడు ఆయన రూపంలో ఒక గడ్డిబొమ్మగాని, ఒక ఉత్తరీయంగాని పెట్టి, ఆయన ఉనికిని భావిస్తూ కార్యక్రమాన్ని పూర్తి చేయాలి. దేవతారాధన సమయంలో, వండిన పక్వాహారాన్ని సమర్పించేటప్పుడు యజ్ఞోపవీతాన్ని ఎడమవైపు నుండి కుడివైపుకు వేసుకొని, సవ్యమైన రీతిలో సమర్పించాలి. అదే పితృదేవతారాధన సమయంలో అపసవ్యంగా ఉంటుంది. పక్వాహారంతోబాటు దేవతారాధనకు సమర్పించేవి పాలు, పెరుగు, కరిగించిన వెన్న, వరి, యవలు, నువ్వులు, గంజి, జంతు మాంసం సందర్భాన్ని బట్టి ఉంటాయి. సంస్కారాల పేరిట ఎన్నో కోరికలు తీర్చుకోవాలనుకోవడమే కాక, చేసిన పాపాలు పోగొట్టుకోవాల్సిన తపన కూడా ఉంది. ప్రాయశ్చిత్తం అనే కార్యం ద్వారా, కొంతవరకు చేసిన పాపానికి లేదా చెడ్డపనికి పరిహారం చెల్లించబడుతుంది. చేసిన పాపం చెబితే తీరుతుందన్న మాట మనకు అనుభవమే.

ఈ కర్మకాండల్లో అగ్ని నిర్వహించే పాత్ర చాలా ఉన్నతంగా చెప్పబడింది. అగ్ని మనిషి చేసిన పూజలను దేవునికి

అందించే దూత లేదా వారధిగా ఉండడమేగాక, దుష్టశక్తులను తరిమికొట్టే శక్తిగా ప్రత్యక్షసాక్షిగా కూడా పూజింపబడుతున్నాడు. అలాగే, జలదేవతలకు నీటిలోను, రుద్రుడు, ఇతర దైవాలకు చీమలపుట్టలలోను, చెట్లకొమ్మలకు వేళ్ళాడగట్టడం, గాలిలో ఎగరేయడం లాంటి పద్ధతుల్లో కానుకలు సమర్పిస్తారు.

అగ్ని పురోహితుడిగా, హోత్రుడిగా ఋగ్వేద కాలం నుండి వస్తున్నా, కాలక్రమాన పురోహితుల ప్రాబల్యం పెరిగింది. శ్రౌత సూత్రాలైన సాంఖ్యాయన, అశ్వలాయన, కాత్యాయన సూత్రాల్లో, హోత్రి, పోత్రి, నేష్ట్రీ, అగ్నీద్ (Agnidh) ఆధ్వర్యుయు, బ్రాహ్మణుడు, ఉపవక్త్రి, అచ్ఛావాక, ప్రశాస్థి మొదలైన అన్ని రకరకాల పురోహితులు కనిపిస్తారు. వీరందరు ఒకరికొకరు సహాయపడడం, ఆధ్వర్యుడన్నవాడు మొత్తం కర్మకాండను తన ఆధ్వర్యంలో జరపడం కన్పిస్తుంది. ఇలా జరపబడే అన్ని పెద్ద కార్యాలకు పురోహితుల అవసరం పెరిగి, వారి స్థాయి పెరిగింది.

ఈ కర్మకాండలకు, మంత్రతంత్రాలకు సంబంధముంది. ఒక ప్రత్యేక సమయ సందర్భాల్లో సాయంత్రంగాని, రాత్రిగాని శ్మశానాల్లో వాటిని ప్రయోగించి, దేవతలను ఆరాధించడం. ఇది సాధారణంగా దుష్టశక్తులను తరమడానికి, అన్యాయం చేసినవాడిని శిక్షించడానికి మంత్రించిన జలం చేతిలోకి తీసుకొని, మంత్రాలు చదువుతూ అవతలివారి మీద చల్లడం జరుగుతూంటుంది. దివ్యదృష్టి ఉండటం కూడా వాడుకలో ఉంది. అయితే, ఇలాంటి శక్తులేవీ నీతికి విరుద్ధంగా ఉపయోగించకూడదని, అలాగే స్వచ్ఛత, దీక్ష, పట్టుదల, దయ గల మనస్తత్వం కర్మకాండల కన్నా ఉత్తమమైందని గౌతమ ధర్మశాస్త్రం చెబుతోంది. అంటే, మనిషి తన జీవితాన్ని తానే తీర్చి దిద్దుకోవాలన్నమాట. ధర్మార్థ కామ మోక్షాలు పురుషార్థాలు. అంటే మానవతా విలువలన్న వేదవాక్కు ఎప్పటికీ ఆచరణీయమైంది.

6.5.1 సంస్కారాలు

వైదిక మతంలో సంస్కారాలకు అత్యున్నత స్థానం కల్పించబడింది. మానవ జీవితంలో తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండి మరణం వరకు, ఆ తర్వాత కూడా, ఆత్మ భగవంతుని చేరుకొనేవరకు జరిగే ఈ సంస్కారాలు మనిషిని భౌతికంగా, శారీరకంగా, మానసికంగా పునీతుని చేస్తాయన్నది, గాఢమైన నమ్మకం. ఈ సంస్కారాలు జరిపిన తర్వాతే, మనిషికి సమాజంలో గుర్తింపు, ఎదుగుదల, పవిత్రత, ఇతర కార్యాలు చేయడానికి అర్హత లభిస్తాయి. వేదాల నుండి మొదలై, బ్రాహ్మణాల్లో కల్పసూత్రాల రూపంలో వివరించబడ్డాయి. వైదిక యజ్ఞయాగాదులు శ్రౌత సూత్రాల్లో వివరించబడితే, నిత్యం మనం జరిపేవి గృహ్య సూత్రాలు. వాటిలో కొన్ని ముఖ్యమైనవి. 1) ఆపస్తంభ, 2) ఆశ్వలాయన, బౌదాయన (Boudayana), భరద్వాజ, గోభిల (Gobhila), హిరణ్యకేశీయ, జైమినీయ, ఖాదిర (Khadira) మానవ, పరస్కార, శంఖ్యాయన, వరాహ గృహ్య సూత్రాలు. ధర్మశాస్త్రాలు కూడ గృహ్యసూత్రాలకు అనుబంధాలే.

సంస్కారాలు మొత్తం నలభై. అవి : 1) గర్భాదాన 2) పుంసావన 3) సీమంత 4) జాతకర్మ 5) నామకరణ 6) అన్నప్రాశన 7) చౌల 8) ఉపనయన 9) ప్రజాపత్య 10) సౌమ్య 11) ఆగ్నేయ 12) విశ్వదేవ 13) సామవర్తన 14) వివాహ 15) దేవయజ్ఞం 16) పితృయజ్ఞం 17) మనుష్య యజ్ఞం 18) భూత యజ్ఞం 19) బ్రహ్మ యజ్ఞం 20) అన్వష్టక 21) పర్వణ 22) స్థాలీపాక 23) ఆగ్రహామని 24) శ్రవణి 25) చైత్రి 26) అశ్వయుజ 27) ఆగ్ని అధాన 28) అగ్నిహోత్ర 29) పూర్ణాంశ 30) అగ్రయాన 31) చతుర్మాస 32) నిరద్ధ పాశుబంధ 33) సంతారమని 34) అగ్నిసోమ 35) అత్యగ్ని సోమ 36) ఉక్థ్య 37) షోడశి 38) వాజపేయ 39) అతిరత్న 40) అబ్దోర్యాయ.

BRAOU

మరికొంతమంది 48 సంస్కారాలు చెప్పారు. ఈ సంస్కారాలు మనిషి చతురాశ్రమ జీవితంతో ముడివేసుకొన్నాయి. బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వనప్రస్థానం, సన్యాసం మొదలైనవి చతురాశ్రమాలు.

ఈ సంస్కారాలు జరిపేటప్పుడు మనకు కనబడే కొంతమంది దేవతల్లో, అగ్ని గృహాన్ని, కుటుంబాన్ని రక్షించే ప్రత్యక్ష సాక్షి. హోమాగ్ని ఇంకో రూపం. యాగం చేసినపుడు ఉపయోగిస్తారు. తర్వాత చెప్పవల్సిన దేవత వరుణుడు. జలం కొంచెం చిలికినంత మాత్రాన పాపాలను కడిగేస్తుంది. సరైన మంత్రాల ద్వారా, ఆయా దేవతలను అర్చించి, కష్టాలను తొలగించుకొని, కోరికలను తీర్చుకోవడం జరిగేది. ఒకవేళ మన ప్రార్థనలు సర్వ సంక్షేమం, మోక్షప్రాప్తికై తే గాయత్రీ మంత్రం పఠించడం జరిగేది. కొన్ని మంత్రాలతో పురోహితులు దీవనలను అందజేస్తారు.

కొన్ని సంస్కారాల్లో కొన్ని పద్ధతులను విధిగా పాటిస్తారు. ఉదాహరణకు, ధ్రువ నక్షత్రాన్ని చూడడం, నువ్వులు వాడడం, వివాహాల్లో పాణిగ్రహణం చేయడం. అలా చేతులు కలపడం వల్ల, బాధ్యతలను స్వీకరించడం లాంటి పద్ధతులున్నాయి.

ఇంకా, శుచి శుభ్రతలకు ఆరోగ్యప్రదమైన పద్ధతుల్లో సంస్కారాలు పాటించడం. శాస్త్రీయపరమైన లాభాలు ప్రతి సంస్కారం వెనకా ఉండడం గమనించవల్సిన విషయం.

6.5.2 పంచ మహాయజ్ఞాలు

ఈ దేవయజ్ఞాలకు మహాయజ్ఞం అన్న పేరువల్లగాని, స్వరూప విస్తారంవల్లగాని, గొప్పతనం ఆపాదించబడలేదు. దేవ యజ్ఞం, పితృ యజ్ఞం, భూత యజ్ఞం, మనుష్య యజ్ఞం అనే ఐదు యజ్ఞాలు ప్రతిరోజూ అనుష్ఠానం, సమాప్తి చేయబడతాయి. ఇతర యజ్ఞాలు వేరే ఏదైనా ఒక రోజు ఆరంభం చేయబడి, ఇంకోరోజు సమాప్తి చేయబడుతుంది. ఈ పంచ మహాయజ్ఞాలు ఒకేరోజు ఉపక్రమేప, ఉపక్రమోప సంహారాలు కనుక, ఇవి ఇతర యజ్ఞాలకు వైలక్షణంగా కనిపిస్తాయి.

దేవ యజ్ఞం

ముఖ్య హవిస్సు లేకపోతే, సమిధనైన అగ్నిలో దేవతలనుద్దేశించి హోమం చేస్తే, అది దేవ యజ్ఞం. ఇది ఒక హోమంతో సమాప్తమౌతుంది.

పితృ యజ్ఞం

పిండదానం ముఖ్యమైంది. అది సంభవించకపోతే, జలంతోనైనా "పితృభ్యస్స్వధాస్తు' అన్న మంత్రంతో సమాప్తం చేయాలి.

భూత యజ్ఞం

వైశ్వదేవం చేసిన తరువాత ఇంటి బయట వాయసాది భూతాలకు (కాకి మొదలైన వాటికి) బృదానం (పిండ ప్రదానం) - భూత యజ్ఞం.

మనుష్య యజ్ఞం

వైశ్వదేవం చేసిన తరువాత 'అతిథీ సేవాగ్నే బోజయెత్' అన్న శాస్త్రానుసారం, ముగ్గురు భోక్తలకు తక్కువగా లేకుండా యధాశక్తి అన్నదానం చేయాలి.

BRAOU

బ్రహ్మ యజ్ఞం

అగ్ని సోమాది సోమ యజ్ఞాలు సంవత్సరానికొకసారి వసంత ఋతువులో చేయబడుతాయి. ఈ బ్రహ్మ యజ్ఞం ప్రతిరోజూ అనుష్ఠానం చేయబడుతుంది కనుక, ప్రతిరోజూ దేవతా ప్రీతికి కారణమౌతూ సర్వశ్రేయస్సులను సిద్ధింపజేస్తుంది.

తన పితృ పితామహ పరంపరగా ప్రాప్తమయ్యే వేదశాఖే స్వాధ్యాయం. "ఆసూక్రాదామ వాకాద్వా బ్రహ్మ యజ్ఞోవిధీయతే" అన్న శాస్త్రానుసారం, అనువాకాది ముఖ్యాధ్యాయనం సంభవించకపోతే, ఒక ఋక్కునైనా, ఒక యజుర్మంత్రమైనా, ఒక సామనైనా అధ్యయనం చేయాలి. ఇది బ్రహ్మ యజ్ఞం. అందువల్ల క్షీరపూర్ణములైన మహా నదులు స్వాధికారంతో దత్తమైన హవిస్సు అయి, ఆద్యేత అయి, పితృదేవతల గూర్చి ప్రవహిస్తాయి.

6.5.3 జననానికి ముందు జరిపే సంస్కారాలు

గర్భాదాన సంస్కారం

మంచి కుమారుడు పుట్టడానికి జరిపే ప్రార్థనా మంత్రాలు, పున్నామ నరకం నుండి తప్పించి, పిత్రూణం తీర్చుకోవడానికి అంగీకరించబడిన సంస్కారం. ధర్మబద్ధమైన గర్భం ధరించడానికి ఏర్పాటైన సంస్కారం.

పుంసావనం

గర్భం ధరించిన రెండు, మూడు లేకపోతే నాల్గవ నెలలో సర్వలక్షణ సంపన్నుడైన పుత్రుని కనాలని మర్రిచెట్టు కాండం నుంచి రసం తీసి, గర్భవతైన స్త్రీ కుడివైపు ముక్కులో వేసి ప్రార్థిస్తారు. దీని వెనుక శుశ్రుతుడి లాంటి వైద్యులు చెప్పిందేంటంటే, గర్భవతిగా ఉన్నప్పుడు ఎలాంటి చికాకులు, ఇబ్బందులు కల్గకుండా ఉండాలని అలా చేస్తారు. అంతేకాదు, గర్భవతి ఎడమచేతి ముంజేతికి రక్షాబంధనం చేస్తారు. ఇంద్రుడు, అగ్ని మొదలైన దేవతలు మంచి పుత్రులు కలగాలని దీవిస్తారని భావిస్తారు.

సీమంతం

గర్భవతికి మొదటిసారి 5-8 నెలల మధ్య జరిపే సంస్కారమిది. తల్లి కాబోతున్న ఆమె ఎలాంటి చికాకులు, అలజడులు లేక, ప్రశాంతంగా త్వరలో పండంటి బిడ్డనెత్తుకోవాలని భావం.

6.5.4 జన్మించిన తరువాత జరపబడే సంస్కారాలు

జాతకర్మ

శిశువు జన్మించిన వెంటనే జరపబడే సంస్కారం. శిశువు జన్మించడానికి తగిన వాతావరణం ఏర్పాటు చేసి, ప్రత్యేకమైన పద్ధతులతో కూడిన సూతిక గృహాలలోకి గర్భవతిని పంపిస్తారు. రెండు రోజులు ముందుగానే శిశుజననం కష్టమైతే, అథర్వవేదంలోని మంత్రపఠన చేస్తారు. ప్రసవం కాగానే, సూతిక అగ్నిని ప్రజ్వలింపజేసి ఆవాలు మొదలైన ఇతర ధాన్యాలు అగ్నిలో వేసి, తల్లీబిడ్డలను పీడల నుండి రక్షించమని ప్రార్థిస్తారు.

శిశువు జన్మించిన వెంటనే, బొడ్డు కోయకుండానే తండ్రి శిశువుని చూసి, అలాగే బట్టలతో చెరువులో కాని, నదిలో కాని స్నానం చేయాలి. అలా స్నానం చేసేటప్పుడు నీటిని తాటి చెట్టంత ఎత్తుకు ఎగిరేలా చేయాలి.

BRAOU

తర్వాత దానధర్మాలు చేయాలి. ఆ తర్వాత తండ్రి శిశువు నోటిలో బంగారు ఉంగరం తేనెలో ముంచి తాకించాలి. దానివల్ల శిశువు మేధ పెరుగుతుందని భావన. శిశువు పేరు కూడా రహస్యంగా చెవిలో చెప్పాలి. దానితోబాటు, శిశువు పదికాలాలబాటు జీవించాలని, శక్తి సంపన్నుడు కావాలని దీవిస్తూ మంత్రం పఠిస్తాడు. తర్వాత శిశువు బొడ్డుకోసి, తల్లి చేతికి ఇచ్చి, తల్లీ బిడ్డల క్షేమం కోరుతూ వరుణుని ప్రార్థిస్తారు.

నామకరణం

ఇది ఎవరి తాహతును బట్టి జరిపే సంస్కారం. అశ్వలాయన చెప్పిన ప్రకారం, మగ శిశువులకు సరి సంఖ్యలో అక్షరాలున్న పేరుండాలని రెండు అక్షరాలు ఉంటే అభివృద్ధి సాధిస్తాడని, నాలుగు అక్షరాలు ఉంటే మతపరంగా ఉన్నతుడవుతాడని చెపుతారు. ఆడపిల్లకు బేసి సంఖ్యలో అక్షరాలున్న పేరు ఉండాలని, పేరు చివర ఇ కారం గాని అ కారం గాని ఉండాలని, పేరు సులభంగా ఉచ్చరింప బడాలని, చెవులకింపుగా, పవిత్రంగా పిలవబడాలని చెప్తారు. సాధారణంగా, జన్మ నక్షత్రాన్ని బట్టి పెద్దవారి పేర్లను కూడా పెడతారు. పురాణకాలంలో దేవతల పేర్లని కూడా పెట్టడం వాడుకై ంది. భక్తి ఉద్యమ కాలం నాటికి, ఈ దేవతల పేర్లను పెట్టి పలుమార్లు పిలవడం, ఉచ్చరించడం జరుగుతుందని, దానివల్ల మేలు కల్గుతుందని భావించారు.

ఈ నామకరణ సంస్కారం సాధారణంగా, పదవరోజు గాని, పన్నెండవ రోజు గాని, ఏడాది లోపున వీలునిబట్టి జరిపిస్తారు. శిశువును ఎత్తుకొని, హృదయానికి హత్తుకొని, పెట్టదలచుకొన్న పేరు మూడుసార్లు చెవిలో చెప్తారు. తర్వాత బ్రాహ్మణులు, పెద్దలు కూడ అలాగే ఆ విధంగా చేసి దీవిస్తారు.

అన్నప్రాశన

అన్నప్రాశన అంటే శిశువు మొదటిసారి వండిన ఆహారం రుచి చూడడం. దీని అంతరార్థం, దేవతలను మంత్రాల ద్వారా ప్రార్థించి, శిశువుకు మంచి ఆరోగ్యం, జీర్ణింప చేసుకొనే శక్తిని, మంచి ఆలోచనలు, తెలివితేటలను ఇవ్వాలని కోరతారు. ఈ సంస్కారాన్ని శిశువు జన్మించిన ఆరు మాసాలకు జరుపుతారు. వాగ్దేవిని ప్రార్థించి, అన్నీ సమర్పిస్తారు. తండ్రి బంగారు ఉంగరాన్ని తీయని పరమాన్నంలో ముంచి, శిశువు నాలికకు ముట్టిస్తారు. తర్వాత తీర్థాన్ని మూలికల్లో ముంచి నోటికి తాకిస్తారు. దీనివల్ల మంచి ఆరోగ్యం కల్గుతుందని నమ్మకం. ఈ సంస్కారం శిశువుకున్న పరిశీలనాశక్తిని, ఆసక్తిని తెలియజేస్తుంది.

చౌలం

చౌలం అంటే, కేశ సంస్కారం. పుట్టు వెంట్రుకలు తీయించడం అన్నమాట. ఈ సంస్కారం శిశువు 3వ ఏట జరపబడుతుంది. తల మీద ఏదై నా పుండు కాని, జబ్బు కాని ఉంటే తప్ప, తలమీద పుట్టినప్పటి వెంట్రుకలను తీసివేయడం, తమ ప్రవరలో ఎంతమంది ఋషులున్నారో అన్ని శిఖలు, లేకపోతే, ఐదు శిఖలు, లేకపోతే ఒక శిఖను ఉంచడం జరుగుతుంది.

శుశ్రుతుడు, చరకుడు చెప్పిన ప్రకారం, ఇలా తల వెంట్రుకలు, పెరిగిన గోళ్ళు తీయడం వల్ల, శారీరక శక్తి పెరుగుతుందని, పవిత్రత, ఆయుష్షు, అందం ప్రాప్తిస్తుందని చెప్తారు. కోరికలు తీరాలని, తలనీలాలు సమర్పిస్తామని మొక్కుకోవడం మనకు తెలిసిందే. ఇది తరువాతి కాలంలో వచ్చిన అలవాటు.

ఒక మంచిరోజు చూసి, మూడు తెల్లని చారలున్న ఏదుపంది తోక మీద ఉన్న వెంట్రుకను రాగి మిశ్రమంతో చేసిన కత్తిని, దర్భలను చేతిలో పట్టుకొని, తండ్రి అన్నివైపుల నుండి వెంట్రుకలను కొద్దికొద్దిగ కోసి

BRAOU

అన్నివై పులకు విసిరేస్తాడు. ఈ సందర్భంలో చదివే మంత్రాలు, వారి బిడ్డకు అన్ని విధాలుగా మేలు జరగాలని, కంటిచూపు, జీర్ణశక్తి సరిగా ఉండాలని, వర్చస్వి అంటే తేజోవంతుడవాలని చెపుతారు.

ఉపనయనం

మగపిల్లవానికి 8, 11 లేక 2వ ఏట మొదటి మూడు కులాలవారిలో జరిపే సంస్కారం. ఇది పిల్లవానికి రెండవ జన్మనిస్తుంది. గురువు దగ్గరకి గాయత్రీ మంత్రోపదేశం ద్వారా బాలుడిని తీసుకొని వెళ్ళే ఈ సంస్కారం వల్ల, వేదాలు అధ్యయనం చేసే అర్హత కల్పిస్తుంది. గురుకులానికి పోవలసిన సమయం వచ్చిందని తెలుస్తుంది. ఉపనయన సంస్కారమంతా ఈ శ్లోకంలో పొందుపర్చబడి ఉంది. వటువుకు ఈ సంస్కారంలో కావల్సిన వస్తువులు ఏమిటంటే,

శ్లో॥ కృష్ణాజినం దర్భమహీచ మౌంజి
ఫాలాస దండం పరివానశౌతి
యజ్ఞోపవీతంచ ధిశంతునిత్యం
వటోస్త్రిరాయువు శుభకీర్తి విద్యాః

అంటే, వటువుకు జింకచర్మం, ఒక ఉత్తరీయం, అంతరీయం, తలకు పాగా, చెపులకు పోగులు, ఒక చేతికర్ర ఉండేవి. ఇవి తనను తాను రక్షించుకోవడానికే కాక దుష్టశక్తులను పారద్రోలడానికి మంత్రదండంలా కూడ ఉపయోగపడేవి. దానికి ఒక ప్రత్యేక కొలత కూడా ఉంది. చేతికర్రతో బాటు ఒక గొడుగు కూడా ఉండాలి.

వేద మంత్రాల సారం గాయత్రీ మంత్రం. ఇది కుడి చెవిలో ఉపదేశించడం అంటే, బ్రహ్మోపదేశం జరిగిందన్నమాట. గురువు మంత్రంతోబాటు, తన శక్తిని కూడ శిష్యునికి ఇస్తాడు. ఈ సంస్కారంలో ఉపయోగించే వస్తువుల్లో ముఖ్యమైనది యజ్ఞోపవీతం. మూడు గుణాలైన సత్య, రజస్, తమస్‌లను అంటే, సత్యం, కామక్రోధాలు, అజ్ఞానం తెలియజేస్తూ, 96 పోగులు (నాలుగు వేళ్ళు అడ్డంగా ఎంత పొడవుగా వుంటాయో అంత పెత్తెడు అంటారు) కొలిచి, త్రిగుణితం చేసి, 'అపోహిష్ఠా' త్యాది మంత్రాలతో తడిపి, శుద్ధమైన ప్రదేశంలో లేకపోతే, గుడిలో గాయత్రి మంత్రంతో తిరిగి త్రిగుణం చేసి, మొత్తం తొమ్మిది పోగులు చేసి, దాన్ని పటుడికి ధరింపజేస్తారు. అప్పటి నుండి అన్ని కర్మలు చేయడానికి అతడు అర్హుడౌతాడు. ఉపనయనం సందర్భంలో, వటువు తల్లితో భోజనం చేసే సాంప్రదాయముంది. దీన్ని 'మాత్రాస ఉపనయన కుమార భోజనం' అని అంటారు. ఈ సమయంలో కొన్ని ప్రమాణాలు చేయాలి.

1) చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకొంటానని,

2) పేరు ప్రఖ్యాతులు గడిస్తానని,

3) నిర్మాణాత్మక కార్యాలను చేస్తానని,

4) దానధర్మాలు నిర్వహిస్తానని,

5) దేవతలను ప్రసన్నులుగ చేసుకొంటానని

6) తననుసరించే వారిని తృప్తి పరుస్తానని

RAO U

7) తనమీద ఆధారపడేవారిని రక్షిస్తానని

8) గృహస్తు అయి, సంసారాన్ని పెంపొందిస్తానని

9) సమానత్వాన్ని నిలబెడతానని

10) పెద్దలను గౌరవించి, సేవిస్తానని.

దీనివల్ల, పటువుకు బ్రహ్మచర్యంలో 'ప్రణవం' అంటే, భగవంతుడు, మేధ, శ్రద్ధ ఉండాలని, నియమబద్ధమైన జీవితం, ఆహ్నికాలతో, సంధ్యావందనాలతో గడపాలని తెలుస్తోంది.

వివాహం

లోకంలో పురుషార్థాలు ధర్మ, అర్థ, కామ మోక్షాలు అని నాల్గు విధాలు. వీటిలో మోక్ష రూప పురుషార్థానికి స్త్రీ సాంగత్యం అనపేక్షితం, అంటే, పనికిరాదు. మిగిలిన మూడు పురుషార్థాలకు స్త్రీ సంబంధం అపేక్షితమే. అందుకే, ధర్మార్థ కామ పురుషార్థాల కోసమే, వివాహ సంస్కారం ఏర్పడింది.

వరుడు "పాణిగ్రహణాఖ్యం కర్మ కరిష్యమాణః" అని వివాహానికి సంకల్పించిన వెంటనే, యోగ్యులు కుశలులు, చతురులు, గుణవంతులైన నల్గురు విప్రులు కన్యాదాత దగ్గరికి దూతలుగా పంపబడతారు. వారు దేవ ఋణ విముక్తి హేతువైన ధర్మ సంపత్తి కోసం, పితృ ఋణ విమోచన సాధనమైన సంతానం, కాము పురుషార్థం కోసం కన్యను కోరుతున్నామని చెప్తారు. కన్యాదాత అంగీకరించి, 'తస్మైదాస్యామి' అంటే, అంగీకరించానని, 'తిరాహ, త్రిష్యతాహి దేవాః' అని మూడుసార్లు పలకాలి.

తర్వాత తండ్రి లేక కన్యాదాత "ఇతికన్యాం ఉదక పూర్వకం దద్యాత్" అని కన్యను మహా విష్ణువుగ భావించబడిన వరునికి సమర్పిస్తారు. ఇది కన్యాదాన సంస్కారం. కన్యాదాత "ధర్మేచ, అర్థేచ, కామేచ త్వయ్యేషా నాతి చరితవ్యా" అని అంటే, వరుడు ఆ మాటలు తిరిగి ఉచ్చరించి, 'నాతిచరామి' అని అంగీకారాన్ని తెలియజేస్తాడు.

కన్యాదానం చేస్తునపుడు కన్యాదాత ఇతర దానాలులాగ హక్కు వదులుకోడు కనక, పండగలకు, పురిటికి కుమార్తెను అత్తవారింటి నుండి పుట్టింటికి తీసుకొని రావడం జరుగుతోంది.

వివాహ సంస్కారంలో మనకు తెలియవచ్చే విశేషాలెన్నో ఉన్నాయి. ఉదాహరణకు, పాణిగ్రహణం ఒక ఒప్పందం, బాధ్యతను వరుడు తీసుకొంటూ, సరస్వతిదేవిని ప్రార్థిస్తాడు.

లాజహోమం జరుపుతున్నప్పుడు వేయించిన ధాన్యం అగ్నికి సమర్పించి, వధువు వరుని కొరకు ప్రార్థిస్తుంది.

సప్తపది సమయంలో ఏడడుగులు భర్తతో వేస్తూ, సర్వకాల సర్వావస్థలో కలిసిమెలిసి ఉండాలని ప్రార్థిస్తుంది. తర్వాత కుమార్తెకు బుద్ధి, నీతులు చెపుతూ, తండ్రి వరునికి అప్పగిస్తాడు. ఆ విధంగా వధూవరులు గృహస్థాశ్రమాన్ని స్వీకరిస్తారు.

వివాహ సమయంలో దర్భలను వలయాకారంలో తయారుచేసి, పెండ్లికుమార్తె శిరం మీద ఉంచి, కాడి రంధ్రం నుండి బంగారాన్ని ఉంచి, ఉదకాన్ని వీటిని "హిరణ్యవర్ణాశ్చయుః" అన్న మంత్రంతో స్నానం చేయిస్తారు. ఆ విధంగా, ఆయుష్ష, తేజస్సు, వర్చస్సులకు సాధనమైన హిరణ్యమును ఏకృతంలో కాడి రంధ్రంలో ఉంచి, సువర్ణం ద్వారా ఉదకం వధువు శిరస్సు మీద పడడం వల్ల సుఖ సంధాయకమని శ్రుతి తెలియజేస్తోంది.

BRAOU

సుముహూర్త సమయంలో, జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని వధూవరులు ఒకరి శిరస్సు మీద మరొకరు పెట్టి హస్తాలతో అణచి పట్టుకొంటారు. దానిలోని విశేషమేమిటంటే, జీలకర్ర ముదిమిని రాకుండా చేయడమే కాకుండా, మంగళప్రదమైనది కూడా. బెల్లం రుగుణోపేతమైందే కాకుండా ,పవిత్రమైంది కూడ. అందువల్ల ఆ మిశ్రమాన్ని వధూవరుల శిరస్సుల మీద ఉంచడం వల్ల, ఒక ద్విజాతీయమైన సంస్కారం కల్గుతుంది. వివాహంలో "ఆశాసానా" అన్న మంత్రంతో స్త్రీకి యోక్త్ర బంధనం అంటే, నడుముకు దర్భలతో పేనిన తాడుతో కట్టడం చేస్తారు.

భార్యాభర్తల వస్త్రాలను బ్రహ్మముళ్ళు అన్న పేరుతో ఆశీస్సులతో కొంగులు ముడివేస్తారు. మంగళ సూత్రానికి మధ్య స్థానం అంటే, ఎత్తుగా బొటమి లాంటిది నిర్మించి, వధువు కంఠానికి ధారణ చేయిస్తారు. వధువుకు మధుపర్కం కట్టించి తీసుకొని వచ్చేటప్పుడు, ఒక పళ్ళెంలో జ్యోతులను వెలిగించి, గోక్షీరం, శుక్లవర్ణం అంటే, తెల్లని బియ్యం ఉంచి తీసుకొని వస్తారు. ఇవే తలంబ్రాలు అయుర్వృద్ధి కోసం ఏర్పాటైనవి.

వివాహమైన తర్వాత వీధి గుమ్మం దగ్గర వధూవరులు పరస్పరం పేర్లు చెప్పాలి. ఇది ముచ్చటకోసం మాత్రమే కాకుండా, సఖ్యాభివృద్ధికి కూడా అని శ్రుతి నిర్దేశిస్తోంది. అదేవిధంగా వధూవరుల సహ భోజనం ఒక వేడుక కాని, వివాహానంతరం నిషిద్ధం.

అంత్యేష్టి

బౌధాయనుడు చెప్పిన ప్రకారం, జీవించి ఉన్నప్పుడు చేసిన సంస్కారాలు భూమిని జయించడానికి, మరణించినపుడు చేసిన సంస్కారాలు మోక్షసాధనకు ఉపయోగపడతాయి. జనన మరణాలు నిరంతరం జరుగుతూనే ఉంటాయి. మనిషి శరీరం నిర్జీవమై అగ్నిలో దహనమౌతున్నప్పుడు, మనమంతా అనుకుంటున్న అంతిమ యాత్ర కాదు. ఆ శరీరం నుండి ఆత్మకు చిముక్తి కలిగించి, మరొక శరీరంలోకి లేక యమలోకంలోకి ప్రవేశించడానికి ఒక ప్రక్రియ మాత్రమే.

దహనం తర్వాత దాని మీద వైతరణి ప్రవహించాలి. అందుకోసం మంత్రాలు చదువుతారు. అగ్నిని ఈ శరీరానికి ఎటువంటి కష్టం, బాధ లేకుండా దహించమని, ఆత్మను విముక్తి చేయమని ప్రార్థిస్తారు. చూడగలిగే చక్షువు (కన్నులు) సూర్యునిలోను, ప్రాణం వాతావరణంలోను ఇలా పంచభూతాల్లో కల్సిపోవాలని ప్రార్థిస్తారు.

మరణం వల్ల శోకతప్తులై కన్నీరు పెడితే, ఆత్మకు మోక్షప్రాప్తిని లేకుండా చేస్తున్నామని అర్థం. అందుకే, పురాణేతిహాసాలు (గరుడ పురాణం) స్నానానంతరం చదవబడి బిందుజలానికి ఊరట, వైరాగ్యాన్ని కలిగించి కన్నీరు రాకుండా చేస్తారు.

శ్రాద్ధకర్మలు

వైదిక మతంలో ఇది అనుసరణీయమైన కర్మకాండ. 'శ్రాద్ధాయ దీమతే యస్మాత్' అని చనిపోయిన పితృదేవతలకు శ్రద్ధతో, అచంచల విశ్వాసంతో, మేధతో అర్పించే శ్రద్ధాంజలి లాంటి కర్మకాండ, అని పులస్త్య మహాముని వివరించాడు.

శ్రాద్ధకర్మలో అర్ఘ్యం, పవనం, బ్రాహ్మణులకు అంటే, భోక్తలకు భోజనం, పిండదానం వికిర, దక్షిణ సమర్పణం, తర్పణం విడవడం మొదలైన కార్యక్రమాలుంటాయి. పవిత్ర బ్రాహ్మణుల మీద మూడు తరాల పితృదేవతలను ఆపాదించి వసు, రుద్ర, ఆదిత్యులుగా భావించి, వారి ఆత్మలను సంతుష్ట పర్చి మోక్షప్రాప్తికై ప్రార్థించడం

BRAOU

ముఖ్యమైన ఘట్టం.

శ్రాద్ధకర్మలో దర్భలు, నల్ల నువ్వులు ముఖ్యమైన వస్తువులు. పద్మ పురాణం దర్భలను విష్ణువు నుండి పుట్టుకొచ్చాయి అని అంటే, అశ్వలాయన గృహసూత్రం సమస్త జలసారమే దర్భ అని అంటుంది. దర్భల వాడకం శ్రాద్ధకర్మకు పవిత్రతను తెస్తుంది. విష్ణువంటే, క్షుద్రశక్తులకు భయం. వారు దగ్గరకి రాకుండా నువ్వులు కాపాడతాయని అంటారు. వెండిగిన్నెలు అర్ఘ్యానికి, పిండ ప్రదానానికి వాడతారు. ఒక ఆవుదూడ మందలోని తన తల్లిని గుర్తుపట్టి ఎట్లా చేరుతుందో అలాగే, శ్రాద్ధక్రియలో చేరవల్సిన వారి పిండం అందేలా, మంత్రాలు చదువుతారు. కాని శ్రాద్ధకర్మ జరపకపోతే, పితృ దేవతల ఆగ్రహానికి గురవుతారు అని భావింపబడేది. కాని, నేటి సామాజిక ఆర్థిక పరిస్థితుల కారణంగా, సరిగా జరపలేకపోవడం కన్పిస్తుంది.

ఏది ఏమైనా, శ్రాద్ధకర్మ కారణంగా ఏడాదికి ఒకసారైనా పితృదేవతలను తలచుకొని, వారు మనకు అందజేసిన ప్రేమాభిమానాలు ఆస్తి, అభివృద్ధి పథకాలకు కృతజ్ఞతతో స్మరించడం మన కర్తవ్యం.

6.6 సంగ్రహంగా

ఈ పాఠ్యాంశం చదవడం వల్ల మరుగున పడిపోతున్న మానవతా విలువలను వెలికి తీసుకురావడానికి వైదిక మతం ఎంత అవకాశం ఇస్తుందో తెలుస్తుంది. భారతీయ సంస్కృతే భారత జీవన విధానం అన్న సత్యం అందరం గుర్తించగలుగుతాం. ఈనాడు మనం ఆచరిస్తున్న మతపరమైన కార్యక్రమాలు తగిన జ్ఞానంతోనూ, గౌరవంతోనూ, మనస్ఫూర్తిగా పాటించడం జరుగుతుంది. మన సనాతన ధర్మం గొప్పతనాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకొంటాం. ప్రపంచ సాంస్కృతిక పటంలో భారతదేశానికి ఒక స్థానం గుర్తింపు రావడానికి స్వామీ వివేకానందుని కృషిని అర్థం చేసుకొని అభినందించగల్గుతాం.

6.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. వేదం అంటే ఏమిటి? వైదిక మత ఆవిర్భావాన్ని, విశిష్టతను, వైదిక సాహిత్యాన్ని గూర్చి వివరించండి.
2. ఋగ్వేద మతంలో దైవాల వర్గీకరణను విశ్లేషించండి.
3. వైదిక మత కర్మకాండల ఆవశ్యకతను తెల్పి వాటి ప్రాముఖ్యతను, ప్రయోజనాన్ని గూర్చి సంక్షిప్తంగా చర్చించండి.
4. జన్మించిన తర్వాత జరపబడే కర్మకాండలను గూర్చి చర్చించండి.

II. ఈ క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. వేదాలు అపౌరుషేయాలు.

2. పంచ మహాయజ్ఞాలు.

3. జననానికి ముందు జరపబడే సంస్కారాలు.

4. ఉపనయన సంస్కారం.

5. వివాహ సంస్కారం.

6. అంత్యేష్టి - శ్రాద్ధకర్మలు.

6.8 ఉపయుక్త గ్రంథాలు

Ayyer, V.A.K. : **Hindu Sastras & Samskaras.**

Majumdar, R.C. : **The Vedic Age - Hindu Culture of the Indian People.**

Satyamurthi, K. : **Indian Heritage & Culture.**

Shree Chandra Sekharendra Saraswathi : **The Eternal Religion.**

బ్ర.వే. ఉప్పులూరి గణపతి శాస్త్రి : **వేదసార రత్నావళి** (2 భాగాలు)

BRAOU

రచయిత్రి : డా. కె. జానకి

భాగం–7 : వేద కాలపు సమాజం – కుల వ్యవస్థ

విషయక్రమం

7.0 లక్ష్యాలు

7.1 పరిచయం

7.2 వేద కాలం నాటి సామాజిక పరిస్థితులు

- 7.2.1 పితృస్వామిక కుటుంబ వ్యవస్థ
- 7.2.2 ఉమ్మడి కుటుంబం
- 7.2.3 స్త్రీ స్థానం
- 7.2.4 స్వేచ్ఛ
- 7.2.5 వివాహం
- 7.2.6 వివాహ పద్ధతులు
- 7.2.7 వివాహ సంస్కారం
- 7.2.8 వివాహ ప్రాధాన్యత

7.3 విద్యా విధానం

- 7.3.1 విద్యాభ్యాస విధానం
- 7.3.2 ప్రవర్తన నియమావళి

7.4 వినోదాలు

7.5 ఆహారపానీయాలు

7.6 దుస్తులు – అలంకరణ

- 7.6.1 ఆభరణాలు
- 7.6.2 శిరోజాలంకరణ

7.7 వైద్యం – పారిశుద్ధ్యం

7.8 కుల వ్యవస్థ

- 7.8.1 పుట్టుక – పురుషసూక్త సిద్ధాంతం
- 7.8.2 వర్ణాశ్రమ ధర్మం
- 7.8.3 అగ్రవర్ణాల ఆధిక్యత

7.9 సంగ్రహంగా

7.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

7.11 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

7.0 లక్ష్యాలు

ఈ పాఠ్యాంశాన్ని చదవడం వల్ల మీరు

* ఈనాటి సామాజిక పరిస్థితులకు వేద కాలం నాటి సామాజిక పరిస్థితులకు గల సంబంధాన్ని విశ్లేషించగల్గాలి.
* ఈనాడు మన కుటుంబాలు పితృస్వామికంగా ఎలా స్థిరపడ్డాయో వివరించగల్గాలి.
* వేద కాలపు సంఘంలో స్త్రీ స్థానాన్ని వివరించగల్గాలి.
* వేద యుగంలోని వివాహ వ్యవస్థ ఈనాటికి అందరికి ఎలా ఆమోదయోగ్యమైందో, దాని ప్రాశస్త్యం ఏమిటో వివరించగల్గాలి.
* మనం అవలంబిస్తున్న వివాహ రీతుల్లో ప్రతి ఘట్టానికి వెనకున్న అర్థాన్ని తెల్సుకోగల్గాలి.
* వేద కాలపు విద్యావిధానానికి నేటి విద్యా విధానానికి గల పోలికలు తేడాలు వివరించగల్గాలి.
* వేద కాలంలో పరిశుభ్రత ప్రాధాన్యతను, వైద్య రంగం అభివృద్ధిని వివరించగల్గాలి.
* కుల వ్యవస్థ - వర్ణాశ్రమ ధర్మం ఎలా కొన్ని వర్గాలవారిని అగ్రవర్ణులుగా ఆధిక్యతను ఆపాదించిందో విశ్లేషించగల్గాలి.

7.1 పరిచయం

సమాజమన్నది లేనిదే మనిషికి మనుగడ లేదు. సమాజంలో వ్యక్తిగతంగా కుటుంబ వ్యవస్థ ఏ విధంగా వేద కాలం నుండి ఇప్పటికీ కొనసాగుతోందో ఉమ్మడి కుటుంబం ప్రాముఖ్యత ఆనాడు ఉన్నా, నేటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వీలుకావడం లేదు. ఉమ్మడి కుటుంబం వల్ల మనకు ఎన్నో నైతిక, ఆర్థికపర లాభాలు, నష్టాలు కనిపిస్తాయి. స్త్రీ మాతృదేవతగా ఆరాధించబడి గౌరవించబడిందే కాని, సముచిత స్థానాన్ని పొందలేదు. మనుధర్మశాస్త్రంలోనూ, ఇతర ధర్మశాస్త్రాల్లోను స్త్రీకి గౌరవం స్వేచ్ఛలనే ఇచ్చి, పగ్గాలు పురుషుల చేతిలోకివ్వడం వల్ల, పురుషాధిక్యత ప్రస్ఫుటంగా కనబడుతుంది. ఇదే కొనసాగుతోంది కూడ.

ధర్మశాస్త్రాలను రచించినవారు పురుషులే. అందుకే, స్త్రీని గౌరవప్రదంగా నాలుగు గోడలకు పరిమితం చేసారు. స్వతంత్రంగా ఏ ఒక్క స్త్రీకి మనుగడ లేదని, పుట్టినప్పటి నుండి చనిపోయేదాకా ఏదో ఒక రూపంలో ఉన్న పురుషుడి మీద ఆధారపడక తప్పదని ధర్మశాస్త్రాలు, పరిస్థితులు తీర్మానించాయి. వివాహం అన్నది వైదిక మతంలో ఎంత ఔన్నత్యం కలిగి ఉందో, అందులోని ప్రతి ఘట్టానికి వెనక ఎంతటి ఉన్నత భావం ఉందో, మనలో చాలా తక్కువ మందికే తెలుసు. భారతీయ వివాహ సంస్కారం పాశ్చాత్య వివాహ సంస్కారంతో పోల్చేస్తే, అక్కడక్కడ చిన్నచిన్న సంఘటనలు మినహా, ఎంతటి శక్తిపంతమైందో మనకంటే కూడా, వివాహబంధాలు సులభంగా తెంచుకుంటున్న పాశ్చాత్య సంఘానికి తెలుసు. పరిశుభ్రతను పాటించడానికున్న నియమాలు

BRAOU

ఎవ్వరూ సరిగా పాటించరు. అదే మతపరమైన ఆ భావాన్ని జోడించగానే అది ఒక అందమైన సాంప్రదాయంగా మిగిలిపోయింది. పండగలు, పబ్బాలు ఉత్సవాల సందర్భంలో మనం మన ఇళ్ళను, వాకిళ్ళను శుభ్రంగా, పచ్చగా, అందంగా ఎలా తీర్చి దిద్దుతున్నామో ఒక్కసారి మన జీవన పరుగును ఆపి, నిలబడి చూస్తే అర్థమౌతుంది. మనకు సమయం లభించకపోయినా, పండగలు, వివాహ సందర్భాల్లోనైనా మనం సాంప్రదాయబద్ధంగా జరపడానికి పూనుకోవడం ముదావహం.

విద్యాభ్యాసం అన్నది అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ముఖ్యమే. విద్యా విధానం అన్నదే అనేక మార్పులకు గురౌతోంది. ఆనాటి గురుకులాలు నేడు ఆశ్రమ పాఠశాలల రూపంలో ఉన్నా, అప్పటి విలువలు లేవు. గురుశిష్యుల మధ్య సంబంధం ఎలాంటిదో మనకు తెలిసినా, ఈనాడు అది మచ్చుకైనా కనబడడం లేదు. ఎవరైనా శుశ్రూష చేసి గురువును మెప్పిస్తే, గురువును మించిన శిష్యులు తప్పకుండా అవుతారు. సరిగ్గా ఇలాంటివే ఆధునిక విద్యావిధానంలో ఉన్నా, నైతిక విలువలు లేక అది కలుషితమై, బలహీనమై పోయింది.

అన్నిటికన్నా ముఖ్యమైంది 'కుల వ్యవస్థ'. ఇది అనాదిగా మనిషికి ఒక తీర్చలేని, పరిష్కారం లేని సమస్యగా పరిణమించింది. అది ఏర్పడిన తీరు, వ్యాపించిన తీరును ఒక్కసారి గమనిస్తే, దానికి వ్యతిరేక పోరాటాలు అప్పుడే ఎదురైన విషయాలు మనకు తెలుస్తాయి. అన్నిటికన్నా ముఖ్యమైన దేమిటంటే, ఏదైనా పద్ధతి ఒక అర్థంతో ఉంటుంది దాన్ని వ్యాఖ్యానించడంలో ఆ అర్థం స్వరూపమే మారిపోయి, వికటార్థం వస్తోంది. శ్రమ విభజన, ఆర్థిక రంగ ప్రభావం కుల వ్యవస్థకు నాంది పలికితే, ఆర్థిక పరిస్థితిని తొక్కివేసి, సామాజిక పరిస్థితి కొంతమంది స్వార్థపరుల వల్ల తలెత్తి, దాని స్వరూపాన్ని మార్చేసింది. కుల నిర్ణయం జన్మవల్ల కాదు, అర్హతవల్ల అని తెలిసినా పట్టించుకొనే నాధుడు లేడు. వేద కాలంలో ఒక కులం నుండి మరో కులానికి మారడానికి అవకాశం ఎంతో ఉంది. రోజులు గడుస్తున్న కొద్దీ ఆ అవకాశాలు పడనివ్వకుండా ఎంతమంది పూనుకొన్నారో మనకు తెలుసు. స్వలాభపరులు, స్వార్థపరులు, పదవీ వ్యామోహంతో, దీన్ని అవకాశంగా తీసుకొని ఏర్పడిన విషజ్వాలలను ఆర్పడానికి బదులు ఎగదోస్తున్నారు. సంఘంలో సులభ సౌమ్య పద్ధతులన్నీ క్రమేపీ బిగుసుకొనిపోయాయి.

7.2 సామాజిక పరిస్థితులు

ఋగ్వేద కాలంనాటి సామాజిక పరిస్థితులను తర్వాతి వేద కాల పరిస్థితుల్తో పోలిస్తే, చాలా మార్పులు కనిపిస్తాయి. తొలి వేద కాలంలో ఆర్యులు తెగలు తెగలుగా ఏర్పడ్డారు. ఒక్కొక్క తెగను 'జన' అంటారు. వారు నివసించే ప్రాంతం 'విస్' లేదా గ్రామం. తెగ నాయకుని 'రాజన్యుడ'ని అంటారు.

సాంఘిక విభాగం కుటుంబం అని కుటుంబాన్ని రక్షించుకొనే వ్యక్తిని 'కులప' లేదా తండ్రి అంటారు. ఆర్యులు తమ సమాజాన్ని రక్తసంబంధం ప్రకారం ఏర్పాటు చేసుకొన్నారు. అందుకే, అది పితృస్వామిక సమాజం అయింది. (ఋగ్వేదం 124.12.5 X V. 27)

7.2.1 పితృస్వామిక కుటుంబ వ్యవస్థ

తండ్రి గృహస్తుగా కుటుంబంలో ఉన్నత స్థానాన్ని కలిగి ఉంటాడు. ఆతడి తర్వాత ఇంటి పెద్ద కుమారుడు ఆ స్థానాన్ని ఆక్రమిస్తాడు. తండ్రి కుమారుల మధ్య చక్కని చిక్కని ప్రేమ, ఆప్యాయతలు కనిపిస్తాయి. పెరిగి పెద్దవాడైన కుమారుని కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తండ్రి దగ్గరకి తీసుకొని, నుదుటి మీద ముద్దు పెట్టుకొన్న

BRAOU

సంఘటన 'సాంఖ్యాయన అరణ్యకం' వివరిస్తుంది. కుటుంబంలోని క్రమశిక్షణను గురించిన ప్రస్తావన వివరించిన సందర్భాలు చాలా ఉన్నాయి. తండ్రి కుమారుని అంధునిగా చేసి, శిక్షించడం ఒక సందర్భంలో ఉంటే, మరోచోట జూదగాడై అప్పులపాలైన కుమారుని మిగతా కుటుంబ సభ్యులు వెలివేయడం లాంటివి కుటుంబ వ్యవస్థ సక్రమంగా నిర్వహించబడాయనడానికి పట్టుకొమ్మలు. కుటుంబంలో పెద్దవారుండగా, చిన్నవాళ్ళు, సోదరులుగాని, ఆడపడుచులుగాని వివాహం చేసుకోవడం కూడదని నియమం. తండ్రిలేని పక్షాన అన్నా వదినలు కుటుంబ భారాన్ని నిర్వహించడం జరుగుతుంది. అన్నదమ్ముల మధ్య కలహాలు సామాన్యం. ఒక్కోసారి తాతముత్తాతలతో, మునిమనవలతోనూ పెద్ద కుటుంబంగా ఉంటుంది. భార్య సోదరుడు, సోదరి కుమారుడు, మేనమామ మొదలైనవారు బంధువులు.

7.2.2 ఉమ్మడి కుటుంబం

సాధారణంగా కుటుంబం విడిపోక అందరితో ఉమ్మడిగా ఉండడం ఆచారంగా కనిపిస్తుంది. అందరి లోకి వయసులో పెద్దవాడు, వివాహాది శుభకార్యాలల్లో ఇంటిపెద్దగా వ్యవహరిస్తాడు. గృహ్య సూత్రాలు చెప్పిన ప్రకారం నిత్యాగ్ని ప్రజ్వలింపజేసే విషయంలో కుటుంబ సభ్యుల వేర్పాటు కనిపించొచ్చు. అలాగే, పిత్రార్జితం అనుభవించడానికి గాని తండ్రి చనిపోయినప్పుడు చితికి అగ్ని సంస్కారం చేయవలసింది పెద్ద కుమారుడే. ప్రతిరోజూ జరిపే విశ్వదేవ బలికి కుటుంబంలో ఎవరు ముందు అగ్నిని రగిల్చి బియ్యం వండుతారో, ఆ వంటగది నుండే సమర్పించవచ్చు. అంటే, ఉమ్మడి కుటుంబంలో ఒక్కొక్కసారి ఎంతోమంది ఉండడం వల్ల ఎవరికి వారు ఎన్నో వంటశాలల్లో ఆహారం వండుకోవచ్చు. అంటే, ఎంతోమంది పిల్లాపాపలతో కుటుంబం పెద్దదిగా ఉండడం ఆనాటి ప్రజల కోరికే అన్న విషయం అర్థమౌతోంది. అయితే, వేద కాలంలో మగపిల్లలు ఆడపిల్లలకన్నా ఎక్కువగా ఉండాలని అని అనుకోవడం మనల్ని ఆలోచింప చేస్తుంది. తండ్రి సుదీర్ఘమైన ప్రయాణం చేసి తిరిగి వచ్చినపుడు ఇంటిలోని మగపిల్లలను ఒక విధంగానూ, ఆడపిల్లలను ఒక విధంగానూ పలకరిస్తాడు, సంబోధిస్తాడు. గృహ్య సూత్రాల్లో కుటుంబ పెద్దకు చాలా బాధ్యతలు, విధులుంటాయి. అతడు తాను తీసుకొనే ఆహారం కూడా ఇంటిలోని చిన్నవారు, అతి పెద్ద ముసలివారు, తన రక్షణలో ఉన్న ఆడవారు, గర్భిణీ స్త్రీలు తీసుకున్న తర్వాత తీసుకోవాలి. ధర్మశాస్త్రాలు తండ్రికి కుటుంబంలో గౌరవం, అధికారాన్నిచ్చాయి. కొడుకు, తండ్రి తిన్న తరవాతో మిగిలినవి తినాలన్న నియమముంది. తండ్రి క్రమశిక్షణతో బాటు, కరుణతో, ప్రేమతో కుటుంబ సభ్యులపట్ల వ్యవహరించాలి. తండ్రి తర్వాత కుమారుని స్థానం అన్నది ఉపనిషత్తులు కూడా ఆమోదించాయి. చందోగ్య ఉపనిషత్తు కుటుంబంలోనివారి స్థాయిలను క్రమంగా మొదట తండ్రి, తల్లి, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళు అని చెప్పింది. ఇంటి కొత్తకోడలు కుటుంబంలో ఏ విధంగా స్వీకరించబడుతుందో, వివాహాది శుభకార్యాలకు సంబంధించిన ఋగ్వేద ఋక్కులు వివరిస్తాయి. కొత్తకోడలు అత్తమామల, బావమరుదుల, ఆడపడుచుల గౌరవాభిమానాలు, అధికారాలను పొందడం అన్నది ఆనాటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థలోని పటిష్టతను సూచిస్తుంది.

7.2.3 స్త్రీ స్థానం

ఆనాటి పురుషాధిక్యత స్త్రీకి, తల్లికి కూడా ఎలాంటి అధికారాన్నివ్వలేదు. ఆ పద్ధతే, ఈనాటికి పరంపరగా సాగుతోంది. అయితే, స్త్రీకి సమాజంలో గౌరవప్రదమైన స్థానముందని మాత్రం చెప్పగలం. చదువు సంధ్యల్లోగాని, ఉన్నత పదవుల్లోగాని ఆరితేరిన స్త్రీలు లేకపోలేదు. ఉత్సవాలు, పండుగల సమయంలో బయటికి వచ్చి, తమ శక్తి సామర్థ్యాలను చూపిన స్త్రీలు ఎందరో ఉన్నారు. మగవారితో సమానంగా అన్ని రంగాల్లోనూ, తమకు తామే సాటి అని ఆధిక్యత చూపించుకొన్న స్త్రీలున్నారు. ఋగ్వేదంలో కొన్ని ఋక్కులను రచించిన స్త్రీలలో ముఖ్యులు విశ్వవర, ఘోష, అపాల మొదలైనవారు.

BRAOU

7.2.4 స్వేచ్ఛ

ఆనాటి స్త్రీకి విద్యావకాశాలతో బాటు, తన జీవిత భాగస్వామిని ఎన్నుకొనే స్వేచ్ఛ స్వయంవరం అన్న పేరుతో ఉన్నా, మనువు వారిని స్వతంత్ర్యంగా ఉండనివ్వలేదు. కుమార్తెగా, సోదరిగా, భార్యగా, తల్లిగా మాత్రమే వారి స్థానం. ఎప్పుడూ మగవారి మీద ఏదో ఒక రూపంలో, కూతురిగా తండ్రిమీద, సోదరిగా తోబుట్టువు మీద, భార్యగా భర్తమీద, చివరికి తల్లిగా కుమారుడి మీద ఆధారపడవల్సిందే. అంటే వారి స్థానం నాల్గుగోడలకు పరిమితమై, గృహవాతావరణాన్ని దాటి రావడానికి వీలు బహు తక్కువ. నాడు నేడూ కూడ కుమార్తెకంటే, కుమారుని గురించే ఆలోచనలు, కలలు, ప్రార్థనలుండేవి. అయితే, మనువు కూడా స్త్రీకి సమాజంలో ఒక పూజ్యస్థాన మిచ్చాడు. "యత్ర నార్యాస్ తు పూజ్యంతే తత్ర దేవతా యత్ర యతాస్ తున ప్రీయంతే సర్వాస్ తత్ర ఆఫలా క్రియ" (III. 56). దీనికి అర్థం ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో, అక్కడ దేవతలు సంతుష్మలౌతారు. ఎక్కడైతే వారు నిర్లక్ష్యం చేయబడతారో, చేసిన యజ్ఞయాగాదులు వృధా అవుతాయి. క్రమేపీ స్త్రీ జీవితానికి ఆంక్షలు, నియమాలను అతడే విధించాడు.

7.2.5 వివాహం

ఆనాటి సమాజంలో స్త్రీల స్థానం ఎలాంటిదో వేదాల్లో పేర్కొనబడ్డ ఋక్కుల ద్వారా తెల్సుకోవచ్చు. ఆనాటి సంఘంలో 'ఘోష' అనబడే ఆమె బట్టి ప్రస్తావనని పెళ్ళికాని స్త్రీలు కూడా ఉన్నారని, వారు తల్లిదండ్రుల అండలో ఉండేవారని (1.117, X 39, 3.40.5) చెపుతున్నాయి. పెళ్ళి కావల్సిన యువతులు యువకులను ఆకర్షించడానికి ఉత్సవాల సందర్భంలో ఎన్నో ఆభరణాలు ధరించి కనిపించేవారట (1.123. II, VII 2.5). ప్రేమించిన యువకుడు తన ప్రియురాలికిచ్చే ప్రేమ కానుకలు (1.117, 18)చూస్తుంటే, ప్రేమ వివాహాలకు అనుకూల పరిస్థితులు (1.167,3, IX 32.5) ఉన్నట్లు కనిపిస్తోంది. అందరూ నిద్రలో మునిగి ఉన్నప్పుడు తన ప్రియురాలిని కలవడానికి వెళ్ళిన యువకుడి (VII 55, 5.8) వర్ణన లాంటివన్నీ ఆనాటి స్త్రీలకుండే స్వేచ్ఛ, యుక్తవయస్సు వచ్చాకే వివాహం లాంటి అవకాశాలు ఉన్నాయనడానికి నిదర్శనాలు. అలాగే వివాహాల్లో స్వయంవరం అనే పద్ధతి ద్వారా వర నిర్ణయం చేసే స్వేచ్ఛ స్త్రీకి ఉంది కాని, ఈ అవకాశం రాజకుటుంబాల్లోనే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, వివాహం బయటి కుటుంబీకులతోనే గాని, ఇంటివారితో మాత్రం జరిగేది కాదు. సాధారణంగా, స్త్రీ వివాహం ఆమె తలిదండ్రులు, తోబుట్టువుల ఆమోదంతో జరుగుతుంది. కాని, ఇది తప్పనిసరిగా జరగాలన్న నియమం లేదు. సామాజిక, గృహ కట్టుబాట్లననుసరించి, తలిదండ్రులు సాంప్రదాయబద్ధంగా, యువతీ యువకులు ఒకరినొకరు ఇష్టపడ్డాక వివాహం జరిపేంచే ఆచారముంది.

కొన్ని సందర్భాల్లో అల్లుడు తగినవాడు కానప్పుడు, కన్యాశుల్కం తీసుకొని వివాహం చేయడం లాంటి ప్రసక్తులు కనిపిస్తాయి. స్త్రీలలో ఏదైనా లోపం, అంగవై కల్యం ఉంటే, వరకట్నమివ్వడం జరిగేది. ఒక్కోసారి తండ్రికి ఇష్టం లేకపోయినా, కుమార్తెను వరుడు ఎత్తుకొనిపోయి, గాంధర్వ వివాహం చేసుకున్న ప్రసక్తి కూడా కనిపిస్తుంది. వివాహం కుటుంబంలోని దగ్గర రక్త సంబంధీకులతో వీలుపడదు. కానీ, శతపథ బ్రాహ్మణం (1.8.3.6) కొంచెం దూరపు బంధు వర్గం నుండి వివాహ ప్రయత్నాన్ని ఆమోదించింది. ఒక గోత్రీకులు మరొక గోత్రీకులతో వివాహ సంబంధం ఏర్పర్చుకోవాలన్నది మరో నియమం. అంటే, స్వగోత్రీకుల్లో వివాహం నిషిద్ధం. వరుడు 'సపిండ' అంటే, దగ్గరి బంధువు కాకూడదు. యువకుడు, శక్తి సామర్థ్యాలు, తెలివితేటలు, సత్ప్రవర్తన కల్గి ఉండి, మంచి కుటుంబం నుండి వచ్చినవాడై ఉండాలి.

అనులోమ వివాహం అంటే, ధనవంతుని కుమారునికి పేదవాని కుమార్తెతో వివాహం జరగడం ఎక్కువగా కనిపిస్తుంది. కాని వారు సవర్ణులై ఉండాలి. ఒకే కుటుంబంలో అన్నదమ్ముల భార్యలు వివిధ కులాలకు

చెందినవారైతే, ఉన్నత వర్గం వారు క్రింది వర్గం వారిని చులకన చేసి, కుటుంబంలో పరిస్థితులు అస్తవ్యస్తం కావడానికి అవకాశం ఉంది.

7.2.6 వివాహ పద్ధతులు

గృహ్య సూత్రాలలో అశ్వలాయన ధర్మశాస్త్రం ఎనిమిది రకాల వివాహాలను సూచించింది. అందులో 'పైశాచ' వివాహంలో కుటుంబంలోని వారంతా నిద్రిస్తుండగా, లేదా ఇష్టపడకపోయినా, అమ్మాయిని లేవదీసుకొనిపోయి వివాహం చేసుకోవడం. 'రాక్షస' వివాహం అంటే, వధువు తరపు బంధువర్గంతో యుద్ధం చేసి, అమ్మాయిని గెల్చుకోవడం. ఈ వివాహాలకు ఈ పేర్లు ఆ తెగల్లో జరిగే వింత ఆచార వ్యవహారాలవల్ల వచ్చి ఉండొచ్చు. కానీ, అలాంటి వివాహాలకు సంఘంలో ఒక గుర్తింపునివ్వడానికి కారణం, బహుశ అలాంటి వివాహమైన వధువుకు అన్యాయం జరగకుండా, ఆమె వివాహం ఆమోదయోగ్యం చేయాలనుకోవడం కావచ్చు.

7.2.7. వివాహ సంస్కారం

ఋగ్వేదంలోని (X85) వివాహ సందర్భ మంత్రాలు ఈ వివాహ వ్యవస్థ ఎప్పటిదో, ఎటువంటిదో చెప్తాయి. వివాహ సంస్కారం వివిధ దశల్లో జరుగుతుంది.

1. వరుని పక్షంవారు సాంప్రదాయబద్ధంగా అమ్మాయి ఇంటికి వెళ్ళడం.
2. అమ్మాయి తండ్రి అంగీకరించగానే, పెళ్ళికుమారుడు వివాహ సంస్కారాన్ని ప్రారంభిస్తాడు. తన బంధువర్గంతో వివాహానికి వధువు గృహానికి తరలి వస్తాడు. (X 17.1)
3. పెళ్ళినాడు మొదటిరోజు తెల్లవారు ఝామున పెళ్ళికూతురికి మంగళ స్నానం చేయించడం.
4. తర్వాత ఇంద్రాణి కర్మలో ఒక భాగంగా, అమ్మాయి ఇంటిపెద్ద లేక పురోహితుడు సంస్కారం ప్రారంభిస్తాడు. దానికి ముందు నలుగురి నుండి ఎనిమిది దాకా ముత్తైదువులు నృత్యం చేస్తారు.
5. పెళ్ళికుమారుడు తర్వాత బట్టలు అత్తరు, గంధం, అద్దం మొదలైనవి అప్పుడే మంగళ స్నానం చేసి వచ్చిన అమ్మాయికిస్తాడు.
6. తర్వాత కన్యాప్రదానం జరుగుతుంది.
7. పాణిగ్రహణం, వరుడు తన కుడిచేతితో వధువు చేయి అందుకోవడం.
8. వధువు సన్నికల్లుపై పాదాన్నుంచడం.
9. వరునితో వధువు అగ్ని ప్రదక్షిణం చేయడం.
10. లాజహోమంలో వరిపేలాలను అగ్నికి సమర్పించడం.
11. సప్తపది అంటే వధూవరులు కలిసి ఏడడుగులు నడిచి, జీవితాంతం కల్సి ఉండడానికి చేసే ఒప్పందం.
12. వివాహానికి వచ్చిన అతిథులకు ఎద్దుమాంసం ముఖ్యంగా గోమాంసం వడ్డించడం (X 85. B).

BRAOU

13. వరుడు వధువును తన ఇంటికి ఊరేగింపుతో పల్లకిలో తీసుకొని వెళ్ళటం (X. 85, 7, 8, b). ఆ విధంగా దాంపత్య జీవితం మొదలపడం (X.85, 28-30, 35). ఈ సందర్భంగా, వధూవరులను సుదీర్ఘ సుఖ దాంపత్య జీవితంతో బాటు, 'పుత్రపౌత్రాభివృద్ధిరస్తు' అన్న దీవెనలు – కుటుంబ వ్యవస్థను ఎంతో ఉన్నతంగా చేస్తాయి.

7.2.8 వివాహ ప్రాధాన్యత

కొత్తగా వివాహితురాలై, అత్తింటిలో అడుగుపెట్టిన స్త్రీకి ఆ ఇంటిలో గౌరవప్రదమైన స్థానం, అత్తమామలు, మరిది ఆడపడుచుల మీద ఆధిపత్యం లాంటివి చాలా సహజంగా లభిస్తాయి. సాధారణంగా ఇంటి పెద్దకుమారుని వివాహం జరగ్గానే, తండ్రి తన బాధ్యతలను విరమించుకొని, కుమారునికి అప్పగించడం జరుగుతుంది. కొత్తకోడలు ఇంటిలో తన స్థానాన్ని, అధికారాన్ని ప్రేమతో, ఆప్యాయతతో సాధిస్తుంది. మత, దైవ, గృహ కార్యక్రమాలన్నిటిలోనూ, భర్తతో సమాన స్థాయిలో పాలు పంచుకుంటుంది. సహధర్మచారిణిగా, ఆమె లేకుండా ఎలాంటి కర్మకాండలు, సంస్కారాలు జరగడానికి వీలులేదు. అశ్వమేధయాగం తలపెట్టిన శ్రీరాముడు బంగారు సీత విగ్రహం పక్కన పెట్టుకొని నిర్వహించిన విషయం, మనకు తెలిసిందే.

వివాహమన్నది ఒక పవిత్ర బంధమే కాని, వ్యాపార ఒప్పందం కాదు. వంశాభివృద్ధి వివాహ ముఖ్యోద్దేశం. ఆయురారోగ్య ఐశ్వర్యాల కోసం, పుత్ర సంతానం కోసం నిత్యం ప్రార్థనలు జరుగుతాయి. కాని, పుత్రికల కోసం మాత్రం కాదు. పుత్రికలు అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ అక్కరలేనివారే. 'అపుత్రస్యః గతిర్నాస్తిః' అన్న వేదవాక్కు మనకు సుపరిచితమే. తండ్రిని పున్నాము నరకం నుండి కాపాడ్డానికి, చనిపోయిన తండ్రికి శ్రాద్ధకర్మలను నిర్వహించడానికి పుత్రుడు అవసరమన్న నమ్మకముండేది, పుత్రుడు లేనివాడు దరిద్రుని కన్నా హీనాతిహీనం కనుక, దత్తపుత్రుని స్వీకరణను ఆమోదించడం జరిగింది (VII. 4.7.8).

ఋగ్వేదంలో సతీసహగమన ప్రసక్తి చాలా తక్కువ. కానీ, అక్కడక్కడ భర్త శవంతోబాటు, చితిమీద పడుకొని ఉన్న స్త్రీని బయటకు వచ్చేయమన్న సంఘటనలు ఈ ఆచారాన్ని సూచిస్తున్నా, బాగా ప్రాచుర్యంలో లేదని తెలుస్తోంది. అది కూడా క్షత్రియ వర్గంలోనే కొంచెం కనిపిస్తుంది. భర్త ఆస్తిలో భార్యకు భాగముంది కనక, సతీసహగమనం ఎక్కువ ప్రాచుర్యం, వ్యాప్తి చెందలేదు.

మగ సంతానం లేని వితంతువు భర్త సోదరుల వల్ల సంతానం పొందవచ్చని ఋగ్వేదం (X 40.2 & X 18.7.8) చెప్తున్నాయి. ఇలా సంతానం లేని వితంతువులు ముఖ్యంగా, పుత్ర సంతానం లేనివారు తిరిగి వివాహం చేసుకోవడాన్ని సంఘం ఆమోదించింది.

స్త్రీకి గృహంలో, సమాజంలో గౌరవప్రదమైన స్థానముంది. కానీ ఆమె సంతోషంగా, స్వతంత్రంగా సంగీత, నృత్యాలతో కాలం గడపడానికి వీలులేదు. అయితే, ముత్తైదువులైన స్త్రీలు వివాహాది శుభకార్యాల్లో మంగళప్రదంగా భావింపబడతారు. 'గోభిల గృహ్య సూత్రం' భర్త బదులు భార్య కూడా ఉదయ సంధ్యా సంస్కారాలు చేయవచ్చని చెప్తుంది. భర్తను తమ చేతిలో పెట్టుకొని ఆడించే భార్యలు కూడా ఉండేవారని, ఈ సూత్రం ప్రకారం తెలుస్తోంది.

ధర్మశాస్త్రాలు స్త్రీల పట్ల కొంత అలక్ష్యాన్ని చూపించాయి. బాదరాయణ, మనుస్మృతులు భార్య మగ సంతానాన్నివ్వలేక, ఆడపిల్లలనే కంటూ ఉంటే, పెళ్ళి అయిన 12వ సంవత్సరం ఆమెను వదిలేయవచ్చు. పుట్టిన పిల్లలందరూ చనిపోతే, 15 సంవత్సరాల తర్వాత, ఒకవేళ ఆమె గయ్యాళితనంతో నిత్యం కలహిస్తూ ఉంటే, వెంటనే వదిలేయవచ్చు అని చెప్పాయి. 'ఆపస్తంబ సూత్రం'లో భార్య మగబిడ్డనివ్వలేని, మత సంస్కారాల్లో పాల్గొనని సందర్భంలో, రెండవ భార్యను తెచ్చుకోవచ్చు అని చెప్పబడింది. కాని 'వశిష్ట సూత్రం' (XXVIII 2.3) భార్య గయ్యాళిదైనా, పాపాలు చేసినా, ఇంటిని వదిలెళ్ళిపోయినా నేరం చేసినా, దొంగలచేతబడినా

BRAOU

కూడా వదిలివేయకూడదని చెప్పుంది. అలాంటివారు తపస్సుచేసి, తిరిగి పవిత్రులవడానికి అవకాశముంది. ఆపస్తంభ సూత్రాలు మగవాడు భార్యను వదిలేస్తే, అతన్ని ఎన్నో కష్టనష్టాలకు గురయ్యేట్లు చేసి, అదే భార్య భర్తను వదిలేస్తే తపస్సు చేస్తే చాలనడం గమనార్హం. ఈ సూత్రం ఒక్కటే భార్యకు – స్త్రీకి అన్యాయం జరగకుండా కాపాడేది. అలాగే, ఒక తండ్రి నేరం చేస్తే, కులం నుండి వెలివేయబడతాడు. కాని, అదే నేరం చిన్న కుమారుని కోసం తల్లి చేసినా అలా వెలివేయబడదు. అలాగే, మగవారికి శూద్ర వనితల పలన కలిగిన మగ సంతానానికి సంఘంలో సముచితమైన స్థానం లేదు. ఆడపిల్లలైతే కట్నం లేకుండా ద్విజుడు వివాహం చేసుకొంటాడు.

బాదరాయణ సూత్రాల్లో మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఏ స్త్రీనైనా బలవంతంగా ఎత్తుకొనిపోయి, ఏ కారణాల వల్లనైనా పెండ్లి కాకుండా ఉండిపోయినపుడు, అలాంటి స్త్రీలకి న్యాయపరంగా ఇంకొక వ్యక్తితో వివాహం జరపవచ్చు.

చివరిగా ఏ తండ్రి అయినా, కుమార్తెకు ఏ కారణాల వల్లనైనా యుక్తవయస్సులో వివాహం చేయలేకపోతే, మూడు నెలల నుండి మూడు సంవత్సరాల వరకు ఎదురుచూసి, ఆమె తనకు నచ్చినవాడిని తనంతట తానే వివాహం చేసుకోవచ్చు.

ఋగ్వేద కాలంనాటి సంఘంలో, వేదంలో (1.6.2.11, 71.1, 104.3.....9) మొదలైన ఋక్కుల ప్రకారం, ఏకపత్నీత్వ నియమం ఉన్నా, బహు భార్యాత్వత్వం అలవాటుగా కనిపిస్తుంది. దశరథునికి ముగ్గురు భార్యలైతే, శ్రీరాముడు ఏకపత్నీ వ్రతుడు. అయితే, రకరకాల కారణాల వల్ల బహు భార్యాత్వత్వం అమల్లోకి వచ్చినా, అది చాలావరకు క్షత్రియ వర్గానికి పరిమితమై ఉండేది. ఋగ్వేదంలో బహుభర్తృత్వం ప్రసక్తి లేదు. కాని, ఋగ్వేదం (X. 85, 37, 38) లో వివాహ సందర్భంలో, ఏకపత్ని, బహు భర్తల ప్రసక్తిని మహాభారతాది పురాణాలకు అన్వయించుకోవచ్చు. పతివ్రతా ధర్మం చాలా ఉత్తమంగా పరిగణించబడేది. అలాగే, భర్త కూడా నియమవంతుడై ఉండాలన్నది కూడా, సర్వసాధారణ విషయం.

ఋగ్వేదంలో కొంచెం తక్కువగా ప్రస్తావించబడ్డ విషయం యువతీ యువకుల మధ్య ప్రేమ కలాపాలు. ఆమోదయోగ్యం కాని ప్రేమ తిరస్కరించబడడం, మనకు ఇంద్రుని విషయంలో కనిపిస్తుంది. తండ్రి కుమార్తెల మధ్య, సోదర సోదరీమణుల మధ్య అక్రమ సంబంధం (incest) ఆమోదయోగ్యం కాదు.

7.3 విద్యా విధానం

ఉపనయన సంస్కారం ఋగ్వేద కాలం నాటికి అంతగా లేకపోయినా, మలి వేద కాలం నాటికి బహుళ ప్రాచుర్యాన్ని పొందింది. అయినా, యుక్తవయస్కులుగా ఉన్నపుడు ఉపనయన సంస్కారం వల్ల బాలురు గుర్తింపబడి, విద్యాభ్యాసానికి సిద్ధం అవుతారు.

మండూక శ్లోకాలు (VII. 103) ఆ కాలంనాటి విద్యావిధానం గురించి పేర్కొన్నాయి. అందులో ఐదవ ఋక్కు వేద పాఠశాలల్లో గురువు శిష్యులకు వేద పాఠాలను బోధిస్తున్నప్పుడు, శిష్యులు నేర్చుకుంటున్న పద్ధతిని మండూకాల (కప్ప) అరుపుతో పోల్చారు. మొదటి శ్లోకం ప్రకారం, వేద విద్యాబోధన వర్షాకాలంతో ఆరంభమౌతుంది కనక, అంతవరకూ ఎక్కడో ఉన్న మండూకాలు వాన రాకకు హర్షించి, అరుస్తున్నట్లు అనుకోవచ్చు. విద్యాబోధన అంతా గురుముఖతః జరుగుతుంది. అంతా నోటితోనే నేర్చుకోవాలి. అయితే, వాగ్వివాదాల ప్రసక్తి ఋగ్వేదంలో (X. 11)లో ఉంది. బ్రహ్మచర్యం, బ్రహ్మచారి అన్న పదాలు ఋగ్వేదంలో

(X. 109)లో కనిపిస్తాయి.

అధర్వణ వేదంలో విద్యార్థి దశలో బ్రహ్మచర్యాశ్రమాన్ని గూర్చి చెప్పబడింది. గురుకులంలో ఉండి గురువుకు శుశ్రూష చేయడం, అంటే, గురువుకు అగ్ని సంస్కారానికి కావలసిన సమిధలు ఏరుకొని రావడం, గురువుకు కావల్సిన ఆహారాన్ని ఇంటింటికి వెళ్ళి అడిగి తీసుకొని రావడం. తర్వాత గురుముఖతః విద్యాబోధన జరగడం గురించి వివరించబడింది.

సంఘంలో బ్రాహ్మణులకే విద్యాభ్యాసం పరిమితమైనా, ఇతర కులాలైన క్షత్రియ, వైశ్యులు కూడా విద్యాభ్యాసానికి వస్తే, వారికి ఉపనయన సంస్కారం చేసి గురుకులంలోకి తీసుకొని, విద్య నేర్పించడం జరుగుతుంది. విద్యాభ్యాసం దీక్షతో, అంకిత భావంతో జరుగుతుంది. గురువంటే భక్తిభావం, శిష్యుడంటే వాత్సల్యం కన్పిస్తాయి. విద్యాభ్యాసంలో గణితం, వ్యాకరణం, తర్క శాస్త్రాల్లో బోధన జరిగేది. విద్య చాలా ఉన్నత స్థాయిలో ఉండేది. విద్యార్థులు తమకు గురు కులంలో గురువు ఉచిత విద్యాబోధన, నివాసం కల్పించినందుకు విద్యాభ్యాసం పూర్తికాగానే, ప్రతి శిష్యుడు తనకు వీలైన గురుదక్షిణ ఇచ్చేవారు. అలా విద్యార్థి గురుకులంలో విద్య, శారీరక, నీతిపరమైన శిక్షణ, క్రమశిక్షణ పొందుతాడు. ఇలాంటి గురుకులాలు ఋగ్వేద కాలం నుండే దేశం అంతటా ఉన్నాయనడానికి నిదర్శనం, కణ్వాశ్రమంలాంటివి.

7.3.1 విద్యాభ్యాన విధానం

ఆనాటి విద్యావిధానం ముఖ్యంగా, జ్ఞాపకశక్తిని మెరుగుపర్చేలా ఉండేది. ప్రతి శ్లోకం ఆచార్యుడు చెప్పిన తర్వాత తిరిగి చెప్పడం, కంఠస్థం చేయడం, ప్రతి ఋషికి సంబంధించిన శ్లోకాలను నేర్చుకోవడం లేదా 'అనువాక' అనబడే చిన్న శ్లోకాలను నేర్చుకోవడం. దానివల్ల పూర్తి వేదజ్ఞానం కాకపోయినా, కొంతవరకూ సూక్ష్మంగా నేర్చుకొని, జ్ఞానవంతులవడానికి అవకాశముంది. ముఖ్యంగా క్షత్రియులు, వైశ్యులు విధిగా వేదశాస్త్రాలను కూలంకషంగా నేర్చుకోకుండా, కొంతవరకు ఇలా నేర్చుకుంటారు. తర్వాత ఎవరి అవసరానికి తగినట్లు కులవిద్యలు నేర్చుకొంటారు. 12 సంవత్సరాల నుండి వేద విద్యాపారంగతులయ్యే వరకు, సుమారు 20వ సంవత్సరం వయస్సు వరకు నేర్చుకుంటారు.

విద్యాభ్యాసంలో వాగ్వివాదాలు విద్యార్థుల్లోను, ఇతర పండితుల్లోనూ ఉండేవన్న విషయం, గెల్చిన తర్వాత ఒక కర్మకాండను నిర్వహించడం వల్ల తెలుస్తోంది.

వేద విద్యాభ్యాసం శ్రావణ మాసంలో, వర్షాకాలంలో మొలిచిన చెట్లతో కూడుకున్న హితావరణంలో, ఉపాకర్మతో మొదలౌతుంది. విద్యాభ్యాసం తర్వాత 4 1/2 నుండి 5 లేదా 6 నెలలు సాగుతుంది. దీని తర్వాత 'ఉత్సర్గ' అనబడే కార్యక్రమం మొదటి స్థాయి విద్యాభ్యాసం ముగిసిందనడానికి బరువబడుతుంది. ధర్మశాస్త్రాల ప్రకారం, వేదాలు బాగా వెలుతురున్న పగలు, వేదాంగాలు రాత్రిపూట చదవాలి. ఇలా సంవత్సరంపాటు సాగే విద్యాభ్యాసంలో ఎన్నో ఆటంకాలు, గ్రహణాలు, బంధుమిత్రుల చావులు మొదలైనవి వస్తూంటాయి. తొందరపడి తప్పులు నేర్చుకోవడం కన్నా, ఆలస్యమే ఫరవాలేదని భావించబడేది.. వేదాలకు సంబంధించిన గ్రంథాలు గ్రంథస్తం చేయడానికి వీలులేదు. పవిత్రమైన స్థలంలో, ఆత్మశుద్ధితో నేర్చుకోవాలి. విద్య పూర్తైన తర్వాత జరిగేది 'సమావర్తన – స్నాతకోత్సవం'.

తర్వాత స్నాతకుడు గృహస్థాశ్రమం స్వీకరించి, విద్యాబోధన చేయవచ్చు. తన నిత్యకృత్యమైన పంచ మహాయజ్ఞాలను నిర్వహించేటప్పుడు 'స్వాధ్యయనం' చేయవచ్చు. విద్యాభ్యాసంలో గురువు కీలక పాత్ర నిర్వహిస్తాడు. తన గృహాన్ని గురుకులంగా చేసి, విద్యార్థి బాగోగులను చూసుకొంటాడు. శారీరక సంబంధమైన

BRAOU

శిక్షణ కూడా విద్యాభ్యాసంలోని భాగమే. యోగాభ్యాసం, ముఖ్యంగా, ప్రాణాయామం ద్వారా ఊపిరి బిగబట్టి, ఉభయ సంధ్యాసమయంలో చేసే ప్రక్రియను చేసేవారు. సూత్రాల్లో బ్రహ్మచర్య దశలో విద్యాభ్యాస వివరాలున్నాయి. గృహసూత్రాల్లో, 'ఉపనయన' సంస్కార వివరాలున్నాయి. ఉపనయన సంస్కారం పూర్తికాగానే, విద్యార్థి ధరించవల్సిన దుస్తులు, వేషధారణ ప్రత్యేకంగా ఉంటాయి. విద్యార్థి జింక చర్మం ధరించి, పవిత్ర యజ్ఞోపవీతాన్ని ధరించాలి. నీతి నియమాలకు కట్టుబడడం, ఆనాటి విద్యావిధానంలో ముఖ్యమైంది. సత్ప్రవర్తన, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం, క్రమశిక్షణ వారికి గురువు పెట్టిన భిక్ష. అందుకే గురువులు, తలిదండ్రులు పూజనీయులని చెప్పబడింది. 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ' అన్న ఉపనిషత్తు వాక్యాలు నేటికీ మన చెవుల్లో మారుమోగుతాయి. బ్రహ్మచర్యంతో విద్యాభ్యాసం పూర్తి అయ్యాక విద్యార్థి గృహస్థాశ్రమం చేపట్టి, సంసార యాత్రలో వంశాభివృద్ధి, ఇతర గృహ సంబంధమైన బాధ్యతలను చేపడతాడు.

ఉపనిషత్తుల లాంటి తర్వాతి వేద సాహిత్యం మనకు విద్యాభ్యాస విధానం వల్లే అందాయన్న విషయం గమనించాలి. సత్యకాము జాబాలి, శ్వేతకేతు, అరుణేయలాంటివారివల్ల, గురుకులంలో విద్యాభ్యాసం చివరి దశలో 'అనుశాసన' అనే చివరి పాఠం వల్ల, ఆ కాలపు విద్య ఎంత ఉన్నత స్థాయిలో ఉండేదో తెలుస్తుంది. అలాగే బ్రాహ్మణులు, క్షత్రియుల దగ్గరి నుండి వేదాంతం నేర్చుకొనేవారన్న విషయం, 'బృహదారణ్య' ఉపనిషత్తు వల్ల తెలుస్తోంది.

స్త్రీలకు ప్రత్యేకంగా విద్యా సదుపాయాలు లేకపోయినా, విద్యావంతులైన స్త్రీల ప్రసక్తి ఉంది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, స్త్రీ అధ్యాపకులు, ఉన్నతమైన జ్ఞానాన్ని సంపాదించినవారున్నారనడానికి యాజ్ఞవల్క్యుడు ఆయన భార్య మైత్రేయిల మధ్య జరిగిన వాగ్వివాదాలు, గార్గి, వాచకనవిల బ్రహ్మజ్ఞానం కూడ చెప్పుకోదగినవి.

ఈ ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు, బ్రహ్మవిద్యలతో బాటు, వ్యాకరణం, గణితం, రాశి, నిధి, వాకోవాక్య, నీతిశాస్త్రం, జ్యోతిష్యం, సైనిక యుద్ధవిద్యలు, పాముల గురించిన జ్ఞానం, భూతవిద్య మొదలైనవి ఉన్నాయి. కాని, దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, వీటికి సంబంధించిన గ్రంథాలు లేకపోవడం. సాధారణంగా తండ్రి గురువై ఇరుగుపొరుగు విద్యార్థులతోబాటు, తన కుమారులకు విద్యాబోధన చేస్తాడు. విద్యార్థుల్లో మేధను పెంచడానికి గాయత్రీ మంత్రబోధన (XII 62.10) కూడా జరుగుతుంది.

అయితే ,వేద కాలపు ప్రజలకు రాత విధానమే తెలియదా? అన్న ప్రశ్నకు లభించే సమాధానమేమిటంటే, ఖచ్చితంగా క్రీ.పూ. 4వ శతాబ్దం వరకూ ఒక ప్రత్యేక లిపి ఏర్పడలేదు. కనుక, వారికి రాత పని తెలియదేమో అని అన్పిస్తుంది. పైగా, భారతీయులు పశ్చిమాసియా దేశాల నుండి లిపిని నేర్చుకొని ఉంటారన్న విషయానికి కారణం, అశోకుని కాలంనాటి బ్రాహ్మి లిపికి, క్రీ.పూ. 9వ శతాబ్దానికి చెందిన సెమెటిక్ లిపి విధానానికి దగ్గర సంబంధం ఉండడమే. అయితే, సింధూ నాగరికత నాటి ముద్రికల ప్రకారం, బొమ్మల లిపి (pictographic script) వాడకంలో ఉన్న విషయం మనలను ఆలోచింపజేస్తుంది. అంతేకాదు, సింధూ లిపి నుండే బ్రాహ్మి లిపి కూడ వచ్చిందన్న విషయం అర్థమౌతుంది. ఇంకా ఇప్పుడున్న ఋగ్వేదం కూడా సింధూ లిపికి, బ్రాహ్మి లిపికి మధ్యస్థంగా ఉన్న లిపిలో పొందుపర్చబడిందని అనుకోవచ్చు.

7.3.2 ప్రవర్తన నియమావళి

అతిథి సత్కారం అనేది పరంపరగా సాగుతున్న ఆచారం. సాంఘికంగానే కాక, మతపరంగా కూడా అది ప్రాచుర్యాన్ని పొందింది. ఇంటికి వచ్చిన అతిథికి భోజనం పెడితే, తాము నిత్యం నిర్వహించే పంచ

BRAOU

మహాయజ్ఞాల్లో ఒకదానితో సమానమనే భావం బలపడింది. అసలు అతిథి రాకపోతే, ఇంటివారు భోజనానికుపక్రమించరు కూడ. ఇంటికి వచ్చిన బంధువులు అధ్యాపకుడు, రిత్విక్కులు, దేశాన్ని ఏలే రాజు, స్నాతకుడు, పిల్లనిచ్చిన మామగారు, ఇంటి అల్లుడు అందరూ అతిథులే. ఈ అతిథులు తిథి, వారం, సమయమనేది లేకుండా, ఎప్పుడు వచ్చినా ఆదరించబడే తీరు ఒక అద్భుతం. కాళ్ళు కడుగుకొనేందుకు నీళ్ళివ్వడం, అర్ఘ్యపాద్యాదులివ్వడం అంటే, నీరు పుక్కిలించడానికి, త్రాగడానికి, పాలు, తేనె నేయిని కలిపిన మిశ్రమం కూడా అతిథికిస్తారు. తర్వాత మాంసంతో సహా షడసోపేతమైన భోజనం, ఒకవేళ పండగ, శుభకార్యాల సందర్భమైతే గోమాంసాన్ని కూడా వడ్డిస్తారు.

స్నాతకులు పాటించవల్సిన నియమాలు, వాసనలేని పూదండ ధరించకూడదు. ఆడపిల్లలను ఏడిపించకూడదు కొన్ని నిషిద్ధ శబ్దాలను మాటల్లో ప్రయోగించకూడదు.

ప్రతి గృహస్థు పాటించవల్సిన నీతి నియమాలు కొన్ని ఉన్నాయి. సూనవత్యం, భార్య పట్ల, విద్యార్థుల పట్ల, సేవకుల పట్ల, సహచరులపట్ల విశ్వాసం, మానసికంగా, శారీరకంగా కూడా పవిత్రంగా ఉండడం, పెద్దల ఎడల భక్తి గౌరవాలను కల్గి ఉండడం అనేవి.

అలాగే, గృహ్య సూత్రాల్లో సుఖజీవనానికి, మానసిక శారీరక ఆరోగ్యానికి కూడ కొన్ని కర్మకాండలను నిర్వహించడం గమనార్హం. కుటుంబంలోని భార్యాపిల్లలు సుఖంగా, ఆరోగ్యకరంగా ఉండాలని ప్రార్థిస్తూ నిర్వహించే కార్యక్రమాలున్నాయి. ఈ గృహ్య ధర్మశాస్త్రాలు స్థానికంగా పాటించే ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ, అవసరమైతే వాటికే ఎక్కువ ప్రాముఖ్యతనివ్వడం పరిపాటి.

7.4 వినోదాలు

సంగీతం, గాత్రం, వాయిద్యాలు రెండూ ఆ కాలంనాటి వినోదాల్లో ముఖ్యమైనవి. మండూక శ్లోకంలో బ్రాహ్మణులు సోమరస పానం చేస్తూ, సంగీతపరంగా గానం చేస్తున్న ప్రసక్తి ఉంది. ఋగ్వేదం (VII.103.7.8) శ్లోకాలలో, రకరకాల గాత్ర శబ్దాలు మనకు వినిపిస్తాయి. గానం చేయడాన్ని శ్లోకాలు నేర్చుకోవడానికి, వర్ణించడానికి కూడా ఉపయోగించారు. సామవేదం సంగీత నిధి అన్న సంగతి మనకు తెలిసిందే. ఆనాటి వాయిద్యాల్లో తీగలతో వున్న వాయిద్యం వీణ, గాలితో వాయించబడే మురళి, పెద్దగా మోత చేసే డప్పులు, నృత్యాంగనల ప్రసక్తి కూడా ఉంది. పురుషులు నృత్యం చేసిన ప్రసక్తి (X 76.6) లో ఉంది. సంభాషణ పూర్వక శ్లోకాలు ఋగ్వేదంలో నాటక స్వరూపానికి నాంది పలికినాయని చెప్పొచ్చు. రథ పోటీలు, గుర్రపు పోటీలు, రాజసూయ, వాజపేయయాగాల సందర్భంగా నిర్వహించే పోటీలు, ఆ కాలపు ప్రజలకు ప్రియమైన వినోదాలు. జూదం వినోదపరంగా ఆడబడినా, క్రమేపి దానికి దాసులై, నాశనమైన సంఘటనలు మనకు కన్పిస్తాయి. క్రమేపి అన్ని శుభకార్యాల్లోను మంగళహారతుల రూపంలో గానం చేయడం ఆచారమై పోయింది.

7.5 ఆహార పానీయాలు

పాలు – పాల పదార్థులు ముఖ్యమైన ఆహారం. 'అపూప' అనే ఒక తియ్యని పదార్థాన్ని యవలనే ధాన్యపు గింజలను విసురురాయితో పిండిచేసి తినడం ఒక ఆచారం. పాల నుండి పెరుగు, వెన్న, నేయి లాంటి పదార్థాలు

తీసి, ఇతర పదార్థాల్లో కలిపి వాడేవారు. పాలను తోడు పెట్టి, పెరుగును చేయడం, పెరుగును చిలికి వెన్నను తీయడం, వెన్నను కరగించి నేయి తయారు చేయడం, వీటినన్నిటిని తేనెతో కలిపి పంచామృతం లాంటివి తయారుచేసి సేవించడం కన్పిస్తుంది.

వరి, యవలు నిత్యం వాడితే, గోధుమ ప్రత్యేక సందర్భాల్లో వాడేవారు. 'మాష, 'ముద్గ' అనబడు రకరకాల చిక్కుడుకాయలు, ఆవాలు, నువ్వులు, పండ్ల వాడకం వారికి తెలుసు. ఆనాటి ప్రజలకు షడ్రుచులు కల్గిన ఆహారం వాడకం తెలుసు. ఆహారంలో పలురకాలైన 'అక్షతదాన' అన్న పదాన్నిబట్టి, బియ్యం రూపంలోనే వాడకం ఎక్కువగా కనిపిస్తోంది. నూకల రూపంలో కన్నా. బియ్యం ఉడికించి వేయించి చేసిన ఆహారం, పిండిచేసి తయారుచేసిన ఆహారం 'పురోదాస' అనే ప్రత్యేక వంటకం తయారీలో కూడ కష్టమైనది కూడ వాడకంలో ఉంది.

అందరూ శాకాహారులు కారు. మాంసం కూడా ఆహారంలో ఒక భాగమే. ఎద్దు, గొఱ్ఱె, మేకల మాంసం సాధారణంగా ఉపయోగించేవారు. మాంసాన్ని ఖండాలుగా చేసి వేయించి, మట్టిపాత్రల్లో లేదా లోహపాత్రల్లో వండేవారు. మాంసాహారం అనేది యజ్ఞ యాగాదుల సందర్భంలోనే వాడుతున్నా, యజ్ఞాలను పెద్దెత్తున తరచు నిర్వహించేవారు. అశ్వమేధ యాగం సమయంలో గుర్రపు మాంసం తింటే, దానికున్న శక్తి, వేగం వస్తాయన్న నమ్మకం ఉండేది.

ఆవు గోమాతగా భావింపబడి చంపకూడదన్న నమ్మకం, ఋగ్వేదంలో పేర్కొనబడింది. పైగా, గోవు గురురూపంగా కూడ భావింపబడింది అయితే, ఈ గోమాంసం ఎలా తినగల్గుతారనేది కొన్ని విషయాల మీద ఆధారపడి ఉంది. మొదటిది, గోవు మాంసం, కాక, ఎద్దు మాంసం తినడానికి ఉపయోగించారు. రెండవది గోమాంసం యజ్ఞ యాగాదుల సమయంలో దేవుడికి ప్రియంగా అర్పించిన మాంసం కనుక తినడానికి ఆమోదింపబడింది. మూడవది, ఋగ్వేదంలో కూడా వదిలేసిన గోవులను మాత్రమే బలివ్వాలనడం వల్ల, ఈ సందర్భాల్లో మాంసాహారం సమంజసమన్న విషయం గమనించదగింది.

రకరకాలుగా పాలతో, పండ్లతో, కూరలతో, ధాన్యంతో వంటకాలు చేయడం పరిపాటైంది. పాలను వేడిచేసి ప్రియంగా తాగేవారు. ఋగ్వేదంలో పేర్కొనబడ్డ సోమరసం హోమం సమయంలో ప్రియమార సేవించేవారు. సోమరసం పాలతోనూ, పులిసిన పాలతోనూ, యవలతోనూ కలిపి మూడు రకాలుగా సేవించేవారు. ఋగ్వేద కాలంలో 'సుర' అన్న మత్తు పానీయం కూడా సేవించడం జరిగింది. సుర అంటే ఒక రకం గింజల నుండి తీసిన రసం కావచ్చు. కాని, ఈ పానీయాన్ని సేవించడం వల్ల, ప్రజలు తప్పుదోవ పడుతున్నారని చాలామంది వ్యతిరేకించారు. మధువు అంటే, సోమరసం అని, పాలు అని లేదా ఒక తీయని పానీయమని లేదా తేనె అని ఋగ్వేదంలో చెప్పబడింది.

7.6 దుస్తులు – అలంకరణ

ఋగ్వేద కాలంనాటి దుస్తులు రెండు భాగాలుగా ఉండేవి. 'వాస' అంటే క్రింది భాగపు వస్త్రం, 'అధివాస' అంటే పై భాగపు వస్త్రం. తర్వాతి వేద కాలంలో 'నివి' అనబడే లోపలి వస్త్రం కూడా ఉపయోగించబడింది. క్రమేపీ ఉత్తరీయం, అంతరీయాలు ప్రాచుర్యాన్ని పొందాయి. మరుత్తులు జింక చర్మాన్ని, మునులు ఇతర చర్మాలను ధరించేవారు.

BRAOU

వేద కాలంలో రంగురంగుల తలపాగా ధరించే అలవాటు కనిపిస్తుంది. రాజు దగ్గర నుండి సామాన్యుల వరకు ఆడా మగా లేడా లేకుండా, తలపాగా ధరించే అలవాటుంది. 'అతక' అన్న మాటకు సరైన అర్థం తెలియకపోయినా, నేసిన తర్వాత తయారు చేయబడిన దుస్తుల్లో ఒక రకమేమో అనిపిస్తుంది. ఉన్నిదుస్తుల వాడకం కూడా ఉంది. 'ద్రాపి' అన్న వస్త్రం, 'పెస' అన్న వస్త్రాన్ని నృత్యాంగనలు ఉపయోగించేవారు. వివాహ సమయంలో పెళ్ళికుమార్తె ధరించే ప్రత్యేక వస్త్రం పేరు 'వధూయ'. పెళ్ళి అయాక దానిని బ్రాహ్మణునికి దానం చేస్తారు. మరుత్తులు ధగధగ మెరిసే బంగారు తీగలతో నేసిన బట్టలు ధరించేవారని చెప్తారు. మొత్తం మీద చక్కని రంగురంగుల వస్త్రాలు ధరించేవారని తెలుస్తోంది. అయితే, స్త్రీ పురుషులకు గల వస్త్రవై విధ్యం మనకు తెలియదు. ఉన్ని, పట్టుబట్టలు వాడకం సందర్భానుసారంగా ఉంది. ఉపనయన సందర్భాలలో స్నాతకుడు ధరించవల్సిన దుస్తులు కూడా వేరే ఉన్నాయి. ఉత్తరీయం, అంతరీయం, తలకు పాగా, జంతుచర్మాలతో చేసిన పాదరక్షలు ధరించడం అలవాటు. గృహ్యసూత్రాల్లో ఒకచోట పాదరక్షల వాడకం వల్ల, కాలికి పుండు అవకుండా ఉండే విధంగా తయారవాలన్న ప్రసక్తి ఉంది.

7.6.1 ఆభరణాలు

ఋగ్వేదంలో ఎన్నోరకాల ఆభరణాల ప్రసక్తి ఉంది. కర్ణాభరణం బంగారంతో చేయబడి, స్త్రీ పురుషులు ధరించగలిగే విధంగా ఉండేది. ఈ సందర్భంగా పూజింపబడే దేవత 'హిరణ్య కర్ణ' అంటే; బంగారు చెవులు కలవాడంటారు. 'కురీర' (Kurira) అనే శిరోభూషణం సాధారణంగా స్త్రీలు ముఖ్యంగా వధువు ధరించే ఆభరణం. దీనినే 'న్యోచని' (Nyochani) (X 85.6) అని కూడా అంటారు. 'ఖాదీ' (Khadi) అన్న ఒక ఆభరణం చేతికి వంకీలలాగ, పాదాలకు పట్టాలులాగ ధరిస్తారు. 'నిష్క' అనేది కంఠాభరణం. ఇదే ధనరూపంగా కూడా ఉపయోగించడం మనం చూస్తాం. మణిహారం మరో కంఠాభరణం. ఇది ముత్యాలతోనో లేదా వజ్రాలతోనో చేయబడుతుంది. 'రుక్మ' అనేది గుండెల మీదకు వచ్చే మరొక ఆభరణం. పూలదండలు కూడా ముఖ్యంగా పురుషులు ధరించేవారు. ఒక ఋక్కులో అశ్వినీ దేవతలు తామరదండలు ధరించినట్లుగా పేర్కొనబడింది.

7.6.2. శిరోజాలంకరణ

శిరోజాలకు నూనెరాసి, దువ్విన సందర్భాలు కనిపిస్తాయి. 'ఉపాస్' అన్నమాట ప్రకారం, స్త్రీలు శిరోజాలను అల్లి, జడలాగ వేసుకొనేవారని తెలుస్తోంది. చిత్ర విచిత్ర ముడులుగా ముడిచేవారని అక్కడక్కడ పేర్కొనబడింది. నాలుగు పాయల అల్లికలతో స్త్రీలు తమ శిరోజాలను అల్లేవారని (X 114.31) తెలుస్తోంది. రుద్రుడు, పూషన్ లాంటి దేవతల శిరోజాలను బట్టి, మగవారు కూడ జడలు కలిగి ఉండేవారని తెలుస్తోంది. వశిష్టాది ముసులు తమ శిరోజాలను పైకి ముడిచి కుడిపక్కన ముడిలాగ చుట్టేవారు. మగవారికి గడ్డం, మీసం ఉండేవని, దానిని తీసేవారు కాదని (X 142.4) ప్రకారం తెలుస్తోంది. 'క్షుర' అంటే బహుశ క్షవరమని అన్పిస్తుంది. అలంకరణలో ప్రత్యేక శ్రద్ధ చూపబడింది. స్నానానికి పూర్వం, తర్వాత వాడే సుగంధ ద్రవ్యాలు శరీరానికి పూతగా పూయడం, స్నానాంతరం శరీరానికి పరిమళపూరిత వస్తువులు, కంటికి కాటుకరేఖలు దిద్దడం చేస్తారు. ఒక్కొక్క శుభకార్యానికి ఒక్కో విధంగా అలంకరణ చేయడం ఆసక్తికరమైన విషయం.

BRAOU

7.7 వైద్యం, పారిశుధ్యం

మంచి వైద్యులకు వారికి గల శక్తిసామర్థ్యాలను బట్టి గౌరవం ఉండేది. అశ్వినీ దేవతలు అనబడే ఇద్దరు దేవతలు అతి చాతుర్యంగా, ఆశ్చర్యకరంగా వ్యాధులను నయం చేసేవారని, వారి శస్త్రచికిత్సా చాతుర్యం అద్భుతమని చెపుతారు. ఆ కాలపు వ్యాధుల్లో 'యక్ష్మ' అనేది తరచు పేర్కొబడింది (11.22.9, X 85.31, 97.11, 12 etc). బహుశ ఇది క్షయ వ్యాధి కావచ్చు. ఇది శరీరాన్నంతా బలహీనం చేసే వ్యాధి. (IX 112.1) లో విరిగిన శరీరభాగాలను అతికే విధానాన్ని బట్టి, వైద్య చికిత్సా అన్నది అప్పటికే ఒక వృత్తి అని అర్థమౌతోంది. 'ఓషధీయ శాంతిః' అన్న (X. 97) శ్లోకం ఔషధ విలువ కలిగివున్న చెట్లకు గల వ్యాధిని నయంచేసే శక్తిని తెల్పుతోంది. ఆనాటి వైద్యశాస్త్ర గ్రంథాల్లో, వనమూలికలు మంచి శక్తి కలిగిన ఓషధులుగా పేర్కొబడ్డాయి. దీర్ఘాయువు కోసం తరచు ప్రార్థనలను చేసేవారు. అంధత్వాన్ని, దీర్ఘకాల వ్యాధులను, అంగవైకల్యాన్ని సరిచేసే దివ్య వైద్యులుగా అశ్వినీ దేవతలను పేర్కొడం జరిగింది. ఋగ్వేదంలో (VIII 18.8, 22.10, 1.116, X 39.3) వారు వ్యవనుడనే వాడిని ఏ విధంగా నయంచేసి, శక్తివంతుని చేశారో, నీటిలో మునిగి చనిపోయాడనుకొన్న రేభాముని (Sage Rebha)ని రక్షించారో, అత్రి సప్తావధ్రి (Atri Saptavadhri) ఊపిరి ఆడక సతమతమౌతూంటే, ఎలా నయం చేసారో, పరావృజ (Paravrij)ని అంధత్వం నుండి, యుద్ధంలో అంగవైకల్యం పొందిన విస్పాలునికి ఒక ఇనుప అంగాన్ని ఎలా అమర్చారో గమనిస్తే, వారికి శస్త్ర చికిత్సలో కూడా అనుభవం ఉన్న సంగతి గమనిస్తాం.

ఆ కాలపు ప్రజలు తరచు ఎదుర్కొనే వ్యాధులు అథర్వణ వేదంలో పేర్కొబడ్డాయి. క్షయ, నీళ్ళ విరోచనాలు, పుండ్లు, వాపులు, గడ్డలు, కీళ్ళవాపులు, తలనొప్పి, కామెర్లు, కంటికి సంబంధించిన వ్యాధులు, మూర్ఛలు, దెబ్బలు తగిలి ఎముకలు విరగడం, పాము ఇతర విష కీటకాల కాటు, విషపానం, కుష్టు లాంటి వ్యాధులు, వాటికి చికిత్స వివరించబడ్డాయి. రక్తస్రావం ఆపడానికి ఇనుకతో నింపిన సంచులను కట్టడం చాలా ఆసక్తిగల విషయం. పరిశోధన నిమిత్తం జంతుమానవ శరీరాలను 'విచ్ఛేదనం' అంటే కోసి, వివరాలు తెల్సుకోవడం మరో ఆశ్చర్యకరమైన విషయం. ఋతువులు మారినపుడు తరచు వ్యాధిగ్రస్తులవుతారన్న విషయాన్ని వారు పరిశీలించి, పరిశోధించారు.

కుటుంబమంతా సంపూర్ణ ఆరోగ్యంతో, సంపూర్ణ ఆయుష్షు కల్గి ఉండాలని పూజలు చేసేవారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూత్రం పాటించేవారు. అన్నిటికన్నా ముఖ్యమైంది, వ్యాధి నిరోధక పద్ధతి. వ్యాధి నిరోధక పద్ధతి చికిత్స కన్నా సయమన్న విషయం తెల్సుకొని జాగ్రత్త పడ్డం ఒక విశేషం. చిన్నపిల్లలకు ఉధృతంగా జ్వరం వచ్చినపుడు వచ్చే మూర్ఛలకు కారణం, శునక, భూత ప్రభావమే అని అనుకొనేవారు. అంటే, ప్రతి వ్యాధికి వెనక కొన్ని క్షుద్రశక్తుల ప్రభావం కారణమని, అవి తగ్గడానికి తగిన పూజా పునస్కారాలను జరిపేవారు. అమ్మవారు లాంటి వ్యాధులు అలా సంభవించినవే అన్న నమ్మకం ఈనాటికి ఉంది. గర్భిణి స్త్రీకి సుఖప్రసవమవడానికి, కొన్ని కర్మకాండలు అలాగే, తలనొప్పి, విష కీటకాలు, పాము కాటుకు మంత్రాలు వేయడం, నేటికీ మనకు అనుభవమే.

ఆనాటి గృహ్య సూత్రాల్లో పేర్కొన్న ప్రతి నియమం వెనకా, పరిశుభ్రత ఉంది. కర్మకాండలు నిర్వహిస్తున్న సమయంలో, నీటిని ఉదారంగా వాడమని, విధిగా స్నానం చేయాలని, ఇళ్ళూ వాకిళ్ళు ఊడ్చి శుభ్రం చేయాలని, పసుపూ, పేడా కలిపి కళ్ళాపు జల్లితే, విషకీటకాలు ఇంటిలోకి చేరవని అర్థం ఉంది. అందచందాల కోసం, ముచ్చటైన ముత్యాలముగ్గులు తీర్చాలని, గోడలు, నేల తరచు అలకాలని, చెత్తచెదారం, వాడిన మురుగు నీరు మొదలైన వాటికి ప్రత్యేక స్థలం ఉండాలని నియమాలున్నాయి. స్నాతకుడు నోటిలోని పదార్థాన్ని పక్కవారి

BRAOU

నీటిలోకి ఉమ్మి వేయకూడదని, పశువుల కొట్టాలు సాధ్యమైనంత దూరంగా పరిశుభ్రంగా ఉంచాలని, ఇలా ఎన్నెన్నో నియమాలను చేశారు. ఈ పనులన్నీ చేస్తున్నపుడు శరీరభాగాలకు కదలిక ఏర్పడి, ఆరోగ్యంగా ఉంటారని భావం. ఇంత అద్భుతమైన శాస్త్రీయపర ధోరణికి మతభావాన్ని చేర్చి, విధిగా అందరినీ ఆచరించేలా చేయడం గమనార్హం.

7.8 కుల వ్యవస్థ

ఋగ్వేద రచనాకారులైన ఆర్యులు తమకు, అక్కడే ఉన్న నల్లని వర్ణంలో ఉన్న మరొక వర్గానికి తేడా చూపించుకొన్నారు. తాము ఆర్యులుగా అంటే, మన్నించ, గౌరవించదగిన వారుగా చెప్పుకొన్నారు. పైగా, శ్వేతవర్ణంతో సుందరమైన దేహ సౌష్ఠవంతో, సరళమైన భాష, స్వచ్ఛమైన జీవన విధానం, నాగరికత కల్గినవారని చెప్పుకొన్నారు. ఆకార, వర్ణ భాషా, వేషాల్లో పూర్తిగా విరుద్ధంగా వున్న అనార్యులను 'దాసులు'గా, 'దస్యులు'గా చిత్రీకరించారు. నల్లని వర్ణంతో వున్న ఈ అనాగరీకులు అధిక పశుసంపద కల్గి ఉండి బలమైన 'పుర' అనే దుర్గాల్లో నివశిస్తున్నా కూడా, ఆర్యులు లెక్క చేయలేదు. పైగా, వారిని తమ యుద్ధదేవత ఇంద్రుడు సులభంగా జయించి, 'పురందరుడన్న' పేరు పొందాడని చెప్పుకొన్నారు. ఇలా ఆర్య అనార్యుల మధ్య జరిగిన పోరాటంలో, దస్యులు ఓడి, బానిస స్థాయికి దిగజారారు. అప్పటినుండి వారిని, వారి సంపదను, శ్రమను తమ సొంతం చేసుకోవడంతో, మన దేశంలో కుల వ్యవస్థకు నాంది ప్రస్తావన జరిగిందని చెప్పొచ్చు. దస్యుల్లోనే పణి అనబడే ఒక వర్గానికి పశుసంపద ఎక్కువగా ఉండేది. బహుశ వీరే కాలాంతరంలో వణిని ఏలే వైశ్యులై ఉండొచ్చు. అటు ఇతర ఆర్య తెగలతో ఆధిక్యత కోసం పోరాటం, ఇటు వర్ణ విభేదంతో దస్యులతో పోరాటం. ఇది ఋగ్వేదంలో ప్రస్తావించిన దశరాజ యుద్ధం (Battle of Ten Kings) క్రింద పరిణమించింది. ఈ పది తెగలు ఋగ్వేదం ద్వారా మనకు పరిచయమే. వారిలో ముఖ్యులు భరతులు, పురులు, యదులు, దృహ్యులు, అనులు, తురవాసులు మొదలైనవారు. భరత వంశానికి చెందిన సుదాసుడు పది రాజుల యుద్ధంలో నాయకత్వం వహించాడు. బహుశ ఈ దాస అన్న శబ్దం దాసులతో సంబంధాన్ని సూచిస్తుందేమోనని అనుకోవచ్చు. మొత్తం మీద, ఇన్ని రకాల దాసులు ఉండడం పల్ల వివిధ వర్గాలుగా ఏర్పడ్డం జరిగింది.

7.8.1 పుట్టుక – పురుషసూక్త సిద్ధాంతం

ఆనాటి సమాజం ఆర్థికంగా వృత్తిని బట్టి, కొన్ని తరగతులుగా విభజింపబడింది. నేతగాళ్ళు, లోహకారులు, పడ్రంగులు, చర్మకారులు, రథాలు తయారుచేసేవారు, పురోహితులు మొదలైన వృత్తులు చేపట్టినవారు ఆనాటి సమాజంలో కన్పిస్తారు. కాని, బిచ్చగాళ్ళు, కూలివాళ్ళ ప్రస్తావన ఎక్కడా ఋగ్వేదంలో లేదు. కుల ప్రస్తావన కూడా ఎక్కడా లేదు. మొదట్లో, ఆర్యుల్లో ధనవంతులైన యుద్ధవీరులు, పూజ పునస్కారాలను నిర్వహించే పురోహితులు, సామాన్యులు అన్న మూడు వర్గాలుండేవి. ఇవి కేవలం ఆనాటి సామాజిక ఆర్థిక స్థితిగతులను సూచించేవి మాత్రమే. దస్యులతో సహజీవనం చేసాక ఆర్యుల్లో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు అని, నాల్గవ తరగతిగా శూద్రులు అంటే, ఆర్య-దస్య జాతి మిశ్రమానికి చెందినవారుగా పరిగణింపబడ్డారు.

బ్రాహ్మణ శాఖలో అసంఖ్యాకమైన గోత్రాలున్నాయి. గోత్రం అంటే, పశుశాల, పశువులను గుర్తించడానికి ఒక ముద్ర అనవచ్చు. స్వగోత్రీకుల్లో వివాహం నిషేధం. వేరొక గోత్రీకులతో వివాహ సంబంధం ఏర్పర్చుకోవాలన్న నియమం ఉంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండేది. పశువుల మీద ఉమ్మడి యాజమాన్యం నెరపేవారు. అలా కాలక్రమేణ గోత్రం అంటే, ఒక కుటుంబంవారు లేదా ఒక ఇంటిపేరు గలవారు, లేదా ఒక శాఖవారు అనే అర్థం

BRAOU

వచ్చింది. ఆస్తిపాస్తులు ఏ రూపంలో ఉంటాయో, వాటిని అదుపుచేసే మానవ సమూహానికి అలాంటి పేరే వస్తుంది. భూమి ఆస్తిగా పరిణమించిన తర్వాత కూడ, సంపదకు పశువులే కొలమానమయ్యాయి. కనుకనే వి.ఎ. స్మిత్ చెప్పినట్లు కులం అంటే, కొన్ని కుటుంబాల సముదాయం అని, కొన్ని నియమాలను వారికి వారే ఏర్పర్చుకొని, ఆహారవ్యవహారాల్లో, వివాహాది శుభకార్యాల్లోను తప్పనిసరిగా ఆచరించడం జరుగుతోందని చెప్పొచ్చు. మొత్తంమీద, సమాజంలో సమానత్వం లేని వర్గాలున్నాయనడంలో, ఏమాత్రం సందేహం లేదు.

మలి వేద కాలం వచ్చేనాటికి, ఈ కుల వ్యవస్థ మరింత పటుత్వం సాధించింది. దీనికి మతపరమైన వ్యాఖ్యను కూడా చేర్చడం జరిగింది. ఋగ్వేద చివరి భాగంలో (ఋగ్వేదం X 90) పురుషసూక్తంలో, వర్ణాశ్రమాన్ని నాలుగు వర్గాలుగా విభజించారు. సృష్టికర్తనే ప్రజాపతి అని కూడా అంటారు. ఆతడి శరీరంలోని భాగాల నుండి చతుర్వర్ణాలు ఉద్భవించారని, శరీరాంగాల్లో మెదడు అతి ముఖ్యమైంది, దాని నుండి ఉద్భవించినవారు బ్రాహ్మణులు కనక, వేదశాస్త్రాల అధ్యయనం, బోధన చేయడాన్ని వారు వృత్తిగా స్వీకరించారు. ప్రజాపతి భుజాల నుండి ఆవిర్భవించిన వారు క్షత్రియులు భుజబల సంపన్నులు, క్షాత్రధర్మం ప్రకారం తమ వర్గ ప్రజలను కష్టాల నుండి, శత్రువుల నుండి కాపాడడం తమ ధర్మంగా భావించారు కనక, దానికవసరమైన క్షాత్రవిద్యలను అభ్యసించడం వారి వృత్తి. ప్రజాపతి ఊరువుల (తొడల) నుండి ఉద్భవించినవారు వైశ్యులు. ఒకచోట కూర్చుని వర్తక వాణిజ్యాలను నిర్వహించేవారుగా గ్రహించాలి. ఇకపోతే, చివరి వర్గం ప్రజాపతి పాదాల నుండి ఉద్భవించి, పై పనులేవి నిర్వహించలేక బ్రతుకుతెరువు కోసం ఎప్పటికప్పుడు పై వర్గాలవారికి ఏదోరకపు సేవచేసి, పొట్ట పోషించుకోవడం జరిగింది. అయితే, ఈ పురుషసూక్త సిద్ధాంతం మిగతా ఋగ్వేదంలో ఎక్కడా పేర్కొనబడలేదు. చివరి భాగంలోనే ఉంది కనక, ఈ కుల వ్యవస్థ ఋగ్వేద చివరి కాలంలో ఆవిర్భవించిందని చెప్పొచ్చు. ఈ ప్రసక్తి క్రమంగా యజుర్వేదంలో కూడా కన్పిస్తుంది.

7.8.2 వర్ణాశ్రమ ధర్మం

ఈ వర్ణ వ్యవస్థ క్రమంగా వర్ణాశ్రమ ధర్మంగా, అందరూ పాటించవల్సిన ధర్మంగా రూపొందింది. అది మొదలుకొని, వ్యక్తి కులాన్ని నిర్ణయించడం ఒక ఆచారమై పోయింది. అయితే, ఈ వర్ణ వ్యవస్థ చాలా సులభంగా పాటించగలిగిన ధర్మంగా ఏర్పడింది. వ్యక్తి కులం జన్మతఃగ కాక, అతని అభిరుచులు, వృత్తులను బట్టి ఏర్పడేది. ఏ వ్యక్తి ఏ ఒక్క కులానికి పరిమితం కాక, అతడు చేపట్టిన వృత్తినిబట్టి నిర్ణయించబడేది. క్షత్రియ కులంలో పుట్టిన విశ్వామిత్రుడు సుదాసుని పురోహితుడిగా బ్రాహ్మణుడయ్యాడు. జనకుడు వేదశాస్త్రపారంగతుడై, క్షాత్ర ధర్మం నుండి బ్రాహ్మణ ధర్మం స్వీకరించి, రాజఋషి అయ్యాడు. వీరేకాక (నేటి) పంజాబు ప్రాంతపు కేకయరాజు అశ్వపతి, కాశీరాజు, అజాతశత్రువు, పాంచాల రాజైన జైవాలి, ప్రవహణుడు రాజఋషులే. అయితే, ఈ రెండు వర్గాలకే కాక ఇలాంటి పరిస్థితి క్రింది వర్గంగా భావింపబడుతున్న శూద్రులు కూడా బ్రాహ్మణ క్షత్రియులుగా వారివారి శక్తినిబట్టి మారడం మనం చూస్తాం.

సత్యకామ జాబాలి ఒక గొప్ప ఋషికి శిష్యుడు. ప్రతిభాశాలి. శాస్త్రపారంగతుడు. కాని ఆయన ఒక బానిస యువతికి, తండ్రి కూడా ఎవరో తెలియని పరిస్థితిలో జన్మించిన ఋషి. అలాగే, ఉన్నత వర్గాల్లో జన్మించి, చదువు సంధ్యలు లేక చండాలుర స్థాయికి దిగజారినవారు లేకపోలేరు. ఒక వేదశ్లోకంతో ఒక పండితుడు, తన తండ్రి వైద్యుడని, తన తల్లి ధాన్యం దంచి బ్రతుకు సాగించే సామాన్య స్త్రీ అని చెప్పుకొన్నాడు.

అయితే, ఈ నాలుగు వర్గాల్లో బ్రాహ్మణ క్షత్రియులు సమాజంలో అధికులుగా భావింపబడ్డానికి కారణం, వారికి కల్గిన అవకాశాలే. వారిద్దరిలో కూడా క్షత్రియులు అడుగడుగునా బ్రాహ్మణులను అధిగమించకుండా అడ్డుపడడం కూడా గమనిస్తాం. ఛాందోగ్య ఉపనిషత్తు ఉన్నత వర్గాలవారి జీవితాన్ని చతురాశ్రమ ధర్మాలతో క్రమబద్ధం

BRAOU

చేసింది. బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థాసం, సన్యాసాశ్రమాలు బ్రాహ్మణక్షత్రియ వర్గాలకు ఉన్నతులుగ చేశాయి.

7.8.3 అగ్రవర్ణాల ఆధిక్యత

వైదిక మతంలో కర్మకాండలు పెరగడం మొదలవగానే, బ్రాహ్మణులు ఈ అవకాశాన్ని చేజిక్కించు కొన్నారు. వేదశాస్త్ర పారంగతులవడంతో బాటు, వేదజ్ఞాన బోధన, కర్మకాండల నిర్వహణ వర్గంగా స్థిరపడిపోయారు. బ్రాహ్మణులు పూజా పునస్కారాలు చేయించే పూజారులుగా గౌరవం అందుకోవడం మొదలుపెట్టారు. అసలు వారు పుట్టి పెరిగి జీవించడం వేదజ్ఞానం కోసం., వేదాధ్యయనం బోధన, కర్మకాండలు, మత, దైవ కార్యాలకు నాయకత్వం వహిస్తున్న వాళ్ళను క్షత్రియుల నుండి కూడా గౌరవం అందుకొనేలా చేసింది. అయితే, సంఘంలో రక్షకులుగా క్షత్రియులు చిన్నచిన్న వర్గాలను, వారి నాయకులను తమ భుజబలంతో ఓడించి, రాజన్యులై రాజ్యాన్ని స్థాపించి, దాని సంరక్షణార్థం సైన్యం సమకూర్చుకోవడం, ముఖ్యంగా ఆ సైన్యంలో చిన్న వర్గాల నాయకులు చేరడం, అలా ఆ వర్గాన్ని యుద్ధనైపుణ్యం పొందేలాగ చేసింది. బ్రాహ్మణులను, సామాన్యులను కూడ రక్షించవలసింది క్షత్రియులు కనక, సమాజంలో వారు బలసంపన్నులుగా పరిగణింపబడ్డారు. బ్రాహ్మణులు విద్యాసంపదలో సాటిలేనివారుగా స్థిరపడ్డారు.

రాజ్యాలు పెరగడం, రాచపరివారం పెరగడం, వారి రక్షణకోసం దేవతలను ప్రార్థిస్తూ, యజ్ఞ యాగాదులను నిర్వహించడం పెరిగిపోయింది. క్రమేపీ, సామాన్యుడి దగ్గరి నుండి రాజన్యుడి వరకు ఈ కర్మకాండల మీద విపరీతమైన నమ్మకంతో వాటిని జరపడానికి ప్రయత్నించడం పల్ల, ఈ కర్మకాండలు, వాటిని చేయించే బ్రాహ్మణులు అందరికి సులభంగా అందుబాటులో ఉండక అందని వారైపోయారు. ఈ కర్మకాండలను ఆచారంగా జరపడం నిత్యజీవితంలోని భాగంగా అయిపోయిందన్నది ఈనాటికీ మనందరి అనుభవంలో ఉన్నదే. సమాజంలోని ఇతర వర్గాలవారు దైవపరంగా బ్రాహ్మణుల పైనా, రక్షణపరంగా క్షత్రియులపైనా ఆధారపడక తప్పలేదు. పంటలు పండాలన్నా, పండిన పంటలు సురక్షితంగా ఉండాలన్నా, ఆ వర్గాలవారి అండదండలు అవసరం. వీరిద్దరి ఆధ్వర్యంలో కూర్చున్న చోటునుండి కదలకుండా వ్యాపారాన్ని చేసుకుంటున్నవారే మూడో తరగతికి చెందిన వైశ్యులు. ధనవంతులైనా బ్రాహ్మణ, క్షత్రియులకు తలవంచక తప్పలేదు.

ఇక నాల్గో తరగతికి చెందిన శూద్రులు అవార్యులు. వీరు ఓడించబడిన 'దస్యులు', దాసులుగ పరిగణింపబడ్డారు. వారి శరీరచ్ఛాయ, వారి పరిస్థితి వారిని సమాజంలో పై స్థితికి రాకుండా చేసాయి. క్రమేపి, మత సంబంధ కార్యక్రమాల్లో కూడ వారిని తొలించడం, సేవకు మాత్రమే వారిని వినియోగించడం లాంటివి జరిగాయి. సులభతరంగా, సరళంగా ఉన్న కుల వ్యవస్థ బిగుసుకోవడం ప్రారంభించింది. వంశపారంపర్యంగా, జన్మనుబట్టి కుల నిర్ణయం కావడం పరిపాటైంది. అర్హతను బట్టి ఏ వర్గానికి చెందినవారైనా సరే, ఉన్నతులు కావచ్చన్న విషయం మరుగునపడిపోయింది.

కుల వ్యవస్థ ఈ విధంగా రూపాంతరం చెందడానికి ఎన్నో కారణాలు ప్రకటితమైనాయి.

1. ఋగ్వేదంలో మొదటి భాగం కాకపోయినా, మిగిలిన భాగం అంతా మధ్యదేశంలో అంటే, బ్రహ్మావర్తంలో కూర్చబడింది. అప్పటికి సమాజం ఎన్నో మార్పులకు గురైంది.

2. కుల వ్యవస్థ వంశపారంపర్యం అవడం, బ్రాహ్మణ పూజారుల పిల్లలే ఆ పనులను నిర్వహించ గలగడం, రాజ కుటుంబంలోని పిల్లలే రాజ లక్షణాలు కల్గి ఉండడానికి కారణం, వారు పుట్టి పెరిగిన వాతావరణ నైపథ్యమే. క్రమేపి అది ఒక అలవాటు, ఆచారమై పోయింది.

3. పురోహితుడి స్థానం రాజు కన్నా ఉన్నతమవడానికి కారణం, శాస్త్రోక్తంగా యజ్ఞయాగాదులను నిర్వహించడం, వంశపారంపర్యంగా బ్రాహ్మణ కుటుంబాలకే పరిమితమవడం, అవి నిర్వహించవల్సిన అవసరం వారికి ఏర్పడడం.

4. ఋగ్వేద కాలం నుండి రాజన్యుడి పదవి వంశపారంపర్యం అవడం, దాన్ని ఎదిరించే శక్తి ఎవరికి లేకపోవడం. శూద్రులు ఒక ప్రత్యేక వర్గంవారుగా పై వర్ణాలవారికి వారి కర్తవ్య నిర్వహణలో తోడ్పడి, సేవలందించేవారుగా ఏర్పడిపోయారు.

తరువాతి వేద సాహిత్య కాలంలో 'వర్ణ' అన్న పదం రంగుకు కాక, కులం అన్న అర్థంలో వ్యవహరింప బడింది. ఋగ్వేద కాలంలో ఏర్పడిన కుల వ్యవస్థ అన్నివై పులకు విస్తరించడం మొదలుపెట్టింది. అలాగే, ఉపకులాలు వారి వారి వృత్తులనుబట్టి, కులవృత్తిని వంశానుగతంగా అనుసరించడం కోసం, ఒక వృత్తివారు ఒక ఉపకులంగా ఏర్పడ్డారు, స్థిరపడ్డారు కూడా. రథాన్ని తయారుచేసేవారు, కమ్మరులు లేదా లోహకారులు, చర్మకారులు, వడ్రంగులు లాంటి ఉపకులాలు ఏర్పడ్డాయి. అయితే, ఆ కాలపు వివాహ సూత్రాల ప్రకారం, ఒకే గోత్రీకులు గాని, రక్త సంబంధం ఉన్నవారితోగాని, వివాహాలు చేసుకోకూడదన్న సూత్రంతోబాటు, వివాహం మాత్రం ఆ కులంలోని వారితోనే జరగాలన్న పట్టింపు మొదలైంది. ఆర్యులు తమ సమాజంలో దస్యులను నాల్గవ తరగతివారుగా ఆమోదించారు. ఒక ఆర్య యువకుడు శూద్ర యువతిని వివాహం చేసుకోవచ్చు. కాని, శూద్రుడు ఆర్యుల కుటుంబంలోని అమ్మాయిని తన భార్యగా చేసుకోకూడదు.

ఈ పద్ధతి మొదట బ్రాహ్మణ వర్గంలో ప్రారంభమై, తక్కిన రెండు వర్ణాలకు కూడ అన్వయించడం జరిగింది. అలాగే బ్రాహ్మణులు తమ తరవాతి వర్ణాలైన క్షత్రియ, వైశ్యుల ఆడపిల్లలను వివాహం చేసుకోవచ్చు. కాని, వారు బ్రాహ్మణ కన్యలను వివాహమాడకూడదు. ఆ విధంగా, ఆనాటి సంఘంలో మిశ్రమ వివాహం కొన్ని పట్టింపులతో జరగడం గమనార్హం.

ఆనాటి సంఘంలో మూడో తరగతికి చెందిన వైశ్యులు వృత్తిపరంగా శూద్రులతో సంబంధాలను పెట్టుకోవడం వల్ల, ఇతర ఆర్య వర్ణాలచే తక్కువగా చూడబడేవారు. అలాగే, వారు నిర్వహించవల్సిన మత సంబంధమైన బాధ్యతలు కూడ వారివారి స్థాయిని బట్టి జరిగేవి. శతపద బ్రాహ్మణంలో చనిపోయాక శరీరాలు పూడ్చడానికి తీసిన గోతుల కొలతల్లో కూడ ఒక వర్ణానికి మరొక వర్ణానికి తేడా కనిపిస్తుంది. ఆయా వర్ణాలచే పూజింపబడే దైవాల పూజా విధానంలో కూడ తేడా కనిపిస్తుంది. అయితే, ఆనాటి సంఘం శూద్రుల మీద చాలా ఆంక్షలను విధించింది. శతపద బ్రాహ్మణం శూద్రులు విద్యావంతులై, ఇతరులకు చెప్పదగినవారు కాదని పేర్కొంది. శూద్రుల్లో సత్యకామ జాబాలి, జనశ్రుతి లాంటివారు ఉన్నా కూడా, అగ్నిహోత్రుని కొరకు ఉంచిన ఆపుసాలు శూద్రుడు పితకకూడదు. కాని శూద్రుని సోమయాగాన్ని శూద్రుడే నిర్వహించవచ్చునని చెపుతుంది. తైత్తరీయ బ్రాహ్మణం రథకారునికి ఏ విధంగా అగ్నిని ప్రజ్వలింపజేయాలో వివరిస్తుంది. ఐతరేయ బ్రాహ్మణం శూద్రుని ఇష్టం వచ్చినట్లు కొట్టి, బాధించవచ్చు అన్న విషయాన్ని వ్యతిరేకిస్తుంది. శూద్రులకు ఆస్తి సంపాదించే హక్కు లేదని ముఖ్యంగా రాజుకు వ్యతిరేకంగా సంపాదించేది లేదని చెపుతుంది.

వైశ్యులు వ్యవసాయం, పచ్చికబయళ్ళు, పరిశ్రమలు, వ్యాపారాల్లో మునిగి ఉండి, తమను కాపాడుతున్నందుకు రాజుకు కొంత ధనం సమర్పించుకొనేవారు. అయినా, వారి పరిస్థితి దిగజారడం మొదలుపెట్టింది.

క్షత్రియులు సాధారణంగా రాజు, రాచ పరివారానికి చెంది ఉండి, ఉన్నత స్థాయిలో ఉండేవారు. దేశంలో శాంతి

BRAOU

సంరక్షణ కోసం రాజుతో చేరి, యుద్ధాలు చేసేవారు. ప్రజల దగ్గరి నుండి ధాన్యరూపంలో పన్నులను వసూలు చేసేవారు. యుద్ధ సమయంలో, శాంతి సమయంలో బహుమానంగా పొందిన గ్రామాల మీది ఆదాయంతో బతికేవారు.

గ్రామ పెద్ద అయిన గ్రామణి రాజు చేత నియమించబడినవాడేగాని, ప్రజలచేత ఎన్నుకొనబడినవాడు కాదు. వారు గ్రామాల్లో కాలం గడిపేవారు. ఒక క్షత్రియుడు బ్రాహ్మణుడు లేకుండా ఏ పని చేసేవాడు కాదు. కాని, ఒక బ్రాహ్మణునికి ఎవరూ అక్కరలేదు. అయినా, 'కథక సంహితం' క్షత్రియుడు బ్రాహ్మణుని కన్నా ఉన్నతుడని, ఐతరేయ బ్రాహ్మణంలో బ్రాహ్మణుడు క్షత్రియుడి చేత దానం పొందవలసిన వాడని పేర్కొంది. అయితే, మనకు బ్రాహ్మణ క్షత్రియులు కల్సిపోయిన సంఘటనలు ఎన్నో కనిపిస్తాయి, రాజ ఋషులు అలాంటివారే.

బ్రాహ్మణులు కూడా రెండు తరగతులుగా విభజింపబడ్డారు. ఒక వర్గంవారు రాజుకు పురోహితులై, రాజుకు పరిపాలనా విషయంలో హితం చెపుతూ, మంత్రులుగా కూడా వ్యవహరించారు. సాధారణంగా పురోహిత పదవి వంశపారంపర్యంగా వస్తుంది. పిల్లలు తండ్రి అంత శక్తిమంతులైతే, రాజులు ఎటువంటి పరిస్థితుల్లోనూ బ్రాహ్మణులను బాధించకూడదన్న సూత్రం వివరిస్తుంది. వారికి కొన్ని విషయాల్లో రాయితీలనివ్వడం కూడ కనిపిస్తుంది. అలాగే, బ్రాహ్మణులు తమ స్థాయిని చాలావరకు విజ్ఞానంతో, తెలివితేటలతో, సమయస్ఫూర్తితో నిలబెట్టుకున్నారు. అధర్వణ వేద కాలం నాటికి, బ్రాహ్మణ స్వరూపంలో దురాశ, స్వార్థం తొంగిచూడడం ప్రారంభమైంది. కాని, అది చాలా తక్కువే.

సూత్ర సాహిత్యం నాటికి, కుల తత్వం కొంచెం స్థిరపడిందని చెప్పాలి. వైశ్యులు, శూద్రులు ఈ కుల వ్యవస్థ పల్ల పడిన ఇబ్బందులు, కష్టాలు, ఆంక్షలు శ్రౌత సూత్రాల్లో, గృహ్య సూత్రాల్లో, ధర్మశాస్త్రాల్లో వివరించబడ్డాయి. సాంఖ్యాయన శ్రౌత సూత్రంలో ఒకప్పుడు వాజపేయ యాగాన్ని నిర్వహించడానికి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు ఆమోదం ఉండగా, ఇప్పుడు వైశ్యులను అనర్హులుగా చేసింది. వాటి సమాజం బ్రాహ్మణులకు పురోహితులుగా చాలా ప్రత్యేక సౌకర్యాలనేర్పర్చింది. పన్నులు కట్టనవసరం లేకుండా, వాళ్ళకు రాయితీలనిచ్చింది. కానీ, క్షత్రియులు పురోహితు లవడం చాలా కష్టం. శూద్రులకు అసలు ఏ విధమైన సౌకర్యాలు లేవు. వారిని నిర్వాసితులు, అనిర్వాసితులు, ఇంకా నిషధులుగా ఏ అవకాశం లేకుండా, వారి సేవలు మాత్రం పొందే విధంగా క్రమేపి సంఘంలో మార్పులు రావడం జరిగింది.

గృహ్యసూత్రాలు సంఘంలోని నాల్గు వర్గాలవారికి స్థాయి, వృత్తి, కర్మకాండలు, మతకార్యాలు, హక్కులు, బాధ్యతలు, సౌకర్యాలు మొదలైన వాటిలో స్పష్టమైన తేడా చూపించాయి. కొన్ని కర్మకాండలను ఉన్నత వర్గానికే పరిమితం చేసాయి. అవి శూద్రులకవసరం లేదన్నాయి. అలాంటి వాటిలో ఉపనయన సంస్కారం ఒకటి. అది కూడా పై మూడు తరగతుల్లో మాత్రమే జరపబడేది. అందులో కూడ జరిపే విధానం, పద్ధతిలోనూ, సమయంలోనూ తేడా ఉండేది. అలాగే పుట్టినప్పటి నుండి పేరు పెట్టటం మొదలుకొని, చనిపోయిన తర్వాత చేసే సంస్కారాల్లో కూడా కులాన్నిబట్టి, వర్గాన్నిబట్టి భిన్న విధానాలున్నాయి. దానధర్మాలు చేయడంలో కూడా తేడాలే ఉండేవి. బ్రాహ్మణులు వారికున్న జ్ఞానాన్నిబట్టి, సామర్థ్యాన్ని బట్టి, మతపరంగా వారు నిర్వహిస్తున్న కార్యకలాపాల కారణంగా, వారిని ఎవ్వరూ ఎదుర్కోలేకపోయారు.

అలాగే, క్షత్రియుల భుజబలం, సాహసం సాటిలేనివి. వారి కర్తవ్య పరాయణత్వం, నాయకత్వ లక్షణాలు, పరిపాలనా సామర్థ్యం వారిని బ్రాహ్మణులకన్నా ఉన్నతంగా, అధికారపంతులుగా చేసింది. బ్రాహ్మణుల ప్రతిభ, క్షత్రియుల సామర్థ్యం వారిని ఏకస్థాయికి చేర్చింది.

BRAOU

వైశ్యులు వారు చేపట్టిన వివిధ వృత్తుల కారణంగా, ఆర్థికంగా బ్రాహ్మణుల కన్నా ఉన్నతంగా ఉన్నా, శాస్త్రపరంగా తక్కువగ ఉండేసరికి, వారు బ్రాహ్మణుల ముందు తలవంచక తప్పలేదు.

బ్రాహ్మణుల ఆశీస్సుల కోసం వారికి దానధర్మాలు చేయబడేవి. వారు చేపట్టిన ఏ కార్యమైనా, బ్రాహ్మణ సమక్షంలో జరగడం సాంప్రదాయమై పోయింది. అంటే, ఎవరింట్లోనైనా మొదటిసారి అగ్నిహోత్రం వెలగాలంటే, అది చాలా ధనవంతుడైన వైశ్యుని వంటింటి నుండిగాని, బ్రాహ్మణుని ఇంటినుండి గాని, క్షత్రియుడి ఇంటి నుండి గాని రావాలని గృహ్యసూత్రాలు చెపుతాయి.

శూద్రుల వరకూ వచ్చేసరికి, వర్ణ సంకరం జరిగి, ఆర్యులు అనార్యులతో సంబంధం పెట్టుకోవడం వల్ల ఉద్భవించిన ఆ వర్గానికి, అసలు సంఘంలో ఉచిత స్థానం లేకపోయింది. వారికి ద్విజ స్థాయి పొందడానికి అర్హతలేదు. అలాగని, వారిని పూర్తిగా వెలివేయలేదు. వాళ్ళ సేవలను ప్రతినిత్యం ఉపయోగించుకోవడం జరిగేది.

ఏ కులంవారైనా సరే ఎవరైతే ఉపనయన సంస్కారాన్ని మూడుతరాలుగా నిర్లక్ష్యం చేస్తారో, వారు వెలివేయబడతారు. అలాంటివారు తపస్సు చేసి, శుద్ధి అవాల్సిందే అని గృహ్యసూత్రాలు చెపుతున్నాయి.

ధర్మశాస్త్రాలు కూడా కులం పట్ల భిన్న ధోరణిని చూపించాయి. నేరం చేయడంలోను, శిక్ష విధించడంలోను, ఆస్తి పంచడంలోను, అప్పులు ఇవ్వటం, వడ్డీరేటులోనూ అన్నిటా ఒక్కో వర్గానికి ఒక్కో నియమాన్ని సూచించాయి. బ్రాహ్మణ వర్గానికి మాత్రం ఆధిక్యతనిచ్చాయి.

7.9 సంగ్రహంగా

ఈ పాఠ్యాంశంలో మీరు వేద కాలం నాటి సామాజిక పరిస్థితులు, పరిణామాన్ని గమనించారు. ఈనాటికి సాంప్రదాయికంగా నిలిచిన పితృస్వామిక కుటుంబం, ఉమ్మడి కుటుంబంలోని గుణదోషాలు, సమాజంలో, కుటుంబంలో నాటి నుండి నేటిదాక స్త్రీ స్థానం, స్త్రీకున్న అవకాశాలు, పురుషాధిక్యతకు గురైన, అవుతున్న స్త్రీ పరిస్థితి వివాహ సంస్కారం, ప్రాముఖ్యత, విధానాల వివరణ, బహు భార్యాత్వం, బహు భర్తృత్వం, వేద విద్యా విధానం ఆవశ్యకత, క్రమశిక్షణ, ప్రవర్తన, వినోదాలు, ఆహార పానీయాలు, దుస్తులు, ఆభరణాలు, అలంకరణ, పారిశుద్ధ్యం, వైద్య విద్య అభివృద్ధిని గూర్చి వివరించబడింది.

వేద కాలంలో ఉద్భవించి, ఈనాడు వేళ్ళు పాతుకొనిపోయిన కుల వ్యవస్థ పుట్టు పూర్వోత్తరాలు, దాని ఆధిక్యతకు, హీనతకు దారితీసిన పరిస్థితులు విశ్లేషించబడ్డాయి.

7.10 పరీక్ష సమీక్ష ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. వేద కాలపు సామాజిక స్థితిని వివరించి, సమాజంలో స్త్రీ స్థానాన్ని విశ్లేషించండి.

BRAOU

2. వేద కాలంలోని వివాహ సంస్కారాన్ని గూర్చి తెల్పి, దాని ప్రాముఖ్యతను వివరించండి.

3. వేద కాలంనాటి విద్యా విధానాన్ని వివరించండి.

4. వేద కాలంలో కుల వ్యవస్థ వెలసిన పరిస్థితులు, పరిణామాన్ని వివరించండి.

II. క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. వేద కాలం నాటి కుటుంబ వ్యవస్థ.

2. వేద కాలం నాటి సమాజంలో వ్యక్తులు, కుటుంబాలు ఆచరించవల్సిన నియమావళి, ప్రవర్తన.

3. వేద కాలంలో అభివృద్ధి చెందిన వైద్య విధానాన్ని వివరించండి.

4. వేద కాలంనాటి సమాజంలో విందులు – వినోదాలు.

5. వేద కాలంలో సమాజంలో వ్యక్తుల ఆభరణాలు, దుస్తుల అలంకరణ.

6. కుల వ్యవస్థలో బ్రాహ్మణుల ఆధిక్యతకు దారితీసిన పరిస్థితులు.

7.11 ఉపయుక్త గ్రంథాలు

Ayyer V. A.K. : **Hindu Sastras & Samskaras.**

Bhasham A.L. : **The wonder that was India.**

Chattopadhyaya D.D. : **Societies and Cultures.**

Dutta N.K. : **Origin and Growth of Caste in India.**

Hutton : **Caste in India.**

Ketkar S.V. : **The History of Caste in India.**

Lunia B.N. : **Life & Culture in Ancient India.**

Majumdar A.K. : **Indian Culture.**

Majumdar R.C. (Ed) : **Vedic Age.**

Munshi K.M.K., Diwakar R.R. : **Our Human Culture.**

Penguin Classics : **The Laws of Manu.**

Romila Thapar : **A History of India.**

Satya Murthi K. : **Indian Heritage & Culture.**

Smith V.A. : **Oxford History of India.**

BRAOU

అంబేద్కర్ రచనలు సంపుటం – 1 : **భారతదేశంలో కులాలు – నిర్మూలన.**

అంబేద్కర్ రచనలు : సంపుటి – 3 : **హిందూ మతం – తాత్వికత.**

అంబేద్కర్ రచనలు : సంపుటి – 4 : **హిందూ మతంలో చిక్కుముడులు.**

బ్ర.వే. ఉప్పులూరి గణపతి శాస్త్రి : **వేదసార రత్నావళి (2 భాగములు).**

రచయిత్రి : డా. కె. జానకి

BRAOU

భాగం – 8 : వేద కాలం – ఆర్థిక వ్యవస్థ

విషయక్రమం

8.0 లక్ష్యాలు
8.1 పరిచయం
8.2 ఆర్థిక వ్యవస్థ
- 8.2.1 పశుపోషణ
- 8.2.2 వ్యవసాయం
- 8.2.3 పంటలు
- 8.2.4 వర్తకవ్యాపారాలు
- 8.2.5 వ్యాపార విధానం
- 8.2.6 ఆర్థిక పరిస్థితి
- 8.2.7 సముద్ర వ్యాపారం
- 8.2.8 వ్యాపార వర్గం

8.3 వృత్తులు, పరిశ్రమలు
- 8.3.1 ఉపవృత్తులు
  - 8.3.1.1 వడ్రంగి
  - 8.3.1.2 లోహకారులు
  - 8.3.1.3 కుటీర పరిశ్రమలు
- 8.3.2 ఇతర వృత్తులు
- 8.3.3 లోహ సామగ్రి తయారి
- 8.3.4 బట్టల తయారి
- 8.3.5 భవన నిర్మాణం
- 8.3.6 గృహ నిర్మాణం

8.4 రవాణా
8.5 సంగ్రహంగా
8.6 పరీక్ష నమూనా ప్రశ్నలు
8.7 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

8.0 లక్ష్యాలు

1. ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు వేద కాలంలో ఆర్థిక వ్యవస్థ ఏర్పడిన విధానం, దాని పరిణామాన్ని వివరించగల్గాలి.

2. ఈనాటికీ, ముఖ్య వృత్తిగా ఉన్న వ్యవసాయం ఎలా ఒక వృత్తిగా ఏర్పడి, శక్తివంతంగా, ప్రముఖమైందిగా

రూపొందిందో విశ్లేషించగల్గాలి.

3. ఆర్థిక వ్యవస్థ అన్నది జీవనాధారమే కాక, మనిషిలోని సృజనాత్మక శక్తిని బయటికి తీసుకురావడానికి వృత్తుల ఏర్పాటుకు ఎలా అవకాశమిచ్చిందో వివరించగల్గాలి.

4. ఆర్థిక వ్యవస్థలో ఉండే వివిధ రంగాలు, వాటికి, ప్రజల జీవితానికి మధ్య గల సంబంధాన్ని విశ్లేషించగల్గాలి.

8.1 పరిచయం

ఈ భాగంలో మీకు వేద కాలంనాటి ప్రజల ఆర్థిక జీవన విధానంగూర్చి తెలుస్తుంది. మనిషి సంచార జీవితం మాని, స్థిర నివాసం ఏర్పర్చుకోవడం, జీవనాధార పద్ధతి నుండి అధిక ఉత్పత్తి చేసి, అమ్మి లాభాలు ఎలా గడించాడో తెలుస్తుంది. పశుపోషణ నుండి వ్యవసాయం, వివిధరకాల పంటలను పండించడం, అక్కడి నుండి వర్తక వ్యాపారానికి దారితీసిన పరిస్థితులు, వివిధ ఉపవృత్తుల ఏర్పాటు, భారీ పరిశ్రమలు లేకపోయినా, ఎక్కువమందికి ఉపాధి కల్పించే వివిధరకాల పరిశ్రమలకు వేద యుగంలోనే ఎలా పునాది పడిందో తెలుస్తుంది. ఆర్థిక వ్యవస్థకు సామాజిక వ్యవస్థకు దగ్గర సంబంధం ఉందన్న విషయం తెలుస్తుంది. వివిధరకాల పరిశ్రమలతో పరిచయం కల్గుతుంది. చివరగా, రవాణా వేద కాలంలో సౌకర్యాలు, ప్రగతి గురించి తెలుస్తుంది.

8.2 ఆర్థిక వ్యవస్థ

తొలి వేద కాలంలో సమాజంలో పచ్చికబయళ్ళ ఏర్పాటు, పశుపోషణ ముఖ్యవృత్తులుగా ఉండేవి. అందువల్ల, ఆనాటి సమాజం వ్యవసాయ ఫలం మీదకంటే, పశుబలం మీద ఎక్కువగా ఆధారపడి ఉండేది. వ్యవసాయం ఇంకా అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు. వ్యవసాయానికి వీలు కూడా లేని ప్రాంతాల్లో, పచ్చిక బయళ్ళ మీదే ఆధారపడి ఉండాల్సి వచ్చింది. అప్పటి కాలంలో అదే జీవనా ధారమైంది.

8.2.1 పశుపోషణ

ఋగ్వేదంలోని ఋక్కులు పశువుల ప్రాముఖ్యతను చెప్పాయి. పశువులను గోధనంగా భావించడం, ఎవరికెక్కువ పశువులుంటాయో, వారిని గోమతులు అని అనడం జరిగింది. పశువుల గురించిన కలహాలు యుద్ధాలుగా మారి, 'గవిష్టి', 'గవిసాన', 'గవ్యవత్' అన్న పేర్లతో పిలవబడ్డాయి. ఈ పదాలే గోధనాన్ని ఎక్కువగా, తక్కువగా కల్గి ఉండడంవల్ల, ఆధిక్యతకోసం వారిమధ్య, కలహాలు వచ్చేవని చెపుతున్నాయి. ఈ కలహాలు తెగలకు కూడా వ్యాపించాయి. 'పణి' అనే ఆర్యుల శత్రు వర్గం వారు ఎప్పుడూ గోధనాన్ని అడవుల్లోనూ, కొండల్లోనూ దాచేవారట. ఆర్యుల యుద్ధదేవతైన ఇంద్రుడు వాటిని విడిపించి, తీసుకొని వచ్చాడని చెప్పడం వల్ల, పశువుల కోసం తరచు దాడులు సర్వసాధారణ విషయం అని తెలుస్తోంది. గోవులను సంరక్షించేవాడు 'గోపతి'. ఋగ్వేదంలో గోధూళివేళను సమయం తెల్సుకోవడానికి ఉపయోగించేవారు. దూరాన్ని 'గవ్యతి' అని కుమార్తెని లేక పాలు పితికే వారిని 'దుహిత' అనడం, ఒకే రక్తానికి సంబంధించిన వారిని ఒక గోత్రంవారని చెప్పడం, పరిపాటైంది.

BRAOU

ఈ పదాలన్నీ గోవు అన్న పదం నుండి ఉద్భవించినవే. ఋగ్వేద కాలంలో మత, సాంఘిక జీవనం గోవు చుట్టూ ఉండేది. వేద సాహిత్యంలో కూడా, పచ్చికబయళ్ళు, పశుపోషణ, పాల పదార్థాలు, ఇతర పెంపుడు జంతువుల ప్రసక్తి ఉంది. ఇతర శ్లోకాలు, మంత్రాల్లో కూడా గోధన ప్రసక్తి ఉంది. గోధనం మాత్రమే దక్షిణగా స్వీకరింపదగింది. అందుకే, యజ్ఞయాగాదుల్లో గోవును దక్షిణగా తీసుకొనే బ్రాహ్మణుడిని కుడిప్రక్క నిలబెడతారు. 'ఆజ్ఞ' (Aghnya) అన్న పదం, గోవును చంపకూడదన్న అర్థాన్ని సూచిస్తూండం వల్ల గోవుకు రక్షణతో పాటు, పవిత్రత కూడా ఆపాదించబడిందని తెలుస్తుంది. ఆవులను స్వేచ్ఛగా పచ్చికబయళ్ళలో వదిలేయడం, రోజుకు మూడుసార్లు పాలు పితకడం వంటివాటివల్ల, గోవులకు ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలుస్తోంది. బయటికి మేతకు వెళ్ళిన ఆవులు తిరిగి వచ్చిన తర్వాత లేగదూడలను ఆప్యాయంగా స్పృశిస్తూ, నాకుతూ ఉన్న దృశ్యం కన్నులపండుగని, పాలు పితుకుతున్నప్పుడు వచ్చే శబ్దం, వీనుల విందుగా ఉంటుందని ఋగ్వేద ఆర్యులు భావించేవారు. ఋగ్వేదంలో ఆర్యులు ఆవులను మేతకు బయటికి పంపుతున్నప్పుడు ఎదురయ్యే ప్రమాదాలను కూడా పేర్కొనబడింది. ఆవులు తప్పిపోవచ్చు, గుంటల్లో పడి లేవలేకపోవచ్చు. అలా పడినపుడు కాళ్ళు విరగగొట్టుకోవచ్చు. లేక దొంగలు ఎత్తుకొని పోవచ్చు. 'స్వసర' అన్న పదం ఉదయాన ఆవులను మేతకు తీసుకొని వెళ్ళే సమయంగానూ, 'సంగవ' అన్న పదం మేత అయిన తర్వాత, సాయంత్రం పాలు తీయడానికి ఇంటికి తోలుకొని రావడం అనే అర్థంలోను ఋగ్వేదంలో కన్పిస్తాయి. గోవులు తప్పిపోకుండా, ఆనవాలు కోసం వాటి చెవులమీద గుర్తులు పెట్టేవారు. ఎద్దులు, గిత్తలు పొలం దున్నడానికి, బండ్లు లాగడానికి ఉపయోగించేవారు. గోవు ఎర్రదై నా, నల్లదై నా, తెల్లదై నా, చిక్కని, తెల్లని పాలు ఇవ్వడం, ఎన్నో పనులకు ఉపయోగపడడం, సృష్టిలోని వింతల్లో ఒకటిగా భావించేవారు (VIII 93.13).

వివిధ వయస్సుల్లో ఉండే గోవులకు ఎద్దులూ, దూడలకు వివిధ పేర్లున్నాయి. పసి వయస్సులో ఉన్న దూడలను లేగలని, పాలిచ్చే గోవులను దేనువులని, కొంచెం పెరుగుతున్న మగ పశువులను గిత్తలని, బాగా పెరిగినవి ఎద్దులని పిలవబడేవి.

అధర్వణ వేదం గోవును యజ్ఞయాగాల్లో కాక, మరెక్కడా చంపకూడదని, బ్రహ్మ హత్యాపాపం అని పేర్కొంది. ఈ పశువులను జాగ్రత్తగా పశువుల కొట్టంలో ఉంచి, పచ్చికబయళ్ళు అందుబాటులో ఉండేలాగ చూసేవారు. అందుకే, గోవు పవిత్రతను కాపాడ్డానికి మత సంబంధమైన కార్యాల్లో కూడా ఉపయోగించేవారు. వ్యవసాయ కార్యక్రమాలను ఆరంభించినపుడు, ఎద్దులకు - నాగళ్ళకు పూజలు చేసేవారు. 'గోమాత' 'సస్యలక్ష్మి' అన్న మాటలు మనకు తెలిసినవే. అగ్రాయణ యజ్ఞం క్షేత్రపతికి మొదటి పంటను సమర్పిస్తూ నిర్వహిస్తారు.

గోధనం ఎంతో విలువైందిగా పరిగణించేవారు. తమను గోధనంతో మరింత ధనవంతులుగ చేయవల్సిందని ప్రార్థిస్తూన్న మంత్రాలు గృహ సంబంధ కర్మకాండల్లో ఉన్నాయి. ఉన్నత వర్గం వారందరూ, పశుపాలనలో మునిగితేలేవారు. 'సూలగావ', 'బౌద్యవిహార' అనబడే కార్యాలు రుద్రుడిని, అతని పరివారాన్ని స్తుతిస్తూ తమ పంటలను, పశువులను కాపాడమని ప్రార్థిస్తూ నిర్వహించేవారు. పశువులు మార్పిడి సాధనంగా పనిచేసేవి. అందుకే, రాజులకు తమకంటూ, గోధనం ప్రత్యేకంగా ఉండేది. వాటిని తమ అనుగ్రహం ప్రకారం, దక్షిణగా బ్రాహ్మణులకివ్వడం ఆచారమైంది. జనక మహారాజు బ్రాహ్మణులను సహస్ర గోదానంతో సంతుష్టులుగ చేసిన విషయాలు మనకు తెలిసినవే. అలాగే, 'దార్షద్వాత' అనే క్రతువు బ్రాహ్మణుల అధీనంలో ఉన్న పశువులను ఒక సంవత్సరంపాటు భరించడం లాంటిది, శ్రౌత సూత్రాల్లో పేర్కొనబడింది.

గృహ్యసూత్రాలు పశువులకు సంబంధించిన కొన్ని క్రతువుల సమయాలను సూచించాయి.

1. పశువులను పచ్చికబయళ్ళకు తరలించే సమయంలో

2. అవి పారిపోయిన సందర్భంలో

3. అవి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో, 'గోధూళి వేళ' అని అంటారు.

4. పశువులు కొట్టం విడిచే ముందు లేక వచ్చిన తర్వాత.

శ్రౌతసూత్రాలు పశువులు దొంగిలింపబడినపుడు తిరిగి పొందే కార్యాన్ని నిర్వహించమని చెప్తాయి. గృహ్య సూత్రాలు పశువుల ఆయురారోగ్యం, వృద్ధికోసం ప్రార్థనలు, కార్యాలను చేయమని చెప్తాయి. 'విష్టోసర్గ' అన్న క్రతువు పశువుల కలయికను, చూలు కట్టడాన్ని సూచిస్తుంది. 'యక్ష్మ' అన్నది పశువుల్లో వ్యాపించే భయంకర వ్యాధి.

పవిత్రత

పశువులను ఇలా జాగ్రత్తగా ఆస్తిగా చూసుకోవడమే కాక, వాటిమీద దేవతా భావం భక్తి కూడా ఏర్పడింది. ఫలితంగా, గోవధ, గో మాంసం నిషేధింపబడింది. రథాల్లో వెళుతున్నా, దారిలో పశువు ఎదురైతే, భక్తిగా క్రిందికి దిగి నమస్కరించడం, ఒక సాంప్రదాయమై పోయింది. అలాగే, గోవు పవిత్రతను, ప్రాణాన్ని కాపాడ్డానికి వేరొక కర్మకాండను నిర్వహించవచ్చని కూడా భావించడం జరిగింది.

8.2.2 వ్యవసాయం

ఋగ్వేద కాలంలోనే వ్యవసాయానికి దారితీసిన పరిస్థితులు కన్పిస్తాయి. అడవులను కాల్చి, స్థలమార్పిడి వ్యవసాయం చేసేవారు. ఆ ప్రాంతంలో నీటి సదుపాయం లేకపోవడం, వర్షాలు తక్కువ పడే ప్రాంతాలవడం, నదులు తమ ప్రవాహ గతిని మార్చుకున్న సందర్భాలు – ఇలాంటి ఈ పరిస్థితులన్నీ వారిని ఒకచోట ఉంచి, స్థిర వ్యవసాయం చేసుకోనివ్వలేదు. పెద్దెత్తున నీటిపారుదల సౌకర్యాలు కల్పించడం తెలియని కారణంగా, భూమి సారవంతంగా ఉండే పండ్రు భూములను వెదికి, పంటలు పండించేవారు. పచ్చికబయళ్ళు వారి పశుపాలనకు ఉపయోగపడేవి. పంటలు బాగా పండేంతవరకూ అక్కడ ఉండి, భూసారం తగ్గగానే మరొక చోటికి తరలివెళ్ళే సంచార జీవితం వారిది. ఋగ్వేద కాలంలో, తరవాతి కాలపు సాహిత్యంలో, ఆరు నుండి 20 ఎద్దులు నాగళ్ళను లాగి, రైతు ఆధ్వర్యంలో భూమిని దున్నేవని పేర్కొన్నారు. నాగలిని పట్టుకోడానికి 'పవీరావత్' అనే పిడి ఉండేది. దాన్ని జాగ్రత్తగా పట్టుకొని, కినాస అనబడే రైతు భూమిని దున్నేవాడని తెలుస్తోంది. అధర్వణ వేదంలో ప్రీతివై న్యుడనబడేవాడు మొదటిసారి దున్నడం జరిగిందని చెప్పినా, అసలు దున్నడమనే ప్రక్రియ తరచు ఉండేదని తెలుస్తోంది. పశువుల వల్ల కూడా తమ వ్యవసాయానికి కలిగే ఇతర లాభాలను గురించి ఆనాటి ఆర్యులకు బాగా తెలుసు. అవు విసర్జించిన వ్యర్థ పదార్థాలను పంటలకు మంచి సహజమైన ఎరువుగా వాడుకొన్నారు. పశువుల పేడతో పిడకలు నిత్యం ఉపయోగించబడేవి. శతపథ బ్రాహ్మణంలో రకరకాల వ్యవసాయ పద్ధతులు పేర్కొబడ్డాయి. భూమిని దున్నడం, విత్తనాలు నాటడం, పంటకోసి నూర్చడం, తూర్పారబట్టడం లాంటివి, పండిన పంటను కొడవలితో కోయడం, సర్వసాధారణంగా చెప్పబడ్డాయి. తైత్తరీయ బ్రాహ్మణం యవలు శీతాకాలంలో నాటబడి, వేసవికాలంలో కోతకోసేవారని చెపుతోంది. ఇంకా వరి వర్షాకాలానికి అనుగుణంగా చిక్కుడు, మువ్వలు వేసవిలో వేస్తే, వర్షాకాల సమయానికి పూర్తి అయ్యేలా వేసేవారు. 'శక్తావహ' అనబడే గోధుమ పంట కూడా ఉండేది. ఆ కాలంలో కూడా వ్యవసాయంలో చిక్కులు ఎదురయ్యేవి. పురుగులు, చీడ పంటను, గింజలను నాశనం చేయడం, వాటికి తగిన జాగ్రత్తలు తీసుకోపడం ఉంది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల నుండి నీటిని జాగ్రత్త చేయడం ఆర్యులకు తెలుసు. గేదెలు, దున్నపోతులు, ఆవులు ,ఎద్దులు వ్యవసాయ కార్యకలాపాలకు ఉపయోగపడేవని, తైత్తరీయాది బ్రాహ్మణ సంహితాలు చెబుతున్నాయి.

BRAOU

8.2.3 పంటలు

అనాటి కాలంలో, పంటలు పండించడానికి ముందు బహిరంగ ప్రదేశాల్లో, అడవుల్లో దున్నకుండా ఉన్న భూమి మీద పెరిగిన వరి పంటల ప్రసక్తి ఉంది. పంటలు పండే భూమిని అక్కడ పండే పంట గింజల ప్రకారం కొలిచేవారని 'ప్రాస్థికే' అన్న మాట నుండి తెలుస్తోంది. పంట పొలాలకు కృత్రిమ నీటి పారుదల, విధానాల ప్రసక్తి కూడా ఉంది. పెద్దపెద్ద బావులు నీటితో నిండుగా ఉంటే, ఆ నీటిని గిలకలాంటి సాధనంతో పైకి తోడి, కాలువల్లో పంచి, పొలాలకు సరఫరా చేసేవారు.

వరి, యవలు స్థానికమైన నిత్య ఆహారం. వేద సాహిత్యాల్లో వ్రీహి, తండూల, సాలి అన్న మాటలకు అర్థం వరి అనే. ఆ కాలంనాటి రాజసూయ యాగం లాంటి కర్మకాండల్లో సమర్పించే వాటిలో, పాలు, నేయి, జంతువులతోబాటు, వరిగింజల ప్రసక్తి ఉంది. అథర్వణ వేదంలో చెప్పబడిన 12 రకాల యజ్ఞాల్లో సకల శుభాలు చేకూరాలని ప్రార్థిస్తూ, ఆవులను, దూడలను, ఎద్దులను, బంగారం, ఉడికించిన వరి, గుడిసెలు, పండించిన పంటపొలాలను బ్రాహ్మణులకు దానం చేసేవారు.

8.2.4 వర్తకవ్యాపారాలు

ఋగ్వేదంలో పేర్కొనబడిన ప్రకారం, (I. 56.2) సుదూర ప్రాంతాలకు లాభాలు గడించడానికి వ్యాపార నిమిత్తమై, కార్యకలాపాలు జరిగేదని తెలుస్తోంది. కాని, ఋగ్వేదం మంత్రాల్లో తమకు వ్యాపారం విజయవంతం కావాలని, లాభాలు ఇసుమడించి ఐశ్వర్యం నూరింతలు అభివృద్ధి చెందాలని ప్రార్థన జరిపేవారని (III. 18.3) తెలుస్తోంది. ఇతర దేశాలతో, ఇతర తెగలతోనే కాక, విస్తృత దేశీయ వ్యాపారం కూడా చేసేవారని తెలుస్తోంది.

8.2.5 వ్యాపార విధానం

వ్యాపారంలో వస్తుమార్పిడి విధానం ఉన్నట్లు తర్వాత, ఆవు ఒక మార్పిడి సాధనంగా అంగీకరించినట్లు, క్రమేపీ 'నిష్కం' (Nishka) అనబడే ద్రవ్యరూప మార్పిడి సాధనం అమలులోకి వచ్చినట్లు తెలుస్తోంది. నిష్కం అన్నది మొదట ఒక బంగారు ఆభరణం. కంఠాభరణ రూపంలో ఉండేది (IV. 24.10. & V 19.3). కాలక్రమేణా ద్రవ్యంగా ఏర్పడిందని అనుకోవచ్చు. వ్యాపారం నియమబద్ధంగా జరిగేది.

8.2.6 ఆర్థిక పరిస్థితి

ఆ కాలపు ఆర్థిక పరిస్థితి అప్పటి ఆదాయ వనరులనుబట్టి అంచనా వేయొచ్చు. యుద్ధంలో గెల్చిన తరవాత కొల్లగొట్టబడిన ధనం, ముఖ్యంగా పశువులుంటాయి. వ్యక్తిగతంగా పరకట్నం, కన్యాశుల్కం, బహుమానాల పేరిట చేతులు మారి, ధనంగా పరిగణింపబడేది. భూమి వ్యాపార వస్తువుగా పరిగణింపబడలేదు. ఎవరికైనా ఇవ్వడానికి, ఇంకొకరి పైసి మార్చడానికి, బహూకరించడానికి సమస్యగా అనలు పరిణమించలేదు. పరిమిత జనాభా ఉండేది. అది కూడ అక్కడక్కడ మాత్రమే ఉండి, ఎంతో భూమి సులభంగా ఆక్రమణకు దొరికేది. ఈశాన్య దిక్కున ఉన్న నదులను బంగారు నిధులుగా పేర్కొనడం జరిగింది.

పుణ్యసిద్ధి అనబడే ఒక క్రతువు తమ వ్యాపారం విజయవంతం కావడం కోసం నిర్వహించబడేది. వ్యాపార వస్తువుల్లో కొంత భాగం హోమకుండంలో వేసి, వ్యాపారం ఇంతకు ఇంతై పదింతలవాలని ప్రార్థిస్తారు. (హిరణ్యకేసి G.S. 1.15.1). వైశ్యులు ఈ వ్యాపారంలో నిమగ్నులైన వర్గం. పాణివి పేర్కొన్న మాత్రాల్లో ఉత్తరాది నుండి ఎన్నో ఆటవిక వస్తువులు పంప, కుతజ, ఇక్షు (చెఱకు) మద్యం మొదలైనవి దిగుమతి చేసుకొనేవారు

BRAOU

గృహ్యసూత్రాల ప్రకారం ఏ వ్యక్తి అయినా మరణించినపుడు, ఆ ఇంటిలో ఆహారం పండకూడదు. ఆ ఇంటిలోని వారు బయట నుండి ఆహారాన్ని కొని తెచ్చుకోవాలని చెప్పడంలో, బయట ఆహారం కొనడానికి ప్రదేశాలు, పూటకూళ్ళ ఇళ్ళలాంటివి ఉండేవని అర్థమౌతోంది. నాణాలు వాడుకలోకి వచ్చినా, ఎక్కువగా వస్తు మార్పిడితోనే వ్యాపారం జరిగేది. పాణిని ఆ కాలంలో 'ఫణ', 'కర్షపణ', 'పాద', 'వాటా' అన్న పేర్లుగల నాణేలు ఉండేవని పేర్కొన్నాడు. తూనికలు, కొలతలకు అధక, అచిత, పాత్ర, ద్యాన, ప్రస్థ అన్నపేర్లు వాడేవని చెప్పాడు.

8.2.7 సముద్ర వ్యాపారం

సముద్రం మీద వ్యాపారం ఉండేదో లేదో అన్నది వాదోపవాదాలకు గురైంది. నౌకల కన్నా, నావల వాడకం ఎక్కువగా ఉండడం వల్ల, నావలను నదులు దాటడానికే ఉపయోగించేవారని, పెద్ద, చిన్న నావలు మాత్రం ఉండేవని తెలుస్తోంది. ఈ నావలు చాలా సులభంగా తయారు చేయబడి, తెడ్లతో నడపబడేవి. అంతేగాని, చుక్కానిగాని, తెరచాపగానీ లేవు. మరి అలాంటప్పుడు సముద్రం మీద ఇలాంటి నావలతో ప్రయాణం చేయడం ఎలా సాధ్యమౌతుందన్నది ప్రశ్నగా మిగిలింది. కనక, వేద కాలపు ఆర్యులకు సముద్రయానం తెలియదు. పొడవైన సింధూ నది, దాని ముఖద్వారాన్ని ఎక్కడ ఉపయోగించకపోవడం, వారికి సముద్ర ప్రయాణం గురించి తెలియదన్న వాదనకు బలం చేకూరింది. అలాగని, ఋగ్వేదంలో పేర్కొనబడ్డ సముద్రం అన్నది వాళ్ళ దృష్టిలో పెద్ద నది అని అనుకోవచ్చు. కాని, 1.116.3 శ్లోకాల అశ్వినీ దేవతలు భుజ్యుడనే వ్యాపారిని అతని 16 తెరచాపల నౌకను సముద్ర తుఫాను నుండి రక్షించిన విధానం చూస్తే, ఆనాటి ఆర్యులకు సముద్రయానం తెలిసి ఉండాలని అర్థమౌతోంది. అలాంటి నౌక సముద్రం మీదే ఉపయోగించబడుతుంది. శతపద బ్రాహ్మణంలో (X 136.5) శ్లోకాలు తూర్పు పశ్చిమ సాగరాలని పేర్కొన్నాయి. అంటే, సముద్రం మీద ప్రయాణం చేసి వ్యాపారం సాగించేవారన్నమాట. క్రమేపీ, తర్వాత వేద కాలంలో అథర్వణ వేదం వల్ల ఖచ్చితంగా సముద్ర వ్యాపారం సాగించారని తెలుస్తోంది.

8.2.8 వ్యాపార వర్గం

'వణిజులు' అని పిలవబడుతున్న వైశ్యులే దేశీయ, విదేశీయ వ్యాపారాన్ని నిర్వహించేవారు. వ్యవసాయంలో గాని, వ్యాపారంలోగాని బాగా ధనం గడించాక, వారు శ్రేణులకు నాయకత్వం వహించినట్లు పేర్కొన్నారు. ఋణాలిచ్చి వడ్డీ వ్యాపారం సాగించడం చాలా ప్రసిద్ధి చెందింది. కానీ, వడ్డీరేటు ఎంతన్నది మనకు తెలియదు. వ్యాపారం సాధారణంగా, వంశపారంపర్యంగా చేసేవారు.

తూనికలు, కొలతల వాడకం వృద్ధి కాలేదు. కాని 'మాన' అన్న కొలత 'కృష్టాల' అన్న కొలతకు సమానంగా వాడకంలోకి వచ్చింది. 'శాన' అనే బంగారు నాణెం నూరు కృష్టాల బరువుకు సమానంగా ఉండి, వ్యాపారస్థుల చేతిలో ద్రవ్యంగా వాడబడింది. 'నిష్క' అనే పూర్వపు గోమానానికి సమానంగా ఉన్న నాణెం, వాడుకలోకి వచ్చింది. ఋగ్వేద కాలంనాటి సామాన్య విపణి క్రమేపి విస్తృతంగా అభివృద్ధి చెంది, రకరకాల దుస్తులు, తోళ్ళు మొదలైన వస్తువులకు మంచి గిరాకి ఉండేది. అయితే, వ్యాపారం కొన్ని నియమాలకు లోబడి జరిగేది. ఉత్పత్తే కాని, దోపిడి చేయకూడదని, దొంగ వ్యాపారం అసలు ఉండరాదన్న నియమం ఉంది. అందుకే ఈ పనులన్నీ చేసే పణులనబడేవారు ఆర్యులకు బద్ధ శత్రువులు. ఋగ్వేదం వారిని దొంగ వ్యాపారులుగాను, పరుకులు అందకుండా దాచేసే (నేటి నల్లబజారు) వారని, మతపరంగా కూడ నియమాలను పాటించరని, యజ్ఞయాగాదులను నిర్వర్తించేవారు కారని నిరసించింది. వారి నాయకుడైన వలుని దాడి నుండి రాజు ప్రజలను రక్షించడం రాజ ధర్మంగా పరిగణించేవారు.

BRAOU

8.3 వృత్తులు, పరిశ్రమలు

బ్రాహ్మణ వర్గం లేక పూజారి వర్గంవారు పూజ కర్మకాండలను నిర్వహించడం, ఆర్యుల వేద విజ్ఞానాన్ని బోధించడం అనే వృత్తికి అంకితమై పోయారు. క్షత్రియ లేక రాజన్య వర్గంవారు యుద్ధరంగంలో యుద్ధం చేయడం వృత్తిగా చేపట్టారు. మూడవ వర్గమైన వైశ్యులు సహజంగానే వ్యవసాయం, పశుపోషణ, వ్యాపారం, ఇతర కళాకారుల వృత్తిని చేపట్టారు. చిట్టచివరి వర్గం శూద్రులు. వారు అన్నిరకాల సేవా కార్యాలను చేపట్టారు. అయితే, ఈ విధంగా వారు తమతము అభిరుచులకనుగుణంగా అవలంబించిన వృత్తులే కాని, వారు అది నిర్వహించడానికని నిర్దేశింపబడ లేదన్న విషయాన్ని గమనించాలి. ఎంతోమంది రాజ్య వర్గంవారు యుద్ధ సమయంలో, యుద్ధంలోనూ, శాంతి సమయంలో తమకు అనుకూలమైన వ్యవసాయం, పశుపోషణ లాంటి వృత్తులను చేపట్టడం ఋగ్వేద కాలం నుండి వస్తోంది.

8.3.1 ఉపవృత్తులు

8.3.1.1 వడ్రంగి

రథాలను యుద్ధాల్లోను, రథ పోటీల కోసం, వ్యవసాయంలోను, వస్తువుల రవాణాకు కావల్సిన బండ్ల తయారీకి కావల్సిన వడ్రంగులు చాలా అవసరమైనారు. అందుకే, ఆ వృత్తి చాలా గౌరవప్రదమైందిగా, ప్రసిద్ధి చెందిందిగా ఏర్పడింది. వడ్రంగి కూడా, తనకున్న నైపుణ్యాన్నంతా చూపెడ్తూ, నగిషీలతో అందమైన రథాలను తయారుచేసేవారు.

8.3.1.2 లోహకారులు

కమ్మరులు పక్షిరెక్కతో విసురుతున్న కొలిమిలో కాల్చి, కరగబెట్టిన లోహం, 'అయాస్' (Ayas) తో గృహోపకరణ వస్తువులను తయారు చేసేవారు. అయాస్ అంటే, ఏ లోహమో తెలియదు. అది రాగిగాని, కంచుగాని, ఇనుముగాని కావచ్చు. లేక మిశ్రమ లోహం కూడా కావచ్చు. అయితే, మొదట రాగి యుగం, ఆ తర్వాత ఇనుప యుగం వచ్చింది కనక, అయాస్ అంటే రాగి అని లేదా, మిశ్రమ లోహమైనా అని అనుకోవచ్చు. తినడానికి, త్రాగడానికి మట్టితో, చెక్కతో చేసిన పాత్రలను వాడేవారు, లోహ పాత్రలతోబాటు చర్మాన్ని శుభ్రంచేసి వాడడం వారికి తెల్సు. ఎద్దు చర్మంతో విల్లుకు ఉండే అల్లెత్రాడు, రథాన్ని వేగంగా నడిపించడానికి కొరడాలు చేసేవారు. సోమరసం తయారు చేసేటప్పుడు రాళ్ళ మధ్య ఈ చర్మాన్ని పర్చేవారు. చర్మంతో సంచులు కూడా తయారు చేసేవారు.

8.3.1.3 కుటీర పరిశ్రమలు

ఇంటిలో తయారయే చిన్నచిన్న పరిశ్రమల్లో ముఖ్యమైనవి కుట్టు, చాపల అల్లికలు, బట్టల నేత మొదలైనవి. వీటిని స్త్రీలు నిర్వహించేవారు.

8.3.2 ఇతర వృత్తులు

నృత్యకారులు, 'వాత్రి' అనబడే క్షురకర్మ చేసే మంగలివారు, మద్యపానం తయారుచేసి అమ్మేవారు (vintuer) మొదలైనవారు ఇతర వృత్తుల వారు. అయితే, ఈ వృత్తికారులందరినీ చిన్నచూపు చూసేవారు.

BRAOU

వేట వినోదం కోసే కాక, వృత్తిగా కూడా ఆచరణలో ఉండేది. సాధారణంగా, రాజన్యులు వేటలో ఆరితేరిన వారి సహాయంతో వేటాడేవారు. బాణాలు, వలలు, గోతులు తీసే సాధనాలు ఉపయోగించేవారు. వేటలో పక్షులను వలలతోను, క్రూరమృగాలను గోతుల్లో పడేసి పట్టేవారు. ఎలుగుబంట్లను, సింహాలను కూడా పట్టేవారని కూడా తెలుస్తోంది. ఋగ్వేదంలోనే వేటాడే పద్ధతి కూడా పేర్కొనబడింది. అయితే, వేట వృత్తిగా కాక, పశువులను, పక్షులను రక్షించే అభయ వృత్తిగా ఉండేది.

మాంసాన్ని అమ్మేటి కసాయివారు కూడ ఒక వృత్తికారులుగ పరిగణింపబడేవారు. యజ్ఞయాగాల సందర్భంలో, బలి ఇచ్చిన పశువుల నుండి మాంసం కోసి ఇవ్వడానికి వారి అవసరం ఎంతైనా ఉంది.


బానిస వృత్తి మాత్రం ఉన్నట్లు కనబడదు. అలా రకరకాల వృత్తులు సమాజంలోని ఇతర కులాలవారి మధ్య పంపకం అయినట్లు తెలుస్తోంది. అయితే, తర్వాతి వేద కాలం నాటికి, మిశ్రమ కులాలవారు ఎక్కువయ్యేసరికి ఈ వృత్తులు చేపట్టిన వారి పరిస్థితి క్లిష్టంగా తయారైంది. వ్యవసాయం, పచ్చిక, పశుపోషణ వైశ్యుల చేతిలో ఉన్నాయి. వేద అధ్యయనం, బోధన, పూజా కర్మకాండలు జరిపించేవారు బ్రాహ్మణులయారు. యుద్ధం చేయడం, రాజ్యం ఏలడం క్షత్రియులకే పరిమితైంది. ఇకపోతే, అన్నిరకాల సేవలకు శూద్రులు నాల్గవ తరగతివారిగా తప్పనిసరిగా గురైయ్యారు. అయితే, ఈ పద్ధతి వారు విధిగా అనుసరించాలని లేదు. కానీ, ఒక కుటుంబానికి సంబంధించిన వృత్తి ఆ కుటుంబ వ్యక్తులు తీసుకోకపోవడం సాధారణంగా జరిగేది కాదు.

పురుషమేధ జరుగుతున్న సందర్భంలో, ఎన్నో వృత్తుల వారు కనిపిస్తారు. వారందరూ తైత్తరీయ బ్రాహ్మణంలో, ఇతర వేద సాహిత్యంలో అనుక్షత్రి, రథాన్ని తోలే సూతుడు, ద్వారపాలకులు, అంగరక్షకులు, అనుచరులు, డప్పు కొట్టేవాడు, ఈతాకు, తుంగ ఆకులతో చాపలు నేసేవారు, లోహకారులు; నాగలి తయారుచేసేవారు, భవిష్యత్తు చెప్పే సోదివాళ్ళు, కసాయివాళ్ళు, విల్లంబులకు అల్లెతాళ్ళు చేసేవారు, వడ్రంగి పనిచేసేవారు, క్షౌరము జమచేసేవాడు, 'దావాపుడు' అంటే, మంట మండుతున్నప్పుడు దానిని జాగ్రత్తగా వ్యాపించకుండా చూసేవాడు, చప్పట్లు కొట్టేవాడు (ఇతడు బహుశ తన చప్పట్లతో పాలాల మీద పక్షులను భయపెట్టేవాడు), దుస్తుల మీద అందంగా కుట్టే స్త్రీలు, బుట్టలు చేసే మేదరులు, ఆభరణాలు చేసే కంసాలులు, గుర్రాలను మాలిష్ చేసేవాళ్ళు, సురాపానాన్ని తయారు చేసేవాళ్ళు, ఏనుగులను చూసుకొనేవారు, బంగారు వస్తువుల తయారీలో సహాయపడేవారు, ఇలా ఎంతమందో వృత్తికారులు పేర్కొనబడ్డారు. ఇతర గ్రంథాల్లో ఇంకా కొంత మంది వృత్తికారులను పేర్కొన్నారు. పడవలను నడిపేవారు, చాకలివారు, కుమ్మరులు, డబ్బు అప్పుగా ఇచ్చేవారు, మంగలివారు, బాకా ఊదేవారు, నావను నడిపించేవారు, ఇంకా ఇతర పనులు చేసేవారు, పంటలు చేసేవారు, వార్తాహరులు, రథం వెంబడి పరుగులు తీసేవారు, అలా అవసరాలు పెరుగుతున్న కొద్దీ వృత్తులు పెరగడం, వాటి మీద ఆధారపడి ఆ వృత్తిని స్వీకరించిన వారెందరో కనిపిస్తారు.

8.3.3 లోహసామాగ్రి తయారీ

ఇంటిలో ఉపయోగించుకొనే పాత్రలు రకరకాల లోహాలతో, రాగి, ఇనుము, రాయి, మట్టితో చేసినవి. ఇవి బహుశ స్థానికమైనవే కావచ్చు. బంగారం, వెండి వస్తువులు, కంచు ఘంటలు మొదలైనవి వారికి ఆ లోహాలతో పరిచయాన్ని సూచిస్తున్నాయి. తెడ్లు, నిచ్చెనలు విసురురాళ్ళు, ఇతర పాత్రలు, కత్తులు, గృహ సామాగ్రిగా, యజ్ఞయాగాల సందర్భాల్లో కూడ ఉపయోగించేవారు. తాటి, ఈత ఆకులతో నేసిన బుట్టలు, చాపలు, 'కతా' అనబడే కూర్చునే చాపలు ముఖ్యంగా దంపతులకోసం ఏర్పాటయ్యేవి.

BRAOU



వేదకాలపు గ్రామీణ స్వరూపం

8.3.4 బట్టల తయారీ

ఆ కాలంలో నూలు, పట్టు, ఉన్ని, నారబట్టలు వాడకంలో ఉండేవి. నూలు తీయడం, నేయడం లాంటివి సాధారణ నిత్యకృత్యంగా ఉండేది. ఒకేరోజు నూలు వడికి, నేసిన బట్టలు ఒక బాలుడికి ధరింపజేసి, మొక్కులు తీర్చుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. నూలుకండెలు 'చత్త' మన్న పేరుతో వాడకంలో ఉన్నాయి. బట్టలకు రంగులు వేయడం అన్నది బాగా ప్రాచుర్యంలో ఉంది.

8.3.5 భవన నిర్మాణం

ఆర్యుల కాలంలో పట్టణవాస జీవితం కనబడదు. ప్రతి గ్రామంలో కొన్ని ఇళ్ళు దగ్గర దగ్గరగా భద్రత కోసం కట్టబడేవి. ప్రతి ఇంటికి క్రూరమృగాల నుండి శత్రువుల నుండి, కాపాడ్డానికి కంచె ఉండేది. ఋగ్వేదంలో పేర్కొన్న 'పుర' అన్న మాటకి అర్థం నగరమో, పల్లె అనో తెలియదు. పురోహితుడు పురానికి హితం చెప్పేవాడని, తరచు పురాలను ధ్వంసం చేసి, పురందరుడన్న పేరు తెచ్చుకొన్న ఇంద్రుడు, ఈమాటలబట్టి అలాంటి పురాలు చాలా ఉన్నాయని తెలుస్తోంది. బహుశ పురం అంటే, ఊరి చుట్టూ రక్షణ కోసం కంచెలాగ బలమైన కోటగోడ లాంటిదని అనుకోవచ్చు. ఇది సాధారణంగా, వర్షఋతువు దాటగానే వచ్చే వరదలాంటి అపాయకరమైన పరిస్థితులను ఎదుర్కోవడానికి ఉపయోగించేవారు.

8.3.6 గృహ నిర్మాణం

ఇళ్ళు, చెక్క లేదా కలప, దూలాలు, వాసాలతో, వెదురుతో కట్టబడేవి. హర్మ్యం అని పిలవబడుతున్న ఈ ఇళ్ళలో ఒక పెద్ద కుటుంబం నివసించడానికి, పశువుల కొట్టాలు ఉండేవి. ఇంటిలో ఎన్నో గదులు, 'గార్హపత్య' అంటే అగ్ని, నిత్యాగ్నికి ఒక ప్రత్యేక స్థలం, తలుపులు, ద్వారబంధాలు ఉండేవి. ఇళ్ళు సాధారణంగా, స్తంభాల మీద దూలాలు, వాసాలు ఆధారం కోసం నిలిపి, వెదురుబద్దలు పేర్చి, ఆపైన గడ్డిని పర్చేవారు. తైత్తరీయ బ్రాహ్మణంలో పేర్కొనబడ్డ 'ధనాధని' అంటే ధనాగారం ప్రత్యేకంగా కట్టబడిన గది అనవచ్చు. అథర్వణ వేదంలో పేర్కొన్న ప్రకారం 'పత్నీం సదనం' బహుశ స్త్రీల కోసం ఏర్పాటు చేసిన గృహాల్లోని భాగం కావచ్చు, దానిలో పడక, ఇతర సామాగ్రిలున్నాయి.

గృహ సంబంధమైన సంస్కారాలు

గృహసంబంధమైన సంస్కారాలను కొన్ని విధిగా చేసేవారు. గృహ ప్రవేశ సంస్కారం అనగా సామాన్యుల నుండి ధనికుల వర్గం వరకు తమతమ తాహతును బట్టి జరుపుకున్న విధానాన్ని గమనిస్తే ఇళ్ళు కట్టుకొనే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. ఇళ్ళ స్థలాలు, ఇళ్ళు కట్టుకోవడానికి అవసరమైన వస్తువులు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇంటికోసం ఎంపిక చేసిన స్థలం వివాదాస్పదం కానిది, చెట్టూపుట్టలు లేనిది, పల్లంగా ఉండి నీరు చేరిపోయే విధంగా లేనిదిగా ఉండాలి. ఆనాటి గృహాల్లో నలుగురూ కూర్చోడానికి ఒక చావిడి, వస్తువులను భద్రపర్చే గది, విశ్రాంతి గది, స్నానపానాదులు నిర్వర్తించే గదులు ముఖ్య గృహానికి కొంచెం దూరంగా విడిగా ఉండేవి.

గృహ నిర్మాణం సాధారణంగా భూమిని కొలిచి, పునాదులను తవ్వి, ఆధారాన్నిచ్చే స్తంభాల కోసం మరింత లోతుగ త్రవ్వి, స్తంభాల మీద దూలాలు, వాసాలు పెట్టి, గడ్డి, ఆకులవంటివి పైన పర్చి, గుమ్మాలు ద్వారబంధాలు ఏర్పర్చడం లాంటి పనులతో కూడుకొని ఉంటుంది. గృహ ముఖ ద్వారం గురించి తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించబడింది. ఇంటికి బావి లేదా నీటిని నిలవచేసి అందించే స్థల ఎంపిక కూడా జాగ్రత్తగా

BRAOU

నిర్ణయించబడుతుంది. ప్రతి సంవత్సరం ఇంటికి కావలసిన మరమ్మత్తులు ఏ పండగ సందర్భంలోనో జరుపుతారు. ప్రతి ఇంటిలోనూ నీటి సరఫరా ఉన్నా, గ్రామంలోని అందరికోసం చెరువులు, బావులు, నీటి నిలవ స్థలాల ఏర్పాటు కన్పిస్తుంది.

8.4 రవాణా

ఋగ్వేదంలో పేర్కొన్న 'పథ' అన్న మాటకు అర్థం రహదారులే. రహదారులు, కూడలి, పంతెనల నిర్మాణం కూడా కనిపిస్తుంది. మనుష్యులను, సరుకులను ఒకచోట నుండి ఇంకో చోటికి చేరవేయడానికి రవాణా సాధనాలు, రహదారుల అవసరం ఎంతైనా ఉందన్న విషయం ఋగ్వేదంలో పేర్కొనబడింది. ఆనాటి ముఖ్య రవాణా సాధనాల్లో రెండు చక్రాలతో ఎత్తుగా తేలికగా ఉండే రథాలు, గుర్రాలతోను, ఎద్దులతోనూ లాగబడే బండ్లు, రాజులకు, ఊరేగింపులకు ఏనుగులనుప యోగించేవారు. గుర్రాలు, గాడిదలు, ఒంటెలు, ఏనుగులు కూడా ఇతర రవాణా సాధనాలు. నదులను నావలు, అవసరమైతే నౌకల ద్వారా దాటేవారు. పూషనుడనబడే దేవత రహదారుల నిమిత్తం పూజింపబడేవాడు. అశ్వినీ దేవతలు నీటిమీద, గాలిలోను ప్రయాణించడానికి తగిన సాధనాలను సమకూర్చేవారని తెలుస్తోంది. రెండు నుండి నాలుగు అశ్వాలతో లాగబడుతున్న రథాలు ధనవంతుల సొత్తు. గుర్రపు స్వారీ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రకరకాల రథాలు, వాటి తయారీ విధానం చూస్తుంటే, ఒకదానిమీద ఒకటి మరింత మెరుగుగా తయారౌతున్నాయని అర్థమౌతోంది. మొత్తం మీద ప్రజలందరికీ ప్రయాణం చేయడం అలవాటే అన్న సంగతి తెలుస్తోంది. ప్రయాణం సానుకూలంగా, సాఫీగా, విజయపంతంగా జరగాలని, ఒడిదుడుకులు, ముళ్ళదారి లేకుండా ఉండాలని, ఇంద్రునికి ప్రార్థనలు జరిపేవారు.

8.5 సంగ్రహంగా

వ్యవసాయం, పశుపోషణ, వర్తకవ్యాపారాలు, చిన్నచిన్న పరిశ్రమలు వేద కాలంలో ఉద్భవించి, ఎంతో అభివృద్ధి చెందాయి. వేద కాలం నాటి సామాజిక వ్యవస్థలో ఎవరెవరు ఏ వృత్తిని చేపట్ట వలసి వచ్చిందో, దాంట్లోనే వంశపారంపర్యంగా ఎలా ఉండాల్సి వచ్చిందో మనం గమనిస్తాం. అయితే, పణిజులు అన్న వైశ్యులు వర్తక వ్యాపారానికి ప్రతినిధులన్నది కన్పిస్తుంది. వ్యాపారానికి అనుకూలంగా ఎన్నో ఇతర వృత్తులేర్పడ్డం, దేశీయ వ్యాపారం ఎలా ఇతర దేశాలకు వ్యాపించిందో తెలుస్తుంది. ఋగ్వేదంలో పేర్కొన్న 'పథ' అన్న మాటకు అర్థం రహదారులు. మనుష్యుల, సరకు రవాణాకు రహదారులు ఎలా అవసరమవుతాయో, ఎంతదూరం రహదారులుంటే, అంతదూరం వ్యాపారం వ్యాపిస్తుందనేది తెలుస్తోంది. మొత్తం మీద వేద కాలం నాటి ఆర్థిక వ్యవస్థ కాలాంతర మార్పులకు మాత్రమే లోనై, ఇంచుమించు అదే విధంగా నేటికి నిలిచి ఉందంటే, అది మన సంస్కృతికి చిహ్నమే కదా.

B R A O U

8.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. వేద కాలం నాటి పశుపోషణ, వ్యవసాయం, పంటలను గూర్చి వివరించండి.

2. వేద యుగం నాటి వ్యాపార పద్ధతులను వివరించండి.

3. వేద కాలం నాటి వృత్తులు, ఉపవృత్తులు ఏర్పడిన విధానాన్ని వివరించండి.

II. క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. పశు సంపద, లేదా గోధనం

2. భవన – గృహ నిర్మాణం

8.7. ఉపయుక్త గ్రంథాలు

Bandhopadhyaya N. : **Economic Life & Progress in Ancient India.**

Buch M.A. : **Economic Life in Ancient India.**

Chakraborthi H. : **Trade & Commerce in Ancient India.**

Chopra P.N., Puri B.N. & Das M.N. : **A Social, Cultural & Economic History of India (Ancient).**

Hussain H.H.G. : **The Economic History of India.**

Kosambi D.D. : **The Culture & Civilization of Ancient India an Historical outline.**

Majumdar R.C. : **Vedic Age - Bharatiya Vidyabhavan.**

Thapar Romila : **A History of India - Vol. I.**

రచయిత్రి : డా. కె. జానకి

BRAOU

BRAOU

ఖండం – 3 : క్రీ.పూ. 6వ శతాబ్దం నాటి మతోద్యమాలు – సాంఘిక, ఆర్థిక, వ్యవస్థలపై వాటి ప్రభావం

భారతదేశంలో క్రీ.పూ. 1400 నుండి ఇంచుమించుగా అభివృద్ధి చెందిన వైదిక మతం, క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి వైవిధ్యంతో కూడిన పరిణామాలను పొందింది. ముఖ్యంగా యజ్ఞకాండ విస్తృతమై, హింసతో కొంతవరకూ కూడుకొని, అంతవరకు వాగరికతలో, ముఖ్యంగా వ్యవసాయక జీవన విధానంలో ఉన్న పైతరగతివారైన బ్రాహ్మణులు ఈ యజ్ఞయాగాదులను నిర్వహించి, ఏం సాధించగల్గుతున్నారు అనే ప్రశ్న అనేక వర్గాల్లో తలెత్తింది.

అంతేకాక, సమాజంలో బ్రాహ్మణులే గొప్పవారుగా పరిగణింపబడేవారు. దాంతో ప్రభుత్వాన్ని పరిపోషిస్తూ పరిపాలిస్తున్న ప్రభువులు తమ గొప్పదనాన్ని ప్రకటించుకొనే స్థితి ఏర్పడింది. ఆ సందర్భంగా ఏర్పడ్డ నగరీకరణ స్థితి వివిధ పట్టణాలు నగరాల రాజ్యాల ఆవిర్భావానికి తోడ్పడింది. దాన్ని పాలించే పాలకులు యుద్ధాల ద్వారా వివిధ ప్రాంతాలను ఆక్రమించి, జనపదాలను, చక్రవర్తి క్షేత్రాలుగా మారుస్తూ తమ ఔన్నత్యాన్ని చాటుకొన్నారు.

వీరే, వైదికేతరమైన రీతిలో, యజ్ఞయాగాదులకన్నా భిన్నమైన రీతిలో సంయమనం ద్వారా, సచ్ఛీలం ద్వారా, శాంతి ద్వారా, యజ్ఞయాగాదికాలిప్యలేని మహోన్నతమైన, ఆనందపారవాన్ని చేరడానికి, యజ్ఞంనుండి పుట్టిన అచ్ఛాతాన్ని అందరికీ ఇవ్వడానికి ముందుకు వచ్చారు.

అప్పటికే హిందూ మతంలో సాంఖ్య, న్యాయ వైశేషిక దర్శనాలు ఆస్తిక దర్శనాలుగా రూపొందడం, భగవంతుని ఉనికిని 'సాకారుడు' 'నిరాకారుడు' అనే చర్చల్లో నిరూపిస్తూ ఉపనిషన్వాఙ్మయంలోనూ, తదనుబంధ వాఙ్మయంలోను జరిగిన చర్చలు, దేవుడు లేడు అనడం, దేవుని గూర్చి ఆలోచించడం అనవసరం అనడం ఎంతో సబబైనవేనని, అవి విప్లవాత్మకమైనవి కావనే భావనను పలువురిలో కల్గించాయి.

ఈ పరిణామాలే, బౌద్ధ, జైన, భాగవత, శైవ, ఆజీవక, లోకాయత మత సాంప్రదాయాలకు దారి తీశాయి.

శాక్య వంశ క్షత్రియుడైన గౌతమ సిద్ధార్థుడు అష్టాంగ మార్గం ద్వారా సత్ప్రవర్తన పొంది, మోక్షతుల్యమైన నిర్వాణాన్ని పొందొచ్చని తెల్సి బుద్ధుడయ్యాడు. అతడు భగవంతుని గూర్చిన చర్చ అసంబద్ధమని భావించాడు.

జ్ఞాత్రిక వంశ క్షత్రియుడైన వర్ధమానుడు అంతకు ముందు అమల్లో ఉన్న తీర్థంకరులచే ప్రవచితమైన మతసూత్రాలైన సత్య వాక్కు, అహింస, దొంగతనం చేయకపోవడం, అస్తేయం అనేవాటికి తోడు, బ్రహ్మచర్యాన్ని జతపర్చి, సచ్ఛీలతద్వారా శరీర బంధాలను, గ్రంథులను జయించి జినుడయ్యాడు. ఇతడు భగవంతుని గుర్తించలేదు.

జైన తీర్థంకరుడైన అరిష్టనేమికి సమకాలికుడైన వృష్ణిశుడైన వాసుదేవ కృష్ణుడు సత్యం అహింస, ఆర్జవం, దానం, తపస్సు అను వాటిద్వారా, వ్యక్తి భగవంతుడవగలడని సూచించాడు. ఆ ప్రక్రియలోనే నిర్వహించిన 24 వ్యూహాలు భాగవత మతాన్ని వైష్ణవంగా మార్చాయి.

BRAOU

ఋగ్వేదంలో చెప్పిన రుద్రుని ప్రధాన దైవంగా గుర్తిస్తూ, వేద ప్రాధాన్యాన్ని నిరసిస్తూ, శైవులు పాశుపతం, కాశ్మీర శైవం, వీర శైవం వంటి వివిధ శాఖలుగా శివోపాసన చేశారు.

కాగా, జీవనంకోసం, సన్యాసులుగా ఉంటూ, కేవలం ప్రపంచం అంతా నిర్దిష్టమైంది దీన్ని మనం కర్మద్వారా ఎలా మార్చలేం గనుక, నిష్కర్మత్వం ద్వారా మాత్రమే ఉండాలి అని, భిక్షుక వృత్తి ద్వారా జీవించేవారు, ఎక్కువగా శూద్రులు ఆజీవకులయ్యారు. దీన్ని గోసాలమంఖలిపుత్తుడు ఎక్కువగా వ్యాప్తిలోకి తెచ్చాడు.

ఈ జీవితంలోని సుఖం దుఃఖం రెండూ ఉన్నప్పుడు దుఃఖాన్ని మార్చి వీలైనంత హెచ్చుగా, ఈ ఋద్ధ్రుద ప్రాయమైన జీవితంలో చట్టసమ్మతమైన రీతిలో, ఎంతో సుఖాన్ని అనుభవించాలి అన్నవారు చార్వాకులు, వారే లోకాయతులు. దుఃఖాన్ని, దుఃఖ నివారణనుగూర్చి చర్చించడం అనవసరమని వారు భావించారు. దుఃఖాన్ని తప్పించుకోవడమెలా అని చర్చించే బదులు, అందుబాటులో ఉన్న సుఖాలను పొందడమే లౌక్యమని వీరు భావించారు. వీరు పూర్తిగా లోకనిష్ఠులవడం వల్ల లోకాయతులని, సుఖానుభావమే ప్రధాన ప్రవృత్తిగా ఉండడంవల్ల 'చార్వకులని' పిలవబడ్డారు.

ఈ రకమైన భావాలన్నీ ఆచరణలో ఉద్యమాలుగా రూపొంది, వివిధ వర్గాల మీద తమ ప్రభావాన్ని చూపాయి. వాని పరిశీలనే ఈ ఖండ లక్ష్యం.

BRAOU

భాగం – 9 : బౌద్ధ మతం

విషయక్రమం

9.0 లక్ష్యాలు

9.1 పరిచయం

9.2 సాహిత్యాధారాలు

9.2.1 భారతీయుల రచనలు

9.2.2 విదేశీయుల రచనలు

9.3 పురావస్తు ఆధారాలు

9.3.1 శాసనాలు

9.3.2 కట్టడాలు

9.3.3 శిల్ప, చిత్రలేఖనాలు

9.4 బౌద్ధ మతతత్వం, ప్రాముఖ్యత

9.5 బుద్ధుని జీవితం, బౌద్ధ మత ఆవిర్భావం

9.6 బౌద్ధ మత పరిణామం, బౌద్ధ సంఘం

9.7 సామాజిక, ఆర్థిక వ్యవస్థలపై బౌద్ధ మత ప్రభావం

9.7.1 సామాజిక వ్యవస్థ

9.7.2 ఆర్థిక వ్యవస్థ

9.8 రాజకీయ వ్యవస్థపై బౌద్ధ మత ప్రభావం

9.9 విద్యా సాంస్కృతిక వ్యవస్థలపై బౌద్ధ మత ప్రభావం

9.10 విదేశాల్లో బౌద్ధ మత వ్యాప్తి

9.11 బౌద్ధ మత క్షీణత

9.11.1 వికేంద్రీకరణల వ్యాప్తి

9.11.2 బౌద్ధ మతం ఒక ప్రత్యేక వ్యవస్థ కాదు

9.11.3 బౌద్ధ మత వ్యాప్తి

9.11.4 రాజ్య దృక్పథంలో మార్పు

9.11.5 పౌరాణిక హిందూ మతం

9.11.6 స్త్రీ దేవతారాధన

9.11.7 అవతార భావన

9.12 సంగ్రహంగా

9.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

9.14 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

9.0 లక్ష్యాలు

* ఈ భాగాధ్యయనం వల్ల మీరు,
* బౌద్ధ మత ఆవిర్భావాన్ని, దానికి సంబంధించిన ఆధారాలను వివరించగల్గాలి
* బౌద్ధ మతారంభంనుండి క్రీ.శ. 700 వరకు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో బౌద్ధ మత ప్రభావాన్ని విశ్లేషించగల్గాలి.
* బౌద్ధ మత ప్రత్యేకతను, ప్రాముఖ్యతను వివరించగల్గాలి.

9.1 పరిచయం

బౌద్ధ మతం భారతదేశంలోని మతాల్లో ఒక ప్రాచీనమైన మతం, చైనాలో కన్ఫ్యూషియస్, ఇరాక్‌లో జొరాస్టర్ మొదలైన వారు కూడా ఇదే సమయంలో వరుసగా కన్ఫ్యూషియనిజం, జూరాస్ట్రియనిజం అను రెండు మతాలను బోధించారు. చైనాలో కన్ఫ్యూషియనిజం ఎంతో ఉత్తమంగా చాలాకాలంపాటు వర్ధిల్లింది. ఆ పిదప బౌద్ధ మతం చైనా చేరాక, కన్ఫ్యూషియనిజం కొంత ప్రాముఖ్యతను కోల్పోయింది. కాగా, యూదుజాతి వారు క్రైస్తవ మతం వ్యాప్తిలో ఉన్నంత కాలం, జూరాస్ట్రియన్ మతాన్ని నిల్పుకొన్నారు. ఇప్పటికీ వారు ఇస్రాయిల్‌లో ఒక ప్రత్యేక జాతిగా, జాతీయత కల్గిన వారుగా గుర్తింపును పొందారు. కాని, బౌద్ధ మతంతోగల ప్రస్తుత దేశాలైన చైనా, జపాన్ వంటి చోట్ల మతమొక్కటే ప్రధానంగా లేదు. కారణం, బౌద్ధ మతం కొన్ని ఆర్య సత్యాలను వివరించి, మానవులను దుఃఖ విముక్తులను చేయడానికి యత్నించిన జీవన విధానం మాత్రమే. అందువల్ల బౌద్ధ మతం అది భౌతికత (Metaphyscism)కన్న అతిభౌతికత (Materialism) పెచ్చుగా ఉండి, ఆ మతం తమ అనుయాయులమీద వారి సామాజిక ఆర్థిక విధానాల మీద, ఎనలేని ప్రభావాన్ని చూపింది.

9.2 సాహిత్యాధారాలు

బౌద్ధ మతాన్ని గూర్చి దాని వ్యాప్తి, తద్వారా కల్గిన సామాజికార్థిక, సాంస్కృతిక పరిణామాలను గూర్చి తెలుసుకోడానికి అనేక రకాలైన ఆధారాలువ్నాయి. వీటిని మనం సాహిత్యాధారాలు, పురావస్తాధారాలు అని రెండు రకాలుగా పేర్కొవచ్చు. సాహిత్యాధారాలను భారతీయుల రచనలు, విదేశీయుల రచనలుగా పేర్కొవచ్చు.

9.2.1 భారతీయుల రచనలు

బౌద్ధ మతాన్ని గూర్చి తెలుసుకోడానికి పాళీభాషలోను, సంస్కృత భాషలోను గల సాహిత్యం ముఖ్యమైంది. పాళీభాషలోని సాహిత్యంలోనే "త్రిపిటకాల"నబడే ప్రధాన ఖండాలను చూడగలం. ఈ పాళీ సారస్వతంలో గద్యాలను "సుత్తాములు" (సూక్తం) అని, గద్యపద్యాలతో కూడిన వానినిగేయాలని, వివరణలను "వెయ్యకరణం" అని, భిన్నభిన్న వృత్తాంతాలను గాథలని, బుద్ధుని దివ్యత్వాన్ని చెప్పే పొడుపు కథలను "ఉదానములని"

(Epigrams) బుద్ధుడు ఈ విధంగా చెప్పాడు అని చెప్పే సూచికలను "ఇతి ఉత్తకములని", బుద్ధుని పూర్వజన్మ వృత్తాంతాలను "జాతక కథలని", బుద్ధుని ఆశ్చర్యావాహక చర్యలను అబ్భుత ధమ్మ" (అద్భుత ధర్మం) అని, ప్రశ్నోత్తర రూపంగా ఉన్నవానిని "వెదళ్ళ" అని వర్గీకరించడం జరిగింది.

ఈ త్రిపిటకాల్లోను, సుత్త పిటకం, వినయ పిటకం, అభిధమ్మ పిటకం అనేమూడు ప్రధాన సంపుటాలున్నాయి.

సుత్త పిటకం బుద్ధుడు సారనాథ్ దగ్గర మృగయావనంలో ధర్మచక్ర ప్రవర్తన ప్రారంభం చేసిన దగ్గరనుండి వివిధ ప్రాంతాల్లో వెలువరించిన సూక్తుల సంపుటి. సుత్త పిటకంలోని సూక్తుల్లో బుద్ధునివి మాత్రమేకాక, ఇతర ప్రధాన అనుయాయులవికూడా ఉన్నాయని శ్రీమతి రైస్ డేవిడ్స్ వివరించారు. సుత్తపిటకంలో ఐదు నియమాలున్నాయి. అవి "దీఘ నికాయం" మజిమ నికాయం". "సంయుత్త నికాయం", "అంగత్తర నికాయం", "ఖుద్దక నికాయం".

దీఘ నికాయంలో 34 పెద్ద సూక్తులున్నాయి. దీనిలో 'పీలక్ఖండ', 'మహావగ్గ', 'పాతికవగ్గ' అనే మూడు ఉపభాగాలున్నాయి. మజ్ఝిమ నికాయంలో, 50 పన్నాగులు ఉన్నాయి. ఇవి యజ్ఞయాగాలను గూర్చి, భిక్షువుల జీవనాన్ని గూర్చి చెప్తాయి. సంయుత్త నికాయంలో 56 క్రోడీకరింపబడిన సూక్తులున్నాయి. దానిలో 'సగాథ', 'నిదాన', 'ఖండ', 'సళాయతన', 'మహా' అనే ఐదు భాగాలున్నాయి. అంగుత్తర నికాయంలో 'నిపాతా'లున్నాయి ఖుద్దక నికాయం ఆభిధమ్మ పిటకం వంటిదే. దీనిలో 'ఖుద్దక పాఠం' 'ధమ్మపదం', 'ఉదానం' 'ఇతివృత్తకం' సుత్తనిపాతం' 'విమానవత్థు', 'హేతవద్దు, 'తేరాగాథ, 'తేరీగాథ', జాతకములు', 'నిద్దేశం', 'పతిసంభధామగ్గ', 'అపదానం' బుద్ధవంశం', 'చరియా పిటకం' అనే 15 భాగాలున్నాయి.

దీఘ నికాయంలోని 'మహాపదాన సుత్తాంతం' (మహాప్రధాన సూత్రాంతం) 'లక్ఖణసుత్తాంతం' (లక్ష్మణసూత్రాంతం) అనేవి మహాపురుష లక్షణాలను ప్రతిపాదిస్తున్నాయి. మజ్ఝిమ నికాయానికి చెందిన 'అరియ పరివేసనసుత్త' (ఆర్యాపరివేషణ సూత్రం) లో గౌతముడు రుద్రకుని ఆశ్రమాన్ని వదలిన పిదప ఉరువేల గ్రామానికి వెళ్లడం, బుద్ధుడవడం, సుజాత అనబడే భక్తురాలి కథవంటివి వివరింపబడ్డాయి. "మహాపరినిబ్బాణ సూత్రం' (మహాపరినిర్వాణ సూత్రం)లో, బుద్ధుడు కుశ నగరాన్ని చేరడం, అక్కడ, ఝగ్మతకు గురికాడం, చివరిగా, నిర్వాణాన్ని పొందడం వివరింపబడ్డాయి. 'ధర్మచక్ర ప్రవర్తన సూత్రం' బుద్ధుని తొలి ప్రవచనాన్ని 'మధ్యమ ప్రతిపత్తగా, పిలుపబడినదాన్ని వివరిస్తుంది.

వినయ పిటకం, శీలసందను పెంపొందించుకోడానికి గల మార్గాలను వివరిస్తుంది. దీనిలో "పాతిమొక్ఖ" అనబడే 152 ప్రవర్తనా నియమాలు, 'సుత్తవిభాంగం' పై నగల 'పాతిమొక్ఖ వ్యాఖ్య,'మహావగ్గ' (మహావర్గ), 'ఛుల్లవగ్గ' (క్షుల్లవర్గ) అనే రెండు భాగాలుగాగల 'కాంధకము'లున్నాయి. 'మహావగ్గ'లో బౌద్ధ సంఘావతరణను గూర్చి చెప్పబడింది. దానిలో దొంగతనాలు, వ్యభిచారం, నేరాలు వంటి వివిధ సామాజికాంశాలు ప్రతిపాదింపబడ్డాయి. ఛుల్లవగ్గంలో బౌద్ధ సంఘంలో భిక్షుకులు, భిక్షుణిలు అనువారి విపరాలు చెప్పబడ్డాయి. పరిహారం అనేది వినయ పిటకంలో తర్వాత చేర్చబడిన భాగం. ఇది ఒక సింహళ భిక్షువు రాసిన ప్రశ్నోత్తర రూపమైన భాగం.

'అభిధమ్మ పిటకం' ప్రజ్ఞను పెంపొందించుకోడానికిగల రూపాలను, మార్గాలను వివరిస్తుంది. ఆచార్య నళినాక్ష దత్‌గారి ప్రకారం, దీనిలో ఆధిభౌతికత సూత్రాలు ఉండదగినంత లేవు. దీనిలో 'ధమ్మసంగణి', 'విభాంగ', 'ధాతుకథ', 'పుగ్గల', 'పట్ఠాన' అనే ఏడు భాగాలున్నాయి. అభిధమ్మ పిటకంలో విజ్ఞాన పదం అని చెప్పబడ్డ కథావత్థు (కథావస్తువు) మహాసాంఘికులను వ్యతిరేకిస్తూ చేసిన తీర్మానాలను కల్గిఉన్నది. కాగా, సర్వాస్తివాదులగూర్చి వారి అభిధమ్మ పిటకంలో కాత్యాయనీ పుత్రుడు రాసిన 'జ్ఞాన ప్రస్థాన సూత్రం' తెల్పుతున్నది.

BRAOU

'ఖుద్దక నికాయం'లో చెప్పబడిన జాతక కథలు బౌద్ధ వాజ్మయంలో ఒక ప్రత్యేకతను సంతరించు కొన్నాయి. అవి ఇంచుమించు 500 ఉన్నాయి. వీనిలో బోధిసత్త్వుడే ప్రధాన వ్యక్తి. ఈ బోధిసత్త్వుడి నుండి మహాయాన మతంలో బుద్ధునికన్న ఉన్నతమైన వాడు, ఆదర్శప్రాయమైనవాడు. దానం, శీలం, క్షాంతి, వీర్యం, ధ్యానం, ప్రజ్ఞ ఉపాయ కౌశలం ప్రణధానం బలం, జ్ఞానం అనబడే, 10 లక్షణాలు కలవాడే, బోధిసత్త్వుడు. ఈ లక్షణాలను పొందడంలో, అవలోకితేశ్వరుడు, మంజు శ్రీ, వజ్రపాణి, సామంతభద్రుడు, మైత్రేయుడు, అక్షగర్భుడు, మహాస్థంప ప్రాప్త, బైషజ్య రాజవంటి వివిధ మూర్తులుగా పరిణమించి, తుదకు బుద్ధత్వాన్ని పొందగలిగాడు. బోధిసత్త్వుడు జనులను దుఃఖంనుండి రక్షించే వివిధ స్థాయీరూపాలే జాతక కథలు. కళలు, సాహిత్యం, ఆర్థిక, సామాజికాంశాలను విస్తృతంగా పొందుపరుస్తున్నాయి. భారతీయ సాహిత్యంలో ఎక్కడా పేర్కొనబడని వివిధ సామాజిక వర్గాలను గూర్చి జాతక కథల్లో మాత్రమే పేర్కొనబడడం జరిగింది. తద్వారా జాతక కథలను ఒక ప్రత్యేక వాజ్మయ రూపంగా చెప్పొచ్చు.

ఇతర గ్రంథాల్లో, నాగసేనుడు రాసిన 'మిళింద పన్హా' ఒకటి. దీనిలో ఏడు భాగాలున్నాయి. ఇవన్నీ నాగసేనుడే రాసినట్లు శ్రీమతి రైస్ డేవిడ్స్ పేర్కొన్నారు. ఈ గ్రంథం యవనరాజైన మినాండర్‌కు నాగసేనునికి మధ్య జరిగిన సంభాషణ. దీనిలో అతడు బౌద్ధమత సిద్ధాంతాల పారామ్యాన్ని బోధించాడు.

అశ్వఘోషుడు రాసిన 'బుద్ధచరిత' 'వజ్రసూచి', 'శ్రద్ధోత్పాద సూత్రం' ముఖ్యమైనవి. మొదటిది, బుద్ధుని చరిత్రకాగా, 'వజ్రసూచిలోను, 'శ్రద్ధోత్పాద సూత్రంలోను అతడు యోగాచార సాంప్రదాయాలను వివరించాడు. వసుమిత్రుడు రాసిన 'విభాష సూత్రం' వైభాషికులు అనబడే మహాయాన శాఖవారిలోని ఒక ఉప శాఖకు చెందిన వారి సిద్ధాంతాలను వివరించింది. కాగా, ఆచార్య నాగార్జునుడు రాసిన 'పంచవింశతి సాహస్రిక ప్రజ్ఞా పారమిత, మధ్యమకారిక' అనే గ్రంథాలు మహాయానంలోని 'శూన్యతవాదాన్ని ప్రతిపాదిస్తున్నాయి. లలితవిస్తారం, వసుబంధుడు రాసిన 'సర్వాస్తివాదభిధర్మం' అనేవి, యోగాచారతత్వాన్ని సూచిస్తున్నాయి. దీనిలో 'లలిత విస్తరం'లో బుద్ధుని విద్యాకాలం గూర్చి, అతడు విలువిద్యలో సాధించిన గొప్పదనాన్ని గూర్చి వివరించడం జరిగింది. లలిత విస్తరం పౌరాణికత గల గ్రంథం.

9.2.2 విదేశీయులు రచనలు

విదేశీయుల రచనల్లో ముందుగా పేర్కొనదగినవి, సింహళానికి చెందిన 'దీపవంశం', 'మహావంశం' అనే గ్రంథాలు. ఇవి రెండుకూడా, 'అట్ఠకథ' మహావంశం అనబడే పాళీ గ్రంథం ఆధారంగా రాయబడ్డాయి. మహావంశాన్ని మహానాముడు రాశాడు. 'దీపవంశం' కర్తను గూర్చిన వివరాలు తెలియడం లేదు. ఈ రెండు సింహళంలో బౌద్ధ మతం వ్యాప్తి పొందిన వివరాలను పొందు పరుస్తున్నాయి. సింహళాన్ని పాలించిన తమిళుడైన ఎళారుని వృత్తాంతం మహావంశంలోనేకాక 'శిలప్పాదికారం'లో కూడా చెప్పబడింది. గుప్తులకాలంలో ఫాహియాన్, హర్ష వర్ధనుని కాలంలో 'హ్యుయెన్‌త్సాంగ్' భారతదేశానికి వచ్చిన చైనా యాత్రికులు వీరి రచనలను బీలే ఇంగ్లీష్‌లోకి అనువదించారు. హ్యుయెన్‌త్సాంగ్ రాసిన 'సి.యు.కి' (Si-yu-ki) లో అనేక సమకాలికాంశాలు వివరించబడ్డాయి.

9.3 పురావస్తు ఆధారాలు

దీనిలో ప్రధానంగా శాసనాలు, కట్టడాలు, శిల్పచిత్రలేఖనాలు, బౌద్ధ మతంలో వచ్చిన వివిధ పరిణామాలను సూచిస్తున్నాయి.

9.3.1 శాసనాలు

బౌద్ధ మతాన్ని గూర్చి తెల్పే ఈ శాసనాలు అశోకుని శాసనాలు బ్రాహ్మి, ఖరోష్ఠి లిపుల్లో రాయబడి, యావద్భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో స్తంభాలమీద, కొండలమీద విస్తృతంగాను, పరిమితంగాను చెక్కబడ్డ ఈ శాసనాలు అక్కడ బౌద్ధ ధర్మాన్ని ఏ రకంగా ప్రచారం చేసింది, ధర్మమహామాత్రులనే ఉద్యోగులను బౌద్ధ ధర్మ ప్రచారానికి నియమించింది తెల్పుతాయి. అదేవిధంగా, మహారాష్ట్రలో గౌతమీ బాలశ్రీ వేయించిన నాసిక్ స్మారక శాసనం నాగార్జున కొండలోని శాసనాలు, బౌద్ధ మతంలోని వివిధ శాఖలైన భాద్రాయణీయులు, మహాసాంఘికులు, రాజగిరికులు, పూర్వశైరీయులు, ఆపరా శైరీయులు వంటి వర్గాలను పేర్కొనడమే కాక, ఇక్ష్వాకులు బౌద్ధ మతాన్ని ఏవిధంగా పోషించింది వివరించాయి. అలాగే, ఆనందస గోత్రీకుల శాసనాలు విష్ణుకుండినుల శాసనాలు, శ్రీ పర్వతస్వామి పాదానుధ్యాతులైన పరమసౌగతుల గూర్చి వివరిస్తాయి. ఇక 'హారీతి' వంటి బౌద్ధ దేవతలు చాళుక్య శాసనాల్లో పేర్కొనబడడం వల్ల, చాళుక్యులకు బౌద్ధ మతానికి గల సంబంధాన్ని ప్రశ్నించి, చర్చించడానికి అవకాశమేర్పడింది.

9.3.2 కట్టడాలు

బౌద్ధ మతానికి చెందిన నిర్మాణాల్లో గుహాలయాలు, స్తూపం, చైత్యం మతపరమైనవికాగా, ఆరామం, విహారం మతేతరమైనవి.

స్తూపాల్లో తొలి దశను సాంచిలో చూడొచ్చు. ఆదశలో స్తూపాలు కేవలం, పోగుగా పెట్టబడిన మట్టికుప్పలు. కొన్ని రాళ్ళతోను, ఇటుకలతోను పేర్చబడ్డవి. వాటికి ఏ రకమైన సున్నం, మట్టి కలిపి ఏర్పర్చలేదు. కాని రానురాను, విస్తృతంగా కన్పించే స్తూపం, అండాకారంగా రూపొందింది. ఒక వేదికనుంచి, దాని మధ్య భాగంలో ఒక పేటికలో బుద్ధుని శారీరక (శరీరానికి చెందిన భాగాలు) పారిభోజిక, (బుద్ధుడుపయోగించిన వస్తువులు) ఔద్దేశిక (బుద్ధుని సూచించే వస్తువులు) అవశేషాలలో దేన్నో ఒకదాన్ని ఉంచి, దానిపై అండం నిర్మించబడింది. దీనిపైన బుద్ధునికి గుర్తుగా ఒక హార్మికం (పతాకం) ఏర్పర్చడం, దాని చుట్టూ, ఆయక స్తంభాలతో కూడుకొన్న ఆయక వేదిక ఏర్పడడం జరిగింది. కాని, ముందుగా పరిమితాలంకారంతో కూడుకొన్న ఈ స్తంభాలు రానురాను సాలంకృతంగా మారి, సాంచివద్దగల తోరణాల్లా అతిరమణీయకతను, దివ్యత్వాన్ని సంతరించుకొన్నాయి.

చైత్యం ప్రార్థనామందిరం, ఇది గుర్రపునాడా ( ) ఆకారంలో ఉంటుంది. చివరి భాగంలో, బుద్ధుని విగ్రహం ఉండగా, మిగతా భాగం ప్రార్థనకు వాడేవారు. ఇటుకలతో నిర్మించిన ఈ చైత్యాలను నాగార్జునకొండలోను, గుహాలయాలుగా మారిన వానిని కార్లే, బాజీ, నాసిక్, కొండెన్, ఎల్లోరావంటి చోట్ల చూడగలం. ఆరామం విహారం అనబడే రెండూ బౌద్ధభిక్షుల వసతికి చెందినది.

9.3.3 శిల్ప, చిత్రలేఖనాలు

బౌద్ధ మతంలో, శిల్పం ఎంతో ఘనమైంది. కుషాణ వంశీకుడైన కనిష్కుని కాలంనుండి అభివృద్ధి పొందిన గాంధార కళ, తక్షశిల, మధుర, అమరావతి వంటి కేంద్రాల్లో ఎంతో విస్తృతంగా అభివృద్ధి చెందింది. ఈ కాలంలోనే తొలి ప్రయత్నంగా, బుద్ధ విగ్రహానికి రూపకల్పన చేయడం జరిగింది. తక్షశిల రూపొందిన బుద్ధుడు రజోగుణానికి ప్రతీకగా నిలవగా, మధురలో రూపొందిన బుద్ధుని ప్రతిమ బుద్ధుని లోని సాత్వికతను, జీవకారుణ్యాన్ని ఎత్తిచూపుతుంది. అదే సాంప్రదాయం కొన్ని స్థానికమైన మార్పులతో అమరావతి శైలిలో కూడా పెంపొందింది. అనేక పార్శ్వ పరివార దేవతలు, యక్షులు, యక్షిణులు వంటి వివిధ శిల్ప రూపాలు, బౌద్ధ

BRAOU

కళలోని పరిణామాన్ని మాత్రమే కాక, ఆ కళలో, కథన మాత్రంగా చూడబడుతున్న వివిధ లౌకిక వర్గాల ప్రాతినిధ్యాన్ని చూపిస్తున్నాయి. అజంతాలోని చిత్రలేఖనాలు బౌద్ధ ఆలయాల్లో అభివృద్ధి పొందుతున్న కళాదృష్టికి చక్కని ఉదాహరణలు. దీనిని తర్వాత హిందూ సాంప్రదాయవాదులు కూడా ప్రోత్సహించినా, దీనికి ఆరంభం బౌద్ధుల ప్రభావంవల్ల జరిగిందనేది నిర్వివాదాంశం. ఈ కళలను పోషించడం, కేవలం ఆనందం, తద్వారా శాంతి పొందడం అనే దృక్పథం దృష్ట్యానే ఏర్పడింది తప్ప, వానికి వేరే ఏరకమైన ఉద్దేశ్యాన్ని అంటగట్టడానికి వీలులేదు. ఈ శిల్పచిత్రలేఖనాలు రెండూ ప్రాథమికంగా, లలిత కళారూపాలైన భారతీయ సంస్కృతిలో వైదిక, ఉపనిషదిక వాఙ్మయంలో చెప్పబడిన బ్రహ్మానందాన్ని, లౌకిక స్ఫూర్తితో రసానందాన్ని సాధించడం ద్వారా, ఎలా పొందాలి అనేదానికి ఒక మధ్యమార్గంగానే రూపొందినట్లు గుర్తించొచ్చు.

9.4 బౌద్ధ మతతత్వం, ప్రాముఖ్యత

బౌద్ధ మతం తొలిసారిగా భారీస్థాయిలో వైదిక సిద్ధాంతాలకు వ్యతిరేకంగా తత్వానికి భాష్యం చెప్పిన ప్రయత్నం. వ్యవసాయిక జీవనం నుండి, నాగరక జీవనానికి మార్పు పొందినప్పుడు, నాగరక పరమైన వర్తక, వాణిజ్యాల మీద అధికారంతో రాజులు తామునూడా ప్రవక్తలం కాగలం అనడానికి ఒక తొలి నిదర్శనం బౌద్ధ మతం. యజ్ఞయాగాదులవంటి సంక్లిష్ట విధానాలను ఏవగించుకొని, కావరాని భగవంతునికి, భగవతత్వానికి వైదిధ్యాన్ని ఆపాదించి, ఆచార సంక్లిష్టతను ఏర్పర్చి దుఃఖాన్ని పొందే బదులు, ఆ దుఃఖాన్ని మాత్రం అన్ని రకాలుగా పరిహరించడం ఎలా? అనే ప్రశ్నతో ప్రారంభం కావడమే బౌద్ధ మతంలోని ప్రాముఖ్యత. ఒక విధంగా చెప్పాలంటే వైదిక మతం సిద్ధాంతం నుండి ఆచరణకు పర్యవసించిన మత రూపం కాగా, బౌద్ధ మతం ఆచరణ నుండి సిద్ధాంత తత్వానికి ఎదిగిన మతం. ఈ ప్రాముఖ్యత వల్లనే, నిత్యజీవితంలో కనపడని భగవంతుని బౌద్ధ మతం అంగీకరించలేదు. రుగ్మత, విచ్ఛిన్నత, మృతిపట్ల ఆసక్తుడైన బుద్ధుడు, దాన్ని మినహా, దుఃఖాన్ని మినహా, వేటినీ గణించలేదు. ఆ మహాదుఃఖానికి మూల కారణాన్ని, దానికి నివారణోపాయాన్ని కనుగొనడం గురించే ఆలోచించాడు.

బౌద్ధ మతంలో బుద్ధుడు తనకు పూర్వం ఉన్న దర్శనాలను, ముఖ్యంగా సాంఖ్య దర్శనాన్ని వినియోగించుకొన్నాడు.. అలా అని యథాతథంగా దాన్నే తన సిద్ధాంతంకు ఆత్మగాకాని, పీఠంగాకాని, గ్రహించలేదు. కారణం సాంఖ్య సిద్ధాంతం నుండి ఆచరణకు వస్తున్నదే అయినప్పటికీ, కపిలునిలాగా బుద్ధుడుకూడా, భగవంతుని ఉనికిని, భగవంతునిపట్ల విశ్వాసాన్ని ఏర్పర్చుకోలేదు. దీన్ని తొలి నాస్తిక వాదంగా కూడా గ్రహించవచ్చు.

బౌద్ధ మతం కోర్కెకు-కర్మకు, కర్మకు-దుఃఖానికి గల సంబంధాన్ని కూలంకషంగా వివరించిన తొలి మతం. కోర్కెవలన కర్మవస్తుందని అకర్మ కోర్కెను తీర్చనిచో దుఃఖ భాజనమౌతుందని, కోర్కెలేని కర్మవల్లనే మానవుడు జన్మరాహిత్యాన్ని పొందుతాడని చెప్పడం జరిగింది. ఈ మొత్తం ఆలోచనా విధానం, కేవలం, భౌతికత్వాన్ని నిరసిస్తుందే కాని, అధిభౌతికతను ఏ మాత్రం సూచించడం లేదు. ఈ దృష్ట్యా చూచినట్లైతే, కర్మ దుఃఖం-జన్మ-పునర్జన్మ వంటి విధానాల్లో బౌద్ధ మతం, హిందూ మతం రెండు కూడా ఒకే పంథాను కల్గి ఉన్నాయి. కాని ప్రధానమైన భేదం హిందూ మతంలో, ఆస్తికత్వం ఉంటే, బౌద్ధంలో ఆస్తికత్వం లేదు. బుద్ధుడు ఎంతసేపు దుఃఖనివారణను గూర్చి ఆలోచించాడేకాని, ప్రకృతి వాస్తవాన్ని ప్రపంచపు పుట్టుక, చావు వంటి విషయాలను ఏమీ విచారించలేదు. కారణం అవన్నీ అతని దృష్టిలో నిష్ఫలం, నిరుపయోగమైనవి. అతడు, ఆర్య పరివేషణ సూత్రం ప్రకారం, 'అజరం' 'అవ్యాధి' 'అమృతం' 'అశోకం' 'అసంక్లిష్టం' 'అనుత్తారం' 'యోగక్షేమవహకమై,

అవ్యాకృతమైన 'నిర్వాణాన్ని' లక్ష్యంగా బోధించాడు. నిర్వాణానికి, నిర్వాణంలోను కూడ దుఃఖంలేదు. ఈ రకంగా లౌకిక ఉపయోగాన్ని మాత్రమే ఆధారంగా తీసికొని, ఒక ఆలోచనా సరళిగా రూపొందడమే బౌద్ధ మతం ప్రత్యేకత. అంతవరకు ఏ మతం కూడా దుఃఖాన్ని ఎలా నివారించాలో చెప్పలేదు. అది కేవలం బౌద్ధ మతంలోనే చెప్పబడింది. అదే దాని ప్రాముఖ్యత.

అంతేకాక, బౌద్ధ మతంలో, అంతవరకు గొప్పవిగా చెప్పబడి, సార్వజనీనంగా గౌరవింపబడిన వర్ణాశ్రమ సాంప్రదాయాలకు గుర్తింపులేదు. వారి దృష్టిలో అన్ని వర్గాలు ఒకటే. అందరూ బ్రాహ్మణులే. బౌద్ధ మతానికి చెందిన, 'దశబ్రాహ్మణ ప్రబంధం'లో మంగళ్ళు, చాకళ్ళు, బోయవారు, కట్టెలు కొట్టేవారు మాంస విక్రేతలు అందరూ బ్రాహ్మణులే. వర్ణం అనే భావం పోయి, కులం అనే భావం పెరగడానికి బౌద్ధ మతమే ప్రధానాధారం. ఆ తర్వాతే కులాన్ని గౌరవిస్తూ, 'శాతవాహనకుల' 'అస్మత్ కులగోత్ర వంశాభివృద్ధ్యర్థమ్' వంటి వివరాలను శాతవాహన, సాలంకాయనుల శాసనాల్లో చూడవచ్చు.

బౌద్ధ మతంలో ఇంకో సామాజిక పురోగతి పరమైన అంశం ఉన్నది. స్త్రీలకు వైదిక ధర్మంలో రానురాను, మతవ్యవహారాల్లో చోటుచేసుకోవడానికి అవకాశం పోయింది కాని, బౌద్ధ సంఘంలో స్త్రీలు ఎంతో ప్రధాన పాత్ర వహించారు. వర్ణాశ్రమ, కుల, విచక్షణ రహితంగా అందురూ దుఃఖాన్ని పోగొట్టుకొని, 'సుగతి' ద్వారా అనగా, అష్టాంగమార్గాన్ని అనుసరించడంద్వారా దుఃఖ విముక్తులై ఆనందాన్ని పొందడం మాత్రమే కాక, పునర్జన్మ లేకుండా చేసుకోవచ్చు అనే అభిప్రాయమే, స్త్రీలకు బౌద్ధ సంఘంలో ఎంతో ఉన్నత స్థానాన్నిచ్చింది. రానురాను దానివల్ల బౌద్ధ సంఘంలో కొంత క్షీణత కల్గినా, అదంతా కూడా కేవలం స్త్రీలకు ప్రవేశం ఏర్పరచడం వల్లనే అని చెప్పడం అసంగతంగా ఉంటుంది. తొట్టతొలిసారిగా స్త్రీ సమానత్వాన్ని ప్రోత్సహించిన మతంగా, మనం బౌద్ధమతాన్ని గుర్తించవచ్చు.

బౌద్ధ మతంలో ఇంకొక ప్రధాన ప్రత్యేకత అహింస. అహింస అనబడేది సాధారణంగా కేవలం, యజ్ఞ యాగాదుల్లోని హింసను చూచి, దానికి వ్యతిరేకంగా, బుద్ధుడు ప్రతిపాదించాడని, చాలామంది అనుకొంటారు. వాస్తవానికి అహింస అనేది హింస ద్వారా కలిగే సార్వత్రికమైన దుఃఖ నివారణకు మార్గమే. అహింస అనేదాన్ని పతంజలి 'యోగదర్శనం'లో అష్టాంగయోగాల్లో ఒకటైన నియమానికి అంగంగా గుర్తించాడు. ఆ అంశాల్లో అహింస, సత్యం, అస్తేయం (దొంగిలించకుండుట) బ్రహ్మ చర్యం అనే నాల్గింటిని బుద్ధుడు కూడా యథాతథంగా స్వీకరించాడు. యమం (కోర్కెల నియంత్రణ) లేనట్లైయితే కోర్కెల వ్యాప్తి, దాన్ని తీర్చనిచో దుఃఖం కల్గడం నిరంతరంగా కొన సాగుతాయి. బుద్ధుడు అహింస అనడంలో ఆత్మహింస, పరహింస ఇతర వ్యక్తులను, ప్రాణులను హింసించరాదనేది ఉద్దేశ్యం. ఏరకమైన హింస అయినా తమోవృత్తికి తోడ్పడి ఆలోచనల్లో విశ్లథత్వానికి, (వైవిధ్యానికి) తద్వారా దుఃఖానికి తోడ్పడుతుంది. అందువల్లనే తర్వాతి కాలంలో కూడా విజ్ఞానాన్ని అహింసను జతకలిపితే, శాంతి ఏర్పడుతుందని గుర్తించడం జరిగింది.

ఈ రకంగా బౌద్ధ మతంలో శాంతి, ఆనందం, సమానత్వం, కర్మఫల విచక్షణలనేవి ప్రధాన సూత్రాలుగా ఉండడం వల్ల, బుద్ధుని సిద్ధాంతాలు ఏ మతానికైనా తగినట్లుగా రూపొందాయి.

9.5 బుద్ధుని జీవితం, బౌద్ధ మత ఆవిర్భావం

బౌద్ధ మతాన్ని స్థాపించిన సిద్ధార్థుడు శాక్యవంశపు రాజకుమారుడు. కపిలవస్తు నగర ప్రభువైన శుద్ధోదనునకి,

BRAOU

మాయాదేవికి లుంబినీ వనంలో క్రీ.పూ. 566లో జన్మించాడు. అతని తల్లి ప్రసవానంతరం మరణించడంవల్ల అతన్ని అతని మేనత్త ప్రజాపతి గౌతమి పెంచింది. అందువల్లనే, అతడు గౌతమ సిద్ధార్థుడుగా పేరు పొందాడు. బాల్యం నుండి కూడా అతనికిగల కారుణ్య భావాన్ని, ఆధ్యాత్మిక జిజ్ఞాసను రాజభోగాలు ఏమాత్రం కదలించలేకపోయాయి. గౌతముడు 'యశోధర' అనే కన్యతో వివాహం జరిగిన పిదప, రాహులుడనే కుమారునికి జన్మనిచ్చినా, భౌతిక సుఖాలపట్ల అతడు ఆసక్తిని పెంచుకోలేకపోయాడు. ఒకరోజు ఒక రోగిని, జరాగ్రస్తుడైన వృద్ధుని, మృత కళేబరాన్ని, ఒక భిక్షువును చూచి కల్లోలిత హృదయుడుగా మారి, తన భార్యను, కన్నకొడుకును త్యజించి, క్రీ.పూ. 533లో పరివ్రాజకునిగా మారాడు. ఈ సంఘటననే 'మహా పరిత్యాగం' అని వర్ణించడం జరిగింది. ఆ పిదప అతడు ఆరాడకాలాముడు, రుద్రకరామ పుత్రుడు అనేవారి పద్ధ సాఖ్య దర్శనం వంటివానిని అభ్యసించినా, అతడు ఏమాత్రం సంతృప్తిని పొందలేదు. ఆ పిదప అతడు ఉరువేల గ్రామం చేరి, అక్కడ ఒక బోధి వృక్షం కింద ఆసీనుడై, కఠోర నియమాలతో శరీరాన్ని శుష్కింపజేసి, చివరకు జ్ఞానాన్ని పొందగల్గాడు. అతడు పొందిన ఆనందంలో ఒక వారం వరకు అలాగే ఉండిపోయాడట. బుద్ధుడు ముందుగా తను కనుగొన్న సత్యాన్ని జనులకు అందజేయడానికి ఇష్టపడకపోయినా, బ్రహ్మ (పరమాత్ముడు) చెప్పడం వల్ల అతడు దానికి సిద్ధపడి, సారనాథ్‌లోని మృగయావనం వద్ద అతడు ఐదుగురు బ్రాహ్మణులకు తన తొలి ప్రవచనాన్ని ఇచ్చాడు. దాన్నే బౌద్ధ మత గ్రంథాలు 'ధర్మచక్ర ప్రవర్తనం' అని పేర్కొంటున్నాయి. ఆ పిదప పరివ్రాజకునిగా వివిధ ప్రాంతాలు తిరిగి, అనేక వర్గాలవారిని తన భక్తులుగా జేసికొన్నాడు. వారణాసికి చెందిన యసుడు అనే వర్తకుడు, రాజగృహానికి చెందిన బ్రాహ్మణులైన శారిపుత్రుడు, ముద్గల్యాయనుడు, నిర్గ్రంథ మతానికి చెందిన ఉపాలి, అభయ రాజకుమారుడు, ఎంతో ధనవంతుడైన అనాథ పిండికుడనే వర్తకుడు, వైశాలికి చెందిన వేశ్య అయిన ఆమ్రపాలి, రాజగృహ పాలకులైన బింబిసారుడు, అజాతశత్రువు, కోసల ప్రభువైన ప్రసేనజిత్తు, అతని భార్య మల్లిక, అతని చెల్లెళ్ళు సోమ, సకుళ, అతని పెంపుడు తల్లి మహా ప్రజాపతి గౌతమి, కౌశాంబికి చెందిన ఉదయనుని రాణియైన సామావతి బుద్ధునికి శిష్యులైన వారిలో కొందరు. వీరు కొందరు ఉపాసకులుగాను, కొందరు భిక్షువులుగాను మారారు. తన ఐదవ పరివ్రాజక వర్షంలో, వైశాలి పద్ధ, స్త్రీలను సంఘంలో చేర్చుకోడానికి, బుద్ధుడు అనుమతించాడు. ఇతని ప్రయాణాలకు అనాథ పిండికుడు, విశాలుడు వంటి ధనిక వర్తకులు, ప్రభువులు, ధనాన్ని వెచ్చించారు. వారే, జేతవనాన్ని కొని, అక్కడ ఒక విహారాన్ని నిర్మించారు. శ్రావస్తి వద్ద గల ఆరామం బుద్ధునికి ఇష్టమైనది. అలాగే, విశాలుడు పుష్పారామ (పుచ్చారామ) విహారాన్ని నిర్మించాడు. ఇతని కృషివల్ల తూర్పున కజంగాం, చంప ప్రాంతాల నుండి, పడమటి వేరంజి, అవంతి వరకు, ఉత్తరాన రాజగృహం, వారణాశి నుండి కౌశాంబి, శ్రావస్తి, సాకేతాల వరకు, బుద్ధుని కాలంలోనే బౌద్ధ మతం విస్తరించింది. ఆనందుడు మహా కాత్యాయనుడు, మహాకాశ్యపుడు అనువారు, అతని ప్రధాన అనుయాయుల్లో కొందరు. బుద్ధుడు కుశనగరంలో మహాపరినిర్వాణం పొందినట్లు, ఆ పిదప అతని అవశేషాలను వైశాలి, కపిలవస్తు, అల్లకప్ప, రామగ్రామ, వేధద్వీప, కుశనగర, పిప్పలివన వాసులు పొందినట్లు మహాపరి నిర్వాణ సూత్రంలో పేర్కొనబడినది.

9.6 బౌద్ధ మత పరిణామం, బౌద్ధ సంఘం

బుద్ధుని కృషివల్ల సమాజంలో వేర్వేరు వర్గాలవారు అనుసరించిన బౌద్ధ మతం అనతి కాలంలోనే, సర్వత్రా వ్యాపించడం ప్రారంభమైంది. బుద్ధుని శిష్యుల్లో ప్రధానులైన మహాకాశ్యపుడు, సుభద్రుడు, ఆనందుడు, ఉపాలి ముఖ్యులుగా బౌద్ధ మతంలో వివిధ వర్గాలు ఏర్పడ్డాయి. బుద్ధుని మరణం పిదప 100 ఏళ్ళు గడువక ముందే బౌద్ధ సంఘంలో విభజనలు రావడం గమనించదగ్గ విషయం. ఆ విభజన క్రమం కొనసాగింది. ఆ విభజనను ప్రోత్సహించినవి, వ్యతిరేకించినవి బౌద్ధ సంగీతులే.

వినయ పీఠికంలో గల 'చుల్లవగ్గ' మొట్టమొదట జరిగిన బౌద్ధ సంగీతిని తెల్పుతున్నది. ఈ తొలి సమావేశాన్ని మగధ ప్రభువైన అజాతశత్రువు రాజగృహంలో నిర్వహించాడు. దీనిలో ఐదువందల మంది భిక్షువులు పాల్గొన్నారు. దీనికి మహా కశ్యపుడు అధ్యక్షుడుగాను, ఆనందుడు ప్రోక్తగాను, ఉపాలి వినయంను తెల్పినట్లు కొందరు చరిత్రకారులు తెల్పుతున్నారు. కాని, అప్పటికే సుభద్రుడు మొదలైనవారు వ్యతిరేకతను వ్యక్తపరచసాగారు.

కాగా, అనతి కాలంలోనే వైశాలిలో రెండో సమావేశం జరిగింది. దీనిని కాలాశోకుడు నిర్వహించాడు. అప్పటికే పది అంశాల్లో బౌద్ధుల్లో భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఆ అంశాలు ఏమిటంటే, ఉప్పును నిలపచేసి కొనడం 2) మధ్యాహ్నం పిదప భుజించడం 3) ఉదయమే రెండుసార్లు భుజించడం 4) ఒకే సీమలో ఉపోసధను నిర్వహించడం (ఉపోసద అనగా ప్రతి 15 రోజులకు నిర్వహించే సభ) 5) ఒక పనిచేసిన పిదప సంఘం ఆమోదం పొందడం 6) ఒక పనికి గతంలోని విషయాలను ప్రమాణంగా స్వీకరించడం 7) భోజనం పిదప త్రాగుట 8) అంచులేని ఆసనాన్ని ఉపయోగించడం 9) పులవని తాటి, ఈతకల్లు త్రాగడం 10) దానంలో బంగారం, వెండి అంగీకరించడం. దీనికి కారణం బుద్ధుడు కొన్ని ఆంక్షలను ఆచార వ్యవహారాలమీద, ఆహార పానీయాదుల మీద, దాన పరిగ్రహణాల మీద విదించడమే. రెండో సమావేశంలో జరిగిన నిర్ణయాలను ఆమోదించనివారు, కౌశాంబిలో మరో సంగీతిని ఏర్పర్చుకొన్నారు. దానిలో పూర్తి సాంప్రదాయకవాదులు తేరవాదులు లేక స్థవిరవాదులని, మిగిలినవారు మహాసాంఘికులు లేక ఆచారవాదులని స్థూలంగా వర్గీకరింపబడ్డారు. త్వరలో ఈ విభజన మరింతగా పెరిగి, కథావత్థు ప్రకారం 18 విభాగాలుగా బౌద్ధ సంఘం విభక్తమైంది. అవి 1) స్థవిరవాదులు, 2) వృజిపుత్రకులు 3) ధర్మోత్తరీయులు 4) భద్రయానికులు 5) భన్నాగారికులు 6) సమ్మితీయులు 7) మహీ శాసకులు 8) ధర్మగుప్తికులు 9) సర్వాస్తివాదులు 10) కాశ్యపీయులు 11) సాంక్రాంతికులు 12) సూత్రవాదులు (సౌత్రాంతికులు) 13) మహాసాంఘికులు 14) ఏకవ్యవహారికులు 15) గోకులికులు 16) ప్రజ్ఞప్తివాదులు 17) బాహులికులు (బహుశ్రుతికులు) 18) చైత్యవాదులు. ఈ విభజన తేరవాదుల్లో 11గాను, ఆచార్యవాదుల్లో 7గాను జరిగింది. వీరందరు హీనయానులే. ఆ తర్వాత బుద్ధుని మృతి పిదప 236వ సంవత్సరంలో అశోకుడు మూడవ సమావేశాన్ని నిర్వహించాడు. దీనికి అధ్యక్షుడుగా మొగలిపుట్ట తిస్స అను బౌద్ధ భిక్షువు వ్యవహరించాడు. ఇతడు స్థవిరవాది. ఇతడు బౌద్ధ మతాన్ని ఇతర దేశాల్లో వ్యాప్తి చేయటానికి కూడ అంగీకరించాడు.

తేరవాదులు లేక స్థవిరవాదుల్లో ప్రధానమైన విభాగం 'సర్వాస్తివాదులు'. దీన్ని రాహులభద్రుడు ప్రోత్సహించాడు. ఈవాదం సుదూర, గాంధారాల మీదగా కాశ్మీరానికి వ్యాపించింది. ఇదే రానురాను వైభాషిక మతంగా రూపొందింది. దీనికి ప్రధాన భాష సంస్కృతం. కాగా, మహీశాసకులు, సమ్మితీయులు లేదా వాత్సీపుత్రీయులు, సౌతాంత్రికులు చిన్నచిన్న అంశాలపై తేరవాదులతో విభేదించారు. కాని మహాకాశ్యపుడు ప్రోక్తగా, ప్రవక్తగా రెండో సమావేశంలోనే ఆవిర్భవించిన మహా సాంఘికులు నాశాలి, అమరావతి, నాగార్జునకొండ ప్రాంతాల్లో వ్యాపించారు.

ఈ కాలంలో కనిష్కుడు కుండలవనంలో నాల్గవ బౌద్ధ సంగీతిని నిర్వహించాడు. దీనికి అధ్యక్షుడు వసుమిత్రుడు, ఉపాధ్యక్షుడు అశ్వఘోషుడు. ఈ సమావేశంలో సర్వాస్తివాదులు ఎంత ప్రాముఖ్యత వహించినా, ఇది మహాయానమత ఆవిర్భావానికి తోడ్పడింది. వీరు హీనయానం కన్నా వేరుగా 'పారమిత' సిద్ధాంతాలను, బోధిసత్వులను రూపొందించి, బౌద్ధ మతానికి ఒక ఆరాధనా వ్యవస్థను ఊరూరా ఒక చైత్యం, ఒక బౌద్ధారామం అన్న విధానానికి అంకురార్పణ చేశారు. దీనివల్ల ప్రజలు భగవతారాధనాయత్త చిత్తులై, తత్ఫలితాన్ని పొందగలిగారు. క్రీ.పూ. 1వ శతాబ్దంలో, ఆంధ్రదేశంలో ప్రారంభమైన మహాయానం, క్రీ.శ. 1, 2 శతాబ్దాల నాటికి అశ్వఘోషుడు వంటివారి కృషివల్ల, గుర్తింపు పొంది, వివిధ మతాల సమ్మేళనంగా రూపొందింది. వారికి బుద్ధుడు స్మృతి పొందిన పరివ్రాజకుడు కాడు. ఇతడు దేవుడే. ఈ రకంగా ఉన్న మహాయానం, బుద్ధుని దశావతారాల్లో ఒకటిగా గుర్తించడం జరిగింది.

BRAOU

క్రీ.పూ. 483 నుండి క్రీ.శ. 150 ప్రాంతం వరకు, జరిగిన ఈ ఆరువందల ఏండ్ల పరిణామంలో, బౌద్ధ మతం కేవలం శరీరాన్ని శుష్కింప చేసి, జ్ఞానాన్ని ఉద్దరింప చేసే విధానంగా కాక, వ్యక్తిగతమైన శూన్యతను, భౌతికమైన శూన్యతను అవగాహన చేసికొన్నప్పుడే దాన్ని క్లేశావరణం (distressable), జ్ఞేయావరణం (Cognisale) అనే రెండు భావాలను తొలగించుకొని చూచినప్పుడే, జ్ఞేయం (Knowable) ప్రచ్ఛన్నం (Concealable) అమలినం (Stainless) కాక, ప్రత్యక్షంగాను, నిర్మలంగాను ఉండగలదు అనే సిద్ధాంతాన్ని పొందింది. అంతేకాక పరివ్రాజకులు కేవలం, తమ శరీరాన్ని శుష్కింప చేసికొనే యోగులవంటివారు కాక, బౌద్ధ ధర్మాన్ని, తథాగతుని బోధనలను ప్రజా సౌకర్యం కోసం అందించే కార్యకర్తలుగా రూపొందారు. స్తూపం, చైత్యం వారి సమావేశ ప్రార్థనా స్థలాలు. కాగా, ఆరామం విహారం వారి నివాస స్థలాలు. ఇప్పటికీ ఈ మతం సమాజ పరిమితులను దాటి, సమాజం మీద దాని హృదయం మీద, ఆలోచన మీద, ఎంతో ప్రభావాన్ని చూపే దశకు వచ్చింది.

ఐనప్పటికీ, ఈ మతాల్లో మరి కొన్ని శాఖలేర్పడ్డాయి. అవి 'తాంత్రిక బౌద్ధ మతం' 'వజ్రయానం', 'కాలచక్రయానం', 'సహజయానం' మొదలైనవి. తాంత్రిక బౌద్ధ మతం, క్రీ.శ. 647 పిదప ఏర్పడింది. తాంత్రిక బౌద్ధ మతంలో, ప్రజ్ఞ, ఉపాయం కలిసినప్పుడు సిద్ధి ఆనందం కల్గుతాయి. 16 ఏళ్ళ యువతి ప్రజ్ఞగా, ఉపాయ చిహ్నమైన పురుషుడు సాధన స్వీకరిస్తాడు. దీనిలో ముద్ర, క్రియ, చర్య అనే విభాగాలున్నాయి. స్త్రీ పురుషులు ప్రజ్ఞ ఉపాయాల సంకేతాలుగా భావించి కల్సినప్పుడే మహా సుఖం పొందగలరు అని వీరి భావన. కాగా వజ్రయానం లైంగిక యోగ సాధన ద్వారా భగవానుడైన, బోధిసత్త్వునిగా పేర్కొనబడ్డ, వజ్రసత్వుని చేరడానికి వీలౌతుందని నమ్ముతుంది. ఈ మతాల్లోనే, 'వైరోచనుడు' 'రత్నసంభవుడు' 'అమితాభుడు' 'అమోఘసిద్ధి' 'అక్షోభ్యుడు' అనే ధ్యాన బుద్ధుల పూజ కొనసాగింది. వారు వరుసగా, వజ్రధాత్వీశ్వరి, లోచనామమక, పండరీ ఆర్యతార అనే అధిష్టాన స్త్రీ దేవతలు, స్త్రీ లేదా ప్రజ్ఞతో కలిసినప్పుడే ఆ ధ్యానం చేయాలి. కాగా, 10వ శతాబ్దంలో తాంత్రిక బౌద్ధంలోనే వేరొక శాఖ కాలచక్రయాన వజ్రయానం శాఖగా పెంపొందింది. కాలచక్రయానంలో అనేక మంది దేవతలు, ఢాకినీ శక్తులు ఉండడం గమనార్హం. 11వ శతాబ్దంలో పై రెండింటికి వ్యతిరేకంగా సహజయానం రూపొందింది. ముద్రా, చర్యల వంటివాని ద్వారా కాక, కేవలం, ప్రార్థనల ద్వారానే నిజం గ్రహించొచ్చని వారి వాదం.

మహాయాన ఆవిష్కరణతో, హీనయానం బలహీనపడింది. కాగా, వజ్రయానం, హీనయానుల పరివ్రాజకత్వానికి మహాయానుల సైద్ధాంతిక ధోరణులకు వ్యతిరేకంగా రూపొందిన రెండింటినీ ప్రచారం నుండి తొలగించింది. 10, 11, 12 శతాబ్దాల్లో వజ్రయానం, కాలచక్రయానం మాత్రం పెంపొందాయి.

ఈ పరిణామంలో, బౌద్ధ మతం చైనా, టిబెట్, బర్మా, సింహళం వంటి వివిధ ప్రాంతాలకు అశోకుడు, కనిష్కుడు మొదలగు రాజుల తోడ్పాటువల్ల బాగా వ్యాపించింది. కాగా క్రీ.శ. 56లో చైనాకు కశ్యప మతంగుడు, బౌద్ధ మతాన్ని అందించగా, కొరియాలో 352లోను, జపాన్‌లో 531లోను, ఇండో-చైనాలో 3వ శతాబ్దంలోను, టిబెట్‌లో 640లోను ప్రవేశించి ,ఒక అంత ర్జాతీయ మతంగా రూపొందింది.

9.7 సామాజిక ఆర్థిక వ్యవస్థలపై బౌద్ధ మత ప్రభావం

బౌద్ధ మత ప్రభావంగా, భారతీయ సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎంతో గణనీయమైన మార్పులొచ్చాయి. అయితే ఆర్థిక రంగంలో కన్నా, సామాజిక రంగంలో ఈ మార్పు ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

BRAOU

9.7.1 సామాజిక వ్యవస్థ

బౌద్ధ మతం సామాజిక రంగంలో ఎంతో మార్పు తెచ్చింది. అంతవరకు వ్యాప్తిలో ఉన్న వర్ణ వ్యవస్థ ఒక్కమారుగా పతనావస్థకు వచ్చిందా? అని అనిపించే ప్రభావాన్ని బౌద్ధ మతం కల్గించింది. బౌద్ధ మతంలో సామాజిక సమానత్వం ప్రధాన సిద్ధాంతంగా పెంపొందింది. దుఃఖం అందరికీ సమానమే అయినప్పుడు, దుఃఖ నివారణ ప్రధానంగా గల ఈ మతంలో తరతమ భేదాలను చూపడం తప్పకుండా దోషమొప్పుతుంది. అందువల్లనే, బౌద్ధ మతంలో వర్ణవిచక్షణ లేదు. కాని వారు వృత్తి విచక్షణను చేయకుండా ఉండలేకపోయారు. ఆ వృత్తిలో విచక్షణ చూపకుండా ఉండలేకపోయినా, సామాజికంగా అందరికీ ఒకేరకమైన గుర్తింపునిచ్చినట్లు తెలుస్తున్నది. దశ బ్రాహ్మణ జాతకం ప్రకారం, మూలములు, ఓషధులు గల వైద్యులు, కూలివారు, బండితోలువారు, వస్త్ర వసూళ్ళు చేస్తూ, దానాన్ని కూడా స్వీకరించేవారు, పెద్ద జుట్టు పెరిగి, మట్టిగొట్టుకుపోయిన గోళ్ళతో, కాషాయరంగు దుస్తుల్లో ఉండి మట్టిని తవ్వేవారు, పండ్లు, మధుర పదార్థములు వంటివానిని అమ్మేవారు, శకునాలను చెప్పేవారు, ఆయుధపాణులై రక్షణ చేయు గోపులు, నిషాదులు, కుందేళ్ళు, పిల్లులు, తాబేళ్ళు, చేపలు వంటివానిని వేటాడుతూ జీవించువారు, యాజ్ఞికుల రూపంలో, ప్రభువు స్నానాది ఉపచారాల్లో తోడ్పడే పరిచారకులు అందరూ బ్రాహ్మణులే.

'హాసెట్ఠ సూత్రం' ప్రకారం, బ్రాహ్మణులు పైతులుగాను, చేతిపనివారుగాను, కబురందజేసెడివారుగాను, యాజ్ఞికులుగాను, భూస్వాములుగాను, వ్యవహరించెడివారని తెలుస్తున్నది. జాతక కథల్లో చెప్పిన అంశాల ప్రకారం, బ్రాహ్మణులు వ్యవసాయం, పశుపోషణ, వర్తకం, వేట, వడ్రంగం, నేతపని, వర్తక సమూహాల రక్షణ, విలువిద్య, సారథులుగా ఉండడం, పాములను పట్టడం, వశపర్చుకోవడం వంటివి చేసేవారు. కాని, ఇవే బౌద్ధ గ్రంథాలు, తపస్వులను లేదా ఋషులను ఉత్తమమైన బ్రాహ్మణ్యంగా గుర్తించారు. వినయసుత్త విభంగం ప్రకారం, కొన్ని హీనజాతులుగా చండాలురు, వేనులు, నిషాదులు, రథకారులు, పుక్కుసులు అనువారు గుర్తింపబడ్డారు. చండాలురకు ప్రవేశం ఎక్కడా లేదని, వారికి మాత్రం విద్యార్హత లేదని తెలుస్తున్నది.

ఈ అభిప్రాయం చూసినట్లైతే, బౌద్ధ సమాజంలో బ్రాహ్మణులు కాని వారెవరూ లేరు. అంతా బ్రాహ్మణులే. ఈ బ్రాహ్మణులు ఋగ్వేదాది వైదిక సాంప్రదాయంలో నిర్వచింపబడ్డ వృత్తిని కాని, ఆలోచనా విధానాన్ని కాని కలవారు కారు.

ఈ పరిణామంలోనే, వర్ణ వ్యవస్థ అనేదానికి బదులుగా కుల వ్యవస్థ అనేది పరిణమించింది. ఈ కుల వ్యవస్థ కూడా ఇప్పటికీ కొంతమంది ప్రకారం, అనిర్వచితంగా ఉన్నా, కులాన్ని వర్ణానికి సమానంగా కాక, సమాంతరంగా ఉండే, వేరొక సార్వత్రిక వర్గీకరణ విధానం అని మనం గ్రహించవచ్చు. ఈ రకమైన పరిణామం కూడా మనం కేవలం బుద్ధునికి సమకాలీన యుగంలోగాని, తక్షణ అనంతర యుగంలోగాని చూడలేం. కేవలం శాతవాహన కాలంనుండి ఈ పరిణామాన్ని గుర్తించొచ్చు. శాతవాహనుల శాసనాల్లో 'శాతవాహన కుల' అని పేర్కొబడింది. ఇక్కడ 'కుల' అనేది వంశానికి పర్యాయంగా కన్పిస్తున్నది. కాని, సాలంకాయనుల శాసనాల్లో 'అస్మత్‌కులో గోత్ర వంశాభివృద్ధ్యర్థమ్' అని చెప్పబడింది. అంటే, అక్కడ కులం అనేది, 'గోత్రం' 'వంశం' అనే రెండు సంకుచితాత్మకమైన పదాలకన్న వేరుగా, కొంచెం విస్తృత పరిధిని కల్గిన పదంగానే కన్పిస్తున్నది. కాని, తొలిరోజుల్లో కులానికి అంత అర్థం లేకపోయింది.

బుద్ధుని బోధనల ప్రభావంలో వచ్చిన ఇంకో మార్పు స్త్రీల విషయంలో గమనించొచ్చు. బుద్ధుడు తన పరివ్రాజక జీవిత పంచమ వర్షం నుండి, బుద్ధ సంఘంలో, స్త్రీలను అనుమతించాడు. ఊరువేల గ్రామంలో వృక్షదేవతగా భావింపబడిన, భక్తురాలిగా కూడా గుర్తింపబడిన సుజాత మొదలుకొని, వైశాలిలోని వేశ్య అయిన 'ఆమ్రపాలి'

BRAOU

బుద్ధునికి భిక్ష ఇచ్చే పర్యంతం గ్రహించినట్లైతే, స్త్రీలకు ప్రవేశం కేవలం సహజ పరిణామంగానే సంభవించింది. రానురాను స్త్రీలు బౌద్ధ సంఘంలో ఎంతో ప్రాధాన్యతను పొందారు. వీరిలో కొందరు బౌద్ధ సిద్ధాంత బోధకులుగా కూడా పెంపొందారు. వారిని కాత్యాయనుడు తన 'వార్తిక'ల్లో 'ఉపాధ్యాయా', 'ఉపాధ్యాయీ' అని పేర్కొన్నాడు. కొంతమంది స్త్రీలు అవివాహితలుగా ఉండి, ఆధ్యాత్మిక ప్రవచనం కోసమే జీవితం గడిపారు. వారిని 'బ్రహ్మవాదినులు' అని పేర్కొన్నారు. కొందరు వివాహం వరకు చదివేవారు. వారిని 'సద్యోద్వాహలు' అనేవారు. కాగా, 'తేరీగాథ'లో ఉన్నత వంశాలకు చెంది, నిర్వాణాన్ని లక్ష్యంగా పెట్టుకొని జీవించిన అనేకమంది స్త్రీలను పేర్కొనడం జరిగింది. నాగార్జునకొండ శాసనాల్లో ఒక స్త్రీ ఇతర శిష్యురాండ్రకు బౌద్ధ ధర్మాన్ని, గ్రంథాలను ప్రవచించినట్లు చెప్పబడింది. అశోకుని కాలంలో ధర్మబోధకు స్త్రీలను కూడా 'ధర్మ మహామాత్రు'లుగా స్వీకరించినట్లు తెలుస్తున్నది. వేశ్యా బోధకుల సాంప్రదాయాన్ని వైశాలిలోని ఆమ్రపాలితోనే గాక, రాజగృహంలో కూడా బింబిసారుడు నెలకొల్పినట్లు తెలుస్తున్నది.

స్త్రీలకు గల ఈ రకమైన ప్రగతి అంతకు ముందుగాని, ఆ పిదపగాని లేవు. స్త్రీలను కేవలం గృహబద్ధం చేసి 'యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాంః' వంటి స్థితులే ఏర్పర్చబడ్డాయి. ఈ రకమైన మార్పులు స్త్రీ జీవితంలో, జీవిత లక్ష్యంలో ఎప్పుడైతే ఏర్పడ్డాయో, వివాహ వ్యవస్థలో కూడా తగినన్ని మార్పులు సంభవించాయి. సప్రవర, సగోత్ర, సపిండ ధర్మాలను లక్ష్యంగా చేసికొని ఏర్పర్చిన వివాహాల్లో, స్త్రీ పురుషులకు వరునగా 7-10, 21-30 సంవత్సరాలు వివాహ వయస్సుగా నిర్ణయించారు. దీనిలో పుష్పవతి కాక ముందు, పుష్పవతి అయిన పిదప జరిగిన రెండు రకాల వివాహాలు సమ్మతిని పొందాయి. బౌద్ధ మతం ఎంత సమానత్వాన్ని ప్రకటించినా, వివాహం విషయంలో కులాంతర లేదా వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించలేదు.

బౌద్ధ భిక్షుణీలు నగ్నంగా స్నానం చేసేవారని, బౌద్ధ భిక్షువులు నగ్నంగానే ఒకరికొకరు నమస్కరించే వారని, ఉపచరించుకొనేవారని, తినడం, త్రాగడం వంటివి చేసేవారని, వినయ పిటకానికి చెందిన 'మహావగ్గ' తెల్పుతున్నది. వానిని బుద్ధుడు నిషేధించాడు. 'చుల్లవగ్గ' ప్రకారం, బౌద్ధ భిక్షువులు చెవులకు జూకాలు, రింగులు, పూసలదండలు, పూసల వడ్డాణాలు, గాజులు, కంఠహారాలు, దండ కడియాలు, ఉంగరాలను ధరించేవారని తెలుస్తున్నది. చుల్లవగ్గ ప్రకారం, స్త్రీ, పురుషులు ఒకటిగా కుట్టిన ఒకే దుస్తులను ధరించేవారని, వాటిని నడుము దగ్గర పాము పడగ ఆకారంతోను, పూసలతోను చేయబడ్డ వడ్డాణాలతో కట్టేవారని తెలుస్తున్నది. అవంతి ప్రాంతంలోనూ, దక్షిణ ప్రాంతంలోను మాత్రం, రోజు స్నానం చేసేవారని, తూర్పు ప్రాంతాల్లో చేసేవారుకారని తెలుస్తున్నది. వినయ పిటకంలోని 'పాతిమొక్ఖ'లోని 'పాచ్చితియ ధమ్మం' ప్రకారం, కనీసం 15 రోజుల కోసారైనా, భిక్షువులు స్నానం చేయాలని చెప్పబడింది. ఆహార విషయంలో, వినయ పిటకం ప్రకారం, బియ్యం, చిక్కుళ్ళు, నువ్వులు, తేనె, కూరలు, ఉప్పు, నూనె, దుంపకూరలు, పండ్లు, చేపలు, మాంసం, పాలు, పెరుగు, నెయ్యి, మజ్జిగ, వెన్న ఉపయోగించేవారని తెలుస్తున్నది. స్థూలంగా గమనిస్తే, ఆహార వ్యవహారాల్లోబౌద్ధం ప్రత్యేకమైన విధి నిషేధాలను ఏర్పర్చడం కాని, మార్పులను తేవడం కాని చేయలేదు.

సామాజిక విషయాల్లో బౌద్ధ మత ప్రభావం కన్పించేది విద్యావిషయంలో. వారు ఎక్కువగా ప్రాకృతాన్ని ఉపయోగించారు. పాళీ, మాగధీ ప్రాకృతం బాగా ప్రచారంలోకి వచ్చాయి. బుద్ధుడు తన బోధనలన్నీ మాగధీ ప్రాకృతంలోనే చేశాడు. అశోకుని శాసనాలు కూడా పాళీలోను, ప్రాకృతంలోను ఉండడం గమనించదగ్గ విషయం. కేవలం, సర్వాస్తివాదులు, వైభాషికులు, మహా సాంఘికులు వంటివారి ప్రాబల్యం పెరిగినప్పుడు, విద్యలో సంస్కృతం చోటు చేసుకోవడం గమనించదగింది.

తక్షశిల, కాశీ పెద్ద విద్యా కేంద్రాలుగా వృద్ధి పొందాయి. విద్యను శుశ్రూష, శ్రవణం, గ్రహణం, ధారణం, ఊహాపోహ, విజ్ఞానం, తత్త్వాభినివేశం అనే విధానాల ద్వారా నేర్చుకొన్నట్లు కౌటిల్యుని అర్థశాస్త్రంలో చెప్పబడింది. ఈ

BRAOU

విధానాలు కేవలం వైదిక విద్యకే కాక, బౌద్ధ సంఘంలో కూడా అనుసరించబడ్డాయి. మిళిందపన్హా ప్రకారం, వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు, నిఘంటు శాస్త్రం, ఛందస్సు, నిరుక్తం; శ్లోకాలు, వ్యాకరణం, ధాతు శాస్త్రం, ఖగోళ శాస్త్రం, జ్యోతిషం శకున శాస్త్రాలు, గ్రహాల పరిశోధన, అంక గణితం వంటివి నేర్చుకొనేవారు. ఛండాలురు తప్ప, అందరూ విద్యార్థులే. వైద్యవిద్య తక్షశిలలోను, కాశీలోను చెప్పేవారు. దానికి ఏడేళ్ళు కాలం ఉండేది. మగధ దేశంలో జీవకుడు ప్రసిద్ధ వైద్యుడుగా పేర్కొనబడ్డాడు. 18 రకాల వృత్తివిద్యలు కూడా పేర్కొనబడ్డాయి.

బౌద్ధ విహారాల్లో విద్యను ధారణ ఏర్పర్చడం, పరీక్షలు పెట్టడం, ప్రయోగం చేయడం, ధమ్మను వ్యాఖ్యానించడం ద్వారా నేర్పేవారు. విద్యలను కులపరంగా కాక, అందరికీ నేర్పేవారు. వృత్తివిద్యల్లో గజవిద్య, వేట, జంతువిద్య, విలువిద్య వంటివి ముఖ్యమైనవి. వైదిక సాంప్రదాయం ప్రకారం, విద్యలో వ్యక్తిగతమైన విద్య కాగా, బౌద్ధవిహారాల్లో సామూహికంగా నేర్పేవారు. దీనివల్ల, విద్య అందరికీ, అందరిదీ అయింది. అయినప్పటికీ, విద్యావిధానంలో ఉపాధ్యాయుల గౌరవం, సడల లేదు. ఉపాధ్యాయుడు కేవలం పాఠం చెప్పడానికి కాక, విద్యార్థి నైతిక వ్యక్తిత్వాన్ని మెరుగు పెట్టవల్సి ఉండడం వల్ల, చదువుకు పుస్తకాల మీద కాక, ఉపాధ్యాయుల మీద ఆధారపడవలసి వచ్చింది. లిపి వాడకం హెచ్చుగా ఉన్నా, దానిని విద్యలో తక్కువగానే వాడేవారు. తర్వాతి శాసనాలను చూస్తే, గౌతమీపుత్ర శాతకర్ణి ఆగమాలకు నిలయుడని, రుద్రదాముడు సారణ, ధారణ ప్రయోగాల ద్వారా పొందిన శబ్ద విద్య, అర్థ విద్య, గాంధర్వ విద్య, న్యాయవిద్య కలవాడని తెలుస్తున్నది.

స్థూలంగా విద్యాపరంగా బౌద్ధ మత ప్రభావం లిపిని ప్రవేశపెట్టడం, సామూహిక విద్యను ఏర్పర్చడం, ప్రాంతీయ భాషల్లో బోధన, కుల విచక్షణ లేకుండా, అందరికీ అన్ని విద్యలు నేర్పడంగా గ్రహించొచ్చు. ఈ రకమైన విధానం, నిజంగా విప్లవాత్మకమైందే.

9.7.2 ఆర్థిక వ్యవస్థ

బౌద్ధ మత ప్రభావం, ఆర్థిక వ్యవస్థ మీద చాలా తక్కువగానే ఉంది. కారణం, బౌద్ధ మతం ప్రబలే నాటికే, భారతదేశంలో రెండో నగరీకరణ చోటుచేసికొంది. కాశి, కోసల, విదేహ, అవంతి వంటి షోడశ(16) జనపదాలు, కాశి, కపిలవస్తు, వైశాలి, శ్రావస్తి, తక్షశిల వంటి నగరాలు ఎంతో విస్తృతిని పొందాయి. గంగా సింధూ మైదానం అంతా ఒకే తాటికిందకు వచ్చే పరిస్థితి ఏర్పడింది. యసుడు, విశాఖుడు, అనాథపిండికుడు వంటి కోట్లకు పడగలెత్తిన వర్తకులు బుద్ధుని ధర్మాన్ని స్వీకరించారు. వారంతా బుద్ధునికి యథాశక్తి స్థల, వస్తువాహనాదులను సమర్పించి, ఉపాసకులుగా పర్యవసించారు. బౌద్ధ మతం వారి ఆదరణను సంపూర్ణంగా వినియోగించుకొంది. వ్యవసాయికే తరమైన ఆ పరిస్థితే, బౌద్ధ మత వ్యాప్తికి తోడ్పడింది. హిమాంశు ప్రభా రే తమ "మొనాస్టరీ అండ్ గిల్డ్" (Monastery and Guild) అనే గ్రంథంలో, శాతవాహనుల కాలంలో పెంపుదల పొందిన రోమన్ దేశంతో వ్యాపారం, వివిధ ఆరామ, విహారాల అభివృద్ధికి ఏరకంగా తోడ్పడింది వివరించారు. అంటే, బౌద్ధ మతం అప్పుడున్న ఆర్థిక వ్యవస్థను తమ పరిధిలో సద్వినియోగపర్చుకొని, తమ మతాభివృద్ధికి మార్గం ఏర్పర్చుకొన్నదే కాని, వర్తకుల మీద కాని, ఆర్థిక విధానం మీద కాని, ఏ రకమైన ఆంక్షలను విధించలేకపోయింది. తేరవాదులు మహాసాంఘికుల ప్రభావం నుండి తమను తాము, తమ శాఖ ధర్మాలను పరిరక్షించడానికే విదేశాల్లో తమ మత వ్యాప్తికి అంగీకరించి, మూడవ సంగీతిలో తీర్మానించారు. దాని ప్రభావం వల్ల, తూర్పు సముద్రంలోని దేశాలతో వర్తక వ్యాపారాలు ఉధృతమవడం, బౌద్ధ సంఘాలకు చెందిన వివిధ ప్రతినిధులు వలస పోవడం వంటివి సంభవించాయి. కాని, వాటిని మనం బౌద్ధ మత ప్రభావం వల్లనే సంభవించిన మార్పులను గుర్తించనవసరం లేదు. దానికి కారణం, బౌద్ధులు అన్ని వృత్తులను, అహింసను మితంగా, ఉచితంగా గౌరవించినట్లే, వాటిని తగినవిగాను, ఆచరణయోగ్యంగాను గుర్తించారు. అందువల్లనే, బౌద్ధుల్లో వేటగాండ్రు, వ్యవసాయ దారులు, బెస్తవారు, కటికవారు వంటి వృత్తులవారు కూడా, వర్తకం వంటి హింసాత్మకం కాని వృత్తులవారితో సమానంగా

BRAOU

గౌరవింపబడ్డారు, గుర్తింపబడ్డారు. దీనివలన బౌద్ధుల ఆర్థిక సమాజం సంకుచితమై ందిగా కాక, సువిశాలమై ందిగా పెంపొందింది. ఏ ఆంక్షలను వారు విధించలేదు. ఆహార వ్యవహారాల్లో కూడా, బౌద్ధులు విశాల దృక్పథాన్ని అనుసరించారు. చేపలు, మాంసం వంటివి కూడా, వారికి ఆహారాలుగా ఉన్నట్లు మనం తెలిసికొన్నాం. దీనివల్ల బౌద్ధుల ప్రభావం ఆర్థిక రంగం మీద లేదు అని, కేవలం ఆర్థిక రంగ ప్రభావమే, బౌద్ధ మతం మీద ఉంది అని గ్రహించొచ్చు. వృత్తుల్లో వై విధ్యం నిష్కం, సువర్ణం, కార్షపణం వంటి వివిధ ద్రవ్యమానాల ద్వారా వర్తకంలో పెంపుదల, మగధ రాజ్య పరిణామం ద్వారా గంగా యమునా పరీవాహక ప్రాంతంలో ఏర్పడ్డ ఆర్థిక రాజకీయ ఏకీకరణ ఇవన్నీ బౌద్ధ మత స్థిరత్వానికి తోడ్పడ్డాయి. కాని, బౌద్ధ మతం వీని ఏర్పాటులలో, అభివృద్ధిలో గాని, ఏరకంగాను తోడ్పడలేదు.

ఇండో-గ్రీక్‌లు, కుషాణులు వంటివారి దండయాత్రల వలన, సింధు గంగానదుల మధ్య ప్రాంతంలో రవాణా సౌకర్యాలు ఏర్పడ్డాయి. బుద్ధుని కాలంలో కాని, అతనికి తక్షణానంతర కాలంలో కాని, ఆ ప్రాంతాలతో సంబంధాలు లేవు. మౌర్యుల కాలంలో, తక్షశిల వరకు విస్తరించిన వారి అధికారంలోని పరిణామాలను, ఇండో గ్రీకులు, కుషాణులు వంటివారు పొంది, మరికొన్ని మార్పులను చేశారు. చంద్రగుప్తుడు జై నుడే కాని బౌద్ధుడు కాడు. బౌద్ధుడై న అశోకుడు చంద్రగుప్తుని నుండి, తాను వారసత్వంగా పొందిన ఆర్థిక వ్యవస్థను కొన్ని మార్పులతో యథాతథంగా నిలబెట్టాడే కాని, ఏ రకమై న విప్లవాత్మకమై న మార్పులను కల్గించలేదు. అందువల్ల, క్రీ.పూ. 566 నుండి క్రీ.శ. 200 వరకు గల పరిణామాన్ని చూచినట్లైతే, ఆర్థిక వ్యవస్థ మీద బౌద్ధ మత ప్రభావం లేదు. రాజకీయ వ్యవస్థలో, ఏ రకమై న పరిణామం లేని స్థితిలో, ఆర్థిక వ్యవస్థలో వచ్చిన ప్రతి పరిణామాన్ని, బౌద్ధ మతం తన ప్రగతికి వినియోగించుకొంది.

9.8 రాజకీయ వ్యవస్థపై బౌద్ధ మత ప్రభావం

ఆర్థిక వ్యవస్థ మీద కన్న రాజకీయ వ్యవస్థ మీద బౌద్ధ మతం కొంత ప్రభావాన్ని కలిగి ఉంది. కోసల రాజై న ప్రసేనజిత్తు, మగధ రాజులై న బింబిసారుడు, అజాతశత్రువు, అవంతి రాజై న చండ ప్రద్యోత మహాసేనుడు, వివిధ ఇతర వంశస్థులై న శాక్యులు, మల్లులు, కోలీయులు, మోరయులు, అందరూ బుద్ధుని కాలంలోనే బౌద్ధ ధర్మం చేత ప్రభావితులయ్యారు. వీరంతా బౌద్ధ మతాభిమానులే కాని, బౌద్ధ మత బోధకులుగాను, ఉద్ధారకులుగాను రూపొందలేదు. బుద్ధుడు క్షత్రియుడవడం వల్ల, ఇతర ప్రభువులు అతని మత ప్రచారానికి తోడ్పడ్డారు. అజాతశత్రువు రాజగృహంలో మొదటి సంగీతిని కూడా నిర్వహించాడు.

ఆ పిదప కాలాశోకుడు వై శాలిలో రెండవ సంగీతిని, అశోకుడు పాటలీపుత్రంలో మూడవ సంగీతిని నిర్వహించినట్లు చెప్పుకున్నాం. ఉపగుప్తుని చేత ప్రబోధితుడై న అశోకుడు బౌద్ధ మతాన్ని స్వీకరించడమే కాక, భేరీ ఘోషను 'ధమ్మ ఘోష'గాను, యుద్ధ విజయాన్ని 'ధమ్మ విజయం'గాను మార్చి, ధర్మమహామాత్రులను ధర్మ ప్రచారానికి నియమించాడు. అతడు తనను దేవతలు మెచ్చుతారని భావించడంచేత, 'దేవానాం ప్రియుడ'ని, ప్రజలకు ప్రియమై న దానిని చేయడం చేత, 'ప్రియదర్శి' అని పిలుచుకొన్నాడు. మతాన్ని రాజకీయ విధానానికి ఆధారంగా చేసిన తొలి భారతీయ చక్రవర్తి అశోకుడు. మధ్య యుగంలో సికందర్‌లోడి, ఔరంగజేబ్ ఎంత తీవ్రంగా మతాన్ని తమ పాలనా విధానంగా రూపొందించుకొన్నారో, అశోకుడు కూడా బౌద్ధ మతాన్ని ప్రోత్సహించాడు. అశోకుని పిదప బౌద్ధ మతాన్ని స్వీకరించిన మినాండర్, కనిష్కుడు, హర్షవర్ధనుడు వంటి వారెవ్వరూ, ఈ రకంగా చేయలేదు. ఒక్క అశోకుడు మినహా ఎవ్వరూ కూడా, బౌద్ధం స్వీకరించినా, యుద్ధాలను మానలేదు. కారణం, అప్పటికే, విదేశీ దండయాత్రల వల్ల, రాజ్య విషయాల్లో, అహింసపట్ల గల అభిప్రాయం

మారిపోయింది. వారంతా యుద్ధం చేయడంలోని హింసను ఉచితంగానే గుర్తించారు. కాని, వేరుగా గుర్తించలేదు.

విదేశీ దండయాత్రలు హెచ్చుగా మొదలైన్నటి నుండి, రాజ్యవ్యవస్థ మీద, బౌద్ధ మత ప్రభావం క్షీణించిందనే చెప్పాలి. రాజులు బౌద్ధ మతాన్ని విద్యను, ఆరామాలను రక్షించి పోషించారే కాని, వాని ధర్మాలను యథాతథంగా నిజజీవితంలో ఆచరించలేదు.

9.9 విద్యా సాంస్కృతిక వ్యవస్థలపై బౌద్ధ మత ప్రభావం

బౌద్ధ మతం తొలి రోజుల్లో ప్రాకృతం, పాలీ భాషలను, తర్వాతి రోజుల్లో సంస్కృతాన్ని ప్రధాన బోధనా భాషగా స్వీకరించింది. వారు వివిధ విద్యాకేంద్రాలను ఏర్పర్చుకొన్నారు. తక్షశిల, కాశీ, నలంద, విక్రమశిల ఉత్తర భారతదేశంలోను, నాగార్జునకొండ దక్షిణ భారతదేశంలోను, మొత్తం ఈ ఐదు ప్రసిద్ధ బౌద్ధ విశ్వవిద్యాలయాలుగా రూపొందాయి. తక్షశిల, కాశీ ముందు నుండి ఉన్నవే. అవి మహా జనపద యుగంలోనే గొప్ప విద్యాకేంద్రాలుగా రూపొందాయి. నాగార్జున కొండ క్రీ.శ. 1వ శతాబ్దం నాటికే మహా సాంఘికులకు, దాని ఉపశాఖలైన పూర్వ శైలీయులు, అపరశైలీయులు వంటివారికి విశ్వవిద్యాలయంగా రూపొందింది. సింహళం నుండి కూడా విద్యార్థులు వచ్చేవారు.

నలంద విశ్వవిద్యాలయం గుప్తుల కాలంలో స్థాపింపబడి, ఎంతో విశ్వవిఖ్యాతమైన పేరు పొందింది. అక్కడ హిందూ బౌద్ధ శాస్త్రాలు, తర్కం, వ్యాకరణం, వైద్యం, సాంఖ్య దర్శనం వంటివి చెప్పేవారు. అలాగే, ధర్మపాలుడు స్థాపించిన విక్రమశిల విశ్వవిద్యాలయం ఎంతో పేరు పొందింది. ఈ విద్యాలయం, క్రీ.శ. 8వ శతాబ్ది తర్వాతది.

బౌద్ధ సంఘానికి చెందిన అసంగుడు, వసుబంధుడు, అశ్వఘోషుడు, నాగార్జునుడు ప్రసిద్ధ శాస్త్ర గ్రంథకర్తలు కాగా, హర్షుడు రాసిన 'నాగానందం', 'ప్రియదర్శిని' నాటకాలు బౌద్ధ మతంలోని సమతాభావాన్ని, అహింస వల్ల పొందే పరమార్థాన్ని ఎత్తి చూపుతున్నాయి.

శిల్పం మీద చిత్రలేఖనం మీద, బౌద్ధ మతం ఎంతో ప్రభావాన్ని కల్గి ఉంది. సాంచి, సారనాథ్, గయ, అమరావతి, జగ్గయ్యపేట, ఘంటసాల వంటి ప్రాంతాల్లో గల స్తూపాలు, నాసిక్, కార్లే, భాజా, కొండేన్, ఎల్లోరా, మొగల్రాజపురం వంటి ప్రాంతాల్లో గల గుహాలయాలు బౌద్ధ మతానికి చెందిన ఎన్నో అంశాలను రాతిలో శిల్పీకరించాయి. బుద్ధ జననం, మహాపరిత్యాగం, ధర్మచక్ర ప్రవర్తన, మహాపరినిర్వాణం, జాతక కథలు వంటి అంశాలు శిల్పాల్లో ఎంతో అందంగా చెక్కబడ్డాయి. ఏనుగు, గుర్రం బుద్ధునికి గుర్తుగాను, బోధి వృక్షం బుద్ధుని బుద్ధత్వం పొందడానికి గుర్తుగాను, సజ్జితమైన గుర్రం బుద్ధుని పరిత్యాగానికి గుర్తుగాను, చక్రం బుద్ధుని ధర్మచక్ర ప్రవర్తనకు గుర్తుగాను పెంపొందాయి.

రానురాను, మహాయాన మతంలో, సర్వాస్తివాద, వైభాషిక వంటి శాఖలు ప్రబలినా, ఊరూరా ఒక స్తూపం, విహారం అనే సిద్ధాంతంతో పెరిగిన బౌద్ధ మతం సువిశాలమైన వాస్తు శిల్ప వ్యవస్థకు పరిణామానికి అవకాశం ఇచ్చింది. మధ్య యుగంలో దేవాలయ వ్యవస్థలో, ప్రాచీన యుగంలో స్తూప, విహార వ్యవస్థ పెంపొందింది.

అజంతా వంటి చోట్ల గల గుహాలయాల్లోని వర్ణనిత్రాలు, మహాయానంలోని బోధిసత్త్వులను ఎంతో సొంపుగా తీర్చిదిద్దాయి. అటవీ సీమల్లో ప్రశాంతాచ్ఛాదిత వాతావరణంలో, శాంతినిచ్చే ఆ నికుంజాలు ధ్యానం ద్వారా భక్తిని, భక్తి ద్వారా యోగాన్ని, తద్వారా ఆనందాన్ని ప్రసాదించే, దివ్యధామాలుగా బౌద్ధ కళావ్యవస్థకు పుట్టిళ్ళుగా

BRAOU

పెంపొందాయి.

9.10 విదేశాల్లో బౌద్ధ మత వ్యాప్తి

బౌద్ధ మతం భారతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక చరిత్రకు అందించిన అతి ముఖ్యమైన అంశం, ఆ మతం విదేశాలకు వెళ్ళడమే. అది కేవలం భారతీయ మతంగా కాక, అంతర్జాతీయ మతంగా రూపొందింది. ఈ విధానాన్ని పరిశీలించేటప్పుడు, వేయవలసిన చిన్న ప్రశ్నఏమిటంటే, ఏ కారణాల వల్ల బౌద్ధం విదేశాలకు తరలింది అని. దానికి రెండు ప్రధాన కారణాలున్నాయి. మొదటిది, బౌద్ధ మతంలో ఏర్పడ్డ శాఖా భేదాల్లో, అధిక సంఖ్యాకులైన మహా సాంఘికులకు, అల్ప సంఖ్యాకులైన స్థవిరవాదులకు మధ్య సైద్ధాంతిక ఘర్షణ ఏర్పడింది. ఆ స్థితిలో స్థవిరవాదులు తమను తాము, ఎంత సనాతన శాఖగా భావించేవారు. అయితే, దాని ఉనికి భారతదేశంలో వివర్ణమవడానికి కావలసిన పరిస్థితులు సంఘటిల్లాయి. ఈ స్థితిలో తమ మతాన్ని నూతన భావాల వెల్లువలో కొట్టుకొని పోకుండా ఉంచుతూ, దాని తత్వాన్ని, నిర్మలత్వాన్ని కాపాడాలని, అందరు సనాతనులకు వలెనే స్థవిరవాదులూ భావించడం జరిగింది. అందువల్లనే, మూడవ బౌద్ధ సంగీతిలో అధ్యక్షుడైన మొగలిపుత్త తిస్స అనే స్థవిరుడు విదేశాల్లో బౌద్ధ మత వ్యాప్తిని ప్రతిపాదించాడు. రెండవది, బౌద్ధ సంఘంలో ఎప్పుడైతే ఈ తీర్మానం జరిగిందో, చక్రవర్తి అయిన అశోకుడు 'ధమ్మ విజయం'లో ఒక భాగంగా, బౌద్ధాన్ని విదేశాలకు మరలించి, అంతర్జాతీయ ధమ్మ విజయాన్ని సాధించాలి అనే భావనతో మహేంద్రుడు, సంఘమిత్ర మొదలైన తన కుమారుడు కుమార్తెలతో, సహా సింహళ ద్వీపానికి, బౌద్ధ మతాన్ని తరలించాడు. ఇది కేవలం ప్రారంభమే. రామరాను, క్రీ.శ. 56లోనే, కశ్యప మాతంగుడు హీనయాన సాంప్రదాయాన్ని చైనాదేశంలో ప్రవేశపెట్టగా, రెండవ శతాబ్దంలో కనిష్కుని కృపివల్ల మహాయానం కూడ, చైనాకు వ్యాపించింది. ఈమధ్య కాలంలోనే, సర్వాస్తివాద సాంప్రదాయం కాశ్మీర్ వరకు వ్యాపించింది. క్రీ.శ. 640 ప్రాంతానికి టిబెట్ బౌద్ధ మతాన్ని పొందింది. ఈ పరిణామాల్లో బౌద్ధాన్ని ఎక్కువగా ఒక ప్రాచుర్యాన్ని పొందిన మతంగా వలసపోయిన ప్రాంతాల్లో గుర్తించడమైంది.

9.11 బౌద్ధ మత క్షీణత

భారతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక చరిత్రలో బౌద్ధ మత క్షీణత ఒక ప్రధాన ఘట్టం. దానికి ఈ క్రింది కారణాలను వివరించొచ్చు.

9.11.1 వికేంద్రీకరణ శక్తుల వ్యాప్తి

బుద్ధుని నిర్వాణం పిదప, బౌద్ధ సంఘాన్ని నిర్వహించడానికిగాని, దానికి తగిన నైతిక బలం ప్రసాదించడానికి గాని, తగిన నాయకుడు లేడు. ఎప్పుడైతే బౌద్ధ సంఘంలో, వివిధ కులాలవారు, వృత్తులవారు విచక్షణా రహితంగా ప్రవేశపెట్టబడ్డారో, వారివారి వ్యక్తిగతమైన లేదా శాఖాపరమైన అభిప్రాయాలు బౌద్ధ సంఘంలో చీలికలకు అవకాశాన్నిచ్చాయి. బుద్ధుని మృతి పిదప 100 ఏళ్ళు గడవకముందే, 18 ఉపశాఖలు ఆవిర్భవించాయి. స్థవిరవాదులు బలహీనులయ్యారు. ఆచార్యవాదులు బలం పుంజుకొని, మహా సాంఘికులయ్యారు. వారి వ్యాప్తి దక్షిణంగా జరగడం వల్ల తేరవాదులు దానిని అరికట్టలేకపోయారు. ఈ పరిణామమే, బౌద్ధ మత క్షీణతకు ఒక ఆధారం.

BRAOU

9.11.2 బౌద్ధ మతం ఒక ప్రత్యేక వ్యవస్థ కాదు

బౌద్ధ మత సిద్ధాంతాలు స్థూలంగా, కొత్తవి కావు. అవి దర్శనాల నుండి (సాంఖ్య, యోగ) గ్రహింపబడి, కొన్ని కాలానుగుణమైన మార్పులు చేయబడి, బౌద్ధ ధర్మంగా పర్యవసింపబడ్డవే. అనగా, మార్పు బౌద్ధ ధర్మ ఆవిర్భావంలోనే అంతర్నిహితమై ఉంది. అందువల్ల దానిలో మార్పు అవిచ్ఛిన్నంగా కొనసాగింది. దానివల్ల బౌద్ధం తనదైన ఒకే లక్షణాన్ని గల సామాజిక ద్రవ్యరాశిని పెంపొందించుకొనలేకపోయింది. అంతేకాక, బౌద్ధం అప్పటికే ఉన్న వ్యవస్థలో సంస్కరణ పూర్వకంగా ఏర్పర్చబడింది. ఎప్పుడైతే, ఆ సంస్కరణకు ప్రతి సంస్కరణ తిరిగి అప్పటికే ఉండే వ్యవస్థలో జరిగిందో, తొలి సంస్కరణ మలి సంస్కరణలో కల్సిపోవల్సి వచ్చింది.

9.11.3. బౌద్ధ మత వ్యాప్తి

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ముఖ్యంగా మార్పులకు గురి కాగల్గిన తీర ప్రాంతాల్లోను, సింధు – గంగా పరివాహక ప్రదేశంలోను, ఈ మతం వ్యాపించడం కూడా, దాని క్షీణతకు వేరో కారణం. వ్యాప్తి పొందిన బౌద్ధం కేంద్రీయతను కోల్పోయి, వివిధ స్థానిక శక్తుల, ఉద్యమాల, ప్రభావాలకు లోనవడం జరిగింది.

9.11.4 రాజ్య దృక్పథంలో మార్పు

బౌద్ధ మతం ఎంతో ఉన్నతమైన ఆశయాలను కల్గినా, అది పరిపోషించే, ప్రవచించే అహింస పట్ల, సమాజంలో, ముఖ్యంగా రాజకీయ విధానంలో ఒక మార్పు వచ్చింది. అశోకుని తర్వాత, ఎవ్వరూ యుద్ధాన్ని త్యజించలేదు. అందువల్ల అహింస నామమాత్రంగా ఉండిపోయింది. అంతేగాక, గుప్తుల కాలం నుండి, పునః ప్రారంభమైన సామ్రాజ్య నిర్మాణ యుగం బౌద్ధంలోని అంశాలను అను సరించలేదు.

9.11.5 పౌరాణిక హిందూ మతం

గుప్తుల కాలం నుండి విస్తృతంగా వ్యాపించిన పౌరాణిక హిందూ మతం ఎంతో ప్రభావాన్ని కలిగింది. దేవాలయాల నిర్మాణం, అశ్వమేధాది యజ్ఞ యాగాదుల నిర్వహణ మళ్ళీ బౌద్ధ పూర్వ యుగంలోని స్థితిగతులను ప్రోత్సహించింది. దానివల్ల బౌద్ధం నిలవలేకపోయింది.

9.11.6 స్త్రీ దేవతారాధన

బౌద్ధ మతంలో వజ్రయాన, కాలచక్ర యానాల్లో వ్యాపించిన స్త్రీ దేవతారాధన, దాని ద్వారా, పెంపొందిన అశ్లీలతలు కూడా బౌద్ధ మత క్షీణతకు ఒక కారణంగా, దానిని వామాచార మతంగా గుర్తించడం వల్ల చెప్పడం జరిగింది.

9.11.7 అవతార భావన

మహాయాన మతంలో, పెంపొందిన బోధిసత్త్వ సాంప్రదాయం ప్రకారం, బుద్ధుడు మహోన్నత శిఖరాలను పొందిన వ్యక్తిగా భావింపబడడం వల్ల, పౌరాణిక హిందూ మతం తన ప్రతిసంస్కరణో ద్యమంలో, బుద్ధుని కూడా ఒక అవతారంగా గుర్తించడం వల్ల; బౌద్ధ మతం ఒక ప్రత్యేక మతంగా తన అస్తిత్వాన్ని కోల్పోయింది. అది హిందూ మత సాగరంలో పవిత్ర గంగా నదిలా కలిసిపోయింది.

BRAOU

9.12 సంగ్రహంగా

క్రీ.పూ. 566లో జన్మించిన గౌతమ సిద్ధార్థుడు అను శాక్యవంశపు రాజపుత్రుడైనా, దుఃఖాన్ని, దానిని నివారించడానికి తగిన ఉపాయం కనుగొనడానికి, తత్ఫలంగా ఆవిష్కరించినదే, బౌద్ధ మతం. కోర్కెలవల్ల కలిగే దుఃఖాన్ని నివారించడానికి, అష్టాంగ మార్గం అనే సంగతిని బుద్ధుడు బోధించాడు. అతడు సమాజంలో సమానత్వాన్ని బోధిస్తూ, అందరూ నిర్వాణాన్ని పొందడానికి అర్హులు అని ప్రవచించాడు. అతడు స్త్రీలను కూడా తన సంఘంలో సభ్యులుగా చేర్చి, ఒక అభ్యుదయ పథాన్ని స్థాపించాడు. తన పరిధిలో ఉన్న రాజులను, వర్తకులను చేరదీసి, వారి పోషణ ద్వారా, బౌద్ధ మతాన్ని, మత సంఘాన్ని పెంచాడు. కాని, బుద్ధుడు నిర్వాణం పొందిన 100 ఏళ్ళలోగా, బౌద్ధంలో ప్రధాన శాఖలైన తేరవాదులు, మహాసాంఘికులు 18 ఉపశాఖలుగా మార్పు పొందాయి. అశోక చక్రవర్తి తాను నిర్వహించిన మూడవ బౌద్ధ సంగీతి తీర్మానాల ననుసరించి, బౌద్ధ మతాన్ని విదేశాల్లో వ్యాప్తి పొందించడానికి కృషి చేశాడు. అశోకుని పిదప, మెనాండర్, కనిష్కుడు, హర్షుడు బౌద్ధ మత రక్షణకు, పోషణకు, వ్యాప్తికి కృషి చేశారు.

బౌద్ధంలో వచ్చిన తొలి 18 శాఖల విభజన మరింత పెరిగి, సర్వాస్తివాదులు, వైభాషికులు, మహాయానులు అనే మూడు ప్రధానమైన తెగలుగా రూపొందింది. మహాయానులు బుద్ధునికన్న మరింత ఆదర్శప్రాయులైన బోధిసత్త్వులను సృజించారు. వారు, 'ఊరూరా స్తూపం, ఊరూరా విహారం' అనే పేరుతో, బౌద్ధ మతాన్ని వ్యవస్థీకరించడం జరిగింది.

ఈ బౌద్ధ మత ప్రభావాన్ని సామాజిక వ్యవస్థ మీద ఎంతగానో చూడొచ్చు. వర్ణాశ్రమ వ్యవస్థను వ్యతిరేకించడం, స్త్రీలకు ఆధ్యాత్మికపరమైన ప్రాముఖ్యతను కల్పించడం, సామూహిక విద్యా విధానాన్ని ఏర్పర్చడం అతి ముఖ్యమైనవి. కాగా, ఆర్థిక వ్యవస్థ మీద బౌద్ధం ప్రభావం లేదు. రెండవ నగరీకరణ ద్వారా పెరిగిన ఆర్థిక వ్యవస్థలోని సత్ఫలితాలను బౌద్ధం తన అభివృద్ధికి వినియోగించుకొంది. సాంస్కృతిక రంగంలో, బౌద్ధ స్తూపాలు, చైత్యాలయాలు, గుహాలయాలు, విహారాలు, ఎంతో గొప్ప సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని రూపొందించుకొన్నాయి. అజంతా, ఎల్లోరా, కార్లే, నాసిక్, కొండేన్ వంటివి కొన్ని ఉదాహరణలు. అలాగే, తక్షశిల, కాశీ, నాగార్జునకొండ, నలంద వంటి చోట్ల గొప్ప విశ్వవిద్యాలయాలు బౌద్ధ సాంప్రదాయంలోనే పెంపొంది, తర్వాతి ఘటికా స్థానాలకు అవకాశమిచ్చింది. ఈ రకమైన బౌద్ధం, వికేంద్రీకరణ శక్తుల వ్యాప్తి, బౌద్ధం ఒక ప్రత్యేక వ్యవస్థ కాకపోవడం, బౌద్ధ మత వ్యాప్తి, రాజ్య దృక్పథంలో మార్పు, పౌరాణిక హిందూ మత వ్యాప్తి, స్త్రీ దేవతారాధన, అవతార భావన అనే కారణాల వల్ల హిందూ మతంలో భాగంగా మిగిలిపోయింది. ఇది దుఃఖాన్ని నివారించడం కోసమే అవతరించిన తొలి మతం. అందువల్లనే, ఈ మతంలో ముందుగా, దేవునికి చోటు లేకపోయింది. కాని, కాలగమనంలో దేవుడు లేడనే భావం చెప్పిన బుద్ధుడే, దేవుడయ్యాడు. ఒక అవతారంగా గుర్తింపబడ్డాడు. దానితో బౌద్ధ మతపు అస్తిత్వం, ప్రయోజనం రెండూ అంతరించాయి.

9.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. బౌద్ధ మతానికి గల ఆధారాలను వివరించండి.

BRAOU

2. బౌద్ధ మతం ప్రాముఖ్యత, ప్రత్యేకతలు తెల్పండి.

3. సాంఘిక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలపై బౌద్ధం ప్రభావాన్ని వివరించండి.

II. క్రింది వాటికి లఘువ్యాఖ్యలను రాయండి.

1. బౌద్ధ మతంలో స్త్రీల పాత్ర.

2. బుద్ధుని జీవితం, తొలి బౌద్ధ మత వ్యాప్తి.

3. బౌద్ధ సంఘం.

4. బౌద్ధ మతంలో పరిణామాలు

5. బౌద్ధ మత క్షీణతకు కారణాలు.

9.14. ఉపయుక్త గ్రంథాలు

Chattopadyaya D.P. : **Indian Atheism**

Davids : **Buddhist India.**

Luniya B.N. : **Life and Culture in Ancient India.**

Majumdar R.C. : **History and Culture of the Indian People.**

Satyamurthy K. : **Indian History and Culture.**

సచ్చిదానంద మూర్తి : **దార్శనములు, మతములు.**

BRAOU

రచయిత : డా. కాశీభట్ల సత్యమూర్తి

భాగం – 10 : జైన మతం

విషయక్రమం

10.0 లక్ష్యాలు
10.1 పరిచయం
10.2 ఆధారాలు
  10.2.1 సాహిత్యాధారాలు
  10.2.2 పురావస్తు ఆధారాలు
10.3 జైన మత సిద్ధాంతాలు : ప్రత్యేకత, ప్రాముఖ్యత
10.4 వర్ధమానుని జీవితం, జైన మతావిష్కరణ
10.5 జైన మత పరిణామం, జైన సంఘం
10.6 సామాజిక, ఆర్థిక వ్యవస్థపై జైన మత ప్రభావం
  10.6.1 సామాజిక వ్యవస్థపై ప్రభావం
  10.6.2 ఆర్థిక వ్యవస్థపై ప్రభావం
10.7 రాజకీయ వ్యవస్థపై జైన మత ప్రభావం
10.8 సాంస్కృతిక వ్యవస్థపై జైన మత ప్రభావం
10.9 జైన మత క్షీణత
10.10 సంగ్రహంగా
10.11 పరీక్ష నమూనా ప్రశ్నలు
10.12 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

10.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

* జైన మత ఆవిర్భావాన్ని, సంబంధిత ఆధారాలను వివరించగల్గాలి.
* జైన మత పరిణామ క్రమాన్ని గూర్చి వివరించగల్గాలి.
* సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక రంగాల్లో జైన మత ప్రభావాన్ని విశ్లేషించగల్గాలి.
* జైన మత ప్రత్యేకతను, ప్రాముఖ్యతను వివరించగల్గాలి.

10.1 పరిచయం

జైన మతం భారతదేశంలో క్రీ.పూ. 6వ శతాబ్దంలో బౌద్ధ మతంతో బాటుగా అవతరించిన మరో మతం. దీన్ని కూడా, బౌద్ధ మతంలో వలె క్షత్రియులే ప్రవచించారు. కాని, జైన సాంప్రదాయం ప్రకారం, దాన్ని ప్రవచించినవారిని 'తీర్థంకరులు' అంటారు. వారిలో 24 తీర్థంకరులున్నారు. 23వ వ్యక్తి పార్శ్వనాథుడు, 24వ వ్యక్తి వర్ధమాన మహావీరుడు. వీరిద్దరినీ చరిత్రకారులు చారిత్రక వ్యక్తులుగానే గుర్తిస్తున్నారు. దీని ప్రకారం జైన మతం కొత్తగా ఆవిర్భవించింది కాదని, కాలానుగుణమైన మార్పులతో వివిధ తీర్థంకరులు దాన్ని తగినంతగా సంస్కరించి, ప్రచారం చేశారని అవగాహన చేసుకోవచ్చు. మొదటి తీర్థంకరుని 'ఆదినాథుడు' లేదా 'ఋషభనాథుడు' అని పిలుస్తారు. మిగిలిన వారు అజితనాథుడు, సంభవనాథుడు, అభినందననాథుడు, సుమతినాథుడు, పద్మప్రభునాథుడు, సుపార్శ్వనాథుడు, చంద్రప్రభునాథుడు, పుష్పదంతుడు, శీతలనాథుడు, శ్రీయాంశనాథుడు, వసుపూజ్యుడు, విమలనాథుడు, అనంతనాథుడు, ధర్మనాథుడు, శాంతినాథుడు, కుంతనాథుడు, అమరనాథుడు, మల్లినాథుడు, మునిసువీరనాథుడు, నేమినాథుడు, అరిష్టనేమి, పార్శ్వనాథుడు, వర్ధమాన మహావీరుడు. ఋగ్వేద మంత్రాల్లో ఋషభనాథుని, అరిష్టనేమిని గూర్చిన ప్రస్తావనలు కన్పిస్తున్నాయి. అలాగే, విష్ణు పురాణం, భాగవత పురాణం, ఋషభనాథుడిని నారాయణుని అవతారాలుగా గుర్తించాయి. 23వ తీర్థంకరుడు క్రీ.పూ. 849 ప్రాంతంలో జీవించాడు. అంతకు ముందుగల తీర్థంకరుల చారిత్రక గతం తెలియకపోవడం వల్ల, వారిని ప్రస్తుతానికి చరిత్రకారులు పౌరాణిక వ్యక్తులుగా పేర్కొంటున్నారు. 21వ తీర్థంకరుడైన నేమినాథుడు కృష్ణవాసుదేవుని తండ్రియైన వసుదేవుని సోదరుడైన నేమికృష్ణుడుగా కొన్నిచోట్ల పేర్కొనబడుచున్నాడు. కృష్ణుని మహాభారత కాలానికి సరిపెట్టినచ్చైతే, మహాభారత కాలం నుండి జైన మతం అవిచ్ఛిన్నంగా వివిధ తీర్థంకరుల బోధనల ద్వారా, కాలానుగుణమైన మార్పులతో కొనసాగుతూనే ఉన్నట్లు మనం గ్రహించగలం. పార్శ్వనాథుడు కాశీ ప్రభువైన అశ్వసేనునికి కల్గిన కుమారుడని, ముప్పై సంవత్సరాలు గృహస్థుగా జీవించి, ఆ పిదప సన్యసించి, 84 రోజులు కఠోర తపోదీక్ష పిదప సిద్ధిని పొందినట్లు మనం తెల్సుకోవచ్చు. ఈ సిద్ధాంతాలే తర్వాత వర్ధమాన మహావీరునిచే ప్రవచితమై, ప్రస్తుతం మనం అనుసరిస్తున్న జైన మతంగా రూపొందాయి.

10.2 ఆధారాలు

జైన మతానికి సంబంధించిన ఆధారాల్లో సాహిత్యాధారాలు, పురావస్త్వాధారాలు రెండూ ఉన్నాయి. జైన మతాన్ని గూర్చి చెప్పే సాహిత్యాధారాల్లోను, విదేశీ ఆధారాల ప్రభావం ఏమాత్రం లేదు. అవన్నీ స్వదేశీయమైన ఆధారాలే.

10.2.1 సాహిత్యాధారాలు

సాహిత్యాధారాలు మొచ్చుగా అర్ధమాగధిలో రాయబడ్డాయి. తర్వాత వచ్చిన ఆధారాలన్నీ సంస్కృతంలో రాయబడ్డాయి. జైన సాంప్రదాయంలో ముందునుండి సాంప్రదాయకంగా వస్తున్న ఆధారాలనన్నింటినీ 'అంగబాహిరం' అంటారు. వానిలో 12 అంగాలు, 14 పూర్వాలు ఉన్నట్లు తెలుస్తున్నది. అంతేకాకుండా, వివిధ జైన సూత్రాలున్నాయి. వానినన్నింటిని 'ఆగమాలు' అని వ్యవహరిస్తారు. సూత్రాల్లో 'ఉత్తరాధ్యయన సూత్రం', 'ఆచారాంగ సూత్రం', 'భేద సూత్రం', 'భగవతీ సూత్రం', 'సూత్ర కృతాంగం' ముఖ్యమైనవి. వీనిలో, భేద సూత్రంలో కొన్నిచోట్ల జైన పరివ్రాజకులు ఎంతవరకు పర్యటించవచ్చో పేర్కొబడింది. తూర్పున అంగ,

BRAOU

మగధాల వరకు, దక్షిణాన కౌశాంబి వరకు, పడమట సూణదేశం వరకు ఉత్తరాన కుణాళ ప్రాంతం వరకు తొలి రోజుల్లో జైనులు పర్యటించేవారు. 'స్థవిరావళి' అనే గ్రంథంలో, వేర్వేరు స్థవిరుల వృత్తాంతాలు తెల్పబడ్డాయి. మహావీరుని తొలి శిష్యులను గాంధారులని వ్యవహరించారు. వారు మొత్తం 11 మంది ఉండగా, వారిలో, ఆర్యసుధర్ముడు మహావీరుని పిదప జైన మతానికి నాయకత్వం వహించాడు. అలాగే కాలాకాచార్య కథ అనబడే ఆధారం జైన మతం మాళ్వా ప్రాంతాల్లోకి విస్తరించిన రీతిని తెల్పుతుంది. 'ఆవశ్యక సూత్రం' అనబడే ఆధారం వర్ధమాన మహావీరుని అల్లుడైన జామాలి వల్ల ఏ విధంగా మొదటి విభజన జరిగిందో వివరిస్తుంది. గుప్తుల కాలానికి, ముందుగా ఉమాస్వాతి రాసిన 'తత్వార్థాధిగమ సూత్రం' జైన తత్వాన్ని వివరించడంలో తోడ్పడుతుంది. కాగా హరిభద్రసూరి రాసిన 'షడ్దర్శన సముచ్చయం', దానికి గుణరత్నుడు రాసిన 'తర్క రహస్య దీపిక' అనే వ్యాఖ్యానం జైన మతం నైయాయికుల, వైశేషికుల సిద్ధాంతాల నుండి బ్రహ్మాన్ని (దేవుని)ని రూపించడంలో ఏ రకంగా వేరైందీ తెల్పుతాయి. ఆచారాంగ సూత్రం, సూత్రకృతాంగం, భగవతీ సూత్రం తొలి జైన సిద్ధాంతాల వివరాలను ఎక్కువగా తెల్పుతాయి. 'ఉత్తరాధ్యయన సూత్రం', 'ఆచార దినకరం', 'అభిదాన చింతామణి' వంటి గ్రంథాలు జైన మతానికి చెందిన తీర్థంకరులు, వారి దేవతా విశేషాల వర్గీకరణ వివరాలను తెల్పుతాయి. 'షట్ఖండాగమం' అనే గ్రంథం 'ధవళ', 'జయధవళ' అనే వ్యాఖ్యానాలతో దృష్టి వాదాన్ని తెల్పుతుంది.

ఈ రకమైన జైన సిద్ధాంతాలను తెలిపే గ్రంథాల్లో 'కాలికాలని, 'ఉత్కాలికాల'ని రెండు రకాలు. కాలికలు అనగా, నిర్ణయించిన కాల పరిధిలో చదవాల్సిన గ్రంథాలు. ఉత్కాలికలకు ఆ రకమైన కాల పరిధిని నిర్ణయించడం జరగలేదు. జైనుల ఈ రకమైన గ్రంథాలు ముందుగా క్రీ.పూ. 6వ శతాబ్దంలో పాటలీపుత్రంలో నిర్వహించిన తొలి సభలోనూ, ఆ పిదప క్రీ.శ. 5వ శతాబ్దంలో వల్లభిలో నిర్వహించిన రెండవ సమావేశంలోను క్రోడీకరించడం, విభజించడం జరిగింది.

10.2.2 పురావస్తు ఆధారాలు

ఈ జైన మతం దొన్నత్యాన్ని, వ్యాప్తిని, అనుయాయులను గూర్చి తెల్పడానికి, వివిధ పురావస్తూ ధారాలున్నాయి. వాటిల్లో ప్రధానమైనవి శాసనాలు. రుద్రదమనుని జునాఘడ్ శాసనం, ఖారవేలుని హాథిగుంఫా శాసనం జైన వ్యాప్తిని, వారి సిద్ధాంత తత్వాన్ని వివరిస్తాయి. కాగా, అనంతపురం జిల్లా హేమావతి, కోనకొండ్ల, రాయదుర్గం వంటి చోట్ల లభ్యమౌతున్న తొలి శాసనాలు మూల సంఘానికి చెందిన, 'పుస్తగాచ్ఛ'కు సంబంధించిన జైనులగూర్చి తెల్పుతున్నాయి. అలాగే, బాదామి చాళుక్యులు, తూర్పు చాళుక్యులు మొదలైన వారి శాసనాల్లో, వారు ఏ విధంగా జైన మతాన్ని ప్రోత్సహించింది, జైన నిర్మాణాలను ఏర్పర్చింది తెల్పుతున్నాయి. కళ్యాణి చాళుక్యుల శాసనాల్లో కర్ణాటక ప్రాంతంలో జైన మత వ్యాప్తిని గూర్చిన వివరాలను అనేకం తెలిసికోవచ్చు. కాకతీయుల శాసనాల్లో గల 'కాకతమ్మ' అనే దేవతను 'కూష్మాండిని' అనే జైన దేవతగానే అన్వయిస్తున్నారు. 'కాకతమ్మ'కు సైదోడు ' క్రీడాభిరామంలో ఉటంకితమైన ఏకవీర' అనే దేవత. ఈ అంశాన్ని పరిశీలించినట్లైతే, కాకతీయులు కళ్యాణి చాళుక్యుల కాలంలో అధికారికంగా జైన మతాన్ని స్వీకరించినా, వారు నమ్మిన ఏకవీర దేవి పాదాలను విడువలేదని, వారు అధికారంలోకి వచ్చిన పిదప కూడా ఏకవీర దేవి పూజాపురస్కారాలను కొనసాగించారని తెలుస్తుంది.

నిర్మాణాల ద్వారా అనేక విశేషాలు తెలుస్తున్నాయి. థాంక్ ప్రాంతంలోని గుహల్లోను బరిస్సాకు చెందిన ఖండగిరి, హాథిగుంఫాల్లోను, ఉదయగిరిలోని రాణిమూర్ గుహలోను అనేక గుహాలయాలు జైనులకు సంబంధించిన స్వస్తిక, మీనం, సింహం వంటి లాంఛనాలతో లభ్యం కావడమేకాక, తొలి జైన శిల్పాలను వ్యక్తం చేస్తున్నాయి.

పార్శ్వనాథ కొండలు, పావాపురి, రాజగృహం, కథియావార్‌లోని గిర్నార్, పాలిదానాల్లో గల కొండల్లో

తీర్థంకరుల దేవళాలు నిర్మించబడ్డాయి. మధ్యప్రదేశ్‌లోని దటియా, కుండలూరు బర్వాని వరుసగా, సోనార్‌గాం, దామో, పశ్చిమ సీమూర్ జిల్లాల్లో వివిధ నిర్మాణాలున్నాయి. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని ముక్తగిరిలో కూడా జైనదేవాలయాలున్నాయి. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ వద్దగల రణక్‌పూర్‌లో ఆదినాథుని దేవాలయం ఉంది. కాగా, మౌంట్ ఆబూ, చిత్తూర్‌గడ్ ప్రాంతాల్లో కూడా ప్రసిద్ధ జైన నిర్మాణాలున్నాయి.

జైన శిల్పాలు, జైనుల్లో విగ్రహారాధన ఎక్కువగా మధుర ప్రాంతంలో వ్యాప్తిలో ఉన్నాయి. కనిష్కుని కాలంలో ఒక ఆదినాథుని విగ్రహం పీఠశాసనంతో సహా కనుగొనబడింది. అక్కడే గుప్తుల కాలానికి చెందిన సింహాసనస్థుడైన ఒక వ్యక్తి వృక్షం క్రింద తపస్సులో మునిగిన మహావీరుని శిల్పం ఇంకొక ప్రత్యేకమైంది. తూర్పు బెంగాల్, దినాజ్‌పూర్ జిల్లాల్లోని నరోహర్ వద్ద ఋషభనాథుని శిల్పాలు గుర్తింపబడ్డాయి. పై జాబాచ్ వస్తు ప్రదర్శనశాలలోని శాంతినాథుని ప్రతిమ వేరొక ప్రసిద్ధమైంది. 21.5 మీటర్ల ఎత్తున శ్రావణబెళగొళలోని బాహుబలి గోమతేశ్వరస్వామి విగ్రహం, 984లో పశ్చిమ గాంగ ప్రభువైన రాచమల్లుని మంత్రి అయిన చాముడరాయనిచే ప్రతిష్ఠితమైంది.

జైనులు 'విద్యాదేవతలనబడే స్త్రీ దేవతలను కూడా పూజిస్తారు. సరస్వతితో ప్రారంభమైన 16 విద్యాదేవులు, దిక్పాలురు, నవగ్రహాలు 64 మంది యోగినులు, లక్ష్మి, క్షేత్రపాలుడు మొదలైన దేవతామూర్తులు హిందూ మతంలో పలె అర్చకమూర్తుల బాహుళ్యాన్ని జైన మతంలో సూచిస్తు న్నాయి. వివిధ రాత ప్రతుల్లో జైనతీర్థంకరుల వర్ణ చిత్రాలు లభ్యమౌతున్నాయి.

ఈ రకమైన ఆధారాలన్నీ జైన మతం క్రీ.శ. 10వ శతాబ్దం వరకు చాలా బాహుళ్యంలో ఉండేదని, రామరాను, ఇది క్షీణతకు గురైందని తెల్పుతున్నాయి. మహ్మదీయ దండయాత్రల పిదప అనగా క్రీ.శ. 1206 నుండి జైనం బాగా పరిమిత సంఖ్యాకుల మతంగా సంకుచితమైంది.

10.3 జైన మత సిద్ధాంతాలు : ప్రత్యేకత, ప్రాముఖ్యత

జైన మతం హిందూ మతం కన్న మరింత ప్రాచీన మతం కాకపోయినా, మిగిలిన అన్ని మతాల కంటే ఎంతో ప్రాచీనమైంది. జైన మతం ఒకే మతంలా ఒకేసారి రూపొందలేదు. వివిధ తీర్థంకరులు ఆ మతాన్ని కాలానుగుణంగా మార్పు చేసికొని ఉపయోగించుకొన్నారు. క్రీ.పూ. 849 ప్రాంతాల్లో పార్శ్వనాథుడు, ఆ పిదప క్రీ.పూ. 527 నాటికి వర్ధమాన మహావీరుడు సంస్కరించిన మతమే, చారిత్రకంగా మనం అందరం అంగీకరిస్తూ, ప్రస్తుతం జైన మతంగా గుర్తింపబడింది.

ఈ మతంలో ప్రధాన సిద్ధాంతాలు మూడు. ఒకటి మానవుని దుఃఖం, వాని కర్మలవల్లనే కల్గుతుంది. ఆ కర్మలను కఠోర నియమాలను అనుసరించి అంతం చేసినట్లైతే, బంధాలన్నీ తొలగి 'కాయోత్సర్గం', అనగా శరీరానికి బంధాలకు సంబంధం తొలగిపోతుంది. అందువల్లనే, జైనులను 'నిర్గందులు' అని వ్యవహరించడం కూడా జరిగింది.

వీరి ప్రకారంగా సృష్టిలో ఏడు న్యాయాలున్నాయి. అవి, ఆత్మ, అనాత్మ, ఆస్రవం, బంధం, సంవరం, నిర్జరం, మోక్షం అనేవి. అనగా, ఆత్మను కప్పిన అనాత్మ భావాలను, వాని నుండి బంధాలను వెలికి పంపడం ద్వారా (నిర్జరం) మోక్షం లభిస్తుంది. వీన్నే స్థూలంగా 'సప్తభంగి' అని కూడా అంటారు. వర్ధమాన మహావీరుని ప్రకారం, ఆత్మతత్వాన్ని త్రిభంగిగా చూచారు, అంటే అది (ఆత్మ) ఉన్నది, లేనిది, ఆత్మ అవ్యక్తం. దీని నుండే జైనుల ప్రధాన సిద్ధాంతమైన 'స్యాద్‌వాదం' ఆవిర్భవించింది. దీన్నే 'నయవాదం' అని కూడా అంటారు. దీని ప్రకారం

BRAOU

ఏ వస్తువును ఉన్నది అని చెప్పరాదు. అది ఉన్నది కావచ్చు, లేనిది కావచ్చు. వేరేచోట వేరే రూపంలో అది ఉన్నది లేదు, అనగా అది ఉన్నది లేనిదీ కూడా కావచ్చు. అంతేకాక, 'ఉన్నదీ అవ్యక్తవ్యం కావచ్చు, లేనిదీ అవ్యక్తవ్యం కావచ్చు. ఉన్నది లేనిది కూడా కావచ్చు, ఉన్నది అవ్యక్తవ్యం కూడా కావచ్చు. ఇది ఆత్మపరంగా చూచినట్లైతే, ఆత్మ ఉంది, కాపున శరీరం ఉంది. శరీర పరంగా చూచినట్లైతే శరీరమే ఉంది, కాని ఆత్మ లేదు. అందువల్ల ఆ ఆత్మ ఉన్నదీ, లేనిదీ కూడా ఆత్మకు రూప, వయో భేదాలవల్ల ఉందనీ చెప్పలేం. లేదని చెప్పలేం. అనగా అవ్యక్తవ్యం. ఈ పరంగా చూస్తే, శరీరమందున్న ఆత్మ అవ్యక్తవ్యం. లేదనుకొన్న ఆత్మ అవ్యక్తవ్యం. ఉందీ లేదులేదనుకున్న ఆత్మ అవ్యక్తవ్యం. స్థూలంగా ఉన్నా, శరీరపరంగా కాని ఆత్మ అవ్యక్తవ్యం.

ఈ విధంగా ఉండే భావాల్లో జైనులు 'సమ్యక్ దర్శనం' 'సమ్యక్ జ్ఞానం' 'సమ్యక్ చారిత్రం' అను మూడు విధానాల ద్వారా, మానసిక ఏకాగ్రతను పెంచుకొని, సంయమం అభ్యసిస్తూ, కరుణాది సంతోష సాధకమైన స్థితినే మోక్షం అంటారు.

ఈ రకమైన స్థితిని పొందడానికి, పార్శ్వనాథుడు సంయమం వల్ల కర్మ అంతరిస్తుందని, జీవహింస చేయరాదని, అసత్యం ఆడరాదని, దానం కాని దాన్ని స్వీకరించరాదని నాల్గు నియమాలను చేశారు. కాని వర్ధమాన మహావీరుడు 'బహిద్ధాణా ఓ వెరమణం' అని చెప్పబడిన అసంగత్వాన్ని సూచించాడు. దాన్ని కఠోరంగా అనుసరించాడు. పైన చెప్పిన పార్శ్వనాథుని సిద్ధాంతాలకు జతపర్చాడు.

జైన మత ప్రత్యేకత ఏమనగా, ఆ మతం అహింసను ఎంతో నిశితంగా, లోతుగా అనుసరించింది. వృక్షాలు, జంతువులు, శిలలు అన్నీ కూడా ప్రాణమయాలేనని, వీటికీ హింసను తలపెట్టరాదని బోధించింది. ఈ మతంలో నవగ్రహాలు, సరస్వతి వంటి విద్యాదేవులు మొదలైనవారిని, లక్ష్మివంటి దేవతలను పూజించడంలో, ఈ మతం హిందూ మతానికి దగ్గరగా ఉంది. బౌద్ధ జైన మతాలు వైదిక సిద్ధాంతాన్ని వ్యతిరేకించినా, అహింసను ప్రోత్సహించినా, వర్ణాశ్రమ ధర్మాలకు స్వస్తి చెప్పి, స్త్రీ పురుష సమానత్వాన్ని సూచించినా, రెండూ బలమైన సంఘాన్ని కల్గి, క్షత్రియుల చేత ప్రవచితమైనా, జైన మతంలో భిక్షుక వర్గానికి బౌద్ధంలో ఇచ్చినంత ప్రాముఖ్యత లేదు. ఎవరైనా భిక్షుకులు కాకపోయినా, జైనాన్ని అనుసరించొచ్చు. బౌద్ధుల నిర్వాణం జన్మరాహిత్యం కాగా, జైనుల నిర్వాణం కాయోత్సర్గమే. అనగా శరీర బంధం నుండి తొలగించుకొనడమే. జైనులు కఠోర దీక్ష ద్వారా శరీరాన్ని క్షయం చేస్తారు. కాగా బౌద్ధులు దాన్ని సమ్మతించలేదు. బౌద్ధులు ఆత్మ ఉనికిని అంగీకరించలేదు. కాని, జైనులు దాని ఉనికిని పిపీలకాది బ్రహ్మపర్యంతం చూడగలిగారు. జైనుల ప్రకారం, సార్వత్రికమైన ఆత్మ శరీరం వల్ల అవక్తవ్యం, అగ్రాహ్యం అవుతోంది. కాబట్టి శరీరమే బంధం,ఆ బంధాన్ని తొలగించినట్లైతే, ఆత్మైక్యత పొందొచ్చు. కర్మవల్ల జన్మ, జన్మవల్ల దేహం, దేహం వల్ల బంధం వస్తాయి. గనుక సత్కర్మ ద్వారా పునర్జన్మ లేకుండా చేసుకోవడం అవశ్యం, కోరదగ్గది. ఇదే దాని ప్రాముఖ్యత. అంతేకాక జైన మతం ప్రత్యేకంగా 'సన్యాస స్వీకారాన్ని' నియమం చేయకపోవడం వల్ల ఎవరైనా కాలికమైన, ఉత్కాలికమైన జైనగ్రంథాలను చదివి, ఆ మతాన్ని అనుసరించొచ్చు. ఇందువల్ల ప్రధానంగా, ఆ మతం భారతదేశంలో ముఖ్యంగా హిందూ సాంప్రదాయం ప్రకారం గృహస్థాశ్రమం ఉన్న సంఘంలో నిలవగల్గి ఉంది. అంతేకాక ఆత్మను జైనులు హిందువుల్లాగా నిర్గుణంగా అంగీకరించారు. అది కూడా జైన మతం నిలవడానికి తోడ్పడ్డ ఒక ప్రత్యేకత.

10.4 వర్ధమానుని జీవితం, జైన మతావిష్కరణ

వర్ధమాన మహావీరుడు వైశాలీ నగర ప్రాంతంలో కుంద గ్రామం అనేచోట జ్ఞాత్రిక కులస్థులైన సిద్ధార్థుడు, త్రిశా

అనేవారికి జన్మించాడు. ఇతడు జన్మతా క్షత్రియుడు. ఋషభుడనే బ్రాహ్మణ ఋషి భార్య అయిన దేవానంద గర్భం నుండి ఈ పిండం త్రిశాల గర్భంలోకి మార్చబడినట్లు కొన్ని శిల్పాల వల్ల, జైన గ్రంథాల వల్ల తెలుస్తుంది. ఇతడు యశోద అనే కన్యను పెండ్లాడగా, వారికి ప్రియదర్శని అనే కుమార్తె కల్గింది. ఆమెను జామాలి అనే మహావీరుని మేనల్లునికిచ్చి పెండ్లి చేయడం జరిగింది. ఆ పిదప అతని ముప్పైయ్యవ ఏట వర్ధమానుడు ఒక శీతాకాలంలో సంసారాన్ని త్యజించాడు. పదమూడు నెలల పిదప, తన వస్త్రాలను త్యజించి, కఠోర తపోదీక్షను అనుసరించినట్లు ఆచారాంగ సూత్రంలో చెప్పబడింది. అతడు పన్నెండేండ్ల తపస్సు పిదప జృంభికా గ్రామానికి సమీపంలో గల ఋజుపాలికా నది ఒడ్డున గల ఒక సాలవృక్షం క్రింద ఉండగా, తాను జినుడై అనగా నిర్గ్రంథుడైన స్థితికి వచ్చినట్లు తెలిసికొన్నాడు. అందువల్ల వర్ధమానుడు మహావీరుడని పిలువబడ్డాడు. అతడు చంప, వైశాలి, రాజగృహం, మిథిల, శ్రావస్తి మొదలైన పట్టణాల్లో మత బోధను చేశాడు. అతని శిష్యుడైన గోయమ, పార్శ్వనాథుని అనుయాయి అయిన కేశితో జరిపిన చర్చల్లో, కేశి మహావీరుని సిద్ధాంతాలు ప్రశస్తమైనవిగా భావించి, దాన్ని స్వీకరించినట్లు, ఉత్తరాధ్యాయన సూత్రంలో చెప్పబడింది. అంతేకాక వర్ధమాన మహావీరుడు ఆజీవక శాఖను ప్రోత్సహించిన గోసాల మంఖలిపుత్తుని ఓడించినట్లు భగవతీ సూత్రం వల్ల తెలుస్తుంది.

వర్ధమానుని కాలంలో, జైన మతం ఎంతో రాజ గౌరవాన్ని పొందింది. 'కుణికుడు' అని కూడా పిలవబడ్డ అజాతశత్రువు, శ్రేణికుడు వంటి రాజులు అతనికి ఉపాచారాలు చేశారు. వర్ధమాన మహావీరుడు 42 ఏండ్ల పరివ్రాజక జీవితం గడపి, తన 72వ ఏట అతడు మజ్జిమపావా (పావాపురి) అనేచోట హస్తిపాలుడు అనే రాజు ఇంట్లో ఉండగా మృతి చెందాడు.

వర్ధమానుడు తన మతంలో స్థూలంగా హింస కూడదని, దొంగిలించరాదని, అసత్యమాడరాదని, ప్రాపంచిక వస్తువుల పట్ల సంపర్కాన్ని కల్గి ఉండకూడదని బ్రహ్మచర్యాన్ని అనుసరించి, వ్యక్తులు తమ భావాలను కోర్కెలను, ఉద్విగ్నతను నియంత్రించవల్సి ఉందని నియమించాడు. ఈ సిద్ధాంతాలే వ్యక్తికి 'సమ్యక్ చారిత్రం' దానివల్ల 'సమ్యక్ దర్శనం' దానివల్ల 'సమ్యక్ జ్ఞానం' కల్గుతుందని చెప్పాడు.వర్ధమానుని 'గాంధారు'లనబడే 11 మంది శిష్యులున్నారని, వానిలో ఆర్య సుధర్ముడు అనే వ్యక్తి జైన మతానికి అధ్యక్షత వహించాడని తెలుస్తుంది.

10.5 జైన మత పరిణామం, జైన సంఘం

'ఆవశ్యక సూత్రం' ప్రకారం, వర్ధమాన మహావీరుని మృతి పిదప, జైన సంఘంలో చీలికలు వచ్చాయి. ఆటుపంటివి ఏడుసార్లు సంభవించాయి. మహావీరుడు దిగంబరత్వాన్ని ప్రోత్సహించినా, అతని పూర్వుడైన పార్శ్వనాథుడు శ్వేతాంబరాలను ధరించడాన్ని సూచించాడు. మహావీరుడు సూచించిన దిగంబరత్వం ఎంతో అసంస్కృతంగా కనిపించడం వల్ల, ఎక్కువమంది శ్వేతంబర ధారణకే మొగ్గు చూపారు. దానివల్ల దిగంబరులు, శ్వేతాంబరులు అని రెండు ప్రధాన శాఖలు ఏర్పడ్డాయి. కేవల జ్ఞానం పొందినవారు ఆహారం తినరని, స్త్రీలకు మోక్షముండదని, దిగంబరుల విశ్వాసం. వీరేకాక, నగ్నంగా తిరుగుతూ ఆహారాన్ని అరచేతిలోనే ఉంచుకొని, భోజనం చేస్తూ, నగ్న విగ్రహాలను పూజిస్తూ, నెమలి పించాలను ధరించి, తమకు నమస్కారం చేసేవారికి, మోక్షమార్గం చూపేవారిని 'గోప్యలు' అనబడే వేరే శాఖ పెంపొందింది. వీరు దిగంబర శ్వేతాంబరుల సిద్ధాంతాలను రెండింటినీ అనుసరిస్తారు.

జైన మతంలో వచ్చిన విభజనకు ప్రధాన కారణం, అతని అల్లుడైన జామాలి ప్రతిపాదించిన కొన్ని సిద్ధాంతాలే. చల, అచల జీవాలకు మధ్యగల భేదం, స్త్రీలకు మోక్షం, నివేదించిన ఆహారాన్ని గ్రహించడం, మహావీరుని జన్మలో పిండం మారిడి. పెండివంటి అంశాల మీద గల భేదాలు ఈ విభజనకు తోడ్పడ్డాయి. మగధలోని ద్వాదశ

BRAOU

వర్షాకాలం కూడా దీనికి తోడ్పడింది.

ఈ రకమైన జైన మతం మగధలో చంద్రగుప్త మౌర్యుడు, ఆ పిదప అశోకుని మనుమడైన సంప్రతి ప్రోత్సహించారు. చంద్రగుప్తుడు భద్రబాహుని చేత, సంప్రతి సుహస్తి చేత జైన మతానికి మార్చ బడ్డారు. ఖారవేలుని హాథిగుంఫా శాసనం ప్రకారం, నందుల కాలంలో కళింగ నుండి గ్రహించబడ్డ జైన విగ్రహాలను అతడు మగధను జయించి తెచ్చుకున్నట్లు తెలుస్తుంది. మధురలోను, మాళ్వాలోను, ఆంధ్రాలోనూ, మహారాష్ట్రలోను, కర్నాటకలోను జైన మతం బాగా విస్తరించింది. జైన మత విస్తరణ కేవలం వలసల వల్లనే జరిగింది. వారిలో మూల సంఘానికి చెందిన 'సేనగణం' 'పుస్తకగచ్ఛ' వంటివి శాసనాల్లో పేర్కొబడ్డాయి. చోళంబులు, వారికి ముందు ఆంధ్ర శాతవాహనులు, బాదామి చాళుక్యులు, ఆ పిదప కళ్యాణ చాళుక్యులు, కాకతీయులు మొట్టమొదట జైనులే. ఆ పిడపనే వానిలో మార్పు వచ్చింది. జైన మతం 'అర్హంతలు' లేక బోధకులు సంఖ్యలో తగ్గడం వల్ల, రాజపోషణ మందగించడం వల్ల, విభజనల వల్ల, అనుయాయులు సిద్ధాంతాలను గ్రహించ లేక ఆచారాల్లో వేరవడం వల్ల, కుల వ్యవస్థ వల్ల, హిందూ మతంలోని ప్రతి సంస్కరణోద్యమం వల్ల జైన మతం ఇంచుమించు అంతరించే స్థాయికి చేరింది.

10.6 సామాజిక, ఆర్థిక వ్యవస్థపై జైన మత ప్రభావం

బౌద్ధ మతంలాగా జైన మతం అంతర్జాతీయ స్థాయికి ఎదగలేక పోయినా, సామాజిక, ఆర్థిక వ్యవస్థపైన సాంస్కృతిక వ్యవస్థపైన ఎంతో ప్రభావాన్ని చూపింది.

10.6.1 సామాజిక వ్యవస్థపై ప్రభావం

జైనులు బౌద్ధులవలె, సాంసారిక జీవనాన్ని తిరస్కరించక పోవడంవల్ల, గృహస్థులైన జైనుల వల్ల సమాజంలో ఎంతో ప్రభావం కన్పించింది. తొలిరోజుల్లో జైన మతం కూడా, వర్ణ వ్యవస్థను ధిక్కరించడం వల్ల, సమాజంలో అదికూడా ఒక ప్రత్యేకతను పొందింది. జైనులు సమాజంలో నిరీశ్వరవాదులుగా పేరొందారు. జైనులు అనుసరించిన అహింస సమాజంమీద ఎంతో ప్రభావాన్ని చూపింది. పరోక్షంగాకూడా, హింసచేయరాదనే భావన ఉండడంవల్ల, పంచసూరములైన వండడం, ఊడ్వడం, తాగడం, రుబ్బడం, దంచడం వానివల్ల జరిగే హింస, వ్యవసాయం వేట వంటి వాని ద్వారా జరిగే హింసను వారు నిషేధించడంవల్ల, జైనులు మృదు భాషులుగా పెంపొందారు. వారనుసరించిన యాచన, ఉపవాసం, నిరశన వ్రతం, పాలు, నెయ్యి, పెరుగు, మధుర పదార్థాలను త్యజించడం వంటివి ఇతర సమాజాల్లో చోటు చేసికొన్నాయి. 'సత్‌చారిత్రం', 'సత్‌దర్శనం', 'సత్‌జ్ఞానం' త్రిరత్నాలుగా గల జైనులు, హిందూ సమాజంలోగల కర్మ,జ్ఞానం, భక్తి అనే తత్వాలు పెంపొందడానికి తోడ్పడ్డారు. జైన సమాజంలోగల విగ్రహారాధన హిందూ సమాజంలో వారి పట్ల గల విరక్తిని తగ్గించడానికి కొంతవరకు తోడ్పడింది.

10.6.2 ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

జైనులు ప్రధానంగా అహింసావాదులవడం వల్ల, వర్ణాశ్రమధర్మ వ్యతిరేకులవడంవల్ల, వర్ణాశ్రమ ధర్మాన్ని ప్రోత్సహించే వ్యవసాయిక విధానానికి వారు దూరమయ్యారు. వ్యవసాయిక వ్యవస్థలో, దున్నడం, కలుపుతీయడం, కోత కోయడం వంటి వానిద్వారా, వివిధ జీవులను చంపడంతో చోటుచేసుకొంటుంది గనుక, జైనులు పూర్తిగా

BRAOU

వ్యవసాయిక పరమైన వృత్తులకు దూరమయ్యారు కాగా, వారు వర్తకాన్ని ప్రధాన వృత్తిగా ఎన్నుకొన్నారు. అంతేకాక, అనేకమంది జైనులు తర్క, వ్యాకరణ, న్యాయ, మీమాంస, గణిత, ఖగోళ, వైద్యాది శాస్త్రాలను అభ్యసించి అన్యోపలబ్ధమైన కీర్తిని, గౌరవాన్ని పొందారు. వృత్తిపరంగా చూచినట్లైతే, ఈరకమైన పండితుల పాత్ర ఆర్థిక వ్యవస్థమీద ఏమాత్రం లేక పోయినా, సాంస్కృతిక రంగంమీద ఎనలేని విధంగా ఉంది.

10.7 రాజకీయ వ్యవస్థపై జైన మత ప్రభావం

బౌద్ధ మతం వలె, జైన మతం ఎక్కువగా రాజాదరణకు విశేషంగా నోచుకోలేదు. కాని రాజులు అనేకమంది జైన మతాన్ని స్వీకరించారు. దక్షిణ భారతదేశంలో విజయాన్ని ప్రోగించి, చక్రవర్తి క్షేత్రనిర్మాతైన చంద్రగుప్త మౌర్యుడు, నందులు యవనరాజైన డెమోట్రియస్ ,శాతవాహన వంశస్థుడైన శాతకర్ణిని ఓడించిన ఖారవేలుడు, దక్షిణ భారతదేశంలో, ఆంధ్ర, తమిళ, మహారాష్ట్ర ప్రాంతాలను జయించి, సామ్రాజ్య నిర్మాణ యాగానికి శ్రీకారం చుట్టి, ఉత్తర భారత చక్రవర్తి అయిన హర్షుని ఓడించిన రెండవ పులకేశి, ఆంధ్రదేశంలో రాజకీయైక కత్వాన్ని తొలిసారిగా కల్గించిన కాకతీయులు ముందుగా జైనులే. వీరు జైన మతానుయాయులేకాని, జైన అర్హంతులు కారు. వారు జరిపిన యుద్ధాలు, జైన మతం పరంగా హింసాయుతమైనవైనా, రాజ్యపరంగా అవసరమైనవే.

అంతేకాక, శాతవాహనులు, తొలిసారిగా ఉత్తర భారతంలో మగధనేలిన దక్షిణాత్యులు 'కాలకాచార్య' కథ ప్రకారం జైనులే. వారికి చెందిన కోటి లింగాల నిధిలోని నాణేల్లో, ముందుగా అన్నింట 'నందిపాదం ఉండి, ఆ పిదప అవి ఉజ్జయిని చిహ్నంగా పరిణమించడం శాతవాహనులు జైనులే అని తెల్పుతుంది. కారణం, నందిపాదం అనే దానిమీద, ఒక చక్రాన్ని ఉంచి, దాన్ని పద్మం మీద ఉంచి, దానికిరువైపుల, మీనయుగ్మాన్ని ఉంచడం పద్దెనిమిదవ తీర్థంకరుడైన అమరనాథునికి గుర్తుగా ఉన్న, నంద్యావర్త చిహ్నం. శాతవాహనులు రెండవ శాతకర్ణి కాలం నుండి హిందూ మతానికి మళ్ళడం వల్లనే ఖారవేలుడు ఆగ్రహించి, రెండవ శాతకర్ణిని కణ్వబెణ్ణా పద్ద చంపినట్లు మనం గ్రహించొచ్చు.

కుషాణుల కాలంలో మధురవద్ద, హర్షుని కాలంలో తూర్పు భారతదేశంలోను, జైన మతం విస్తృతంగా పెంపొందింది. అనేక తూర్పు చాళుక్య, గంగ, సోళంబ ప్రభువులు జైన మతాన్ని వివిధ దశల్లో పోషించారు. గుప్తుల కాలంలో, పౌరాణిక హిందూ మత పునరుద్ధరణ వల్ల జైన మతం కొంత వెనుకబడింది. కాని కుమారగుప్తుడు మళ్వా, మధుర ప్రాంతాల్లోను, స్కందగుప్తుడు గోరఖ్‌పూర్ జిల్లాలోను జైన తీర్థంకరుల ప్రతిమలను స్థాపించారు. హ్యూయన్‌త్సాంగ్ ప్రకారం, వాయవ్య సరిహద్దు రాష్ట్రాల్లో కూడ జైన మతం క్రీ.శ. 7వ శతాబ్దం నాటికి ప్రాచుర్యాన్ని పొందిన మతమే. గుజరాత్‌లో 1100 ప్రాంతం నాటికి అన్హిల్వాడా చాళుక్య ప్రభువులైన సిద్ధరాజు (1094-1143), అతని కుమారుడైన కుమారపాలుడు జైన మతాన్ని ఎంతగానో ప్రోత్సహించినట్లు తెలుస్తున్నది. మహ్మదీయుల కాలం నుండి జైన మతం పతనావస్థను పొందింది. స్థూలంగా చెప్పాలంటే, జైనం కూడ బౌద్ధంవలె రాజకీయ వ్యవస్థమీద గొప్ప ప్రభావాన్ని చూపలేకపోయింది.

10.8 సాంస్కృతిక వ్యవస్థ పై జైన మత ప్రభావం

వ్యవసాయికేతర వృత్తులనే జైనులు ప్రధానంగా స్వీకరించడంవల్ల, జైనుల్లో అనేకమంది విద్యావంతులు,

మంత్రులు, సేనానాయకులు వంటి వృత్తులవారుండడంవల్ల, వారి ప్రభావం సాంస్కృతిక వ్యవస్థపై ఎంతగానో ఉంది.

జైన మతస్థులు ప్రధానంగా తమ మాధ్యమంగా అర్ధమాగధి భాషను వాడడంవల్ల హిందీ, గుజరాతీ, మరాఠీ భాషలకు మూలప్రాయమైన అపభ్రంశ భాషను వాడడంవల్ల, సంస్కృత ప్రాకృతాలనుండి ఆధునిక ప్రాంతీయ భాషల ఆవిర్భావంలో జైన మతం ప్రభావం ఎంత ఉందో గ్రహించొచ్చు. దక్షిణ భారతదేశంలో కన్నడ సాహిత్యం జైనుల ప్రభావానికి లోనైంది. కన్నడంలో, భారతాన్ని 'విక్రమార్జున విజయం' పేరిట అనువదించిన పంప, పొన్న, రన్నలనే కవులు ముగ్గురూ జైనులే. వీరు వ్యాకరణం, ఛందస్సు, నిఘంటుశాస్త్రం, గణితం వంటి వానిమీద, ఎంతో కృషిచేశారు. తెలుగులో 'సంగ్రహ గణితాన్ని' రాసిన పావులూరి మల్లన జైనుడే.

అంతేగాక, నోళంబుల కాలంలో హేమావతి వద్ద విలసిల్లిన మహాఘటికా స్థానం, విష్ణుకుండినుల కాలంలో ఏర్పర్చబడ్డ ఘటికా స్థానాలు, పల్లవుల కాలంలో కాంచీపురంలోని ఘటికా స్థానం, ఇవన్నీ ప్రధానంగా జైనుల కృషిఫలనే పెరిగి పెద్దవయ్యాయి.

జైన సాంప్రదాయంలో నెలకొన్న తీర్థంకరుల, విద్యాదేవుల, నవగ్రహాల లక్ష్మి, క్షేత్రపాలుడు, యోగినులు వంటి వారి విగ్రహారాధన భారతీయ సాంప్రదాయంలో, జైన ప్రతిమా సంపదలకు తోడ్పడ్డాయి. వారి గుహాలయాలు ఠాంక్, ఉదయగిరి, ఖండగిరి, ముక్తగిరి, ఝున్నార్, ఉస్మానాబాద్, ఎల్లోరావంటి చోట్ల చూడగలం. కాగా వారి దేవాలయాలు ఒక ప్రత్యేకమైన శైలిలో పావాపురి రాజగిరి, పలిధానా, అబూ పర్వతం, సోనార్‌గాం, కుందల్‌పూర్, బర్వానీ, ముక్తగిరివంటి చోట్ల పెంపొందాయి.

10.9 జైన మత క్షీణత

జైన మతంలో స్వార్థం, సేవ చేసే అర్హంతుల సంఖ్య తగ్గటంవల్ల, రాజాదరణ మందగించడం వల్ల, మతంలోని వివిధ శాఖల విభజనలు, జైన మతానుయాయుల్లో ఆచార భేదాలు పెరగడంవల్ల, జైన మతంలో కూడా, వర్ణ వ్యవస్థ చోటుచేసుకొనడంవల్ల, హిందూ మతంలో పౌరాణిక హిందూ మతంద్వారా, సంస్కరణ ఏర్పడడం వల్ల అది క్షీణించింది. దాని అహింసవంటి కొన్ని ప్రత్యేక సిద్ధాంతాల ద్వారా, వ్యవసాయిక వృత్తులను జైనులు స్వీకరించకపోవడంవల్ల, బౌద్ధ మతంలాగ జైన మతం హిందూ మత స్రవంతిలో కలపలేకపోయింది. అందువల్లనే, అది నేటికీ ఒక ప్రత్యేకమైన మతంగానే, భారతదేశంలో మిగిలి ఉంది.

10.10 సంగ్రహంగా

జైన మతం ఒక కొత్త మతం కాదు. దాన్ని 24గురు తీర్థంకరులు వివిధ కాలాల్లో బోధించారు. 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథుడు, 24వ తీర్థంకరుడైన వర్ధమాన మహావీరుడు, ఆధునిక జైన మతాన్ని ఏర్పర్చారు. వారి ప్రకారం, బంధాలనుండి విముక్తి చెందడమే, నిజమైన లక్ష్యం. వారికి దేవుడులేడు, వర్ణాశ్రమ వ్యవస్థ పట్ల సమ్మకం లేదు. సత్‌చరిత్రం, సత్‌దర్శనం, సత్‌జ్ఞానం కల్గిన వ్యక్తులు బంధాలను తొలగించుకొని, 'నిర్గ్రంథులు' అనగా బంధాలు లేని వారౌతారు. అందుకోసం వారికి, అనత్యం, దొంగతనం, వ్యభిచారం, వస్తువులను కల్గి ఉండడం వంటివి నిషేధాలు.

BRAOU

ఈ మతాన్ని బోధించిన వర్ధమానుడు జ్ఞాతిక కులానికి చెందిన క్షత్రియుడు. ఇతడు క్రీ.పూ. 511-527 మధ్య జీవించాడు. ఈ మతాన్ని గూర్చి తెల్సుకోడానికి అంగాలు, సూత్రాలు; పూర్వాలు ప్రధానాధారాలు. వర్ధమానుని మృతి పిదప, ఈ మతం శ్వేతాంబరులు, దిగంబరులు, గోప్యులు అనేమూడు శాఖలుగా విడిపోయింది. వీరు క్రీ.శ. 5వ శతాబ్దంలో వల్లభిలో సమావేశమై, జైన గ్రంథాలను తిరిగి క్రోడీకరించారు. ఈ మతాన్ని మౌర్య వంశానికి చెందిన చంద్రగుప్తుడు, సంప్రతి, చేది వంశానికి చెందిన ఖారవేలుడు, గాంగులు, చాళుక్యులు, అవ్షిల్లడా చాళుక్య వంశానికి చెందిన సిద్ధరాజు, కుమారపాలుడు మొదలైనవారు పోషించారు.

ఈ మతంలో చెట్లలో కూడా జీవం ఉందని, వాటిని చంపడం కూడా పాపమని నమ్ముతారు. అందువల్ల జైన మతస్థులు హెచ్చుగా వ్యసాయికేతర వృత్తులను ఆదరించారు. వారు సాంస్కృతిక వ్యవస్థకు ఎంతో మేలు చేశారు.

నిస్వార్థంగా జీవించే అర్హంతులు లేనందువల్ల, రాజాదరణ లోపంవల్ల, హిందూ మతంలో సంస్కరణలు జరగడంవల్ల క్రమంగా జైన మతం క్షీణించి, భారతదేశంలో అల్పసంఖ్యాకుల మతం రూపొందింది.

10.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. జైన మత చరిత్రకు ఆధారాలు, ఆవిష్కరణ, పరిణామాలను గూర్చి రాయండి.
2. భారతదేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో జైన మత ప్రభావాన్ని వివరించండి.

II. ఈ క్రింది వాటిపై లఘువ్యాఖ్యలను రాయండి

1. జైన మత సిద్ధాంతాలు
2. జైన మతంలో వచ్చిన విభజన

10.12 ఉపయుక్త గ్రంథాలు

Luniya B.N. : **Life and culture in Ancient India**

Satya Murthy K. : **Indian Heritage and Culture**

Majumdar R.C. (ed) : **Age of Imperial Unity**

Chattopadhyaya D.B. : **Indian Atheism**

కె సచ్చిదానందమూర్తి: **దర్శనములు – మతములు**

రచయిత : డా. కాశీభట్ల సత్యమూర్తి

BRAOU

భాగం – 11 : భాగవత, శైవ మతాలు

విషయక్రమం

11.0 లక్ష్యాలు
11.1 పరిచయం
11.2 ఆధారాలు
11.3 భాగవత, శైవ మతాల సిద్ధాంతాలు : ప్రత్యేకత, ప్రాముఖ్యత
11.4 భాగవత, శైవ మతాల పరిణామ, ప్రభావాలు
11.5 సంగ్రహంగా
11.6 పరీక్ష నమూనా ప్రశ్నలు
11.7 ఉపయుక్త గ్రంథాలు

11.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు

* భాగవత, శైవ మతాల ఆవిర్భావాన్ని, సంబంధిత ఆధారాలను వివరించగల్గాలి.
* భాగవత శైవ మతాల పరిణామక్రమాన్ని విశ్లేషించగల్గాలి.
* సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో భాగవత, శైవ మతాల ప్రభావాన్ని వివరించగల్గాలి.
* భాగవత, శైవ మతాల ప్రత్యేకతను, ప్రాముఖ్యతను విశ్లేషించగల్గాలి.

11.1 పరిచయం

వైదిక మత భావాల పరిణామాల్లో ఏర్పడ్డ యజ్ఞాల పేర చేసే వికృత రూపాలకు వ్యతిరేకంగా హింసను వర్జిస్తూ, వానిలో ముఖ్యమైన ముక్తిని కేవలం భక్తిద్వారానే సాధించడానికి తగిన రీతిలో అవతరించిన మతమే భాగవత మతం. దీన్ని అంగీరస గోత్రీకుడైన అఘోరుడనే ఋషి శిష్యుడైన కృష్ణుడనే యతి బోధించినట్లు చాందోగ్యోపనిషత్తులో చెప్పబడింది.

ఈ రకమైన భాగవత మతం వలనే, ఋగ్వేదం, శ్వేతాశ్వతరోపనిషత్తు, కేనోపనిషత్తువంటి వానిలోగల శివుని ప్రధాన దేవునిగా, శైవం వ్యాప్తి పొందింది. దానిలో క్రమంగా, పాశుపతం కాశ్మీరశైవ మతం, వీరశైవం, శైవ సిద్ధాంతం, శివాద్వైతం వంటి వివిధ శాఖలు అభివృద్ధి పొందాయి.

BRAOU

ఈ రెండు రకాల శాఖల్లోను శైవమే ఎంతో ప్రాచీనమైంది. భాగవత మతం చారిత్రకంగా, క్రీ.పూ. 7వ శతాబ్దాన్నుండి ప్రాచుర్యాన్ని పొందిందని కొందరు, క్రీ.పూ. 4వ శతాబ్దం నుండి ఉందని ఇంకొందరు అభిప్రాయపడుతున్నారు.

11.2 ఆధారాలు

భాగవత మతాన్ని గూర్చి తెలియడానికి వివిధ ఆధారాలు లభ్యమౌతున్నాయి. దీనిలో ముఖ్యంగా హరివంశం, వాయు పురాణం, భాగవత పురాణాల్లో ఆధారాలు వాసుదేవ మతానికి ప్రోక్త అయిన కృష్ణుడు జైన తీర్థంకరుడైన అరిష్టనేమికి సమకాలికునిగా పేర్కొనడం జరిగింది. దాని దృష్ట్యా, అరిష్టనేమి కాలం క్రీ.పూ. 7వ శతాబ్దం కావడంవల్ల వాసుదేవ మతం కాలం తెలుస్తుంది.

క్రీ.పూ.5వ శతాబ్దానికి చెందిన పాణిని 'అష్టాధ్యాయి'లో ఈ మతస్థులను "వాసుదేవకులు" అని పేర్కొవడం జరిగింది. అలాగే, బౌద్ధాయన ధర్మసూత్రాలు తైత్తిరీయోపనిషత్తు, "జైమినీ యోపనిషద్బ్రాహ్మణం" ఈ మతానికి చెందిన వివిధ దేవతామూర్తులను పేర్కొనడం జరిగింది. కాగా, ఈ మతమే, భాగవత మతమని తెలియడానికి గుర్తుగా, క్రీ.పూ. 2వ శతాబ్దంలో, గ్రీక్ సేనాని హీలియోడోరస్ విదిశలో దానం చేసిన గరుడస్తంభ శాసనం ప్రధానాధారంగా తోడ్పడ్తుంది కాగా, ఆజీవక మతంలోని మణిభద్ర భక్తులను భాగవతులుగా గుర్తిస్తున్నట్లు చెప్పిన క్రీ.పూ.1వ శతాబ్దానికి చెందిన 'పావాయి శాసనం' కూడా వేరొకాధారం.

ఈ భాగవతం వైష్ణవ మతంగా పరిణమిస్తున్న ప్రధానాధారాలను శతపథ బ్రాహ్మణంలోని 'పంచరాత్ర సూత్రం', తైత్తి రీయారణ్యంల్లోని 10వ ప్రపాఠకం, క్రీ.పూ. 1వ శతాబ్దానికి చెందిన "మహానిద్దేశం" 'చుల్లనిద్దేశం' విదిశ, ఘోసుండి, నానేఘాట్ శాసనాలు మొదలైనవానిలో చూడవచ్చు.

శైవ మతానికి చెందిన ఆధారాలను, శ్వేతాశ్వరోపనిషత్తు, కేనోపనిషత్తు, మెగస్థనీస్ రాసిన 'ఇండికా', పతంజలి 'మహాభాష్య' అనేవి స్థూలంగా చెప్పున్నాయి. పాశుపత శైవానికి చెందిన లకులీశుడు రాసిన 'సిద్ధాంత గ్రంథం'. క్రీ.శ. 4 శతాబ్దానికి చెందిన రెండవ చంద్రగుప్తుని 'మధుర శాసనం' ఆధారాలు, కాశ్మీర శైవానికి చెందినవి. వసుగుప్తుని 'శివసూత్రాలు', అభినవ గుప్తుని 'ప్రత్యభిజ్ఞా దర్శనం' క్షేమరాజు రాసిన 'ప్రత్యభిజ్ఞా హృదయం,' శివాద్వైతాన్ని గూర్చి 'పెరియ పురాణం', 'శిలప్పాదికారం' 'మణిమేఖలై' అనే గ్రంథాలతోబాటు, శైవనందిని 'శివాష్టమూర్తుల మీద చేసిన రచనలు ప్రధానాధారాలు.

11.3 భాగవత, శైవ మతాల సిద్ధాంతాలు : ప్రత్యేకత, ప్రాముఖ్యత

భాగవత మతం ఆస్తిక మతమే అయినప్పటికీ, వేదాల్లోని యజ్ఞకాండపట్లగల అతి నమ్మకాన్ని, అత్యాచరణను ఖండించింది. ఈ మతం తపస్సు, దానం, ఆర్జవం (కరుణ), సత్యం, అహింస ప్రధాన సూత్రాలుగా, దేవకీసుతుడైన వృష్ణి వంశానికి చెందిన కృష్ణుడు బోధించాడు. అతడు వసుదేవుని కుమారుడవడంవల్ల, ఈ మతాన్ని 'వాసుదేవ మతం' అనడం జరిగింది. ఋగ్వేదంలో చెప్పబడ్డ గోపుడు, బాదాయాన సూత్రాల్లోని 'దామోదరుడు', 'గోవిందుడు', తైత్తిరీయోపనిషత్తులోను, జైమినీయోపనిషద్బ్రాహ్మణంలో చెప్పబడ్డ 'గోబలుడు'

B R A O U

అందరూ ఒకరిగా గుర్తింపబడి, ఈ మతం ఒక సమన్వయత్వాన్ని, క్లిష్టతను పొందడమే దీని ప్రత్యేకత. బౌద్ధ, జైన మతాలు మూలంనుండి వివిధ శాఖలుగా విడివడగా, భాగవత మతం వేర్వేరు శాఖలతో, భావాలతో కలిసి, గొప్ప వ్యూహంగా మారింది.

దానిలో శతపథ బ్రాహ్మణ పంచరాత్ర సూత్రంలో ప్రత్యేకంగా చెప్పబడ్డ నారాయణుడు, బాదాయనుడు చెప్పిన 'విష్ణువు, తైత్తిరీయ అరణ్యక 10వ ప్రపాతం ప్రకారం, వాసుదేవునితో సమానులే. అంటే, వాసుదేవుడే జ్ఞానాన్నిస్తూ నారాయణుడుగాను, విశ్వవ్యాప్తమైన విష్ణువుగాను ఉండి, మతం భాగవత మతంగానేకాక, వైష్ణవంగా మార్పుపొందింది. దీనికి ప్రధాన అధిదేవుడైన విష్ణువు 'స్థానకమూర్తి'గా ఉండి, పై రెండుచేతుల్లో శంఖం, చక్రం, క్రిందిచేతుల్లో గద, అంగుళీయకం ధరించినట్లు పాంచాల రాజైన విష్ణుమిత్రుడు కుషాణ రాజైన హువిష్కుడు వేయించిన ముద్రల్లో తెలుస్తున్నది. ఈ వ్యూహంలో మొత్తం 24 గురు దేవతలు ఏర్పడినారు. వారు కేశవుడు, నారాయణుడు, మాధవుడు, గోవిందుడు, విష్ణువు, మధుసూదనుడు, త్రివిక్రముడు, వామనుడు, శ్రీధరుడు, హృషికేశుడు, పద్మనాభుడు, దామోదరుడు, సంకర్షణుడు, వాసుదేవుడు, ప్రద్యుమ్నుడు అనిరుద్ధుడు, పురుషోత్తముడు, అధోక్షజుడు, నరసింహుడు, అచ్యుతుడు, జనార్దనుడు, ఉపేంద్రుడు, హరి, కృష్ణుడు మొదలైనవారు. ఈరకమైన 24 మూర్తుల పరిణామంలో, వైష్ణవం వివిధ భావాలను తనవిగా చేసుకొంది. ఇది దీని ప్రాముఖ్యత.

శైవ మతం వైష్ణవ భాగవత మతంలా ఆస్తిక మతమే. ఋగ్వేదంలో రుద్రుడని, శ్వేతాశ్వరోపనిషత్తులో మహాదేవుడని, కేనోపనిషత్తులో ఉమానాధుడని చెప్పబడిన దేవత కేంద్రంగా రూపొందింది. వీరు శివుని పశుపతిగా కొలుస్తూ, వేదప్రామాణ్యాన్ని అంగీకరించక పోవడంవల్ల, సూత్రకారులు శైవ మతానుయాయులనందరినీ పాపులు అని పేర్కొన్నారు. ఈ మతంలో శివుడు యోగీశ్వరేశ్వరుడు, సృష్టి, స్థితి, లయ కారకుడు, లింగం చిహ్నంగా కలవాడు. సందిని వాహనంగా కలవాడు. ఇతడు, శ్మశానాల్లో తిరుగుతాడని, 'మహాయోగి' అని 'చర్మాంబరధారని, పశువులచేత పరివేష్టితుడై ఉంటాడని, భూతగణాలచే సేవింపబడి ఉంటాడని, కైలాసంలో నివసిస్తాడ'ని చెప్పడం జరిగింది. ఈ శివుడు స్థల, కాల, రూప, గుణాలకు అతీతుడని, నిర్ద్వంద్వుడని చెప్పబడింది.

రానురాను శైవంలో విభేదాలు వచ్చాయి. పాశుపతులు, శివుడే సృష్టికి, వినాశానికి అధిపతి అని, అతడే జంతువులను, మానవులను సృష్టించాడని అంటారు. వారి ప్రకారం శివుడు విరాగైనా సతినే భావిస్తూ ఉంటాడు. సృష్టికోసం మాత్రం, అర్ధనారీశ్వరుడై ఉంటాడు. కామంకరుడు మహాదేవుడని, పాపాలనాశనం చేస్తూ ఉంటే హరుడని, నాశనాన్ని కల్గిస్తూ మహాకాలుడు, భైరవుడు అని, రాజుగుణంతో పశుపతి అని పిలువ బడ్డాడు. వీరి ప్రకారం, ప్రతి వ్యక్తి కార్యం, కరణం, యోగం, విధి, దుఃఖాంతం అనే వానిద్వారా, అసాధారణమైన సిద్ధులు పొందొచ్చు. వీరు విశిష్టమైన ఆస్తికత్వం గలవారు.

కాశ్మీర శైవం ప్రకారం, శివుడు స్పందం, ప్రత్యాభిజ్ఞ ఆత్మావలోకనం ద్వారా ప్రపంచాన్ని గడచి, శివుని చేరాలి. అతడే చైతన్యం, పరాసంవితీ, పరమేశ్వరుడు, విశ్వమయుడు, విశ్వోత్తీర్ణుడు అనుత్తరుడు (ఇది అని సమాధానం పొందలేనివాడు). వీరి ప్రకారం, శివుడు శక్తితో ఉన్నందువల్లనే శక్తి పొందగల్గుతున్నాడు. వీరు భగవశ్శక్తిని పొందడం (శక్తినిపాతం) ద్వారా, ద్వంద్వం (నిజం, అబద్ధం అనే సందేహం) గడచిన స్థితి చేరుకొంటారు. అదే మోక్షం. ఈ కాశ్మీర శైవం జ్ఞాన ప్రధానమైంది.

వీరశైవంలో మరో లక్షణం కలదు. దీనిలో శివుడు శక్తి ఒక్కరే. శివ భక్తులకు లింగం ధరింపచేసి, శివగాయత్రిని ఉపదేశిస్తారు. వీరు వితంతువులకు పునర్వివాహం చేయడం దోషం కాదంటారు. వీరు ఎక్కువగా కర్మవాదులు.

తమిళనాడులో ఎక్కువ వ్యాప్తిలోనున్న శైవ సిద్ధాంతం ప్రకారం, శివుడు కుమ్మరి, శక్తి మట్టి. మట్టి తనంతతాను

కుండగా ఎలా మారలేదో, ప్రపంచంలో రూపం, మార్పులన్నీ శివునివల్ల ఏర్పడేవే. శక్తి నామ మాత్రమే చర్య, క్రియ యోగం, జ్ఞానం అనేవానిద్వారా మాయను అణచి, సాయుజ్యాన్ని పొందవచ్చని వీరి మతం.

కాగా, శ్రీకంఠుడు ప్రతిపాదించిన శివాద్వైతం ప్రకారం, అన్నీ శివుడే. శివుడే అన్నింటికన్న వేరు కాదు. అన్ని తత్వాలు శివుడి భావాలే.

భాగవత మతాన్ని, శైవ మతాన్ని పోల్చిచూసినట్లైతే, శైవం వేర్పాటుతో ప్రారంభమై, వివిధ శాఖలుగా రూపొందింది.

కాని, భాగవత మతం వైష్ణవంగా పరివర్తన పొంది, వివిధ భాగాలను అవతారతత్వం ద్వారా ఏకీకరించగల్గింది.

11.4 భాగవత, శైవమతాల పరిణామ ప్రభావాలు

భాగవత మతం క్రీ.పూ. 5వ శతాబ్దంనాటికే వాసుదేవ మతంగా రూపొందినట్లు మనం గుర్తించాం. ఈ మతాన్ని తొలిరోజుల్లో బాగా ప్రోత్సహించిన వారు కుషాణులు. కుషాణుల్లో తొలి ప్రభువులైన వీమ, కుజుల, ఇద్దరూ శైవమతావలంబకులు. కనిష్కుడు బౌద్ధమతస్థుడు. కాని వాని అనంతరం వచ్చిన హువిష్కుడు విష్ణుమతమవలంబించి, అతని రాజ చిహ్నాలమీద నాల్గు చేతులుగల విష్ణువును గుర్తించడం జరిగింది. అతని కుమారుని పేరు, వాసుదేవుడే. దీన్ని బట్టి, వారు భాగవత మతాన్ని స్వీకరించినట్లు తెలుస్తుంది. అదే విధంగా శాతవాహనుల్లో ఒక పేరొందిన రాజైన రెండవ శాతకర్ణి, వాసుదేవునికూడా, చంద్రుడు, సూర్యుడు, యమ, వరుణ, కుబేరావాసవులనే దిక్పాలకులతో సహా పూజించినట్లు, అతని భార్య నాగనిక వేయించిన నానేఘాట్ శాసనం ద్వారా తెలుస్తున్నది. అదే విధంగా శాతవాహనుల పిదప, ఇక్ష్వాకుల కాలంలో అష్టభుజనారాయణస్వామి దేవాలయంలో వైష్ణవ మతం, దిగువ కృష్ణా పరీవాహక ప్రదేశం వరకు వ్యాపించినట్లు గమనించగలం. గుప్తుల కాలంలో వారి కృషివల్ల, పౌరాణిక హిందూ మత వ్యాప్తి జరిగి, భాగవత మతం క్రీ.శ. 340 – 60 నుండి తనదైన ప్రాథమికావస్థను కోల్పోయింది.

కాగా, శివుని మతంలో ముందుగా వారు శివభాగవతులని, శివవైశ్రవణులని గుర్తింపబడ్డారు. శివ భాగవతులు, త్రిశూలాన్ని పోలినట్టి ఇనుపశూలాన్ని ధరించేవారు. శివవైశ్రవణులు శివుని మాత్రమేకాక, స్కందుని కూడా పూజించేవారు. స్కందుని, విశాఖుని ప్రతిమలను అమ్ముతుండేవారని పతంజలి మహాభాష్యంలో పేర్కొనడం జరిగింది. ఈ స్కందుడు విశాఖుడే మహాసేనుడనికూడా గుర్తింప బడడం జరిగింది. ఇతనికి, ఇక్ష్వాకుల కాలంలోనే ఆంధ్రదేశంలో ఒక దేవాలయం ఏర్పడ్డంవల్ల, శైవ వైష్ణవ మతాలు రెండూ, దక్షిణ ముఖంగా, బాగా వ్యాప్తి పొందినట్లు గ్రహించగలం. మధుర, విదిశ, రెండూ వాసుదేవ మతానికి కేంద్రాలుగా రూపొందగా, ఉజ్జయిని, కాశీ రెండూ శైవ సాంప్రదాయాలకు కేంద్రాలుగా రూపొందాయి.

క్రీ.శ. 7వ శతాబ్దాంతం వరకు కూడా, వైష్ణవ మతమే ఎక్కువ రాజాదరణను పొందింది. దానికి కారణం, వైష్ణవంగా మారిన వాసుదేవ మతంలో ఏర్పడ్డ అవతారతత్వంలోని సమగ్రత్వమే. భితార్‌గాం, భేడ్సా వంటి చోట్ల గుప్తుల కాలంలో నిర్మింపబడ్డ దేవతలే దీనికి నిదర్శనం. వాసుదేవ మతాన్ని గుప్తులకు ముందు, దక్షిణ భారత దేశంలో, ఆభీరులు బాగా వ్యాప్తి చేశారు. వారి కృషివల్ల, బౌద్ధం మరుగునపడి, వైష్ణవం బాగా ప్రబలింది. దానికి ప్రధాన ఉదాహరణ కృష్ణాతీరమే.

భాగవత, శైవ మతాలు, బౌద్ధ మతం బాగా ఉన్నంత వరకూ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల మీద తమదైన

BRAOU

ప్రభావాన్ని విశృంఖలంగా, విస్తృతంగా చూపలేకపోయాయి. కేవలం 4వ శతాబ్దాంతం నుండి ఈ మతాలు రెండూ బాగా వ్యాప్తిచెంది 8వ శతాబ్దం నుండి ద్వీపకల్ప ప్రాంతం అంతా ఒక ఉద్యమంగా రూపొందాయి.

పల్లవులు, చోళులు, చాళుక్యులు క్రీ.శ. 600 నుండి 1100 మధ్య ప్రాంతాల్లో, విస్తృతంగా దేవాలయ నిర్మాణాన్ని స్వీకరించారు. వారు శైవాలయాలను, వైష్ణవాలయాలను కూడా బాగా భారీ స్థాయిలో నిర్మించారు. అవన్నీ లలిత కళలకు కేంద్రాలుగా రూపొంది, భారతీయ సంస్కృతి సౌధానికి మహోదాత్తమైన పునాదులుగా పరిణమించాయి.

11.5 సంగ్రహంగా

భాగవత మతం క్రీ.పూ. 7వ శతాబ్దం నుండి వైదిక యజ్ఞకాండల్లోని అతి భావాలను నిరసిస్తూ, తపస్సు, దానం, ఆర్జవం, సత్యం, అహింస ఆధారాలుగా పెంపొందింది. దీన్ని వాసుదేవుడైన కృష్ణుడు ప్రారంభించడంవల్ల ఇది వాసుదేవ మతంగా పేర్కొబడింది. రానురాను, ఇది 24 వ్యూహాలతో పెరిగి, వైష్ణవంగా మారింది. పాంచాలులు, కుషాణులు, ఆంధ్రులు, గుప్తులు ఈ మతాన్ని ప్రోత్సహించారు.

కాగా, వేద ప్రామాణ్యాన్ని నిరసిస్తూ, ఋగ్వేదంలో చెప్పబడ్డ రుద్రుడు ప్రధానమూర్తిగా, మహాదేవుడు, శివుడు, మహాకాలుడు, శంభువు వంటి రూపాలతో పెరిగి, ద్వంద్వాతీతుడు, యోగీశ్వరుడు అని గుర్తింపబడ్డాడు. ఈ మతంలో పాశుపతం, కాశ్మీరశైవం, వీరశైవం, శైవ సిద్ధాంతం, శివాద్వైతం వంటి వివిధ శాఖల్లో పెరిగాయి.

బౌద్ధ మతం ప్రబలంగా ఉన్నంత కాలం ఈ మతాలు బాగా గౌరవ ప్రభావాలను పొందలేదు. క్రీ.శ. 600 ప్రాంతం నుండి ఈ మతాలు దేవాలయ వ్యవస్థ ద్వారా పెరిగి, సమాజం మీద ఎంతో ప్రభావాన్ని చూపించాయి.

11.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. భాగవత, శైవ మతాల సిద్ధాంతాలు, ప్రాముఖ్యత, ప్రత్యేక రీతులను విశ్లేషించండి

2. భాగవత, శైవ మతాల పరిణామ క్రమాన్ని, ప్రభావాన్ని వివరించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘువ్యాఖ్యలను రాయండి.

1. భాగవత శైవ మతాలను గూర్చి తెల్పే ఆధారాలెవ్వి?

2. శైవ మతంలోని వివిధ శాఖలను వివరించండి.

BRAOU

11.7 ఉపయుక్త గ్రంథాలు

Majumdar R.C. (ed) : **Age of Imperial Unity**

Luniya B.N. : **Life and Culture in Ancient India.**

సచ్చిదానందమూర్తి : **దర్శనములు, మతములు**

రచయిత : కాశీభట్ల సత్యమూర్తి

BRAOU

భాగం – 12 : ఆజీవకులు, లోకాయతులు

విషయక్రమం

12.0 లక్ష్యాలు
12.1 పరిచయం
12.2 ఆధారాలు
12.3 ఆజీవక, లోకాయత మతాల సిద్ధాంతాలు : ప్రాముఖ్యత, ప్రత్యేకత
12.4 ఆజీవక, లోకాయత మతాల ఆవిష్కరణ, వ్యాప్తి
12.5 ఆజీవక, లోకాయతుల జీవన విధానం
12.6 సంగ్రహంగా
12.7 పరీక్ష నమూనాప్రశ్నలు
12.8 ఉపయుక్త గ్రంథాలు

12.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు

* జైన, బౌద్ధ కాలానికి ముందునుండి పరిణమించి, అవతరించిన ఆజీవక, లోకాయత శాఖలను గూర్చి తెల్సుకోవడానికి తగిన ఆధారాల్ని పరిశీలించగల్గాలి.
* ఆజీవక, లోకాయత మత శాఖల అభివృద్ధి, గమనగతి, సిద్ధాంతాలను వివరించగల్గాలి.
* ఆజీవక, లోకాయత శాఖల ప్రాముఖ్యత, ప్రభావాన్ని విశ్లేషించగల్గాలి.

12.1 పరిచయం

ఆజీవక సాంప్రదాయం జైన మహావీరుని కాలానికన్న ముందుగా ఉంది. దీన్ని ముందుగా నందవచ్ఛుడు, ఆ పిదప, కిససంకిచ్ఛుడు ప్రోత్సహించారు. మూడవ వ్యక్తి, గోశాల మంఖలిపుత్రుడు. ఇతడు వర్ధమాన మహావీరునికి, గౌతమ సిద్ధార్థునికి సమకాలికుడు. ఈశాఖ వారినందరినీ 'శూద్ర సన్యాసులు' అని పిలుస్తారు.

కాగా, లోకాయతులు ఒక మతంగా రూపొందలేదు. ఇది ఒక దర్శన విశేషం. అయినా, వారు తమ కాలంలోని ఇతర మత జీవనంపై తమ ప్రభావాన్ని ఎంతగానో కల్గి ఉన్నారు. లోకాయతులనే 'చార్వాకుల'ని కూడా పేర్కొనడం జరిగింది. వీరిని కొందరు అనాగరకులని, అసంస్కృతులనీ కూడా గుర్తించడం జరిగింది.

BRAOU

12.2 ఆధారాలు

ఆజీవకులను గూర్చి తెలుసుకొనడానికి ప్రత్యేకంగా వారు ప్రాగుచేసుకొన్న ఆధారాలేమీ లేవు. అక్కడక్కడ వారిని గూర్చి లభించిన అంశాలే వారిని గూర్చి తెలిసికొనడానికి ఆధారం. వారిని గూర్చి జైన సాంప్రదాయానికి చెందిన భగవతీ సూత్రంలోను, బౌద్ధసాంప్రదాయానికి చెందిన 'మజ్ఝిమనికాయం', 'దీఘనికాయా'ల్లోను పేర్కొనడం జరిగింది. పతంజలి 'మహాభాష్యం'లోను, నాగసేనుని 'మిళింద పన్హా'లోను కూడా ఆజీవకులను గూర్చి పేర్కొనడం జరిగింది. అదే విధంగా, క్రీ.పూ. 1వ శతాబ్దానికి చెందిన 'పావాయి శాసనం'లో, ఆజీవక మతం నుండి పరిణమించినట్లు చెప్పబడుతున్న మణిభద్రులు భగవతనామం గుర్తింపబడడం కూడా జరిగింది.

కాగా, లోకాయత సాంప్రదాయం ఎంతో ప్రాచీనమైంది. రామాయణంలో జాబాలి రామునికి లోకాయతాన్ని చెప్పాడని ఉంది. భారతంలోకూడా లోకాయతం ప్రసక్తి ద్రుపదుని సందర్భంగా చెప్పబడింది. కకుద వాత్సాయనుని రాతలు, బౌద్ధ గ్రంథమైన 'దివ్యావదానం' హరిభద్రసూరి 'షడ్దర్శన సముచ్చయా'నికి గుణరత్నుడు రాసిన 'తర్కరహస్య దీపిక' అనే వ్యాఖ్య, బ్రహ్మసూత్రాలకు ఆదిశంకరుడు రాసిన 'శంకరభాష్యం', 'బృహస్పతి సూత్రాలు', 'శుక్రనీతి', కౌటిల్యుని 'అర్థశాస్త్రం,' 'హర్షచరితం' మనుధర్మ సూత్రాలకు మేధాతిథి రాసిన వ్యాఖ్య, 'బృహదారణ్య', శ్వేతాశ్వతర, 'మైత్రాయణీయోపనిషత్తులు' మొదలైనవి. లోకాయత సాంప్రదాయాన్ని గూర్చి తెల్పే ఆధారాల్లో కొన్ని.

12.3 ఆజీవక, లోకాయత మతాల సిద్ధాంతాలు : ప్రాముఖ్యత, ప్రత్యేకత

ఆజీవక సాంప్రదాయం కఠోర నియతివాదాన్ని సూచిస్తుంది. ఈ మతాన్ని జైనుల కాలంలో ప్రవేశపెట్టిన గోశాల మంఖలిపుత్రుడు, కఠోర నియతివాదిగా తాత్వికుల చేత గుర్తింపబడ్డాడు. వారి ప్రకారం, ఒక మానవుని జన్మకుగాని, నాశనానికి గాని, ఒక మానవుని ఆత్మపరమైన పవిత్రత పొందడానికిగాని, కోల్పోవడానికిగాని కారణంలేదు. శక్తి, అధికారాల ప్రభావాలవల్లనే, సృష్టి, స్థితి లయలు జరుగుతున్నాయి. కాని, మానవ బలం ఏమాత్రం లేదు. ఆలోచన గలవారైన మానవులు, ఇంద్రియాలుగల పశువులు, పక్షులు, జీవంగల మొక్కలు, చెట్లవంటివి అన్నీ ప్రాణంగల పదార్థాలే. ఇవన్నీ మహత్తరమైన శక్తి ప్రభావానికి లోనౌతున్నాయి. అంతేగాక, అనంతమైన జనన మరణ వలయాలద్వారా ప్రాకృతిక, ఆధ్యాత్మిక పరిణామం సంభవిస్తుంది. వీరి ప్రకారం, నియతి (determinism) యే ప్రపంచ గతిని నిర్ణయిస్తుంది. నియతి గతిని మార్చడంలో, మనుష్య ప్రయత్నానికి తావు లేదు. అందువల్ల, మానవుడు కర్మరహితుడుగా ఉండాలి. ఈ రకమైన కర్మరాహిత్యమే, సహజంగా మార్పును తెస్తుంది. బుద్ధుడు, మహావీరుడు స్థాపించిన మతాల్లో కర్మలోని దుష్పలితాన్ని సచ్చరితం ద్వారా, సత్కర్మద్వారా పరిహరించాలని చెప్పగా, కర్మయే అవసరం లేదని ఆజీవకుల సిద్ధాంతం. కర్మలేనప్పుడు పాపపుణ్యాలు లేవు, జన్మ లేదు. కావున ఉన్నదాన్ని ఉన్నట్లు అంగీకరించడమే ముఖ్యం అని చెప్పడమే వీరి ప్రత్యేకత.

కాగా, లోకాయత మతంలో, సత్ పృథివి, నీరు, నిప్పు, గాలి, దిక్కు, ఆత్మ ఈ పదార్థాలన్నీ పరస్పర భిన్నాలు, సుఖదుఃఖాలే వీని సంయోగ, విభాగాలకు ప్రేరేపించే తత్వాలు. వీరు ప్రధానంగా, మోక్షానికి ప్రాముఖ్యతనివ్వలేదు. ధర్మ, అర్థ, కామాలే వీరి పురుషార్థాలు. వీరు అసత్యాన్ని సత్యంగా భావిస్తూ, ఇహం పట్ల, కామంపట్ల, ఆసక్తి కల్గినవారు. సృష్టి భూతాలవల్లనే కల్గిందని, మరణం పిదప తిరిగి జన్మలేదని వారి అభిప్రాయం. మహాభారతానికి

BRAOU

నీలకంఠుడు రాసిన వ్యాఖ్య ప్రకారం లోకాయతులు, శ్వేతాశ్వరోపనిషత్తులో చెప్పబడిన భూత భావాన్ని ప్రధానంగా కలవారు. వీరు స్వభావవాదులు. లోకాయతులు అనుభూతమైన ప్రపంచానికి పరిమిత మైనవారు. వీరు కనిపించని దేవునిపై భక్తి, పుణ్యపాపాలను, భయాలను లేనివారు. వారి తత్త్వం అతి నాస్తికం. వీరు ధర్మార్థకామాలనే లక్ష్యంగా పెట్టుకొన్నారు. దేహాచ్ఛేదమే మోక్షం. వీరికి రాజు చెప్పిన ధర్మమే ధర్మం. 'చచ్చిన తిరిగి రాము' కాబట్టి బ్రతికినన్నాళ్లు సుఖంగా బ్రతకడానికి యత్నించాలి. అందువల్ల రాజ శాసన మర్యాదలను ఉల్లంఘించకుండా, సుఖంగా బ్రతకడమే ధర్మమని చెప్పడమే వీరి ప్రత్యేకత. వీరు కఠోర నియమాలను, జనన, మరణ భావాలను ఏమీ నమ్మలేదు. అందువల్ల వీరు జైన, బౌద్ధ, ఆజీవకుల నుండి పూర్తిగా వేరయ్యారు.

12.4 ఆజీవక, లోకాయత మతాల ఆవిష్కరణ, వ్యాప్తి

నందవచ్ఛుడు, కిససంకిచ్ఛుడు, వర్ధమాన మహావీరునికన్న ముందుగా, ఆజీవక మతాన్ని బోధించినా, దీన్ని కేవలం, గోశాల మంఖలిపుత్తుడే ప్రోత్సహించాడు. ఇతడు వర్ధమాన మహావీరునితో సిద్ధాంతపరమైన చర్చలు చేసి, అతని శిష్యరికాన్ని అంగీకరించాడు. కాని, మరల దాన్ని పరిత్యజించి, తనదైన సిద్ధాంతాలనే ప్రధాన లక్ష్యంగా చేసికొన్న ఆజీవక శాఖను పెంపొందించాడు. భగవతీ సూత్రం ప్రకారంగా, వింధ్య పర్వత పాద శ్రేణుల వద్దగల పుంప్రదేశం ఆజీవకులకు ప్రధాన క్షేత్రం. ఈ మతాన్ని మౌర్య అశోకుడు, అతని మనుమడైన దశరథుడు గౌరవించి, ఆ శాఖవారికి గుహాలయాలను నిర్మించి ఇచ్చారు.

వీరిలో క్రీ.పూ. 1వ శతాబ్దం నాటికి పూర్ణభద్రుడు, మణిభద్రుడు అనే ఇద్దరు నిర్దేశకులు ఒక శాఖను పెంపొందించారు. వీరిని కూడా భాగవతులనే గౌరవ వాచకంతో గుర్తించినట్లు, సావాయి శాసనం ద్వారా తెలుస్తుంది. ఈ మతం, క్రీ.శ. 14వ శతాబ్దం వరకు అంతరించింది.

లోకాయత మతానికి ఆవిష్కర్త బృహస్పతి అని చెప్తారు. లోకాయతులను 'చార్వాకులు' అని కూడా అంటారు. 'చారు' అంటే అందమైన, 'వాక్' అనగా మాట కల్గి ఉండటం వల్ల చార్వాకులంటారని కొందరనగా, గుణరత్నుడు 'తర్కరహస్య దీపిక'లో 'భృగచర్వ్వ' అనగా భుజించు, అనుభవించు అనే ధాతువు ద్వారా అనుభవమే ప్రధాన లక్ష్యంగా కలవారని పేర్కొనడం జరిగింది.

ఈ మత సిద్ధాంతం రామాయణ, మహాభారతాల్లో కూడా చెప్పబడ్డం వల్ల, ఈమతం ఎప్పుడు ఆవిష్కృతమైందో చారిత్రకంగా గ్రహించలేకపోతున్నాం. కాని, బుద్ధుని కన్నా ముందున్న కకుద కాత్యాయనుడు అనే బుద్ధుని కన్నా ముందున్న వ్యక్తి ఈ సిద్ధాంతాలను ఆవిష్కరిస్తూ వ్యాఖ్యానించడం చేత, ఈ మతం, లేదా తత్త్వం బుద్ధునికన్న ముందుదని గ్రహించవచ్చు. బాణభట్టుడు 7వ శతాబ్దంలో రాసిన 'హర్షచరిత' వీరిని గుర్తించడం చేత, 7వ శతాబ్దం వరకూ, సిద్ధాంతపరంగా లోకాయతులను అంగీకరించినట్లు తెలుస్తుంది.

12.5 ఆజీవక, లోకాయతుల జీవన విధానం

ఆజీవకులు సన్యాసులవలె ఉంటూ జీవించేవారని, జీవించడం కోసమే సన్యాసులయ్యారని చెప్పబడింది. 'మంఖలి' అనగా సన్యాసి అని అర్థం. వీరు శూద్రులు. అంతేకాక, వీరు సమాజంలో ఇంకొకరి మీద ఆధారపడ్డవారే

కాని, సమాజానికి తమ వంతు సేవలను అందించే శాఖ కాదు.

వీరు ఒక వెదురు కర్రను ఎప్పుడూ ధరించి ఉండడం వల్ల వీరిని 'ఏకదండు'లని పిలుస్తారు. 'మధ్యమనికాయం' ప్రకారం, ఆజీవకులు వస్త్రాలను పూర్తిగా పరిత్యజిస్తారు. నాగరక పద్ధతుల ననుసరించరు. వారు ఆహారాన్ని తమ హస్తాల్లో ఉంచుకొని భుజిస్తారు. ఆజీవకులు భోజనానికి ఆహ్వానాలను అంగీకరించరు. అంతేకాక, వారికోసం ప్రత్యేకంగా తయారుచేసిన ఆహారాన్ని కూడా స్వీకరించరు. వీరికి ఆహారాన్ని ఇంటి గడప దాటి, బయటకు వచ్చి ఇస్తేనే స్వీకరిస్తారు. ఇచ్చే ఆహారం మీద ఈగలు ముసిరినా, ఆహారం ఇస్తున్నప్పుడు ప్రక్కన కుక్క నిలబడినా, వీరు ఆ ఆహారాన్ని స్వీకరించరు. వారు మత్స్య మాంసాలను, మద్యాన్ని ఉపయోగించరు. కొందరు ఒక ఇంటికి వచ్చి, అక్కడ రెండు కబళాలను ఆశించి, తిని వెళ్ళిపోతారు. మరికొందరు, ఏడిళ్ళకు మాత్రం వెళ్ళి ,ఏడు కబళాలను స్వీకరిస్తారు. వీరిలో కొందరు రోజూ యాచిస్తారు. మరికొందరు, రెండ్రోజులకు, ఇంకొందరు, వారానికొసారి, మరికొందరు 15 రోజులకోసారి యాచిస్తారు. వీరు మిగిలిన కాలాల్లో ఉపవసిస్తారు. వీరు ఏకాంత జీవనాన్ని కోరుకొంటారు. వీరి జీవన విధాన ప్రక్రియ దృష్ట్యా చూచినట్లైతే, సామాజిక వ్యవస్థ మీద, ఆర్థిక వ్యవస్థ మీద వీరి ప్రభావం లేదు అని చెప్పాలి.

కాగా, లోకాయతుల జీవన విధానం విశిష్టమైంది. వీరు రాజ శాసనాన్ని ఉల్లంఘించకుండా జీవించేవారు గనుక, సామాజిక వ్యవస్థలో వీరికి తగిన గౌరవాన్ని పొందగల్గారు. వీరు 'దివ్యావధానం' 'తర్క రహస్య దీపిక'ల ప్రకారం ఆలోచన లేని చెడు మూక వలె ప్రాక్కృత జనుల వలె జీవించేవారు. మానియర్ విలియం ప్రకారం, లోకాయతులు అడవులను నరికి చదును చేసి, సాగు చేసికొని జీవించేవారు. 'బృహస్పతి సూత్రా'ల ప్రకారం, ధనార్జనకు వ్యవసాయం, వ్యాపారం ఆధారంగా గలవారు.

వీరు వేదాల ప్రామాణ్యాన్ని, పరలోకాలను, దానం యజ్ఞం, యాగం అనే వాటిని నిరసించారు. అందువల్లనే, మనుధర్మ శాస్త్రానికి వ్యాఖ్య రాసిన మేధాతిథి వీరిని హైతుకులు అని వ్యవహరించాడు. వీరికి ఇహమే ప్రత్యక్షమైన సత్యం. అందువల్ల వీరి జీవన విధానం సామాజికతను పొందింది. కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో, అన్వీక్షణ అని పిలువబడిన వ్యవసాయ, వ్యాపారాలను కొనసాగించేవారిలో లోకాయతులను పేర్కొన్నాడు. శుక్రుతుని కాలం నాటికి లోకాయతులను అంతగా గుర్తించలేదు. కాని మధ్య యుగంనాటికి సాంఖ్యవాదులకు, లోకాయతులకు భేదం లేదని, భావించడం జరిగింది.

ఆజీవక, లోకాయతులను పోల్చి చూస్తే, జీవన విధానం దృష్ట్యా లోకాయతులే సామాజిక, ఆర్థిక వ్యవస్థలో ప్రభు సమ్మతమైన విధానాన్ని అనుసరిస్తూ, జీవించేవారుగా గుర్తించొచ్చు.

లోకాయతం ఒక సిద్ధాంతంగా మాత్రమే ఉండడం వల్ల, జైన, బౌద్ధాల్లాగా మత వ్యవస్థను పెంపొందించుకోలేకపోవడం వల్ల దాని అస్తిత్వం, అస్తినాస్తి విచికిత్సకు గురైంది. కాగా, ఆజీవకం ఒక సన్యాసి జీవనం కావడం వల్ల, ఇదమిత్థమైన ఆరాధనా, ఆచరణా సిద్ధాంతాలు లేనందువల్ల, అది కొంతకాలం మతంగా గుర్తింపు పొందినా, స్థిరత్వాన్ని పొందలేకపోయింది.

ఆజీవకులు పూర్తిగా కర్మను నిరసించడం చేత, లోకాయతులు కర్మను నమ్మినా, కేవలం త్రివర్గ సాధనకే కర్మను పరిమితం చేసుకోవడం వల్ల వాటి ప్రభావం, జైన, బౌద్ధ మతాల మీద ఏ మాత్రం లేకపోయింది. ఇవన్నీ నాస్తిక మతాలే అయినా, జైన, బౌద్ధాలు ఏదో ఒక రూపంలో, జన్మ రాహిత్యాన్ని, దానికి తగ్గ మానవ ప్రయత్నాన్ని సూచించాయి. కాని, ఆజీవక, లోకాయత సాంప్రదాయాలు, దానికి వ్యతిరేకంగా ఉండడమే సంభవించింది.ఆహార విధానంలో, జైన మతం మీద ఆజీవకుల ప్రభావం కొంత ఉన్నట్లు పేర్కొనడం జరిగింది.

ఈ మతాలు రెండూ ఎంతో పరిమితమైన అనుయాయులను కల్గి ఉండడం చేత, ఆనాటి వ్యవస్థ పై వీని ప్రభావం

BRAOU

ఏమాత్రం ప్రత్యక్షంగా కనిపించడం లేదు.

12.6 సంగ్రహంగా

ఆజీవకులు అతి కఠోర నియతివాదులు. ఈ మతాన్ని నందవచ్ఛుడు, ఆ పిదప కిససంకిచ్ఛుడు మూడవ వాడుగా గోశాల మంఖలిపుత్రుడు ప్రోత్సహించారు. వీరంతా శూద్రులు, సన్యాస జీవనాన్ని గడుపుతూ, యాచనతో కడుపు నింపుకొంటూ, ఉపవాసాది కఠోర నియమాలను అనుసరించేవారు. వీరు కర్మవాదులు కాదు. వీరికి తమదైన మత గ్రంథాలు లేవు.

కాగా లోకాయతులు హేతుకులు. వీరు వేదాలను, దేవున్ని, దాన యజ్ఞయాగాలను నిరసించారు. జీవించినంత కాలం సుఖంగా, రాజు ఆజ్ఞకు లోబడి, అన్నీ అనుభవిస్తూ జీవించాలనేదే వీరి వాదం. వీరు మోక్షాన్ని నమ్మరు. మరణమే అన్నిటికీ అంతం. వీరు వర్తక వ్యాపారాల ద్వారా జీవిస్తూ, సామాజిక వ్యవస్థలో చోటుగల అతి నాస్తికులు.

12.7 పరీక్ష సమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. ఆజీవక, లోకాయత మతాల ఆవిష్కరణ, సిద్ధాంతాలు, ప్రాముఖ్యతలను తెల్పండి.
2. ఆజీవక, లోకాయత తత్వాలను పోల్చి పరిశీలించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. ఆజీవక, లోకాయతుల గూర్చి తెలియజేసే ఆధారాలను పేర్కొనండి.
2. ఆజీవక, లోకాయతుల జీవన విధానాన్ని పరిశీలించండి.

12.8. ఉపయుక్త గ్రంథాలు

Chattopadhyaya D.P. : **Indian Atheism**

Luniya B.N. : **Life and Culture in Ancient India.**

R.C. Majumdar (ed) : **Age of Imperial Unity**

సచ్చిదానందమూర్తి : దర్శనములు – మతములు

రచయిత : కాశీభట్ల సత్యమూర్తి

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

రెండో సంవత్సరం

పాఠ్య ప్రణాళిక

కోర్స్ – I భారతదేశ సామాజికార్థిక చరిత్ర (అనాది నుండి క్రీ.శ. 700 వరకు)

ఖండం – I : హరప్పా సంస్కృతి

భాగం - 1 : ప్రాక్ హరప్పా సంస్కృతి, సమాజం

భాగం - 2 : హరప్పా సమాజం, మతం

భాగం - 3 : హరప్పా ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, పరిశ్రమలు

భాగం - 4 : హరప్పా సంస్కృతి : కళలు, చేతిపనులు

భాగం - 5 : హరప్పా సంస్కృతి : నగరవ్యవస్థ

ఖండం – II : వేద యుగం

భాగం - 6 : వైదిక మతం, కర్మకాండలు

భాగం - 7 : వేద కాలపు సమాజం, కుల వ్యవస్థ

భాగం - 8 : వేద కాలం : ఆర్థిక వ్యవస్థ

ఖండం – III : క్రీ.పూ. 6వ శతాబ్దం నాటి మతోద్యమాలు : సామాజికార్థిక వ్యవస్థలపై వాటి ప్రభావం

భాగం - 9 : బౌద్ధ మతం

భాగం - 10 : జైన మతం

భాగం - 11 : భాగవత, శైవ మతాలు

భాగం - 12 : ఆజీవకులు, లోకాయతులు

ఖండం – IV : ఆర్థిక పరిస్థితులు

భాగం - 13 : మౌర్యుల కాలంనాటి ఆర్థిక పరిస్థితులు

భాగం - 14 : శాతవాహనుల కాలంనాటి ఆర్థిక పరిస్థితులు

భాగం - 15 : గుప్తుల కాలంలో ఆర్థిక పరిస్థితులు

భాగం - 16 : గుప్తుల అనంతర కాలంనాటి ఆర్థిక పరిస్థితులు

భాగం - 17 : వాణిజ్యం, పరిశ్రమలు (క్రీ.పూ. 2500 - క్రీ.శ. 700)

భాగం - 18 : భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ, దాని స్వభావం

ఖండం – V : సామాజిక సంస్థలు

భాగం - 19 : యుగయుగాలుగా కుల వ్యవస్థ

భాగం - 20 : సమాజంలో స్త్రీల పాత్ర

భాగం - 21 : విద్య, విద్యాకేంద్రాలు

BRAOU

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

రెండో సంవత్సరం

మాదిరి పరీక్షా పత్రం

కోర్స్ – I భారతదేశ సామాజికార్థిక చరిత్ర (అనాది నుండి క్రీ.శ. 700 వరకు)

సమయం : 3 గంటలు మార్కులు : 100

భాగం – ఎ

I. **క్రింది ప్రశ్నల్లో ఏ నాల్గింటికైనా వ్యాసరూప సమాధానాలు రాయండి.** 4×15 = 60

1. ప్రాక్ హరప్పా సంస్కృతి భౌగోళిక పరిధి, గమనశీలత, స్వభావాన్ని గూర్చి విశ్లేషణాత్మకంగా చర్చించండి.
2. హరప్పా సంస్కృతిలో వెలకొన్న రూపకళ, చిత్రకళ, చేతివృత్తులను గూర్చి తెల్పి, వాటి ప్రయోజనాత్మకతను అంచనా వేయండి.
3. వైదికమత విశిష్టతను తెల్పి, ఋగ్వేద కాలంలో వైశ్యుల వర్గీకరణను గూర్చి వివరించండి.
4. మౌర్యుల కాలంనాటి ఆర్థిక వ్యవస్థ లక్షణాలను సమగ్రంగా పరిశీలించి, నాటి కార్మికుల స్థితిగతులను సమీక్షించండి.
6. గుప్తుల కాలంలో ఉన్న భూముల వర్గీకరణను, భూ యాజమాన్య విధానాన్ని విశ్లేషించండి.
7. క్రీ.పూ. 2500 నుండి, క్రీ.శ. 700 వరకు ప్రాచీన భారతదేశంలో వెలకొన్న వాణిజ్య పరిస్థితులను, పారిశ్రామికాభివృద్ధిని సమీక్షించండి.
8. ప్రాచీన భారతదేశమందలి విద్యా విధానాన్ని విశ్లేషించి, ఆ కాలంలో వెలసిన విద్యా సంస్థలను గూర్చి రాయండి.

భాగం – బి

II. **క్రింది ప్రశ్నల్లో ఏ ఐదింటికైనా లఘువ్యాఖ్యలను రాయండి.** 5×8 = 40

9. హరప్పా సంస్కృతిలోని పారిశ్రామిక ఉత్పత్తులను గూర్చి రాయండి.
10. వేద కాలం నాటి వర్తక వాణిజ్యాలను సమీక్షించండి.
11. బౌద్ధ మత క్షీణతకు కారణాలను వివరించండి.
12. జైన మత ప్రాముఖ్యత, ప్రత్యేకతలను విశ్లేషించండి.
13. ఆజీవక, లోకాయతుల మత తత్వాన్ని, జీవన విధానాన్ని పోల్చి, పరిశీలించండి.
14. కుషాణుల పాలనలోని ద్రవ్య వ్యవస్థ ఎట్టిదో తెల్పండి.
15. పల్లవుల కాలంలో గ్రామీణార్థిక జీవనాన్ని గూర్చి వివరించండి.
16. శాతవాహనుల కాలంనాటి దేశీయ, విదేశీయ వ్యాపార కార్యకలాపాలను సమీక్షించండి.
17. ప్రాచీన భరాతదేశంలో వెలకొన్న భూస్వామ్య వ్యవస్థ లక్షణాలెవ్వి ?
18. పురాణ, ఇతిహాసాల్లో స్త్రీల పాత్ర, ప్రాధాన్యతను విశ్లేషించండి.

BRAOU

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

రెండో సంవత్సరం

కోర్స్ – I భారతదేశ సామాజికార్థిక చరిత్ర (అనాది నుండి క్రీ.శ. 700 వరకు)

అభ్యాసం – I

గమనికలు :

* పుస్తకాలను చూచి జవాబులు రాయకూడదు.
* సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాల్లో రాయాలి.
* జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
* అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
* మీరు రాసే జవాబునకు ఇరువైపులా మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
* ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

భాగం – ఎ

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. హరప్పా కాలంనాటి నగర నిర్మాణాన్ని, నగర వ్యవస్థపై సామాజిక ప్రక్రియల ప్రభావాన్ని గూర్చి చర్చించండి.
2. వేద కాలంలో మానవుని జననానికి ముందు, తర్వాత జరుపబడే కర్మకాండలను తెల్పి, వాటి ఆవశ్యకతను వివరించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. ప్రాక్ హరప్పా సంస్కృతుల్లో ఉపయోగించిన వివిధ రకాల పనిముట్లు, వాటి స్వభావాన్ని తెల్పండి.
2. వేద కాలంలో వృత్తులు, ఉపవృత్తులు ఏర్పడిన క్రమాన్ని పరిశీలించండి.

BRAOU

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

రెండో సంవత్సరం

కోర్స్ – I భారతదేశ సామాజికార్థిక చరిత్ర (అనాది నుండి క్రీ.శ. 700 వరకు)

అభ్యాసం – 3

గమనికలు :

* పుస్తకాలను చూచి జవాబులు రాయకూడదు.
* సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాల్లో రాయాలి.
* జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
* అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
* మీరు రాసే జవాబునకు ఇరువైపులా మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
* ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

భాగం – ఎ

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. ప్రాచీన భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భావానికి తోడ్పడ్డ ప్రధానాంశాలెవ్వి? సామాజికార్థిక రంగాలపై దాని ప్రభావమెట్టిది ?
2. ప్రాచీన భారత సమాజంలో స్త్రీ స్థానాన్ని గూర్చి కూలంకషంగా చర్చించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. మౌర్యుల నాటి పన్నుల విధానాన్ని క్లుప్తంగా పరిశీలించండి.
2. ప్రాచీన భారతదేశంలోని కుల వ్యవస్థ లక్షణాలను విమర్శనాత్మకంగా విశ్లేషించండి.

BRAOU

BRAOU

BRAOU

BRAOU